# ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

## భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Telugu Literary, Culture & Language Studies

Vol. 16 - Issue. 01 - Spl. Edition - February 2019 - ISSN No. : 2456-4702

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500




# సాహిత్యం - నవరసాలు

## జాతీయ సదస్సు

తేది: 21-02-2019


ప్రత్యేక సంచిక - ప్రధాన సంపాదకురాలు :

డా॥ ఎస్. బేబిరమణి

శాఖాధిపతి, తెలుగు విభాగం,

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Literary, Culture & Language Study**

(సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)



Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.



**Vol. 16 - Issue No. 1 - Spl. Edition - February 2019 - ISSN No. : 2456-4702**



**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies
Universityof Heidelberg, Germany.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**COVER PAGE & PAGE SETTING**

**TENALI PRAKASH**, G.L.S. ENTERPRISES, Guntur. 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar,
Guntur - 522 002. Ph. 9703301698.

GOVT. DEGREE COLLEGE
SADASIVPET
జ్ఞానమ్ సదాశివమ్

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.



# సాహిత్యం – నవరసాలు

## జాతీయ సదస్సు

**తేది : 21-02-2019**

నిర్వహణ :

తెలుగు విభాగం

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల**

సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

# సాహిత్యం – నవరసాలు
# జాతీయ సదస్సు

**భావవీణ** ప్రత్యేక సంచిక

**ISSN No. : 2456-4702**

**RNI No. APTEL/2003/12253**

**UGC Approved Journal No. 42500**

| | | |
|---|---|---|
| ప్రథమ ముద్రణ | : | **21 ఫిబ్రవరి 2019** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 300/– (మూడు వందల రూపాయలు)** |
| కాపీలకు | : | **ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,**<br>**సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్**<br>**పోస్టల్ కాలనీ, 4వ లైను,**<br>**గుంటూరు – 522 002.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్**<br>**జి.యల్.ఎస్. ఎంటర్‌ప్రైజస్, గుంటూరు.**<br>సెల్ : 9494 660 509. |

# సాహిత్యం – నవరసాలు

# జాతీయ సదస్సు - ప్రత్యేక సంచిక

**సంపాదక మండలి**


గౌరవ సంపాదకులు :

**డా॥ టి. పతంజలి**

ప్రాచార్యులు.

ప్రధాన సంపాదకులు :

**డా॥ యస్. బేబి రమణ**

శాఖాధిపతి, తెలుగు విభాగం.

ఉప సంపాదకులు :

**శ్రీ వినాయక కుమార్,** శాఖాధిపతి, ఆంగ్ల విభాగం.

**శ్రీ వై. రమేష్‌బాబు,** శాఖాధిపతి, జంతుశాస్త్ర విభాగం.

**శ్రీ డా॥ యస్. పి. కృష్ణవేణి,** శాఖాధిపతి, అర్థశాస్త్ర విభాగం.

**శ్రీ యన్. రాములు,** శాఖాధిపతి, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం.

**శ్రీ డా॥ డి. కరుణ కుమార్,** శాఖాధిపతి, రసాయనశాస్త్ర విభాగం.

**శ్రీమతి కె. అనూరాధ,** సహాయాచార్యులు, శాఖాధిపతి, వృక్షశాస్త్ర విభాగం.

# శుభ రసాభినందనలు

## రసాత్మకం వాక్యం కావ్యం :

జీవితంలోను, సాహిత్యంలోను నవరసాలున్నాయి. అనుభవించగలిగినవారికి అనుభవించినంత. రసమనే శబ్దాన్ని పండితులు ఒక అర్థంలో, ఆధ్యాత్మిక వేత్తలు ఇంకో అర్థంలో సామాన్యులు మరొక అర్థంలో వాడుతుంటారు.

పులుసు, పచ్చిపులుసు, ఇగురు, చారు, రసం ఇలా విభిన్న ప్రాంతాలలో భిన్నంగా పలుకుతుంటారు. వైద్యం మొదలయినవి చేసే సందర్భాలలో రసం అంటే పాదరసమని అర్థం. సిద్ధ వైద్యంలో రసానికి ప్రాముఖ్యం ఉంది. ముసలివారికి యౌవనాన్ని ప్రసాదించే ఆయుర్వేద ప్రక్రియ - కాయకల్ప చికిత్సలో, బంగారం తయారు చేయడంలోనూ పాదరసం ఉపయోగిస్తారట.

ఆధ్యాత్మికార్థంలో రసమంటే బ్రహ్మ పదార్థం. రసోవైసః. ఏది రసమో అదే నిత్యం. దేనినైతే జీవుడు, ఆత్మ ఆస్వాదించి, అనుభూతి చెంది మమేకమవుతాయో - అదే రసము. సాహిత్యార్థంలోకి వస్తే రస ఆస్వాదనే. ఆస్వాదింపబడేది రసం.

ఒక అందమయిన ఆడపిల్లనో - అందమైన మగపిల్లవాడినో చూసి “అబ్బా!”అనుకొన్నామనుకో. అది శృంగారరసం. అబ్బా.. అని పళ్ళు ఇకిలించావనుకో - అది హాస్య రసం. ఒక పసిపిల్లవాడిని ఒకకుక్క రోడ్డు మీద ఈడ్చుకు పోతున్న దృశ్యం చూసావనుకో.. మనస్సు కదిలిపోతుంది. అబ్బా.. అని బాధతో అంటాం.. అది కరుణ రసం. ఇలా రౌద్ర, వీర, భయానక, బీభత్స, అద్భుత, శాంత రసాలు జీవితంలో ఉన్నాయి.

విభావానుభావ వ్యభిచారీ భావాలని అదొక లెక్క . అవి కలిస్తే రసమని చెబుతారు. భరతుడు ఎనిమిది రసాలన్నాడు. ఉద్భటుడు తొమ్మిది రసాలన్నాడు.రుద్రటుడు పది రసాలన్నాడు.నేను ఆ నిర్వచనాల జోలికి, రసాల లెక్కల జోలికి వెళ్ళటంలేదు.

సామాన్యుని కోణంలో రసప్రపంచంలోకి అడుగుపెట్టి ఒకటి రెండు ఉదాహరణలు చూపిస్తాను.

## శివే శృంగారార్ద్రా :

శంకరభగవత్పాదులు సౌందర్యలహరి అనే గ్రంథంలో “శివే శృంగారార్ద్రా..” శ్లోకంలో ఎనిమిది రసాలు అమ్మవారి కళ్లద్వారా మనకు చూపించారు.

అమ్మా! లలితాదేవీ! నీ కంటి చూపు శివునిలో “శ ృంగార రసము” చేత తడుపబడి, ఆయనకు ప్రేమ పుట్టిస్తోంది.శివుడు కాని ఇతర జనులపై రోత కలిగి, “బీభత్స రసము”తో కూడి ఉన్నది. నీ చూపు సవతి అయిన గంగా దేవియందు రోష ముతో ఉండి, “రౌద్రరసము” కలదిగా ఉంది. త్రిపురాసుర సంహారము మొదలయినవి చేసిన శివుని విజయ కథలలో నీ కంటి చూపులు ఆశ్చర్యముతో నిండి “అద్భుతరసము” కలిగి ఉన్నది. శివుడు ఆభరణములుగా ధరించిన పాములందు భయము కల్గి నీ కనుచూపులు “భయానక” రసముతో కూడినవై ఉన్నాయి. ఎఱ్ఱకలువల సౌందర్యాన్నీ, ఎరుపును పుట్టిస్తూ నీ కళ్ళు “వీరరసము”తో కూడినట్లు ప్రకాశిస్తున్నాయి. చెలికత్తెలపై కదలిక లేని స్థిరమైన కంటిగ్రుడ్లతో చూస్తూ చిరునవ్వు పుట్టిస్తూ “హాస్యరసము”తో నీ కళ్ళు ఉన్నాయి.. నిన్ను ఎప్పుడూ పొగిడే నాపై నీకళ్ళు “కరుణ” రసముతో నిండియున్నాయి..

ఇలా శంకర భగవత్పాదులు ఈ శ్లోకంలో ఎనిమిది రసాలను చెప్పారు కాని అదే సౌందర్యలహరిలోని 41, 50వ శ్లోకాలలో నవరస ప్రస్తావన చేసారు.

## నవరసములదీనళినాక్షి :

తాళ్లపాక అన్నమాచార్య కవి అమ్మవారిలో 11 రసాలున్నాయన్నాడు.

నవరసములదీనళినాక్షి/జవకట్టి నీకుజవి సేసీని/ 1.శృంగారరసము చెలియమొకంబున/సంగతి వీరరసము గోళ్ళ/ రంగగు కరుణారసము పెదవులను/అంగపుగుచముల నద్భుతరసము 2.చెలిహాస్యరసము సెలవుల నిండీ/పలుచని నడుమున భయరసము/కలికి వాడుగన్నుల బీభత్సము/అలబొమ జంకెన నదె రౌద్రంబు 3. సతిరతిమరపుల శాంతరసంబదె/అతిమోహము పదియవరసము/ఇతవుగ శ్రీ వేంకటేశ కూడితివి/సతమై యీపెకుసంతోసరసము

ఓ వేంకటేశా! మా అమ్మ అలమేలు మంగమ్మ నవరసములు కలిగినది. నిన్ను జతచేసుకొని ఆరసాలను నీకు రుచిచూపిస్తోంది. అలమేలు మంగమ్మ మోములో శృంగారరసముంది. పదునెక్కిన తన గోళ్ళను నీ శరీరంపై చేర్చే సమయంలో వీరరసము చూపిస్తుంది. శ్రేష్ఠమయిన పెదవులతో మమ్మలిని ఆశీర్వదించే సమయంలో దయా రసముంది. అందంగా ఉన్న ఆమె స్తనములలో అద్భుతరసముంది. ఆమె పెదవి చివర్లలో హాస్యరసము ఉంది.అల్లల్లాడే తన పలుచని నడుమున భయానక రసముంది. దుష్టులయిన రాక్షసులను వాడిగా చూసే కన్నులలో బీభత్స రసమున్నది. కోపం ప్రకటించే కనుబొమలలో రౌద్రరసమున్నది. నీతో కలిసి సుఖాలు అనుభవించిన మై మరపుల తర్వాత శాంతరసము అనుభవిస్తుంది. ఆమె అతిమోహము పదోరసము. శ్రీ వేంకటేశ! నువ్వు అలమేలు మంగను కూడావు. ఇక ఈమెకు సంతోషరసము. ''అవధరించగదయ్య అన్నిరసములు'' అను మరొక కీర్తనలో అన్నమయ్య ఇటువంటి రసావిష్కరణం చేసాడు.

## శృంగారీ గిరిజాననే :

కథానాయికలలోనే కాదు - కథానాయకులలో కూడా నవరసావిష్కరణ ఉన్నది. రుద్ర భట్టు రచించిన శృంగార తిలకములోని మొదటి శ్లోకము ''శృంగారీ గిరిజాననే...'' లో శివునిపరంగా నవరసావిష్కరణ జరిగింది.

పార్వతీదేవి దేవి మోము చూసేటప్పుడు శివునిలో శృంగార రసము కనబడుతోంది. తనమూడో కంటితో రతిదేవి భర్త మన్మథుడు బూడిదయ్యాడు. ఆ స్థితిలో విలపిస్తున్న రతీదేవిని చూసినప్పుడు శివునిలో కరుణారసము పెల్లు బుకుతోంది. మన్మథుని విషయములో శివునికివీరరసము కనబడుతోంది. ఎముకల దండను దాల్చుటచేత శివునిలో బీభత్స రసము నెలకొంది. పడగెత్తిన పాములను ధరించి ఉండుట చేత భయము కొల్పుచూ భయానకరసము శివుడు కలిగి ఉన్నాడు. పొడవైన మూర్తి కావటం వలన - చూసేవారికి ఆయనలో అద్భుతరస స్పృహ కలుగుతోంది. దక్ష యజ్ఞాన్ని నాశనము చేసే సందర్భంలో దక్షుని బాగా మర్దించే సమయంలో శివునిలో రౌద్రరసము ఉట్టిపడుతోంది. దిగంబరుడు కావటము చేత హాస్య రసాన్ని కూడా శివుడు కల్పిస్తున్నాడు. చాలాకాలమునుండి ఆయన దగ్గర భక్తులను అనుగ్రహించే శాంతరసము ఉన్నది. ఈ విధముగా అన్ని రసాలకు ఆశ్రయుడైన పశుపతి శివుడు మంచివారికి ఐశ్వర్యములిచ్చుగాక!

రసాలను గుర్తించేది కనుక నాలుకని ''రసనం'' అన్నారు. రసాలను గుర్తించి ఆనందించేవాడు కనుక సహృదయుడిని రసజ్ఞుడు అన్నారు.

రససదస్సు ఏర్పాటు చేస్తున్న మా తెలుగు అధ్యాపకుల మొదటి అక్షరం కూడా ''ర''. శ్రమకోర్చి రసాభినివేశంతో ఈసదస్సును ఏర్పాటు చేస్తున్న బేబీరమణిగారికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలియ చేసుకొంటున్నాను.

వివిధ ప్రాంతాలనుండి రసజ్ఞశేఖరులు విలువైన వ్యాసాలు ఈ సంచికకు పంపారు. అందరికి ధన్యవాదాలు. లోకంలో అరసికులు కొంతమంది ఉంటారు.

“అరసికాయ కవితా నివేదనం శిరసి మాలిఖ మాలిఖ మాలిఖ” అరసికుల ముందు (రసజ్ఞత లేనివారి ముందు కవిత్వం చెప్పడం అనే వ్రాతను నానుదుట వ్రాయవద్దని బ్రహ్మని పూర్వం ఒక కవి ప్రార్థించాడు.

**“రోజులు మారిపోతున్న దుర్భర పరిస్థితుల్లో మనం ఉన్నాం.**

**రసము నే నెరుగనా? ప్రారబ్ధమిదియేమి?/ద్రవిడదేశాన్న సత్రములనిడరే**

**సముచితాలంకారసమితి నేనెరుగనా?/మగువలు ధరియించు నగలు కావె?**

**యతిని నే నెరుగనా? క్షితిలోన కాషాయ వస్త్రధారుండైన వాడు కాడె?**

**గురువు నే నెరుగనా? సరి సరి! అక్షరాభ్యసనంబు సల్పిన యతడు కాడె?**

**శబ్దమన నే నెరుంగనా? చప్పుడు గదె ?/అనుచు వచియించు అజ్ఞాన జనములోన**

**అగ్రగణ్యుండవగు నీ వహో! కవిత్వ /మును రచించుట భాషకు ముప్పు గాదె”**

రసం’ అంటే ద్రవిడదేశం (తమిళ నాడు) లో సత్రాలలో పెట్టే అన్నంలో పోసే రసమని, ‘అలంకారం’ అంటే ఆడవాళ్ళు పెట్టుకొనే ‘నగలని, ‘యతి’ అంటే భూమిపై కాషాయ వస్త్రాలు ధరించి తిరిగే సన్యాసి అని ఇలా విచిత్రమైన జవాబులు చెప్పే “విద్వాంసులు” పెరిగిపోతున్న రోజులలో ఈ సదస్సు స్వచ్ఛరసావిష్కరణ చేయాలని హృదయపూర్వకంగా ఆశిస్తూ, మా సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యక్షునిగా అందరికి శుభ రసాభినందనలు.

– డా॥. తాడేపల్లి పతంజలి

# ముందుమాట

'వాక్యం రసాత్మకం కావ్యం' అని విశ్వనాధుడనే ఆలంకారికుడు తెలియజేశాడు. నవరసాలలో ఏ ఒక్కరసంతోనైనా అనుబంధం కల్గిన రచన కావ్యం అవుతుందని దాని అర్థం. మన భారతీయ ఆలంకారికులు కావ్యాత్మను గూర్చి చెప్పే సందర్భంలో తమతమ విభిన్నమైన ఆలోచనలను వెలువరించారు. ఒకరు కావ్యాత్మను రీతి అంటే మరొకరు వక్రోక్తి అన్నారు. మరొకరు అలంకారమే కావ్యాత్మ అంటే వేరొకరు 'రసం' అన్నారు. వీరందరినీ కాదని ఆనందవర్ధనుడు ధ్వనినే కావ్యాత్మ అన్నాడు. ఐతే అభినవగుప్తుడు ధ్వని వస్త్వలంకార రసరూపమని చెప్తూ, రసధ్వని శ్రేష్ఠమైనదని అదే కావ్యాత్మ అని వాదంచేశాడు.

ఏదేమైనా కావ్యంలో రసానికున్న ప్రాధాన్యం ఎవరూ కాదనలేనిది. వేదాలు శబ్ద ప్రధానాలు. పురాణాలు అర్థప్రధానాలు. కావ్యాలు రసప్రధానాలు. కావ్యానందం బ్రహ్మానందంతో సమానం. అది రసం వల్ల కలుగుతుంది. మన ఆలంకారికులు ముఖ్యంగా నవరసాలను గుర్తించారు. వానిలో శృంగారమే గొప్ప రసమన్నవారున్నారు. కాదు కరుణరసమే గొప్పదని చెప్పినవారున్నారు. అద్భుతానికి ప్రాధాన్యం ఇచ్చినవారూ ఉన్నారు. లేదు శాంతమే గొప్పరసమని నిరూపించినవారూ ఉన్నారు.

భరతుడు 8 రసాలనే పేర్కొన్నప్పటికీ శాంతాన్ని కాదనలేదు. కవులలో కాళిదాసు శృంగారరసానికి ప్రాధాన్యమిస్తే భవభూతి కరుణ రసానికి ప్రాధాన్యమిచ్చాడు. మహాభారతంలో నవరసాలున్నప్పటికీ ముఖ్యమైంది శాంతమేనని లాక్షణికులు తెలియజేశారు. ఒక్కసారి రసాలను పరికిస్తే అవి అన్నీ మనలను రంజింపజేసేవే అనిపిస్తుంది. రసదృష్టితో రాసిన కావ్యమే నాలుగు కాలాలపాటు నిలుస్తుంది. కవి శబ్దాన్ని ఆశ్రయించినప్పటికీ రసహృదయుడు కావాలి. ఏదో ఒక రసాన్ని ఆశ్రయించకపోతే ఆ కావ్యాన్ని ఎవరూ చదవరు అందుకే సాహిత్యమేదైనప్పటికీ అన్ని ప్రక్రియలూ రసస్పర్శతో అలరారుతున్నాయి.

తెలుగు సాహిత్యమంతా రసదృష్టిగల రచనల సమాహారమే. బాగా పరిశీలిస్తే ఏ ఒక్క రసమూ తక్కువ చేయబడినదిగా కనిపించదు. అందుకే 'సాహిత్యం - నవరసాలు' అనే అంశాన్ని ప్రధానంగా చేసుకొని తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను రసదృష్టితో అనుశీలించడం వివేకమనక తప్పదు.

తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేటవారు ఈ ప్రత్యేక రీతిలో రసదృష్టితో సాహిత్యాన్ని పరిశీలించే పరిశోధనలను ఆహ్వానించి, పత్ర సమర్పణ ద్వారా సదస్సును విజయవంతం కావాలని కోరుకొంటూ, ఈ సందర్భంగా సదస్సు సంచాలకులకు, పరియోజకులకు, పత్ర సమర్పకులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు అందజేస్తున్నాను.

– ఆచార్య మసన చెన్నప్ప

# జీవన రసాల సాహిత్య సమ్మేళనం

కనురెప్పల కదలికలలో దాగిన సుందర స్వప్నాల మేళవింపులో కన్నులు తెరిస్తే జననం. కోటి అనుభూతులతో, అనుభవాలతో జీవన స్వప్నాన్ని ముగిస్తే అది మరణం. ఆ నడుమ సాగిన జీవన చిత్రాల మధురిమలను మనోఫలకంపై ముద్రించుకొనే నవరసాల సమ్మేళనమే నవజీవనం. బుడిబుడి అడుగులతో, చిరుచిరు నగవులతో, ముద్దుముద్దు పలుకులతో అందరినీ సమ్మోహనపరచి, గడిపే ప్రతి కణాన్ని ఆస్వాదింపజేసేఅద్భుత రసానంద స్ఫూర్తి చిన్నారుల జీవనం. పసిడి భవితకై బంగరు సౌధాన్ని సప్తవర్ణ మిళితమై నిర్మింపజేసే విద్యనభ్యసించే వేళ సఖుల పరిహాసాలతో, సరసాల సరాగాలతో, చిలిపి అల్లరులతో బాల్యాన్ని సుసంపన్నం చేసేదే హాస్యరసం. నవయవ్వనం పలికించే సరిగమలతో సుమధుర జీవన రాగాలను ఆలపిస్తూ, మధురమైన ఊహలలో మునకలు వేస్తూ, శతకోటి స్వప్నాలతో తన జీవన సర్వస్వాన్ని, జీవిత భాగస్వామికి సమర్పించే కళ్యాణ సమయాన వధువు ఓరకంట వరుని చూచిన క్షణం ఆ వరుని హృదిలో జాలువారే జలపాతాల సవ్వడి మనసును మురిపించగా ఆ జడిలో జలకాలాడుతూ యుగాలు క్షణాలుగా మార్చే రసమే శృంగారం.

కలల పంట తనయను మెట్టినింటికి అప్పగించు తరుణాన, ఆ నవ వధువు ముందుకు సాగలేక, వెనుకకు మరలలేక అడుగులు తడబడు తరుణాన కన్నవారి మనసులో పొంగిపొరలే అనంతమైన వేదన కన్నీరుగా కరిగి సంద్రమై పొంగులువారేదే కరుణరసం. సమాజపు మనుగడలో మమేకమై, దురితాలను దునుమాడే దీక్షలో ఉప్పెనగా విరుచుకుపడేదే రౌద్రరసం. జీవనపు ప్రతి అడుగుతో పోరాడుతూ, ఎదుటపడే ప్రతికూలతలను ప్రతిభావంతంగా ఎదుర్కొనే శౌర్యంలో కరవాలాన్ని ఒరనుండి ఝుళిపించేదే వీరరసం. జీవన పోరాటంలో మునుముందుకు సాగుతూ ముదిమి ముంచుకు వచ్చిన క్షణాలలో రక్షణగా నిలిచే రక్తబంధమే అరక్షితమై ఆశలను చిదిమివేయగా ప్రశ్నార్థకమైన శేషజీవితమే భయానకం. ఇంతటి సంకటస్థితిలో సైతం తనవారిపై వీడని మమకారంతో, వారి ఉన్నతిని ఆకాంక్షించే మనసులో వ్యక్తమయే రసమే శాంతం. శాంతమెంత వహించినా, అశాంతిపాలైన కన్నబంధాలు సంపదను మాత్రమే కోరి, వృద్ధ వలయాన్ని మోయలేని బరువుగా భావించి, ఆ బరువును దించుకొనే దిశగా పలు యత్నాలు చేయగా, మృత్యువు వేపు పయనిస్తున్న హృదయం వేదనతో రగిలి, రెప్పపాటున బీటలువారితే పారుతున్న రుధిరధారలే బీభత్సం. సాహిత్యంలో చిందే నవరసాలు జీవన దర్పణాలు. కనుకనే ఆ రసాలను రసబంధురమైన కూడికగా సాహిత్యంలో దర్శించాలనే ఆకాంక్షయే ఈ సదస్సుకు రూపకల్పన. ఈ ప్రయత్నానికి అన్నివిధాలా సహకారాన్ని అందించిన కళాశాల ప్రిన్సిపల్ గారికి, సహ అధ్యాపకులకు, ఈ సంచికను ప్రచురించిన వెంకటస్వామి గారికి నా కృతజతలను తెలియజేస్తున్నాను.

– డా॥ ఎస్. బేబి రమణి

# CONTENTS


| | | | |
|---|---|---|---|
| 1. | ఆధునిక కవిత్వం - హాస్యరసం | - డా॥ అల్లంశెట్టి నాగజ్యోతి | 14 |
| 2. | దేవదాసు నవల - కరుణరస పాత్ర చిత్రణ | - కె. అనూరాధ | 15 |
| 3. | రామాయణం - కరుణ రసం | - బి. రమాదేవి | 19 |
| 4. | "మనుచరిత్రలో నవరసములు" | -డా॥ కె. అరుణాబాయి | 23 |
| 5. | నవరసాల్లో - కరుణరసము | - ఆచార్య జి.బి.ఆనంద కుమార్ | 26 |
| 6. | డా॥ రావూరి భరద్వాజ-కరిమింగిన వెలగపండులోని హాస్యం | - డాక్టర్ గుంటుపల్లి గౌరి | 29 |
| 7. | పి. వి. సునీల్ కథలు - హాస్యపు జాడలు | - డా. జె. సీతాపతి రావు | 33 |
| 8. | అలపర్తివారి కథా సాహిత్యం - రసపోషణ | - డా॥ జంపాల అనూరాధ | 36 |
| 9. | నవరసభరితం - పారిజాతాపహరణం | - డా॥ కపిల భారతి | 40 |
| 10. | డా॥ మలయశ్రీ నవలల్లో నవరస పోషణ | - పోరండ్ల శంకర్ | 43 |
| 11. | బమ్మెర పోతన ఆంధ్ర మహాభాగవతము - రస పోషణ | - పద్యప్రవీణ కట్ట రంజిత్ కుమార్ | 45 |
| 12. | ముళ్ళపూడి వెంకట రమణ 'బుడుగు' - హాస్యం | - పప్పుల శైలజ | 48 |
| 13. | శృంగార వీర రస భావ సంపుటి - అగ్నిధార | - సోనబోయిన సతీష్ | 52 |
| 14. | సాహిత్యము - హాస్యము | - ఎస్. సరస్వతి | 55 |
| 15. | చిటికె సాహిత్యం - నవరసాలు | - శ్యామ్ సుందర్ | 57 |
| 16. | హాస్యరస చిత్రీకరణలో వేమన్న వివేచన | - డా. యస్.పి. కృష్ణవేణి | 60 |
| 17. | పి.వి.సునీల్ కుమార్ "దెయ్యం 2" కథ - హాస్యం | - డా. ఒభిన్ని శ్రీహరి | 62 |
| 18. | ఆంధ్ర మహాభారతము - శాంతరసము | - పూషడపు సుబ్బారావు | 67 |
| 19. | పి. యశోదా రెడ్డి కథలో నవరసాలు | - డా॥. ఎన్. సూర్యకాంతి | 69 |
| 20. | ప్రాచీన, ఆధునిక సాహిత్యంలో - హాస్య రసం | - పొన్నెకంటి స్వప్న | 73 |
| 21. | మహాభారత ఆరణ్యపర్వంలో కరుణరసపోషణ | - డా॥ ఎ. వెంకట ప్రసాదు | 77 |
| 22. | పుష్ప విలాపం - కరుణరసం | - వినాయక కుమార్ | 78 |
| 23. | డా॥మలయశ్రీ "ప్రజాకవి వేమన" నాటకం - రసపోషణ | - అలువాల మహేందర్ | 80 |
| 24. | జానపద సాహిత్యం - నవరసాలు (కరుణ రసం) | - లింగంపల్లి ఆంజనేయులు | 82 |
| 25. | కవిత్రయ యుగం - నవరసాలు | - బానోత్ వెంకటేశ్వర్లు | 85 |

| | | |
|---|---|---|
| 26. జానపద సాహిత్యంలో కరుణ రస పోషణ | - పెండ్యాల భార్గవి | 87 |
| 27. రామదాసు కీర్తనలలో - భక్తి రసం | - నిమ్మ లావణ్య | 90 |
| 28. ప్రబంధ సాహిత్యంలో హాస్యరస పోషణ | - నడిమెట్ల శివశేఖర్ | 93 |
| 29. తెలుగు నవలా సాహిత్యం - నవరసాలు | - మలిపెద్ది నాగరాజు | 95 |
| 30. ప్రబంధ సాహిత్యంలో వెల్లివిరిసిన శృంగార చంద్రికల భోగవైభాగ్యం | - డా॥ పల్లి చిన్నారావు | 97 |
| 31. మను చరిత్రలో శృంగార రస పోషణ | - చామనపల్లి పృథ్వీరాజు | 103 |
| 32. నాటక సాహిత్యం - రసం - రస సమన్వయం | - శ్రీమతి రాజ్యలక్ష్మి | 106 |
| 33. భార్గవరామ చరిత్రం - వీర రసపోషణ | - జి. రమేశ్ | 110 |
| 34. ప్రబంధ కావ్యం - శృంగార రసం | - దేవసాని సోని | 113 |
| 35. శృంగార నైషధం - శృంగార రస పోషణ | - వేణు జంగిటి | 116 |
| 36. వేయి పడగలు - కరుణ, శృంగార, భక్తి రసాలు | - అవధానం సుజాత | 119 |
| 37. కవిత్రయ భారతం - రసావిష్కరణ | - డా॥ బాచిమంచి వెంకటేశ్వర్లు | 123 |
| 38. నవరస మిశ్రితం - ప్రభావతీ ప్రద్యుమ్నం | - డా॥ పి. లలితవాణి | 126 |
| 39. కరుణరసాత్మక నవల 'మూగవాని పిల్లనగ్రోవి' | - డా॥ ఎం. రమేశ్ బాబు | 130 |
| 40. శివకవుల సాహిత్యం - రసవాదం | - నందిగామ నిర్మలకుమారి | 133 |
| 41. కె. సభా కథలు - కరుణరసం | - వారణాసి మల్లీశ్వరి | 138 |
| 42. భాగవతంలో అద్భుత రసం | - కుమ్మరి ఎల్లప్ప | 141 |
| 43. "దంపతుల ప్రథమ కలహం" కథలో "కరుణ రసం' | - డా॥ బి. భీమమ్మ | 144 |
| 44. కవిత్రయ భారతం - నవరస రమ్యం | - డా. పి.వి. ఉమాశశి | 147 |
| 45. నానారసాభ్యుదయోల్లాసము | - డా. ఎన్. మృదుల | 151 |
| 46. రంగనాథ రామాయణం, మొల్ల రామాయణాలలో నవరసాల పరిశీలన | - శివునూరి చంద్రశేఖర శర్మ | 154 |
| 47. తిక్కన మహాభారతంలో నవరసాలు | - యం. స్వర్ణలత | 160 |
| 48. జానపద గేయాలు - హాస్యరసం | - నండూరి అనంతలక్ష్మి | 163 |
| 49. నన్నయ్య భారతం - మధుర రస గుణాలు | - ఎల్. రేఖ | 166 |
| 50. జానపద పురాణ సాహిత్యంలో రస చర్చ | - కొండిగారి బుచ్చయ్య | 171 |
| 51. యం.డి. సౌజన్య నాటికలు - రస పోషణ | - డా॥ బూసి వెంకటస్వామి | 175 |
| 52. భానుమతీ రామకృష్ణ గారి అత్తగారి కథలు - హాస్యం | - డాక్టర్ వై. శ్రీలత | 180 |

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# ఆధునిక కవిత్వం – హాస్యరసం

– డా॥ అల్లంశెట్టి నాగజ్యోతి, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, శ్రీదుర్గమల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల, విజయవాడ.

## హాస్యరసం ప్రస్థావన :

ప్రాణికోటిలో నవ్వ గలిగిన ఏకైక జంతువు మనిషి. నవ్వలేని మనుషులు ఉండరు ఎంత క్రూరుడైన మనిషి అయినా నవ్వగలడు, అది అతనిలోని మానుష్యత్వానికి చిహ్నం. కొన్ని విషయాలు చూసినప్పుడు, లేదా విన్న పుడు, ఆలోచించినప్పుడు ఆయా విషయాలలో ఉండే వికారము, వైపరీత్యము, వైషమ్యము, అతి వాస్తవికత, అసహజత్వం మొదలైన గుణాల వలన మనకు నవ్వు పుడుతుంది. నవ్వు రావడానికి ముందు మనకు ఆ నవ్వు పుట్టించే విషయం గురించి కొంత పరిజ్ఞానం అవసరం. వస్తు స్థితి ఇట్లు ఉండునని, స్థితి వైపరీత్యము ఇట్లు ఉన్నదని కలిసినప్పుడే నవ్వు పుడుతుంది.

‘‘నవ్వవు జంతువుల్ నరుడు నవ్వును నవ్వులు చిత్తవృత్తికిన్’’ అని జాషువా మహాకవి హాస్యాన్ని గూర్చి నిర్వచించారు. పరాహాస శీలమైన మనోవృత్తి విశేషమే హాస్యం.

**“శృంగార హాస్య రకుణ రౌద్రవీరభయానకా:**
**బీభత్సాద్భు శాంతశ్చనవ నాట్యేరసా: స్మృతా:”**

రసాలు తొమ్మిదని ఆలంకారికులు నిర్ధారిచారు. అందులో ‘‘వికృతాకార వాగ్వేష చేష్టాదీర్నర్త కాద్భచేత్ హాస్యాక్ష్మీఆస స్థాయిభావ:’’ అని విశ్వనాథుడు తన సాహిత్య దర్పణంలో పేర్కొనారు. ఇక ఆధునిక సాహిత్యానికి వచ్చినట్లయితే 20వ శతాబ్దపు ఆరంభంలోనే కవులు హాస్యానికి శ్రీకారం చుట్టారు.

ఆధునిక సాహిత్యానికి యుగకర్తగా గుర్తింపబడిన కందుకూరి వీరేశలింగం గారు ఉత్తమ సాహిత్య ప్రక్రియలకు ఆద్యుడయ్యాడు. తన ప్రవచనాలలో చక్కని హాస్యాన్ని పండించారు. ఆ విధంగానే గురజాడ అప్పారావు, జానపదుల్లో కూడా హాస్య ప్రవృత్తి ఉంది, అది వారి సాహిత్యంలో సంపూర్ణత్వం గావించినది. కారణం హాస్యంతో కూడిన సాహిత్యం విశిష్టమైన పాఠకాదరణ లభిస్తుంది.

ఆ రోజుల్లో నవ్వు నాలుగు విధాల చేటు అన్నారు “లక్ష్మణ దేవర నవ్వు’’ వంటి జానపదుల స్వచ్ఛమైన భావాలు మనకు సుపరిచితమే. హాస్యపూరిత బ్రతుకు నేటి యాంత్రిక జీవనంలో టార్చ్ పెట్టి వెతికినా కనపడదు. ‘‘బ్రతుకులు యాంత్రికమై, చదువులు భారమై, యువత సెల్లే లోకమై, మనిషికి మానవత్వం లోపమై మహిళలకు మనుగడే శూన్యమై పరుగులు పెట్టే జీవన విధానంలో అయోమయంలో ని మనిషికి హాయిగా నవ్వే సందర్భాలు కరువైపోతున్నాయి. హాస్య విశిష్టత ఆనాటి నుంచే సాహిత్యపరంగా ఎంతోమంది కవులు తమ రచనల్లో రచించారు.

ఆధునిక సాహిత్యంలో సంక్షిప్తంగా హాస్య పోషకులలో చిలకమర్తి వారు, మణి మాణిక్యం, పానుగంటి ‘సాక్షి’ వ్యాసాలు గురజాడ వారి ‘కన్యాశుల్కం’ లో గిరీశం, జంఘూలశాస్త్రి, బాపు-రమణల పేరడీలు వంటి తెలుగు పాఠకుల హృదయాలలో స్థిరంగా హాస్య గీతికలు పలుకుతున్నాయి. అందులోని కొన్ని అపూర్వమైనవి.

## కందుకూరి వారి సత్యంరాజ్ ఆచార్యులు :

మొదటి ప్రకరణంలో సత్యం రాజా చార్యుల జీవన శైలి, ఆంగ్ల విద్యాభ్యాసం, గ్రామాలలో ఉండే వైద్యుల ప్రవర్తన వర్ణింపబడ్డాయి. రెండవ ప్రకరణంలో చెన్న పట్నంలో మోసాలు, సత్య రాజా చార్యుల దేశ యాత్ర కోసం తిరువనంతపురం చేరి అక్కడ మలయాళంలోకి ప్రవేశించే తీరు హాస్యరసాన్ని పండించారు.

మూడవ ప్రకరణంలో మొదలుపెట్టి ఎనిమిదవ ప్రకరణం వరకు వింతలు, విశేషాలతో నే కాకుండా,

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

స్త్రీ జనోద్ధారకుడు కందుకూరి వారు పురుషుల కన్నా స్త్రీలను అధికంగా చేసి వర్ణించే ఘట్టాలు హాస్యరసాన్ని పండిస్తారు.

**గురజాడ వారి 'గిరీశం' :**

తెలుగులో హాస్యరస ప్రధానమైన, సాంఘిక నాటకాలలో 'కన్యాశుల్కం' ప్రథమంగా చెప్పుకోవాలి. దీని విశిష్టత ఎక్కువగా ఆంగ్ల పదాలు తెలుగు రచనల్లో చేర్చిన ఘనత గురజాడ వారికే దక్కుతుంది. ప్రధాన పాత్రధారి 'గిరీశం' డామిట్ కథ అడ్డం తిరిగింది అంటూ ఒకశైలితో ఆధునిక పోకడలకు అద్దం లాంటి వాడు 'గిరీశం' గిరీశాన్ని కదిలిస్తే చాలు తేనెటీగ వలే అఖండంగా లెక్చర్లు దంచేవాడు.

**"నాతో మాట్లాడడమే ఎడ్యుకేషన్"**

**"టు బర్న్ఎట్ వన్ ఫాట్"**

**మాణిక్యం గారి "కాంతం" పాత్ర :**

ఆధునిక పోకడలు పాఠకలోకాన్ని తన ప్రవసనాల రచనలలో విశిష్టప్రశస్తి పొందిన కవి. వారి రచనల్లో ముద్రించుకొన్న కాంతం పాత్ర ఆంధ్రుల ఆడబిడ్డ స్త్రీ సహజమైన భావాలను ఈ పాత్రలో మనకు బాగా పరిచయమైన స్త్రీలా అనిపిస్తుంది. ఒకరోజు కొడుకు ఏడుస్తూ స్కూల్ నుంచి వచ్చి తరగతిలో జరిగిన సంభాషణ చాలా చక్కటి హాస్యానికి మచ్చుతునక. మాస్టారు పిల్లవాడిని ప్రపంచ పటంలో చైనాని గుర్తించమన్నాడంట అంట చిన్న వెధవ వాడు ఎక్కడ పెటాడో ఏమో మరచి పోయాడు కామాలు, అంటూ అసలు దానిని ఎందుకు తీసావు రా అని దండిస్తూ అమాయకంగా ఎంత కోపంలో ఉన్నా సమయస్ఫూర్తిగా సమాధానం చెప్పడంతో 'కాంతం' పాత్ర అద్వితీయం.

ఒకసారి భర్త కోపంలో మీ చెల్లెలు కోతి, మీ అన్నయ్య కోతి అంటూ వాటికి తోకలు లేవు అని అంటాడు దానికి కాంతం ఆ లోటు మీ చెల్లెళ్లు తీర్చా రండి అంది తాపీగా. దాంపత్యంలో ఉండే విలువలకు నవ్వుల నదిలో పువ్వు వంటిది కాంతం.

**మొక్కపాటి నరసింహశాస్త్రి గారి 'బారిష్టరు పార్వతీశం' :**

పార్వతీశం పాత్ర నవల మొదటి భాగం నుంచి హాస్య పోషణ కొరకై సృష్టించినట్లుగా మనం గ్రహించవచ్చు ముఖ్యంగా నిడదవోలు నుంచి మద్రాసు వరకు పార్వతీశం రైలు ప్రయాణం మద్రాసులో పుట్టు వెంట్రుకలు తీయించుకోవడం, టోపీ ప్రహసనం, మద్రాసు నుండి కొలంబో ప్రయాణం అన్ని సన్నివేశాలలో హాస్య పోషణకు అనుకూలంగానే సాగినాయి.

రైలు మొహం ఎరుగని పార్వతీశం మొట్టమొదటిగా నిడదవోలు రైల్వే స్టేషన్ లో అవస్థలు పడి గాడ్డు చేత మెడబట్టి, తరువాత రైలు చెన్నపట్నం వరకు వెళ్ళటానికి ఎక్కి తన చేష్టలు మననం చేసుకుంటూ నవ్వుల పువ్వులు పంచిపెడతారు. అలాగే భోజనం చేయడానికి వచ్చినప్పుడు ఫోర్క్ నీ ఉపయోగించడం తెలియక, గుణపం గుచ్చినట్టు రొట్టె లోకి దింపటం చుట్టూ ఉన్న వాళ్లకు ఆ సన్నివేశం నవ్వుల పువ్వులు పూయించింది.

**పానుగంటి వారి జంఘాలశాస్త్రి :**

పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు జంఘాల శాస్త్రిని సంఘంలో పాతుకుపోయిన దురాచారాలను దుయ్యబట్టుటకు భాష ఉన్నతికై పాటుపడే గొప్ప వక్తగా 'సాక్షి' వ్యాసాల ద్వారా సృష్టించిన పాత్ర జంఘాలశాస్త్రి ఎంతటి విశిష్టమైన సంఘసంస్కర్తగా చిత్రింపబడినప్పటికీ, అతని ఉపన్యాసాల ద్వారా కవి దురాచారాలను, మూఢత్వాన్ని హాస్యరస మయంగా, హర్ష దాయంగా, వాడిగా, ధాటిగా ఖండించిన తీరు హాస్య ప్రియులకు ప్రశంస లందుకున్న సన్నివేశాలుగా చెప్పవచ్చు. జంఘాలశాస్త్రి ఎంతటి గొప్ప ఉపన్యాసాలు. ఉపయోగకరమైన అంశాలతో ప్రసంగించే తీరులో శాస్త్రిగారి లోక అనుభవము కనబడును. ఆదర్శాలు వల్లించటమే కాదు ఆచరించి చూపేవాడు కైలాస శిఖరం నుండి కన్యాకుమారి వరకు కాలినడకన తిరిగేవాడు. మానవునిలోని నాస్తికత్వాన్ని, మత, మూఢాచారాలను ఎత్తిచూపే అంశాల విషయంలో చక్కని హాస్యం రంగరించి చెప్పే తీరు అపూర్వమైనది.

**ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సదాశివపేట.**

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

సాక్షి వ్యాసాలు, ఇటు శాస్త్రి ఉపన్యాసాలలో పాఠకుల లో ఉండే లోపాలు ఎత్తిచూపే తీరును, మన దేశం, భాష, జాతి, సభ్యత, సంస్కృతులపై అభిమానం కలిగించేటట్లు ఆద్యంతం హాస్యంలో నిండిన ఉపన్యాసం, వ్యంగ్యం, ప్రహసనం కల్పి నట్టి కాషాయం లాంటి ఔషధం. నాలుగురు వ్యక్తుల్లోని దోషాలను విమర్శించాలి గాని, వ్యక్తులను కాదు అంటూ హాస్యం సరసంగా, సునిశితంగా ఉండాలని కవి ప్రయత్నించారు.

సుదీర్ఘమైన వాఙ్మయ ప్రస్థానంలో ప్రాచీన కాలంలో కేవలం హాస్యరస ప్రధాన రచనలు అరుదుగా లభించాయి. ఈ హాస్యం నారికేళ పాకం ఆ ప్రయత్నాన్ని శ్రీమట్నూరి సంగమేశం గారు సమర్థవంతంగా నిర్వహించారు, రాయల కాలం నుండి రఘునాధ రాయల కాలం వరకు కూడా రాజాస్థానాలలో హాస్యాన్ని వెదజల్లే కవులు లేదా భట్రారాజులకు సముచితమైన స్థానం లభించింది.

హాస్య రచనలు వెలువడటానికి ప్రధాన కారణం నాటి రచయితలలో ఉన్న సంఘ సంస్కరణాభిలాష ఆధునిక భావాలు ఈ సంస్కరణ వ్యక్తిత్వం ప్రవర్తన మానసిక స్వభావాలు మానవనైజం ఇలా ఒకటనేమిటి అనేక రంగాలలో ప్రసరించింది దీనికి ఆంగ్ల విద్య దోహద పడిందని ఏది అందరికీ తెలిసిన నిజం

శ్రీరావూరు సత్యణారాయణ రచనల్లో - వడగళ్లు అనే శీర్షికతో కృష్ణా పత్రికలో రచించిన హాస్యరచనలో అలవాట్లు పొరపాట్లు అనే వ్యాసంలో వ ృత్తులను బట్టి వ్యక్తులకు కొన్ని విడిచిపెట్ట లేని అలవాట్లు ఏర్పడ్డాయి అవి వ్యాసానికి కారణాలవుతాయి పరీక్ష పేపర్లు దిద్దే సమయంలో ఒక తెలుగు మాస్టారు గారి భార్య నుంచిఉత్తరం వచ్చిందట. ఉత్తరం చదివి వ్యాకరణ దోషాలన్నీ మార్కు చేసి, అండర్ లైన్ చేసి, దస్తూరి ఇంప్రూవ్ చేసుకోవాలని రిమార్కు వ్రాసి ముపై రెండు మార్కులు వేశాడట అంటూ తెలుగు అధ్యాపకుల మనస్తత్వాలను హాస్య భరితంగా చిత్రిస్తాడు.

భార్య ఎలా ఉండాలి అనే వ్యాసం రచయిత యొక్క హాస్య చతురతకు దర్పణంగా నిలుస్తుంది కులం ఇంటి పిల్ల దొరికితే జలం మీది కమలం లాగా కదిలి గంతులు వేస్తుంది అంటారు మరికొందరు పురుషులైతే ఉండు లాంటి ఆడది ఇంట్లో ఉంటే కుడుము తిని నీళ్లు తాగినంత బలంగా ఉంటుంది అంటారట. ఇది హాస్య స్ఫూర్తితో కుటుంబ జీవితంలోని చిత్రాలను మన ముందుంచాడు.

ఈ విధంగా నవరసాల్లో హాస్యం ద్వితీయస్థానంలో ఉన్నా అద్వితీయమైన శక్తితో నరజాతికి ఆనందాన్ని అందిస్తుంది.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# దేవదాసు నవల – కరుణరస పాత్ర చిత్రణ

– కె. అనూరాధ, సహాయ ఆచార్యులు, వృక్షశాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, తెలంగాణ.

'దేవదాసు' నవలను బెంగాలీ నందు శరత్ చంద్ర చటోపాధ్యాయ రచించారు. దానిని శివరామకృష్ణ తెలుగు లోకి అనువదించారు. దేవదాసు నవలలోని పాత్రలు, వాటి స్థితిగతులు నాటి బెంగాలీ సామాజిక, ఆర్థిక స్థితులను కన్నులకు కట్టినట్లుగా రూపొందించారు. నాటి కాల పరిస్థితులైన క్షీణిస్తున్న భూస్వామ్యదశ, స్త్రీల మూగ వేదనను రచయిత వర్ణించారు. ముఖ్యంగా కరుణరసం జాలువారేట్లుగా చిత్రీకరించారు. నవల దేవదాస్ బాల్యం నుండి ప్రారంభమగుతుంది. బడిలో దేవదాస్ పార్వతిలు స్నేహంగా ఉంటూనే కొంత అధికారం ఒకరిపైమరొకరు చూపుకునేవారు. బాల్యావస్థలో స్నేహం నుండి వయస్సు పెరిగే కొద్దీ ప్రేమలో గడిపి చివరి దశలో భగ్న ప్రేమికులుగా మిగిలిపోయారు. బాల్యంలో కొట్టిన దేవదాసును రక్షించడానికి బడిపంతులు మీద అభాండం వేసిన చిన్ననాటి పార్వతి తదుపరి జీవితములో ఒక హత భాగిసి వలె మిగిలిపోయింది. తనకెంతో ఇష్టమైన దేవదాసును వివాహము చెసుకోవలెనన్న ఆకాంక్షను తుడుచుకొని, తనకంటే వయస్సులో చాలాపెద్ద వ్యక్తిని పెండ్లి చేసుకోవాల్సినందుకు పార్వతి పడే బాధ వర్ణనాతీతం.

"మనోదీదీ ! ప్రపంచంలో ఎంతమందికి నలభై ఏళ్ళు లేవు? నా భర్త వయస్సు పంతొమ్మిది ఏళ్లు అని మాత్రమే తెలుసునాకు. నాకు తెలిసిందల్లా నా భర్త పేరు దేవదాసు." పార్వతి మనస్సులో దేవదాసునే తన భర్తగా భావించినది. అందుకే ధనవంతుడైన వరుడు పెళ్లికి సిద్ధంగా ఉన్న సమయంలో కూడా దేవదాసునే భర్తగా ఊహించుకున్నది. సాంప్రదాయాన్ని గౌరవించే స్త్రీగా తన బాధను దాచుకొని గృహిణిగా ప్రవర్తించింది.

"నీకేం మగవాడివి, ఇవ్వాళ కాకపోతే రేపైనా నీ కళంక గాథను అంతా మరిచిపోతారు. రెండు రోజులు పోయాక ఒకనాడు రాత్రి హతభాగిని అయిన పార్వతి నీ పాదాల చెంత తలవాల్చటానికి సమస్తాన్ని తుచ్ఛంగా భావించి వచ్చిందని గుర్తుపెట్టుకోవు" పార్వతి మాటలలో నాటి సమాజములోని పురుషాదిక్యతను రచయిత తెలిపారు.

పార్వతిని హతభాగిని అని పేర్కొంటూ కళంకమంటూ వస్తే స్త్రీలకు మాత్రమే వస్తుందని, కష్టాలు కేవలము స్త్రీలకే సొంతమనే భావన పై వాక్కులలో నిగూఢంగా వ్యక్తమగుచున్నది. ఇక దేవదాసు విషయానికొస్తే పార్వతిని కోల్పోయాక మాత్రమే తనలో ఉన్న ప్రేమను గుర్తించాడు. "చదువు మూలంగా నేనెంతో పోగొట్టుకున్నను. అమూల్య రత్నాన్ని జారవిడుచుకున్నను." అని దేవదాసు చునీలాల్ తో పలికిన పలుకులలో అతని వేదన, నిర్లిప్తత గోచర మగుచున్నది.

రచయిత చంద్రముఖి పాత్ర ద్వారా మరొక కోణాన్ని పరిచయము చేసారు. వేశ్య అయిన చంద్రముఖి దేవదాసు పరిచయము ద్వారా పూర్తిగా మారిపోయింది. అదేసమయంలో పార్వతి విరహంతో దేవదాసు మద్యమునకు బానిస అయినాడు. చంద్రముఖి మద్యము ముట్టుకోవద్దని అతనిని వేడుకొన్నది. ఆ దురలవాటు మాన్పించాలని శతవిధాలా ప్రయత్నించింది. దేవదాసు చంద్రముఖిని అసహ్యించుకునేవాడు. ప్రతిసారి తనలో తనే కుమిలిపోయినది కాని దేవదాసును వదలలేకపోయింది. అమె జీవితములోకి దేవదాసు ప్రవేశించాక వేశ్యావృత్తి వదిలివేసింది.

"ఆహా! శక్తి స్వరుపిణివి. తిట్లు, చీవాట్లూ, అవమానాలు, అఘాయిత్యలు, స్త్రీలు ఎంతవరకైతే సహిస్తారో దానికి నువ్వే దృష్టాంతం." అనే దేవదాసు పలుకులలో రచయిత నాటి సమాజంలో స్త్రీల కష్టాలను తెలిపారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

బాల్యములో దేవదాసు చేసిన గాయము ద్వారా వచ్చిన మచ్చను పార్వతి ఎన్నడూ కళంకంగా భావించ లేదు. తాగుడుకు బానిసై ఆరోగ్యాన్ని చేజేతులారా నాశనం చేసుకుంటున్న దేవదాసును చూసిన పార్వతి రోదనకు అంతులేకపోయింది.

"ఈమచ్చే నాకు నాకు స్వాంతన దేవదా! ఇది నాకు లజాకరం కాదు కళంకం కాదు. నాకు గౌరవచిహ్నం." చిన్ననాటి గాయము తాలూకు మిగిలిన మచ్చను తమ మధ్య అనుభందానికి చెరిగిపోని గుర్తుగా భావించింది. ఈ మాటలలో దేవదాసు పట్ల తనకు గల అపారమైన ప్రేమ, దేవదాసు దూరమైనందుకు పార్వతి పడుతున్న బాధ తెలుసుకోవచ్చు.

పారవతి గృహిణిగా తన వంతు కర్తవ్యన్ని సమర్ధ వంతముగా నిర్వహించినది. పార్వతి తన కూతురైన యశోదతో ఇలా అన్నది "ఇది నీ తండ్రి ఇల్లు, ఇంత పెద్ద ఇంటికి ఎంత మంది దాసదాసీలైనా అవసర ముంటారు. నేనూ ఒక దాసీదాన్ని. అంతకన్నా మరేంకాదు. బీదవాళ్ళ పిల్లను. మీ దయవల్ల పోషింపబడుతున్న దీన దుఃఖితులూ, అనాధులలో నేను ఒక్కదాన్ని తల్లీ."

పార్వతి వయస్సు చిన్నదైన ఆలోచనపెద్దది. తన పేద రికాన్ని తలుచుకొని బాధతో కత్త భాద్యతను స్వీకరించింది. ఇంటికి యజమానురాలైన తాను ఒక దాసీ దాన్నని చెప్పు కుంటుంది. సర్వాభరణాలను యశోదకిచ్చివేసి నిరా భరణయై ఉంటుంది. గృహిణిగా తన ధర్మాన్ని మరవ లేదు.

స్త్రీలు శాంత ధీర భావంతో మామూలు గృహకృత్యాలు చూసుకుపోతూ దుఃఖ సమయంలో శక్తి కొద్ది సహాయం చేయగలిగితే ఎంతైనా పొగుడుతారు, కాని ఏక్షణాన్నైనా హృదయవేదన సహించలేక ఇల్లు వదిలి వచ్చి నిలబడిం దంటే అప్పుడు 'కళంకిని' అంటారు". అన్న చంద్రముఖి మాటలలో నాటి సమాజంలో స్త్రీలపై ఉన్న చులకన భావాన్ని తెలియజేస్తారు. తన కష్టాన్ని కడుపులోనే దాచుకొని ఉండి పైకి గంభీరంగా కనిపంచే స్త్రీలనే గౌరవిస్తారని రచయిత తెలిపారు.

పార్వతి దేవదాసుతో తాగుడు మాన్పించాలని అనేక ప్రయత్నాలు చేసి విఫలమైంది. "ఇంక తాగుడు మానేస్తా నని ప్రతిజ చెయ్యి" అని పార్వతి దేవదాసుతో పలుకు తుంది. తన ప్రయత్నము ఫలించకపోయేసరికి వెక్కి వెక్కి ఏడుస్తుంది. దేవదాసు లోని అస్తిరత, చంచలత్వము, అసమర్ధత వలననే పార్వతిని కోల్పోయాడని రచయిత తెలిపారు.

"పార్వతిని ఎంత ప్రేమించే వాడిని! ఆమె ఎంత ప్రేమించింది నన్ను?" అని దేవదాసు బాధాపడుతాడు.

మృత్యువుకు చేరువగుచున్న తరునంలో దేవదాసు పార్వతి ఇల్లు ఉన్న హాతి పోతా గ్రామముకు బయలు దేరుతాడు. క్షణాలను లెక్కబెట్టుకుంటూ ఆ దారి ప్రయానంలో దేవదాసు పాత్రా చిత్రీకరణలో కరుణరసం రచయిత కలం నుండి జాలువారింది. చదువరులకు ఉత్కంఠంతో బాటు, గుండెలో పిండేసే వేదన కలుగు తుంది. చాలా కష్టంతో పార్వతిని కలువాలని ఇంటి ముందు వరకూ వెళ్లిన దేవదాసు చివరికి పార్వతిని చూడ కుండానే మరణిస్తాడు. దేవదాసు దయనీయ స్తితిలో మృత్యువడికి చేరుకునే అస్థితి అందరినీ కంటతడి పెట్టిస్తుంది.

తన ఇంటిముందు మరణించిన వ్యక్తి దేవదాసేనని తెలియగానే పార్వతి దిక్కుతోచని స్థితిలో దేవదాసు చివరి చూపుకై పరుగెడుతుంది. కాని దేవదాసును చూడలేక పోతుంది. దేవదాసు భగ్నప్రేమికుడు. దేవదాసంటేనే దుఃఖము. పార్వతి జీవితము కూడా దుఃఖమయము. చంద్రముఖిది వేదనాపూరితమైన జీవితమే. ఈ మూడు పాత్రలూ కరుణరసముకు ప్రతిబింబాలుగా కనుబడు తాయి. కరుణ రస పాత్ర చిత్రీకరణలో రచయిత నైపుణ్యం అడుగడుగున్నా వ్యక్తీకరింపబడుతుంది.

రచయిత అపార అనుభవము ద్వారా సృష్టించిన దేవదాసు - పార్వతి - చంద్రముఖిల పాత్రలు నేటి సమాజంలోని సామాన్య జనజీవనముతో పోల్చి ఆలో

చింప చేసేలాగా ఉందనుటలో అతిశయోక్తి లేదు. సాంసారిక సంప్రదాయ సంకెళ్ళతో, సామాజిక దురన్యాయాల సమ్మెటపోట్లతో, ఇంటికే కట్టుబానిసగా ఉన్న స్త్రీల పట్ల జాలితో చదువరుల హృదయం కరుణరసాత్మక భవనతో నిండుతుందనుటలో ఏ మాత్రం అతిశయోక్తి లేదని చెప్ప వచ్చును.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# రామాయణం – కరుణ రసం

– బి. రమాదేవి, స్నాతకోత్తర విద్యార్థి, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ & పి.జి. కళాశాల, సిద్ధిపేట, తెలంగాణ.

**రామాయణ ప్రాశస్త్యం :**

భారతీయులకు వేదమే ప్రమాణం. ఆ వేదమే రామాయణ రూపంలో అవతరించడం మన భాగ్యం. మానవ జీవన మూల్యాలను దర్శింపచేసేది అక్షర రమణీ దర్పణం. ఆదికవి వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణ మహాకావ్య మొక మహా సముద్రము అటువంటి రామాయణాన్ని రచించి భారతీయుల్ని పునీతుల్ని చేసిన తపస్వీ వాల్మీకి మహర్షి. వేల సంవత్సరాల నుండి వాల్మీకి అనే గిరి నుండి ప్రభవించిన రామాయణ గంగ నిరంతరం ప్రవహిస్తూ ఈ జాతిని పునీతం చేస్తూనే ఉన్నది.

**వేద వేద్యే పరే పూసి – జాతే దశరథాత్మజే !**
**వేద : ప్రాచేత సాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా**

వేద వేద్యుడు, పరమ పురుషుడు అయిన అపరమాత్మ దశరథ పుత్రుడు శ్రీరామునిగా అవతరించాడు. ఆ పరతత్వాన్ని వెల్లడి చేయడానికి ప్రాచేతసుడైన ఋక్షుడు సాక్షాత్తూ వేదాన్నే రామాయణ రూపంలో అందించాడు. వేదాధ్యయనానికి అధికారంగాని, పాండిత్యంగాని లేని వాళ్ళు రామాయణం పఠనంతో తరిస్తారు. రామాయణం భారతీయుల జీవన విధానానికి దర్పణం. యుగ యుగాలుగా జాతి చరిత్రను చక్కదిద్దే మహాకావ్యం భార్గవుడైన ఋక్షకుడి తరువాత రామాయణాన్ని అనేక భాషల్లో వ్రాశారు. ఎంతో మంది కవులు ఎన్నో రకాలైన ప్రక్రియల్లో ఆ ప్రక్రియకు తగినట్లు మార్పులూ, చేర్పులూ ఔచిత్యానూసారంగా గద్య పద్యోభయ ద్విపద గేయాత్మకములుగా అనాది నుండి రామాయణాలనూ రచిస్తూనే ఉన్నారు.

రామాయణం ఏ రూపంలో ఉన్నా మనకిచ్చే సందేశం ఒక్కటే. ఆదర్శవంతమైన జీవన విధానం, సదాచరణ అందువల్లనే ఇన్ని వేల సంవత్సరాలు గడిచినా రామాయణ కావ్యానికున్న లోక ప్రియత్వం మరే కావ్యానికి లేదు.

**అరణ్యకాండ :**

ప్రతి వ్యక్తి జీవితంలో ఒడిదుడుకులు కలగటం సహజం. ఇటువంటి పరిస్థితి ఎదురైనప్పుడు సామాన్య మానవుడు దు:ఖంతో క్రుంగిపోతాడు. అరణ్య వాసానికి సిద్ధమైన రాముడిలో ఎటువంటి చిత్త వికారం కన్పించలేదు. కాని మానవ సహజమైన దు:ఖం కలుగకపోలేదు. రాముడు వనవాసానికి ముందుగానే తన ధనం అంతా దానం చేస్తాడు. అరణ్యంలో సీత ఏ విధంగా నడుచుకోవాలో ఉపదేశించాడు. రాముడికి తండ్రి మీద గౌరవం, వంశప్రతిష్ఠను నిలపాలనే నియమంతో అడవులకు వచ్చాడు. ఒక నిర్ణయానికి కట్టుబడి, నమ్మిన సిద్ధాంతాల కోసం జీవిస్తాం. చివరికి జీవితంలో కష్టాలు కలిగినపుడు వాటిని భరించేటపుడు మనసు కొంతి అలజడికి గురవుతుంది. సమర్థత ఉన్నా ధర్మానికి కట్టుబడి కష్టాల్ని సహించటం ఆదర్శ మానవుని లక్షణం. రాముడిలో ఈ ఆదర్శ గుణాలే ఎక్కువ. శ్రీరాముడు దండకారణ్యంలో ప్రవేశిస్తాడు. మునుల ఆశ్రమాలవైపు వెళ్ళేటప్పుడు తన ధనస్సు నారిని విప్పి వెళ్ళాడట. రాముడు వినయ సంపన్నుడు. తపోధనుల ఆశ్రమానికి వేళ్ళేటప్పుడు వినితుడై వెళ్ళటాన్ని అతడు మరవడు కదా! శరభంగ, సుతీక్ష్ణ మహర్షుల గొప్ప తప: సంపన్నులు తపొబలం చేత గొప్ప వాళ్ళయిన ఆ మహర్షుల్ని స్వర్గలోకానికి దేవేంద్రుడు ఆహ్వానించాడు. అయినా రాముడు అరణ్యంలో ఉన్నాడని తెలిసి వాళ్ళు అతన్ని చూడటానికి భూమి పైనే ఉండిపోయారు.

సీత సమేతుడైన రామాలక్ష్మణులు అరణ్యంలోనికి ప్రవేశించగానే విరాధుడు అనే రాక్షసుడు రామ లక్ష్మణులను తన భుజాలపై తీసుకువెళ్ళగ సీత రోధిస్తుంది. రామలక్ష్మణులు అసురుడి రెండు భుజాలు తొలగించారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

విరాధుడు తాను తుంబురుడి శాపం వల్ల రాక్షసుడిగా అయ్యానని తనను గోతిలో పూడ్చమని రామ లక్ష్మణులను వేడుకున్నాడు. దండకారణ్యంలోని రాక్షసులు మహర్షుల్ని భాదిస్తుంటారు. మహర్షులు తపోనిష్ఠులు. వాళ్ళు తమ తమ శక్తితో రాక్షస సంహారం చేయడానికి సమర్థులు అయిన తప: క్షయం చేసుకోవటం ఇష్టం లేక రాముడిని ప్రార్థించారు. రాముడు మహర్షులకు రాక్షస సంహారం చేస్తానని మాట ఇస్తాడు. శత్రుత్వం లేకుండా రాక్షసుల్ని సంహరించటం న్యాయం కాదంటుంది సీత. కాని తన ప్రతిజ్ఞను మాత్రం విడువనని నొక్కి చెపుతాడు, సీత నొచ్చుకోకుండా ఎంతో నేర్పుగా, మృదువుగా చెప్పటం విశేషం. అటువంటి సమయాల్లో ఆత్మీయుల మనస్సు నొప్పించకుండా ఒప్పించి తమ మార్గాన్ని సుగమం చేసు కోవడం జీవన కళ. ఈ రహస్యం తెలిసినవాడు కావటం వల్లనే శ్రీరామాచంద్రుడు ఆదర్శ వ్యక్తి అయ్యాడు. శ్రీరామలక్ష్మణులు అగస్త్య మహర్షిని దర్శించి తాము నివసించుటకై తగిన ప్రదేశం సూచించమనీ కోరగా మహర్షి పంచవటిలో నివసించమని ఉపదేశించాడు. మార్గ మధ్యంలో వీరికి జటాయువు కనిపిస్తుంది. దానికి సీతా సంరక్షణ బాధ్యతను అప్పగిస్తారు. శూర్పణఖ మోహంతో రామలక్ష్మణుల్ని సమీపిస్తుంది. వారి ముందు తన కోరికను వెల్లడిచేస్తుంది. శూర్పణఖ రాముడిని దండ కారణ్యానికి వచ్చిన కారణం గురించి అడుగుతుంది. రాముడు విషయాన్నంతటిని ఉన్నదున్నట్లుగా చెపుతాడు.

**"అన్నతం నహి రామస్య – కదాచిదపి సంమతయ్!**
**విశేషణా శ్రమస్థన్య – నమీపేస్త్రీ జనస్యచ !! "**

రాముడికి అసత్యం పలకడం ఎన్నడూ ఇష్టం కాదు. విశేషించి అతడు ఆశ్రమంలో ఉన్నప్పుడు, స్త్రీల ఎదుట అసత్యం అతనికిష్టం కాదు. అందుకే రాముడు కూడా తామెవరో దండకారణ్యానికి వచ్చిన కారణం ఏమిటో ఉన్నదున్ననట్లుగా చెప్పాడు. శూర్పణఖ కోరిక విన్న రాముడు తనకు వివాహం అయిందని లక్ష్మణుడికి వివాహం కాలేదని అతడు నీకు తగిన భర్త అనీ అంటాడు. లక్ష్మణుడు శూర్పణఖ విరూపిని చేసి పంపిస్తారు. చెవులు, ముక్కులు కోసి వికృతంగా ఉన్న మొహంతో రాక్షసి తన సోదరుడైన ఖరుడివద్దకు చేరి జరిగిన విషయాన్నంత వివ రించింది. జనస్థానంలో శ్రీరాముడు ఖరుని, అతని సైన్యాన్ని సంహరిస్తాడు. అప్పుడతని పరాక్రమం, యుద్ధ నైపుణ్యాన్ని గురించి విపుల వర్ణన జరిగింది. అంతకముందే సీత నిష్కారణంగా రాక్షసులతో వైరం తగదంటుంది. రాముడు మహర్షుల ఆదేశాన్ని అనుసరించి ధర్మ రక్షణ కోసం మాత్రమే తాను రాక్షస సంహరానికి సిద్ధమయ్యా నంటాడు. దుష్టుల్ని సంహరించి ధర్మ రక్షణ శాంతి స్థాపన చేయటం అతని కర్తవ్యం. వాళ్ళపై అతనికి వ్యక్తిగతమైన క్రోధమేమీ లేదు.

అందుల్లనే రాక్షసులతో యుద్ధం చేసేటప్పుడు క్రోధాన్ని ప్రదర్శించననీ రాముడి ఉద్దేశ్యం. ఖర, దూష ణులే కాదు 14వేల మంది రాక్షసుల్ని ఒక ఘడియలో సంహరించాడు. ఆ విధంగా దండకారణ్య వాసులకి రాక్షస బాధ లేకుండా చేసిన మహపరాక్రమశాలి రామచంద్రుడు. రాముని పరాక్రమం అద్భుతమైంది. ఆ సందర్భంలో రాముడి పరాక్రమాన్ని శత్రువులు కూడా ప్రశంసించారు. రాముణ్ణి వధించడం దేవాసురులకు కూడా సాధ్యం కాదని శూర్పణఖ సీతను అపహరించమనీ, సలహ ఇస్తుంది. రాముడు భయంకరామైన బాణాల్ని ఎప్పుడు తీస్తున్నాడో, ధనస్సు ఎప్పుడు లాగుతున్నాడో, బాణాల్ని ఎలా ప్రయో గిస్తున్నాడో నాకు కనబడలేదు అనీ సోదరి ద్వారా గ్రహిం చిన రావణాసురుడు సీతను అపహరించటంలో తనకు సహాయం చేయమని మారీచుడిని అడుగుతాడు. మారీచుడు అతడిని వారిస్తూ ఎన్నో విధాల హిత బోధ చేస్తాడు. జరిగిన విషయాల్ని గురించి సరిగా తెలుసు కోవాలంటాడు. తన బలాన్ని, ఎదుటి వ్యక్తి బలాన్ని పరిగ ణించలంటాడు. మారీచుడు రాముడి పరాక్రమం తనకు బాగా తెలుసని రావణుడికి వివరిస్తాడు. రెండు సార్లు రాముని బాణపు దెబ్బను తాను చవిచూశానని తన అనుభవాన్ని వివరిస్తాడు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

మారీచుడు ఎంత చెప్పినా వినడు. పైగా మారీచుని బెదిరిస్తాడు. మారీచుడు తన మనస్సులో ఈనీచుని చేతం జచ్చుకంటే రఘురామ చేత జచ్చినం బరమతి గలదు. కావున నిదియేమేలు కార్యంబని పూని మాయా మృగం కావటానికి అంగీకరిస్తాడు. శ్రీరాముడు ధర్మ బద్ధుడు, పితృ వాక్య పరిపాలకుడు అందువల్లనే వనవాసానికి వెళ్ళాడు. అన్ని అనర్ధాలకి మూలకారణమైన కైకేయి దుర్బుద్ధి రాముడి మనసుకి బాధ కల్గిస్తూనే ఉంది. కాని ద:ఖ తీవ్రతలో తాను కైకేయిని ఆమె దుర్బుద్దిని అనేక మార్లు స్మరిస్తాడు. తానీ విధంగా కష్టాలపాలవడం వల్ల కైకేయి కొరిక సఫలమైందంటాడు. అంతలో సీతా అప హరణం అతనికి అశనిపాతమే అయింది. పర్ణశాలలో సీత కనిపించక రాముడు దు:ఖించటం సీత జాడ తెలియక రాముడు విలపిస్తాడు. ఆమె కోసం అన్వేషిస్తాడు. తన ఆజ్ఞను అతిక్రమించి సీతను ఒంటరిగా వదలి వచ్చి నందుకు రాముడు లక్ష్మణున్ని మందలిస్తాడు. ఇన్నాళ్ళు సీత తనకు అండగా వుంది. రాణీ వసాన్ని వదిలి తనతో అరణ్యవసానికి సిద్ధమై వచ్చింది. అడవల్లో అనేక కష్టాలు పడింది. అటువంటి సీత కనిపించపోయే సరికి రాముడు చెట్లని, పుట్లని, గోదావరిని పర్వతాలని కూడా సీత జాడ గురించి అడుగుతాడు. సీతారాములు కలిసి విహరించిన ప్రదేశంలో పిచ్చి వాడిలా తిరుగుతాడు. వెతికి, వెతికి అలసిపోతాడు. ఇప్పుడు కైకేయి కోరిక తీరిందం టాడు. సీత లేకుండా అయోద్యకెట్లా తిరిగి వెళ్ళగలనని దు:ఖిస్తాడు. జనకుని ముఖం ఎట్లా చూడగలనని వాపోతాడు. తానిన్ని కష్టాలు అనుభవించటానికి కారణం పూర్వ జన్మలో తాను చేసిన పాపాలే అని బాధపడతాడు. లోక హితాన్ని కోరి తానిలా జీవిస్తుంటే దేవతలు కూడా తనకు ప్రతికూలంగా ఉన్నారని బాధపడతాడు. ఇలా భార్యా వియోగంతో రాముడు తల్లడిల్లుతాడు. ఆ శోకం మన హృదయాల్ని కూడా దు:ఖంలో ముంచెత్తుంది. ఆ దు:ఖాన్ని చూసిన తరువాత మన కష్టాలు గుర్తురావు. సర్వసమర్ధుడు, సకల లోకేశ్వరుడే ఇన్ని కష్టాల పాలై ఇంతగా దు:ఖిస్తుంటే మనమెంత అనే భావన ఆపత్కా లంలో మనకు ఊరడింపవుతుంది. కష్టాల్ని భరించడానికి కొండంత సహనం అలవడుతుంది. ప్రభు సమ్మితమైన వేదం, కాంతా సమ్మితమైన కావ్యంగా అవతరించింది. మానవ జీవితంలో సంభవించే ఒడుదుడుకు లన్నింటినీ సహించి ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మాన్ని వీడక ధీరుడై నిలిచిన గంభీరుడు. మహోన్నతమైన రామాయణానికి ఉన్న లోక ప్రియత్వానికి ఇదే కారణం. ఎన్ని వేల సంవత్సరాలు గడిచిన, మానవుడు ఇతర రంగాలలో ఎంత అభివృద్ధి సాధించినా రామాయణం భారతీయులకు శిరోధార్యమే! కష్ట పరం పరలో చిక్కుకున్న మానవాళికి చేయుతనిచ్చి నడిపించేది.

**"వాల్మీకి గిరి సంభూతా-రామాంభోనిది సంగతా!**
**శ్రీమద్రామాయణీ గంగా – పునాతి భువనత్రయమ్!!"**

కవితా శాఖను అధిరోహించి మధురంగా రామ నామాన్ని ఆలపించి యుగ యుగాలుగా భారతీయులు పరవశిస్తూనే ఉన్నారు. భారతీయుల ఆధ్యాత్మిక జీవితంలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించుకొన్న గ్రంథం రామాయణం.

**నమోస్తూ రామాయ సలక్ష్మణాయ, నమోస్తూ దేవ్యైజన కాత్మయై**

**ఆధార గ్రంథాలు :**

1. రామాయణము - రామపాత్ర - డా॥ తుమ్మలపల్లి వాణీకుమారి
2. శ్రీమద్రామాయణ కల్పవృక్షము - విశ్వనాథ సత్యనారయణ
3. భాస్కర రామాయణము - భాస్కరుడు
4. రంగనాథ రామాయణము - గోన బుద్ధారెడ్డి

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# "మనుచరిత్రలో నవరసములు"

-డా॥ కె. అరుణాబాయి, ప్రధానాచార్యులు, ప్రభుత్వడిగ్రీ కళాశాల, శేరిలింగంపల్లి, రంగారెడ్డిజిల్లా, తెలంగాణ.

కావ్యపురాణయుగం తరువాత రాయలయుగం లేదా ప్రబంధయుగంగా చెప్పున్నకాలం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక వినూత్న ప్రక్రియకు ద్వారాలు తీసింది. ఆ వినూత్న ప్రక్రియే ప్రబంధం. ఆ ప్రబంధ ప్రక్రియకు ఆదిమూలం మనుచరిత్ర అల్లసాని పెద్దనామాత్యుని కృతం. ఈ ప్రబంధం తరువాత ప్రబంధాలన్నింటికీ మార్గదర్శనం చేసింది. పెద్దన చతురవచోనిధి, అఖిల పురాణేతిహాస విజ్ఞానఖని, చతుర్విద కవితా విశారదుడు. మారన మార్కండేయపురాణంలోని ఒక చిన్ని కథను స్వీకరించి దానిని అష్టాదశవర్ణనలచే పెంచి శృంగారాది రసప్రధానంగా. ఆరు ఆశ్వాసాల ప్రబంధంగా మనుచరిత్ర రచించాడు పెద్దన.

కవి చౌడప్ప "పెద్దన వలె గృతి సెప్పినా" అని 'పెద్దన'ను నుతించాడు.'అల్లసానివారి యల్లిక జిగిబిగి" అనే నానుడి లోకప్రసిద్ధం. ఈ మనుచరిత్రకు స్వారోచిష మనుసంభవ మనే నామాంతరం వుంది. మనుచరిత్ర స్వతంత్ర ప్రబంధం. పంచకావ్యాలలో మొదిటికూడా ఈ ప్రబంధమే.

శాస్త్రాలననుసరించి మనువులు పదునాలుగుమంది. వారిలో ఒకడు స్వారోచిషుడు. ఇదంతా ఒక పార్శ్వమైతే మరో పార్శ్వంలో మనుచరిత్ర నాచన సోముని ఉత్తర హరివంశంలాగ "రస సముంచిత కథలతో నిండినది" అంటారు "మను వసుచరిత్రలపై తులనాత్మక పరిశీ లనము" అనే అంశంపై పరిశోధించిన డా॥ముదిగంటి సుజాతారెడ్డి. ఈ మనుచరిత్ర శృంగార, వీర, కరుణ రసవృత్తాంతాలతో కూడి వుంటుంది. అయితే ఈ ప్రబంధములోని రసపరంగా సన్నిధానంవారు, దివాకర్ల వారు భిన్న అభిప్రాయాలను తెలియచేశారు.ఈ ప్రబంధం నిజంగా శృంగారరసమునే పరిపుష్టం చేసిందనడానికి ఈ ప్రబంధంలోని తృతీయాశ్వాసం పద్యాలు

1) **"...యిందులకై వగంబొగుల నేటికి ...**
**...... యెవ్వని వెత్తిఁజేయనే"**

- 1. మనుచరిత్ర తృతీయాశ్వాసం పద్యం 64, పుట.94

2) **"ఏల దురంత వేదన .....**
**నినుఁజూచు నంతకున్"**

- 2. మనుచరిత్ర తృతీయాశ్వాసం పద్యం 64, పుట.94

శృంగార భావనలచేతనూ, సఖుల ఉత్సాహపరిచిన కారణంగాను వరూధుని గంధర్వుని ప్రవరునిగానే భావించింది. కావున వరూధిని కపట ప్రవరుల మధ్య రతి ఉభయ ఇష్టమైనందున శృంగార రసమే ప్రాధాన్యత వహించింది ఈ ప్రబంధానికి. విమర్శకులన్నట్లు శృంగార రసాభాసము కాదు. ఈ కారణాలచేత ఈ ప్రబంధంలో అంగరసం శృంగారముగా స్పష్టమవుతోంది. అలాగే అంగి రసం శాంతంగా చెప్పబడింది. దీనికి తార్కాణం ఈ గ్రంథ ఆరంభంలో ప్రవరుని ధీరశాంతస్వరూప వర్ణన అతని గుణముల ఆధారంగా తెలియజేయబడింది. నిజానికి మనుచరిత్రలో ప్రవరుడు "మకరాంక శశాంక మనోజ్ఞ మూర్తి" అంతేకాక ధీర, శమ, శాంత గుణముల వల్ల మనఃప్రసన్నత కలిగిన ధీరశాంతుడు, సుందరూప గుణ సంపన్నత, ఏకపత్నీవ్రతం, అధ్యయన, అధ్యాపనా తత్ప రత, అతిథిసేవాపరతంత్రత మొదలైనవి ప్రథమా శ్వాసంలో ఎనిమిది పద్యాల్లో పెద్దన తెలియజేశాడు. దీనికి ఇది ఉదాహరణ.

3) **"శాంతరసమొల్కు బ్రహ్మతేజంబుతోడ**
**బ్రవరుడయ్యె వియచ్చర ప్రవరుఁడపుడు"[3]**

- 3.మనుచరిత్ర పద్యం 71, పుట.96

గంధర్వుడు ప్రవరుని వేషం ధరించిన సందర్భంలో అతడు కపటిగానే కనిపించాడుగాని నిజమైన ప్రవరుడుగా కనిపించలేదు ఒక్క వరూధునికి తప్ప. ఈ అంశాలతో

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

సరిపోలిస్తే ఈ ప్రబంధనాయకుడు ప్రవరుడు శాంత మూర్తి, వరూధుని శృంగార రసమూర్తి. ఈ కారణంచేత ఈ ప్రబంధంలో నిజప్రవరుడు శాంతరసమూర్తికి, వరూధునికి శృంగారరసమూర్తికి పొసగలేదు. ఇది శాంత శృంగారాలకు ద్వితీయాశ్వాసంలోని ఘర్షణగా పేర్కొన వచ్చు. వీరిని ఆయా రసాల్లో సరిపోలుస్తొ పెద్దన రస బంధురంగా తెలియజేశాడు. ఇక ఈ ప్రబంధంలో అంగ రసంలో శృంగారసం తదుపరి నవరసాల్లో కనిపించే వీర రసం ఈ ప్రబంధంలో విస్తరణగా కనిపిస్తుంది. ఈ రసానికి వీరమని లోకప్రాచుర్య నామం వుంది. చతుర్థాశ్వాసంలో స్వరోచి రాక్షసులతో యుద్ధం చేసే సమయంలో, ఆరవ ఆశ్వాసం రెండవ పర్యాయం సరోచి వేటకెళ్ళిన సంద ర్భంలో ఈ వీరరసం పోషించబడింది. పెద్దన ఈ ప్రబంధంలో వీరరసపోషణలో తన నేర్పరితనం ప్రదర్శిం చాడు. ఈ వీరరసానికి ప్రత్యక్ష ఉదాహరణ ఈ మహాస్రగ్ధర పద్యం.

**4). "గళగర్త క్రోడ...... జాళెముల్ ద్రిప్పుకొంచున్"**

- 4.మనుచరిత్ర నాల్గవ ఆశ్వాసం, పుట 136

పై పద్యంలో స్వరోచి రక్కసునితో యుద్ధం చేసిన సందర్భంలో పై పద్యం ద్వారా పెద్దన స్వరోచి వీరాన్ని తెలియజేశాడు.

మనుచరిత్రలో మరొక రసము అద్భుతరసము. ఈ రసాన్ని కూడా పెద్దన రససంభరితంగా తెలియజేశాడు. అద్భుతరసానికి విస్మయం స్థాయీభావం. మనుచరిత్రలో నాల్గవ ఆశ్వాసంలో స్వరూచి ఇందీవరాక్షుడు శాపవశాన రాక్షసునిగా మారి అల్లకల్లోలాలు సృష్టించినపుడు అతనిని యుద్ధంలో పావకాస్త్రంతో (అగ్నిఅస్త్రంతో) కాల్చి నిజరూపం (పూర్వగంధర్వరూపం) తెప్పించడంలో ఎంతో ప్రతిభతో పెద్దన అద్భుతరసాన్ని పండించాడు.

**5). క॥భూపతి పావక బాణం..... ఖేచరులు వెఱఁగందన్"**

- మనుచరిత్ర నాల్గవఆశ్వాసం పద్యం 116, పుట 142

పై పద్యంలో అప్పటివరకు బ్రహ్మరాక్షసుని రూపంలో ఉన్న గంధర్వుడు ఒక్కసారిగా నిజరూపాన్ని పొందడం అద్భుతంగా అనిపిస్తుంది. అందువల్లనే అక్కడ ప్రయో జనం కోసం అద్భుతరసాన్ని పెద్దన ప్రయోగించాడు.

ఇక రౌద్రరసాన్ని పరిశీలిస్తే రౌద్రరసానికి స్థాయీభావం కోపం. దీన్ని చిత్తప్రవృత్తి విశేషంగా రసగంగాధరకర్త తెలియజేశాడు. ఈ రౌద్రరసం పాత్రల గుణస్వభావ రీతులనుబట్టి పోషిస్తారు కావ్యకర్త. వారి మార్గంలోనే పెద్దన ఈ ప్రబంధంలో రౌద్రరసాన్ని ఇందీవరాక్షుడు అనే గంధర్వునకు విద్యనేర్పిన గురువైన బ్రహ్మమిత్రుడు ఆ గంధర్వుని తృణీకారమును సహింపలేక కోపంతో బ్రహ్మరాక్షసరూపం వస్తుందని శపించే ఘట్టంలో మత్తేభ పద్యంలో పెద్దన బ్రహ్మమిత్రుని కోపాన్ని ప్రకటితం చేశాడు. ఆ పద్యం

**6). మ॥ "అనినం గన్నులు జేవురింప...... కరాళధ్వనిన్"**

- 6. మనుచరిత్ర నాల్గవ ఆశ్వాసం, పద్యం 121, పుట 142

పై పద్యంలో బ్రహ్మమిత్రుని రౌద్రరూపం, హావ భావాలు కనులముందు సాక్షాత్కరింపజేశాడు. మరొక కోణంలో పెద్దన నన్నయ్య కవితా గుణాల్లో ఒకటైన అక్షరరమ్యతను ప్రయోగించాడు.

భయానకరసాన్ని గురించి చెప్పవలసి వస్తే దీని స్థాయీభావం భయం. దీనిగురించి నరసభూపాలీయ కర్త భట్టుమూర్తి (ఇతనికే రామరాజభూషణుడనే పేరుంది). క్రూరకారాదులను చూసే సందర్భంలో జీవుల హృదయంలో పుట్టే అనర్థశంకలు భయంగా నరస భూపాలీయ కర్త తెలియజేశాడు. ఈ మనుచరిత్ర ప్రబంధంలో చతుర్థాశ్వాసంలో స్వరోచి వేటసందర్భంలో మనోరమ బ్రహ్మరాక్షసుని బారినుండి పరువెడుతున్న ఘట్టంలో స్వరోచి అభయం ఇచ్చినప్పటికీ ఆమెపొందే భయాన్ని పెద్దన ఈ పద్యంలో తెలియజేశాడు.

**7). "ఒక్కతె భయశోకంబుల........నెక్కొన ధరణీశు నెదుట నిలిచి వినీతిన్"**

- 7.మనుచరిత్ర నాల్గవ ఆశ్వాసం, పద్యం 69, పుట 131.

పై పద్యంలో మనోరమ భయముచేత, శోకముచేత విహ్వల చిత్తయై గద్గదకంఠియై కన్నులు నాశికాపుటములు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

అదురుచుండ కంపనతో ప్రకటించిన భావములన్నియూ భయానకములుగానే పెద్దన తెలియజేశాడు.

తరువాత రసము భీభత్సము. ఇది ఏహ్యమైన స్ఫురణము. వస్తువులలోని దోషాన్ని దర్శించినపుడు కలిగే రోతను జుగుప్స అంటారు. దీన్ని గూడా రసగంగాధరకర్త చిత్తప్రవృత్తి విశేషం అని తెలియజేశాడు. ఈ భీభత్సానికి జుగుప్స స్థాయీభావం. మనుచరిత్రలో ఇందీవరాక్షుడు (గంధర్వుడు) బ్రహ్మమిత్రుని శాపంతో (గురుశాపంతో) బ్రహ్మరాక్షసునిగా మారినపుడు అతని రూపాన్ని వర్ణిస్తూ పెద్దన్న భీభత్స రసాన్ని ఈ పద్యంలో ప్రయోగించాడు.

**8. "నిట్టుతాడనఁబొడవుచేనిక్కినాఁడు..... యుసుఱు గొనవెంటఁదిరిగెడునసురయొకడు"**

- 8. మనుచరిత్ర నాల్గవ ఆశ్వాసం, పద్యం 74, పుట 141.

పై పద్యంలో బ్రహ్మరాక్షసుని రూపం జుగుప్సా కరంగా కనిపించడాన్ని పెద్దన్న అనేక ఉపమానములతో జోడించి తెలియజేశాడు. ఈ రకమైన భీభత్సరసాన్ని ఆముక్త మాల్యదలో మాలదాసరి కథలో అతని ఎదుట ప్రత్యక్ష మైన బ్రహ్మరాక్షసుడు అతడు నివసించు మఱ్ఱిచెట్టు ఆ చుట్టు పక్కల ఉన్న కపాలములన్నియు భీభత్స ప్రతీకము లుగా శ్రీకృష్ణదేవరాయలు దర్శింపజేశాడు.

ఇక నవరసాల్లో ప్రాధాన్యతను సంతరించుకున్న రసం కరుణరసం. "రసేషుకరుణోరసః" అన్న నానుడి రసాల్లో కరుణమే ముఖ్యమైనది అని తెలియజేస్తోంది. కరుణ రసానికి స్థాయీభావం శోకం. ఈ కరుణరసాన్ని పెద్దన మనుచరిత్ర ప్రబంధం ఆరవ ఆశ్వాసంలో మనోరమ తన చెలికత్తెల దుస్థితిని చూచి శోకించే ఘట్టంలో ప్రయోగించాడు. ఆ పద్యం ఇలా వుంది.

**9. "అక్కట!.... స్వరోచి ఇట్లనున్"**

- 9.మనుచరిత్ర ప్రబంధం ఆరవఆశ్వాసం, పద్యం 10, పుట 171

మనోరమ చెలికత్తెలు అడవిలో అగచాట్లు పడుతూ మనోరమకు కనిపించిన సందర్భంలో ఆమె వారిని చెలి కత్తెలుగా కాక తన తోడబుట్టినవారివలే భావించి బిగ్గరగా ఏడ్చుచున్న సందర్భమును

పై పద్య పరంగాపెద్దన కరుణసప్లావితంగా తెలియ జేశాడు.

ఇక హాస్యరసానికి వస్తే ఈ హాస్యరసానికి స్థాయీభావం "హాసం". ఈ రసాన్ని గూడా చిత్తవృత్తి విశేషంగా రసగంగా ధర కర్త తెలియజేశాడు. ఈ హాస్యం చేష్టాగతంగా కూడా దర్శించవచ్చు. మనుచరిత్ర నాల్గవ ఆశ్వాసంలో మనోరమ వృత్తాంతంలో మునివర్ణనలో ఈ హాస్య రసాన్ని పెద్దన ప్రయోగించాడు. ఆ పద్యం ఇలా వుంది.

**10. "ఊసరవెల్లి చందమున...... జీర్ణమునింగని కౌతుకంబునన్"**

- 10. మనుచరిత్ర నాల్గవ ఆశ్వాసం, పద్యం 79, పుట 133.

ఈ పద్యంలో మునిని మనోరమ చూసిన సందర్భంలో ఆ ముని రూపం హాస్యమునకు ప్రేరణ కలిగించునదిగా ఉన్నట్లుగా పెద్దన పై పద్యంలో తెలియజేశాడు.

ఈ విధంగా పెద్దన ప్రబంధం మనుచరిత్రలో నవ రసాలతోపాటు భక్తి రసాన్ని కూడా ఆరో ఆశ్వాసాంతంలో విష్ణువుని తనకు దర్శనమిచ్చిన సందర్భంలో స్వరోచి భక్తిరస ప్లావితంగా విష్ణుస్తుతి చేసిన సందర్భంలో ప్రకటితం చేశాడు. ఏది ఏమైనా ప్రబంధాలను ఏక వాక్యంగా శృంగారాత్మకములని విమర్శచేయడం కేవలం హేతువు రహితమైన నిందగానే పరిగణించాలి. రాయల కాలంలో వచ్చిన ప్రబంధాలు సందర్భ శుద్ధికి అను గుణంగా నవరసాలను తగుపరిణామంలో ప్రయోగిం చాయి. అలాగే ప్రబంధాలు సామాజికాంశాలను కూడా స్పృశించాయనే వాస్తవాలను తెలియజేస్తూ ఈ మను చరిత్ర ప్రబంధంలో నవరసాలను ఆయా ఆశ్వాసాలలోని ఘట్టాలకు అనుగుణంగా పద్యాలను సోదాహరణంగా ఈ సదస్సు పత్రంలో తెలియజేయడం జరిగింది. ❖

ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సదాశివపేట.

# నవరసాల్లో – కరుణరసము

– ఆచార్య జి. బి. ఆనంద కుమార్, ఆంధ్రోపన్యాసకులు, నోబుల్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), మచిలీపట్నం.

## ఉపోద్ఘాతము :

ఏదైనా ఒక చక్కని కావ్యములోని మధురమైన పద్యములను చదివినప్పుడు గానీ, నాటకాన్ని చూసినప్పుడు గానీ, తియ్యని పాట విన్నప్పుడు గాని, మన మనస్సును ఒక విధమైన హాయిని కలిగించి, అలౌకికమైన ఆనందము, పారవశ్యమును పొందుతాము. ఆ అలౌకికమైన ఆనందాన్ని కలిగించే భావ స్వరూపమే రసము. భావం, భావన, ఆలోచన, పదగుంఫనము అనేవి కావ్య తత్వములు. యివన్నీ ఏ కావ్యంలో సమపాళ్లలో వుంటాయో ఆ కావ్యము చదివినప్పుడు ఈ ఆనందాన్ని పొందుతాము.

నవరసాలు అనే మాట లోకంలో ప్రసిద్ధంగా వుంది. ఈ నవరసాల్లో కరుణ ఒక ముఖ్యమైన రసము. దీనికి స్థాయి భావము శోకము. బంధువులు, మిత్రులు యితర అవినాభావ సంబంధం గల వారి వియోగమువలన కలిగిన దు:ఖము శోకము.

## కరుణ రసము – రసరాజము :

రసరాజమేది? అనే ప్రశ్నకు ఆలంకారికుల్లో చాలా వాదోపవాదములు జరిగాయి. అందులో కరుణరసాన్ని కూడా రసరాజముగా ప్రస్తావించారు. వీరిలో ముఖ్యుడు భవభూతి. కరుణ రసానికి వున్న హృదయ ద్రవీకరణ శక్తి మరి ఏ రసమునకు లేదు. కనుక కరుణయే ఉత్తమ రసముగా ప్రతిపాదించిన వారు వున్నారు. సంస్కృత సాహిత్యంలో ఆధికవి వాల్మీకి 'మానిషాద' శ్లోకం కరుణ రసభరితం. అతని శోకం శ్లోకంగా మారింది. వాల్మీకి శిష్యుడైన భవభూతి 'తమస' అనే పాత్ర ద్వారా ఈ భావాన్ని వ్యక్తం చేశారు.

భవభూతి తన 'ఉత్తరామ చరిత్ర' నాటకంలో-

**"ఏకోరస: కరుణ ఏవ నిమిత్తభేదా
ద్భిన్న: పృధక్పృథగివాశ్రయతే వివర్తాన్
ఆవర్త బుద్బుద తరంగమయాన్వికారా
సంభోయథా సలిలమేవ హితత్సమస్తమ్"**

(కరుణ ఒక్కటే రసము. నీరు సుడులుగా, బుడగలుగా అలలుగా మారినట్లుగా, బేధమును బట్టి కరుణ వివిధ రకాలుగా కనిపిస్తుంది) విప్రలంబ శృంగారము కరుణ రస బేధములలో ఒకటి అని, అదే 'కరుణ విప్రలంబము' అని కొందరు ఆలంకారికులు భావించారు.

పై శ్లోకంలో భావం భవభూతి 'ఉత్తరామ చరిత్ర' నాటకంలో ఒక పాత్ర ద్వారా పలికించాడు. పాత్రలు పలికిన కావ్యాలను కవి అభిప్రాయాలు అని లేము. కాని యిక్కడ పై శ్లోకం సహజంగా కాకుండా అతికించినట్లుంది. సీతారాముల దుస్తితిని చూచి శోక నిమగ్నమైన 'తపసి' పలికినది శ్లోకం. అలంకార శాస్త్రోదాహరణ మన దగిన ఈ శ్లోకం పాత్రోచితంకాదు. అది భవభూతి అభిప్రాయము అని భావించాలి. కరుణరసము ఆబాల గోపాలాన్ని ఆనందింపచేస్తుంది. హృదయాన్ని ద్రవీకరింప చేసే శక్తి కరుణరసానికి వున్నంతగా మరి ఏ యితర రసానికి లేదని. కరుణ రసము నిమిత్తం భేదాలుగా వివర్తనం పొందటాన్ని మానసిక ధర్మశాస్త్ర వేత్తలు అంగీకరింపరు. అందుకే సద్య:పర నిర్వృతిని కలిగించు ఆపాతమధురమైన సంగీత శక్తి కరుణకు వున్నట్లుగా చెప్పారు. కాని యిది రసరాజమవుతుందా? అంటే శృంగారసమువలె పరివ్యాప్తమగు రసముగా దీనిని భావించుటకు అవకాశం లేదు. యిది జన్యరసమే కాని, జనకరసము కాదని విజ్ఞుల యొక్క అభిప్రాయము. అంటే - కరుణ రసరాజము కాదన్నారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

**కరుణరసము – బేధములు :**

భరతుడు 'నాట్యశాస్త్రం'లో కరుణ రసానికి మూడు భేదములు వున్నట్లుగా ప్రస్తావించాడు.

1. ధర్మోపఘాతజం - యిది ధర్మహాని వల్ల కలుగుతుంది.
2. అర్థాపచయోద్భవం - యిది ధనహాని వల్ల కలుగుతుంది.
3. శోకకృతం - బంధువులు, మిత్రుల మృత్యుశోకం వల్ల కలిగేది.

   అగ్ని పురాణ కర్త కరుణరసానికి మరొక భేదాన్ని ఆపాదించాడు.
4. చిత్తగ్లాని, జన్యజని - భానుదత్తుడు కరుణరసానికి రెండు బేధాలను చెప్పాడు.
5. స్వనిష్ట - తనకు వచ్చిన కష్టం వల్ల కలిగేది.
6. పరనిష్ట - యితరులకు వచ్చిన కష్టం వల్ల కలిగేది.

కవిబ్రహ్మ తిక్కన 'విరాటపర్వం'లో - ద్రౌపది విరాటుని నగరానికి వెళ్లేటప్పుడు నడువలేని పరిస్థితుల్లో అలసి, సొలసి పోయిన సందర్భంలో -

**'డప్పిజనించె వ్రేళుల పుటంబులు పొక్క దొడంగె గోళ్ళలో**
**జిప్పిల జొచ్చె నెత్తురులు చిత్తము నాకు గడున్ వశంబుగా**
**డప్పుర మిచ్చుటచ్చుటను నాసల వచ్చితి నెంత దవ్వొకో**
**యిప్పటి భంగి నొక్కడుగునే గెడుదానికి నోర్వ నెమ్మయిన్'**

పద్యాన్ని స్వభావోక్తి అలంకార భూయిష్టంగా రచించాడు. సుకుమారియైన పాంచాలి ధర్మరాజులో మాట్లాడిన పద్యమిది. ఈ పద్యంలో కరుణ రసప్లావితమైన వర్ణన కనిపిస్తుంది. 'అయ్యో! పాపం' అన కుండా ఈ పద్యాన్ని పఠించటం కుదరదు. ఈ పద్యంలో తిక్కన దీర్ఘమైన సమాసాలనున వాడకుండా, పొడిపొడి మాములలో ద్రౌపతి యొక్క మనోగతాన్ని వ్యక్తపరిచినాడు. ఈ భావ విస్తరణ, ఆంగికాభివర్ణనం మూలంలో లేదు. కావ్య శిల్పానికి, రసాశ్రయ భావోన్మీలన పద్ధతికి ఈ పద్యం మంచి ఉదాహరణగా కనిపిస్తుంది.

కుంతి తన కుమారులకు కోడలికి కలిగిన కష్టాలకు, నష్టాలకు ఎంతో ఆవేదన చెందింది. కుంతీ వియోగ వేదనను ద్రౌపది వ్యక్తం చేసిన విధానం తిక్కన ఎంత చక్కగానో తన కలం నుండి ఝుళిపించాడు -

**'కడుబసి బిడ్డ వీడొకటి కాదవునా నెఱుగండు ముందరె**
**య్యెడనొక పాటెఱుంగడెద యెంతయు గోమల మెప్పుడైననే**
**గుడువగ బిల్తుగాని తనకుంగల యాకటి ప్రొద్దెఱుంగడీ**
**కొడుకిటు పోకకున్ మనము గుండెడు నిన్గని యూఱడిల్లున్'**

తిక్కన రచించిన ఆంధ్రమహాభారతంలోని ఉద్యోగ పర్యంలో 'ద్రౌపది పరిదేవనం'లో పాండవుల తరపున కౌరవసభకు రాయభారిగా వెళుతున్న శ్రీ కృష్ణునికి తనకు జరిగిన అవమానాలను వివరిస్తూ ద్రౌపది యిలా పలికింది -

**'ఆ సభ కేకవస్త్రయగునట్టి నను౦ గొని వచ్చి నొంచుదు**
**శ్శాసను జూచుచుం బతుల సంభ్రములై తగు చేష్టలేక'**

తన నిస్సహాయ అసహాయ స్థితిని దీనాతిదీనంగా పలికిన మాటలు హృదయాల్ని ద్రవింపచేస్తాయి.

**'ఇది దుస్స సేను వ్రేళ్లం**
**దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి'**

మొదలైన మాటల ద్వారా పాంచాలి హృదయావిష్కరణ జరిగింది. తద్వారా ఆమెలోని అంతర్మధనం పెల్లుబికి భావాన్ని సూటిగా వ్యక్తం చేసింది. సంస్కృత సాహిత్యంలో కవికుల గురువైన కాళిదాసుచే విరచింపబడిన 'కుమార సంభవం' పంచమ సర్గలో శంకరునికై తపస్సు చేస్తున్న పార్వతి తీరును, రీతిని చక్కగా విరచిస్తాడు.

**"త్రిభాగ శేషాసు నిశమ్య క్షణం**
**నేత్రే నిమీల్య, 'క్వాసి నీలకంఠ' ఇతి**
**అసత్య కంఠార్పిత బాహుబంధనా"**

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

రాత్రి నాల్గవ జాములో తదేక నామస్మరణలో మార్మోగుతున్న పార్వతి హృదయములో ప్రేమైక హృదయినిగా, పరాకాష్టకు చేరిన పార్వతిని చూస్తే ఉస్సూరనిస్తుంది. 'అసత్య కంఠార్పిత బాహుబంధనా' అనటంలో 'నిజము కాని కౌగిలికలదయ్యేను' అనే భ్రాంతి కనిపిస్తుంది. యిదే తపస్సు కొనసాగించిన తననే, కపటవటుడు పరీక్షించాడు. ఆమెపై కరుణించాడు, కుమార సంభవం 'పంచమ సర్గ' ఆరంభాన ఆమె తపస్సుకై చేసిన కఠోర నియమాలు, పద్ధతులు ఆమె పట్ల మనకెంతో కరుణ కలుగుతుంది.

సత్య హరిశ్చంద్ర, సతీ అనసూయ మొ॥ నాటకాలు కరుణ రసానికి దర్పణాలుగా కనిపిస్తాయి. కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి కలం నుండి జాలువారిన 'పుష్ప విలాపం' కరుణార్ధకంగానే కనిపిస్తుంది.

**'విరులన్నియు జాలిగా నోళ్ళు విప్పి**
**మా ప్రాణముల్తీతువాయని బావురుమన్నవి'**

మాట్లాడలేని, చూడలేని పుష్పములు తమ మానసిక స్థితిని వ్యక్తం చేస్తున్నట్లుగా ఈ విలాపం కొనసాగుతుంది. యిదే రీతిలో, క్రమంలో కుంతీ విలాపం కూడా కనిపిస్తుంది.

**ముగింపు :**

బ్రహ్మానంద సబ్రహ్మచారి ఆయన రసానందము 'నవరసాలు'గా తెలుగు సాహిత్యలోకంలో తెలుస్తుంది. నవరసాల్లో కొన్ని కోమలరసములుగా, కొన్ని ఉద్ధత రసములుగా చెప్పబడుతున్నాయి. యిందులో కరుణ రసము కోమల రసము. కావ్యాల్లో కరుణ రస ప్రాధాన్యమును అంగీకరించవచ్చు. నాటి నుండి నేటి వరకూ కరుణ రస ప్రాధాన్యంగా పలు కావ్యాలు వెలువడ్డాయి.

ప్రాచీన కావ్యముల నుండి నేటి ఆధునిక కాలం వరకు నాటకము, కథ, గేయం, కవిత మొ॥ ప్రక్రియల్లో కరుణరస పూరితమైన కథలు, గాథలు వచ్చాయి. ఆదరించబడ్డాయి అని చెప్పవచ్చు.

**ఆధాంత గ్రంధాలు :**

1. రస సిద్ధాంతం - తెలుగు ఆకాడమి
2. విమర్శన దర్శనము - ఆచార్య వెలమలసిమ్మన్న
3. మహతి - యువభారతి
4. తెలుగులో సాహిత్య విమర్శ - డా॥ పాటిబండ మాధవశర్మ

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# డా॥ రావూరి భరద్వాజ – కరిమింగిన వెలగపండులోని హాస్యం

– డాక్టర్ గుంటుపల్లి గౌరి, ఆంధ్రోపన్యాసకురాలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), గుంటూరు.

డా॥ రావూరి భరద్వాజ 1927 జూలై 5న గుంటూరు జిల్లా, తాడికొండ గ్రామవాస్తవ్యులైన విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన రావూరి కోటయ్య, మల్లికాంబల ముద్దు బిడ్డగా జన్మించాడు. "పాకుడురాళ్ళు" నవలకి మరియు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికిగాను 2012వ సంవత్సరంలో 48వ భారతీయ జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు.

వీరి రచనలలో హాస్యం ఆకుచాటు పిందెగా ఉం టుందనడానికి 'కరిమింగిన వెలగపండు' అక్షర సాక్ష్యం. వీరి రచనల్లో విలక్షణంగా కనిపించే హస్య నవల అయిన 'కరిమింగిన వెలగపండు' మరియు సినీ మాయా ప్రపం చంలోని నీతిలేని, మంచిలేని, సిగ్గులేనితనాన్ని ఎండగట్టిన 'పాకుడురాళ్ళు' నవలలను గురించి సూక్ష్మంగా ఈ వ్యాసంలో తెలియజేయడం జరిగింది.

## కరిమింగిన వెలగపండు :

'కరిమింగిన వెలగపండు' మొదటి నుంచి చివరి వరకు ఎడతెరిపి లేకుండా నవ్వు తెప్పించే హాస్య నవల. ఈ నవల శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు తొందరపెట్టడం వల్ల వెలువడిందని చెప్పుకున్నారు. కారణం ఏదైనా కాని వ్వండి, ఆనాడు ఈనాడు సాంఘిక జీవనం అసంతృప్తితో అల్లకల్లోలంగా తయారైంది. స్త్రీ పురుషుల మధ్య అవ గాహన లేకపోవడంవల్ల అపార్థాలు, అపోహలు ఎక్కువై నాయి. మనస్పర్థలు పెరిగి పోయాయి. సుఖశాంతులు కరువైనాయి. వీటిన్నింటికి కారణం ఏమై వుంటుందోనన్న ఆలోచనల్లోంచి 'కరిమింగిన వెలగపండు' నవల పుట్టు కొచ్చిందని భరద్వాజ స్వయంగా చెప్పుకున్నాడు.

కుటుంబంలోని భార్యభర్తల మధ్య ఉండాల్సింది ప్రేమ, అనురాగం, త్యాగం, మోహం వంటివి. భార్యా భర్తలు ఒకర్నొకరు అర్థం చేసుకొని ఒకరిమీద ఒకరు నమ్మకం, గౌరవం కలిగి ఉంటే వారి జీవనం ఆనంద మయమౌతుంది. లేకుంటే లేనిపోని అపోహలవల్ల స్పర్థల వల్ల జీవనం నరకమయమౌతుంది. ఈ సత్యాన్నే రావూరి భరద్వాజ 'కరిమింగిన వెలగపండు' నవల ద్వారా వ్యక్తం చేశారు. నవలలో ప్రధాన పాత్రలు భార్యభర్తలు. వాళ్ళ జీవితంలో తలయెత్తే చిన్న చిన్న సమస్యల చుట్టూ కథ అల్లబడింది. భర్త శంకరం, భార్య సత్యవతి. వీళ్ళ మనస్తత్వం మార్చకుండ శరీరాలు మార్చడం జరిగింది. సెక్స్ మార్పిడి ఫాంటసీ ఎలిమెంట్‌ని జతచేయడమైంది. శివపార్వతులు భూలోక సంచారానికి రావడం, స్త్రీ పురు షుల మధ్య కొరవడిన అవగాహనను గుర్తించడం, ఆలు మగల కోరికమీద ఒకరి రూపం మరొకరికి బదలాయిం చడం జరుగుతుంది. ఆ విషయం కొంత కృతకమని పిస్తుంది. ఆ కల్పనవల్లే నవలలో హాస్యం పండింది.

సత్యవతి, శంకరం మొదట్లో ప్రేమికులు. ఆ తర్వాత భార్యభర్తలు. ఇద్దరూ పెళ్లికాక మునుపూ, పెళ్ళయిన తర్వాత జీవితాన్ని గురించి ఎన్నో మధురమైన కలలు కంటారు. కొంతకాలం హాయిగానే కలసి కాపురం చేస్తారు. భౌతిక ప్రపంచం కలల ప్రపంచం వంటిదికాదూ. కలకూ వాస్తవానికి ఎంతో వ్యత్యాసం ఉంటుంది. జీవితంలోని రంగు, రుచి, వాసనలు, త్వరలోనే మాయమైపోయినట్లు యిద్దరూ భావిస్తారు. ఒక్కోమారు జీవితం నిస్సారంగా, నిరుపయోగంగా దర్శనమిస్తుంది. ఇద్దరి ప్రవర్తనలోనూ మార్పులొస్తాయి. ప్రతి చిన్న విషయానికి శంకరం, సత్యవతిని విసుక్కోవడం జరుగుతుంది. సత్యవతి కూడా శంకరానికి ఏమాత్రం తీసిపోకుండా అంతకూ, ఇంతకూ సాధించడం నేర్చుకుంటుంది. ఒకరు పడుతున్న కష్టాలకు మరొకరు కారణమనుకుంటారు. మగ పుట్టుకలో సుఖం లేదని ఆడపుట్టుకలో ఎంతో సుఖముందని శంకరం భావి స్తాడు. ఆడపుట్టుకలో కష్టం తప్ప సుఖంలేదని సుఖ

మంతా మగపుట్టుకలోనే ఉందని సత్యవతి వాదిస్తుంది. సమస్యల్ని భూతద్దంలోంచి చూసి జడుసుకుంటారు. చిన్న చిన్న పట్టింపులు పెద్దవై, జటిలమై కూచుంటాయి. సూటిపోటి మాటలతో హృదయాలను గాయపరుచు కుంటారు. ఒకరిపట్ల ఒకరికి ఉండాల్సిన ప్రేమానురాగాలు పోయి, వాటి స్థానంలో ఈర్ష్యాసూయలు చోటుచేసు కుంటాయి.

ఒకరోజు ఆరుబయట వెన్నెల్లో శంకరం, సత్యవతి ఎదురెదురుగదా కూర్చొని "దురదృష్టవశాత్తు మగాణ్ణయి పోయాను. నేనే ఆడదాన్నయి పుట్టివుంటే నా భర్తను అద్భు తంగా సుఖపెట్టివుందు" నని శంకరమూ, "నా ఖర్మకాలి నేను ఆడదాన్నయిపోయాను కాని మగాడుగా పుట్టివుంటే భార్యను నెత్తిమీంచి దించకపోనని" సత్యవతీ నిట్టూరు స్తారు. శంకరం సత్యవతిల మాటల్ని ఆ రాత్రి భూలోక సంచారం చేస్తున్న శివపార్వతులు (కల్పన) వింటారు. పార్వతి కోరిక మేరకు శంకరుడు వాళ్లిద్దరి రూపాలు తారు మారు చేస్తాడు. శరీరాకృతులు మారినా మనస్తత్వాలు మారవు. రూపాలు మార్పిడి విషయం పార్వతి స్వయంగా వాళ్ళకు కలలో కనిపించి చెబుతుంది. మరుసటి రోజు తెల్లవారగానే నిద్రలేచిన శంకరం సత్యవతి తమలో హఠాత్తుగా కలిగిన మార్పును గమనించి సంతోషిస్తారు. ఆ రూపాల్లో తాము సుఖపడతామనుకుంటారు. అసలు కథ అక్కడే మలుపు తిరుగుతుంది. ఆ తరువాత అంతా తారుమారు వ్యవహారం. శరీరాలు మారినా మనస్తత్వాలు మారవు కాబట్టి పాత అలవాట్లు మారక సత్యవతిగా మారినా మునపటిలాగే శంకరం సిగరెట్లు కాల్చడం, తన ఒంటిమీద ఉన్నది చీర అన్న ధ్యాసకూడా లేకుండా నలుగురి ముందు చీరను లుంగీలాగ ఎగమడచి కట్టడం, శంకరం రూపంలో ఉన్న సత్యవతి పాత అలవాట్లు వదిలి పెట్టుకోకుండా నిద్రలేస్తూనే ఇల్లు వూడ్చడం, అంట్లు తోమడం -ఇవన్నీ గమనించిన పనిమనిషికి అసలు శంక రమే ఆడంగిగా ఇంటి పనులన్నీ చేస్తున్నాడని ఆశ్చర్య పోవడమూ, శంకరంగా మారిన సత్యవతి ఆడంగిగానే మాట్లాడమూ, శంకరం సత్యవతిగా మారినా మగమహా రాయుడి ఫోజులే పెట్టడం మహా విడ్డూరంగా కనిపిస్తాయి.

ఆ తర్వాత శంకరం రూపంలో సత్యవతి ఆఫీసుకు వెళ్ళి, మగపుట్టుకలో ఎంత తలనొప్పి ఉందో తెలుసు కుంటుంది. సత్యవతి రూపంలో శంకరం ఇంటి చాకిరీ చేసి ఆడపుట్టుకలో ఎంత విసుగు, చిరాకు ఉందో గ్రహి స్తాడు. ఇద్దరూ ఒకర్కొకరూ సానుభూతితో అర్థం చేసుకొని ఎవరి బాధలు వాళ్ళకున్నాయనే అభిప్రాయానికొస్తారు. చివరిగా ఇద్దరూ పశ్చాత్తాపపడి మళ్ళా తమకు ముందు రూపాలే కావాలని కోరుకుంటారు. మరుసటి రోజు రాత్రి మళ్ళా వాళ్ళకు శివపార్వతులు వాళ్ళ అసలు రూపాలు ప్రసాదిస్తారు. అక్కడనుంచీ శంకరం, సత్యవతిల జీవితం హాయిగా సాగుతుంది.

భరద్వాజ ప్రవృత్తిరీత్యా హాస్య రచయిత కాకపోయినా, హాస్యసరచనా సమర్థులని చెప్పడానికి 'కరిమింగిన వెలగ పండు' నవల ప్రత్యక్ష నిదర్శనం.

ఈ నవలలో కొంత కథ జరిగాక ప్రధాన పాత్రయిన సత్యవతి, శంకరం రూపాలు మారతాయి. సత్యవతి శంకరంగా, శంకరం సత్యవతిగా దర్శనమిస్తారు. రూపాలు మారినపుడు వాళ్ళ చేష్టలు ఏ విధంగా ఉన్నాయో చెపు తాడు రచయిత - "సత్యవతి బద్ధకంగా లేచింది అంత కన్నా బద్ధకంగా వొళ్ళు విరుచుకుంది. గోళ్ళతో జుట్టు సరిచేసుకోవడం ఆవిడ అలవాటు. అదేవిధంగా చేతులు రెండూ వెనక్కు చాపి మెటికలు విరుచుకొని, ఆవలించి జుట్టు సరిచేసుకోబోయింది. పట్టుదారాల్లా ఉండవలసిన వెంట్రుకలు బిరుసెక్కి ఉక్కు తీగల్లా వేళ్ళకు తగిలాయి. సత్యవతి క్షణకాలం దిమ్మరపోయింది. చేతులతో తల తడుముకొంది. పొడవైన జడకు బదులు పొట్టి క్రాపు మాత్రమే తగిలింది. అప్రయత్నంగా గుండెలకేసి చూసు కుంది. నల్లని వెండ్రుకలు చిత్తవత్తుగా వున్నాయి. మామూ లుగా తన తొడుక్కున్న తెల్ల జాకెట్టుకు బదులు శాండో బనీనున్నది. రాత్రి తను కట్టుకున్న వాయిల్ చీరకు బదులు గళ్ళలుంగీ వొంటిమీదున్నది." ఈ వర్ణనలో సత్యవతి చేష్టలు, సత్యవతి అలవాట్లు కలిసిపోయాయి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

ఇక శంకరం వర్ణన ఎలా సాగిందంటే - "అతగాడు వెరైటీగా నిద్రపోతున్నాడు. తుమ్మెద రెక్కల్లా ఉండే మీసాలుగాని, బరుకు గడ్డంగాని లేవు. ముమ్మూర్తులా తనలాగ తెల్ల జాకెట్టు వేసుకొని, వాయిల్ చీర కట్టుకుని జడను మెడమీదుగా గడ్డం కిందికి జార్చుకొని, గొంతుదాక దుప్పటి కప్పుకొని పడుకున్నాడు." అని వర్ణిస్తాడు రచయిత. మగవాళ్ళను ఆడవాళ్ళ దుస్తుల్లో, ఆడవాళ్ళను మగవాళ్ళ దుస్తుల్లో చూస్తే కొంత ఆశ్చర్యం కొంత నవ్వు కలుగకపోదు. వేషం వర్ణించి నవ్వు తెప్పించడమనేది సులువైన పనేమి కాదు. ఈ నవలలో చేష్టల వల్ల ఉత్పన్నమయ్యే హాస్యం - ప్రధాన పాత్రల రూపాలు మారాక వాళ్ళ మనస్తత్వాలు మారకపోవడం వల్ల ఎదురయ్యే సమస్యల వల్ల నవ్వు తెప్పించాడు. దానికి తోడు వాళ్ళ మతిమరుపు చేష్టల వల్ల హాస్యాన్ని పరాకాష్టకు తీసుకుపోయాడు. వాళ్ళ రూపాలు మారక అంతా తారుమారు వ్యవహారం, తలక్రిందుల వ్యవహారం, శంకరంగా మారిన సత్యవతి "ఓ నిమిషం పాటు శంకరం ఎలా లుంగీని కుట్టుకునేది మననం చేసుకుంది. రెండు చెంగులూ పట్టుకొని చేతులు పొడవునా బారజాపి, పిరుదుల మీదుగా క్రిందికి అంచున రానిచ్చి, ముందుభాగాన మెలిక చుట్టింది సత్యవతి, లుంగీ మడతయితే పడింది గాని, మోకాళ్ళ నుండీ కింది భాగమంతా కనబడుతూనే ఉంది. ఇలా మొండి కాళ్ళతో తలుపు తీయడమెలా? ఎవరన్నా చూస్తే యేమనుకుంటారు? ఫలనా ఆవిడ లుంగీలు కట్టుకుంటోందని తెలిస్తే, ఇంట్లో సిగరెట్లు కాలుస్తుందని కూడా అనుకుంటారు గదా" అని శంకరంగా మారిన సత్యవతి ఆలోచించడం నవ్వు దాగుంది. శంకరంగా మారిన సత్యవతి - సత్యవతిలా ఆలోచించడంలో నవ్వు దాగుంది. వాళ్ళ ఆలోచనలు నవ్వు పుట్టిస్తాయి. సత్యవతిగా మారిన శంకరం చేష్టలు ఎలా ఉంటాయంటే "నిద్రలేస్తూనే స్టూలుమీదికి చెయ్యి చాపాడు. సిగరెట్టు అగ్గిపెట్టె చేతికందాయి. పూర్తిగా కళ్లు తెరవకుండానే వాటిని అందుకున్నాడు. సిగరెట్టు పెదవుల మధ్య బిగించి అగ్గిపుల్ల గీశాడు. ఆ ఉదుటుకు గాజులు గల్లుమని చప్పుడు చేశాయి. అప్పటికిగాని అతను పూర్తిగా మేలుకోలేదు. పక్కమీదనే బాసీంపట్టు వేసి కూచుని, దిండ్లన్నీ కాళ్ళమీద పేర్చుకొని వాటిమీద చేతులానించి, ఆ చేతుల చివర గడ్డం మోపెట్టి సిగరెట్టు కాలుస్తున్నాడు... అనవసరంగా ఓసారి ఆవలించి చేతులు రెండూ పైకి చాపి వేళ్ళు కలిపి, మెటికలు విరుచుకున్నాడు శంకరం. ఈసారి మళ్ళీ చెవుల పక్కనే గాజుల చప్పుడు వినిపించింది. మంచం మీద నుండి లేచాడు. లుంగీని మోకాళ్ళ పైకి ముడుచుకుందుగ్గాను కుడికాలు వెనగ్గావేసి, లుంగీ అంచుకోసం చెయ్యిచాపాడు. లుంగీకి బదులు నీలిరంగి అంచున్న తెల్లచీర కనిపించింది. కొరడాతో బాదినట్లు ఉలిక్కిపడ్డాడు శంకరం. ఓసారి తనను తాను చూసుకున్నాడు. చేతులకు గాజులున్నాయి. ఎడమచేతి చిటికెన వేలుకు నీలం రాయి ఉంగరం ఉంది. మెళ్ళో సన్నని గోవర్ధన గొలుసు, రెండు పేటల రాళ్ళ నక్లెసూ ఉన్నాయి. అందమైన ఉంగరాల క్రాపు బదులు పిరుదుల దాకా వేళ్ళాడే జడ కనిపించింది. అప్రయత్నంగా అతని చేతులు గుండెల మీదికెళ్ళాయి. సత్యవతి ఎదుర్రొమ్ము జ్ఞాపకం వచ్చింది."

హఠాత్తుగా సంభవించిన మార్పును చూసి శంకరం దిమ్మరపోయాడు. సరదాగా వెన్నెల్లో కూర్చొని అనుకున్న మాటలు నిజమౌతాయని శంకరం భావించలేదు. పైగా తనకు సత్యవతి శరీర సౌష్టవం వచ్చిందే గాని మగ మనస్తత్వం పోలేదు. అందువల్లే సత్యవతిగా మారిన శంకరం, మునపటి మగ మహారాయుడి లాగే సిగరెట్టు కాల్చడం, లుంగీ ఎగ్గట్టడం, పోజులు పెట్టడం చూస్తే ఎవరైనా నవ్వుకుంటారు. ఆడవాళ్ళు ఆడవాళ్లుగా, మగవాళ్లు, మగవాళ్లుగా ప్రవర్తించినా, ఆలోచించినా, మాట్లాడినా నవ్వుకోం. ఆడవాళ్లు మగ వాళ్లుగా, మగవాళ్లు ఆడ వాళ్లుగా దర్శనమిచ్చినా, మాట్లాడినా తప్పక నవ్వుకుంటాం.

ఈ రకమైన తారుమారు వ్యవహారం వల్లే భరద్వాజ హాస్యం పండించాలనుకున్నాడు. 'కరిమింగిన వెలగ పండు' 1962లో మొట్టమొదటిగా 'కృష్ణా' పత్రికలో సీరియల్‌గా వెలువడింది. 1967లో ఆదర్శ గ్రంథమండలి (విజయవాడ) వారు నవలగా ముద్రించి వెలువరించారు. (ఒకటి రెండు ముద్రణలు ఆదర్శ గ్రంథమండలి వారే వేశారు). మళ్ళీ 1977లో 'విజేత' మాసపత్రికలో ఒకసారి నవలిక రూపంలో వెలువడింది. 'కరిమింగిన వెలగపండు' తమిళ కన్నడాల్లోకి అనువాదమైంది. తమిళంలోకి అనువాదం చేసింది శ్రీ శ్యాంప్రసాద్, శ్రీ. పి. చిరంజీవి, శ్రీమతి గౌరిగారు. తమిళప్రతి 1984 మే, జూన్ 'మంజరి' సంచికల్లో ప్రచురించబడింది. తెలుగు సాహితీ ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారంచుట్టి, ఆడంబరాలు లేని సాధారణ జీవితం జీవించి, కలాన్ని కంఠాన్ని నమ్ముకొని బ్రతికానని చెప్పి, "జయించే వాడికి ప్రపంచం చాలా చిన్నదే" అన్న 'అలగ్జాండర్' మాటల్ని తన జీవితంలో నెరవేర్చి, తన కంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకొని, తెలుగు సాహితీ ప్రపంచంలో ఉద్దండుడై, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతలైన విశ్వనాథ సత్యన్నారాయణ, డా॥ సి. నారాయణరెడ్డి గార్ల సరసన నిలిచిన రావూరి భరద్వాజ 2013 అక్టోబరు 18న తిరిగిరాని లోకాలకు పయనించారు.

❖ ❖ ❖

# పి.వి. సునీల్ కథలు – హాస్యపు జాడలు

– డా. జె. సీతాపతి రావు, సహాయాచార్యులు,
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఏ.పి.ఐ.ఐ.ఐ.టి., నూజివీడు, కృష్ణా జిల్లా.

## హాస్యం ఉపకరణాలు :

హాస్యం ఒక భావానుభవం. ఇది మూడ్ కి సంబంధించిన విషయం. పొరపాటు లేదా అజ్ఞానం, దుస్థితి లేదా వికారాది చేష్టల వల్ల హాస్యం పుడుతుంది.

హాస్యం గురించి ప్లేటో(సోక్రటీస్ చెప్పినట్లుగా) ఒకరి పట్ల వ్యంగ్యంగా ప్రవర్తించినపుడు రెండవ వారు దానిని తిప్పికొట్టలేని పరిస్థితి ఉంటుంది. దానిని అర్థం చేసుకోలేకపోవడమే వ్యంగ్యం అని అన్నాడు. అరిస్టాటిల్ జుగుప్స కలిగించని అందవిహీనత హాస్యానికి ప్రాథమిక ఉపకరణం అని అన్నాడు.

## హాస్యం విశ్లేషణ :

హాస్యానికి అసంబద్ధత (Incongruity Theory) కారణమని కాంట్ అభిప్రాయం. ఒక నిశ్చితమైన ఫలితం లేని పరిస్థితి హాస్యం అవుతుంది. దీనినే హెన్రీ బెర్గ్సన్ మరింత విపులీకరించాడు. ఈ సిద్ధాంతాలపై అనేక పొడిగింపులు, వివరణలు ఉన్నాయి. మోరియల్ అనే విశ్లేషకుడు "ఏకకాలపు కలగాపులగం" (simultaneous juxtapositions) అనే అంశానికి ప్రాధాన్యత ఇచ్చాడు. లాట్టా (Latta) అనే శాస్త్రజ్ఞుడు మాత్రం ఒక పరిస్థితిలో ఒక పజిల్‌కు సమాధానం లభించినపుడు కలిగే దృక్పథపు మార్పు హాస్యానికి ప్రధానమైన అంశం అన్నాడు. ఇంకా ఇలాంటి అనేక సిద్ధాంతాలు ఉన్నాయి. కొందరు మాత్రం అసలు హాస్యాన్ని ఇలా విశ్లేషించడం తగదన్నారు.

## హాస్యం రకాలు శాస్త్రీయత :

నవ్వు లేదా మందహాసం (Smile) ఒక విధమైన ముఖ కవళిక. నవ్వులో ముఖంలోని వివిధ కండరాలు, ముఖ్యంగా నోటికి రెండువైపులా ఉండేవి సంకోచిస్తాయి. మానవులలో నవ్వు సంతోషం, ఆనందానికి బాహ్య సంకేతం. కొందరు నిశ్శబ్దంగా నవ్వుకుంటే, కొంత మంది బయటకు శబ్దం వచ్చేటట్లుగా నవ్వుతారు. సాధారణంగా చలోక్తులు, కితకితలు మరికొన్ని రకాల ప్రేరేపణల వల్ల నవ్వొస్తుంది. నైట్రస్ ఆక్సైడ్ పీల్చడం వల్ల, కొన్ని మాదక ద్రవ్యాలు వాడడం వల్ల బిగ్గరగా నవ్వుతారు. బిగ్గరగా నవ్వినప్పుడు కొన్నిసార్లు కన్నీరు రావచ్చును.

## హాస్య రస దేవత 'నీలవేణి'?

కథలో నవ్వు పుట్టించాలి. అంటే సన్నివేశంలో పాత్ర కుడ్చి దింపి పొట్ట చెక్కలయ్యేలాంటి సంఘటనలని సంక్షిప్త వాక్యాలలో చెప్పడం అవసరం. ఇలాంటివి కొన్ని పి.వి.సునీల్ కుమార్ నీలవేణి కథల సంపుటిలో చూడవచ్చు. నీలవేణి అనడంలోనే అందమైన జుట్టు ఉన్న అమ్మాయి అనిపిస్తుంది. కానీ ఆ కథలోకి వెళ్ళి చూస్తే ఆ నీలవేణి వెనక ఉన్న వ్యథలు మానవ సమాజాన్ని వెక్కిరిస్తాయి. కొన్ని చోట్ల వెటకారం, కుక్క కన్నా హీనంగా చూసే స్వార్థ జీవన విధానం కనిపిస్తుంది. నిజానికి నీలవేణి హాస్య రస దేవత కాదు. కానీ ఆయా సందర్భాలలో ఆ పాత్రలు నడిపించే తీరులో రచయిత ఎన్నుకొన్న విధానంలో హాస్యాన్ని చూడవచ్చు.

## దెయ్యం కథలో భయోత్పాత హాస్యం :

దెయ్యం పేరుతో భయపెట్టడం దెయ్యం కథలో కనిపిస్తుంది. అయితే అలాంటి భయాలు గుండె జబ్బులున్న వారి పట్ల హై బి.పి ఉన్న వారి పట్ల ఇలాంటి భయాన్ని సృష్టించిట్లయితే వారు ప్రమాదానికి గురౌతారు.

'రంగడు రాయల్ స్టాగ్ సవారీ మీద ఉంటే ఒసామా బిన్ లాడెన్ కి అయిన భయపడడు. కానీ ఇది దెయ్యం. ఇంత ధైర్యవంతుడుని కూడా దెయ్యం అమాంతం మంచంతో సహా తీసుకెళ్లి తోటలో పడేసింది. ఆ దెబ్బకి

రంగడు ఆ రాత్రంతా గుడిమెట్ల దగ్గర వెళ్ళి పడుకున్నాడు. ఉదయం లేచేసరి రాయల్ స్టాగ్ దిగేసింది. ఇంటికి వెళ్ళాడు. బాగా ఆకలి వేస్తుంది. అప్పటికే వండిన ఆహారం మూతలు తెరిచి చూశాడు. అంతా ఎర్రటి రక్తం. అది చూసి ఇంత ధైర్యవంతుడు కూడా నేను ఈ దెయ్యంతో పడలేనురా బాబోయ్ అని తన సొంత ఊరికి లగెత్తాడు' (దెయ్యం కథ, 30 31 పుటలు)

ఇక్కడ ఎర్రటి రక్తం అంటే ఇంటిని ఆక్రమించు కోవడానికి ఒక వ్యక్తి చేసిన పన్నాగం. ఇది తెలియని వాడు సర్పరజ్జు భ్రాంతి (తాడును చూసి పాము అను కోవడం) వల్ల భయపడటం కనిపిస్తుంది. నిజమైన విషయం తెలిసిన వారికి నవ్వు పుట్టిస్తుంది.

## దెయ్యాన్నే భయపెట్టించిన హాస్యం :

హాస్యం వల్ల ఆనందమే కాదు అవసరం కూడా తీరాలి అనే కోణంలోంచి కనిపించే సందర్భాన్ని చూద్దాం. తక్కువ జీతం ఉన్న ఒక వ్యక్తికి ఇంటి అద్దె తక్కువగా ఉన్న ఇల్లు దెయ్యం ఉన్న ఇల్లు. దాన్ని భయపెట్టి ఆ ఇంటి లోనే ఒక వ్యక్తి ఉండటం, దానిని పెళ్లి చేసుకోవడం పాఠకుడికి వింతను, హాస్యాన్ని కలిగిస్తుంది.

"అతడి మెడ చుట్టూ రెండు చేతులు బిగుసు కున్నట్టు, ఊపిరి ఆడనట్టు అనిపిస్తుంది యువరాజుకి.

'చంపేస్తాను' అంది.

యువరాజుకి ఒళ్ళు మండింది. ఆ పైన చిరాకు వేసింది.

"అది తెలుస్తూనే ఉంది గానీ చంపే భాగ్యానికి ఈ అల్లారంతా ఎందుకు? అన్నాడు చిరాగ్గా.

మనిషికి దెయ్యాన్ని చూస్తే భయం. కానీ దెయ్యానికి దేన్ని చూస్తే భయపడాలో తెలియలేదు. కానీ సరిగ్గా ఇప్పుడు జరిగిందదే.

"ఏంట్రా?" అతి కష్టం మీద అంది.

"చంపదలచుకుంటే నేను పడుకున్నాక నిద్రలో చంపొచ్చు కదా. ఈ లైటులు పాడుచెయ్యడాలు, ఫానులు తిప్పడాలు, తలుపులు బాదడాలు ఎందుకు? పైగా ఎంగిలి కంచం ఎత్తి పడేసినావు. ఆ ఎంగిలి అంతా ఎవడు ఎత్తుతాడు నీ బాబు" అన్నాడు చిరాగ్గా. (దెయ్యం 2, 38 వ పుట)

భయపెట్టడానికి దెయ్యం చేసే పనులన్నీ తిప్పి కొట్టడంలో ఆ వ్యక్తి చేసిన సంభాషణ చివరకు పాఠకుడికి హాస్యాన్ని ఇస్తుంది.

## యాస వల్ల హాస్యాన్ని పుట్టించడం :

కొన్ని కొన్ని సందర్భాలలో మాట తీరు వల్ల హాస్యం వస్తుంది. తెగించిన యువరాజు ధైర్యంగా దెయ్యంతో మాటలాడుతూ తెలంగాణ యాసను వాడటం ద్వారా నవ్వు వస్తుంది.

"నీకు నిజంగా మైండు పోయింది. నువ్వు ఆల్రెడీ చచ్చినంకనే దెయ్యిమయినావు. మళ్ళా చచ్చుడేంది. ఎట్ల చస్తావు. సరే చస్తే చావు నాకేం బోయింది" అన్నాడు యువరాజు.

"చంపుతారా నిన్ను"

"అరె చంపితే జరా చంపరాదు. ఈ మాట, ముచ్చ టెంది... ఫుర్సత్ గా చంపేదుంటే రేపు రా.. చంపెడుది లేకుంటే నేను పండుతా.

"నీ మాట నాకు సగం అర్థమౌతుంది. సగం అర్థం కావడం లేదు".

నువ్వు దెయ్యానివి... నీకు అన్ని యాసలు, భాషలు తెలియాలే. మేమంటే మనుషులం కాబట్టి పోలేమ్ నువ్వు గాలివి. రేపు ఏ జపానో జర్మనీనో పోయినవనుకో అక్కడ భాష తెలియలేదనుకో ఏం జేస్తావ్. బిచ్చమెట్టుకుంటావా. (దెయ్యం 2, 39 వ పుట) ఇలా యాసతో హాస్యం పుట్టించడం ఈ కథకి ఆయువు పట్టు.

## వ్యంగ్యంతో కూడిన హాస్యం :

పెళ్ళి అయిన తరవాత కొన్నాళ్లకు అందమైన భార్య కూడా భర్తకు దెయ్యంలా కనిపిస్తుంది. అలాంటి అంశా

లను తీసుకొని దెయ్యమే మాట్లాడటం వెటకారపు హాస్యాన్ని పుట్టిస్తుంది.

"నాకు కూడా ఓ మనిషిని పెళ్లి చేసుకొని పెంచే స్థోమత లేదు. కానీ నీలాంటి మంచి అమ్మాయి... అసలెందుకు నువ్వు బ్రతికుంటే నిన్నే చేసుకుందును" అన్నాడు యువరాజు.

" పోనీ ఇప్పుడైనా చేసుకో. పెళ్లయ్యాక ఎలానూ పెళ్ళాం దెయ్యంలా కనబడుతుందిగా. నీకయితే ఆ బాధ ఉం డదు. ఎలాగూ దెయ్యాన్ని చేసుకుంటున్నావు కాబట్టి" అందామే నవ్వుతూ. (దెయ్యం 2, 42 వ పుట)

నేటి కాలంలో టి.వి షోలలో కూడా స్త్రీ హాస్య వస్తువుగా మారింది. స్త్రీలపై వ్యంగ్యంగా పదజాలం వాడటమే హాస్య మార్గం గా చాలా మంది రచయితల మార్గం.

**ముఖ కవళికలతో హాస్యం :**

గోదావరి సినిమాలో ఉన్న యానిమేషన్‌తో చేసిన కుక్క ద్వారా హాస్యాన్ని కల్పిస్తాడు. అలాంటి ప్రయత్నమే కుక్క చూపులు ద్వారా హాస్యాన్ని స ృష్టించినట్లు వర్ణిస్తాడు. ఎంతటి వాడైన బ్రతుకు చెడిపోతే కుక్క బతుకు అని అంటారు. దొంగల్ని పట్టుకున్న కుక్కకు అలాంటి గతి పడితే దానిని ఏమనాలి? దాని యజమానిని ఏమనాలి?. ఈ నేపథ్యం ద్వారా హాస్యాన్ని పుట్టించడం కనిపిస్తుంది.

టాం అండ్ జెర్రీ కథలలో మాటలు ఏమీ లేకుండా కొన్ని పనులు ధ్వనులు ద్వారా హాస్యంతో పిల్లలని పెద్దలని కట్టిపడేస్తాడు.

"ఇప్పుడే గుంట గ్రౌండ్ దగ్గర రూలింగోళ్ళు ఇరవై లక్షలు ఇన్నోవాలో పెట్టుకు దొరికేరు.... దొరవారికి చెప్పాలి. ఇప్పుడేం చెయ్యమంటావు? అన్నాడు గబ్బర్ వదిలెయ్ అన్నట్టుగా చూసింది డిసిప్లి. " నీకేం కుక్క సలహాలు ఎన్నిన్నా ఇస్తావు. రేపీ ఉద్యోగం ఏమన్నా అటు ఇటు అయితే నా బతుకు కుక్క బతుకే" అన్నాడు గబ్బర్. 'ఇప్పుడు నీ బతుకు నాకన్నా దర్జాగా వెలిగిపోతోందా ? నీ బతుకొకటి.... నా బతుకొకటా? రెండూ ఒకటి కాదా? దొంగ నాయాలా..' అన్నట్టు చూసింది డిసిప్లి" (తోక దెయ్యం చెప్పిన డిసిప్లి కథ, 92 వ పుట)

ఆ కుక్క అలా చూసింది అనగానే మనం ఊహాల్లోకి వెళ్లిపోతామ్. కుక్క ఎలా ఆ ఎక్స్‌ప్రెషన్ పెట్టిందో ఆలో చిస్తూ నవ్వుతామ్. ఇతని కథల్లో నిశితపరిశీలన తో కూడిన తత్త్వం ఉన్న అంశాలో తెలుస్తాయి. ఆయా సందర్భాలు కథనంలో వన్నె తెస్తాయి. వాస్తవికతను చూపుతాయి. నవ్వు గురించి ఒక్క మాటలో చెప్పాలంటే నవ్వు నవ్వించు కానీ నవ్వుల పాలు కాకు.

**ఆధార గ్రంథాలు :**

1. 'నీలవేణి' (కథల సంపుటి) - పి. వి. సునీల్ కుమార్
2. 'థూ' (కథల సంపుటి) - పి. వి. సునీల్ కుమార్
3. సమాజ సాహిత్యాలు - డా. సి. ఆనందారామం

❖❖❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# అలపర్తివారి కథా సాహిత్యం - రసపోషణ

- **డా॥ జంపాల అనూరాధ,** సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గార్ల, మహబూబాబాద్ జిల్లా, తెలంగాణ.

## ప్రవేశిక :

సాహిత్యానికి పుష్టినిచ్చేది అలంకారిక ప్రయోగమైతే సాహిత్య ప్రయోజనాన్ని సిద్ధింపజేసేది దానిలోని రసపోషణ అనే విషయం లోకవిదితం. రసాత్మకమైన వాక్యమైనా కావ్యమేనని విశ్వనాధుని నిర్వచనము. ప్రాచీన కాలపు వేదవాఙ్మయంలో మొదట రసము 'ద్రవ' మనే అర్థాన్ని పిదప 'రుచి' అనే అర్థాన్ని కలిగి వుంది. ఉపనిషత్తుల కాలానికి 'సారము' అనే అర్థంలో స్థిర పడింది.

సాహిత్యంలో అలంకారికులు 'రస' శబ్దాన్ని విశ్లేషించి - విభావములు, అనుభావములు, సాత్విక భావములు, వ్యభిచారీ భావముల చేత ప్రేరేపించబడిన స్థాయీభావమే రసము అన్నారు. రసానందము బ్రహ్మానందమే. ఈ స్థాయీభావము స్థిరము. ఈ స్థాయీభావము పఠిత హృదయంలో బీజప్రాయమున ఉండి, రచనానుగతమైన నాయకాదులనే విభావముల వలన రత్యాదిస్థాయీ భావాలకు హేతువు అవుతుందని సాహిత్యదర్పణం వంటి అలంకారిక గ్రంథాలు విశ్లేషించాయి.

సాహిత్యపరంగా రసాలను తొమ్మిదిగా పేర్కొన్న లాక్షణికులు వాటి స్థాయీభావాల్ని ఇలా ప్రకటించారు.

1) శృంగార రసానికి స్థాయీభావం - రతి
2) హాస్యరస స్థాయీ భావం - హాసం
3) కరుణ రసానికి స్థాయీభావం - శోకం
4) రౌద్రరస స్థాయీ భావం - క్రోధం
5) అద్భుత రసానికి - విస్మయం
6) భయానక స్థాయీ భావం - భయం
7) వీర రసానికి - ఉత్సాహం
8) భీభత్సరస స్థాయీభావం - జుగుప్స
9) శాంతరసపు స్థాయీభావం - శమం. లోకంలోని రసాలలో కరుణ మాత్రమే ప్రధానమనీ మిగిలిన వన్నీ దాని అనుభావాలనే వాదం ఒకటి వుంది. ఏదిఏమైనా సాహిత్య సృజనలో కవులు రచయితలు, తమ రచనల్లో రసపోషణ సరిగా చేయనిదే దాని లక్ష్యం నెరవేరదు అనేది నిర్వివాదాంశం.

## పరిశీలనా ఆవశ్యకత :

**"లోకోత్తర చమత్కార ప్రాణైః కైశ్చిత్ప్రమాతృభిః
స్వాకారవదభిన్న త్వేనాయ మాస్వాద్యతేరసః"**

అని జగన్నాధ పండితరాయులు, తన రసగంగాధరంలో పేర్కొన్నాడు. అంటే రసానందం పొందటం అనేది ఆత్మసాక్షాత్కారంలాంటిది. దాన్ని లోకోత్తరులైన కొందరు మాత్రమే పొందుతారు అని.

కానీ సాహిత్యపరంగా తన రచనలోని విషయానందాల్ని లేదా జ్ఞానాన్ని పఠితకు రసానందరూపంలో అందించేందుకే కవి/రచయిత ప్రయత్నిస్తాడు. వస్తు సేకరణ, ప్రక్రియా, అలంకారికత, రస ప్రయోగాల ద్వారా పాఠకుడిని రసానందంలో బంధిస్తాడు.

ఆధునిక కాలంలో అత్యంత ప్రముఖమైన, ప్రభావవంతమైన ప్రక్రియ కథ. వచన రూపం గల కథ/కథానిక తెలుగుసాహిత్యంలో ప్రవేశించి 108 సంవత్సరాలైంది. విస్తృతంగా వ్యాప్తిచెందిన కథాసాహిత్యంలో ఎన్నో ప్రయోగాలు చేసి రసానందాన్ని అందించిన రచయితలున్నారు. కథాసాహిత్యంపై విస్తృత పరిశోధనలు జరిగాయి. కానీ రస విషయకంగా ఆధునిక కథను పరిశీలించటం అనేది నా దృష్టిలో లేదు. ఈ విషయకంగా ఈ పరిశీలన అత్యంత ఆవశ్యకత గల అంశమని భావించవచ్చు.

## ప్రత్యేకత :

ప్రస్తుతకాలంలో విస్తృతంగా వెలువడుతున్న వచన

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

సాహిత్య ప్రక్రియలలో రస నిర్దేశాన్ని, దాని ఆవశ్యకతనీ పరిశీలించటం వల్ల ఒక నిర్ధిష్ట అవగాహన ఏర్పడుతుంది. మనోగతమైన భావాల్ని సామాజిక పరం చేస్తున్నప్పుడు, పాఠకుని హృదయాన్ని పట్టుకునేలా రచనకు పరిపుష్టి కలిగించటం అనేది ముఖ్యం. ఈ దిశలో ఈ పరిశోధన ప్రత్యేకంగా రసాస్వాదన దృష్టితో, కథానికపై సాగటం వల్ల ప్రత్యేకమైంది. ఔత్సాహిక రచయితల కోసం ఈ విశ్లేషణ అనివార్యం కూడా.

## అలపర్తి వారి కథారచన ప్రత్యేకత :

అలపర్తి వెంకట సుబ్బారావు గారు 1950వ దశకం నుండే విస్తృతంగా రచనలు చేస్తున్న లబ్ధ ప్రతిష్ఠులు. ప్రముఖంగా వారు బాలల గేయరచయితగా పేరెన్నిక గన్నారు. 'బాలబంధు' బిరుదాంకితులు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వయోవృద్ధులే అయినా సదాబాలుడని కీర్తిపొందిన జ్ఞాన వృద్ధులు. బాలల గేయాలేగాక రూపకాలు, నాటకాలు, కథారచనలో కూడా చేయితిరిగిన రచయిత. వివిధమైన ప్రత్యేక వస్తువుల్ని కథలుగా మలిచిన నేర్పరి ప్రక్రియాపరంగా వైవిధ్యంగా కథని నడుపుతూ కథా లక్ష్యాన్ని సాధించగలవారు.

## పరిశీలనా పరిమితులు :

విస్తృత పరిశోధనా పరిధిగల ఈ అంశాన్ని స్థల/కాల పరిమితులకు లోబడి 1960లలో రచించిన ఒక పది కథల్ని మాత్రమే రసపోషణ విషయకంగా స్వీకరించాను. స్థాయీభావాల్ని, అంగ-అంగిరసాల పరిశీలన, రసపోషణ ద్వారా కవి తన కథాలక్ష్యాన్ని ఎలా సాధించారు అనే విషయాల్ని చర్చించాను.

## అలపర్తి వారికథ - రసపోషణ - విశ్లేషణ :

కవిగా రచయితగా అలపర్తివారు ఉన్నత శ్రేణికి చెందినవారు. సంపూర్ణమైన జీవితానుభవాల్ని సౌకుమార్యంగా ఆవిష్కరించే నేర్పువారి సొంతం. కవిత అయినా కథ అయినా, నాటిక అయినా తనదైన ముద్రతో ఆలోచనాత్మకంగా సాగించటం వారి ప్రత్యేకత. క్లుప్తత, స్పష్టత, సరళత వారి రచనా సూత్రం. ఇంతక్లుప్త రచనలోనూ రసానందం కల్గించటం వారి విశిష్టత.

## అలపర్తి కథ - రసవిభజన :

సాత్త్విక ప్రవృత్తిగల అలపర్తివారి కథల్లో కేవలం మనం 3 రసాలనే అంగిరసాలుగా గుర్తించగలం. అవి శృంగారం, కరుణ, హాస్యం. వీటిలో మిగిలిన రసాల్ని అవసరాన్ని బట్టి పోషించినా అవి అంగరసాలే. స్థాయీభావాల విషయంలో కూడా రచయిత రాజీపడరు. కరుణ మొక్కటే రసం అని ఆయన నమ్మినట్లుంది. అందువల్ల అనేక కథల్లో కరుణరసమే చివరికి ఉద్దీపనమైంది. స్థూలంగా చేసిన ఈ పరిశీలనలో నిర్ధిష్టత కోసం ఇలా విభజించాను.

అ) హాస్యరస ప్రధానాలు
ఆ) శృంగారరస ప్రధానాలు
ఇ) కరుణ రసప్రధానాలు

**(అ) హాస్యరస ప్రధానాలు :**

అలపర్తివారి రచనల్లో అంతర్లీనంగా హాస్యం, వ్యంగ్యం తొణికిసలాడుతుంటాయి. అధిక కథలు హాస్యరస ప్రధానాలే. 'కమీషనర్' కథలో వేలంపాటలో పంచెల వేలం ధర పెంచేందుకు చెంగయ్య స్వయంగా అధికంగా పాడిన 'పంచె అతనికే పాట కొట్టివేయడం ద్వారా కొనుక్కోవాల్సి వచ్చింది. ఆ సంగతి తెలిసి ఊరంతా అతనిని కమీషనర్ అనే పేరుతో పిలుస్తుంది. మనిషిలో కష్టపడకుండా వచ్చే సొమ్ముపై ఎంత ఆశ వుంటుందో హాస్యరస పోషణ ద్వారా తెలిపేకథ ఇది. రచయిత ఇందులో సంభాషణాత్మక శైలి ద్వారా హాస్యం అనే స్థాయీ భావాన్ని సాధించారు.

"రంభాపరీరంభం" కథలో ముదిరిన బ్రహ్మచారి కామేశం, శృంగార సాహిత్యం చదివి, రంభకోసం పరితపించగా, స్నేహితులు అతడ్ని, అరటిచెట్టుకు చీరచుట్టి అభాసుపాలు చేయడం హాస్యరస స్ఫోరకంగా మలిచారు. సంఘటనాత్మక శైలివల్ల స్థాయీభావమైన హాస్యం సాధ్యమైంది. "ద్రౌపదీవస్త్రాపహరణం" కథలో అచ్చమ్మ, ద్రౌపదిగా పేరు మార్చుకుని పెళ్ళి చేసుకోవటం, శీఘ్రకాలంలో భర్తనికోల్పోయి అమ్మ లక్కలతో కాలక్షేపం చేసే

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

స్థాయికి చేరటం, హాస్యరసంతో వివరించారు. భారత కథాపఠనంలో ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టం, ఆమె చదివేరోజునే బిచ్చగాడు ఒకడు దడిపై ఆరవేసిన ఆమె మడిబట్టని అపహరించటం కొసమెరుపైంది. సంఘట నాత్మక స్థాయీభావసాధన జరిగింది.

"అగ్నిలో పడిన బల్లి" కథలో బుచ్చిరామయ్య గారు లౌకికంగా పెద్దమనిషి. పదిమందికి జాగ్రత్త చెబుతూ అతిజాగ్రత్తగా ఉండే ఆయన జేబునే గమ్మత్తుగా కత్తిరించటం కథలో హాస్యస్ఫోరకమైన మలుపు. హాస్యరస సాధనలో ఈ రచయిత సంఘటన, సంభాషణల ద్వారా స్థాయీభావాన్ని సాధించి హాస్యరసపోషణను సమర్థ వంతంగా చేశారు.

**(ఆ) శృంగార ప్రధానాలు :**

శృంగారం ప్రధానపరంగా వ్రాసిన కథ అని ప్రత్యేకంగా అలపర్తివారి రచనల్లో గుర్తించగలవి అని చెప్పదగిన కథ లేదుగానీ శృంగారాన్ని కథల్లో పండించగలనేర్పు అడు గడుగునా వారి కథల్లోని వాక్య నిర్మాణాల్లో కన్పిస్తుంది. 'రంకుల రాట్నంకథ' ఎత్తుగడలో శృంగారపు భావనలతో రసోద్రిక్తం చేసిన ఈ రచయిత, కథాంతంలో కరుణ రసాంతంగా నడుపుతారు. 'రంగులరాట్నాన్ని' పదేళ్ళ పిల్ల చేత 'రంకులరాట్నం' అని పలికించి, ఆపిల్ల తల్లి, జీవితంలో యవ్వనపు తప్పటడుగు వల్ల 'రంకు'లోదిగి ఎలా నాశనమైందీ వివరిస్తూనే తన బిడ్డకోసం ఆమె పడే తపనని వివరించే కథయిది. ప్రథమార్థంలో సంభా షణాత్మక, సంఘటనాత్మక శైలిలో శృంగార స్థాయీ భావమైన రతిని సాధించారు.

'అందం అనురాగం' కథలో ఉత్కృష్టమైన 'ఆత్మరతి'ని భార్యాభర్తల మధ్య అనురాగం ద్వారా సాధించారు. శరీరక అందంపట్ల అపరిమితమైన ఆరాధనగల సరోజ, భర్త ప్రకాశరావుకి మశూచి తగిలి వికారి అయితే నిరా దరిస్తుంది. ఆమెకు మశూచి తగలగా భర్త చేసే సపర్యలకి కనువిప్పు కలుగుతుంది. కానీ ఆమె మరణిస్తుంది. శృంగారపు స్థాయిని అమలిన శృంగారస్థాయికి చేర్చిన కథయిది.

శృంగార రస పోషణలో రచయిత గొప్ప ప్రతిభతో స్థాయీభావాన్ని ఉన్నతరీతిన సాధించారు.

**(ఇ) కరుణరసప్రధానాలు :**

అలపర్తి కథల్లో అంతర్లీనంగా దోబూచులాడే రసం కరుణ. కరుణయే ఏకరసమని నమ్మిన లక్షణం ఈ రచయితలో కనిపిస్తుంది.

'ముళ్ళబాట' కథలో ప్రసాదరావు యువరచయిత. అతని రచనలపై అభిమానంతో సంపన్నురాలైన సరళ అతన్ని ప్రేమించి పెళ్ళాడుతుంది. కొత్తభార్య, ధన వంతుడైన మామగారి డబ్బు ప్రసాదరావుని చదువు నుండి, రచనల్నుండి మరల్చి సోమరిని చేస్తాయి. భార్య వదిలివెళ్తుంది. అప్రయోజకుడిగా మిగుల్తాడు. అంతర్లీ నంగా కరుణరసంగా సాగే ఈకథ, కష్టపడని వారికి జీవితం లేదనే సత్యాన్ని వివరిస్తుంది.

'పండిన బ్రతుకులు' కథ అలపర్తివారి కథల్లో ప్రక్రియాపరంగా గొప్పకథ. జయరామయ్య తల్లో ఒక వెంట్రుక తెల్లబడింది. దాని ముసలిలక్షణాన్ని మిగిలిన వెంట్రుకలు ఈ సడించటంతో మొదలైన కథ, జయ రామయ్య ఆస్తికోసం తల్లిని పోషించటం గురించి తెలుపు తుంది. కొడుకుదుర్మార్గాన్ని విన్న తల్లి శాంతమ్మ, న్యాయం కోసం ఊరిపెద్ద రంగనాథం వద్దకి వెళ్ళి, అతడు ముసలి నౌకరుతో ప్రవర్తించిన తీరు వింటుంది. వృద్ధులపట్ల సమా జపు తీరుని కరుణరసాత్మకంగా వివరించిన ఈ కథ ప్రక్రియాపరంగా కరుణరస స్థాయీభావాన్ని సాధించింది.

కథారచనాపరంగా కరుణరసాన్ని అత్యంత సమర్థంగా అలపర్తి తన రచనల్లో పోషించారు.

## ఫలితాంశం :

కథారచనలో రసపోషణ వల్ల పాఠకుడు రసానందం పొందుతాడు. తద్వారా కథద్వారా చెప్పాలనుకున్న విశేషబోధ పాఠకుడి హృదయానికి నేరుగా చేరుతుంది. రసపోషణకు నిలయమైంది కవిత్వ / పద్యరచన. అలపర్తి వారు పద్య, గేయ రచనల్లో వందలాది రచనల ద్వారా

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

కీర్తి పొందిన వారు కనుక వారి కథల్లో రసపోషణకు అధిక అవకాశం వుంటుంది. కథారచనలో రసపోషణ ద్వారా స్థాయీభావాన్ని సాధించగలగటం అనే నేర్పుని లబ్ధప్రతిష్టులైన రచయితల కథల్ని విశ్లేషించటం ద్వారా యువ రచయితలకు మార్గదర్శనం అవుతుంది. తద్వారా సమాజానికి ఉపయుక్తమైన కథలు, ముందు తరాల్లోకూడా రచింపబడి, చిరస్థాయిగా నిలిచే అవకాశం ఉంది. పరిశోధకులకి రస విషయకంగా ఆధునిక సాహిత్యాన్ని రసదృష్టిలో పరిశీలించే అవకాశం ఈ విశ్లేషణ ద్వారా కలుగుతుంది కూడా.

**ముగింపు :**

సంక్షిప్తంగా పరిమితులకు లోబడి జరిపిన ఈ పరిశోధనలో ఏకరచయిత కథలలో రస పోషణని పరిశీలించటం జరిగింది. రసము, స్థాయీభావాలు పఠితను ప్రభావితం చేసే భావాల్ని రసపోషణ కోసం ఎన్నుకోవటం, లాక్షణికుల అభిప్రాయాలు సంక్షిప్తంగా ప్రవేశికలో చర్చించాము. ఈ పరిశీలనకు వచన ప్రక్రియ అయిన కథనే ఎందుకు ఎన్నుకున్నాము? కథారచయితగా శ్రీఅలపర్తి సుబ్బారావు గారి విశిష్టత ఎలాంటిది? పరిశీలనకు విధించుకున్న పరిమితులు ఎలాంటివి అనే విషయాన్ని ప్రవేశికలోనే చర్చించాం.

రెండొవదైన ప్రధాన విభాగంలో అలపర్తికథల్ని హాస్య, శృంగార, కరుణ రసాత్మకాలు అనే మూడు విభాగాలుగా విభజించి పరిశీలించటం జరిగింది. రస నిర్వహణ విధానం, స్థాయీభావసాధన మొదలైన విషయాల్ని ప్రయోగాత్మకంగా విశ్లేషణాత్మకంగా చర్చించాము. ఫలితాంశ విశ్లేషణలో ఈ వ్యాస ప్రధానోద్దేశ్యం సాధిం చిన రీతిని తెలుపుతూ సామాజిక ఉపయోగాన్ని పరిశీ లించి వివరించాను. ఉపయుక్త కథానికల్ని చివరన పట్టిక రూపాన యివ్వటం జరిగింది.

**ఉపయుక్తం :**

| | | |
|---|---|---|
| కథ | - | పత్రిక |
| రంకులర్నాటం | - | జ్యోతిమాసపత్రిక |
| భుక్తిమార్గం | - | చిత్రగుప్త మాసపత్రిక |
| పండినబ్రతుకులు | - | వినోదిని మాసపత్రిక |
| అందం-అనురాగం | - | చిత్రగుప్త మాసపత్రిక |
| ముళ్ళబాట | - | వినోదిని మాసపత్రిక |
| ద్రౌపదీ వస్త్రాపహరణం | - | మాతృసేవ మాసపత్రిక |
| విలువకోసం | - | వినోదిని మాసపత్రిక |
| కమీషనర్ | - | మాతృసేవ మాసపత్రిక |
| రంభాపరిరంభం | - | చిత్రగుప్త మాసపత్రిక |
| అగ్నిలో పడినబల్లి | - | మాతృసేవ మాసపత్రిక |

❖ ❖ ❖

# నవరసభరితం - పారిజాతాపహరణం

- డా॥ కపిల భారతి, తెలుగు ఉపన్యాసకురాలు, పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హన్మకొండ, తెలంగాణ.

పారిజాతాపహరణ కావ్యం తెలుగు పంచ మహా కావ్యములలో ఒకటి. దీనిని శ్రీకృష్ణ దేవరాయల ఆస్థాన అష్టదిగ్గజ కవులలో ఒకనిగా పేరు పొందిన నంది తిమ్మన రచించెను. నంది తిమ్మనకే ముక్కు తిమ్మన అని నామాంతరము. పారిజాతాపహరణ ఇతివృత్తం సంస్కృత హరివంశములో, కన్నడ హరికథాసారములో మరియు సంస్కృత భాగవత దశమ స్కందములో మూడే మూడు శ్లోకములలో ఉంది. ఆ కథను గ్రహించి తిమ్మన 511 పద్యముల ఐదు ఆశ్వాసముల ప్రబంధంగా శృంగార రసం అంగి రసముగా కరుణ వీరరౌద్రభయానక భీబత్సాద్భుత శాంత భక్తి రసములు అంగరసములై ప్రధాన రసమైన శృంగారమునకు రసపుష్టిని చేకూర్చేవిగా మలచి పారిజాతాపహరణ కావ్యం రచించాడు.

**పారిజాత + అపహరణము** : అపహరణము అంటే దొంగిలించడం అని అర్థం. హరణము అన్న దొంగలించుటయే కాని 'అప' అనే ఉపసర్గను చేర్చి కవి కావ్యానికి 'విశేష' అర్థాన్ని స్ఫురింపజేశాడు. పారిజాత వృక్షం ఇంద్రుని నందనోద్యాన వనంలో ఉన్నప్పటికీ అది నిజంగా శ్రీకృష్ణ పరమాత్మునిదే. సృష్టిలోనివి అన్ని భగవంతునికి చెందుతాయి. కాబట్టి "కృష్ణుని వృక్షం కృష్ణునికే" చేరిందనే విశేషార్థంలో కవి "అపహరణము" అనే పద ప్రయోగం కావించాడు.

## కావ్య కథా సంగ్రహం :

పారిజాతాపహరణ కావ్యం శ్రీకృష్ణుని సంసార విభూతి వివరణతో ప్రారంభమౌతుంది. శ్రీకృష్ణుడు రుక్మిణి గృహంబున ఉన్న సమయంలో నారదుడు వచ్చి కృష్ణునికి పారిజాత పుష్పం ఇవ్వడం దానిని కృష్ణుడు రుక్మిణికి ఇవ్వగా ఆమె దానిని తలలో ధరించడం, అప్పుడు అక్కడ గల సత్యభామ చెలికత్తె ఆ వృత్తాంతమును సత్యభామకు చెప్పడం, సత్యభామ అలిగి కోప గృహప్రవేశం చేయడం, కృష్ణుడు ఆమెను అనునయించి పారిజాత వృక్షమునే తెచ్చెదనని పలకడం, సత్యభామా సమేతుడై ఇంద్రపురికి వెళ్ళడం, పారిజాత వృక్షమును పెకిలింపగా దానిని చూచిన వనపాలకులు ఇంద్రునికి తెలియపర్చడం, ఇంద్రుడు రౌద్రముతో యుద్ధమునకు రావడం, యుద్ధంలో కృష్ణుడు ఇంద్రుని ఓడించడం, పారిజాత వృక్షమును తెచ్చి సత్యభామ పూదోటలో నాటడం, నారదుడు సత్యభామకు పుణ్యక వ్రతమును ఉపదేశించడం, ఆ వ్రతమును చేసిన సత్యభామ కృష్ణుని నారదునికే దానం ఇవ్వడం, నారదుడు కృష్ణునితో ఊడిగం చేయించుకోగా చూచిన సత్యభామ దానిని భరించలేక తన సంపదలన్ని నారదునికి ధారపోసి శ్రీకృష్ణుని తిరిగి పొందడం, నారదుడు శ్రీకృష్ణుని నుతించడంతో ఈ కావ్యం పరిసమాప్తమౌతుంది.

## కావ్యమందలి రసములు :

కావ్య ప్రథమాశ్వాసమున సత్యభామ చెలికత్తె శ్రీకృష్ణుడు రుక్మిణికి పారిజాత పుష్పం ఇచ్చిన సంగతి వివరించగా రౌద్ర రూపిణి అయిన సత్యను కవి

**"అవనిని వ్రేటువడ్డ యురగాంగనయుంబలె నేయి వోయ భ**
**గ్గన దరికొన్న భీషణ హూతాశన కీల యనంగ లేచి హె**
**చ్చిన కనుదోయి కెంపు దన చెక్కుల కుంకుమపత్ర భంగ సం**
**జనిత నవీన కాంతి వెద చల్లగ గద్దద ఖిన్న కంఠయై"**
**అన్ని దెబ్బపడిన ఆడత్రాచు పాముతోటి, నేయ్యి పోసిన లేచు భయంకరాగ్ని జ్వాల వలె లేచి కనులందైన అరుణ కాంతి చెక్కుల**
**వ్యాపించినవి.... అంత కోపంతో ఆమె కోప గృహం ప్రవేశించెననుచూ...**

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

**"అని వగల మిగుల బొగులుచు జనితామర్షమున గోప సదనంబునకున్**
**జనియెను లతాంగి హరి చందన కోటరమునకు నాగతరుణియు బోలెన్".**

అంటూ రౌద్ర రసమును పోషించి వెంటనే

**"వెడ వెడ గన్ను మూయుగను విచ్చు నగుం దలయూచు బాన్పుపై**
**బడునుసురంచు లేచు దడబాటును దత్తఱ ముం జలంబులో**
**నడరంగ గోప వేగమున నగ్గలమైన మనోజు బాధలం బడి మద హస్తి హస్త గత పద్మినియుంబలె సొంపు పెంపఱన్"**

అని సత్యభామ శృంగార రసోద్దీపక చేష్టలను వర్ణిస్తాడు.

**కోప గృహమున ఉన్న సత్యభామను ఓదార్చుటకు కృష్ణుడు రాగా కృష్ణుని ఎదుట సత్యభామ**

**"ఈనున బుట్టి డెందమున హెచ్చిన శోక దవానలంబుచే**
**గాలిసి యేడ్చె బ్రాణ విభుకట్టెదుట లలితాంగి పంకజ**
**శ్రీసఖయైన మోము పయి జేల చెఱంగిడి చాల పల్లవ**
**గ్రాస కషాయ కంఠ కల కంఠ వధూకల కాకలీ ధ్వనిన్"**

అని ఆడ కోకిలల యొక్క అవ్యక్త మధురమైన, సూక్ష్మమైన శబ్దములతో కరుణార్థ్ర పూరింతంగా ఏడ్చెనని వర్ణించాడు. అందుకే ముక్కు తిమ్మన "ముద్దు ముద్దుగా వేడ్చెనని" పెద్దలందురు.

కావ్య తృతీయాశ్వాసము నందు కృష్ణుడు దేవదూత అయిన అదితిని దర్శించినపుడు ఆమె శ్రీ కృష్ణుని (హరి) అవతారములను ఒక్కొక్కటిగా నుతించుటకు ముందు

**"సర్గమొనర్తు బ్రహ్మయన సత్కృప బెంతు జనార్ధనుండు నా**
**భర్గు డనంగ గ్రమ్మఱగ బారణ సేయుదు విజ్జగంబు నై**
**సర్గి కలిల నొక్క మఱి సౌఖ్యము నొందుదు కేవలంబు తోడ**
**రర్గళ భూషణి కృతర థాంగ! నినుంగొని యాడ నేర్తునే"!**

అంటూ కృష్ణుని సృష్టికర్తవై సృజించు వాడవు నీవే; విష్ణువై పాలించువాడవు నీవే, శివరూపివై సంహరించువాడవును నీవే ;

కేవల మాత్మారాముండవై సహజ లీల సుఖించు వాడవు కూడా నీవే ఓ త్రిమూర్తి రూపీ, నిన్గొని యాడ నే జాలనని తన భక్తిని ప్రకటించెను.

కావ్య పంచమాశ్వాసమున ఇంద్రునితో, దిక్పాల కులతో కృష్ణుడు యుద్ధము చేసే తీరును దాదాపు 32 పద్యములలో వీర, భయానక, భీభత్స, అద్భుత రసము లను చవి చూపించినాడు. అందు కృష్ణుడు ఇంద్రుని వజ్రాయుధమును పట్టుకొను సందర్భమున

1) శతధారా జాయమానజ్వలన ముఖ శిఖాచ్ఛా దితా....
2) కవి నెమ్మోమున బిన్న నవ్వు దొలకం గంసారి నిశ్చం కదా......

అను పద్యములలో శ్రీకృష్ణుని పరాక్రమాతిశయమును వీర భయానక, భీభత్సరసములలో ఉద్దీపింపజేసెను.

పంచమాశ్వమునవే పారిజాతమును గరునుని మూపు పై ఉంచి తెచ్చు సందర్భమున అద్భుత రసమును పోషించెను.

**"అ మహి జాతముం గనినయంతటిలో ధనధాన్యరాశితో**
**సామజ ఘోటి కా మహిత శాలలతో మణి సౌధ పంక్తితో**
**గో మహిషీ శతాంగ భట కోటులతో మణిభూషణాలితో**
**దామర తంపరై తనరె దత్పురి గింపచ గేహ వాటికల్"**

అంటూ పారిజాత వృక్ష మహిమను అద్భుతంగా వర్ణించెను. ఈ విధముగా తిమ్మన నవరసములతోనే గాక అనులోమాను విలోమ కందము, ఒక పాద భ్రమకము 5-93, గోమూత్రికా బంధము 5-94, నాగబంధము 5-95, ఛూరికా బంధము 5-96, చక్రబంధము 5-97, ద్వ్యక్షరి కందము 5-98, ద్వికంద క్రౌంచ పదము 5-95, 100, భుజంగ ప్రయాత గర్భ స్రగ్విణి 5-101 మొత్తం

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

ఎనిమిది బంధ చక్ర కవితలతో నారదునిచే కృష్ణుని స్తుతింపజేసి తన బంధ కవిత్వ ప్రౌఢతో పాటు సూర్యోదయాస్తమయ, చంద్రోదయా, నక్షత్ర, చకోర, మేరు, నందనోద్యాన, జలకేళి, యుద్ధాది వర్ణనలు చేసి నవరస భరిత లలిత మృదు మధుర ప్రబంధముగా పేర్కొనదగిన ప్రతిష్టను ఈ కావ్యమునకు ఇనుమడింపజేసెను.

**ఉపయుక్త గ్రంథాలు :**

1) పారిజాతాపహరణము - ముక్కు తిమ్మనాచార్యుడు
2) ఆంధ్ర సంగ్రహ సాహిత్య చరిత్ర - వారణాసి వేంకటేశ్వర్లు
3) తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ జి. నాగయ్య

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# డా॥ మలయశ్రీ నవలల్లో నవరస పోషణ

- శోరండ్ల శంకర్, తెలుగు ఉపన్యాసకులు (అతిథి), ప్రభుత్వ మహిళా డిగ్రీ & పి.జి కళాశాల, కరీంనగర్, తెలంగాణ.

## రచయిత పరిచయం :

సాహితి రంగంలో "బహుముఖ ప్రతిభాశాలి" అని డా॥ సి. నారాయణ రెడ్డి గారి ప్రశంసలు అందుకున్న తెలంగాణ సీనియర్ కవి, తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో వీరివి ఇప్పటికి 131 పుస్తకాలు ముద్రితం. అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులు వీరికి సొంతం.

## రచనలు :

మలయశ్రీ నవలల ప్రచురణ 1977 నుంచి మొదలైంది. ఇప్పటికి వీరివి 12 నవలలు అచ్చయినవి. 5 సీరియల్స్ అముద్రితాలు. పది అవార్డులు/బహుమతులు పొందిన వీరి నవలలు మూడా. ఈ మూడు నవలలోని నవరస పోషణ గురించే నా ఈ ప్రసంగ వ్యాసం. ఆ నవలల వివరాలు ఇవి-

1) తిరుగుబాటు - 'విశాలాంధ్ర' విజయవాడవారి రాష్ట్రస్థాయి నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందింది - 1982. ఇదే నవలను 1999 లో ఎం.ఎం. అకాడమీ కలకత్తా వారి అవార్డు లభించింది.
2) సహచరి - 'రచ్చబండ' వార పత్రిక 'జమ్మికుంట' రాష్ట్రస్థాయి పోటీలో ఈ నవల ద్వితీయ బహుమతి గెలుచుకుంది - 1983.
3) నిర్ణయం - ఇది 2010 సం॥ ప్రచురణ రాష్ట్ర స్థాయిలో మూడు ప్రథమ బహుమతులు ఈ నవలను వరించినై.

మలయశ్రీ గారి నవలల్లో రసపోషణ పరామర్శ వీరివన్నీ సాంఘీక నవలలు. పౌరాణిక,, చారిత్రక, జానపద గాథల ఇతివృత్తాలవి లేవు. అందుకే నవరసాల్లోని - రౌద్ర, బీభత్స, అద్భుత, భయానక రసాల సన్నివేశాలు మలయశ్రీ నవలల్లో కనిపించవు.

శృంగారం, హాస్యం, కరుణ, వీరం, శాంతం, - ఈ అయిదు రసాల పోషణ ప్రధానంగా వీరి నవలల్లో ఉంది. వీరు అవార్డులు పొందిన నవలలను చూస్తే -

1. తిరుగుబాటు - ఇది ప్రధానంగా దళితుల సమస్యలను చర్చించింది. వారి జీవితాల వర్ణించింది. మార్పును ఆశించి సూచనలు అందించింది. ఒక గ్రామ భూస్వామి కూతురు దళిత యువకున్ని ప్రేమించటంతో కథారంభం. రాగల పరిణామలు ఆలోచించి, వివరించి, కథానాయకుడు ఆమెతో పెళ్ళికి అంగీకరించక పోవుట విశేషం. ఆ యువతికి వేరే పెద్దింటి దొరబాబుతో పెళ్ళయి ఆమె జీవితం ఛిద్రమగుట పరిణామం. ఆడవి అన్నల సన్నివేశాలు, కులాల సంబంధాలు - సమస్యలు ఇందులోని అదనపు అంశాలు.

   ఈ నవలలో శృంగార సరపోషణ ఉన్నా కథంతా ధర్మపోరాటం కాబట్టి, ఇది వీర రస ప్రధాన నవల. అంటే ధర్మవీరం అంగిరసం. అన్నల - పోలీసుల పోరాట సన్నివేశం ఉన్నా అది అంగ రసమే. అక్కడ భయానక రసపోషణ జరిగింది. విధ్వంసం జరిగితే భీభత్సం ఉండేది. హాస్య రసపోషణ మలయశ్రీ కలానికి వెన్నతో పెట్టిన విద్య. అది ఈ నవలలోని సమయోచిత చతుర సంభాషణలతో పలుచోట్ల పోషింపబడింది. అయినా అది అంగరసంగానే. దమనీయ సన్నివేశాల్లో కరుణ రసాన్ని విధిలేని పరిస్థితుల్లో సహనంతో శాంతరసం కనిపించినై. చివరకు దళిత హీరో సర్పంగ్‌గా నెగ్గుతాడు. ఇది ధర్మపీతం.

2. సహచరి - యువ ఉద్యోగ ప్రేమికుల జంట. కథానాయకుడు ప్రేమించింది ఒకరిని. విధిలేని పరిస్థితిలో పెళ్లాడింది వేరే గ్రామీణ యువతిని.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

కుటుంబ ఘర్షణ, ఎన్నో అపార్థాలు - ఆదర్శాలు. హీరో సగటు మానవుడు. అతని గృహిణి సాధరణ సగటు మహిళ - స్వార్థదృష్టి. నాయకుని ప్రేయసి ఆత్మాభిమాని - ఆదర్శమహిళ - విశిష్ట వ్యక్తిత్వం. దీనిని శృంగార రస ప్రధాన నవల అనవచ్చు. అయినా ఇతర విషయాలే ఎక్కువ. కరుణ, శాంతం అంగరసాలు.

3. నిర్ణయం - ఇందులో నాయికా నాయకులు కొత్త దంపతులు. ఇద్దరికీ చక్కని ఉద్యోగాలు. నగర జీవితం. అనుకోని విధంగా అతనికి మరో యువతితో సంబంధం ఏర్పడుతుంది. ఆమె ఆ యింటి పనిపిల్లే. ఆ విషయం తెలిసి, సహించక నాయిక అత్తమామల పిలిపించి భర్త వ్యవహారం తెలిసి పుట్టింటికి (ఓ జిల్లా కేంద్రం) వెళ్ళి పోతుంది. ఆమెకు ఇద్దరు చెల్లెళ్ళు, అమ్మా నాన్న. చెల్లె పెళ్ళికి భర్త వచ్చినా పలుకరించదు. కొన్నాళ్ళకు వెళ్ళి ఉద్యోగంలో చేరి వేరే చోట ఉంటుంది. ఆమెకు సంతానం కలిగి, అమ్మ-అత్త వచ్చిన వారికి దూరంగా ఉంటుంది. మోస పోయిన పనిపిల్లను ఆదరిస్తుంది. అనేక సన్నివేశాలు కథలో ఎన్నో మలుపులు. ఇది తెలంగాణ సాంఘీక జీవిత చరిత్రను చక్కగా చిత్రించిన నవల. అభిమానవతియైన ఒక ఆధునిక మహిళ సాహస జీవితం ఇది. ఇందులో హీరో కథా నాయికే అనాలి. ధర్మవీరం, అంగిరసంగా హాస్య, కరుణ, వీర, శాంతాలు అంగ రసాలుగా సందర్భోచితంగా పోషింపబడినై ఈ నవల్లో.

## ముగింపు :

మలయశ్రీ రచనలు కథ, నవల, నాటకం.. అది ఏదైనా పాత్ర పోషణలో దిట్ట. సంభాషణల రచనలో చతురుదు. తెలుగులో ఎం.ఏ, ఎం.ఓ.ఎల్., పిహెచ్.డి. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సంస్కృత భాషల్లో రచయిత - కవి. సంస్కృతాంధ్ర కావ్యాలంకార శాస్త్రాలు చదివిన వారు. తరువాత తమిళ, కన్నడ బాషలు తెలుసు. అందుకే ఔచిత్య శోభితంగా - అపహాస్యం, రసభంగం, అతివేల శృంగారం, జుగుప్స కలిగించే సన్నివేశాలు లేకుండా ఆదర్శ రచయితగా తమ నవలలు రచించారు.

నవరసాలు (9) నాటి, నేటి ఏ రచనలోనూ లేవు, ఉండవు. రామాయణ మహాభారతాలు, గుణాఢ్యుని - బృహత్కథ, బాణుని - కాదంబరి వంటి ఉద్గ్రంథాల్లో అది సాధ్యం కావచ్చు.

మలయశ్రీ నవలలన్నీ సామాజికాలు. సమాజ చిత్రణ. సంస్కరణ అతని ధ్యేయం. ఇంచుమించు ధర్మవీరం, అంగిరసం, శృంగార హాస్య కరుణ వీర శాంత రసాలు వీరి నవలల్లో అంగరసాలు మాత్రమే. రౌద్ర భయానక బీభత్సాద్భుత రసాల జోలికి వీరు పోలేదు.

చివరిమాట - ఈ సెమినార్‌లో ఈ అంశంపై ప్రసంగ పత్ర సమర్పణకు నాకు అవకాశం కల్పించిన సదస్సు నిర్వాహకులకు కృతజ్ఞతలతో సెలవు.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# బమ్మెర పోతన ఆంధ్ర మహాభాగవతము - రస పోషణ

- "పద్య ప్రవీణ" కట్ట రంజిత్ కుమార్, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ & పీ.జి (స్వయం ప్రతిపత్తి) కళాశాల, సిద్ధిపేట, తెలంగాణ.

సంస్కృత భాగవతం వేదాంత జటిలమైన గ్రంథం. తెలుగు భాగవతం భక్తిరసభాండం. మహాకవి పోతన భక్తి రసార్ద్రంగా భాగవతాన్ని తీర్చి దిద్దాడు. పోతన భాగవత గ్రంథం ఇంటింటిలో ఉండడమే శ్రేయస్కరంగా భావిస్తారు తెలుగు వారు. బమ్మెరపోతన తెలంగాణ మహా కవి అనడంలో ఏమాత్రం సందేహం లేదు. కవిత్రయం వారు భాగవతం జోలికి పోకుండా తనకు ఆ భాగవతాను వాదాన్ని వదిలివేయడం తన "పురాకృత శుభాధిక్యంగా" భావించాడు పోతన.

అలంకారాలు పోత పోసినట్లు, ఆధ్యాత్మిక భావాలు కుండపోత పోసినట్లు కలగలిపిన కవిత్వ ధార పేరు పోతన. భక్తికి మారుపేరుగా భాగవతాన్ని చెప్పుకుంటారు తెలుగు వారు. దానికి కారణం దానిలో ఉన్న భక్త గాథలే కాదు బమ్మెరపోతరాజు కమ్మని కవిత్వం. స్వయంగా భక్తుడై భగవన్నామస్మరణం చేతనే పారవశ్యాన్ని భజించే చిత్తంతో భగవంతుని ప్రేరణతో భాగవత రచన చేపట్టాడు పోతన్న. కవిత్వం అతనికి కైవల్య సాధనం. కైవల్యం జ్ఞానం వల్లకాని కైవంశం కాదు.

రాజుల నీసడించి, రాముణ్ణి ఆశ్రయించి, భోగాలను గర్హించి, భగవంతుణ్ణి కీర్తించిన పోతన జీవితం ఉత్తమ మానవతకు ఉజ్వల మణిదర్పణం. "విద్యావతాం భాగవతే పరీక్షా" అని కొమ్ములు తిరిగిన పండితులకు కూడా "కొరకరాని కొయ్య" అయిన శ్రీ మద్భాగవతం పోతన అమృతహస్త స్పర్శతో "బాలరసాలంగా" పరిణమించి పల్లవించి పుష్పించి ఫలించి ఆ బాలగోపాలానికి రసానందాన్ని అందించింది.

ఆధ్యాత్మిక విద్యా సంపన్నమైన ఆద్య భారతీయ వాఙ్మయమున అష్టాదశ పురాణములలో ఒకటియై, ఆద్యంతము భగవద్భక్తితత్త్వ ప్రతిపాదకమై, భక్తిరస సిద్ధాంతముకు ఆలంబమై, ప్రామాణికమైనది శ్రీమహాభాగవతము. పండితులు-పామరులు, బాలురు-వృద్ధులు, స్త్రీలు-పురుషులు వారు వీరు అను నేల సమస్తాంధ్ర మహాజనహృదయములను చూరగొన్నది భాగవతమే! ఇలా సార్వజనీనత్వము, సార్వకాలికత్వము, సార్వ దేశికత్వము సంపూర్ణముగ మూర్తీ భవించిన తెలుగు కృతి పోతన భాగవతము.

**భక్త్యా భాగవతం జ్ఞేయం! న వ్యుత్పత్త్యా న టీకయా!**
**అంటే భాగవతాన్ని అర్థం చేసుకోవాలంటే భక్తి కావాలి.**

భాగవతము భాగవతోత్తముల గాథ. ప్రహ్లాద, నారదాంబరీషాది భక్తుల చరిత్ర. ఈ పురాణంలో భగవంతుని కన్నా భక్తుడేఉన్నత స్థానం పొందాడు. అలవైకుంఠపురంలో ఉన్న శ్రీహరిని ఇలకు రప్పించి నావంటి బాధితులు ఎందరో ఉన్నారయ్యా! రావయ్యా! అన్నట్లు గజేంద్రుడు వ్యవహరించాడు. అంబరీషుడు దుర్వాసుని దుర్వార గర్వభంగానికి సుదర్శనాన్నే దర్శింపజేశాడు. ప్రహ్లాదుడు దుష్ట శిక్షణకు నారసింహ రూపంలో స్తంభంలో శ్రీమహా విష్ణువును అవతరింపజేశాడు.

పరమ భాగవతోత్తముడైన ప్రహ్లాదునిలోని ఆవేశాన్ని రసావేశంతో రంగరించి రచించాడు పోతన్న.

**సీ. కంజాక్షునకు గాని కాయంబు కాయమే**
**పవన గుంభిత చర్మ భస్త్రిగాక !**

ఒక కాయం నిజమైన కాయం కాదు. అది నిష్ప్రయోజనమైనది. రెండవ కాయం (కంజాక్షునకు అయిన కాయం) సార్థకమైనది. అట్లే

**సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు**
**శ్రీనాథు వర్ణించు జిహ్వజిహ్వ !**

అనే పద్యంలో రెండుసార్లు కరములు అన్నాడు కవి. జిహ్వను కూడా రెండు సార్లు వాడాడు. ఈ ఆమ్రేడితంలో

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

గొప్ప అర్థమున్నది. నిజమైన నాల్క యేదో చెబుతున్నాడు. రసావేశంలో కవి. అంధేందూదయముల్ మహాబధిర శంఖారావముల్ మొదలైనపద్యాలన్నీ రసావేశ భాసితాలు. ప్రహ్లాదుని చేత పోతన్నగారు తొమ్మిది రకాల భక్తిని హిరణ్యకశిపునికి చెప్పించారు.

భాగవతంలో భక్తి అంగిరసం. శృంగార వీర కరుణాదులు అంగరసాలు. వివిధ రసాలను సమపాళ్లలో రంగరించి అందించగల దిట్ట పోతన్న. సత్యభామను శృంగార వీర రసాధి దేవతగా చిత్రించిన ఘట్టంలో రసావేశం అనుభవైక వేద్యం. రాకేందు బింబమై - రవి బింబమై - కందర్పకేతువై-ఘనధూమకేతువై, భావజు పరిధియై ప్రళయార్కు పరిధియై, అమృత ప్రవాహమై-అనల సందోహమై, హర్షదాయియై-మహారోషదాయియై హరికి అరికి కన్పిస్తున్న సత్యావర్ణనంలో భిన్నరసాలకు ఏకత్వం కల్పించాడు పోతన కవీంద్రుడు.

వీరరసం అనేక విధాలు-దాన ధర్మదయా పాండిత్యాదులు పోతన్నగారు చిత్రించిన బలిచక్రవర్తి దానవీర మూర్తిగా సాక్షాత్కరిస్తాడు.

**శా. ఆదిన్ శ్రీనతి కొప్పుపై తనువుపై అంసోత్తరీయంబుపై**
**పాదాబ్జంబులపై కపోలతటిపై పాలిండ్లపై నూత్న మ**
**ర్యాదం జెందు కరంబు క్రిందగుట మీదై నా కరంబుంట మే**
**ల్లాదే! రాజ్యముగీజ్యమున్ సతతమే! కాయంబు నా పాయమే!**

"రాజ్యము గీజ్యము" అనిపించాడు బలి చక్రవర్తితో పోతన్నగారు. ఏదీ శాశ్వతం కాదు.

ప్రథమస్కంధంలో అశ్వత్థామ అవమాన సమయమందు భయానక, బీభత్స రసాలను; అర్జునుడు కృష్ణ నిర్యాణవార్తను ధర్మరాజునకు చెప్పినపుడు కరుణ రసాన్ని; సప్తమస్కంధంలో ప్రహ్లాద చరిత్ర యందు శాంత, కరుణ రసాలను; నృసింహావతార ఘట్టమున వీర రౌద్రద్భుత రసాలను; దశమస్కంధంలోని రుక్మిణీ కళ్యాణమున శృంగార, భక్తి రసాలను నరకాసురవధ యందున వీర, శృంగార రసములను పరమరమణీయముగ వర్ణించాడు పోతన.

ప్రహ్లాదుని హిరణ్యకశిపుడు వివిధ ఉపాయములందు హింసించుట, ఆ హింసలనన్నింటిని దీనభావము లేక ప్రహ్లాదుడు భరించుటయందును శాంత - కరుణ - అద్భుత - బీభత్స రసాలను పోతన్న వర్ణించాడు.

**ఉ. తన్ను నిశాచరుల్ వొడువ దైత్యకుమారుడు మాటి మాటికో**
**పన్నగశాయి! యో దనుజభంజన!...............(7.193)**

అనే పద్యము నందు శాంత, కరుణ రసాలున్నవి.

అష్టమస్కంధంలోని గజేంద్రమోక్షమనేఘట్టంలో గజేంద్రుని భక్తి, ఆయాసము, సందేహము, భయము నిపుణతతో ఈ క్రింది పద్యములలో ఇమడ్చబడినవి.

**కం. వినుదట జీవుల మాటలు**
**చనుదట చనరాని చోట్ల శరణార్థుల కో**
**యనుదట పిలిచిన సర్వము**
**గనుదట సందేహమయ్యె కరుణావార్ధీ ! (8.91)**

**సీ. కలుగడే నాపాలి కలిమి సందేహింప**
**గలిమిలేములు లేక కలుగువాడు**
**నాకడ్డపడరాడె నలినసాధువుల చే**
**బడిన సాధుల కడ్డ పడెడివాడు**
**చూడడే నాపాటు జూపుల జూడక**
**చూచువారల గృప జూచువాడు! (8.87)**

పై ఈ పద్యాలలో గజేంద్రుని మొరయందెంత కరుణ రసమున్నదో మనకు కన్పిస్తుంది.

పోతన్న ఉదాత్తంగా పోషించిన శాంతరసాన్ని, అందులో తాను ప్రదర్శించిన రసావేశాన్ని ద్రౌపదికి ఆపాదించాడు. శాంత రసాధి దేవత ద్రౌపది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

**శా. ఉద్రేకంబునరారు, శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు కిం..............................**

అనే పద్యంలో పోతన్న ద్రౌపది ద్వారా తమలోని శాంత రసావేశాన్ని చాలా చక్కగా ప్రదర్శించారు.

పై ఈ విధంగా రసావేశపరుడైన పోతనామాత్యుడు ఆంధ్ర భాషను, తెలుగుసాహిత్యాన్ని రసస్లావితం చేశాడు. ముఖ్యముగ భక్తిరసమును, కరుణరసమును పోషించి, శృంగార రసమును సరసముగ రమణీయముగ నిర్వహించి భక్తి రసమున ఆంధ్ర వాఙ్మయమున భాగవతాన్ని నిల్పిన సహజపండితుడు బమ్మెర పోతన.

పండి మగ్గిన వ్యాస భాగవత ఫలం పోతన్న వంటి తెలుగు చిలుకకు లభించడం దైవనియోగం. ఆంధ్ర రసికుల అదృష్టయోగం. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారన్నట్లు భక్తి రసపారావారమున ఓలలాడునట్లు ఆంధ్ర మహా భాగవత ప్రబంధమును రచించి ఆంధ్రలోకమును అనుగ్రహించిన పూతచరిత్రుడు బమ్మెరపోతరాజు సుకవి. డా॥ నేతి అనంతరామశాస్త్రి గారి మాటలో పోతన ఒక కవితా నిర్మాణదక్షుడు. అతడు నిరాడంబరమైన కర్షక కవిమణి. ఒకచేత కలము, ఒక చేత హలము బట్టి మందార మకరంద మాధుర్య జ్ఞానరాసులను, ధాన్య రాసులను పండించిన సవ్యసాచి. కవికోకిల గుఱ్ఱం జాషువా గారు "భాగవతంబు నా బాల శిక్ష" అని నినదించిన, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు నుడివినట్లు "పోతన్న తెలుగుల పుణ్యపేటి!"

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. జగన్నాథ శర్మ విరచిత వ్యావహారికంలో భాగవతం-అమరావతి పబ్లికేషన్స్-2014
2. ఆచార్య సి.నారాయణ రెడ్డి విరచిత మందార మకరందాలు-తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురణలు-2017
3. ఆచార్య అనుమాండ్ల భూమయ్య విరచిత విమర్శ విద్యా సార్వభౌమం-మనస్వి ప్రచురణలు-2013
4. ఆచార్య ఎస్వీరామారావు విరచిత తెలంగాణ సాహిత్య చరిత్ర-పసిడి ప్రచురణలు-2014

❖ ❖ ❖

# ముళ్ళపూడి వెంకట రమణ 'బుడుగు' – హాస్యం

– పప్పుల శైలజ, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ & పీ.జి కళాశాల (అటానమస్), సిద్ధిపేట, తెలంగాణ.

"నవ్వడం ఒక యోగం, నవ్వించడం ఒక భోగం, నవ్వలేక పోవడం ఒక రోగం" అంటారు జంధ్యాల. ప్రాచీన అలంకారికులు నవరసాలలో ఒక రసంగా హాస్యాన్ని చేర్చారు. హాసం అంటే నవ్వు. హాసాన్ని కలిగించేది కనుక హాస్యం అంటారు. "హాస్యం స్మితం, హసితం, విహసితం, ఉపహసితం, అపహసితం, అతిహసితం అని ఆరు రకాలు. ఇందులో మొదటి రెండు ఉత్తమమైనవని, ఉత్తరోత్తరా పరిహాణీయ" మని ధనుంజయుని అలంకార గ్రంథంలో చెప్పబడింది.

ఎవరిని నొప్పించకుండా వాక్చాతుర్యంతో నవ్వించడ మనేది అంత సామాన్యమైన విషయమేమీ కాదు. అది ఒక సృజనాత్మకమైన కళ. It lightens the heart, but the process to arrive at it requires serious thinking నవ్వు మనసుని తేలిక పరుస్తుంది. కానిదాని సృష్టి మాత్రం అంత తేలిక కాదంటాడు ఒక ఆంగ్లకవి.

If i have no sense of humor, I would long ago have committed suicide Mahatma Gandhi.

"నవరసాల్లో హాస్యాన్ని ఒక రసంగా పేర్కొన్నా. అది ఆధునిక యుగం వరకు ఒక సుస్థితి రూపంలో ఆవిష్కరింపబడలేదు. భావాదుల పరిపుష్టి, చిత్తద్రవీకరణ, తాదాత్మ్య స్థితి కలిగినప్పుడే ఒక రసం ఆవిష్కరింపబడుతుంది. ఈ లక్షణాలు లేనిదే ఒక రసం కాలేదు. ప్రాచీన సాహిత్యంలో ఏ రసానికి లేని ఉపేక్ష ఒక హాస్య రసానికి సంప్రాప్తించింది." అని డా. పి.ఎల్.ఎన్ ప్రసాద్ గారు అన్నారు.

తూమాటి దోణప్ప గారు "తెలుగు సాహిత్యంలో, ప్రాచీన సాహిత్యపు పేరోలగంలో హాస్య రసానికి వేసిన పీట మాత్రం చాలా చిన్నది. ఆ రోజుల్లో వాళ్ళు చాలా రసాలకు పట్టాభిషేకం చేసారు. కాని హాస్యం దాస్యం చేసింది. అయితే ఆంధ్రులు హాస్యప్రియులు కారని గట్టిగా అనలేం. వదినా మరదళ్ళ సరసాలు, పెళ్ళిళ్ళలో ఇరు పక్షాల వారి పరియాచకాలు ఒకేటేమిటి అడుగడుగునా, అనుక్షణమూ తెలుగువారి బ్రతుకు దారుల్లో హాస్యం జాలువారుతూనే ఉంటుంది. తెలుగు వినోదాత్మక ప్రదర్శనల నిండా హాస్యమే కనిపిస్తుంది. అంటారు.

ఆధునిక యుగంలో అన్ని ప్రక్రియల్లో హాస్యం కొత్త అందాలు సంతరిచుకుంది. కేవలం విదూషక పాత్రకి పరిమితం కాకుండా నాయికా, నాయక ప్రతి నాయకాది పాత్రల్లో ప్రవేశించింది. హాస్యమే లక్ష్యంగా రచయితలు ఆధునిక యుగంలో తమ రచనలు రూపొందించారు. కందుకూరి వారి సత్యరాజా పూర్వదేశ యాత్రలు తెలుగులో వ్యంగ ప్రధాన హాస్య నవలకు శ్రీకారం చుట్టింది. చిలకమర్తి వారి గణపతి, పానుగంటి వారి సాక్షి వ్యాసాలు, గురజాడ వారి కన్యాశుల్కం మొక్కపాటి నరసింహశాస్త్రి గారి బారిష్టరు పార్వతీశం, మునిమాణిక్యం నరసింహారావు గారి కాంతం కథలు, చింతాదీక్షితుల హాస్య కథల సంపుటి, ముళ్ళపూడి వారి బుడుగు, గిరీశం లెక్చర్లు, ముప్పాళ్ల రంగనాయకమ్మ గారి ఆండాళ్లమ్మ, స్వీట్ హోమ్ మొదలైన రచయితల రచనలలో హాస్యం కనిపిస్తుంది. ప్రారంభ కాలంలోని రచనల్లో సంఘ సంస్కరణాభిలాషని హాస్యంతో మిళితం చేసి చెప్పినా తరువాతి కాలంలో పూర్తి హాస్య ప్రధాన రచనలు వచ్చాయి. కందుకూరితో ప్రారంభమైన హాస్యం, పానుగంటి కాలానికి పదునుదేలి ముళ్ళపూడి వెంకటరమణ కాలానికి సంపూర్ణతని సంతరించుకుంది.

హాస్యానికి పెద్దపీట వేస్తూ ఆద్యంతం చమత్కారాలతో అలరించిన రచయిత ముళ్ళపూడి వెంకట రమణ. "నవ్వొచ్చినప్పుడు ఎవడైనా నవ్వగలడు. ఏడుపొచ్చి నప్పుడు కూడా నవ్వగలిగే వాడు మగాడు. అసలదే నవ్వు."

అని నవ్వుకి నిర్వచనం చెప్పాడు. ముళ్ళపూడి సీతా కళ్యాణం, ఇద్దరమ్మాయిలు ముగ్గురబ్బాయిల ప్రేమాయణం, రాజకీయ బేతాళ పంచవింశతి, ఋణానందలహరి, కానుక, రాధగోపాలం, సాక్షి, ఆకలీ - ఆనందరావు, గిరీశం లెక్చర్లు, బుడుగు, కోతికొమ్మచ్చి మొదలైన అనేక (ముళ్ళపూడి వెంకటరమణ సాహితి సర్వస్వం తొమ్మిది సంపుటాలు) రచనలు చేసారు.

ముళ్ళపూడి వెంకటరమణ అద్భుత సృష్టి బుడుగు. బుడుగుని సృష్టించడంలో బాపు పాత్ర కూడా అమోఘం. బాపు రమణలను మనం విడదీసి చూడలేం. వీరిద్దరి ప్రవేశం హాస్య యుగంలో ఒక బ్రహ్మాండమైన మలుపు. రమణ మన చుట్టూ ఉన్నటువంటి పాత్రలనే సాహిత్యంలో ప్రవేశపెట్టి మనల్ని గిలిగింతలు పెట్టి మనసారా నవ్వుకునేట్టు చేయడంలో సిద్ధహస్తుడు. అలా సృష్టించబడిన పాత్రలే బుడుగు. సీగాన పెసూనాంబ, రాధాగోపాలం, పక్కింటి లావుపాటి పిన్నిగారు. బుడుగు మొదట "బుడుగు చిచ్చుల పిడుగు"గా ఆంధ్రపత్రిక వార పత్రికలో నవంబర్ 1956 నుండి ఏప్రిల్ 1957 వరకు వచ్చింది.

ముళ్ళపూడి వెంకటరమణ చిన్నప్పటి ముద్దు పేరు బుడుగు. బుడుగు రచనకు ఇన్స్పిరేషన్ "డెనిస్ ది మెనేస్" అంటారు. కానీ బుడుగు కుటుంబం, పరివారం, ఆలోచనలు, భాష అన్నింటిలోను తెలుగుదనం ఉట్టి పడుతుంది. డెనిస్ కంటే బుడుగు విస్తృతి ఎక్కువ.

బుడుగు వయసు ఏడేళ్లు. అతడి ఆలోచనలు, అమాయకత్వం, అల్లరి, నిజాయితీ, భాష, అభిప్రాయాలు, సలహాలు, అయోమయం, సమకాలీన పరిస్థితులపై అతడికున్న అవగాహన లోకజ్ఞానం అన్నీ మనకు నవ్వు తెప్పిస్తాయి. మనసారా నవ్వుకునేట్టు చేస్తాయి. బుడుగు ప్రస్థానం 1956లో మొదలైనా ఇప్పటికి నిత్య నూతనంగానే కనిపిస్తాడు.

"నాపేరు బుడుగు. ఇంకో పేరు పిడుగు. ఇంకో అసలుపేరుండది. అది చెప్పడానికి టైం లేదు. అది చాలా పొడుగు. కావలిస్తే మానాన్న నడుగు." పేరు చెప్పడానికి కూడ టైం లేనంత బిజీ అయినట్టు నవల ఆరంభంతోనే మనల్ని నవ్వించడం మొదలు పెడతాడు బుడుగు.

ప్రైవేటు మాస్టార్లకి, చిన్న పిల్లలకి చదువు చెప్పడం రాదని, ఈడుకు తగని లెక్కలు చెయ్యమంటారని అంటాడు. "ఏడాది నుంచి ఈ మేష్టర్లు నాకోసం వస్తున్నారు. ఒకడి తరువాత ఒకడు. వీడు పదోవాడు కాబోలు. ముందర చాక్లెట్లు తెస్తారు. ఒక్కడూ పకోడీలు తేడు. పైగా చాక్లెట్లు ఇచ్చినందుకు లెక్కలు చేసిపెట్టమంటాడు. వాడి పదిస్తే (ఉత్తది ఒకటో, రెండో తెస్తాడు.) నేను రెండు తింటే ఎన్ని ఉన్నాయి అంటాడు. నాదగ్గర పది మేష్టర్లు పనిచేశారనుకో వాళ్లందరూ నిజంగా మంచివాళ్ళే. రెండ్రోలో, పడకొండ్రోలో అయ్యాక మానేసేవాళ్ళు. నన్ను భరించలేమని చెప్పారట నాన్నతో. ఉత్త అబద్ధం. నేను వాళ్ళ వీపు మీద సవారీ చేస్తానని ఎప్పుడూ అనలేదు." అంటూ అమాయకంగా మనల్ని నవ్విస్తాడు బుడుగు.

ఇంకో సందర్భంలో మేష్టర్లతో వేగలేకపోతున్నానని వాపోతాడు బుడుగు. "ఈ మేష్టర్లని ఉంటాయే, వాటితో వేగలేకపోతున్నానురా. సాదార్నంగా ఈ మేష్టర్లకి ఏం తెలీదు పాపం. పెద్దాళ్ళనడిగితే కోంబడతారని బయం. అందుకని బడి అని ఓటిపెట్టి మన్ని అడుగుతారన్నమాట. వాళ్ళకి పాఠాలు రావుగదా. ప్రైవేటు మేష్టార్లు వేషం వేసుకుమనింటికొచ్చి వురేయ్ బుడుగు, బుడుగు రెండు రెండు ఎంత? అని అడుగుతారు. ఇంకానేమో 'సీరాముని దైచేతను పజ్జెంచెప్పమ్మా!' అని ఏడుస్తూ అడుగుతారు. ఇక్కడ నేర్చుకున్నా మర్చిపోయి మళ్ళీ బళ్ళో అడుగుతారు. పాపం అని మనం చెపుతామా వినరు." అంటాడు.

ప్రతి మాటకూ ఓ అర్థం ఉంటుందని, అది ఒక్క ప్రైవేటు మాష్టారుకే అర్థం అవుతుందని, అతడు చాలా తెలివైన వాడని అందుకే తన దగ్గర ప్రైవేటు మానేశాడని అంటాడు.

"ఓసారేమో నాన్నేమో అమ్మ చెవిపట్టుకు కీ ఇస్తున్నాడు. ఇంతట్లోకి నాకు ఆకలేసింది. 'అమ్మా ప్రైవేటు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

అయిందా' అన్నం పెట్టుదుగానీ అన్నాను. 'ఛీ పోకిరి వెదవకానా' అంది కోపంగానూ, నవ్వుతూనూ." అసలు వాళ్ళమ్మకి కోపం వచ్చిందో నవ్వుతుందో అర్థం కాక పెద్దవాళ్ళు ఎప్పుడూ ఏదీ సరిగ్గా చెప్పరనంటూ మనల్ని నవ్వుల్లో ముంచెత్తుతాడు.

బుడుగు అందరికి ఒకే రూల్స్ లేకపోవడం అన్యాయం అని బాధపడతాడు. నేను చక్కగా తలదువ్వుకుంటే పండులా ఉంటానని, దువ్వుకోకపోతే జలాయిబడవలా ఉంటాననే నాన్న, అమ్మ తల దువ్వుకోకుండా మొహం మీద జుట్టు పడుతుంటే "అహా హా హా హా రాధా ఆ జుట్టు అలా ఉంచరాదా ఎంతో బాగున్నావు అంటాడు. ఎందుకనాలీ అంట. అమ్మకి ఒక రూల్స్ పెట్టేసి నాకు ఇంకో రూల్స్ పెట్టడం అన్యాయం" అంటాడు.

బుడుగు విగ్గులేని యముడి గురించి చెపుతూ నేనంటే చాలా మందికి బయం నేను మంచివాణ్ణే ఎందుకనో అని ఆలోచిస్తాడు. బుడుగు నాన్నగారి ఆఫీసులో వాళ్ళంతా వాళ్ళ మేనేజర్ని విగ్గులేని యముడు అని తిట్టుకుంటారు. ఓ రోజు బుడుగు వాళ్ళ నాన్నతో ఆఫీసుకి వెళతాడు. విగ్గులేని యముడ్ని చూడాలన్న కుతూహలంతో వాళ్ళ నాన్న చూడకుండా మెల్లగా మేనేజర్ గదికి వెళతాడు. మేనేజర్ నవ్వుతూ బుడుగుని పిల్చి బిస్కెట్టుపెడతాడు. దాంతో అతడు యముడు కాదనుకొని మేనేజర్నే అడుగుతాడు. "ఇక్కడ విగ్గులేని ఎముడు అని ఓడున్నాడుట ఎవడురా వాడు అన్నాను వాడు నవ్వుతూ నేనేలే అన్నాడు. నాకు అవమానం (అనుమానం) వేసింది వీడు నిజం ఎముడు కాదురా అని అందుకని తలుపు దగ్గరికెళ్ళి మానాన్నని గఠిగా పిలిచి అడిగాను. నాన్నా వీడేనా విగ్గులేని ఎముడు అని. అంతే ఒక్కసారిగా నాన్నా వాళ్లందరూ పరుగేరుకొచ్చేసి నానోరు మూసేశారు." అంటూ అమాయకంగా అందర్నీ హడలెత్తించి మనల్ని నవ్విస్తాడు.

బోల్డంత లోకానుభవం ఉన్న బుడుగుకి కూడా పాపం కొన్ని విషయాలు అర్థం కావంటాడు. నిజం ఎప్పుడు చెప్పాలో నిజంగా తెలీదంటాడు. అమ్మాయిలు ముందుకో జడ వెనకకో జడ వేసుకుంటే వాళ్ళు వెళుతున్నారో వస్తున్నారో అర్థం కాదంటాడు. 'గుండుకి మెడ్రాస్ కాఫింగు షాపు' ఎందుకు చేయరో, నాన్న 'పిల్లా' అంటే నవ్వే అమ్మ నేను 'పిల్లా' అంటే 'ఛప్ వధవకానా' అని ఎందుకు కోప్పడుతుందో, అల్లరి చేస్తే వద్దురా అని తిట్టే పెద్ద వాళ్ళు అల్లరి మానేస్తే హడలిపోయి భయపడుతా రెందుకో బుడుగు అర్థం కాదు. భయబత్తులంటే తెలీదంటాడు. అవి బామ్మ కాల్చే అగరొత్తులో, బాబాయి కాల్చే సిగరొత్తులో అనుకుంటాడు.

బుడుగు అల్లరి పిడుగే అయినా నిజాయితీ పరుడు. గుండేసి పేల్చినా పలక పగలదని చెప్పిన విశ్వనాథాన్ని పలక పగులగొట్టిమరీ నిలదీస్తాడు. సుబ్బలక్ష్మి ముక్కు బాగుందన్న బాబాయితో గొడవకొచ్చిన సుబ్బలక్ష్మి తాతయ్యతో నిజమే చెప్పిన నిజాయితీ పరుడు. ఇలా నిజాయితీతో కూడా బుడుగు పాఠకులను కడుపుబ్బా నవ్విస్తాడు.

బుడుగు నేను చిన్న వాడినా చితకవాడినా, నా అంత వాడిని నేను, నాకు పరపంచ గానం చాలా ఉంది. అలాగే బోలెడంత అనుభవం కూడా అని చెప్పుకుంటాడు. ఆ అనుభవంతోనే కొన్ని జీవిత సత్యాలు చెపుతాడు. అలాగే సలహాలు కూడా ఇస్తాడు. శిక్ష అంటే బడిలో వేయడమని, ప్రేమించడం అంటే ఎవరికీ తెలియదని, చదువు సంధ్య లేకపోతే పెళ్ళి చేయరని చెపుతాడు. కొత్తగా వచ్చిన ప్రైవేటు మాష్టర్లు ఎలా ఉండాలో, మాష్టరు నచ్చకపోతే ఉత్తినే 'బామ్మోయ్ వీడు గిల్లేస్తున్నాడే' అని బామ్మకి వినపడేట్టు గట్టిగా అరవాలని, అలాగే పిల్లల్ని ఎలా పెంచాలో, బడి ఎగ్గోట్టలంటే ఏంచేయాలో సలహా ఇస్తాడు. ఒకసారి నిజంచెప్పి మొట్టికాయలు తింటే రెండోసారి నిజం చెప్పకూడదని కూడా సలహానిస్తాడు.

బుడుగు కొన్ని నిర్ణయాలు కూడా తీసుకుంటాడు. "మనం అల్లరి మానేసేదాకా బడి తియ్యరుట, అందుకని బడితీసేదాకా అల్లరి మానేయాలని" త్వరగా పెద్దవాడు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

కావాలంటే త్వరత్వరగా చదుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఎందుకంటే పెద్దవాడు కాకపోతే చదువు సంధ్య లేకపోతే సీ గాన పెసూనాంబనిచ్చి (బుడుగు గర్ల్ ఫ్రెండ్) పెళ్లి చెయ్యరుగా అందుకు. బుడుగు ఆసాంతం పాఠకులను హాస్యపు జల్లుల్లో ముంచెత్తుతాడు. నవ్వులతో పాటు బుడుగులు (చిన్న పిల్లలు) ఎలా ఉండాలో, బుడుగులని పెద్దవాళ్ళు ఎలా పెంచాలో కూడా అంతర్గతంగా సందేశాన్ని ఇస్తాడు. బుడుగు పాత్ర బాల సాహిత్యానికే మకుటాయమానంగా తీర్చిదిద్దాడు ముళ్ళపూడి వెంకటరమణ. బుడుగు చక్కని హాస్యానికి నిలువుటద్దం. తెలుగు సాహిత్యంఉన్నంత కాలం బుడుగు చిరంజీవిగా మనతోనే ఉంటాడు.

**ఆధార గ్రంథాలు :**

1. డా॥ ఎమ్బీయస్ ప్రసాద్ : బుడుగు ముందుమాట
2. డా॥ పి.ఎల్..ఎన్. ప్రసాద్ : తెలుగు సాహిత్యంలో హాస్యం.
3. డా॥ ద్వా. నా. శాస్త్రి : తెలుగు సాహిత్యంలో హాస్యామృతం.
4. వన్ ఇండియా : ఆధునిక సాహిత్యంలో హాస్యం, నవంబర్ 10, 2003
5. వెంకట రమణ ముళ్ళపూడి : బుడుగు
6. సాహిత్య మాన పత్రిక - మాలిక పత్రిక, ఫిబ్రవరి, 06, 2011

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# శృంగార వీర రస భావ సంపుటి – అగ్నిధార

– సోనబోయిన సతీష్ తెలుగు అధ్యాపకులు, శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ & పి.జి. కళాశాల, వరంగల్, తెలంగాణ.

దాశరథి కృష్ణమాచార్య తొలి కవితా సంపుటి అగ్నిధార. ఇది 1949లో అచ్చయింది. ఇది ఖండకావ్యం. 1963లో రెండవ ముద్రణ పొందిన ఈ సంపుటిలో యాబై ఖండిక లున్నాయి. సమాజం పట్ల కవికి గల దృష్టికి, అంతరంగిక భావనలకు ఈ అగ్నిధార నిదర్శనం. ఒకటి బాహ్య దృష్టి; రెండు అంతరదృష్టి. ఈ గ్రంథానికి కవి వ్రాసిన ముందు మాటలో ఇందలి కవితలను గూర్చి ఈ విధంగా ఉంది-

"ఈ అగ్నిధారలోని ఖండికలు చాలా వరకు నా జైలు జీవితంలోను, జైలులో నుంచి వెలువడిన కొత్తలోనూ రాసినవి. నిజాం రాష్ట్రంలో ప్రభుత్వ నిరంకుశత్వం, ప్రజల అగచాట్లు, భారత స్వాతంత్ర్యం, భారత సైన్యాల ప్రవేశం, నైజాం ప్రభుత్వ పతనం - ఇవన్నీ నా రచనకు పునాదులు" ఈ మాట కవి బాహ్య దృష్టిని తెలుపుతుంది. ఈ ముందు మాట - "పురాస్మృతులు"లో దాశరథి, తన కవితల్లో శృంగార భావాలున్న విషయాన్ని తెలిపినాడు -

"అయితే వీటితో పాటు అంతర్వాహినిగా కొంత శృంగారం వెలువడక పోలేదు. ఈ రెండు (అంగారం, శృంగారం) భిన్న విషయాలు కలగలసి సాగడం సాధ్యమా? అని కొందరు అనవచ్చు. దానికి ఉదాహ రణలు చాలా కవుల్లో చూపుతాను. ముఖ్యంగా నా ఉ ర్దూకవి మిత్రులలో మఖ్దూం మొహియుద్దీన్ ఎంత విప్లవ కవియో అంత శృంగార కవి... క్రాంతిని ప్రబోధించే ఎందరో కవులు కమ్మని శృంగారం రాశారు... కరకు నైజాం సిపాయీలను ఎదిరిస్తూ అరణ్యాలలో తిరుగు తున్నప్పుడున్నూ, జైల్లోనూ మా వూళ్లో నదికి మంచి నీళ్ళు తీసుకుపోవడానికి వచ్చే పచ్చని అమ్మాయి తల పులో మెదలుతుండేది. నేను జైల్లో ప్రవేశించినప్పుడు నా వయస్సు సుమారుగా ఇరవై. ఆకాశంలోకి తలెత్తి చూస్తే మేఘాలు అందమైన అమ్మాయిల ఆకారాలు ధరించి, పొంగిన వక్షస్థలాలలో నన్ను కవ్వించడానికి వచ్చేవి... ఇలా శృంగార వీర రసాలు కలగలిసి నాలో పెల్లుబికేవి. వాటికి తార్కాణం అగ్నిధార."

సామాజిక విషయపరమైన కవితలు వీరరస భావాత్మ కాలు. దాశరథి తెలిపిన ఈ 'శృంగార వీర రసాలు' క్రమంగా అతని అంతరదృష్టికి బాహ్య దృష్టికి నిదర్శనాలు.

## 1. అంతరదృష్టి : శృంగార రస భావం :

అగ్నిధారలోని వర్ణనాత్మక కవితలు కవి అంతరదృష్టిని తెలుపుతున్నాయి. ఈ వర్ణనల్లో దాశరథి శృంగార రసభావ ధార ప్రధానంగా వ్యక్తమై ఉంది. ఈ వర్ణనలు ప్రకృతి వర్ణనలు, తదితరములు. ప్రకృతి వర్ణనములను రెండు విధాలుగా విభజించవచ్చు. ఒకటి, ఋతువర్ణనలు. రెండు, కేవలం ప్రకృతి వర్ణనలు. 'ఉష', 'రుదిర సంధ్య' వంటివి.

**ఋతు వర్ణనలు** : వసంతం మొదలైన ఆరు ఋతువు లను కవి వర్ణించినాడు. ఆమని, ఎండలు, వాసంతిక, వసంతకుమారి, రాక, వానలు, ఋతు షట్కము మొద లైన ఖండికలు ఋతువులకు సంబంధించినవి. వసంత ఋతువులో పూచిన పూలను కవి తన ప్రియురాలి దర హాసంగా భావిస్తున్నాడు. ఆ పూల చెట్లు అంట్లను తన ప్రియురాలే నందనవనం నుంచి తెచ్చి తన తోటలో నాటిందంటున్నాడు-

**నా ప్రియురాలు నందనవనమ్ముల పూవుల అంట్లు తెచ్చి, నా**
**కప్రపుతోటలో మడులు కట్టిన దా కుసుమాల మాలలో**
**అప్రతిమాన కింపురుష హాసములే కనుపించునంట! ప్రే**
**మప్రసనాలు, మానస సుమాలు ప్రియా దరహాస సూనముల్ (ఆమని)**

వసంతాన్ని స్త్రీగా భావించి కవి తనను చేర రమ్మం టున్నాడు. ఆమె తనను కలుసుకొని తనను వీడకుమని తనతో చెప్పిన సరస సల్లాపాన్ని తెలిపినాడు -

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

**పచ్చని చెట్టు క్రింద తెలవారక ముందొకనాడు నీవు నేన్**
**వచ్చితి మొక్క మారుగ భవత్సుకుమార**
**కరాంగుళీయకం**
**బిచ్చితి, నాదు వ్రేలునకు బెట్టితి, వెన్నడు నన్ను వీడకో**
**వెచ్చనివాడ, యంచు శల విచ్చితివో మధు**
**మాధుకన్యకా! (వాసంతికా)**

"ఓ వాసంత కుమారి! నీ పెదవులం దూరెన్ మరందాం బుధారా వాః పూరము త్రావినాడ..." నని ప్రియురాలి ఆధరపానం చేసిన విషయాన్ని తెలిపినాడు. వసంతకాల ప్రభాత సౌందర్యంలో కవి తన ప్రియురాలి సునుబుగ్గలనే చూస్తున్నాడు ; కవితలు వ్రాస్తున్నాడు -

**నీ నును బుగ్గలందు రమణీ! అరుణారుణ బాలభాను డే**
**లా నటనార్థియై ఉదయ రాగమునన్ పరువెత్తివచ్చు? ప్ర**
**స్థానిత తీక్ష్ణతన్ మధుర తాండవ మాడును? నా కలంపు వి**
**న్నాణముతో రచింతు లలనా! నును చెక్కులపైని**
**కావ్యముల్ (వాసంతిక)**

"తాపము నోపజాలను..." అను పద్యంలో గ్రీష్మ ర్తువును కవి వర్ణించినాడు. భరింపలేని గ్రీష్మ తాపాన్ని తొలగించుకోవటానికి రసాల వృక్షాల క్రింద కాపుల ముందామని, "నదుల్ కలయాడెడి సంగమాలలో మాపులు దాటవేత" మని ప్రియురాలికి ఆహ్వానం పలుకు తున్నాడు. ఇందలి "సంగమాలలో" అను మాట స్త్రీ పురుష సంగమాన్ని సూచిస్తుంది.

వర్షర్తువును వర్ణించే "వానలలోన..." అను పద్యంలో, వర్షంలో నిలువెల్ల తడిసిన స్త్రీని వర్ణించినాడు-

**వానలలోన క్రొంజలువ వాగులలో వడగళ్లలో పసం**
**దైన పయంటయున్, పిరుదునంటిన చీరయు నాని పోవ రా**
**వే ననకన్నె! కొంకున చలించెను నీ తనువల్లి యెల్ల, శ్రీ**
**తానిల ధారలో వలువ లారగ బెట్టుము నా భుజాలపై**

తడిసిన చీరను తన భుజాలపై వేసి చల్లగాలికి ఆర బెట్టుమన్న మాట ఆమె నగ్న సౌందర్యాన్ని భావింప జేస్తుంది.

చుక్కలు, చెంగలువ, చంద్రుడు, వెన్నెల వాతా వరణాన్ని శృంగారాత్మకంగా చిత్రిస్తూ, కవి, శరదృతు శోభను వర్ణించినాడు. "చుక్కలు దాటి చెంగలువ సుందరి నొక్కగ చక్క వచ్చినా డక్కుముదామనోహరుడు" చంద్రో దయం వల్ల కలువ వికసించటాన్ని ఆధారంగా చేసికొని చంద్రున్ని "కుముదామనోహరు"డని చెంగలువను సుందరి యని, ఆమె నానందింపజేయటానికి చుక్కల లోకం దాటి ఇంత దూరం వచ్చినాడని చెప్పినాడు.

సంభోగశృంగార భావాత్మకంగా కవి, హేమంతాన్ని వర్ణించినాడు. చలి భరింపలేక ప్రియురాలిని కుడి 'రజాయి' కప్పుకోవటం 'ప్రియాధర మారగించ'టం, నిరం తరం చెలినే జపించటం మొదలైన విషయాలను చెప్పి నాడు.

**చలిచలి, చాలి చాలని 'రజాయి'ని కప్పుక కన్ను**
**మూసి, ని**
**ద్రలు వడబోసి, స్వప్నములు త్రావి, ప్రియాధర**
**మారగించి ఆ**
**కలి దిగబెట్టివత్తును, జగత్తును మొత్తము 'మెత్త' క్రిందనే**
**నలిపి చెలీ! చెలీ! యనుచు నాలుక దప్పిగొనన్**
**జపించనా!**

"ఆకులు రాలిపోయె..." నన్ను పద్యంలో కవి, శిశిర ఋతువును వర్ణించినాడు. శిశిరంలో చెట్లన్ని ఆకులను రాల్చి వేయటాన్ని ప్రకృతి కాంత చీరలు జారిపోయినట్టుగా చెప్పి నగ్న సుందరి రూపాన్ని భావింపజేస్తున్నాడు. "కటి పోకముళ్లు విడలాగెద" నన్ను మాట సంభోగ శృంగార భావాన్ని సూచిస్తుంది-

'జైల్లో' అను ఖండికలో గ్రీష్మ కాలపు ఎండలు వర్ణింపబడినాయి. జైల్లో ఉండగా వచ్చిన ఎండాకాలాన్ని కవి వర్ణిస్తున్నాడు.

**ఇది నిదాఘము, ఇందు సహింపరాని**
**వేడి యేడ్పించుచున్నది ; పాడువడిన**
**గోడలందున జైలులో పాడినాడ**
**వాడిపోనున్న పూమొగ్గ పైని పాట**

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

ఎండల తీవ్రత, ప్రకృతి, కవి మనోభావాలు ఈ ఖండికలో చిత్రింపబడినాయి. వాగుల్లోని నీటి తుంపరలో 'కాలంపు కన్నె' స్నాన మాడిందో, "రసోద్యాన వాటి వలువ విచ్చి నృత్యాలను సలిపెనేమొ" అనే ఊహలో శృంగార భావం వ్యక్తం చేయబడింది.

వర్షఋతువును నాలుగు పద్యాల్లో 'వానలు' అను ఖండికలో కవి వర్ణించినాడు. ఎండలు తగ్గి వానలు వచ్చి నాయని, "సన్నజాజి పూమొగ్గలపై తుషారములు, సోకి నాయని మెరపుతీగను స్త్రీగా భావిస్తూ, తనను వరింప వచ్చిందంటున్నాడు - "పొంగిన బంగరు చన్నుదోయితో డిగ్గె విహాయసమ్మును తటిన్నటి నన్ వరియించు కోసమై" వసంతర్తువు లోని మామిడి పూతలు, కోకిల లేవని ఆ అందాలన్ని వానల్లో వరదలై పోయినాయని వసంత శోభనే స్మరిస్తున్నాడు. మబ్బుల నుండి వర్షధారలు భూతలం మీద ప్రవేశించినాయని, మెరుపు తీగలు ఆకాశంలో నిండి ఉన్నాయంటున్నాడు. భూమి వేడిని వర్షజలం తాగివేసిం దని చెప్పి వడగళ్లు పడటాన్ని, మెరపుల విన్యాసాన్ని దాశరథి సమాస భూయిష్ఠ రచన ద్వారా వర్ణిస్తున్నాడు -

**గుటగుట త్రాగివేసె చినుకుల్ భువి క్రక్కిన వేడినెల్ల, ఆ**
**రటపడి మ్రగ్గి పోవు ఉదరమ్ములు చల్లవడెన్; తటిన్నటీ**
**కటక రటత్ సువర్ణ జయఘంటలు కింకిణికా ఝుళంఝుళో**
**త్కటమయి వీను సోకె వడగళ్లు పటాపటా నేలరాగలన్**
**(వానలు)**

'చంద్రోదయాన్ని' వర్ణించటంలోను శృంగార భావాన్నే కవి వ్యక్తం చేసినాడు. పాలసముద్రం నుండి మీగడలు తిని "రేజవరాలి వరాల బుగ్గలన్ గిచ్చినవారుణాస్ర మొలి కించుచు" తూర్పు చంద్రుడుదయించినాడని వర్ణించి నాడు. ఋతువులు, ప్రకృతిని వర్ణించటంలో దాశరథి, ప్రధానంగా శృంగార రసభావాలనే వ్యక్తం చేసినాడు.

దాశరథి వ్రాసిన ఈ శృంగార రసాత్మక కవితలను గూర్చి, దేవులపల్లి రామానుజరావు ఈ కావ్యానికి వ్రాసిన 'తొలి పలుకు'లో ఈ విధంగా చెప్పినాడు -

"అగ్నిధారలతోనే దాశరథి కవితావిర్భావము జరుగ లేదు. దాశరథి రసికుడు గూడ. ప్రబంధ సంప్రదాయా లను కవి గారి కలము పరిపూర్ణముగా ఆకళించుకొన్నది.... ఇంతి, వాసంతి దాశరథికి అతి ప్రియమయైన కవితా వస్తువులు, ఉషస్సులో, చంద్రోదయములో, శరత్తులో, శిశిరములో అన్నింటా ఆయనకు అతివలే కన్నులకు కట్టుతారు.

## 2. బాహ్యదృష్టి : వీర రస భావం :

**మా నిజాము జన్మజన్మాల బూజు**
**ఈ ముసలి నక్కకు రాచరికంబు దక్కునే**
**నా తెలంగాణ కోటి రత్నాల వీణ**

మొదలైన వాక్యాలు దాశరథి నిజాం వ్యతిరేకోద్యమ లక్షణానికి, తెలంగాణం పట్ల గల అభిమానానికి నిదర్శ నాలు.

సంప్రదాయ కుటుంబంలో పుట్టిన దాశరథి ప్రారంభం నుండి నిజాం వ్యతిరేక పోరాటానికి స్పందించి కవితలు వ్రాయటం, స్వయంగా ఆఉద్యమంలో పాల్గొని అరెస్టయి జైలుపాలు కావటం దాశరథికి గల సామాజిక దృష్టిని స్పష్టం చేస్తుంది. దోపిడికి నిలయమైన ఈ సమాజాన్ని మార్చివేయవలసిన ఆవశ్యకతను దాశరథి తెలిపినాడు. దోపిడి సమాజంలో పేదవాని జీవితం నరక ప్రాయం. "ఎన్ని నాళ్ళీ నరకాల క్రుంగెదవు, లెమ్ము సమా జము మార్చివేయగా" అని నిరుపాధిజీవిని సంబోధిస్తు న్నాడు. జన్మనెత్తిన నీకు ఈ సమాజంలో పొందటానికి ఏమీలేదు కాబట్టి సమాజాన్ని వెంటనే మార్చ మంటున్నాడు. దాశరథి అంతరదృష్టిని, బాహ్యదృష్టిని తెలిపే శృంగార వీర రసభావ కవితల సంపుటి ఈ "అగ్నిధార".

❖❖❖

ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సదాశివపేట.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# సాహిత్యము - హాస్యము

- ఎస్. సరస్వతి, ఆంధ్రోపన్యాసకురాలు, టిఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (జి), బెజ్జంకి, తెలంగాణ.

"హితేన సహితం సాహిత్యం" అన్నారు ఆర్యులు. మనకుమేలు కలిగించేదే సాహిత్యము. అలాంటి సాహిత్యములో నవరసాలకు ప్రముఖ స్థానము కలదు. నవరస భరితము మానవ జీవితము. ఆస్వాదయోగ్యమైనది రసము. రసహీనమైన జీవితము వ్యర్థము. నవ్వును మన వారు "వికృతాకార వాగ్వేష చేష్టాదేర్కుతకాద్భవేత్ హాస్యోహాస స్థాయిభావ" అని నిర్వచించారు. అనగా వికృతమైన ఆకారము, భాష, చేష్టల ద్వారా హాస్యము జనిస్తుందని పెద్దలు చెబుతారు. ఈ హాస్యమును మనవారు శ్రేష్ఠానాం స్మిత హసితే మధ్యానాం విహసితా వహసితేచ, నీచానా మపహాసితం తథాతిహసితంచ షడ్భేదా:అని విభజించారు.

భారతములో ఋష్య శృంగుడి వృత్తాంతములో ఋష్య శృంగుడు తన తండ్రికి వేశ్యాపుత్రికను వర్ణించి చెప్పుటలో నన్నయ హాస్యమును పండించాడు.

**ఆ. వచ్చిపోయె వానివదనంబు వలన వె**
**ల్వడ సుగంధి మధురభాషితంబు**
**పొలుచు వినగ సమదపు స్కో కిలాలాప**
**చారు వగుచు హృదయ సమ్మదముగ**

భారతములోని శశిరేఖా పరిణయములో ఘటోత్కచుడు శశిరేఖను ఎత్తుకుపోయి, ఆమెకు బదులుగా ఆమె రూపంలో పెండ్లిపీటల మీద కూర్చొని లక్ష్మణ కుమారుని తన మాయలచే భయపెట్టడము పాఠకులను ఎంతో నవ్విస్తుంది.

శ్రీనాథ మహాకవి రాయలవారి చేత గండపెండేరము తొడిగించుకుని కనకాభిషేకము పొందినవాడు అలాంటి కవి తన జీవిత చరమాంకములో అనేక ఇబ్బందులకు గురి అవుతూ పల్నాటిసీమకు పోయి అక్కడి అనాగరికతను మోటు తనమును చూసి ఈ క్రింది పద్యము చెప్పెను.

**రసికుల కేలా పల్నా**
**డెనగెడ నారంభయైన నేకులో వడకున్**
**వసుదేవుడైన దున్నును**
**కుసుమాయుధుడైన జొన్నకూడే కుడుచున్**

పల్నాడులో జీవించుట నాగరికులకు కష్టము అక్కడ రంభయైన యేకులే వడకవలెను.రాజైన వ్యవసాయము చేయాలి. మన్మథుడైన జొన్నన్నమే తినాలి.

తిరుమల రాయడు ఒకనాడు తన ఆశ్రయములో ఉన్న కవిని తనపై పద్యము చెప్పుమని అడిగాడట. ఆ రాజుకి ఒక కన్నుగ్రుడ్డి ఆ విషయమునే కవి చమత్కారముగా ఈ పద్యము అల్లెను.

**అన్నాతిని గూడ హరుడవు**
**అన్నాతిని గూడకున్న నసురగురుడవౌ**
**దన్నా తిరుమల రాయా**
**కన్నొకటి దక్కెగాని కౌరవపతివే**

ఓ తిరుమల రాయా నీవు నీ భార్యతో ఉన్నపుడు శివుడివే. భార్యతో లేనప్పుడు సాక్షాత్తు ఆ రాక్షసుల గురువు శుక్రాచార్యునివే. భగవంతుని దయవల్ల ఒక కన్ను ఉంది. కాని అదిలేకపోతే నీవు ధృతరాష్ట్రుడవే. ఈ విధంగా పైకి స్తుతి కన్పించినా నీవు గ్రుడ్డివాడవు అనే నింద ఈ పద్యములో కలదు.

జానపద సాహిత్యములో "ఊర్మిళాదేవి నిద్ర"లో శాంత, సీత మధ్య సంభాషణము మనకు నవ్వు తెప్పిస్తుంది.

**శాంతమ్మ :** కుందనపు ప్రతిమ కళలూ ఈ కళ లెందుండి దాగున్నవో, దృష్టి తగలకుండనూ, నీలాల నివ్వాళు లివ్వరమ్మా అని ఊర్మిళను దెప్పిపొడవగా

**సీతమ్మ :** ఇంద్రాది చంద్రులాను వలపించు చంద్రులూ మీ తమ్ములూ, దృష్టి తగలకుండాను నీలాల

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

నివ్వాళు లివ్వరమ్మా అని దెప్పి పొడవగా

**శాంతమ్మ:** అటువంటి మా తమ్ములనే వలపించిన మీరు సామాన్యులా అని మరల దెప్పిపొడిచెను

**సీతమ్మ :** ఝటితి స్ఫూర్తితో నీవు మాత్రము సామాన్యురాలవా

ఏమి యెరుగని తపసినీ (ఋష్య శృంగుని) వో వదినె

కెళించి విడిచినావు.

లక్ష్మీపార్వతులకు జరిగిన సంవాదము చక్కని హాస్యమును పోషించును.

**లక్ష్మీ :** గౌరీదేవి నీ శంభుని గళమున నలుపేమిటే ఓ యమ్మ-నలుపేమిటే ఓ యమ్మా

**పార్వతి :** నారీమణి నీ విష్ణుదేవుడు నలుపుగాదటే కొమ్మా - నలుపుగాదటే కొమ్మ

**లక్ష్మీ :** బిదుదు లేక నీ కాంతుడు జగములో బిక్ష మెత్తుటేమమ్మా-బిక్షమెత్తుటేమమ్మా

**పార్వతి :** బలము లేకను బలి చక్రవర్తిని అడుగలేదటే కొమ్మా-అడగలేదటే కొమ్మా

**లక్ష్మీ :** శంక లేకను శంకరు కరమున జింకయుండ టేమమ్మా-జింక యుండుటేమమ్మా

**పార్వతి :** శంకలేక వనవాసము కేగుట జింక కొరకు సుమి కొమ్మా-జింక కొరకు సుమి కొమ్మ

జానపద సాహిత్యములో ఒక మరుదలు వదినెనెట్లా ఎగతాళి చేయుచున్నదో చూడండి.

వదినెకు వగదర బిందెకు బిగదర
బంగారు జడకుచ్చుల మా వదిన
గొడపొంటి రెండు నల్లులె పారితే
ఉలవాలంటాది మా వదినె బుక్కుతనంటాది మా వదినె
నరాల పొంటి రెండు తేళ్ళు పారితే
సేవాలంటది మా వదినె తింటానంటాది మా వదినె
దులాల పొంటి పాములు పారితే
కడియాలంటాది మా వదినె పెట్టుకుంటానంటాది మా వదినె
శక్కెర బుక్కి దొడ్ల వంటే చీమలు కుట్టినవా వదినె
అన్నం తినక అఙ్ఞిల బంటే అన్నయ్య కొట్టిండా వదిన

ఒకసారి పెద్దమ్మకు చిన్నమ్మకు తమలో ఎవరు అందంగా ఉన్నారనే సందేహము కలిగింది. దానిని తీర్చుకొనుటకు వారు బ్రహ్మ దేవుని దగ్గరకు వెళ్ళి అడుగగా శివుని దగ్గరకు వెళ్ళమంటాడు. శివుడు విష్ణువు వద్దకు పంపుతాడు. విష్ణువు ఆ సందేహన్ని తాను తీర్చలేనని చెప్పగా వారు వెళ్ళిపోవుచుండగా వారికి నారదుడు ఎదురవుతాడు. నారదుడు ఏమి జరిగిందని అడుగగా వారు తమలో ఎవరు అందంగా ఉన్నారో తీర్పు చెప్పమంటారు. అప్పుడు నారదుడు మీ సందేహము తీర్చడము నావల్ల కాదు. కాని భూలోకములో రత్నాకరుడనే వైశ్యుడు ఉన్నాడు మీ సందేహమును అతడు తీర్చగల్గుతాడు. అనగా వారు అతని దగ్గరికి వెళ్తారు. ఆ కోమటి ఒకరు అందంగా ఉన్నారని చెబితే మరొకరికి కోపం వస్తుంది. అని ఆలోచించి మీరు అలా నడుస్తూ ఉండండి. అప్పుడే నేను చెప్పగలను అంటాడు. వారు అలా కొద్దిసేపు నడిచి అడుగగా ఆ కోమటి పెద్దమ్మ బయటకు వెళ్ళేటప్పుడు అందగా ఉంది. చిన్నమ్మ లోపలికి వచ్చేటప్పుడు అందంగా కన్పిస్తుంది. అని సమయస్ఫూర్తితో చెప్పాడు.

### ముగింపు :

ఈ విధముగా మన సాహిత్యంలో హాస్య రసమును పోషించే ఘట్టములు చాలా కలవు. అవి చదువుతున్నపుడు పరిపూర్ణముగా నవ్వుకుని మానసిక ఆనందమును, ఆరోగ్యమును కూడా మనము పొందవచ్చును.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# చిటికె సాహిత్యం - నవరసాలు

- శ్యామ్ సుందర్

చిటికె ప్రక్రియ అనే మాట తెలుగు సాహిత్యంలో కొత్తది.దీన్ని తెలుగు సాహిత్యమ్లో ప్రవేశ పెట్టిన ఘనత గణపతి సచ్చిదానంద స్వామిజీకి దక్కింది.పలువురు పండితులు చిటికె సాహిత్యాకిని స్వామిజీయే ఆధ్యుడని పేర్కొనడమ్ ఇందుకు నిదర్శనం.

"ఈ ప్రక్రియను తెలుగు భాషలో మొదటిసారి ప్రవేశపెడుతున్న మార్గదర్శి మహర్షి స్వామివారే"

**(రామరాజు .జి.నవ్య పుట. XIVI)**

చిటికె సాహిత్యంపై కన్నడ ప్రభావం తెలుగు వ్మాయి సాహిత్య ప్రక్రియ బాహుళ్యంలో ఎన్నోరకాల ప్రక్రియలు ప్రాచీనకాలం నుండి నేటి ఆధునిక కాలంవరకు విశాల పరిధిలో చోటుచేసుకుంటున్నాయి.అందుకు కారణం తెలుగులో ఏ ప్రక్రియ వెలువడిన ఆ ప్రక్రియకు అంత ప్రచుర్యం ఉండటం వలనే అని చెప్పుకోవాలి.

ఆధునిక తెలుగుకవిత్వంలో కాలనుగుణంగా వచ్చిన రూపపరమైన కవితాప్రక్రియలలో చిటికె సాహిత్యం ఒకటి. చిటికెలు దేశ విదేశాలలో ఉన్న మన పిల్లలు,మన సంస్కృతికి దూరమ్ కాకుడదనే సదాశయంతో కూర్చిన అక్షరపుష్పాలు అని డా..ఎస్.గోపి అనగా,రచయిత బుద్ధిలో పూచిన అక్షర పుష్పాలే ఈ చితికెలని ఆచార్య కె.మలయం వాసిని గారు(జోడి) ప్రశంసించారు.అయితే వీరన్నట్లు ఇవి తెలుగు కవిత్వంలో మాత్రమే వచ్చినవి కావు.

రసం : కవి తన వర్ణన ప్రతిభ భావాలతో ఒక %feeling% ను క్రియేట్ చేస్తాడు.అదే భావన పాఠకునిలో కలిగితే దాని సారమే రసం.పాఠకునిపై స్థిరపరమైనటు వంటి ప్రభావాన్నిచేపించే రసం దాని స్థాయిభావమే రసం.

**శృంగార** : నాయిక నాయకుల మనసులు జనించేది శృంగార రసం దీని స్థాయి భావం రతి చిటికె కవిత్వం శృంగార రసం గూర్చి ఇలా అంటాడు.

**హరిదాసు లెక్కడన్న కలిలో**
**కాంతదాసులు ఎక్కువన్న ఇలలో**
**ఆంజనేయ దాసులకన్న కాంచన దాసులు ఎక్కువ**

**- నవ కవిత్వం 634-169**

అంటు ఈ నాటి కాలంలోని మానవత్వం మమతాను రాగాలు లేని నేటి మనుషులు విచ్చలవిడి శ్రుంగారన్ని గూర్చి కవి వివరిస్తాడు.

**హాస్యం** : ఒక సన్ని వేషంలోని చేష్టలను కామెడి అంటారు. హాస్యం దీని స్థాయి భావం హాసం, చిటికె కవిత్వంలో స్వామీజి హాస్యంను గూర్చి ఇలా అంటాడు.

**తండ్రి ఆస్తులు ఇవ్వలేదని**
**చదువు సంధ్యలు నేర్పలేదని**
**దుఃఖమెందుకు షుగరు వ్యాధిని**
**ఇచ్చినాడుగా! సచ్చిదానంద.**

**- నవ్య కవిత్వం 362.**

అని పై కవిత్వంలో కవి హస్యరసాన్ని పండించాడు. నాడు షుగర్ వ్యాధి ఎక్కువగా సమీపిస్తున్న కాలంలో హాస్యరసాన్ని చమత్కారంగా నడిపించాడు.

**కరుణ** : కరుణ అనగా దీనాతి దినముగా వేడుకొనుట దుఃఖించుట.దీని స్థాయి భావం శోకం.చిటికె కవిత్వంలో గణపతి సచ్చిదానంద స్వామిజి కరుణ రసాన్ని గూర్చి ఇలా అంటాడు.

**శోకించకు శోకించకు**
**ధైర్యము నశిస్తుంది**
**జ్ఞానమంత నశిస్తుంది**
**సమస్తము నశిస్తుంది**

దుఃఖించడం వలన ధైర్యం కోల్పోతారని దానిత్జోనం సమస్తం సశిస్తుందని ఏ ఆపదలు సంభవించిన శోకించ కూడదు అని వివరిస్తాడు.

**ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సదాశివపేట.**

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

**అద్భుతం :** సమాజంలో ఏదైన ఆశ్చర్యాన్ని గొల్పె వింత విషయాన్ని చూసి ఆశ్చర్యపోవడం అద్భుతం. దీని స్థాయి భావం విస్మయం. దీని గురించి కవి ఇలా అంటాడు.

**మూడు అడుగుల స్థలమిచ్చిన పుడమి ఇది**
**సురుల కొరకు ఎముకలిచ్చిన**
**మునిని కన్న వసుధ ఇది**

నవ్యపుట : - **297-1081**

అంటూ మస్త భారతావనిలోని ఒక్కొక్కరి గూర్చి ఒక్కొక్క అద్భుత గాథలు ఉన్నాయంటూ ప్రబోధిస్తాడు.

**భయానకం :** భయానక రసం అనగా ఒక సంఘ టనను చూచి భయపడటం దీని స్థాయి భావం భయం. ఈ రసానిక అన్నారు. నంగ కవి ఇలా అంటాడు.

**రైటు రైటును చూనుచూ కండక్టర్ అనగానే**
**కార్పోరేట్ బస్సు ప్రయాణం అగుచుండు**
**కాలం పయనం కలిసి రాకున్నా**
**ఊరికి టిక్కెటు ఉన్న వాడైనా**
**అమరాపురికే చేరు సచ్చిదానంద**

నవ్యపుట : - **254-78**

అంటూ నేటి కార్పోరేట్ బస్సులు స్పీడ్‌గా ప్రయాణించే అనేక యాక్సిడెంట్లతో రోడ్లపై భయానకం సృష్టిస్తున్న తీరును కవి చమత్కరించిన తీరు కనిపిస్తుంది.

**వీరం :** వీర రసం అనగా ఒక విషయం పట్ల ఉల్లా సంగా వీరత్వం చూపడం. దీని స్థాయి భావం ఉత్సాహం. దీనికి సంబంధించి కవి ఇలా అంటాడు.

**అఖండ చైతన్య మఖండ సృష్టి అమితాశ్చర్యము కల్గునురా**
**మాటరాక మూగవోయి నీ సృష్టిని చూచితిరా**
**ఏమని పొగుడును ఏమని చెప్పుదు అనంతమైన సృష్టిక్రమము**
**సద్గురుదత్తుడు ! సచ్చిదానందుడు అద్భుత సృష్టిని తెలుపునురా**

నవ్యపుట : - **83-29**

**భీభత్సవం :** చూడగానే మనస్సుకు అద్భుతంగా కని పించి ఏవగింపును కలిగించడం. దీని స్థాయిభావం జుగుప్సా దీనిని కవి ఇలా అంటాడు.

**జుట్టు చూస్తే విగ్గు**
**ముఖం చూస్తే బొగ్గు**
**పొద్దెప్పుడు నిగ్గు**
**రావెప్పుడు సిగ్గు**
**ఆఫ్ చొక్కాలునూ**
**ఆఫ్ లాగులూను**
**ఇవేమి ఫ్యాషన్స్**
**ఇదేమి కల్చరో ! సచ్చిదానంద**

- నవ్యపుట : - **200-61**

అని నేటి కాలంలోని యువత వేష హావ భావాలను చూచిన కవి విస్మయం చెందాడు.

**శాంతం :** శాంతరసం అనగా ఎన్ని కష్టాలు వచ్చినా ఆగాధములు ఎదురైన చెదరని దృఢసంకల్పం కల్గిన మనస్సు. దీని స్థాయి భావం శాంతంగా పేర్కొన్నారు. దీనిని గురించి కని ఇలా అంటాడు.

**నేను శాంతికి సంకేతాన్ని**
**నింగికి ఎగిరిన పావురాన్ని**
**జీవులారా ! విజ్ఞానులారా !**
**మీరు చేయాల్సినది ఒక్కటే**
**నింగికి ఎగిరే నన్ను ఎప్పుడూ**
**పుడమిపై పడవేయవద్దు**
**స్వేచ్ఛనెప్పుడు అమ్మవద్దు**
**శాంతిగా ఉండి శాంతిని పంచు.**

- నవ్యపుట : - **156-585**

అంటూ శాంతికి సంకేతంగా పావురాన్ని చూపిస్తూనే ప్రపంచ శాంతికై ప్రతి ఒక్క పౌరుడు, ప్రతి ఒక్క దేశం బాధ్యతాయుతంగా హింస లేకుండా అహింసా తత్వంతో నడుచుకోవాలని శాంతి చిహ్నంగా పావురాన్ని చూపిస్తూ ఐక్యరాజ్య సమితిని సూత్రాలను ప్రపంచ శాంతికోసం ప్రబోధించిన తీరు కనిపిస్తుంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

**ముగింపు :**

ఈ విధంగా "చిటికె సాహిత్యం నవరసాలు" అనే పరిశోదన పత్రంలో నవరసాలకు సంబంధించిన చిటికె కవితంను ఊటకింపు నా పరిశోధన పత్రం ఒక వీహంగ వీక్షణగా పరిశీలించాను.

**ఆధార గ్రంథాలు :**


1. అరుణ కుమారి, జి.(1989) "ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాదం విభిన్న దోరణులు"
2. గణపతి సచ్చిదానంద స్వామిజీ (2006) నవ్యయుగానికి నవ్యకవిత (చిటెకె సాహిత్యం)రాగరాణిని ట్రస్టు. శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రయం మైసూరు - 25
3. చెన్నకేశవులు పోతిరెడ్డి (2000) స్వాతంత్ర్యనంతరం తెలుగు కవిత్వంలో సంఘసంస్కరణ, విశాలాంధ్ర, నవోదయ
4. డాక్టర్ డి. శ్యామ్‌సుందర్ (2007) నవయుగానికి నవ్యకవిత్వం సామాజిక వివేచన, ఎంఫిల్ సిద్ధాంత వ్యాసం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం - గచ్చిబౌలి.


❖ ❖ ❖

# హాస్యరస చిత్రీకరణలో వేమన్న వివేచన

– డా. యస్.పి. కృష్ణవేణి, అర్ధశాస్త్ర అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, తెలంగాణ.

## వేమన్న పరిచయం :

ప్రగతిశీలుడైన ప్రజాకవి వేమన్న. ఇతనిపేరు వినని వారుగానీ, ఇతని పద్యములు చదువని అక్షరాస్యులుగానీ లేరని చెప్పుటలో అతిశయోక్తిలేదు. ఈ మహానుభావుడు ఉత్తమ సంఘసంస్కర్తగా, నీత్యుపదేశకుడుగా, కారణ విమర్శకుడుగా, మానవతావాదిగా, పెక్కు రూపములతో మనకు గోచరించును. వేమన్న వీరశైవమత వాతావరణములో పుట్టి, సంసార సుఖదుఃఖములన్నియు నను భవించీ, రసవాద సంబంధమువలన శివయోగల సహ రాసముతో విరక్తుడై, హఠయోగమును సాధిమచి, ఆ తర్వాత రాజయోగియై హరిహరాదిసగుణోపాసకుడై, బ్రహ్మసాయుజ్య రూపమగు అద్వైతానందము నను భవించి జీవన్ముక్తుడైనట్లు వేమన్నను గూర్చి వ్రాసిన సర్వశ్రీ వంగూరి, రాళ్ళపల్లి మి॥ కవులు ఊహించిరి.

మొట్టమొదట పాశ్చాత్య పండితుడైన 'బ్రౌను' మహాశయుడు వేమన్నలోని సంస్కారభావములను గుర్తించి, అనేక పద్యములను ఆంగ్లములోనికి అనువాదించి, పాశ్చాత్య పండితులకు పరిచయము చేసెను. మేజర్ మ్యాక్ డొనాల్డ్, క్యాంబెల్ మొదలగువారు కూడా ఈ మహావ్యక్తిని ప్రజాకవిగా పరిగణించి, కొన్ని రచనలు చేసిరి. తర్వత విమర్శక శేఖరుడైన డా॥ కట్టనుంచి 'కవిత్తత్వ విచార' మను తన గ్రంథములో వేమన్న గొప్పతనమును గూర్చి వర్ణించి చెప్పెను వేమన్న నీతికవిగానే కాకుండా వేదాంతకవిగా కూడా మిక్కిలి పేరు పొందెను. పల్లెలలో వేమన్న వేదాంతముని చెప్పుకొనుచుండుట విందుము. భావైక్యమును, సామన్య లక్షణచ్చాయులు వేనిలో కని పించిననూ అవి వేమన్న పద్యములనీ నిశ్చయించ వచ్చును.

వేమన్న తొలుత విషయాసక్తుడై, వేశ్యాలోలుడై భోగియై కాలము గడిపెననీ, పిదప విరక్తుడై యోగి యయ్యెననీ కొందరి తలంపు. ఇతని పద్యాలలో కొన్ని యోగమార్గ ప్రతిపాదకములున్నవి. కానీ యోగాభ్యాసాదులను నిరసించు పద్యాలు కూడా ఉన్నవి. తాను యోగినని ఇతడు చెప్పుకొనలేదు. తాకికములయెడ విరక్తుడని మాత్రము నిశ్చయింపవచ్చును.

## వేమన రచనా క్రమాణిక :

వేమన పద్యములు శతకవాఙ్మయమునకు చెందినవి. శతకములలో పద్యము చివరనో, చివరి పాదము పూర్తిగానో మకుటముగా ఉండుట తెలుగువారి సంప్రదాయము. వేమన పద్యములకు ఆటవెలదులలో నాల్గవ చరణము ''విశ్వదాభిరామ వినురవేమ'' అనురీతి నుండుట వలన వీనిని శతకములలో చేర్చించుండ వచ్చును. సామాన్యముగా శతకములలో నూరు పద్యాలే ఉండును. వేమన పద్యాలలో వేలకొలది కానవచ్చు చున్నవి. వీనిలో ఆటవెలదులతోపాటు తేటగీతులు, కందములు, సీసములు, మత్తకోకిలలు, ఇతరములు కూడా కానవచ్చుచున్నవి. ఏ విషయమునైనను చక్కని ఉదాహరణముతో కుండ బ్రద్దలు కొట్టినట్లు నిర్భీతిగా చెప్పు టయే వేమనకు సమ్మతము. చెత్తను చేర్చి కుప్ప పోయుట అతనికి కిట్టదు.

**"నిక్కమైన మంచి నీలమొక్కటె చాలు**
**తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల?**
**చదువ పద్య మరయ జాలదా యొక్కటి"**

అని ఘంటాపథముగా చెప్పినవాడు.

వేమన్న రచనలలో వివిధ పద్ధతులను అనుసరించి సులభగ్రాహ్యమైన అర్ధ, తాత్పర్యాలతో, ఉదాహరణలతో రచించారు. ఈ పద్ధతులలో ప్రధానంగా మూర్ఖపద్ధతి,

ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సదాశివపేట.

దాంబిక, విద్వత్, అర్థ, దుర్జన, సజ్జన, దైవ, కర్మ, ధైర్య, మోహ, యోగి, బ్రహ్మస్వరుప గురుభక్తి, ప్రపంచస్వభావ, జీవన్ముక్తి, ఫలశృతి, మొదలైనవి ప్రధాన రచనా పద్ధతులు.

## దుర్జన పద్ధతిలో వేమన్న హాస్యరస ప్రదర్శన :

ఈ పద్ధతిలో వేమన్న సాధారణ జనావళికి నప్పేరీతిలో పద్యాలనుకూర్చి చక్కటి లోకవ్యవహారికాన్ని వివరించారు.

1. " రేగు పుచ్చుకాయ రేయెల్ల దన్నిన
   మురగ దంతకంత పెరుగుగాని
   ఒరులు ఛీయన్నను నోగు సిగ్గెఱుగునా " వి. వే.

తా॥ నీచమైన రేగుపుచ్చకాయను తన్నిన అది పెరుగునేకాని మురగదు అలానే ఎన్ని తిట్టినను నీచునకు సిగ్గుండదు అని వివరించినారు.

2. "కలువ పూలవంటి కన్నులుండిననేమి?
   చిలుక పలుకులట్లు పలుకనేమి?
   తెలివి బలిమి గలిగి తేజరిల్లిననేమి?
   తులువ గామి నలరు నెలత వేమ.

తా॥ చక్కటి కన్నులు కల్గి ఆందముగానున్నను, చిలుకవలె ఇంపుగా పలికిననూ, తెలివితేటలున్ననూ స్త్రీ యోగ్యురాలుగా ఉన్నపుడే రాణించును లేనిచో హీనురాలే యగును.

3. " కల్లు కుండకెన్ని ఘనభూషణములిడ్డ
   అందులోని కంపు చిందులిడదె?
   తులువపదవి గొన్న దొలిగుననేమగు?"

తా॥ నీచునకు ఉన్నతపదవినిచ్చినను వాని చెడ్డ గుణముపోదు. కల్లుకుండ నెట్లలంకరించిననూ, లోని కల్లు కంపు పోదు.

## ముర్ఖపద్దతిలో వేమన్న హాస్యరస ప్రదర్శన :

**ఎలుకతోలు తెచ్చి ఎన్నాళ్ళు ఉతికిన**
**నలుపు నలుపేగాని తెలుపుకాదు**
**కొయ్యబొమ్మదెచ్చి కొట్టినా పలుకునా? వి.వే.**

తా॥ ఎలుక తోలును ఎన్నాళ్ళు ఉతికినను దాని నలుపు పోయి తెలుపు రాదు. కొయ్యబొమ్మను ఎంతకొట్టిన అది పలుకదు. అట్లే ముర్ఖునకెంత చెప్పినను బోధపడదు.

**పొట్లకాయ రాయి పొదుగ ద్రాటను గెట్ట**
**లీలతోడ వంక లేక పెరుగు**
**కుక్కతోక గట్ట గుదురునా చక్కగా? వి.వే.**

తా॥ పొట్లకాయ వంకరలు లేక తిన్నగా పెరుగుటకు త్రాటితో రాయి కట్టుదురు. కుక్కతోకను అట్లు కట్టినను అది తిన్నగా ఉండదు. మూర్ఖుడును అట్లె తిన్నబడడు.

ఈ విధంగా వేమన్న తన రచనా కౌశలంతో సామాన్యుని జీవన వైచిత్ర్యాన్ని చక్కగా చిత్రికరించారు.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# పి.వి.సునీల్ కుమార్ "దెయ్యం 2" కథ - హాస్యం.

- డా. బభిన్ని శ్రీహరి, తెలుగు అధ్యాపకులు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు, కృష్ణా జిల్లా.

నవరసాలలో హాస్యానికి చాలా ప్రముఖమైన స్థానం ఉన్నది. సమాజ ఉద్ధరణకు పూనుకొన్న కందుకూరి వీరేలింగం పంతులు, గురజాడ అప్పారావు వంటి మహనీయులు కూడా వారి రచనల్లో హాస్యాన్ని సందర్భానుచితంగా వాడి పాఠకుల మదిలో చెరగని ముద్రను వేశారు. గురజాడ వారి "కన్యాశుల్కం" నాటకంలో గిరీశం పాత్ర సంభాషణల్లో. భమిడపాటి కామేశ్వరరావు గారి "వద్దంటే పెళ్లి" నాటకంలో సానయ్య సంభాషణల్లో ఇలా చాలా రచనల్లో మన రచయితలు పాత్రల సంభాషణలు చాలా హస్యస్ఫోరకంగా ఉండడం మనకు తెలిసిన విషయమే.

ఇక్కడ రెండు ప్రయోజనాలు నెరవేరడం కనిపిస్తుంది. ఒకవేపు సమాజంలో ఉన్న ముఢాచారాల పట్ల, మూఢ నమ్మకాల పట్ల ప్రజలను చైతన్యవంతం చేయడం, మరో వైపు హాస్యం ద్వారా పాఠకులకు ఉల్లాసాన్ని కలిగించడం అన్నది జరుగుతుంది. ఎప్పుడైతే రచయిత ఒక సందేశాన్ని పాఠకుడికి ఇస్తున్నప్పుడు ఆ సందేశం పాఠకుడికి బలంగా చేరాలనుకొన్నప్పుడు ఇటువంటి హాస్యాన్ని ఉపయోగిస్తే మరింత సమర్ధవంతంగా ఆ సందేశం ప్రజలకు చేరుతుందన్న విషయాన్ని గురజాడ వంటి వారు ఆనాడే గుర్తించారు.

ఆధునిక కాలంలో దాదాపుగా అన్ని ప్రక్రియల్లో హాస్యానికి ప్రముఖ స్థానం ఇవ్వడం మనం చూస్తున్నాం. ముఖ్యంగా కథా సాహిత్యంలో ఎక్కువగా హాస్య సంబంధమైన కథలు పూర్వం వచ్చాయి, ఇప్పుడు కూడా వస్తున్నాయి. కథ నిడివి తక్కువగా ఉండడం, చెప్పేది సూటిగా, స్పష్టంగా ఉండడం వలన కథలలో ఎక్కువగా ఇటువంటి హాస్య సంబంధ కథలు వస్తున్నాయి. అటువంటి హాస్య కథలలో నేను నా ప్రస్తుత వ్యాసంలో పి.వి. సినీల్ కుమార్ గారి "దెయ్యం2" కథలోని హాస్యాన్ని, అదే విధంగా ఆ కథలో అంతర్లీనంగా కనిపించే సామాజిక సమస్యను నేను ఈ వ్యాసంలో చర్చించదలచుకొన్నాను.

రచయిత పి.వి.సునీల్ కుమార్ గారు పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడిలో పుట్టారు. పెనుగొండలో పెరిగారు. తణుకు, విశాఖపట్నం, హైదరబాద్‌లలో ఆయన విద్యాభ్యాసం జరిగింది. వీరి మాతామహులు ఆంగ్ల భాషా పండితులు, ప్రధానోపాధ్యాయులు. రచయిత చిన్నతనంలోనే షేక్స్పియర్ రచనలు చదివారు. వీరి తల్లి గారు దయామని గారు. ఈమె తెలుగు సాహిత్య అభిమాని. శరత్, చలం రచనలు ఈమె ఎక్కువగా చదివేవారు. ఈ విధంగా ఈయనకు తెలుగు , ఆంగ్లం రచనలపై అభిరుచి ఏర్పడింది.

ఈయన వృతి రీత్యా ఐ.పి.ఎస్ ఆఫీసర్. కడప జిల్లా ఈయన ఫాక్ష్యనిజానికి వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు చేసి, ఒక సమర్ధవంతమైన పోలీస్ అధికారిగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకొన్నారు. ఒకపైపు ఉద్యోగ నిర్వహణలో తీరికలేకున్నా ఆయన పుస్తక పఠనం అపలేదు. ఈయన స్వయంగా 50 కథలు, 3 నవలలు వ్రాయడం జరిగింది. ఈయన ప్రతీ రచన పాఠకుడిని ఆలోచించే విధంగా ఉంటుంది. ఒక మంచి రచన చవివానన్న ఆనందం పాఠకుడిలో కలిగేలా రచనలు చేయడంలో ఈయన దిట్ట. సినీల్ కుమార్ డిల్లీ తెలుగు అకాడడమీ పురస్కారం, తానా పురస్కారం అందుకొన్నారు.

## "దెయ్యం 2" కథ - సారాంశం :

ఈ కథలో యువరాజు అన్న యువకుడు, దెయ్యం రెండే పాత్రలు. యువరాజు గ్రామం తెలంగాణాలోని ఒక మారుమూల పల్లెటూరు. యువరాజు పెద్దగా చదువుకోలేదు. రచయిత చెప్పినట్లుగా "అక్షరాస్యత మాత్రమే ఉండి చదవడం రాయడం మరచిపోయిన

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

చాలామంది తెలుగు వాళ్లలానే అతడికి భాష అంటే బస్సెక్కడానికి, కావాల్సింది కనుక్కోవడానికి ఒక సాధనం" అంటాడు. ఆయనకు తండ్రిలేడు,చనిపోతాడు. తల్లీ, అక్క ఉంటారు. వారిని పోషించాలసిన బాధ్యత యువ రాజు మీద ఉంటుంది. తండ్రి చనిపోతూ ఏదో ఆస్తి ఇచ్చినట్లుగా సేటు దగ్గర తను చేసిన బాకీ తాలూకు అప్పు ఇచ్చాడు. దీనితో యువరాజుకు కష్టాలు రెట్టింపొయ్యాయి.

యువరాజు పెద్దగా చదువుకోలేదు కాబట్టి సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేద్దామని హైదరబాద్‌లో ఒక సెక్యూరిటీ సూపర్ వైజర్‌ను కలుస్తాడు. అతడు యువరాజు సర్టిఫికెట్స్ తీసుకొని అతడిని హైదరబాద్ చివర్ల పరిగి దగ్గర జనసంచారం తక్కువగా ఉన్న ఒక ఏ.టి,యం దగ్గర డ్యూటీ కేటాయిస్తాడు. అతడికి డ్రస్ , టోపీ ఇతర వస్తువులు ఇస్తూ నెలకు 5000 జీతం, సెలవు పెడితే జీతం తగ్గిస్తామని చెపుతాడు. యువరాజు సరేనని వాటిని తీసుకొని ఆ ఏటియమ్ దగ్గరకి వెళతాడు.

ఆ రాత్రి అక్కడ డ్యూటీ చేసి ఉదయనే ఒక చిన్న రూమ్ అద్దెకు తీసుకొందామని బయలు దేరాడు. తనకు వస్తున్న ఆ 5000 జీతంలోనే తను నెల మొత్తం తిని, అద్దెకట్టాలి. అదే డబ్బుతో ఇంటికి అమ్మకు పంపాలి, సేటు దగ్గర ఉన్న అప్పు నెలనెలా కొద్ది కొద్దిగా తీర్చాలి. ఈ కష్టాలు వల్ల జీవితం మీద ఒక తీవ్రమైన నైరాశ్యం యువరాజులో కలిగింది. మొదటి రోజు డ్యూటీ తర్వాత తను ఉండడానికి అద్దెకు చిన్న గది వెదకడానికి బయలు దేరాడు.

యువరాజుకు ఒక పెద్ద ఇంటిలో ఒక రూమ్ అద్దెకు ఇవ్వబడునని ఉంది. అక్కడకు వెళ్ళి ఇక్కడ ఉన్న ఇస్త్రీ బండి వాడిని అడిగితే ఈ ఇంటిలో చాలా కాలం నుండి ఎవరూ లేరని చెపుతారు. యువరాజు మెట్ల క్రింద చిన్న గది అయినా అద్దెకు ఇవ్వరా అనుకొన్నారు. ఇస్త్రీ ఆయన ఈ ఇంటి తాళం అతని బంధువుల వద్ద ఉందని అడ్రస్ ఇస్తాడు. ప్రక్కన ఉన్న వారు ఈ ఇంట్లో దిగుతావా అని ఆశ్చర్యకరంగా చూస్తారు. యువరాజు అవి పట్టించుకోకుండా ఆ ఇంటి ఆయన దగ్గరకు వెళతాడు, ఆయన ఆ ఇంటిలో చిన్న గదిని చాలా తక్కువ అద్దెకు యువ రాజుకు అద్దెకు ఇస్తాడు.

యువరాజు ఆ గదిని శుభ్రంగా తుడుచుకొని ఆ ఇంటి పరిసరాలను కూడా శుభ్రం చేస్తాడు. ఆ రోజు అన్నం వండుకుని తిని పడుకొంటాడు. రోజు పనిలో అలసి పోవడం వలన రోజూ తినగానే నిద్రపోయేవాడు. ఒక వారం గడుస్తుంది. ఈ లోగా ఒక రోజు రాత్రి ఫేన్ దానికదే తిరగడం ఆగిపోయింది. లేటు కూడా వెలిగి ఆరిపోతున్నవి. ఫేన్ వేగంగా తిరుగుతూ ఉంది. ఈ సమయంలో ఒక స్త్రీ నవ్వుతూ ఇతని ముందుకు వచ్చింది.

యువరాజు ఉల్లిక్కిపడ్డాడు. ఆ దెయ్యం యువరాజు చంపేస్తానన్నది. కానీ యువరాజులో ఏ కొసవైన భయము లేదు. చెంపేస్తానంటే చంపయే అంటాడు. అతడిలో ధైర్యానికి ఆశ్చర్యపోతుంది. అనేక రకాలుగా భయపెడుతుంది. కానీ యువరాజు తను పడే ఆర్థిక కష్టాల ముందు ఇవి ఏమూలాలకు సరిపోవావనుకొంటాడు. అతడిని హెచ్చరిస్తూ రేపటిలోగా ఇక్కడ నుండి వెళ్లి పోమంటుంది.

మర్నాడు వస్తుంది అదే విధంగా యువరాజులో భయం ఏ మూలా కనపడదు. పైగా నన్ను చంపెయ్ నేను పాలసీ తీసుకొన్నాను, నా వాళ్ళకు డబ్బులు ఈ విధంగా అయినా సాయం చేసినవాడిని అవుతాను అనేసరికి దెయ్య, నివ్వెరపోతుంది. చివరకు యువ రాజును భయపెట్టి అక్కడనుండి పంపాలనుకొన్న దెయ్యి తానే అక్కడ నుండి వెళ్ళి పోవాలనుకొంటుంది. ఈ విషయం యువరాజుతో చెపుతుంది నువ్వు వెళ్ళిన మరుక్షణం ఈ ఇంటి మీద జనం పడతాడు, అప్పుడు నాకు ఈ గదికి కూగా అద్దె ఇవ్వరు అనుకొంటాడు.

చివరకు దెయ్యం యువరాజును చూడకుండా ఉండలేను అంటుంది. యువరాజు నేను ఎలా మనిషిని పెళ్లి చేసుకోలేను కాబట్టి నీలాంటి దెయాన్ని పెళ్లిచేసుకొంటే

ఏ గొడవ ఉండదు అనుకొంటాడు. అప్పుడు దెయ్యం ఇప్పుడున్న ఉన్న మనుషుల చేస్తున్న కాపురాలు కంటే మన కాపురం చాలా బాగుంటుంది అంటూ ఇప్పుడున్న సమాజంలో పగలు రాత్రి ఉద్యోగాలు చేస్తున్న భార్యా భర్తల గురించి చెపుతుంది. ఈ విధంగా యువరాజుతో మనుషులే మాలా దెయ్యాలుగా మరారని చెపుతుంది. తర్వాత దెయ్యం, యువరాజు ఆ ఇంటి నుండి వెళ్లలేదు. అంతటితో కథ ముగుస్తుంది.

### "దెయ్యం" కథ హాస్యం - విశ్లేషణ :

ఎన్నో చందమామ కథల్లో కథా వస్తువయిన ''దెయ్యం'' పాత్ర ద్వారా ఈ దెయ్యం కథలో రచయిత హాస్యాన్ని పండించాడు. రచయిత దెయ్యానికి యువరాజు మధ్య సంభాషణలు చాలా హాస్యపూరితంగా రచించారు. సాధారణంగా సమాజంలో దెయ్యం అంటే భయడతారు, కానీ అటువంటి దెయ్యంతో యువరాజు ఎంత హాస్యాన్ని కలిగించడో మనకు ఈ కథలో సంభాషణాల్లో కనిపిస్తుంది.

యువరాజుకు మొదటి సరిగా దెయ్యం కనపడి నప్పుడు తలుపులు కొట్టి, క0చాలను నెలకెసికొట్టి పెద్ద భీభత్సం చేస్తుంది. యువరాజు కనిపించి అతడిని చంపేస్తానంతుంది. అప్పుడు యువరాజు దెయ్యంతో ''అది తెలుస్తూనే ఉంది కానీ చంపే భాగ్యానికి ఈ అల్లా రంతా ఎందుకు?'' అంటాడు. మరలా దెయ్యం ఏంట్రా అంటే ''చంపదలచుకొంటే నేను పడుకొన్నాకా నిద్రలో చంపొచ్చు కదా. ఈ లైటు పాడు చేయడాలు, ఆ ఫాను తిప్పడాలు ఎందుకు? పైగా ఎంగిలి కంచం ఎత్తి పడేసి నావు. ఆ ఎంగిలంతా ఎవడు ఎత్తుతాడు నీ బాబు'' అంటాడు.

దానితో దెయ్యానికి దిమ్మతిరిగిపోతుంది. సాధా రణంగా మనిషి తనను చూడగానే వనికిపోతారు. కానీ ఇతడు ఈ విధంగా మాట్లాడేసరికి ఆశ్చర్యపోతుంది. పైగా అతడు ఏ ఎల్లమన్నో, పుల్లమన్నో చూసినట్లుగా చూడడం ఆమె ఇగోను దెబ్బతీసింది. మరలా దెయ్యం యువ రాజును హెచ్చరిస్తుంది.

దెయ్యం ''రేయ్...... ఎవడ్రా నువ్వు? నేనేమన్నా పది రూపాయల టిక్కెట్టుతో రెండు గంటలు కనపడే సినిమా దెయ్యాన్ననుకొన్నావా? మామూలు గాలిననుకున్నావా? దెయ్యానిరా.....నిజం దయ్యాన్ని.......నీ కాళ్ళు వణకడం లేదురా?.అంటుంది. దానికి యువరాజు ''సినిమా అయితే పైసలు పెట్టి టిక్కెటు కొంటాం కాబట్టి భయపడాలి. లేకపోతే డబ్బు బొక్క ఫ్రీగా కనపడుతున్నావు. నేనెందుకు భయపడాలి? నువ్వు గాలివే నాకు కాళ్ళు పీకుతున్నాయ్. కానీ వణుకత లేదు. అన్నాడు.

మరలా దెయ్యం ''ఇది నేను గాబట్టి తట్టు కొంటున్నా.. అదే ఇంకో దయ్యమయితే అవమానంతో చచ్చిపోయేది అంటుంది. దానికి యువరాజు ''నీకు నిజంగానే మైండ్ పోయింది. నువ్వు ఆల్రెడీ చచ్చినందుకనే దెయ్య మయినావు. మళ్ళా చచ్చుడేంది....... ఎట్ల చస్తావు. సరే చావు. నాకేం బోయింది'' అన్నాడు యువరాజు.

దానికి దెయ్యం చంపుతారా నిన్ను అంటుంది. దానికి యువరాజు''అరే..... చంపేదయితే జల్దీ చంపరాదు.......ఈ మాట, ముచ్చతెంది... పురాగా చంపేడుంటే రేపురా. చంపేడిది లేకుంటే నేను కాసేపు పండత'' అంటాడు. దెయ్యం రేపు చంపుత......... ఈ లోగా ఏమన్నా తావీజు కట్టించుకొంటావా? అంటే యువరాజు '' ఆయాన్నీ పని జేసెదిడుంటే ఈ ఇల్లు ఎందుకు ఇడిసిపెడతరు? మళ్ళా దానికి డబ్బులు బొక్క ఇహ నువ్వు బోతే నేను పండు కొంట. అన్నాడు. నిరాశగా దెయ్యం వెళ్లిపోతుంది.

ఒక దెయ్యంతో సామాన్య మానవుడు ఈ విధంగా మాట్లాడడం దెయ్యనికి చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మరలా మర్నాడు వచ్చినా దెయ్యానికి ఇంకా ఆశ్చర్య పోయేలా సమాధానం చెపుతాడు యువరాజు.

దెయ్యం '' ఏరా... అకల్మందొ్క ఇషారా కాఫీ హై... అది కూడా తెలీదా దేడ్ దిమాక్..........ఇంటికి ఉరికిపోక వపసొచ్చినావ్'' అంది. దానికి యువరాజు ''నిన్న చక్కగా చూడలే కానీ... చాలా అందంగా వున్నావ్'' అన్నాడు. దెయ్యం సిగ్గుపడుతుంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

ఈ రోజు చావడానికి సిద్దామా? అటుంది.

ఆ... డబుల్ రడీ నిన్న చంపితే కొంచెం ఇబ్బందే అన్నాడు.

దెయ్యం ఆశ్చర్యంగా చూసింది. దానికి యువరాజు "ఎంలే......నిన్న చస్తే మా అమ్మ చెల్లి ఏం దినొటోల్లు........ నేను పైసలు పంపాల తినాల. ఇయాల ఇన్సూరెన్స్ దీసుకొన్న బీస్'లాక్ ......ఇరవై లక్షలు ఇస్తరు మా అమ్మకి నేను జస్తే.....చంపు" అంటాడు.

దానికి దెయ్యం " వెథవా.. లత్తుకోర్ .. నేనేమన్నా దెయ్యమనుకొన్నావా లేక మనిషిననుకొన్నావా డబ్బులు కోసం చంపడం. చావడం మనుషులు చేసే పనులు...... నేను చంపను పో? ఆమె చాలా చిరాకు పడుతుంది.

దానికి యువరాజు "నువ్వు గుస్సా చెయ్యకు .... మనిషన్నాక మాటమీద ఉండాలే...... నువ్వు కూడా ఒకప్పుడు మనిషివే కదా... మనిషికున్న పాటి నీతి దయ్యానికి లేకపోతే ఎలా? చంపుతానని, ఇయాల చంపనని మాట మరుస్తే దయ్యాల ఇజ్జత్ మూసిలో కలవదా ? అన్నాడు. దానికి దెయ్యం "నేను చంపనురా" అంటుంది. దానికి యువరాజు కోపం వచ్చి "నాకు నేను చస్తే పైసలు రావు. అయినా నీ మాట నమ్మి బోలెడు పైసలు బెట్టి ఇన్సూరెన్స్ కొన్న..... చావని కాడికి ఎందుకా ఖర్చు....... అనవసరంగా పైసలు బరాబాద్ జెయించినావ్" అన్నాడు అన్నాడు.

ఈ విధంగా వారం రోజులు గడిచేసరికి దెయ్యం దిగులు ఎక్కువ అయ్యింది. యువరాజు భయపడడం అటుంచి రోజూ తనను చంపేయ్యమని వేపుకు తిన డంతో అతడిని చూసి ఆమె భయపడే పరిస్థితి వచ్చింది. కానీ అతడిని రోజూ కలవడం , మాట్లాడడం చేయకుండా ఉండలేకపోతుంది. చివరకు ఆమెను చూసి యువరాజు జాలిపడతాడు. అప్పుడు దెయ్యం ఆ ఇంటినుండి వెళ్లిపోతాననడం, యువరాజు వద్దని వారించి దెయ్యాన్ని పెళ్లి చేసుకొంటాననడం మనకు కథలో జరుగుతుంది.

ఈ విధంగా రచయిత సునీల్ కుమార్ ఈ కథలో యువరాజు, దెయ్యం పాత్రల మధ్య అద్భుతమైన హాస్యాన్నిపుట్టించి పాఠక లోకానికి మనోల్లాసాన్ని కలి గించాడు. పాఠకుడు దెయ్యం కథ అనుకొని కథ చదవడం ప్రారంభిస్తే యువరాజు దెయ్యం మధ్య సంభాషణలు వచ్చేసరికి రచయిత కడుపుచెక్కలయ్యే హాస్యాన్ని జోడించి మంచి వినోదాన్ని అందిస్తాడు.

ఇక్కడ గమనించవలసిన అంశం మరొకటి ఉన్నది. ఈ కథలో హాస్యంతో పాటు అంతర్లీనంగా ఒక పేద యువకుడు కష్టాల కడలిలో ఈదుతూ బాధపడుతున్న ప్పుడు అతడికి ఉన్న ఆర్థిక ఇబ్బందుల వల్ల జీవితమే నరకమైనప్పుడు అంతకన్నా ప్రమాదకమైనది ఏది లేదని భావిస్తాడు. అందుకే దెయ్యానికి కూడా భయపలేదు.

నేడు ఇదే సారాంశాన్ని రచయిత యువరాజు పాత్ర ద్వారా చెపుతూ దెయ్యం చంపుతానన్నప్పుడు దెయ్యంతో " మా పంతులు జెప్పేటోడు. ఆయనెవరో అన్నడంట కదా...మనదీ ఓ జిందగేనా కుక్కల్లెక్క, నక్కల్లెక్కా, గల్లీల పందులెక్క అని....అసుంటి బతుకు నాది. బతికి రోజూ చచ్చుడేనాయే. గంజుంటుందా, గంజిలో ఉల్లి గడ్డ ఉం టుందా అని...... చచ్చినంత మాత్రన్న పోయేడిదేమున్నది". అంటాడు. ఈ సంభాషణాల్లో పేదరికం వల్ల జీవితం మీద విరక్తి కలిగిన ఇక పేద యువకిని వేదన కనిపిస్తుంది.

కథ చివర్లో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధా లుగా ఎలా మారాయో దెయ్యం పాత్ర ద్వారా చెప్పిస్తూ మనం పెళ్లి చేసుకోవడం తప్పుకాదని "అసలు ఈ మధ్య ఇద్దరు మనుషులు చేస్తున్న కాపురాల కన్నా మన కాపురం చాలా బాగుంటుంది తెలుసునా? భార్య ఇండియాలో ఉంటే భర్త దుబాయిలోనో అమెరికాలోనో ఉంటున్నాడు. ఇద్దరూ నెట్'లో చాటింగూ, వీడియో కాలింగుల్లో కాపురం చేస్తున్నారు... అంటే నాలాంటి దయ్యాలు రెండు మాట్లాడుకొంటునట్లు. అది కూడా రోజూ కాదు. మొగుడూ పెండ్లాము ఆఫీసులకి పోయి అలసిపోయి వచ్చి ఒకరితో ఒకరు కాకుండా టీవీలోని నీడల్లో కాలక్షేపం చేస్తున్నారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

అది కాకపోతే ఫేస్ బుక్కని అదని ఇదనీ ఇవీ నీడలే.. నీడల్తో కాపురం చేస్తున్నారు.. వాళ్ళతో పోలిస్తే మనం కలిసి గడిపే సమయం. దానికి మనమిచ్చే విలువ చాలా ఎక్కువ అంది" అంది.

ఇక్కడ దెయ్యం మాటల్లో నేడు సమాజంలో ప్రజల జీవన విధానం ఏవిధంగా ఉందో తెలుస్తుంది. సామాజిక మాధ్యమాల ప్రభావంతో సంబంధాలు నేడు ఎలా ఉన్నాయో కూడా మనకు రచయిత ఇక్కడ చెపుతున్నారు. ఈ విధంగా ఈ కథలో హాస్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినా, నేటి సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలించి నేటి సమాజపోకడను కూడా ఈ కథలో రచయిత చాలా సమర్థవతంగా చెప్పాడని అన వచ్చు. ఈ విధంగా సుశీల్ కుమార్ ఒక బాధ్యతాయుత మైన పోలీస్ ఉన్నతాధికారిగా ఉంటూ తన విధి నిర్వ హణలో తీరికలేకున్నా తన వృత్తి ద్వారానే కాదు తన సాహిత్యం ద్వారా సమాజాన్ని ఉద్ధరించి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. రచయిత నేటి సమాకాలిన సామాజిక సమస్యల మీద స్పందిస్తూ రాయడంవలన ఈయన కథలు ప్రజలను ఆలోచింపచింప చేసే విధంగా ఉన్నా యని చెప్పవచ్చు.

## సంప్రదింపు గ్రంథాలు:

పి.వి. సునీల్ కుమార్ - నీలవేణి కథా సంపుటి.- నవచేతన పబ్లిషింగ్ హౌస్. హైదరబాద్ 2016.

❖❖❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# ఆంధ్ర మహాభారతము - శాంతరస పోషణ

- పూషడపు సుబ్బారావు, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, అవనిగడ్డ, కృష్ణా జిల్లా.

అజరామరమైన భారతీయ సాహిత్యం యొక్క దివ్య గుణాలలో రసప్రతిష్ట ఒకటి. విశ్వంలో మొదటిగా నాట్యశాస్త్రాన్ని సృజించిన భరతుడు తన 37 అధ్యాయాల గ్రంథంలో 6వ అధ్యాయమందు రసము గురించి చర్చిం చాడు. సహృదయుని మనోపద్మంలోని మకరందమే రసము. మానవుణ్ణి అలౌకిక ఆనంద జగత్తు అంచులకు తీసుకువెళ్ళి తిప్పి తేగలిగిన దివ్య విహంగము రసము. ఇవి "8" అని తొలిగా భరతుడు ప్రతిపాదిస్తూ "రసహీన మైన ఏ అర్థమూ ప్రవర్తించి నిలబడదు" అని స్పష్టం చేశాడు. శాంతమును ఒక రసంగా ఆయన అంగీకరించ లేదు. ఆపై వచ్చిన భట్టలోల్లటుడు, శ్రీశంకుకుడు, భట్ట నాయకుని వంటి ఆలంకారికులు భరతుని అనుసరిం చారు. ఈ అష్టరస సిద్ధాంతానికి ఉద్భటుడు తన కావ్యా లంకార సంగ్రహంలో శాంతరసాన్ని జోడించి పరిపూర్ణం చేశాడు. దీనిని దశరూపకకర్త ధనంజయుడు, దీనికి "ప్రభ" అను వ్యాఖ్యానం వ్రాసిన ధనికుడూ అంగీకరించ లేదు. ఇందరి రౌద్రరసాన్ని అవలోకించి ఎట్టకేలకు శాంత మొక రసంగా కవి మానస కేదారాలను తడిపి నవకావ్య సస్యాలను మొలకెత్తించింది. చతుష్షష్టి కళలలో లలితకళా విభాగం ఎలా ఉందో, అలాగే నవరసాలలో 4 కోమల రసాలని 4 ఉద్ధతరసాలని అద్భుత రసాన్ని ఉభయ గుణాత్మకమని ఆలంకారికులు నిర్ణయించారు. నాటి నుండి నేటి వరకూ శృంగారం రసరాజంగా వర్ధిల్లుతున్నది. భవభూతికి కరుణ ఒక్కటే రసమనిపించింది. ఏది ఏమైననూ పరాశరాత్మజుడైన వ్యాసమహర్షి శాంతరసాన్ని అంగిరసంగా మహాభారతాన్ని వెలయించడంలో, కరుణ రసప్రాధాన్యత గల రామాయణానికి అది సరిజోడు కావడంతో లోకమంతటా శాంతరసకీర్తి పాదుగొల్పబడింది. ఈ నవరసాలకు స్థాయీభావాలు నిర్ణయించబడ్డాయి. "శమము" శాంతరసానికి స్థాయీ భావం అనగా ఆత్మజ్ఞానమని అర్థం. శృంగార, హాస్యాది రసాలకూ శాంతము ప్రాతిపదిక. వ్యాస భారతమునకు స్వేచ్ఛాను వాదమైన తెనుగు భారతంలో కవిత్రయం వారు శాంత రసాన్ని సందర్భోచితంగా పోషించారు.

విరటుని కొలువులో కీచకుని దుర్వర్తనను సహించలేక విజృంభించబోయిన భీముణ్ణి ధర్మరాజు వారించాడు. కొన్నాళ్ళకు భీముడు ప్రశాంతచిత్తుడై ఇలా అంతర్మధనం పొందాడు. తన కోప ప్రదర్శనం వలన గుట్టు బయట పడకుండా ధర్మనందనుడు ఎలా అడ్డగించినదీ తెలుసు కున్నాడు.

**కీచకుడట్లు మీదు పరికింపగ తన్ను బరాభవింపగా**
**జూచి మహోగ్రకోప వివశుండగు నన్ను జూచి ధైర్యహే**
**మాచలుడైన ధర్మసుతు డమ్మెయి వారణసేయకున్న నే**
**నీచత వాని మత్స్యవిభుని బరివారము నుగ్గు సేసినన్**
**(విరాట. ద్వితీయ-179)**

ధర్మరాజు వశీకృత చిత్తము కలవాడు. మెత్తని పులి అని తిక్కన మహాకవి వర్ణించడమేగాక ధర్మజుని నోటి వెంట విషమ పరిస్థితులను కూడా చక్కదిద్ది, కార్చిచ్చు మీద కూడా కుంభవృష్టి కురిపించు శాంతి వచనములను ఇలా ఎన్నింటినో పలికించాడు. దుర్యోధనుని ఘోషయాత్ర పరాభవం తరువాత ధర్మరాజు అతడికెంత మెత్తగా బుద్ధి చెప్పాడో, తమకెన్నో అవమానములు చేయబూనిన శత్రువు చేతికి చిక్కినా ఎలా హితము చెప్పి పంపినాడో, ప్రబంధ పరమేశ్వరుడు, శంభుదాసుడైన ఎఱ్ఱన ఇలా వర్ణించాడు. చేసిన ఘనకార్యములు చాలు వీటిని మనస్సులో పెట్టు కోవద్దు, బుద్ధిగా ఇళ్ళకు వెళ్ళండని పలికించాడు.

**ఎన్నడు నిట్టి సాహసము లింకనొనర్పకు మయ్య, దుర్జనుం**
**డన్నన సాహస క్రియలందు గడంగి నశించు గావునం**

**గ్రన్నన తమ్ములన్ దొరలగైకొని యిమ్ముల బొమ్ము వీటికిన్**
**సన్నుత! దీని కొండొక విషాదము బొందకుమీ మనంబునన్ (అరణ్య-పంచము-434)**

శ్రీకృష్ణుడు కురు సభలో పాండవుల పక్షాన రాయ బారిగా పోయి అక్కడి ధర్మాధర్మాను వర్తులందరికీ ఏక కాలంలో అర్థమయ్యేడట్లుగా ధర్మము, సత్యము - పాపము, బొంకుచే అణగద్రొక్కబడినప్పుడు దక్షులు, సమర్థులు ఉపేక్షించకుండా ధర్మం కాపాడాలి. వాళ్ళు ఊరకే ఉంటే వారితో పాటు అధర్మాన్ని కూడా నాశనం చేయడానికి దైవమే పూనుకుంటుంది అని ఎంత హితంగా హెచ్చరించాడో తిక్కన మహాకవి ఈ పద్యాలలో చెప్పాడు.

**సారపు ధర్మమున్ విమల సత్యము - బాపముచేత బొంకుచే**
**బారము బొందలేక చెడబాఱినదైన యవస్థ, దక్షులై**
**వ్వారులుపేక్ష చేసిరది వారలచేటగు, గాని ధర్మని**
**స్తారకమయ్యు, సత్య శుభదాయక మయ్యును దైవముండెడున్**

**(ఉద్యోగ-తృతీయ - 273)**

**"పాండవులకు తగిన పాలు మేదినింబంచి**
**యిచ్చుట కంటే గార్యమొద్ది కలదు?**
**ధర్మమెద్ధి? సముచితంబగు విధమెద్ధి?**
**శక్యమెద్ది చెపుడు వాక్యవిదులు"**

**(ఉద్యోగ - తృతీయ - 275)**

ఉపప్లావ్యములో నివశిస్తున్న పాండవుల దగ్గరకు దృతరాష్ట్రుని తరపున ఉభయుల శ్రేయస్సునూ కాంక్షించే సంజయుడు వచ్చి మీ కుశలమును సదాకోరుకునే ధృత రాష్ట్రుడు పంపగా తాను వచ్చానని చెప్పి, పాండవులకియ్య వలసిన రాజ్యభాగము సంగతిని ప్రస్తావించకుండా పోరు నష్టదాయకమని, దీని ద్వారా సంప్రాప్తించు నెత్తుటికూడు కన్నా భిక్ష ఎత్తి తెచ్చుకున్న భోజనము మేలని చెప్పిన పద్యమెంత అందంగా శాంతరస హృద్యంగా తిక్కన నడిపించారో చూడండి.

**పాలీక కౌరవులుదు**
**శ్శీలత చెడదలిచిరేని, జెప్పెద, రుధిరా**
**ఖిలాన్నంబున కంటెను**
**మేలగు భిక్షాన్నమైన వీ నడవడికిన్**

**(ఉద్యోగ-ప్రథమ-329)**

రాజదండము ప్రజలను రక్షించేందుకే గానీ పీడించ డానికి కాదని హెచ్చరిస్తూ పాలు పితికేవాడు ఎక్కువ పాలు గ్రహించాలని పొదుగును మాటి మాటికీ కొట్టి బాధించకుండా ఉపాయంగా పాలను పొందాలి. రాజు కూడా పన్నులు ప్రజాభీష్ఠంతోనే వసూలు చేసుకోవాలి ఈ విషయము.

## ముగింపు :

ఎంత గొప్ప కవి అయినా కేవలం కథనాశ్రయించి తన కావ్యాన్ని రజింపచెయ్యలేడు. అందుకు రసమావశ్యక మైన ముడిపదార్థము. విశ్వనాథ సత్యనారాయణగారు "ప్రాగ్విపశ్చిన్మతమున రసము వేయిరెట్లు గొప్పది నవ కథాదృతిని మించి" అని చెప్పినది అందుకే. తిక్కన మహా కవి ఆంధ్ర మహాభారతములో "ఆత్మసమ్మోదము పొంద కావ్యరసముంగొనియాడుచునుండు దెప్పుడున్" అంటూ రసానందము యొక్క ప్రాధాన్యతను వివరించారు. భీష్మునకు, ధర్మరాజుకు మధ్య సంవాదంగా సాగిన మహా భారత శాంతిపర్వం పురుషార్థాలను ప్రతిపాదించేదేగాక, సర్వకాల సర్వావస్థలలోనూ శాంతగుణము మనకు శ్రేయస్సును కలిగిస్తుందని చెప్పినది.

## ఆధారగ్రంథసూచి :

1. మహాభారత విమర్శనము - సరస్వతీపుత్ర శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు.
2. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతము.
3. నా స్వీయపరిశీలనలు.
4. ఆంధ్ర మహాభారతము - ఔపదేశిక ప్రతిపత్తి - డా॥ నందుల గోపాలకృష్ణమూర్తి - 1982 - మార్చి. ❖

ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సదాశివపేట.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# పి. యశోదా రెడ్డి కథలో నవరసాలు

– డా॥. ఎన్. సూర్యకాంతి, సహాయాచార్యులు, తెలుగు శాఖ, అరోరా డిగ్రీ & పి.జి. కళాశాల, చిక్కడపల్లి, హైదరాబాద్.

1960లలోనే పి. యశోదారెడ్డి. పాఠకులను కుచ్చుల సవారికచ్చెరంలో పరచి కూచోపెట్టి బిజినపల్లి తీసుకు వెళ్ళి అక్కడి చిత్రాలన్నీ తీరొక్కటిగా అచ్చమైన తెలంగాణ నుడికారంలో చెప్పారు కథ చెప్పడం వెన్నతో పెట్టిన విద్య అంటే అందులో అతిశయోక్తి అసలు లేదు. ఆమె తాను పుట్టి పెరిగిన మహబూబ్ నగర్ జిల్లా మాడలికంలో కథ మొదలు పెడితే ఉపమానాలు, సామెతలు, చమత్కా రాలు, అన్నీ కలుపుకుని పరిగెత్తే ఓ ప్రవాహమే అది అచ్చ మైన తెలంగాణా నుడికారంలో "మా ఊరిముచ్చట్లు" ఏచ్చమ్మ కథలు" వ్రాసిన ఎచ్చమ్మ (యశోదని అంటూ యశా అని పిలిచేవారట చిన్నప్పుడు తన పేరేమిటంటే ఎచ్చమ్మ అని చెప్పేదట యశోద, ఆ ఎచ్చమ్మే ఈ కథల్లో ఎచ్చమ్మ) తరువాత "పత్రికల" భాషలో "ధర్మశా" కథా సంపుటి ప్రచురించారు. యశోదారెడ్డి మంచి వక్త. బహుశా ఆ దారే రచనలో కూడా కనిపిస్తుంది.

ఉస్మానియా యూనివర్సిటీ నించి తెలుగు సాహి త్యంలో పిహెచ్‌డీ తో పాటు ఆలీగర్ యూనివర్సిటీ నించి డి.లీట్ కూడా అందుకున్న యశోదారెడ్డి, హిందీ ఉర్దూ కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు జర్మన్ భాషలో డిప్లొమా కూడా చేశారు. కోఠీ విమెన్స్ కాలేజిలో తెలుగు అధ్యాపకురాలిగా తరువాత ఉస్మానియా యూని వర్సిటీలో ఆచార్యులుగా పనిచేశారు. యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్ మెంబర్‌గా కేంద్ర సాహిత్య అకాడమీ మహావక్తగా అధికార భాషా సంఘం అధ్యక్షురాలిగా పదవులు సత్కారాలూ పొందారు.

మావూరి ముచ్చట్లులో పది కథలు. ఎచ్చమ్మ కథలులో ఇరవై, ధర్మశాలలో ఇరవై నాలుగు కథలు వున్నాయి. ఎచ్చమ్మ కథలూ మా ఊరి ముచ్చట్లు, తెలం గాణా గ్రామీణ నేపథ్యంలో మాండలిక గుబాళింపుతో వుండగా ధర్మశాలలోని కొన్ని కథలు తమ వార్తాపత్రికలో చదివిన సంఘటనలపై స్పందించి వ్రాసానని ఆమె వ్రాసుకున్నారు. మొత్తం యాభై కథల్లోనించీ కొన్నింటిని విశ్లేషించుకుని ఆమె శైలినీ శిల్పాన్ని, తాత్విక దృక్పథాన్ని తెలుసుకుందాం.

ఈ యాభై కథల్లోనూ మొదట నిలిచే కథ "గంగరేగి చెట్టు". ఇది కొంత ఆత్మ కథాత్మక కథ అనొచ్చు. పుట్టగానే తల్లిని పోగొట్టుకున్న ఎచ్చమ్మ మంచి నక్షత్రంలో పుట్ట లేదన్న పేరు పడి, తండ్రి కూడా ఆమెను దగ్గరుంచుకోక రుక్మిణమ్మ అనే ఆమెకు పెంచుకోమని ఇచ్చాడు. తరు వాత ఆయన మళ్ళీ వివాహం చేసుకున్నాడు. రుక్మిణమ్మ దగ్గర పెరిగుతున్న ఎచ్చెమ్మ మహబూబ్‌నగర్లో చదువు కుంటూ చూడచక్కగా అంతా తన తండ్రి పోలికలో వుంటుంది. తండ్రి ఆమెను పెంపకానికైతే ఇచ్చాడు గానీ అప్పుడప్పుడూ వెళ్ళి చూసుకొస్తూనే వుంటాడు ఆమెకు తొమ్మిదేళ్ళప్పుడు ఒకసారి అట్లా వెళ్ళినప్పుడు ఆ పిల్ల తన దగ్గరగా వస్తే ఆ పిల్ల అంతా తన పోలికేనని, కదిలి పోయాడు. ముద్దు చేశాడు. అంతకు ముందు ఆయన చెల్లెలు ముత్యాలమ్మ, తన కొడుక్కు ఆయన కూతుర్నివ్వ మనీ ఆట్లా సంబంధం కలుపుకుంటే పరుపూ ప్రతిష్టలు కల అన్న ఆండ తనకి వుంటుందనీ భర్త బిర్రు కాస్త సడలుతుందనీ అడుగుతూ వుంటుంది. అప్పుడు తన రెండో భార్య కూతురు నీలిని ఇస్తానంటాడు. ఎచ్చమ్మని చూసి మనసు కరిగిపోయిన తరువాత నీలిని కాదు ఎచ్చమ్మని ఇస్తానంటాడు మొదట్లో ముత్యాలమ్మకి ఎచ్చమ్మని అంతా నష్ట జాతకురాలనడం తండ్రి కూడా దగ్గరుంచుకోక పాలూమరు పంపడం గుర్తొచ్చి కాస్త సందే హించినా అన్నతో సంబంధం ముఖ్యం అనీ, నీలి కన్న ఎచ్చమ్మే బాగుంటుందనీ అసలు తనే ఆ పిల్లను తెచ్చి పెంచుకుంటే బాగుండేదనీ సర్ది చెప్పుకుని సరే నంటుంది

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

సంక్రాంతి పండక్కి నెల రోజుల ముందుగానే అన్న ఇంట్లో మకాంపెట్టి, వదిన మర్యాదలో పంచేసినా సహించుకుని వుంటుంది. అప్పుడు ఎచ్చమ్మని కూడా తీసుకుని రుక్మిణమ్మ కూడా వస్తుంది. ఎచ్చమ్మ రాకతో "బంతి పూలు పూసినట్టు, పచ్చతోరణాలు గట్టినట్టు, ఎన్నెల గాసినట్టు" ఆ యిల్లు కళకళలాడింది. తొమ్మిదేళ్ళ ఎచ్చమ్మ ఇంగ్లీషులో పద్యాలు అవీ చెప్పడం పిల్లలందర్నీ ఆకట్టు కోవం మేనత్త కొడుకు రఘునాథ రెడ్డి చూస్తాడు. అతనేమో ఉర్దూ మీడియంలో చదువుకుని వచ్చాడు. ఎట్లాగైనా ఆమె దగ్గర "అంగిరేజ్" నేర్చుకోవాలనుకున్నాడు. అయితే ఆ పిల్ల ఒక షరతు పెట్టింది. కాశిరెడ్డి పెరట్లో పెద్ద గంగ రేగు చెట్టుంది. సంక్రాంతి రోజుల్లో నిండా కాయలతో వుంది. ఆ గంగురేగు కాయలు కోసిస్తే అంగిరేజు నేర్పుతా నంటుంది. కానీ అక్కడో దయ్యం వుందని పిల్లల్ని పోని వ్వరు. అయినా గానీ సరే అన్నాడు ఆ పిల్లవాడు. మధ్యాహ్న భోజనాల వేళ వాళ్ళిద్దరూ గంగరేగు చెట్టు దగ్గరకు పోయి అక్కడ గోడ మీద కూచున్ని ఎచ్చమ్మ చదువుతుంటే అతను మళ్ళీ అని ఆమె చెప్పినవి వల్లె వేస్తున్నాడు. ఇది చూసిన పిల్లలు కొంతమంది పోయి. అతని తల్లి ముత్యా లమ్మకి ఎచ్చుక్క దగ్గర బావ అంగ్రీజు నేర్చుకుంటున్నాడని చెప్పారు. కొడుకు అంగ్రీజు నేర్చుకుంటున్నాడంటే ముందు సంతోషమైనా వెంటనే, రేపు తన కొడుకు "అదు పాజ్లలలో వుండవలసిన పోరి గురువాలె వాడికి అంగ్రీజు నేర్పడమేమిటని" కోపం వచ్చింది. అంగ్రీజు నేర్చుకోడం తరువాత ఇద్దరూ ఒడుపుగా చెట్టెక్కి కాయలు కోసుకుని తిన్నారు. మరి రఘునాథ రెడ్డయితే దిగాడు గానీ ఎచ్చెమ్మకు దిగరాలేదు. అతనే ఉపాయం చెప్పాడు. తను కింద వొంగి నిలబడితే, తన వీపు మీద ఆలకు పెట్టిదిగమన్నాడు. అట్లాగే దిగుతోంది. ఆ పిల్ల కొడుకుని వెతుక్కుంటూ వచ్చిన ముత్యాలమ్మ కంట తన కొడుకు "సల్వా" అంగి మీద కాలు పెట్టి దిగుతున్న పిల్ల" తిప్పికొడ్తే పదేండ్లు లేని ఈ పిల్ల ఇప్పట్నించే తన కొడుకుని కర్రె కుక్కను చేసి తిప్పుతుండది. దీనికి దీని సంబంధానికి ఒక దండం "అనేసి కొడుకుని తీసుకుని వెళ్ళిపోయింది. బాల్య వివాహమూ చదువుకు స్వస్తి మొదలైనవి తప్పి పోయిన ఆ పిల్ల ఏ ప్రొఫెసరో అయుండచ్చు.. మేనత్త దయ వల్ల.. ఇందులో మేనత్త పాత్రని ఆ నాటికి అత్యంత సహజంగా చూపించారు యశోదారెడ్డి... 'మ్యానరికం" అనే మరో కథ, మేనరికం పేరిట బాల్యం లోనే పిల్లల పెళ్ళిళ్ళు నిశ్చయం అవడాన్ని వ్యతిరేకించిన కథ. పల్లెలో పీర్ల పండుగ, హిందూ ముస్లింల మైత్రి, భంగుతాగి సన్యాసులెంటబడి ఆరునెలలు తిరిగి ఇంటికొచ్చి మళ్ళీ భార్యను చూసి ఆమెకు అంటుకుపోయిన జోగుళయ్య అప్పటి గ్రామీణ జీవితాన్ని కళ్ళకు కట్టిస్తారు.

మా వూరి ముచ్చట్లు అనే పెద్దకథలో ఆ వూరికి జాన పద కళలపై పరిశోధన కొచ్చిన యువతీయువకుల ఎదుట తమ కళల్ని ప్రదర్శించడానికి సిద్ధమౌతున్న వివిధ కళాకారుల్ని మనకి పరిచయం చేస్తూ పనిలో పనిగా అందు లోనే ఒక ప్రేమ కథను కూడా చెప్తారు. కురువల పెళ్ళి సంబరాలు చూడ్డానికి పోయి వాళ్ళ పెళ్ళి తంతుల్లో ఇరుక్కుపోయిన ఒక కాపింటి బిడ్డ అనుకోకుండా ఒక బ్రాహ్మణ యువకుడికి భార్య అయిపోవడం, ఆ ఇద్దర్నీ పెద్దలు అంగీకరించకపోతే, వాళ్ళు వెళ్ళిపోవడం ఒకర్ని విడిచి ఒకరు ఉండలేనంత ప్రేమ వాళ్ల మధ్య చివరికి వాళ్ళు ఈ జానపద సంఘంతో ఆవూరొచ్చినప్పుడు ఆమె వరుస చెల్లెలు ఆమెని తమ ఇంటికి పిలవడం కథ.. ఇందులో పల్లెల్లో దశరా పండగ సంబరాల్లో భాగంగా జమ్మి కొట్టేటప్పుడు ఊరి ఆసాముల సంభాషణల ద్వారా వారి మనస్తత్వాలు అద్దంలో లాగా కనపడతాయి. పర్సు బండ, బొక్కించే దక్కుడు రాజుగారి ఒకనాటి ప్రచారం కథలు అద్భుతమైన రాజకీయ వ్యంగాస్త్రాలు ఎలక్షన్లు రాబోయేముందు" రాంగ రాంగ నెలలు నిండి పురిటి దినాలు దగ్గర పడ్డట్లు ఎన్నికలు రేపోమాపో ఇవే నాల్గు రాళ్ళు రాలంగ రెండురాళ్ళు వెనకేసుకునే దినాలు పల్లె ఒళ్ళువిరుచుకుని లేచి ఉత్సాహం పుంజుకునే వైనం.

ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సదాశివపేట.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

అప్పటి పల్లెల్లో కొందరు దొరసాండ్ల కెంత అసూయ పొగరు వుండేవో ఎన్ని కుటిల బుద్ధులుండెవో "కాలం చెప్పిన తీర్పు' కథలో పాపవ్వ దొరసాని ఉదాహరణ మంచి దొరసాండ్లకు "సంజ" కథలో దొరసాని ఉదాహరణ ఎచ్చమ్మ "కోరి చేసుకుంటినమ్మ కోతి శివుణ్ణి" అని ఏరికోరి ఒక వన్నెల మొగోడు చిత్రకారుణ్ణి పెళ్ళి చేసుకుంది వాళ్ళు చెమడోడ్చి ఒక ఇల్లు కట్టుకున్నారు దాని పేరు సుధర్మ. అదొక బొమ్మల కొలువు. అంతా బాగానే వుంది కానీ ఆ ఇంటిచుట్టూ బస్తీ రొద పెరిగింది. ఆక్కడొక చెత్తకుండీ వెలిసింది. ఆ చెత్తకుండీలో చిత్తుకాగితాలేరు కునే వాళ్లు మొదలయ్యారు అప్పుడీ కుండీ ఖాళీ చేసి మున్సిపాలిటీ మనిషి చిత్తుకాయితాల వాళ్లని రూపాయ కట్టి కాయితాలు ఏరుకోమని ఆర్డరేశాడు. ఆ రూపాయి కట్టలేని వాడొకడు కుండీలో దిగి కూచుని కాగితాలు మూటగట్టుకుని బయట కుక్కల్ని బెదరగొట్టడానికి తనూ కుక్కలాగా అరుస్తాడు. ఒకావిడ సీసాపెంకులు తెచ్చి కుండీలోపోయగా అతని తలకు వంటికి గాయాలై నెత్తురోడుతూ బయటికొచ్చాడు. ఈ కథని యశోదారెడ్డి వ్రాసిన తీరు ఒక కెమెరా పట్టుకుని ఆ వీధిని అందులో పొద్దుటి నించీ సాయంత్రం దాకా నడిచి వెళ్ళే రకరకాల మనుషుల్నీ, వాహనాల్నీ క్లోజప్ షాట్లు తీసి అంతా కలిపి ఒక షార్ట్‌ఫిల్మ్ చేస్తే ఎలా వుంటుందో అలా వుంటుంది. ఒకప్పుడు మారియో మిరండా అనే చిత్రకారుడు ఒక బొమ్మ వేస్తే అతి చిన్న వివరాన్ని కూడా వదిలే వాడు కాడు అలా వుంటుంది యశోదారెడ్డి కథనం పెళ్ళి తంతుల్ని గురించి చెప్పినా ఉయ్యాల వేడుక గురించి చెప్పినా ప్రయాణానికి కుచ్చరం బండి తయారుచెయ్యడం గురించి చెప్పినా, ఉయ్యాల వేడుక గురించి చెప్పినా ప్రయాణానికి కచ్చరం బండి తయారుచెయ్యడం గురించి చెప్పినా బండికి ఏ ఎద్దుల్ని కట్టాలో అందులో ఎలాంటి మెత్తలు పరవాలో, ఏమేమి అలంకారాలు చెయ్యాలో ఏ ఒక్క వివరమూ వదలదు ఆమె ఆమె కథలన్నీ కథా చిత్రాలే, ఆమె భాషలోనే చెప్పాలంటే 'పూరాగా చిత్తారి దించినట్లు'' వుంటాయి. మనుషుల పట్ల ప్రేమ కథల్నిండా పరుచుకుని వుంటుంది. శాంత గంభీరమైన కథలు ఆమెవి.

ఇక ఉపమానాలైతే ఏరుకోవాలి గానీ ఎక్కడంటే అక్కడ దొరుకుతాయి అవి శ్రమ పడి వెతికి తెచ్చి అతికించినవి కావు. అలా అశువుగా పాళీలోంచి సిరా ప్రవహించినంత సహజంగా ప్రవహిస్తాయి సామెతలూ అంతే" ఆ రెండూ నావి" అనే కథలో ముసలి ఎలమందని గురించి'' ఆకు రాలిన సెట్టులె దురమాగిన పండోలె పండువారిన ఆకోలె. పీసువారిన బీరకాయోలో. వొట్టి వోయిన సెర్వోలె. రెక్కలూడిన పక్షోలె వున్న ఎలమంద, పసినిమ్మ పండోలె పచ్చని సిగురోలె దొరకాయోలో దానిమ్మపూవులె రెక్కలొచ్చిన చిల్కోలె పులిబెదురు తాకని జింకపిల్లోలె కొబ్బరిగిన్నోలే వున్న మన్మరాలిని వెంట బెట్టుకుని'' ఇటువంటి ఉపమానాలు కథల్నిండా వుంటాయి ఇంక బీర పువ్వులన్నా చిలకపచ్చ చీరెలన్నా చాలా ఇష్టం ఆమెకు.

మోనా అనే కథలో ఇతివృత్తం పాతదే అయినా ఆ కథ మొదట్లో ఆమె వరదను వర్ణించిన తీరు అద్భుతం. మొగులు చిల్లివోయినట్టు ముంతన గుమ్మరించినట్లు మిన్నూ మన్నూ కలిసి ఏకంకవాడికినట్లు ఏకసిస్తుగవాన. వొర్రెలు. వొంపులు, కాల్వలు, మడుగులు, కుంటలు, చెర్లు ఏర్లు నదులు అన్నీ నీళ్లు నిండంగ పిక్కటిల్లి గండ్లుపడి, కట్టెలు దెంపుకొని ఏకమై ఒడ్లెక్కి అలుగులు దుంకి చిన్నా పెద్దా తారతమ్యాలుడిగి మిర్రు, పల్లాలు ఒకటై వొంపులు దీరి, ఈసురోసాలు ఇడ్సిఒక్కబాటగా, ఒక్కసూటిగా, జత జతగా కలెగల్పుగా సముద్రయ్య దిక్కు నడిసినై'' ఇట్లా సాగుతుంది. 1929లో జన్మించిన ఈ విదుషి, 2009 మరణించారు. త్వరలోనే ఈమె కథా సంకలనం నేషనల్ బుక్ ట్రస్ట్ ద్వారా వెలువడనున్నది.

❖❖❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# ప్రాచీన, ఆధునిక సాహిత్యంలో – హాస్య రసం

– పొన్నెకంటి స్వప్న, తెలుగు అధ్యాపకురాలు, సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం, తెలంగాణ.

హాస్యము అనేది జీవితంలో చాలా ప్రధానమైన రసం. హాస్యము అనగా వినోదం కలిగించి నవ్వు పుట్టించే లక్షణం కలిగిన ఒక భావానుభవం హాస్యం అంటే ఏమిటి? అది ఎలా సంభవిస్తుంది. దాని వలన ప్రయోజనాలు ఇబ్బందులు ఏమిటి అనే విషయంపై పలు అభిప్రాయాలున్నాయి. దైనందిన జీవితంలోనూ, సినిమాలోను, సాహిత్యంలోను, వ్యక్తుల వ్యవహారాలలోను హాస్యం ఒక ముఖ్యమైన పాత్ర కలిగి ఉంటుంది.

నన్నెచోడుడి కుమార సంభవంలో కూడా పరమేశ్వరుని తపోభంగం చేయాలని వెళ్తూ ప్రగల్భాలు పలికే మన్మధునితో రతీదేవి మాట్లాడిన మాటలు ఎంతో కొంత నవ్వుని తెప్పిస్తాయి. శివుని విల్లు కనకసిరియని, నీ విల్లు చెరుకు గడ అని, ఆయన బాణం పాశుపతమని, నీ బాణం కేవలం పుష్పం అని, చిన్న పిల్లలు కూడా తిని, పిప్పి ఉమిసెడి చెరుకుగడను గొప్పవిల్లని విశ్వసించి, క్షణాల్లో నశించే పూలని బాణాలుగా తగిలించుకొని వేసవి ఎండకి బెదిరిపోయే వసంతుని గొప్ప స్నేహితుడని వెంటబెట్టుకొని, కాకి పిల్లల్ని చూసి బెదిరిపోయే కోకిలలు, ఆడవాళ్ళు అదిలిస్తేనే ఆకాశంలోకి ఎగిరిపోయే పెద్దచిలుకలు పెద్ద సైన్యంగా గర్వించి, పరమేశ్వరునిపై దాడికి వెళ్ళడం మంచిది కాదు అని హెచ్చరిస్తుంది. ఇలాంటి మాటల్లోని హాస్యం సున్నితంగా మనసుని తాకి నవ్విస్తుంది. తిక్కన రచనలలో వ్యంగ్యం ఎక్కువ. పాండవులు అజ్ఞాత వాసంలో ఉన్నప్పుడు విరాటమహారాజు బావమరిది కీచకుడితో నర్తనశాలలో స్త్రీ వేషంలో ఉన్న భీముడు ద్రౌపదిలా అతనితో సంభాషిస్తున్న సందర్భంలో నన్ను ముట్టి నీవు చెండియు వనితల సంగతికి పోవు వాడవె అని గూఢంగా అంటాడు. ఇలాంటి వాక్యాలు చిరునవ్వుకి పుట్టినిల్లు అవుతాయి. ఇక ఉత్తర కుమారుని ప్రగల్భాలు, తీరా కురుసైన్యాన్ని చూసాక "ప్రాణములు తీపియన వినవే" అనే అతని గోల బాగా నవ్విస్తాయి. అంతేకాదు పసులదయ్య మెరుగు, పడతుల సంతోషమేల నాకు, యనికి జాల నేను" అని రథం మీద నుండి క్రిందకి ఉరికి పరుగెత్తడం కడుపుబ్బా నవ్విస్తుంది. తిక్కన తన పాత్ర చేత నవ్వించిన నవ్వులు లెక్కలేనన్ని. తిక్కన పేర్కొన్న నవ్వుల జాబితా పరిశీలిస్తే ఇన్ని రకాల నవ్వులుంటాయా అని ఆశ్చర్యం కలగకమానదు. అయితే ఏ నవ్వు పాత్రో చిత్యాన్ని భంగం చేయదు. అదీ విశేషం.

ఇక శ్రీనాధుని విషయానికొస్తే చాటువుల్లో హాస్యాన్ని పలికించాడు.

**పూజారి వారి కోడలు**
**తాజారగబిందె జారి దబ్బున పడియెన్**
**మైజారు కొంగు తడిసిన**
**బాజారే తొంగి చూసి ఫక్కుండ నగియెన్**

ఎంత దగ్గరి వారైనా ఇలాంటి సన్నివేశాల్లో దబ్బున జారిపడితే చూసిన వాళ్ళెవ్వరికైనా ముందు వచ్చేది నవ్వే. భక్త కవి పోతన భాగవత రచనల్లో సైతం పరికిస్తే కొంత మేరకు హాస్యం కానీ వస్తుంది. శ్రీకృష్ణుని బాల్య చేష్ఠలు మనల్ని నవ్వించి పరవశింపజేసే హాస్యప్రసంగాలు రాయల కాలం అన్నిరసాలకి స్వర్ణయుగం. తెనాలి రామకృష్ణుడిలాగా చెప్పబడే చాటుపద్యాలు హాస్య భాండాగారాలు ఇతని అద్భుత కృతి పాండురంగ మహాత్యం ఇందులో నిగమశర్మ అక్క మరువలేని తెలుగింటి ఆడపడుచు. దుష్టసావాసాలు చేస్తూ తిరుగుతున్న తమ్ముడిని బాగు చేయడానికి వచ్చిన ఆమె తమ్ముడికి ఎన్నో నీతులు చెబితే విన్నట్టుగా నటించి ఆ రోజురాత్రే ఇంట్లో ఉన్న నగలన్నీ అఖరికి తన అక్క ముక్కు పుడకతో సహా తీసు కెళ్ళిపోతాడు. విషయం తెలిసిన ఆమె తన మాట తల కెక్కించుకోలేదన్న మాట అటుంచి, తన ముక్కు పుడక

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

పట్టుకపోయాడని గొల్లుమనడం రసాభావమై పఠితన్ని ఫక్కుమనిపిస్తుంది.

వీరేశలింగం గారి ప్రహసనాలలోని పాత్రల్లో హాస్యరసం చిప్పిల్లుతుంది. ఆయన సంఘ సంస్కరణోద్యమానికి అస్త్రంగా హాస్యరసాన్ని వాడుకున్నారు. అట్లాగే గురజాడ, చిలకమర్తి, మొక్కపాటి పానుగంటి మొదలుకొని భమిడిపాటి, ముళ్ళపూడి వరకూ ఆనాటి నుండి ఈనాటి వరకు చాలామంది రచయితలు కనిపిస్తారు. ఆధునిక యుగంలో హాస్యానికి ఓ ఆదనపు భారం వచ్చి చేరింది. దాని పేరు సామాజిక ప్రయోజనం. గతంలోలా "హ్యూమన్ ఫర్ హ్యూమర్ సేక్" రాయడానికి వీలు లేదు ఈ రోజుల్లో వ్యంగ్యం ద్వారా సమాజాన్ని ఉద్ధరించడానికి కంకణం కట్టుకున్నారు పత్రికాధిపతులు, రచయితలు, ఇటువంటి వాతావరణంలో కేవలం హాస్య రచయితగా కాకుండా ఎందరో కవులు రచయితలు తాము చేపట్టిన అనేక ప్రక్రియల్లో ఒక ప్రక్రియగా హాస్యాన్ని కూడా పరామర్శించి చూశారు. కందుకూరి వీరేశలింగం గారిని చూస్తే ఆయనో వ్యవస్థ. సాహిత్య పరంగా చూస్తే ఆయన ఎన్నో ప్రక్రియలు చేపట్టి సంస్కరణే లక్ష్యంగా రచనలు చేశారు. వాటిలో ఆయన సమాజపు పోకడలను దుయ్యబట్టడానికి ఉద్దేశించి చేసిన రచనలున్నాయి. ప్రహసనాలు కావచ్చు. సత్యరాజ పూర్వ దేశయాత్రలు, అభాగ్యోపాఖ్యానం కావచ్చు పురుషాధిక్య సమాజాన్ని కుహనా పండితుల విరహ బాధలు తెగ వర్ణించే ప్రబంధాలను ప్యారడీ చేసి వదిలిపెట్టారు. దీనికి ప్రేరణ కొక్కొండ వెంకటరత్నం గారు హాస్నాన్ని, హాస్యంతో ఎదుర్కోవాలనే ఉద్దేశ్యంతో ఈయన ప్రహసనాలు రాశారు. కందుకూరి తర్వాత చెప్పుకోవలసినది చిలకమర్తి వారిని. గయోపాఖ్యానము వంటి పద్య నాటకాలు, రామచంద్ర విజయము వంటి నవలుల రాసిన ఈ కవీశ్వరుడు ప్రహసనాలు రాశారు. సంఘసంస్కరణ కోణంలో అనలేం కానీ సమాజంలో ఉన్న అవకతవకలను ఎత్తి చూపడానికి వీటిని బాగా వాడుకున్నారు. వినోదములు, నవ్వులగని అనేజోక్ బుక్స్ రాశారు. భగవద్గీతకు కలిగీత పేరుతో ప్యారడీ రాశారు. చిలకమర్తి పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది. గణపతి అనే రేడియో నాటిక గణపతి నవలగా అక్కడక్కడ శృతిమించినా మొత్తం మీద నవ్వు తెప్పించే రచన. ఇక పానుగంటి వారి రచనల్లో సాక్షి వ్యాసాలు ప్రసిద్ధి పొందాయి. జంఘాల శాస్త్రి పాత్ర ద్వారా ఆయన సంఘంలోని అనేక అవలక్షణాలను తూర్పారబట్టారు. కంఠాభరణం నాటకం పూర్తి హాస్యభరితమైంది. విప్రనారాణలో శ్రీనివాసుడు దేవదేవి మధ్య సంభాషణ అతి చమత్కారంగా ఉంటుంది. జంఘాలశాస్త్రి గారిలా తెలుగులో నిలిచిపోయిన హాస్య పాత్రలు కొన్ని ఉన్నాయి. మిసస్ వటీరావ్, ఆధునిక పోకడలకు పోతున్న స్త్రీలకు ప్రతినిధి ఆవిడకు విరుద్ధంగా సంసార స్త్రీగా ఉంటూ మొగుడికి వాతలు పెట్టగల దిట్ట కాంతం. కాంతంలాగానే తెలుగు నాట నిలిచిపోయిన మరో పాత్ర బారిస్టర్ పార్వతీశం లండన్ వెళ్ళి బారిస్టర్ చదువుదామని ఉబలాటపడిన ఓ పల్లెటూరి యువకుడి గాథ. సున్నితమైన హాస్యం అంటే ఏమిటో దీని ద్వారా రుచి చూపించిన మొక్కపాటి వారు ఇదికాక ఇంకా కొన్ని హాస్య రచనలు కూడా చేశారు. భానుమతి అత్తగారు కూడా తెలుగు సాహిత్యంలో నిలిచిపోయిన హాస్యపాత్ర. ఆ అత్తగారి చాదస్తం మనను నవ్విస్తుంది. సుతారమైన హాస్యం గిలిగింతలు పెడుతుంది. అలాగే హాస్యాన్ని పుట్టించే పాత్రలలో మరువలేనివి బుడుగు, రాధాగోపాలం, అప్పారావు పాత్రలు. వీటి సృష్టికర్త ముళ్ళపూడి వెంకటరమణ. ఆధునికయుగంలో హాస్య రచయితగా ముళ్ళపుడికి ఉన్న స్థానం వేరేవరికి లేదనడంలో అతిశయోక్తి లేదు. ఈయన కథా రచనా వ్యాసంగం సాగింది కొంత కాలమే అయినా హస్యంలో అన్ని ప్రయోగాలనీ చేసేసి ఓ రెండు తరాలవారికి ఐకాన్ అయిపోయాడు. అలాగే జరుక్‌శాస్త్రీ, శ్రీశ్రీ పేరడీ పాట ద్వారా శ్రీరమణ, రావికొండలరావు, రావిశాస్త్రి, వీనాదేవి, మల్లాది వెంకటరమణకృష్ణమూర్తి , ఇలా చెప్పుకుంటూ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

పోతే ఎందరో రచయితలు అనేక ప్రక్రియలలో హాస్య రచనలు చేశారు. వీరంతా ఏదో ఒక సన్నివేశాన్ని తీసుకొని సమస్యని తీసుకొని సున్నితమైన హాస్యం లేదా వ్యంగ్య ధోరణిలో రచించి హాస్యపు జల్లులు వెదజల్లారు.

పోటీ ప్రపంచపు ఈదులాటలో ఎక్కడ వెనుకబడి పోతామోననే శంకతో ఉరుకుల పెట్టే మధ్య తరగతి కుటుంబంలోనూ హాస్యం, వెటకారం, చమత్కారపు మాటలు తగ్గాయి. అందువల్లే లాఫింగ్ థెరపి లాఫింగ్ క్లబ్స్ వంటివి పుట్టుకొచ్చాయి. యాంత్రిక జీవన హోరులో పడిపోయి మానవ సహజగుణాలైన నవ్వడాన్ని మరిచిన మనిషిలోని బాధని, విషాదాన్ని, కోపాన్ని పోగొట్టే అత్యంత శక్తి వంతమైన సాధనం హాస్యం. ఇది ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేని ఔషధం. హాయిగా నవ్వుకుంటూ చతురోక్తులు విసురుకుంటూ ఆనదంగా ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపే వాతావరణాన్ని సాహిత్యం సృష్టించాలి. అది నేటి సామాజిక అవసరం కూడా.

❖ ❖ ❖

# మహాభారత ఆరణ్యపర్వంలో కరుణ రసపోషణ

- డా॥ ఎ. వెంకట ప్రసాదు, సహాయాచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వనపర్తి, తెలంగాణ.

రసంలేని కావ్యం నీరసంగా వుంటుంది. కాబట్టి ప్రతి కావ్యంలో రసస్థాపన తప్పకుండా వుంటుంది. ఇందులో చాలా కవులు శృంగారరసానికి ప్రాధ్యాన్యతనిస్తే కొందరు హాస్య, అద్భుతాలను ప్రధానరసాలుగా రచించినవారున్న ప్పటికి, కరుణరసానికి పెద్దపీటవేసినవాడు భవభూతి. అతడు తన ఉత్తరరామచరిత్రలో " ఏకో రస కరుణ ఏక...." కరుణనే ప్రధానరసమని నవరసాలలో మిగిలినవి అప్రధానమైనవనే భావనతో చెప్పాడు. కరుణ రసం మిక్కిలి కోమలమైన ప్రవృత్తి కలది కాబట్టి రసా విష్కారానికి అది ఎక్కువ అనుకూలంగావుంటుంది. కరుణ రసంలోని మాధుర్యం కూడ ఎక్కువే. కవులను భవించే కరుణ రస భావనలవల్లే ఎన్నో మహాకావ్యాలు వుద్భవించాయి. ఆనందవర్ధనుడు కూడ హృదయార్ద్రతా వహమైన మాధుర్యగుణం కరుణ రసంలోనే ఎక్కువగా వుంటుందని తన ధ్వన్యాలోకంలో తెలిపాడు. మన తొలి తెలుగు కావ్యమైన వాల్మీకి రామాయణం శోకంతోనే శ్లోకంగా మారి కరుణ రసాత్మకమైన రామాయణము మహా కావ్యంగా అవతరించింది. రామాయణమే కాదు వీరరస ప్రధానమనుకున్న మహాభారతంలో కూడ కరుణరస పోషణము చక్కగా ఆవిష్కరింపబడింది. ప్రస్తుతము కవిత్రయ రచనయైన మహాభారతములోని ఎఱ్ఱన అరణ్యపర్వశేషంలో కరుణరసస్థాపన.

లోక స్వభావము సుఖదు:ఖ సమన్వితము, కరుణకు స్థాయియైన శోకము మానవజీవితంలో అత్యంత ప్రధానపాత్రను పోషిస్తుంది. శోకమగ్నమైన లోకాన్నుద్ధ రించుటకు ఎందరో కరుణామూర్తులవతరించారు. క్రౌంచ ద్వంద్వవియోగోత్థమైన శోకమే శ్లోకరూపాన్ని ధరించి కరుణరసప్రధానమైన లోకోత్తరమైన రామాయణ మహాకావ్యము అవతరించినది. కవిత్రయకృతమైన మహా భారతంలో ప్రతిపాదింపబడిన శోకమే కరుణరసరూపంలో సహృదయునిచేత యేవిధంగా ఆస్వాదింపబడిందో అరణ్యపర్వంలో కనిపించే కరుణరసాన్ని పరిశీలనాం శముగా ఎన్నుకోవడమైనది.

కరుణము శోకమనెడి స్థాయిభావం వలన వుద్భ విస్తుంది. భరతుడు కరుణరసమునకు స్థాయీభావము శోకమని పేర్కొన్నాడు. కరుణరసానికి వర్ణము కపోత వర్ణ మని (కపోత: కరుణశ్చైవ - నాట్యశాస్త్రము -43), ఇది సప్తవర్ణములలో చేరదని, దీనికి దేవతను యముడిగా పేర్కొన్నాడు భరతుడు.

మహాభారత ఆరణ్యపర్వంలో పాండుపుత్రులు కపట ద్యూతంలో ఓడిపోయి ఆరణ్యమునకు వెళ్ళేసందర్భంలో ప్రజలశోకం ఆలంబన, పాండవుల సచ్చరిత్ర, ప్రజాను రంజకత ఉద్దీపనాలు, కౌరవులు నిందను పొందడం అనుభవాలు. దయావిషాదచింతాదైన్యాలు మొదలైనవి వ్యభిచారిభావాలు. (అరణ్య I - 3)

కర్ణుడు మొదలైనవారు మత్సరము కలవారు, లోభులు. ఇట్టివారుండుచోట ధర్మానికి తావు, ప్రజలకు రక్షణయుండదు. కాబట్టి అట్టి రాజ్యంలో వుండవలసివచ్చే శోకం ఆలంబన విభావము. దుర్యోధనుని లోభము, కర్ణాదుల క్రూరము, పాండవుల ధార్మికత వుద్దీపనవి భావము. " ఈరాజ్యమున నెట్లుండనేర్తుము" యని విల పించుట అనుభవములు. 'మమ్ము విడిచి మీరరుగంగ జనునే' వంటి అనుభావముల చేత చింతా విషాదదైన్య దయా కోపాదివ్యభిచారులు వ్యక్తమవుతాయి. ఇది ధర్మా భిఘాతజ పూరకమైన కరుణరసము. (అరణ్య I - 5) పాండవులు ఆరణ్యవాసానికి బయలుదేరి కామ్య కావనంలో నున్నారని తెలిసి శ్రీకృష్ణుడు, యాదవులు వచ్చినపుడు పాంచాలి శ్రీకృష్ణునితో తనలోని పరాభవాగ్ని ప్రజ్వరిల్లగా, తనమహాత్మ్యమునంత చాటిచెప్పి దిక్కు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

లేనిదాననైతినని యేడ్చింది. ఇక్కడ శత్రువులవలన పరాభవము ఆలంబనము, అభిజాత్యాదులు, విభవ నాశము ఉద్దీపనములు, దైన్యస్థితి కథనాదులు అను భవాలు. దుశ్శాసనుడు పాంచాలిని పరాభవించే సమ యంలో భర్తలు మౌనం వహించడాన్ని తలచుకొన్నపుడు కోప విషాదదైన్య వేగాదిభావాలు ద్యోతకమవుతాయి. ధర్మతత్త్వవేత్తలు అతిలోక పరాక్రమము కలవారు భీష్మా దులు వుండడము విస్మయజడతాది సంచారిభావాలు. (అరణ్య I - 5). శరణుకోరినవారిని రక్షించేవారెవరులేరని, సమయానికి పనికిరాని పరాక్రమము, శరణుకోరినవారిని రక్షించే గుణములెన్నివున్నా అవివ్యర్థులేనని, పాంచాలి ఆక్షేపిస్తూ శ్రీకృష్ణునితో చెప్తూ తోబుట్టువులు పుత్రబంధువు లెందరున్నా ఆ సమయానికి లేనిదాననయితినని తనదీనత్వాన్ని పేర్కొన్నది. (అరణ్య I - 5).

పాండవులు ద్వైతవనమున నివసించే సమయంలో మార్కండేయాదులవల్ల ధర్మోపదేశాలను వినేవారు. ఒక రోజు దు:ఖోపశమనమైన కథలు చెప్పుకునే సందర్భంలో ద్రౌపది ధర్మరాజుతో ధృతరాష్ట్రుని కుటిలనీతిని, పాండ వుల దుస్తితిని వివరిస్తూ, పాండవులు అనువంశిక రాజ్య భోగాలు అనుభవించేవారు కారని రాజసూయ యాగమొ నర్చి దిగ్విజయయాత్ర చేసి రాజులనందరినోడించిన శౌర్యప్రతాపములు కలవారని, యింతటి రాజ్యవైభవము కపటద్యూతంలో ధృతరాష్ట్రుల వశమైందని, కౌంతేయు లిపుడు దిక్కుమాలినవారై దైన్యస్థితిలో నున్నారని పేర్కొన్న సందర్భంలో పాండవుల వీరశృంగారమయమైన గతచరిత్ర స్మరణ విభావమై, వారిదైన్య జీవనము ద్రౌపది శోక ముద్దీపనమొనర్చుతూ, దైన్యవిషాద చింతా వేగవిస్మయ నిర్వేదాదులు వ్యక్తీకరింపడుతున్నవి. (అరణ్య V - 210). ధుర్యోధనుడు ఘోషయాత్రలో చిత్రసేనుడనే గంధర్వునికి భార్యాసమేతంగా పట్టుబడగా అర్జునుని పరాక్రమము వల్ల ప్రాణాలు దక్కించుకొన్నపుడు, ధర్మరాజు దుర్యోధ నుని మెత్తనిమాటలతో మందలించి బంధ విముక్తుడుని చేస్తూ యెన్నడు నిట్టి సాహసములింక చేయక, మనసులో 'దీని కొండొక విషాదము పొందకు' మనే మృదుపలుకులు బాణములై దుర్యోధనుని హృదయంలో గ్రుచ్చుకొని విషాదాధిక్యానికి కారణమైంది. (అరణ్య ఎ-434).

దుర్యోధనుడు శత్రువుల ముందు పరాభవము పొందితినని, భీష్మద్రోణాదుల ముందు తనమొగమెలా చూపింతునని శోకించటం, (అరణ్య VI - 16) ఆ కటకట! యిట్టి కష్టమునకు వచ్చితి నని వాపోయెను (అరణ్య VI -20). పరాభూతుడై పెద్దలకు మొగము చూపుటకంటె ప్రాణత్యాగము మేలని దుర్యోధనుని ప్రాయో ప్రవేశ ఘట్టము నందు దుర్యోధనుని శోకానికి పరాభవము ఆలంబనము, చిత్రసేనుని సైనికులు దుర్యోధనుని బంధించుట, ధర్మరాజు ఓదార్పు మున్నగునవి ఉద్దీప నాలు, లజ్జ నిశ్శ్వాసాదులు అనుభవములు, దైన్యవిషాద నిర్వేద శంక వితర్కాలస్యాదులు వ్యభిచారిభావాలు. ప్రతి నాయకగతమైన నిష్పన్నమైన కరుణము సహృదయునితో సంవదింపక కరుణా భాసమవుతున్నది.కర్ణుని కవచకుండ లాలను గ్రహించడానికి యింద్రుడు వచ్చుటకు ముందు జనమేజయునికి వైశంపాయనుడు ఈ కథను చెప్తున్న సందర్భంలో...

కుంతీదేవి సూర్యసమాగమము వల్ల కర్ణుడికి జన్మనిచ్చి ధర్మభీతి లోకోపవాదముతో నదిలో విడిచిపెట్టిన తర్వాత పడే బాధ(అరణ్య VII - 342, 343)లో భగ్నమైన పుత్ర వాత్సల్యము, కుంతీశోకానికి ఆలంబనము, బున్నమ చెందురుబోలు ముఖము, చిరునవ్వు, పులకులు చెన్నొంద, క్రుచ్చియెత్తుకొనుట, అక్కున చేర్చుట మొద లైన వాత్సల్యానుభావములు స్మరణ ఉద్దీపనాలు. దైవో పాలంభవాలు అనుభవాలు. కుంతి భావించిన వాత్స ల్యాను భావములు అనుభవానికి రాకుండా అడ్డుపడినది దైవము. కాబట్టి దైవాన్నుపాలంభించి విషాదదైన్యాలను ప్రకటించి నది కాబట్టి వాత్సల్యభావమిందులో కరుణ రసానికి పోషకమైంది.

సుందరము, ఉజ్వలమైన కర్ణుని రూపము వీర శృంగార నిలయము కాగలదని కుంతీదేవి ఉబ్బి తబ్బి

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

బయిపోయిన సందర్భంలో(అరణ్య VII - 345) తన కుమారుడు కొంతకాలానికెపుడైనా కనిపించక పోతాడా? యని ఆశపడుతూ సూర్య చంద్ర రుద్ర అశ్వినాదులు శిశువును రక్షింతురు గాక యని (అరణ్య VII - 346 - 348) ఆశీర్వదించి అక్కడినుండి భయపడి విషాదంతో అంత:పురమునకు చేరుకునే ఘట్టములో వాత్సల్యము కరుణ రసపోషణము.

అరణ్యములోనున్న పాండవులదగ్గరికి ఒక బ్రాహ్మ ణుడు వచ్చి ఒక మృగము తనకొమ్ములకు తనవస్తువు లను తగిలించుకొని పోయెనని తెచ్చి యిమ్మని ప్రార్థించి నపుడు పాండవులు దాని జాడకై వెతుకుతూ పోయి దప్పి గొని ధర్మజుని ఆనతిమేరకు దూరంలోని సరస్సు దగ్గరికి వచ్చి ఆనీటిని త్రావి ఒకరితర్వాత ఒకరు మూర్ఛిల్లారు. పోయిన తమ్ములు తిరిగి రాకపోయేసరికి భయంతో వెళ్లిన ధర్మజునికి కమలాకర తీరమున పడిపోయిన వారిని గాంచిన సందర్భంలో (అరణ్య VII-407)మృతులై పడి పోయిన తమ్ములు ధర్మజుని శోకమునకు ఆలంబనము, శరభశార్దూల బాహుళ్యమగు అరణ్యము ఉద్దీపనము. తల్లడిల్లుట ని:శ్వాసవైవర్ణ్యములు, అశ్రుమూర్ఛలు అనుభావములు. తాల్మిచలించుట శ్రమగ్లాన్యావేగాదు లకు, మూర్ఛదేలుట మోహాపస్మారవ్యాధులకు 'చిత్ర మున రూపంబోలె' వుండుట స్తంభప్రళయ జడతాది భావములకు, తల్లడిల్లుట దైన్యవిషాదవేగాదులకు సూచకములు. ఇందులో ధర్మజుని శోకానుభావవర్ణనము తదనుకూలమైన సర్వభావములను వ్యక్తీకరింపడానికి సమర్థమైనది. కాబట్టి వీటిచేత కరుణ రసము వ్యక్తీకరింప బడుతున్నది. ఈ విధంగా కరుణ రసము అరణ్య పర్వం లోనే కాకుండా మిగిలిన పర్వాలలో కూడ కనిపిస్తుంది.

❖❖❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# పుష్ప విలాపం - కరుణరసం

- వినాయక కుమార్, ఆంగ్ల ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, తెలంగాణ.

జంధ్యాల పాపయ్య శాస్త్రి (ఆగస్టు 4, 1912 - జూన్ 2, 1992) 20వ శతాబ్దములో బాగా ఆదరణ పొందిన తెలుగు కవులలో ఒకరు. వీరి కవిత్వయం సులభమైన శైలిలో, సమకాలిన ధోరణిలో, చక్కని తెలుగు నుడికారము విన సొంపైయుండును. ఖంద కావ్యము వీర ప్రత్యేకత, అందునా కరుణ రస ప్రధాన మయంగా చాలా కవితలు వ్రాసి, "కరుణశ్రీ" అని ప్రసిద్ధులైనారు.

కరుణశ్రీ గారు అత్యంత ప్రముఖ కావ్యాలు "పుష్ప విలాపము" మరియు " కంతి కుమారి" అని అనవచ్చును.

**పుష్పవిలాపము** : ఘంటసాల గారి రికార్డుల పుష్ప విలాపం పద్యాలు బాగా ప్రాచుర్యము పొందాయి.

**"కరుణ లేని మనసు కఠిన పాషాణంబు**
**జాలి కలిగె వాడు, సజ్జనుండు**
**జీవి హింస ఘోర పాపమయ్య".**

పోతన భాగవతము లోని పద్యము.

**"సృష్టిలో వున్న ప్రతీది మనిషి అవసరం కోసమే**
**కాని దయలేని ఈ మానవుడు -**
**అందాన్ని ఆస్వాదిస్తున్నాడా**
**ఆ ఆస్వాదనలో కూరత్వన్ని చూపిస్తున్నాడా!"**

కరుణశ్రీ రాసిన పుష్పవిలాపంలో పూలు పడుతున్న భాధ చెప్పబడింది, ఆ పూలకి మాట్లాడే శక్తి వుంటే, ఆ పూబాలలు పడుతున్న ఆవేదనకు కరగని మానవు డుండడు. కదలని హృదయం వుండదు.

మానవీకరణ ఈ పద్యంలో ప్రస్పుటంగా కనిపిస్తుంది. ఒక భక్తుడు పూజకోసం పూలుకోయాలని పూల తోటకు వెళాడు. ఆ పూలను భగవతార్పితం కోసమే కోస్తాడు. కాని ఆ పూలు తమ ఆవేదనను ఈ విధంగా వ్యక్తం చేస్తాయి.

ఆ భక్తుడు కొమ్మను చివాలున వంచినపుడు, ఆ విరులన్ని "మా ప్రాణము తీతువా"యని విలపిస్తాయి. ఆ పూలు బాదపడటం చూసి కవి హృదయం కూడా కుంగిపోతు, తల్లి ఒడి తల్పమై ఆడుకొనుచున్న ఆ సుకుమారమైన మృదువైన పువ్వులను చిదిమి బుట్ట లందు వేసికొని స్వార్థంకోసం అమ్ముకుంటావ్ కదా!

హృదయము లేని పూజలెందుకోయి! అని ఆ పుష్పాలు ఈ భక్తుడిని ప్రశ్నిస్తాయి.

"మనిషి బుద్ధియున్నవాడు, జ్ఞానవంతుడం, భావ సమృద్ధి గలవాడు. అలాంటి ఆ మానవుడు జడమతులైన ఆ పూలను కోయడానికి మనిషి తన మనసును బండ రాయి చేసుకున్నాడు.

ఆ పూలకు ఆయువు తక్కువే, ఆ కొంత ఆయువులొ తల్లి ఒడిలో లాలనగా వుంటూ, స్వేచ్ఛగా, ఆనందంగా, తేలియాడుతున్న ఆ లేత విరులను ఆయువు తీరక ముందే ప్రాణాలు హరించడం భావ్యంకాధని ఆ పువ్వులు దుఃఖ పడుతున్నాయి. ఈ విధంగా చిరుప్రాయంలోనే తల్లిని, బిడ్డను వేరు చేసినట్టవుతుంది.

ఆ పూవులు కోమ్మ-రెమ్మలపైన వుంటే గాలిలో సుగంధాన్ని వెదజల్లుతాయి. వాటిపై ఆధారాపడిన తుమ్మెదలకు కమ్మని తెనెల విందుకలిగిస్తాయి. రకరకాల రంగులతో కనులకు విందు చేస్తాయి. అలాంటి అందాన్ని అపహరించడం భావ్యం కాదు. ఆ రకంగానైన స్వతం త్రంగా వుండనీయకుండా, మా స్వేచ్ఛను హరిస్తారు ఈ మానవులు, అని పూవ్వులు వాపోతున్నాయి.

ఇతరుల గొంతుకోసి మెప్పు పొందాలనుకుంటే - అది మోక్షమనిపించుకోదు ఆ విశ్వాత్ముడు నెత్తురు చేతి పూజను ఎలా స్వీకరిస్తాడు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

భగవంతుడు సర్వాం తర్యామి కదా! మా పవిత్రాత్మల నెందుకు స్వీకరించడం -

ఇంతెనా, ఆ పుష్పాలు పడుతున్న ఆవేదనను చూసి ఎవరికైనా మనసు కరగక మానదు. ఊలు దారాలతో గొంతు బిగించి, ఆ లేత గుండెలో సూదులు గ్రుచ్చి, ముడుచుకొని ఆడవాళు ముచ్చట పడతారు, దయలేని ఈ ఆడవారికి అర్ధంలేని, ఆర్భాటాల అలంకరణ లెందుకు? తడిలేని గుండెలకు అత్తరులెందుకు?

లేత విరుల నేత్తురులను పిండి పిండి అత్తరులను చేసి కంపు దేహలపై ఇంపుగా గుమాయించి, పులుము కొందురు. ఈ మానవులు ఇంత నిర్దయులా?

పసిడి పూరేకులను ప్రక్కలపై చల్లుకొని ఆ పసి మేనులను కాళ్ళతో త్రొక్కి, నలిపి, వత్తలై పోగ, రాలి నలిగిపోయిన వాటిని పెంటదిబ్బపై అసహ్యంగా పార వేస్తారు.

ఆకర్షణగా ఉన్నపుడు కన్నులకు ఆనందాన్ని కలి గించిన ఆ పువ్వులను అవసరం తీరినాక త్యజించడం మానవ దుర్బుద్ధిని సూచిస్తుంది.

వెలకట్టలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధుర్యము పంచే జీవితాలను కృశించేటట్లు చేయడం, మరీహీనం. కుసుమ కొమలమైన ఆ పువ్వులు వాడిపోగానే చీపురుతో చిమ్మి ఆవల పారవేతురు ఈ నీతి లేని నరజాతి.

బుద్ధుడు జన్మించిన భూమి కదా! శాంతి భోదించిన భాపు జన్మ స్థలం కదా! అలాంటి అవని పై వున్న ఈ మానవుడికి సహజమైన ప్రేమ కరువాయెనా. అంద మెప్పుడూ పూజనీయం. అట్ల కాదని ఆ అందాన్ని ఆశ్వా దించేబదులు, అందాన్ని హత్య చేసి మనవుడు హంతకు డయ్యి, మనుజ జన్మనే నాశనం చేసుకుంటున్నాడు ఈ మనిషి.

మానవీకరణ దృక్పధంతో రాసిన ఈ పద్యంలో ప్రతి పదంలో ఆ పూబాలల ఆవేదన మనసుకు బాధ కలిగి స్తుంది. నవరసాలలో కరుణ రసాత్మకమైన 'పుష్ప విలాపాన్ని' కరుణశ్రీ కరుణతో రాయడమే గాక మనకు ఆ విరుల పై కరుణ కురిపించేలా చేశాడు. కరుణ రసంతో కూడిన ఈ పద్యం అమోఘం.

❖❖❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# డా॥ మలయశ్రీ "ప్రజాకవి వేమన" నాటకం - రసపోషణ

- **అలువాల మహేందర్,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

మన పూర్వ కావ్య-నాటక అలంకార శాస్త్రవేత్తలు రచయితల ఇతివృత్తం నాయకీ నాయకుల స్వభావం. ఇతర పాత్రల ప్రవర్తనల పట్టి 'నవరసాలు' గా భావాలను గుర్తించి వివరించారు.

రసాలు తొమ్మిది 1. శృంగారం, 2. హాస్యం, 3. కరుణ, 4. రౌద్రం, 5. వీరత్వం, 6. భయానకం, 7. బీభత్సం, 8. అద్భుతం, 9. శాంతం.

ఇందులో శాంతాన్ని కొందరు లాక్షణికులు రసం కాదన్నారు వాళ్ళకు ఎనిమిదే కావ్యరసాలు. ఇంకొందరు భక్తి, మైత్రి, ధర్మం మొదలైనవి కూడా రసాలే అని వాదించారు. మొత్తానికి మన దేశ (సంస్కృతి) సాహిత్యంలో "శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకా బీభత్సాద్భుత శాంతాశ్చ" అని 9 రసాలకు ప్రాధాన్యత లభించింది.

## నాటకాలు - రసాలు :

ఏ రచనలోనూ నవరసాలు ఉండవు, లేవు. మహాభారతం వంటి ఉద్యంథాలలోనే అది సాధ్యం. విశ్వేనాథ వేయిపడగలు, ప్రేమ్‌చంద్ రంగభూమి వేయ్యేసి పుటల మహా నవలలోనూ రసాలన్నీ (9) లేవు. కావ్య నాటకాలకు రచయితలు ఏదో ఒక రసాన్ని "అంగి" ప్రధాన రసంగా ఎంచుకొని, మిగతా రసాలలో కొన్ని అక్కడక్కడ సందర్భానుసారంగా పోషిస్తారు.

కావ్య ప్రబంధాల వలె నాటకాలు కూడా శృంగార రస ప్రధానంగా అధిక సంఖ్యలో వచ్చినై. ఉదా॥ కాళిదాసు - అభిజ్ఞాన శాకుంతలకు భాసుని - స్వప్న వాసవదత్త తెలుగు ప్రబంధాలన్నీ శృంగార రస ప్రధానలే కదా. నేటి ప్రేమకథల సినిమాల వలెనే, నాడు కూడా శృంగారం రసరాజు.

శృంగారం తర్వాతి స్థానం వీర రసానిది. ఇది పౌరాణిక, చారిత్రక యుద్ధగాథల నాటకాలలో సాధ్యం. ఉదా॥ ఛత్రపతి శివాజీ, రాణాప్రతాప్, అల్లూరి సీతారామారాజు.

కరుణకు - భవభూతి 'ఉత్తర రామ చరితకు'
హాస్యానికి - గురజాడ 'కన్యాశుల్కం'
శాంతానికి - మలయశ్రీ "శాంతిపథం" (బుద్ధ చరిత్ర)
అద్భుతం - బాలనాగమ్మ కథ

రౌద్రం మహావీరం, భయానీకం హింస, భీభత్సం విధ్వంసం అవి పౌరాణిక, జానపద గాథల నాటకల్లోనే సాధ్యం.

మనకు మ్యాచింగ్ దుస్తులు - అలంకారాలు వలెనే కావ్య - దృశ్య కావ్యాల్లో (నాటకల్లో) ఈ రసాలు కథా సన్నివేశాలవట్టి అవసరమైన రీతిలో ఉంటుంది. ఉన్న ఆభరణాలన్నీ ఒకేసారి ఏ వ్యక్తీ ధరించనట్లే మొత్తం తొమ్మిది రసాలు ఏ నాటకంలోనూ ఉండవు. ఒకవేళ అన్నీ గుది కుచ్చితే అది రసాభాసం - రసభంగం. తిరుపతి వెంటక కవుల మహాభారత నాటకాలన్నిటిని కలిపి చూస్తే నవరసాల పోషణ కనిపించవచ్చు, అది అనుమానమే.

## డా॥ మలయశ్రీ - ప్రజాకవి వేమన నాటక :

ఈ రచయిత బహుగ్రథ కర్త, పలు ప్రతిష్టాత్మక అవార్డుల విజేత వీరికి తత్త్వవేత్తగా బుద్ధుడు, కవిగా వేమన ఇష్టం. అందుకే ఆ ఇద్దరి జీవిత చరిత్రలను నాటకాలుగా రాశారు. వీరు బుద్ధుని కథను 'శాంతి పథము' పేరుతో నాటకాన్ని రచించగా అది 1975-78 కాలంలో ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ 2వ సం॥ విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా నియుక్తమైంది. అది శాంతిరస ప్రధాన 9 అంకాల లాక్షదిక నాటకం ప్రజాకవి వేమన. ఇది వీరి 1984 రచన. 8 రంగాలు 68 పుటలు 12 సార్లు ప్రదర్శింపబడింది. వేమన చారిత్రక వ్యక్తి అయిన ఇది సాంఘీక నాటకం అనవచ్చు. నాటి/నేటి సమాజ చిత్రణ ఎక్కువగ (ఈ రచయిత మరో) మూడు సామాజిక నాటకాలు, ఇటీవల నాలుగు కాకతి చక్రవర్తుల చారిత్రక నాటకాలు రచించినా అముద్రితాలు).

ప్రజాకవి వేమన నాటక ఇతివృత్తం చారిత్రకం. అయినా అతని జన్మస్థలం - కాలం విషయాల్లో స్థిర నిర్ణయాలు లేవు కొండవీటి రెడ్డి రాజుల కాలంవాడు ఈ కవి అనేది చిత్తూరు నాగయ్య, విజయ చందర్ నాయ కులు గా తెలుగులో రెండు చలన చిత్రాలు వచ్చినై. వాటికి ఇతివృత్తం 'పంచనాదం' గారి 'వేమన నాటకం' లోనిదట. వేమన గురించి డా॥ ఎన్. గోపి, డా॥ సుబాని రెండు పిహెచ్.డి. రాంరెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, నార్ల, ఆరుద్ర, గంగప్ప మొదలగు వారి పుస్తకాలతో పాటు అనేక శతక సంపుటాలు వచ్చినై. వ్యాఖ్యానాల పుస్తకాలు ఎక్కువే. 'విశ్వదాభిరామ వినురవేమ' మకుట వేమన పద్యాలు కొన్నయినా రాని తెలుగు వాళ్లులేరు. ఆయన పద్యాలకు అంత వ్యాప్తి జనాధరణ.

## డా॥ మలయశ్రీ 'ప్రజాకవి వేమన నాటకం':

ఇది 8 రంగాల అధునిక స్టేజి నాటకం, సెట్టింగుల ఆర్బాటం లేదు.

**ఇందలి పాత్రలు** : వేమన (వేమారెడ్డి, అన్న, వదిన, కూతురు, మరదలు, దేవదాసి, ఆమె చెల్లెలు, యోగి అభిరామయ్య, ఇద్దరు శిష్యులు చిన్నయ్య పెద్దయ్య ఒక శెట్టి, బిచ్చగత్తె + 3 మాత్రమే. మరదలు పాత్ర కల్పితం.

కథ వ్యాప్తిలో ఉన్నదే వేమన మొదటి భోగి, తర్వాత విరాగి - యోగి ఈ నాటకంలో పద్యాలన్నీ వేమనవి. పాటలు మలయశ్రీవి. కథ చివరి 3 రంగాలు వేమన 60 పద్యాలతోనే కథ నడిచింది. ఇదో గొప్ప నేర్పు.

**రసపోషణ** : ఈ నాటకం మొదటి సగభాగం శృంగార నాటకం అనిపిస్తుంది. తర్వాత సంఘ సంస్కర్త దృష్టితో మూఢ విశ్వాసాలను ఖండిస్తూ ధర్మప్రబోధంతో వీరనాటకంగా మారింది. శృంగార రసం వేమన మరదలు విషయంలో రసా భాసం అయ్యింది. దేవదాసి విషయంలో రసభంగమై వేమనను విరాగిని చేసింది. హాస్యం నాటకం పూర్వార్థం కంటే ఉత్తరార్థంలో వేమన కవి శిష్యుల ద్వారా చక్కగా పోషించబడింది.

గురుబోధ సందర్భంలో, అభిరామయ్య ఆశాభంగ సమయంలో శాంత రసపోషణ జరిగింది. వేమన వదిన సహసంలో కరుణ రస పోషణ ఉంది. వేమన దేవదాసిని వదిలి వెళ్ళుట అద్భుత రసం. హాస్య శృంగార, శాంత రసాలు అమితంగా ఉన్నా అవన్నీ ఈ నాటకానికి అంగీ రసాలు మాత్రమే.

మలయశ్రీ 'వేమన' నాటిక అంగిరసం (ప్రధాన రసం). "ధర్మవీరం" అని చెప్పక ఒప్పక తప్పదు. అదే ఈ నాటకంలో నాయక / కవి వేమన పాత్ర చిత్రణ ద్వారా చక్కగా అభివ్యక్తమైంది. ఈ నాటిక రచయిత ధన్యుడు. అది చదివిన / చూసిన వారు పుణ్యులు. ఈ 'నవరసాల' సెమినార్ నిర్వాహకులు మాన్యులు. సదస్సు నిర్వాహకు లకు సహృదయ శ్రోతలకు నా సహవక్తలకు ధన్యవాద లతో సెలవు.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# జానపద సాహిత్యం - నవరసాలు (కరుణ రసం)

- **లింగంపల్లి ఆంజనేయులు,** ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ & పీ.జి కళాశాల, సిద్ధిపేట, తెలంగాణ.

జానపదం జనం నానుడి నుండి వెల్లువడింది అది క్రమంగా జానపద సాహిత్యంగా మారింది.

ఆదిమ మానవుడి నుండి ఆధునిక కాలం వరకు జీవన విధానాన్ని క్రమ వికాసాన్ని ప్రతిభింబించేది జానపద సాహిత్యం అని చెప్పవచ్చు. ప్రకృతి ఒడిలో పుట్టిన జానపదాలు, మాటలు, పాటలు, వారి స్వచ్ఛమైన మాన సిక నిర్మలత్వాన్ని హృదయ భావకథలు తెలియజేస్తాయి.

కొన్ని సందర్భాలలో అనిర్వచనీయమైన అపరిమితమైర ఆనందం అనుభవిస్తాము అది రసానుభూతి.

కళాసృష్టి వల్ల ఉదయించే ప్రధాన భావాన్ని అనుసరించాల్సి ఉంటుంది. అప్పుడప్పుడు మానవునిలో కలిగే భావాలు అనేక రకాలుగా ఉండటం వల్ల రసాలు ఉత్పన్నమవుతాయి. మానవుని మనస్సును అధ్యయనం చేసిన పూర్వపు అలంకారికులు ఈ భావాలు ఎనిమిది అని కొంత కాలం తర్వాత క్రీ.శ. 5 లేక 6వ శతాబ్ధంలో మరొక రసం అయి శాంత రసం చేర్చి నవరసాలు చేశారు.

ఒక రసం ఉన్నత స్థితికి వెళ్ళి రచయితల మన్ననలు పొందితే దానిని "స్థాయి భావం" అంటారు. స్థాయి భవ అంకురం అభివృద్ధి చెందటం చేత రసోత్పత్తికి అవకాశం అందుకే రెండు విధాలుగా ఆలంకారికులు నిర్వచించారు.

1. ఆలంబన, 2. ఉద్దీపన

సర్వ కళలకు నిలయం మన భారతదేశం.

1. వేదాలు, 2. పురాణాలు వీటికి పుట్టినిళ్ళు

1. భరతనాట్యం, 2. కూచిపూడి, వంటి వాటికి ప్రసిద్ధి

భావ ప్రకటనకు మనోల్లాసానికి అల్లుకున్న గీతాలే జానపద గేయాలు, వీటికి కొన్ని విశిష్టమైన లక్షణాలు కలిగి ఉన్నాయి.

**అజ్ఞాత కర్తృత్వం :** ఎవరు రాశారో ఏమో తెలియదు, ప్రజల పలుకుల నుండి మౌఖికంగా వ్యాప్తి చెందింది, 2. సామూహిక ప్రచారం, 3. మౌఖిక సాంప్రదాయం, 4. ప్రాచీనం, 5. సారళ్యం, 6. జాతీయత, జానపదం జనం నోటి నుండి వెల్లువడిన గీతాలు, కవితలు, సామెతలు, పొడపు కథలు, ఆచారాలు, సంస్కృతి భాష మొదలగునవి.

జానపదానికి మూలం స్త్రీలు. వీళ్ళే గేయ సాహిత్యానికి ఆద్యులు అని కూడా చెప్పచ్చు. వీళ్ళు శ్రామికులు, వడ్లు దంపుడులో వరినాట్లు వేసేటప్పుడు, విత్తనాలు వేసి, కలుపుతీత సమయంలో, చేనుకావలిలో, చేన్లు కోసే టప్పుడు, ఏతం వేసేటప్పుడు, అవ్వలక్కలు, మౌఖిక గేయాలలో కొన్ని పురుషులు, స్త్రీలు అలాగే ఇద్దరు కలిసి పాడేవి కొన్ని, రసదృష్టితో చూస్తే గీతాల్లో కొన్ని వలపు పాటలు, హాస్యగీతాలు, కరుణారసాత్మక గేయాలు (కన్నీటి పాటలు) వున్నాయి.

కొందరు మనుషులల్లో, విప్లవ, కర్షక పాటలు, వాన పాటల, ఏరువాక, మేట, కోత కుప్పలు, వేసుకుంటు పాడేటోళ్ళు అందుల కొన్ని నష్టపోయిన పంటలను చూసి రైతు కన్నీళ్లు కారుస్తూ పాడే పాట ఇది.

**పల్లవి :** **ఏటికి ఏతం పెట్టి ఎయ్యిపుట్లు పండిస్తే**
**ఎన్నడూ మెతుకెరుగవన్నా నీవు గంజిలో మెతుకెరుగవన్నా**
**కాళ్ళు జెయ్యి కడుక్కోని కట్టమీద కూసుంటే**
**కాకి తన్నిపాయేరన్నా కాకి పిల్ల తన్నిపాయెరన్నా.....**

అంటూ తన బాధను, వ్యక్తపరిచాడు.

పాల్కురికి సోమనాథుడు తొలి దేశీయ ఛందస్సులో స్వతంత్ర్య రాజ్యంగా చేశాడు. ఈయనను పల్లె జీవుల నాడీ తెల్సిన ఆదికవిగా చెప్పవచ్చు. పాల్కురికి సోమ నాథుడు అల్పక్షరాలలో అనల్పార్ధ రచనలు చేయడంలో ప్రసిద్ధి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

**మాను మాను పువ్వుగాసే**
**మాను కింద రాసిపోసే**
**ఇప్పమాను పువ్వుగాసే**
**ఇప్పుడిరిగే నా మనసు**

సాముహికం పొందిన గేయాలు, ప్రాచుర్యంలో ఉన్న పాటలకు నుడికారాలు కలపారు. కొన్ని ప్రజల నానుడిలో వారి పరిభాషలో ఇమిడి ఉన్నాయి.

సాహిత్య కృషికి తోడ్పడిన కవులు, రచయితలు వారి గ్రంథాలు, విన్నకోట పెద్దన, కావ్యాలంకార చూడా మణిలో సాహిత్యానికి కృషి చేశారు. అద్దంకి శాసనం క్రీ.శ. 848 పండరంగడు వేయించిన శాసనంలో తరువోజల పద్యాలున్నాయి. ఇవి అచ్చ జానపదులలో ఉన్నాయి. నన్నె చోడుడు, కుమార సంభవంలో అనేక గీతాలు పేర్కొన్నాడు. ఇందులో అంకమాలికలు, మంగళ హారతు లకు సంబంధించి ఉయ్యాల పాటలు, పొందు పరిచి ఉన్నాయి. పాల్కురికి సోమనాథుడు దేశీయ ఛందస్సులో శాంకరి పదాలు, వెన్నెల పదాలు, తుమ్మెద పదాలు, పర్వత పదాలు, ప్రభాత పదాలు, జానపదాలు, వాటి ఆధారాలు పొందుపర్చాడు. అచ్చమైన తెలంగాణ సాహిత్యంతో కూడుకున్నది.

**బావిలో ఉదకాలు దెచ్చి అంగపూజలు చెద్దామంటే**
**బావిలున్న కప్ప పిల్లల ఎంగిలంంటడు లింగమయ్యా**
**చెరువులున్న నీళ్ళు దెచ్చి శివ పూజలు చెందామంటే**
**చెరువులున్న చేప పిల్లల ఎంగిలంటడు జంగమయ్యా**
**ఏమిజెద్దాం లింగమయ్యా మహిమలేమో తెలియదాయో!**

అంటూ అలంకారపు, నుడికారాలు, పునరుక్తి అయి నాయి. తెలుగు సాహిత్యంలో కొన్ని రకాల భావోద్వేకానికి వాటి స్థాయి ప్రకారం భారతదేశంలో భరతుడు తన నాట్య శాస్త్రంలో ఎనిమిది రసాలను ప్రతిపాదించాడు. అందులో చివరన శాంత అనేక కళను జోడించిన ఉపగుప్తుడు ప్రతి ఒక్కరికి అన్ని రసాలను ఎరిగి ఉండాలీ దీన్నే రసాభి నయం అంటారు.

గేయ లక్షణాలల్లో కొన్ని అలంకారాలు అంశాల ఉన్నాయి. అవి

1. చారిత్రక గేయాలు, 2. పౌరాణిక గేయాలు, 3. సాంఘిక అంశాలు.

ఎక్కువగా పాటలల్లో రసాలు మరియు ఫలసృష్టి కూడా అవసరం, ఫలసృష్టి దారుణ్యతలో 1. గేయం, 2. వచనం, 3. రూపకం. అనే గుణాలు కూడా ఉంటాయి. ఇవన్నీ కేవలం జానపద సాహిత్యంలో కనిపించటం మౌఖిక సాహిత్యంలో ఇమిడి ఉండటం సాహిత్య కృషికి మూలం అని చెప్పవచ్చు.

ఆర్ఎస్ బాగ్స్ అనే జానపద సాహిత్యాన్ని శాస్త్రవేత్త సాహిత్యాన్ని 6రకాలుగా విభజించాడు.

1. రస గీతాలు, 2. లౌకిక గీతాలు, 3. దైవిక సంబంధమైనవి, 4. జీవితంలో ముఖ్యమైన ఘట్టాలు, 5. పిల్లల పాటలు, 6. మత సంబంధమైన గీతాలు.

జానపదుల మాటలు, పాటలు వారి స్వచ్ఛమైన మాన సిక స్వభావాన్ని హృదయ భావకతను తెలియజేస్తారు. మేలు కొలుపు పాటలు, విషాద సమయాల్లో పాడే పాటలు, మంగళ హారతులు, ప్రజల జాతీయత భావాలు, కష్టసుఖాలు వీటి ద్వారా జానపదుల జీవన విధానం వ్యక్తం అవుతుంది.

గేయ సాహిత్యానికి అజ్ఞాత కర్తృత్వమే ముఖ్యం ఎవరు పాడారు అన్నది కాకుండా ఆ పాట ప్రాధాన్యత ముఖ్యం. దీన్నే "మౌఖిక సాహిత్యం" అంటారు. 1. అలంకారాలు, 2. నుడికారాలు, 3. యతిప్రాసలు, 4. పల్లవిలు పునరుక్తా లుగా వస్తాయి.

## జానపద సృష్టి :

మౌఖిక సాహిత్యం క్రమంగా వృద్ధి చెందటం వల్ల జానపద సాహిత్య కృషి జరగుతూ వచ్చింది. భాణీలు, పల్లవిలు ఒక ధారుణగా వస్తాయి. పల్లవిలు, అను పల్లవిలు కనిపిస్తాయి.

**పల్లవిలు :** 1. చల్ మోహన రంగా, 2. కోల్, 3. వల చందమామయ్యలో, వల చందమామ, 4. ఉయ్యాల, 5. వలలో, వలలో జానపద సాహిత్యంలో రసస్ఫూర్తి అనేది ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. వ్యక్తులల్లో గాని 64 కళలు ఏవిధంగా ఇమిడి ఉంటాయో అదే విధంగా ప్రతి పాటలో కవిత్వంలో నవరసాలు పొంది ఉండాలి.

పల్లెటూరిలో పుట్టి పెరిగి, ఆచార సాంప్రదాయాల వ్యవహారాలు తెలిసిన పెద్దవారు కనుమరుగు అవుతున్న నాగరికతను చూస్తూ దు:ఖంతో మాటలు రాక పాట రూపంలో చెప్పాడు.

**వామ్మో నాపల్లె సీమ ఏమాయో నాపల్లె సీమ**
**నాడు దురపు సుట్టాన్ని వరుస కలుపుకొని ఇంటికి రమ్మని మర్యాద చేసేది**
**నేడు ప్రాణామసోంటి చుట్టాన్ని ఇంటికి వచ్చిన ఒక్కపూట ఉండన్న మాట రాకపాయో**

ఇది ఎవరు తెచ్చిన కరువుగోడు, అయ్యో అయినోల్ల నెడచూసే చూడు అంటూ కన్నీరు కారుస్తూ తన ఊరుస్థితిని తెలిపాడు.

అత్తగారింట్లో ఎట్టి సాకిరికి గడుపుతున్నా కోడలు అత్తమామలు పెట్టె గోడుకు,

**మానన్న గానైతి మంచెవేతురు**
**చెట్టన్ని గానైతి చెలిగివేతురు**
**ఆకన్న గానైతి మెకలారగించు**
**కాయన్న గానైతి ఆకులారగించు**

అంటూ హృదయం కదిలించే కరుణ రసం కుటుంబ గేయంగా మలిచింది. దేశానికి అన్నం పెట్టే రైతు తను ఊడిగం చేసి పండించె పంట చేతికి రాకపోను తన ఎద్దు ఎవుసం మట్టిలో కలిసి పోయాయని బాధతో

**పాలు పెరుగు సల్లా బొట్టెది**
**నా ఇంటి యెనకాల చిన్న దొడ్డెది**
**దొడ్డి కాకిడి పాయో పెద్దోడ**
**ఎద్దు సచ్చిపాయో కూలోడ**
**నా ఏతం సెదలు వట్టె పాలోడ**
**బువ్వ పెట్టని కులవృత్తి**
**వలసపాయో కళాకృతి........**

## ఉపయుక్త గ్రంథ సూచీ :

1. తెలంగాణ మాసపత్రికలు
2. తెలంగాణ సాహిత్యం, చరిత్ర, ఆధునికం
3. ఆంధ్రభారతీ
4. జానపద గేయాలు, తెలుగువారి జానపద రూపాలు
5. మౌఖిక వాదులు

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# కవిత్రయ యుగం - నవరసాలు

**- బానోత్ వెంకటేశ్వర్లు** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

రస సిద్ధాంతం మౌలికంగా అలంకార శాస్త్ర సిద్ధాంతమే అయినా దాని వెనుక కాలాన్ని తట్టుకొని నిలువగలిగే మనోవైజ్ఞానిక శాస్త్ర ఆధారాలున్నాయి. ఈనాడు మనం అంగీకరిస్తున్న రసాల స్థాయి భావాలలో చాలావరకు మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు అంగీకరించిన సహజాతాలు, నైజాలు లేదా వాసనలను తెలిపేవే! రసాభివ్యక్తి మానవులో బహిర్గతమయ్యే భావమే స్థాయీభావం. మానవునిలో అంతర్గతంగా ఉండేస్థాయి భావాలు రసానుదానుభూతి వేళ రసాలుగా బహిర్గతమవుతాయి.

భరతుడు తన నాట్యశాస్త్రంలో ఎనిమిది రసాలను వాటికి ఎనిమిది స్తాయీ భావాలను మాత్రమే నిరూపించాడు. ప్రస్తుతం లాక్షిణికులు అంగీకరిస్తున్న తొమ్మిదవ స్థాయీ భావాన్ని అందులో చేర్చలేదు.

**"శృంగార హాస్యకరుణ రౌద్రవీర బయనకా:**
**బీభత్సాద్భుత సంజ్ఞాచేత్యష్టానాట్యేరసాస్మృతా:**
**రతిర్హా సవ్చశోకశ్చ క్రేదోత్సాహబయం తథా**
**జుగుప్సా విస్మయశ్చేతిస్థాయీభావా! ప్రకీర్తితా"**
**- నాట్యశాస్త్రం**

ఇందులో భరతుడు శాంతరసాన్ని చేర్చకున్నా తర్వాత శాస్త్రకారులు ఆ పనిని చేశారు. శాంతరసాన్ని గురించి విచారించి, నిర్ధారించిన వాడు భట్టోద్భటుడు

శంతనుడు వేటకోసం యమునాతీరానికి వెళ్ళి యోజనగందిని చూచి పరవశుడైన సందర్భములో శరీర సౌరభం, విలోకనవైభవం, రసోద్దీపనకు కారణాలు. కథని చెప్పేటప్పుడు రసానుగుణమైన కథనం కొనసాగించడం నన్నయ ప్రత్యేకత. ద్రౌపదీ వస్త్రాపహరణ సందర్భములో దుశ్వాసనునిపై భీముడు కోపోద్రిక్తుడయ్యాడు. ఆ కోపాన్ని నన్నయ "వీరరస" స్ఫూర్తితో కురువృద్దుల్ గురువృద్ధ బాంధవులనేకుల్" అని సభాపర్వంలో రచించారు. నన్నయ భారతాంధ్రీకరణ రసదృష్టిలో జరిగింది. మహాభారతాన్ని "రసరమ్య" కావ్యంగా మలచడానికి శ్రమించాడు. ప్రధాన రసమైన వాంతరసానికి భంగం రాకుండా నన్నయ జాగ్రత్త వహించాడు. వివిధ సందర్భాలలో "అంగరసాలను" పోషించిన తీరు కూడా పండితుల ప్రశంసలు పొందింది. వస్త్రాపహరణ సన్నివేశంలోను యుద్ధ వర్ణనలోను రౌద్ర, వీర రసాలను సముచితంగా ప్రదర్శించాడు. బకాసురవధ ఘట్టంలో భీభత్సరసం ఉండగా, కణ్వాశ్రమంలో శకుంతల విడిచివెళ్లేటప్పుడు కరుణ శాంత రసాలు కనిపిస్తాయి. తపతీ సంపరణుల, గంగా శంతనుల, శకుంతలా దుష్యంతుల వృత్తాంతాలలో శృంగార రసం చక్కగా పోషించబడింది. ఋశ్యశృంగుని ఘట్టంలో కొంత హాస్యం గోచరిస్తుంది. ఊర్వశి అర్జునుల రసాభాస కూడా వర్ణించబడింది. రసోచితమైన పద ప్రయోగం ద్వారా రసాన్ని పోషించిన తావులు కూడా ఎక్కువే.

శ్రీనాథుడు కాశాఖండంలో భాషింతు తిక్కయజ్వ ప్రకారము రసాభ్యుచిత బంధముగ నొక్కొక్క మాట అని చెప్పాడు. అంతా తిక్కనలోని ముఖ్యమైన కవితాగునం రసపోషణ విధానం. మహాభాతరం శాంతరస ప్రధానమైనది. వీర, రౌద్ర, భీభీత్సాది రసాలు, అంగరసాలు, విరాట పర్వాన్ని తిక్కన "నానా రసాభ్యుదయోల్లాసి" గా పేర్కొన్నాడు. కాని తిక్కన చేతిలో ప్రతి పర్వమూ రసవంతమైంది.

విరాటపర్వం రసమయం. అందులో కీచకవధ ఘట్టం చాలా ప్రసిద్ధమైనది. దర్మరాజు తన సోదరుల పరాక్రమాన్ని చెప్పించిన తిక్కన సమయోచితమైన శైలి ప్రయోగించి రౌద్ర, వీర రసావిష్కరణ గావించాడు. రసపోషణకి భాష ఒక సాధనమని మరోసారి తెలిపాడు. యుద్ధ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

పంచకంలో రౌద్ర, వీర, బయానక, భీభత్స రసాలను నిర్వమింపచేశాడు. స్త్రీ పర్వంలో కరుణారసం దర్శన మిస్తుంది. ఉత్తరాభిమన్యుల వివాహ సన్నివేశములో శృంగార రసాన్ని చక్కగా పోషించారు. యుద్దరంగంలో ఉన్న కౌరవసేనను చూసి వణికిపోయాడు. అప్పటి ఉత్తరుని స్థితిని హాస్యాన్ని జోడించి తిక్కన సేనపద్యంగా అందించాడు. పాత్రల చిత్తవృత్తిని వర్ణించి రసస్ఫూర్తిని కలిగించడంలో తిక్కన ప్రతిభావంతుడు.

నాచన సోమనాధునకు వున్న కవితా గుణాల్లో రెండోది సాహిత్య రసపోషణ. ఉత్తర హరివంశం పంచమశ్వాసంలో ఇందుధరోపాఖ్యానం మొదలుకొని ఉషా అనిరుద్దుల కలయిక వరకు శృంగారం పోషించబడింది. ఉత్తర హరి వంశంలో ప్రధాన రసం వీరం. అంగరసాలు శృంగా రాదులు, హరివంశంలో రసప్రాధాన్యాన్ని గూర్చి చెప్ప వలసి వస్తే వీర శృంగారాలు రెండింటిని సోమన సమ ప్రాధాన్యత చక్కగా పోషించాడు. ద్వితీయాశ్వాసంలో కృష్ణుడు తపోదీక్షను గూర్చి హరిహర సమాగమాన్ని గూర్చి వర్ణింపబడింది. ఇందులో శాంతరసం చక్కగా పోషించ బడింది. యమునాజలంలో మునిగిపోయిన హంసుని కానిక డింభకుడు ఆక్రోశించే ఘట్టంలో హాస్యం పోషించ బడింది. ప్రథమ శాస్త్రంలోని దేవదానవ యుద్ద వర్ణనం లోను తృతీయాశ్వాసంలోని ఏకలవ్య విజృంభణ వర్ణనంత షష్టాశ్వాసంలోని శివకేశవ యుద్ద వర్ణనంలోను రౌద్రరసం పోషించబడింది. తపస్సుకు వెల్లేటప్పుడు శ్రీ కృష్ణునకు పిశాచ దయ్యం కన్పించే సన్నివేశంలో భీభత్సరసం పోషించ బడింది. బ్రహ్మ స్వరూపుడైన పురుషుడు ప్రకుమారుల్ని అపహరించే ఘట్టంలోనూ శ్రీకృష్ణుడు సుదర్శనాన్ని ప్రయోగించే ఘట్టంలోను భయానక రసం పోషించ బడింది. నరకాసురుని సభకు వెళ్లా ఊర్వశిరూప చిత్రా లకు, నరూసురుని పరివారం పెట్టే బాధలకు ఓర్వలేక మునులు ఆక్రోశించే ఘట్టంలోను, హంసడింబకులు తమకు కావించిన భంగపాటును మునులు శ్రీకృష్ణునితో వివరించే ఘట్టంలోను కరుణరసం పోషించబడింది. ద్వితీయ శ్వాసంలో కృష్ణుడు విప్రకుమారుల్ని తెచ్చే ఘట్టంలో, అద్భుతరసం పోషించబడింది.

అనుశాసనిక పర్వంలోని సుదర్శనాగుల వివాహంలో శృంగార రసం చోటు చేసుకుంది. భారతంలో ఉత్తర కుమారుని మాటలు హాస్యరసానికి ఉదాహరణ. ద్రౌపది విరాట నగరానికి వెల్లేటప్పుడు ద్రౌపది నడవలేక అలసిన సందర్భములో కరుణం తన దర్మపత్ని అయిన ద్రౌపదిని తాను చూస్తుండగా తాకిన కీచకుని చూచేటప్పటి భీముని, రౌద్రమూర్తిని చూచిన వాడెవ్వడు జీవితాంతం మరువలేడు. వీరరసం బహువిధాలు యుద్దవీరం, ధర్మ వీరం, దానవీరం, దాయవారం ముఖ్యమైనవి. భారతంలో "యుద్ధవీరం" చోటు చేసుకుంది. ఉత్తర గోగ్రహణ సందర్భంలో కౌరవులపై యుద్ధం చేయడానికి వచ్చిన అర్జునుని మూర్తి వీరరస ప్రతిబింబం బృహన్నలను సారథి చేసుకొని ఉత్తరుడు సేనపై యుద్దానికి వెళతాడు. భీష్మ ద్రోణాది కురువీరుల్ని చూడగానే అతనికి భయం కలుగు తుంది. తన ఆస్థానానికి వచ్చిన ధర్మరాజుని చూసి విరా రుడు ఆశ్చర్యం చెందుతాడు. శాంతిని పొందడానికి సాధన మేమిటో భారతం చాలా స్పష్టంగా చెప్పింది.

## సంప్రదించు గ్రంథాలు :

1) తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానాశాస్త్రి
2) తెలుగు సాహిత్య చరిత్ర - వెలమలసిమ్మన్న
3) తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ నాగయ్య
4) భారతీయ అలంకార శాస్త్రం

❖ ❖ ❖

ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సదాశివపేట.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# జానపద సాహిత్యంలో కరుణ రస పోషణ

–**పెండ్యాల భార్గవి,** స్నాతకోత్తర విద్యార్థి (ద్వి.సం.), తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ & పీ.జి కళాశాల, సిద్ధిపేట, తెలంగాణ.

రసమును గురించి ప్రపంచంలో మొట్టమొదట చెప్పింది భరతుడు క్రీ.పూ. 3శతాబ్ధము నాట్యశాస్త్రము గ్రంథం.

పాఠకుని లేదా ప్రేక్షకుని హృదయంలో కలిగే వికారము లేదా విప్రక్రియను స్థాయి రసభావస్ఫురణ రసధ్వని అంటారు.

భరతునిచే అంగీకరించబడ్డ రసాలు ఎనిమిది.

వేడెక్కిన నీరు బుడగలుగా మారి, ఆవిరై ఆవిధంగా నీటికి శీతల పదార్థస్పర్శచే (చల్లని గాలి మొ॥ స్పృశించుటచే) జల బిందువులుగా మారి చిలికినట్లు సాత్విక భావానంతరం ఆనందామృతంగా పరిణమించిన భావమును భావకుడు ఆస్వాదించి మైమరచుటకు రసానందమనుభవించుట తొమ్మిది రసాలు, తొమ్మిది స్థాయి భావాలు మొట్టమొదట ఉద్భటుడి కావ్యాలంకారసార సంగ్రహంలో కన్పిస్తుంది. నవరస సిద్ధాంతాన్ని మొదట ఉద్భటుడు వెలువరించినది. నవరస సిద్ధాంతాన్ని రూపొందించినది ఆనంద వర్ధనుడు, అభినవగుప్తుడు. రసాల్లో మొదటి నాలుగు స్థానాలల్లో నిలిచే రసాలు శృంగారం, వీరం, కరుణ, శాంతం తొమ్మిది రసాలలో కోమల రసాలు 4 శృంగారం, హస్యం, కరుణం, శాంతం. తొమ్మిది రసాలలో ఉద్ధాత రసాలు వీర, రౌద్ర, భయానక, భీభత్సం.

రసరాజం కరుణ అని నిరూపింప ప్రయత్నించినది భవభూతి

## కరుణ రసం :

కరుణ ఒక్కటే రసము. నిమిత్త భేదము వలన నీరుసుడులు, బుడుగలు, అలలు మొదలైనవి అనేక రూపములను ఆశ్రయించినట్లు కరుణము నిమిత్త భేదము వలన అనేక రూపములో కన్పించును. సంగితమునకున్న హృదయ ద్రవీకరణ శక్తి రసాల్లో కరుణ రసంకు ఉంది. కరుణాబాసము అనగా ధీరోద్ధత నాయకులు శత్రు సంహారము గావించిన పిమ్మట వారిని గూర్చి శోకించుట కరుణా భాసము.

**ఉదా** : కళింగ యుద్ధానంతరం అశోకుని దు:ఖ: కరుణాభాసం.

**కరుణ విప్రలంబం :** సాహిత్య దర్పణ కారుడైన విశ్వనాథుడు (క్రీ.శ.13వ) విహవిప్రలంబమును ప్రవాస విప్రలంబము నందే చేర్చి కరుణావిప్రలంబమును వియోగ శృంగారంలో 4వ భేదంగా కూడాచేర్చారు. జానపద గేయ కథలు కరుణ రసంగా ఉండే కథలు కామమ్మ కథ, నల్ల తంగాళ్ కథ, సారంగ ధర, పండగసాయన్న కథలు చెప్పవచ్చు. జానపద సాహిత్యంలో నవరసాలు కూడా మనక కన్పిస్తుంది. ముఖ్యంగా జానపద సాహిత్యం మౌఖికంగా ఒకరి నుండి మరొకరికి సక్రమించడం జరుగుతుంది. అంతే కాకుండా జానపదులు కరుణ రసానికి ముఖ్య ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది. పల్లెలో వారు ప్రతి దు:ఖాన్ని పాటల రూపంలో వ్యక్తం చేయటం జరుగుతుంది. జానపద గేయాలు రస ప్రధానవటం పన్నెండో లక్షణం. జానపదుని నోటి నుంచి అశువుగా వెలువడ్డ జానపద గేయరత్నం ఒక రస గుళిక జానపదులు దు:ఖాన్ని దిగమ్రింగి మనసుకుదట పరుచుకోవడానికి కరుణ రసము ఉపయోగించడం జరుగుతుంది. జానపద గేయాలన్నీ రస ప్రధానాలని చెప్పటంలో అతిశయోక్తి లేదు.

## కరుణ రసం :

తెలంగాణ ప్రాంతంలో తల్లిదండ్రులు కన్నకూతురికి వివాహం జరపించి ఆతర్వాత కూతురిని అత్తగారింటికి పంపే సమయంలో అంటే అప్పగింతలు చేసే వేళల్లో తల్లి కూతురు మధ్య సాగే రసం కరుణ రసంగా చెప్పడం జరుగుతుంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

జానపద సాహిత్యంలో కరుణ రసాన్ని కన్నీటి పాటల రూపంలో చెప్పటం జరుగుతుంది.

కరుణ రస గేయాలనే శోకంతో కూడిన పాటలనవచ్చు. సామాన్యంగా జానపద గేయాలన్నీ శృంగార ప్రధానాలనే తప్పు అభిప్రాయం ఉంది. వలపు భావాలకు జానపదులెంత ఇస్తారో శోకతప్త హృదయాలకు వారంత ప్రాతినిధ్యం వహిస్తారు.

కన్నీటి పాటలు ప్రపంచమంతటా ఉన్నాయి. ఆత్మీయులు చనిపోయినప్పుడు మరణ గీతాలను పాడుతారు. కాని తెలుగులో అటువంటివి చాలా అరుదు. కరుణ రస ప్రధానమెన కవిత్వం తెలుగులో కథా గేయాల రూపంలో కన్పిస్తుంది.

జాపనద గేయాలలో అప్పగింతల పాటలను కన్నీటి పాటలు మొట్ట మొదట చెప్పుకోవచ్చు. వీటిని కొందరు స్త్రీలు పాటలలో చేరుస్తారు. వేడుక పాటలలో పెళ్ళి పాటలన్నీ చేరుతాయి. అప్పగింతల పాటలు మాత్రం ప్రత్యేకమైనది. ఇవి సాందర్భిక గీతాలు. అంటే ఒక సందర్భం కోసం ప్రత్యేకంగా వెలువడ్డవి.

ఆ సందర్భం ఎట్టి కఠినాత్మునికైనా కన్నీరు తెప్పించేది. ఈ విధంగా పుట్టింటి నుంచి కదలడానికి ఇష్టపడని కూతురి ఆవేదనను ఇది తెలుపుతుంది. దానికి కారణాలను కూతురు చెప్తుంది. కాని అత్తగారింటికి కూతుర్నీ పంపితీరవల్సిన పరిస్థితి తల్లిది. ఎందుకంటే కూతురు అత్తగారింటికి పోయి ఇంటికి కీర్తి తేవలెనన్నది తల్లిదండ్రుల ఆకాంక్ష గ్రామ జీవనంలో ఏయింటికాయిల్లు వేరుగా ఉండడం సాధ్యం కాదు. సహజంగానే సామాజిక ప్రజ్ఞ గ్రామీణులు ప్రతి ఒక్కరికి అలవడుతుంది. అందువల్లనే ఈ పాటలో తల్లి ఇంటికి కీర్తి తేవమ్మా అని మరుక్షణమే ఊరికి కీర్తి తేవమ్మా అంటుంది.

అంటే తల్లి ప్రేగు తెంచుకొని పుట్టిన ఆడబిడ్డను కన్న తల్లిదండ్రులు మహలక్ష్మీ పుట్టిందని సంతోషించి ఎంతో అల్లారుముద్దుగా పెంచి వివాహ సమయం వచ్చే సరికి వివాహం జరిపించాక తమని వదిలి వెళ్ళిపోతే ఎంతో బాధపడుతారు. కూతురు కూడ మెట్టింటికి వెళ్ళాలంటే తన బాధ కరుణ రసంగా ఉంటుంది.

కూతురికి వివాహం జరిపించిన తర్వాత మెట్టింటికి వెళ్ళలేను నా తల్లిదండ్రులను వదిలిఅని దు:ఖించిన సందర్భంలో తల్లి కూతురుకు ఎంతో కరుణ రసంగా చెప్పడం జరుగుతుంది. అంటే ఆరెకరాలో పంటచేను అంటి మామిడి తోటను ఇస్తాను పోఅమ్మా నాకూతురా అత్తింటికి వెళ్ళి ఆ ఇంటికి కీర్తి తీసుకురా అమ్మా అంటుంది. అంతే కాకుండా ఆరు ఎకరాలతో పాటు ఆవుల జతను ఇస్తా పోయమ్మా నా కూతురా అని ఎంతో ఆర్ధతతో చెప్తుంది. కాని కూతురు మాత్రం పోనమ్మా నేను పోనమ్మా పోతే తిరుగుటలేదమ్మా అంటుంది. అన్న గార్లు ఏడమంది అక్క చెల్లెళ్ళు అందరిని వీడి పోలేనమ్మా అంటుంది. అప్పుడు తల్లి కూతురును ఓదార్చే సమయంలో నాకూతురా నీకు నాగరబిళ్ళా చేపిస్తా పోవమ్మా నా కూతురా వెళ్ళి అక్కడ కీర్తి తేవమ్మా అంటూ తల్లి కూతురుల మధ్య అప్పగింతల ఓదార్పు ఎంతో కరుణ రసంగా మన కనుల ముందు కన్పిస్తుంది.

ఆడపిల్ల కటుటుంబంలో తల్లిదండ్రులే కాదు తోబుట్టువులు కూడా కన్నీటి పర్యంతం కావడం ఆ అప్పగింతల సమయంలో తమ తోబుట్టువు తమని వదిలి వెళ్ళడంతో వారు రోజు చిలిపిగా కొట్టుకోవడం తిట్టుకోవడం అన్ని గుర్తు చేసుకుంటూ కరుణ రస కన్నీటి పాటలను ఆలపించడం జరుతుగుంది. అలా అప్పగింతల సమయంలో అక్కడికి వచ్చిన బంధుమిత్రులు కూడా కంటతడి పెడుతారు.

జానపదులలో ఈ విధంగా ప్రేమ వాత్సత్యాలు మనకు స్పష్టంగా కన్పియడం జరుగుతుంది.

జానపద సాహిత్యంలో కుటంబ చిత్రీకరణ ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారు. అంటే కుటుంబంలో తల్లిదండ్రులలకు పిల్లలకు మధ్య వాత్సల్యంతో పాటు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

పిల్లలను వీడలేని కన్నీటి ఆర్ధ్రత మనకు కరుణ రసంగా కన్పిస్తుంది. అంతేకాకుండా జానపదులు మరీ అంతగా విద్యావంతులు కాకపోయిన వారి మాటలు వారి శోకాన్ని వారు కన్నీటి పాటల రూపంలో వెలువరిస్తారు. జానపదుల జీవిత చిత్రీకరణలో వారి మనో భావాలను, మనో వేదలనను ఎంతో కరుణ రసోత్పత్తితో తెల్పడం జరుగు తుంది. మహాలక్ష్మిలాగ ఇంట్లో తిరిగే కన్న కూతురు అత్తగారి ఇంటికి వెళ్ళే తీరును తల్లిదండ్రులకు కూతరుకు మధ్య దు:ఖాన్ని ఈ విధంగా కరుణ రసంగా చిత్రింక రించడం జరిగింది.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# రామదాసు కీర్తనలలో - భక్తి రసం

- నిమ్మ లావణ్య, స్నాతకోత్తర విద్యార్థి (ద్వి.సం.), తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ & పీ.జి కళాశాల, సిద్ధిపేట, తెలంగాణ.

రసం అంటే "ఏ భావం పుట్టి చిరకాల చిత్తంలో ఉంటుందో ఏది అలౌకికమైన ఆనందాన్ని కలిగిస్తుందో ఏది హృదయాన్ని ద్రవీకరిస్తుందో అది రసం" అంటారు. నవరసాలు అనే మాట లోకంలో ప్రసిద్ధంగా ఉంది. ఎక్కువ మంది శాస్త్రకారులు నవరసాలనే ఆమోదించారు. ఈ సంఖ్య మొదట ఎనిమిదిగా ఉండి ఆతర్వాత తొమ్మిది తరువాత పది. ఆ తరువాత పన్నెండు, ఆ తరువాత అంతకంటే ఎక్కువగా పెరిగింది. భక్తిరసం గురించి ప్రతిపాదించిన వారిలో రూపగోస్వామి, మధుసూదన సరస్వతి ముఖ్యులుగా చెప్పవచ్చు. రూప గోస్వామి రచన ఉజ్వల నీలామణి దీనిని 12వ రసంగా భక్తి రసాన్ని ప్రతిపాదించినది రూపగోస్వామి, మధు సూదన సరస్వతి, భక్తి రసానికి రూపగోస్వామి చెప్పిన స్థాయి భావం చిత్త ద్రవం. మధుసూదన సరస్వతి రచన హరిభక్తి రసాయనం, ఇతను చెప్పిన స్థాయి భావం భాగవ దాకర చిత్తవృత్తి. భక్తి అనేది భావమే గానీ రసం కాదు అని ధనుంజయుడు, ముమ్మటుడు జగన్నాథ పండితులు చెప్పినప్పటికి భక్తి రసం అంటే నిరంతరం భగవన్నామ స్మరణలో తరిస్తూ ఉండేవారు. అని భక్తి రస ప్రాధాన్యతను చక్కగా వివరిస్తారు. భక్తి మార్గాన్ని పోతన వంటి మహాకవులు నవవిధ భక్తి మార్గాన్ని గురించి వివరించారు.

ప్రతి వ్యక్తి మనస్సులో కొంత వరకు అయిన దైవ చిత్తంలో ఉంటారు. కొందరు దైవ భక్తితో ఎంతో భక్తి శ్రద్ధలతో నిరంతరం భగవంతుని ధ్యానంలో ఉంటారు. భక్తి రసం భక్తి గురించి ప్రతిపాదించిన వారిలో ముఖ్యంగా భాగవత రచనకు చేసిన పోతన భాగవతంలో నవవిధ భక్తి మార్గములను గురించి వివరించారు. నిరంతరం భగవంతుని నామాన్ని జపించడం స్మరణం. అదే విధంగా ఎంతో భక్తితో పాటలు వినడం శ్రవణం. భగవంతుని పాటలు ఎల్లప్పుడు గానం చేయడం కీర్తనం ఏవిధంగా అయితే హనుమంతుడు నిరంతరం శ్రీరామ పాదసేవలో నిమగ్నమవుతాడో అదే పాదసేవనం నిరంతరం భక్తితో పూజలు చేయడం అర్చన ఎల్లవేళల భగవంతుని సాన్నిహిత్యంలో ఉంటే సఖ్యం. ఈ విధంగా నవవిధ భక్తి మార్గలను వివరించాడు. అదే విధంగా భక్తి అంటే కేవలం భక్తి అనేది మనసా, వాచ, కర్మణ, త్రికరణ శుద్ధిగా పూజించాలి. మానవులు తమకు కష్టం వచ్చినప్పుడు భగవంతుని ప్రార్థించడం అదేవిధంగా ఎలాంటి కష్టతర పరిస్థితుల్లో లేనప్పుడు భగవంతుని గుర్తించకపోవడం ఇలా కాకుండా ఎల్లప్పుడూ ప్రతి పనిలో దైవ చిత్తంతో కొనసాగించాలి. భక్తి ప్రాధాన్యత గురించి కవులు అనేక రకాలుగా భక్తి పారవశ్యంలో ఎంతో మంది కవులు అనేక రకాల కవితా విశేషాలను పేర్కొన్నారు. ముఖ్యంగా అన్నమాచార్యులు వేంకటేశ్వరుని భక్తితత్వం చక్కగా వివరించాడు, అనేక కీర్తనలు రచించాడు. అన్నమయ్య పదాలలో కీర్తనలలో గల జానపదుల బాణీ గురించి, తెలుగుదనం గురించి భక్తి వైరాగ్య తత్వం గురించి, సాంఘీక దృక్పథం గురించి అద్భుత వర్ణనల గురించి వివరించారు. అన్నమయ్య వివిధ భక్తి మార్గాలు, ఆరాధనలు స్వామి వారి ఉత్సవం, అలంకారాలు మొ॥న దైవ విశేషాలన్నిటిని వర్ణించాలి. అలాగే నిగమ నిగమాంత వర్ణిత మనోహర రూప అంటూ భగవంతునిపై గల మధుర మైన భక్తితో భక్తిరసం తేటతెల్లమవుతుంది. అలాగే అతడే రక్షకుడు అందరి కతడే యేపతి యండగ అంటూ అన్నమాచార్యులు భక్తి ప్రధానంగా త్రికరణ శుద్ధితో పారమార్థికంగా కీర్తనలు రూపంలో భక్తి రసాన్ని వివరించారు. జాపనద సాహిత్యం లోనూ ఆరితేరిన వారు అన్నమాచార్యులు వెంకటేశ్వరుని కీర్తిని గానం చేయడంలో భక్తి రస ప్రాధాన్యం తెలుస్తుంది. పదకవిత పితామహుడిగా పేరు గాంచిన అన్నమయ్య

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

భజన సంప్రదాయానికి ఆధ్యుడిగా నిలిచారు 32,000 కీర్తనలు రచించడంలో అన్నమాచార్యుల భక్తి తేటతెల్ల మవుతుంది.

**"బ్రహ్మం ఒక్కటే పరబ్రహ్మమొక్కటే, పరబ్రహ్మమొక్కటే నిండార రాజు నిద్రించు నిద్రయు ఒక్కటే"**

అంటే ఈ జగత్తుకు మూల రూపం భగవంతుడు ఒక్కడే అని అన్నమాచార్యులు తన కీర్తనలు ద్వారా చెప్పాడు.

త్యాగయ్య, క్షేత్రయ్య, తరికొండ వెంగమాంబ, ఇలా అనేక మంది భక్తి మార్గంలో దైవ చిత్తంతో ఎంతో అద్భుతంగా కీర్తనలు చేసారు. భక్తిరసం వారి కీర్తనలో ఎంతో చక్కగా తనువు పులకరించేలా రచించారు. అందులో ముఖ్యంగా కంచర్ల గోపన్న శ్రీరామ భక్తుడు తనువు పులకరించేలా ఎంతో అద్భుతంగా మిక్కిలి భక్తి పారవశ్యంలో అనేక కీర్తనలు చేసారు.

హైందవ మతంలో ఎక్కువగా భగవంతుని ఆరాధించడం, భక్తితో గానం చేయడం చేస్తారు. హిందుమతంలో ప్రతి ఒక్కరు శుభకార్యాలు ప్రారంభించే ముందు భగవంతుని ఆరాధించి ఆ తరువాత ఇతర కార్యక్రమాలు చేపడతారు. వివాహం తరువాత జరిపించే సత్యనారాయణ వ్రతం, మంగళ గౌరీ పూజ లాంటివి భక్తికి నిదర్శనంగా చెప్పవచ్చు. అదే విధంగా ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరగా ప్రఖ్యాతి గాంచిన సమ్మక్క సారక్క జాతరను గిరిజన ప్రజలు జరిపించడం బెల్లంను బంగారంగా భావించి విక్రయించడం చేస్తారు. ఈ విధంగా చేయడంలో ప్రజలకు భగవంతునిపై గల భక్తిని తెలుపుతుంది. భగవంతునిపై గల భక్తి విశేషమైనది. పురాణ కథలను ఆధారంగా ఉదా॥కు బెజ్జమహాదేవి కథలో శివుడిని తన కుమారిడిగా భావించి చేసిన సేవలలో భగవంతునిపై గల ముగ్ధ భక్తి తేటతెల్లమవుతుంది. అలాగే మీరాబాయి ఎల్లప్పుడు శ్రీకృష్ణుని పాద సేవలో తన జీవితాంతం కృష్ణ భక్తితత్వంతో భగవన్నామాన్ని గానం చేసిన తీరు భక్తికి నిదర్శనంగా చెప్పవచ్చు.

## గోపన్న భక్తితత్వం :

గోపన్న తానీషా వద్ద తహసిల్దార్‌గా ఉన్నాడు. ఆ సమయంలో శ్రీరామ మందిరం నిర్మించాలని పూనుకుంటాడు. ఇక్కడ మందిరం నిర్మించాలానే భావనలో గోపన్న భక్తితత్వం తెలుస్తుంది. అయితే గోపన్నపై నగదు అపహరించిరని నేరం పడడంతో బందీగా వేస్తారు. గోపన్న ఇక్ష్వాకుకుల తిలక ఇకనైన కరుణింపవ అనే కీర్తనలో భక్తిభావంలో తనను రక్షింపమని ఎంతో శ్రద్ధతో కీర్తనతో వేడుకుంటాడు. గోపన్న బందీఖానాలో చిత్రవధ అనుభవిస్తూ సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకంబు రామచంద్ర అంటూ పరిపరి విధాలుగా భగవంతున్ని నిందిస్తూ గానం చేస్తాడు. ఇక్కడ భక్తి ప్రాధన్యంలో తాను కష్టాల్లో ఉన్న ప్పుడు భగవంతుడు ఆదుకోవడంలేదు అని భగ వంతునిపై కొపంతో గానం చేస్తాడు. భక్తి రసం అద్భు తంగా గోచరించేలా తన కీర్తనలో రస ప్రాధాన్యాన్ని గానం చేసాడు. ఓరామ శ్రీరామ నీనామం ఎంతో మధురం అంటూ శ్రీరామ నామంలో భక్తిని ప్రతిపాదించాడు. రామ నామ స్మరణంలో భక్తి వైశిష్ట్యం తెలుపవచ్చు. గోపన్న శ్రీరామభక్తిలో ఎంతో అద్భుతంగా తనువు పులకరించేలా గానం చేసాడు. శ్రీరామ నామం గానంలో భక్తి రసం అద్భుతంతో వర్ణించడం జరిగింది. అదేవిధంగా రామ దాసు ప్రసిద్ధి చెందిన కంచర్ల గోపన్న 400పైగా కీర్తనలు తన ఇష్ట దైవంకు సమర్పించడంలో భగవంతునిపై భక్తిని తెలియజేస్తుంది. ప్రతి కీర్తన పరమ అద్భుతమైనది. తెలుగు నేలపై శ్రీరాముని మది మదిలో గుడి కట్టేల చేయడంలో రామదాసుని కీర్తనలే కీలకం. అందులో ప్రధానంగా

శ్రీరామ మీ నామమేమి రుచిరా...... అంటూ రామ నామంలో ఉన్న భక్తిని ఒక అద్భుతమైన భక్తిరసంగా రూపొందించారు. ఈ విధంగా భక్తిలో ఉన్న మాధుర్యాన్ని కీర్తనల రూపంలో ప్రజల నాలుకలలో నాట్యం చేసేలా అద్భుతంగా రచించాడు.

**నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి**

అని ఆర్ద్రతతో తన యొుక్క భక్తి భావనను వెలువరించాడు. ఈ విధంగా గోపన్న అద్భుతంగా ఆర్ద్రంగా తన కీర్తనలను భక్తి పారవశ్యంతో అతులిత మాధురి మహిమలతో భక్తిరసంలో ఉన్న మాధుర్యాన్ని తెలియ జేసాడు.

## ఉపయుక్త గ్రంథ సూచీ :

1. శ్రీ అన్నమాచార్యుల కీర్తనలు : శ్రీ ఏడిద బాలసుబ్రహ్మణ్యేశ్వర శర్మ, రోహిణి, పబ్లికేషన్స్ (2009).
2. శతక కవుల చరిత్ర : పండిత వంగూరి సుబ్బారావు పంతులు, 1957.
3. రామదాసు కీర్తనలు : మంచాళ జగన్నాథ రావు, 1975.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# ప్రబంధ సాహిత్యంలో హాస్యరస పోషణ

– **నడిమెట్ల శివశేఖర్,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదారాబాద్.

**నవ్వడం ఒక భోగం**
**నవ్వించడం ఒక యోగం**
**నవ్వలేకపోవడం ఒక రోగం.**

అని ఒక సినీ కవి అన్నట్టుగా నవ్వడం అనేది మానవులు మాత్రమే చేయగలిగే ఒక ప్రక్రియ. ఇది మనుషులకు ఒక గొప్ప సంపద.

దీనిని బట్టి హాస్యం యొక్క ప్రాముఖ్యత ఎట్టిదో మనం గమనించవచ్చు. నవ రసాల్లో ఒకటైన హాస్యానికి మన కవులు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానమే కల్పించారు.

ఆధునిక సాహిత్యంలో హాస్యానికి పెద్దపీట వేస్తూ అనేక నవలలు, నాటకాలు, కథలు, కథానికలు వచ్చాయి. అయితే ప్రాచీన సాహిత్యంలో మాత్రం హాస్యం అనేది అంగ రసంగా మాత్రమే ఉన్నదని చెప్పవచ్చు.

## ఆముక్త మాల్యద :

రాయల కవిత్వం ఎంత గాఢంగా, ఉదాత్తంగా వున్నా సున్నితమైన హాస్యం కూడా కనిపిస్తుంది. అధికారుల లంచగొండి తనాన్ని సరసంగా వివరించాడు. యామునాచార్యుడు సభలో ప్రవేశించగానే ఆ వైష్ణవ వటుని పొట్టిదనం చూసి రాయలవారికే చిరుహాసం కలిగింది లేకపోతే ఈ పద్యం ఎలా వస్తుంది.

**"సంగతియె యోయిసుమంత టింగణావు**
**తత్త్వ నిర్ణయ వాదంబు తరమె నీకు**
**నోడి తే నియు బట్టి మొఱ్ఱోయనంగ**
**లింగమును గట్ట కుడగ యెరింగి నొడువు"**

రాయల వర్ణనా వైభవానికి, సహజ సుందరమైన కమనీయ ఊహా వైభవానికి, చమత్కార కల్పనకే చిహ్న పతాకంగా నిలిచే బాతుల దృశ్యాన్ని వర్ణించే

**"తల పక్షచ్చట గ్రుచ్చి బాతువులు కేదారంపు కుల్యాంతర**
**స్థలి నిద్రింప జూచి యా రెకులస్స్నాత ప్రయాతద్విజా**
**వలి పిండీకృత వాటకల్పది దదావాసంబు జేర్పంగరే**
**వుల డిగ్గన్వెస బాఱు వాని గని నవ్వుసాలి గోప్యాఘ**
**ముల్"**

అనే పద్యంలో బాతులు రెక్కలలో తల దూర్చుకొని నిద్రపోతున్నాయి. ఆ రేకులకు అదృశ్యం బ్రాహ్మణులు స్థానం చేసి పిండి పెట్టి మరచిపోయిన వస్త్రాల్లా అనిపించి దగ్గరకి వెళ్లి ఆ వస్త్రాలు తీసి బ్రాహ్మణులకు అందించాలని వెళ్తే ఆ చప్పుడుకి బాతులు లేచి ఈదుకుంటూ వెళ్ళిపోయాయి. ఈ సంఘటన చూసిన పైరు కాపల యువతులు నవ్వుకున్నారట. రాయలు తాను చూసిన దృశ్యాన్ని ఇంత అద్భుతంగా అక్షరీకరించటం గొప్ప చమత్కారమే. ఇలా రాయలు రచించిన ఆముక్త మాల్యదలో హాస్యం కూడా మనకు కనబడుతుంది.

## పాండురంగ మహాత్మ్యం :

పాండురంగ మహాత్మ్యం రచించిన తెనాలి రామకృష్ణుడు హాస్యరసంలో ఆరితేరిన వాడే. పాండురంగ మహాత్మ్యంలో భక్తి రసం ప్రధానమైనది. అయిన అక్కడక్కడ సున్నితమైన హాస్యం మనకు కనిపిస్తుంది. సున్నితమైన హాస్యం అంటే నవ్వుకాని నవ్వును చూస్తాం. దశావతార స్తుతిలో బుద్ధావతారం వర్ణిస్తూ చెప్పిన

**"ప్రతిదిన కేశలుంచనపు రాయిడి నెట్టన పట్టిగట్టి పై**
**పుత పుత మంచునున్న కుఱుబోడతలన్ ధరియింప**
**నోడియున్**
**సతమగు సొమ్ముగాన విడజాలవుగా శిఖిపింఛవల్లి! సౌ**
**గత మతధుర్య! దానికటి గట్టుము పుట్టము మిన్న**
**కేటికిన్ "**

అనే పద్యంలో హాస్యం గంభీరంగా ప్రదర్శించాడు. "బుద్ధుడు నున్నగా గుండు కొట్టించుకొని ఉంటాడు.

బుద్ధావతారంలో శిఖిపించం తలలో ధరించడానికి వీలుకాదు కనుక, నడుమున గల పుట్టము తొలగించి ఫించం నడుమును కట్టుకొమ్మనాడు మరి బట్టసంగతీ యనగా "బట్టతల" లో బట్ట ఉన్నది కదా, అది చాలదా! అంటాడు. అని ఇందులోని హాస్యాన్ని దాశరధి వివరించాడు.

సుశీలోపాఖ్యానంలో ప్రస్తుతంబని పదార్థములు రాజులు వేడికొని తెచ్చియమ్మించు కోమటిండ్ల.... అనే పద్యంలో సుశీల భర్త లోభిత్వ గుణాన్ని తెలిపే సందర్భంలో చిరునవ్వును గమనిస్తాం.

**పారిజాతపహరణం :**

నంది తిమ్మన రాసిన పారిజాతాపహరణములో నారదుడు కృష్ణుడి చేత పనులు చేయించుకున్న సందర్భములో

**మేళవించినవి దీని మెట్లని మాంసలాసంబున మహతి జేర్చి**
**మిన్నేటి జలము సుమ్మీ తొలంకెడునవి డా చేత మణికమండల వొసంగి**
**యిది జపోచితము సుమ్మీ జతనంబిని - వలచేత బద్మాక్ష వలయమిచ్చి**
**యీశాను డిచ్చె జమ్మి మాకు నిదియని - శార్థుల చర్మంబు జంక డొనిపి పొమ్ము పొమ్మని యొక్క పోవ బోవ**
**రమ్ము రమ్మని మరల జౌరంగ బిలిచి**
**కపట నటనా పరుండైన కంసవైరి**
**బరమముని నవ్వుటాలకు బనులు గొనియే**

అనే పద్యంలో సున్నితమైన హాస్యం రేఖామాత్రంగా కనిపిస్తుంది.

ఈ విధంగా ప్రపంధ కవులు తమ ప్రబంధాలలో శృంగారానికి పెద్దపీట వేసిన సందర్భానుసారం హాస్యానికి కూడా ప్రాధాన్యమిచ్చి వారు కూడా హాస్య ప్రియులే అని చాటుకున్నారు.

ఈ సెమినార్‌లో ఈ అంశంపై ప్రసంగ పత్ర సమర్పణకు నాకు అవకాశం కల్పించిన సదస్సు నిర్వాహకులకు కృతజ్ఞతలతో సెలవు.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# తెలుగు నవలా సాహిత్యం – నవరసాలు

– మలిపెద్ది నాగరాజు, స్నాతకోత్తర విద్యార్థి (ద్వి.సం.), తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ & పీ.జి కళాశాల, సిద్ధిపేట, తెలంగాణ.

మానవుడు తన జీవితంలో అనేక అనుభూతులకు లోనవుతాడు. అనేక సంఘటనలు అనేక రకాలుగా ప్రభావితం చేస్తు ఉంటాయి. అలా మానవుడు ప్రభావితం అయిన సమయంలో మానవుడు వివిధ హవ భావాల ద్వారా తన అభిప్రాయాన్ని అనుభూతిని వ్యక్త పరుస్తాడు దానినే రసానుభూతి అంటారు. అలాంటి నవ రసాలలో కరుణ రసం గూర్చి ఈ వ్యాసం ద్వారా వ్యక్త పరుస్తున్నాను.

రసం అనగా ఆస్వాద యోగ్యమైన గుణము అనగా మనం అనుభూతి చెంది ఆస్వాదించేదే రసం. రసంను పురాణాలలో, వేదాలలో క్షీరము, సారము, జలము అని వివిధ రకాలుగా వివరించారు. రసం మొదట సోమ పానకంకు వాడబడింది. అధర్వణ వేదంలో రుచి అని వాడబడినది. ప్రాచీన నాట్య శాస్త్రంలో రస శబ్దాన్ని మొట్టమొదట వివరించాడు. అలంకారికులలో రసాలు ఎనిమిది అని భరతుడు పేర్కొంటే, ఉద్భటుడు తొమ్మిది అని, మరి కొందరు అలంకారికులు పది రసాలను ప్రతిపాదించారు. అలా ప్రతిపాదించిన సాహిత్య పరంగా నవ రసాలను పేర్కొంటు అలంకారికులు ప్రతి రసానికి స్థాయీభాము రెండు పేర్కొన్నారు.

రసాలలో శృంగార రసాన్ని భోజుడు రసరాజంగా తన సరస్వతి కంఠంభరణంలో పేర్కొంనే భవభూతి తన అలంకార గ్రంథంలో ఏకోరస:కరుణమేవ అనీ కరుణ రసన్నే రసరాజంగా పేర్కొన్నాడు. ప్రతి మనిషి వేరొక మనిషిపై కరుణ, జాలి, ప్రేమ అని భావాలను కలిగి ఉంటాడు. అలా కరుణ యొక్క ప్రాముఖ్యం జీవితంపై ఎంత ఉంటుంది. ప్రాచీన సాహిత్య కావ్యలు, ఇతిహాసాలు, వివిధ రసాలను కలిగిస్తాయి. అనేక ప్రముఖ గాథలు శృంగార, కరుణ రసాలతో నిండి ఉన్నాయి. సంస్కృతి ఆది కావ్యం అయిన రామయణం కరుణ, శాంత, వీర రసాలు కలిగి కరుణ రసాత్మకంగా ముగుస్తుంది. అలా మహాభారత గాథలు, వీర, శౌర్య, క్రోద, కరుణ రసాలతో నిండి ఉంటాయి. ఇలా తెలుగు సాహిత్యం సంస్కృత సాహిత్యంలో అనేక కథలు గాథలు, గేయాలు, పాటలు రసాన్నే ప్రధానంగా కలిగి ఉంటాయి. దానిని బట్టి, కావ్యలలో, కథలలో, రసప్రధాన్యం తెలుస్తుంది. ఆధునిక సాహిత్యం అనేక నూతన వచన, గేయ ప్రక్రియలతో నిండి ఉంది. కథలు తమ రచనలలో వివిధ భావాలను సంఘటనలను తమ రచనల ద్వారా కళాత్మకంగా చిత్రిస్తూన్నారు. అలాంటి వచన ప్రక్రియలో కథ, కథానిక, గల్పిక, నవల వంటి ప్రక్రియలు అధునిక సాహిత్యంలో ఎంతో ప్రాధన్యతనలు పోషిస్తున్నాయి.

నవల సమాజంలో వ్యక్తుల మనస్తత్వాన్ని గాని సమాజంలో సంఘటలను వస్తువుగా చేసుకొని రచయితలు నవలను రచిస్తారు. అలాంటి నవలలో వివిధ మనస్తత్వాలు వివిధ పాత్రలు, వివిధ సంఘటనలు మన యొక్క మనస్సుని వివిధ రకాలుగా స్పృషిస్తాయి. నవలలోని పాత్రలు మన యొక్క మనస్సుని వారి కదలికతో ముందుకు గమింపజేస్తూ వివిధ ఆలోచనలను, భావాలను కలిగిస్తాయి. అలా మనలో వివిధ రసానుభూతిని పెంపోందిస్తాయి. అలా నవలా రచయిత మనలో నవరసాలను తన కాళత్మక చిత్రణ ద్వారా పాత్రల ద్వారా కలిగింపజేస్తాడు. అలా కందుకూరి గురజాడ, చిలకమర్తి, విశ్వనాథ వంటి మహాకవులు వారి నవలలు కావ్యాల ద్వారా ప్రజలలో కరుణ, వీర, రౌద్ర, భయానక, బీభత్సం వంటి రసాలను కలుగజేస్తూ వారిలో చైతన్యం తీసుకొని వచ్చారు.

నవీన్, బుచ్చిబాబు, యండమూరి వీరేంద్రనాథ్ వంటి మనోవైజ్ఞానిక నవలా కారులు ఒక వ్యక్తిలో ఉండే భావాలను వ్యక్త పరచారు. ఇలా నవలలు వివిధ రసాలను

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

అవి కలిగించే విభావ అనుభవాలను స్థాయి భావాలను మనలో కలిగిస్తాయి.

అలా అంపశయ్య నవీన్ రచించిన కరుణ అనే నవల ఎంతో కరుణ రసాత్మకంగా ఉంటుంది. అందులో కరుణ పాత్ర మన మనస్సును ఆ పాత్రతో పాటు తన లోకంలో వివిధ అనుభూతులకు గురిచేస్తుంది. ఆ పాత్ర తన మనస్తత్వం, తను పెరిగిన పరిస్థితులు మనలో ఆశ్చర్యాన్ని వ్యక్త పరుస్తూ మనల్ని ఆలోచించే విధంగా ఉంటుంది. తన స్నేహం, స్నేహితుల మనస్తత్వాలు చూసినపుడు ఆ పాత్రలు మనలో ధైర్యాన్ని నమ్మకాన్ని ప్రేరేపించేలా ఉంటాయి. వారితో కరుణ పొందిన ఆనందం వారిని వీడి వెళ్తున్నప్పుడు తను కొల్పోతున్నప్పుడు తన పరిస్థితి బాధగా అనిపిస్తుంది, సుజాత ఇంటి పరిస్థితులు చూసినపుడు మరియు సుజాత అనురాధ సినిమా విషయాలు మాట్లాడిన సమయంలో ఉత్సాహంగా అనిపిస్తుంది. కరుణ వారిని వీడి వెళ్తున్నప్పుడు బాధకరంగా తోస్తుంది. కరుణ వరంగల్ నుండి హైద్రాబాద్‌లో కొత్త కళాశాలకు వెళ్లినప్పుడు అక్కడ నర్మద పరిచయం ఆనందంగా అనిపించిన విస్మయానికి గురిచేస్తుంది. వరంగల్‌లో భాస్కర్ కరుణను ప్రేమించడం కరుణ పాత్ర విషయంలో చూసినట్లయితే ఆశ్చర్యాన్ని గురి చేస్తుంది. కరుణ నాన్న డి.సి.పి అయిన కరుణకు భాస్కర్‌కు వివాహం చేస్తానని చెప్పి వారిలో ఆశలను పెంచి అంతకంటే గొప్ప సంబందం అయిన మంత్రి సంబందం రాగానే మాట మార్చడం వంటి పరిస్థితులు క్రోదాన్ని కలిగిస్తాయి. కరుణ తన తల్లి కుటుంబ సభ్యులతో తనకు పెళ్ళి వద్దని చెప్పే సందర్భంలో వారు తనకు అడ్డు చేప్పే పరిస్థితులు ఎంతో కరుణ రసాత్మకంగా అనిపిస్తూ జుగుప్సకు గురి చేస్తాయి. కరుణ ఆత్మహత్య చేసుకోవడానికి నిర్ణయం తీసుకున్న సందర్భం మనలో వివిధ రకాల ఆలోచనలకు గురిచేస్తూ హస్య కరుణ, వీర, రౌద్ర, భయానక, బీభత్స, అద్భుత రసాలను ఒకేసారి కలిగిస్తాయి. తన చివరి లేఖలలో తను మరణంతో తన నాన్నకు సంబంధం లేదని తెలిసినపుడు తనలో గల క్షమా గుణం మనల్నీ ఆశ్చర్యపరుస్తూ ఆలోచించే విధంగా చేస్తుంది. కరుణ ట్వెక్‌టెల్ బాటిల్ తాగి మరణించినపుడు కరుణ కుటుంబంపై జిగుప్స, క్రోదాన్ని, రౌద్రన్ని కలిగిస్తాయి. అలా నవీన్ కరుణ నవల మొదటి నుండి చివరి వరకు కరుణ రసాత్మకంగా సాగుతూ వివిధ రకాల భావాలను కలిగిస్తాయి. కరుణ నవలలో భాస్కర్ యొక్క ప్రేమ, వియోగ, విప్రలంబ శృంగారన్నే సూచిస్తుంది. ఇలా నవల మనలో అనేక రసాలను ఆలోచనలను, అలజడులను, వివిధ భావాలను రేకెత్తిస్తాయి.

**ఉపయుక్త గ్రంథసూచీ :**

1. అంపశయ్య నవీన్ : కరుణ, దాగుడు మూతలు నవల
2. ఇమద్దిలేటి సాహిత్య దీపిక

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# ప్రబంధ సాహిత్యంలో వెల్లివిరిసిన శృంగార చంద్రికల భోగవైభోగ్యం

– డా॥ పల్లి చిన్నారావు, ఆంధ్ర విశ్వకళాపరిషత్, వాల్తేరు.

జంతుజాతులలోకాని మానవజాతిలోకాని మగ, ఆడ (పురుష, స్త్రీ) సంబంధాలు అనునిత్యాలు. అంతేకాదు అనునిత్య (కొందరి విషయంలో అనుక్షణ) వసంతాలు.

**"శృఙ్గార ఏవ మధురః సర్వ ప్రహ్లాదననో రసః**
**తన్మయం కావ్యమాశ్రీత్య మాధుర్యం ప్రతితిష్ఠతి"**

(ఆనందవర్ధనుడు:ధ్వన్యాలోకం:ద్వితియోద్ద్యోతం:శ్లో. 7)

అన్నాడు ఆనందవర్ధనుడు. (శృంగారమే అత్యధికంగా ఆహ్లాదాన్ని కలిగించే మాధుర్యమైన రసం). ప్రబంధ యుగ కవులు శృంగార వర్ణనలలో 'పాపం' శక్తివంచన - అనకూడదు ఆలోచనావంచన - లేకుండా యథాశక్తి కష్ట పడ్డారు. రసరామణీయక పద్యాలను సద్యోహృద్యంగా సహృదయ నైవేద్యంగా ఆంధ్ర పాఠకులకు నైవేద్యంగా కాదు షడ్రసోపేత భోజనంలా చక్కని 'చిక్కని' ఆమెతగా అందించారు. స్థూలంగా వాటి రుచిభోగాలివి.

మనుచరిత్రను ప్రథమాంధ్ర ప్రబంధంగా విమర్శక విద్వద్వరేణ్యులు కీర్తించారు. కానీ చారిత్రక సాక్ష్యం ప్రకారం నంది తిమ్మన 'పారిజాతాపహరణం', 'ప్రబంధ పారిభాషిక' పద అర్థంలో తొలి ప్రబంధం. (నన్నెచోడుని కుమారసంభవం ప్రథమ ప్రబంధం అన్నారు మహానుభావులైన విమర్శకులు. అది స్తవమో వాస్తవమో. తాత లేకుండా తండ్రి, తండ్రి లేకుండా మనవడూ ఉండడూ. ఆధునిక విమర్శకులు పేర్కొన్న ప్రబంధ లక్షణాలను స్వీయ గర్భితం చేసుకున్నదీ, రచనాకాలం దృష్ట్యా రాయలనాటి ప్రబంధాలలో మొదటిదీ పారిజాతాపహరణం).

కాబట్టి రాయల యుగ ప్రబంధాలలో పారిజాతాపహరణమే ప్రాథమికం.

ఆధునిక విమర్శకులు ప్రబంధానికి పేర్కొన్న లక్షణాలలో 'శృంగార రసం' ప్రధాన రసంగా ఉండాలనేది. లక్ష్యంతోటే లక్షణం. జీవితంలో శృంగారం వైయక్తికానుభవం. కావ్యంలో వర్ణించబడే శృంగారం - దాన్నే ఆలంకారికులు కావ్య (ప్రబంధ) నాయికానాయకుల పరంగా శృంగార రసం అన్నారు. కవులది రసపోషణే. నాయికా నాయకులు దివ్యులైనా, అదివ్యులైనా వారివారి శృంగారనుభవాల్ని తమ తమ ఊహాపోకలతో అతిశయోక్తి ఆడంబరాలతో యధాశక్తి వర్ణించారు. గ్రంథం (ప్రబంధం) రాణించాలంటే శృంగార రసం ప్రధాన రసం కావాలి అనేది ప్రబంధ యుగకవుల ముఖ్యలక్షణం. అదే ప్రబంధ లక్షణాలలో ఆధునిక విమర్శకులు పేర్కొన్న అపరిహార్య లక్షణం. రాయల యుగంలో వెలువడిన క్షేత్రమాహాత్మ్య ప్రబంధాలలో కూడా ఈ శృంగార రిరంసా లక్షణం సకృన్మాత్రంగా కాదు బాహాటంగానే పరిఢవిల్లింది.

కృష్ణరాయల యుగంలో వెలువడిన ప్రబంధాలలో మొట్టమొదటిగా పేర్కోదగిన 'పారిజాతాపహరణం'లో శృంగార రసం నాటి సాటి ప్రబంధాలకంటే ఏ మాత్రం అతిశయంగా వర్ణింపబడలేదు. పారిజాతాపహరణంలో కావ్యకథకు సంబంధించినంత వరకు సత్యాకృష్ణుల ప్రణయానురాగమే చిత్రితమైంది. కృష్ణుడు దక్షిణ నాయకుడు అలంకారశాస్త్రపరంగా. రుక్మిణి, సత్యభామ, జాంబవతి, మిత్రవింద, భద్ర, సుదంత, కాళింది, లక్షణ అనే అష్టభార్యలతో ఆయన కొలువుండేవాడట. వాళ్ళూ, కాకపోతే తాను కోరిన వేళల కోరికలు తీర్చే భోగాయుక్తుడైన శ్రీకృష్ణుని లీలావిలాసాలు పారిజాతాపహరణంలో ప్రసక్తాలు. ఏది ఏమైనా తిమ్మన కావ్య సృజనలో సత్యాకృష్ణుల అనురాగమే ప్రధానం. పట్టమహిషి రుక్మిణీ సౌధంలో ఉన్న కృష్ణుని దృష్టంతా సత్యభామ మీదే. సత్యభామ గర్వం కూడా అదే.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

**"చక్కని దాన నంచు నెలజవ్వని నంచు జగంబులోనఏ బే**
**రెక్కిన దాన నంచు"**

**(పారిజాతాపహరణం, ప్ర. ఆ. ప. 66)**

కులరూప సౌందర్యంతో మిడిసిపడిన సత్యభామ నిజంగా 'ఖండిత నాయిక'. అంతకుమించి 'స్వాధీన పతిక'. పారిజాతపుష్పాన్ని శ్రీకృష్ణుడు రుక్మిణికి ఇచ్చిన సంగతి తెలుసుకున్న సందర్భంలో సత్యభామ ప్రవర్తన తీరును తిమ్మన వర్ణించిన తీరు అపూర్వం. కృష్ణుడు ఆమె మందిరానికి వెళ్ళి అలుకతీర్చిన తీరు అనన్య సామాన్యం. సత్యచేత పాదతాడనం చేయించాడు. (దీనికి ఎక్కడా మూలం లేదు).

**"జలజాతాసన వాసవాదిసుర పూజా భాజనం బై తన**
**యట్టికాంత లుచిత వ్యాపారము ల్నేర్తురే"**

'నేర్వరే' అని అర్థాంతరన్యాసాలంకారం. ఇది ద్వాపర యుగం నాటి విశేషం. అయినా కాకపోయినా ప్రబంధ యుగ (జనశ్రుతి) విశేషం కూడా! అంతేకాదు రాయల నాటిదే కాదు నేటిది కూడా! పారిజాతాపహరణం ద్వితీయాశ్వాసం చివరలోను, తదుపరి ఆశ్వాసాలలోను శృంగార రసం వాచ్యంగా కాక సూచ్యంగా చిత్రించ బడింది. తిమ్మన చిత్రించిన శ్రీకృష్ణుడు మురళీకృష్ణుడే కాదు మోహన కృష్ణుడు కూడా! కాగా పారిజాతాపహరణ ప్రబంధ నాయకుడు కృష్ణునికి ప్రతిబింబం కృష్ణ రాయలే అనటంలో విప్రతిపత్తి లేదు. కామదృష్టి కాని భోగసృష్టి తిమ్మనది.

ఇక మనుచరిత్ర మరో మెట్టు పైకి వెళ్ళింది. అల్లసాని 'అల్లిక జిగిబిగి'తో శృంగార సంబంధమైన భౌతిక విలువలతోపాటు ఆధ్యాత్మిక విలువలతోటి పరిపుష్టమైంది మనుచరిత్రం. ప్రబంధ యుగ భౌతిక విలువలలోని శృంగారానికి సొంపైన, కనువింపైన వినువిందైన తెర ఎత్తింది మనుచరిత్ర. మనుచరిత్ర రాయలనాటి మన చరిత్రే. నాటి సంప్రదాయ విలువలకు, తోసుకు వస్తున్న నూతన (భౌతిక) విలువలకు అద్దం పట్టింది మనుచరిత్ర.

ఆ విలువలు, వాటి సంఘర్షణ మీది రెండు ప్రకరణాలలో వివరించ బోతున్నవనీ ఊచముట్టుగా విశ్లేషణా పూర్వకంగా వివరిస్తానని విన్నవించుకుంటున్నాను. అయితే మనుచరిత్రలో మాత్రమే - పెద్దన నాటి శృంగార వైభోగ్యాన్ని చిత్రించింది స్వరోచివృత్తాంతంలోనే మను చరిత్రకు మూలమైన మార్కండేయ పురాణంలో స్వరోచి - మనోరమ, విభావసి, కళావతులను వివాహమాడతాడు. ఇది కథాకాలం నాటి విషయమే కాదు. ప్రబంధ కాలం నాటి విషయం కూడా!. బహుభార్యత్వం నాటి రాజ సంప్రదాయం. భోగలాలసతాపేక్ష దాని అసలు అంతర్లీన లక్షణం. కృష్ణరాయలు పెద్దనను "మనువులలో స్వారోచిష, మను సంభవమరయ రససమంచిత కథలన్' అలరారే కథను రచింప మన్నాడు. ఆ కథల్లోనిదే స్వరోచికథ. పెద్దన మనుచరిత్ర షష్ఠాశ్వాసంలో కథాపరంగా శృంగార రస పోషణను సద్వినియోగం చేసుకున్నాడు. మనోరమా స్వరోచుల 'ప్రథమ రాత్రి'ని విపులంగా వర్ణించాడు. భార్యాభర్తల లేక ప్రియాప్రియుల సమాగమం సృష్ట్యారంభం నాటి నుంచి నేటి దాకా ఉన్నదే. కాదనలేని వాస్తవం.

'ప్రథమ రాత్రి' కి 'మేడమీద' అమర్చిన పరికరాలు ఇవని పెద్దన వర్ణన. 'మేడ' పెద్దన నాటిదే.

**"పాండురప్రభఏ గ్రిందువడిన చీఁకటివోలె**
**జిగి నొప్పు నీలంపు జగతి మెఱసి"**
**"రమణునికడ కనుప మనో**
**పము వెట్టి జవాది నంటు వాపి నిపుణతన్"**
**"చెంగల్వపూదండ సేర్చి పెందుఱుముపై**
**ఘనసారమున సూసకము ఘటించి"**

**(మనుచరిత్ర, ష. ఆ. పద్యాలు 3,4,5)**

శృంగార రాసిక్యం రవళించిన భోగలాలస వర్ణనకు ఇది మచ్చుతునక. కల్పన అనుకోవటానికి అవకాశం లేకపోలేదు. 'జవాది' పెద్దన నాటిదే.

ప్రబంధాలలోని శృంగార వర్ణనలు అన్నీ వర్ణనా వైచిత్రి విలసితాలే తప్ప అనుప్రయుక్తాలే. అవి ప్రబంధయుగ భోగవిలాసాలే. అవన్నీ దివ్యనాయికా నాయికోత్త ములకు

ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సదాశివపేట.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

ప్రబంధ కవులు ఆపాదించిన తమనాటి భోగలాలసతలే. అది ఆ యుగధర్మం.

కాగా ప్రబంధయుగ కావ్యాలలో ఉపాఖ్యాన కథ దృష్ట్యా నాయకుడు అనదగ్గ వాడు పాండురంగ మాహాత్మ్యంలోని నిగమశర్మ. ఇతడు 'భ్రష్టనాయకుడు'. పేరు గొప్ప. నిగమాలలో (వేదాలలో) శర్మ (పండితుడు) కావాలి అని పాపం తండ్రి పెట్టుకున్న పేరు. ఏనాడైన తల్లి దండ్రుల ఆకాంక్ష అదే. అయితే 'నిగమశర్మ' పేరు 'నేతి బీరకాయ' అయింది. ఇతడు అదివ్యుడు. కథాకాలం ఏదైనా ప్రబంధయుగ కాలంవాడే. "ప్రాసగువిత్తువంటి నెఱపాఱుకొలంబునఁ బుట్టి'న వాడు. (పాం. మా. తృ. ఆ.ప.3) అహితాగ్ని అయిన సభాపతి కుమారుడు. అతని యౌనవ స్థితి ఇది.

**"వనితామానస సూనసాయకుఁడు, జీవత్తాతపాదుండు, భూ**
**జన సన్మాన్య విశుద్ధవర్తనుఁ",**
**- (పాండురంగ మాహాత్మ్యం, తృ. ఆ. ప. 6)**

రామకృష్ణకవి పద్యం ఎత్తుగడే అవశ్యం భావి కథార్థ సూచనం. నిగమశర్మ వనితల మనస్సులకు మన్మథుడట. జీవించిన (సంపాదించిన) తండ్రి గలవాడు. వాచాలతలో వాడిని మించినవాడు లేడట. చంద్రకాంతి సదృశుడట. లోటేమున్నది. "నిచ్చలుంబులు గడుగంగ బడ్డ నును ముత్యము ఁబోలుచు వాలుంచుం బురిన్" (తృ.ఆ.ప.9) తిరుగాడటం మొదలుపెట్టాడట. వివాహం అయింది. ఆ నిగమశర్మకు-

**"భార్య పాలిండ్లు రిక్తకుంభములు, రోయి**
**వెలఁది చనుదోయి నిండుకుండలు, కులంబు**
**తరుణిఫాలంబు చవతి చందురుఁడు, వేశ్య**
**నుదురువానికిఁ బ్రతిపదిందుండు నయ్యె"**
**(పాండురంగ మాహాత్మ్యం, తృ. ఆ. ప.11)**

నట. నిజమే. తెనాలి రామకృష్ణకవి "సరసార్థ బోధఘటనా హేలాపరిష్కారు"డు (ప్ర. ఆ. ప. 27) ఈ పద్యంలో ఉపమాన స్వీకారం రామకృష్ణుని ప్రతిభకు పట్టం కట్టటమే కాదు నిగమశర్మ పాత్రచిత్రణకు కలికి తురాయి.

**"ఉష్ణ న హోమాగ్నియూఁదనొల్లఁడు గాని**
**విరహజ్వరార్తుఁడై వెచ్చనూరు"**
**(పాండురంగ మాహాత్మ్యం, తృ. ఆ. ప. 12)**

"స్కందపురాణ నీరనిధి కౌస్తుభమై ప్రభవించు దేవకీ నందను సత్కోథో దయము" (ప్ర. ఆ. ప. 26) ను ప్రబంధీ కరించిన రామకృష్ణకవి స్వతంత్ర కల్పనం ఇది. మూలం పాత్ర. వర్ణన రామకృష్ణకవిది. శ్రీనాథ యుగ కాలానికే అగ్రవర్ణీకులైన బ్రాహ్మణులలో నేడు మనం అను కుంటున్న సామాజిక విలువలతో పతనావస్థ ప్రారంభ మైంది. దానికి శ్రీనాథుని కాశీఖండంలోని 'గుణనిధి' పాత్ర; ఆ మహాకవిదే బహుశా చివరి కృతి అయిన 'శివ రాత్రి మాహాత్మ్యం'లోని 'సుకుమారు'ని పాత్ర నిదర్శ నాలు. శ్రీనాథుని కాలం నాటి 'అస్తి నాస్తి విచికిత్సా సహో దర' మయిన శృంగార విలువలు ప్రబంధయుగంలో 'యథేచ్ఛ'గా కవుల రచనలలో పరిఢవిల్లాయి. శ్రీనాథుని గుణనిధి, సుకుమారులకు రామకృష్ణకవి 'నిగమశర్మ' అన్న. కందుకూరి రుద్రకవి 'నిరంకుశోపాఖ్యాన' నాయకుడు నిరంకుశుడు వాళ్ళని తలదన్నినవాడు.

ఇష్టం వచ్చినట్లు తిరుగుతూ, ఇంటి గడప తొక్కని నిగమశర్మ ఇంటికి అతని అక్క (పేరులేని సజీవ పాత్ర) వస్తుంది. ఇల్లు చక్కబెడుతుంది. ఎక్కడి నుంచో ఊడి పడ్డాడు తమ్ముడు నిగమశర్మ. మందలించింది. సుద్దులు చెప్పింది. 'ఆషాడభూతి' నిగమశర్మ విన్నాడు. నమ్మకం కలిగించాడు. ఒకానొక రోజు రాత్రి ఇల్లు ఊడ్చిపెట్టి నగలు, నాణాలతో పారిపోయాడు. అడవిలో దొంగలు దోచుకున్నారు. కొట్టారు. ఒక కాపువాడు రక్షించి ఇంటికి తీసుకెళ్ళి, సకలోప చారాలు చేశాడు. ఆ కాపుకోడలు నిగమశర్మ మీద మరులు కొన్నది. జాతర సమయంలో ఆమెను లేవదీసుకుపోయాడు. ఆమె అనుకోకుండా చనిపోయింది. నిగమశర్మ తర్వాత ఒక ప్లవ (మాల) కన్యకతో సంసారం చేస్తాడు. ఆమెతో సంతానాన్నికంటాడు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

ఆమె చనిపోతుంది. తర్వాత కథను అలా వుంచితే నిగమ శర్మ నూటికి నూరుపాళ్ళు నాటి అగ్రవర్ణీకులు అందరికీ ప్రతినిధి కాదు. అది నిస్సంశయం. కాని నాటి సమాజంలో ఆధిపత్యధోరణి చెలాయించే ఒక వర్గంలోని బలహీనతను నాటి సమాజపరంగా అదే వర్గానికి చెందిన కవి చిత్రించటం విశేషం. కవి ఏ కథ (ఇతివృత్తం) అయినా స్వీకరించవచ్చు. కానీ స్వీకరించిన ఇతివృత్తాన్ని తనదైన ధోరణిలో చిత్రించవచ్చు. దానిలో సమకాలీన సమాజ పరిస్థితుల్ని చొప్పింపచేయటం విశేషమే. అల్లసాని పెద్దనాదులకంటే పౌరాణిక ప్రతిపత్తిని విడిచి, సాంఘిక పాత్రతో రామకృష్ణుడు చేసిన కథా ('పద ' కాదు) గుంభనం ఇది.

రాయలయుగ ప్రబంధాలలో సంగ్రహ ప్రబంధం కందుకూరి రుద్రకవి 'నిరంకుశో పాఖ్యానం'. రుద్రకవి రాయల అష్టదిగ్గజ కవులలో ఒకడని జనశ్రుతి. చాటువులు కలవు. వాటి మూలాలు సంశయాస్పదాలు.

నిరంకుశోపాఖ్యానంలోని ఇతివృత్తం పాత్రల దృష్ట్యా పౌరాణికమే. అయినా రుద్రకవి దీనిని సాంఘిక ప్రబంధంగా తీర్చిదిద్దాడు. కథా నిర్వహణం అడుగుడునా పౌరాణిక ప్రతిపత్తితోనే సాగుతుంది. నిరంకుశుడు ఎవరో కాదు. శ్రీనాథుని గుణనిధి, సుకుమారులకు; రామకృష్ణుని నిగమశర్మకు, స్వయానా అన్న. వాళ్ళ కంటే నాలుగు ఆకులు ఎక్కువ చదివినవాడు.

'మాణిక్యపురం' అనే పురంలో సురశర్మ అనే కర్మిష్ఠి ఉన్నాడు. అతడు అపర భాషాపతి. అతనికో కొడుకు పుట్టాడు. 'వేదాది విద్యా నిరంకుశు'డు అవుతాడని భావించి తల్లిదండ్రులు 'నిరంకుశుడు' (ఎవరిచేత అడ్డగించబడనివాడు) అనే పేరు పెట్టాడు. వేద, శాస్త్రాలు నేర్పించారు. పెళ్ళి చేశారు. మొదట్లో అతడు ప్రవరాఖ్యుడే! కానీ ఆ తర్వాత నిగమశర్మకు సమఉజ్జీ అయ్యాడు. జూదంలో ఆరి తేరాడు. కొంగున ఎప్పుడూ పాచికలు ఉండేవి. విటసార్వభౌముడు అయ్యాడు.

"చేరి కన్నడభూమి జెరపట్టు పాశ్చాత్య నృపతికైన నొకింత కృపదలిర్చు 'గాని' లంజతల్లికి దయలేదు లక్షయైన' (నిరం. 2-42) నిరంకుశుడు దొరికినంత మేరకు డబ్బుతెచ్చి, దోసిళ్ళతో వేశ్యమాత దగ్గర కుమ్మరించేవాడు. ('పాశ్చాత్య నృపతి' పద ప్రయోగం. రుద్రకవి కాలం నాటికి పోర్చుగీసుల ప్రాబల్యం పెరిగింది. వాళ్ళకి గౌరవదరాలు మాత్రమేకాదు దండప్రణామాలు చేసే స్థితి ఏర్పడింది. అదే కవి ప్రయోగ వైశిష్ట్యం) భార్య, తల్లి చేసిన హితబోధలు అతనికి చెవికి ఎక్కలేదు. నిదానించి నట్లు ఉన్నా ఒకనాటి రాత్రి తెల్లవారుతుందనగా భార్య నగలు - నల్ల పూసలుతోసహా మూటగట్టుకొని బయట పడ్డాడు". వేశ్యాగృహం చేరుకున్నాడు. ఎన్నాళ్ళు సాగుతుంది. బయటకు గెంటారు. నిరంకుశుడు అడవులు పట్టాడు.

అడవిలో ఒక శివాలయం ఉంది. ఆ పాడుబడిన గుడిలోని దేవుణ్ణి చూసి నిరంకుశుడు 'నాతో జూద మాడుతావా?' అన్నాడు. కొంగుముడి విప్పి పాచికలు తీశాడు. 'పందెం ఏమిటని అడిగాడు'. నీ ఆయుధాలు, వాహనాలు, వస్త్రాలు అక్కర్లేదుగాని "లంజ లంజ పన్నిదమునకున్" (తృ. ఆ. ప. 13) అన్నాడు. ఓడినవాళ్ళు గెలిచిన వాళ్ళకు అడిగిన ఒక వేశ్యను సంపాదించి ఇవ్వాలి అన్నాడు. "నీ యెత్తు నేనె యాడెద, నీ యెడలం బొంకు లేక" (తృ. ఆ. ప. 18) అని ఇద్దరి తరుపునా పందెం తనే వేశాడు.

**"ధృతి పెంపొందగ సారెసారె పయిసారెం జూచు చున్నారెవో,**
**వ్రతఱిం బోవుచు జోడుగట్టుతఱి రివ్వు లీమ్రఱ జోడించుచున్"**
**(నిరంకుశోపాఖ్యానం, తృ. ఆ. ప. 20)**

పందెంలో నిరంకుశుడే గెల్చాడు. (ఇక్కడ దేవుడు ముఖ్యంకాదు లేకపోతే కథలేదు) దేవుడు మాట్లాడలేదు. నిరంకుశుడు 'పాగడదండ' వేశాడు"[4]. దేవుడు ప్రత్యక్షమయ్యాడు. నిరంకుశుడు రంభను కోరుకున్నాడు. ఏమైనా చివరకు శివుడు ఆమోదించాడు. నిరంకుశుడు ఆమెతో ఇష్టోపభోగాలు అనుభవించాడు. ఆమెను మెప్పించాడు. ఆమె ఇలా అన్నదట.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

**"మనసిజకేళికి భూసుర**
**తనయా, నీసాటి రారు దలపగ నేలా?"**
**(నిరంకుశోపాఖ్యానం, తృ. ఆ. ప. 64)**

తర్వాతి కథ మామూలే. ఈ వృత్తాంతంలో గమనించ దగిన అంశాలు మూడు. 1) నిరంకుశుడు బ్రాహ్మణోత్తముడు, ఇతివృత్త ప్రారంభంలో. కానీ జాతి భ్రష్టుడు అయ్యాడు, 2) పరమశివునితోనే జూదమాడటం, 3) రంభను కోరుకోవటం. ఆమెతో భోగాలు అనుభవించటం. ఇవి కథలోని అంశాలే అయినా ప్రబంధ యుగ భోగలాలసతకు పరోక్ష సూచకాలు. రక్తి భక్తిని త్రోసి రాజన్నది ఈ వృత్తాంతం. ఎంతటి మహాకవి అయినా తానున్న సమాజాన్ని మరచిపోలేడు. మిగిలిన ప్రబంధాల కంటే పాపం రుద్రకవి ముందుకుపోయి నాటి భౌతిక విలువల్ని - జూదం, వేశ్యాగమనం - వీటినిమించి భక్తి కంటే రక్తి రమ్యమని (పరోక్షంగా) చాటటం గమనార్హం. సమకాలం పాఠకలోకం మెచ్చిన రచనలు అవి.

## పాదసూచికలు :

1. శయన మందిరంలో పొరపాటున రాయలదేవిది కృష్ణదేవరాయల శిరస్సును 'వామ' పాదంతో తాకిందట. రాయలు కుపితుడయ్యాట, ఆ ఆలుమగలు పొరపొచ్చాలు తీర్చటానికే తిమ్మన 'పారిజాతాపహరణం' రచించాడట. నిజమేనేమో! కల్పన ఎప్పుడూ వాస్తవానికి పెద్దన్న. స్తవమో, వాస్తవమో తిమ్మనార్యునుది ముద్దుపలుకే - 'అమరుక శతకం' (సంస్కృతం)లో కోపించిన నాయిక 'పాదతాడనం' చేసినా తప్పులేదని చెప్పబడింది - అది అంతిమ శ్లోకం.

**"సా లక్తకేన నవపల్లవ కోమలేన**
**పాదేన నూపురవతా మదాల సేన**
**య స్తాడ్యతే దయితయా ప్రణయాపరాధాః**
**త్స్యే జ్గీ కృతా భగవత్ మకరధ్వజేన"**

తిమ్మన ఈ ఉదాహృతశ్లోకాన్ని అనుసరించడా? లేక కృష్ణరాయలకు ఆ అనుభవం ఎదురైందా అని విచికిత్స. 'చికిత్స' (డాక్టర్లు చేసే పని) తిమ్మన చేశాడేమో. వాస్తవం అయితే స్తవం, కల్పిత జనశ్రుతి అయితే నిజంగానే ప్రబంధ కవి మూర్ధన్యుడు నంది తిమ్మనకవి ధన్యుడు. బహుశా ఈ పారిజాతాపహరణ ప్రబంధంతో పుణ్యం, పురుషార్థం సాధించుకున్నాడు నంది తిమ్మన మహాకవి.

2. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి, సారస్వతాలోకము, నిగమశర్మ అక్క,(వ్యాసం)పుటలు 63-71.

**"రామకృష్ణుడమృతములో లేఖినినద్ది దిద్ది తీర్చి యాడించిన పుత్తడిబొమ్మ యిది"**

(పుట 63) - అనేది ఆయన సహృదయ సమాలోచిత పరిణితవాక్కు.

3. నిరంకుశుడికి తల్లి చేసిన హితబోధ 'పాండురంగ మాహాత్మ్యం' లోని నిగమశర్మ అక్క హితబోధను పోకింది. నిగమశర్మ భార్య నోట్లో నాలుకలేనిది. కానీ నిరంకుశుడి భర్య కాస్త నోరుగలదే. నిగమశర్మ మారినట్లు నటించాడు. నిరంకుశడూ మారినట్లు నటించాడు. నిగమశర్మ ఒక అర్థరాత్రి దొరికినంత మేరకు మూటగట్టుకొని పరారయ్యాడు. నిరంకుశుడూ అంతే. పాండురంగ మాహాత్మ్యం నిగమశర్మ వృత్తాంతపు అడుగుజాడలలోది ఈ వృత్తాంత చిత్రణ. బహుశా నాడు మిగిలిన వర్ణాలను వదిలితే, బ్రాహ్మణుల్లో సైతం నిగమశర్మలు, నిరంకుశులు తటిల్లతల్లా మెరుస్తుండేవారని స్పష్టం.

4. "కవిరాజుకంఠంబు కౌగలించెనుగదా - పురవీధి నెదురెండ పొగడదండ"

అని శ్రీనాథుడు తనను గూర్చి చెప్పుకున్న (చాటు) పద్యంలో 'పొగడదండ' ప్రయోగం ఉంది. అప్పు తీర్చలేనివారికి వేసే ఇనుప సంకెళ్ళు, తోళ్ళో అని చెప్పాలి. చూ. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - ప్రతాపరెడ్డి సురవరం, పుటలు 279-280. కానీ అవి వట్టి సంకెళ్ళు తాళ్ళు అయి వుండవు. ముళ్ళతో కూడినవి అయివుండాలి. సంకెల మామూలు శిక్ష. పొగడదండ - కఠిన శిక్ష.

**ఆధార గ్రంథాలు :**

1. అచ్యుతరావు, టేకుమళ్ళ - విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్ర వాఙ్మయ, చరిత్రము (ప్రథమభాగము), రాజమండ్రి స్వీయ ఎలక్ట్రాక్ ప్రెస్, 1993.
2. డా॥ పల్లా దుర్గయ్య - ప్రబంధ వాఙ్మయ వికాసము, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2013.
3. డా॥ కాకర్ల వేంకటరామనంహం - ఆంధ్ర ప్రబంధములు - అవతరణ వికాసములు, వాల్తేరు, ఆంధ్ర విశ్వకళాపరిషత్, 1965.
4. సత్యనారాయణ, కంభంపాటి - ఆంధ్రల చరిత్ర - సంస్కృతి -2, హైదరాబాద్, నేషనల్ బుక్ ట్రస్ట్, 1992.
5. ఆరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్యం, (ప్రథమ, ద్వితీయసంపుటాలు), హైదరాబాద్, తెలుగు అకాడమీ, 2012.

❖❖❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# మను చరిత్రలో శృంగార రస పోషణ

– **చెమనపల్లి పృథ్వీరాజు,** స్నాతకోత్తర విద్యార్థి, తెలుగు విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు అయిన శ్రీ కృష్ణ దేవరాయలు విద్య వినోదములు నిర్వహించే సభా భవనమునకు భువనవిజయం అని పేరు. ఎనిమిది దిక్కులందును ఎనిమిది సింహ పీఠికల మర్చి వాటి పైన ఎనమండుగురు కవులను ప్రతిష్టించి శ్రీకృష్ణ దేవరాయలు విద్య వినోదము నిర్వహించెడి వారు. ఈ ఎనమండుగురు కవులే అష్ట దిగ్గజ కవులు. అల్లసాని పెద్దన, రామరాజ భూషణుడు, ధూర్జటి, ముక్కు తిమ్మన, తెనాలి రామకృష్ణుడు, పింగళి సూరన, మాదయగారి మల్లన, అయ్యలరాజు రామభద్రుడు మొదలగు వారు. వీరు రచించినవే ప్రబంధాలు. అవి మనుచరిత్ర, వసు చరిత్ర, శ్రీకాళహస్తీశ్వర శతకం, పారిజాతాపహరణం, పాండురంగ మహత్యం, కళాపూర్ణోదయం, రాజశేఖర చరిత్ర, రామాభ్యుదయంలు.

అష్ట దిగ్గజములున్న శ్రీ కృష్ణ దేవరాయల కాలాన్ని అనగా 16వ శతాబ్దాన్ని తెలుగు సాహిత్య చరిత్రలో ప్రబంధ యుగం అంటారు. ఇతని కాలంలోని కావ్యాలను "ప్రబంధాలు" అంటారు.

ప్రబంధ శబ్దం సంస్కృత వాఙ్మయంలో సాహిత్య ప్రక్రియల సామాన్య నామంగా కనిపిస్తుంది. సాహిత్య చరిత్ర కారులు "కుమార సంభవం"ను ప్రథమాంధ్ర ప్రౌఢ ప్రబంధం అన్నారు. తెలుగులో క్రీ.శ. 12 వ శతాబ్దానికి చెందిని నన్నెచోడుడు తన కుమార సంభవంలో ప్రబంధ శబ్దాన్ని ప్రబంధ కార్య లక్షణాలను సమగ్రంగా పేర్కొన్నాడు. శ్రీనాథుడు తన హరవిలాస కావ్యాన్ని శైవ ప్రబంధం అని పేర్కొన్నాడు.

ప్రకృష్టమైన బంధం కలిగి అష్టాదశ వర్ణనలు ఉన్న కావ్యాన్ని ప్రబంధం అంటారు. తొలి తెలుగు సమగ్ర ప్రబంధం మను చరిత్ర. రామరాజ భూషణుని రచన వసుచరిత్ర రచన రసోచిత చమత్క్రియా కల్పనాకల్ప భవ్యములు. రాయల కాలంలో పరిపాలన కాని సాహిత్యంలో కానీ స్వర్ణయుగం అంటారు.

**ప్రబంధ లక్షణాలు :** (1) పురాణేతిహాసాల నుండి కథను గ్రహించుట, (2) ఏక నాయకాశ్రయత్వం, (3) వస్త్వైక్యం, (4) అష్టాదశ వర్ణనలు కలిగి ఉండాలి. (5) శృంగారం రస రాజముగా ఉండాలి. (5) అలంకారికమైన శైలి ఉండాలి, (7) సజీవ పాత్ర చిత్రణ ఉండాలి. (8) అనువాదం కాక స్వతంత్ర రచన అయి ఉండాలి.

18 వర్ణనలు ఉండాలి అని కావ్యాలలో అష్టాదశ వర్ణనలు చేయాలని చెప్పిన వాడు దండి మహాకవి ఒక్కడే. దండి చెప్పిన అష్టాదశ వర్ణనలు (1) నగర వర్ణన, (2) సముద్రం, (3) పర్వతం, (4) ఋతువులు, (5) చంద్రోదయం, (6) సూర్యోదయం, (7) ఉద్యానవనం, (8) జలక్రీడ, (9) మధుపానం, (1) రతి, (11) విప్రలంబం, (12) వివాహం, (13) కుమారోదయం, (14) మంత్రం, (15) దౌత్యం, (16) ప్రయాణం, (17) యుద్ధం, (18) నాయకాభ్యుదయం మొదలగునవి ఉన్నాయి.

అసలు రసం అంటే ఏమిటి? రసం అనగా ఆస్వాద యోగ్యమైన గుణం. రసము చేతనే కావ్యం జీవిస్తుంది. నిజానికి రసమే కావ్యమునకు ఆత్మవస్త్వలంకార ధ్వనులు. ఎల్లప్పుడూ రసం పర్యవసాయిగానే ఉంటుంది. "విభావానుభావ వ్యభిచారీ సంయోగాద్రస నిష్పత్తి" అని భరతుడు అన్నాడు. విభావాలు, అనుభవాలు, వ్యభిచారి భావాల సంయోగం వలన ఉద్భవించునదే రసం.

**శ్లో॥ "విభావై రనుభావైశ్చ సాత్యకై ర్వ్యభిచారిభి**
**అనీయమాన్ల స్వాద్యత్వం స్థాయిభావో రసస్మృత్ణ"**

అని ధనుంజయుడు సూత్రీకరించాడు.

విభావాలు (ఆలంబన, ఉద్దీపన) అనుభవాలు (4), సాత్త్విక భావాలు (8), వ్యభిచారి భావాలు (33) చేత

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

అస్వాత యోగ్యతను పొందింప బడిన (అనుభవింప బడిన) స్థాయి భావమే రసమని చెప్పాడు ధనుంజ యుడు.

భరతుడు పేర్కొన్న రసాలు 8. శాంత రసాన్ని భరతుడు పేర్కొనలేదు. భరతుని నాట్యశాస్త్రంలోని అష్టరస నిర్వచ నానికి, శాంత రసాన్ని చేర్చి ఉద్భటుడు తన కావ్యాలంకార సంగ్రహంలో నవ రసాలను మొదటిసారిగా ప్రతిపాదిం చాడు. నవరసాలు - స్థాయి భావాలు. (1) శృంగారం - రతి, (2) హాస్యం - హాసం, (3) కరుణం - శోకం, (4) వీరం - ఉత్సాహం, (5) రౌద్రం - క్రోధం, (6) భయానకం - భయం, (7) బీభత్సం - జుగుప్స, (8) అద్భుతం - విస్మయం, (9) శాంతం - శమము.

రసములలో రాజు శృంగారం బహు పండితాభి ప్రాయం ప్రకారం రసరాజం శృంగారం. శృంగారమే రస రాజమని భోజుడు సిద్ధాంతీకరించాడు.

**శ్లో॥ "ఆమ్నా శిషుర్దశ రసాన్ సుధియో వయంతు**
**శృంగారమేవ రసనాత్ రసమామ నామ"**

అని అన్నాడు.

పెద్దలందరును రసములు 10 అని అనుచున్నారు. మాత్రం శృంగారమొక్కటే రసమని అంటాము. రసాభావం 15 రకాలు. అందులో మొదటిది శృంగార రసాభాసం. శృంగార రాసాభాసం 3 రకాలు అని విద్యానాథుడు చెప్పాడు. అందులో మొదటిది ఏకత్రైవాను రాగం, రెండ వది మ్లేచ్ఛగతం, మూడవది తిర్యగ్గతం. ఏకత్రైవానురాగం అనగా స్త్రీ పురుషురిరువురిలో అనురాగం ఒకరి యందుండి మరొకరి యందు ఉండక పోవుట. ఇది ఒక రసమే. ఇందులో మొదటి దానికి చెందినది వరూధని ప్రవర ఘట్టం.

అష్టదిగ్గజ కవులలో అల్లసాని పెద్దన మొదటి వారు. అతని రచనలను మెచ్చుకొని శ్రీ కృష్ణ దేవరాయలు స్వయంగా గండపెండేరం కాలికి తొడిగినాడు. అష్ట దిగ్గజ కవులలో పెద్దనకు ఉన్న గౌరవం అపారం. రాయల దృష్టిలో మరియు కవుల, పాఠకుల దృష్టిలో కూడా. అందుకే "పెద్దన వలె కృతి చెప్పిన పెద్దనవలే" అని కవి చౌడప్ప అల్లసాని పెద్దన కవిత్వాన్ని ప్రశంసించాడు. ఆయన గురించి విశ్వనాథ సత్యనారాయణ గారు "అల్లసాని వారి అల్లిక జిగిబిగి" అన్న పరిశోధన గ్రంథాన్ని వ్రాసారు.

అల్లసాని పెద్దన రచనలలో ముఖ్యమైనది రాయల ప్రబంధ కాలంలో ఎక్కువ పేరు తెచ్చినది మనుచరిత్ర. తెలుగులో సమగ్ర ప్రబంధ లక్షణాలతో వెలువడిన మొదటి రచన మనుచరిత్ర.

మనుచరిత్ర ప్రబంధ కథకు మూలం మార్కండేయ పురాణంలోని కథ మనుచరిత్ర ప్రబంధానికి స్వరోచిష మనుసంభవం అన్న పేరు కూడా ఉంది. మనుచరిత్ర 6 అశ్వాసాలు శృంగార ప్రబంధం. ఇందులో ప్రధాన ఘట్టాలు, వరూధుని ప్రవరాఖ్యుల ప్రణయ వృత్తాంతం, స్వరోచి మనోరమల వృత్తాంతం, ఇందీవరుని వృత్తాంతం, విభావసి కళావతుల వృత్తాంతం, మనువు పుట్టుక. ఇందులో వరూధిని ప్రవరాఖ్యుల ప్రణయ వృత్తాంతం ముఖ్యమైనది, శృంగార పరమైనది.

**స్వారోచిష మను సంభవ కథ :** ప్రవరుడనే బ్రాహ్మ ణుని ఇంటికి ఒక సిద్ధుడు అతిథిగా వచ్చి, ఒక పసరును ప్రవరుని పాదాలకు రాస్తాడు. ఆ పసరు ప్రభావంతో హిమవత్పర్వతముల వద్దకెళ్లి అక్కడి పుణ్య ప్రదేశాలు చూస్తాడు. మంచువల్ల పాదాలకున్న పసరు కరిగిపోయి ఇంటికి వెళ్లలేక దారి వెదుకుతూ ఉంటాడు. అక్కడ గాంధర్వ యువతి వరూధిని ప్రవరుని అందాన్ని చూసి వలచి, ప్రేమించమని అర్థించగా ఆమె ప్రార్థనను మన్నించక అగ్ని దేవుని దయ వల్ల ఇల్లు చేరుతాడు. ఇదివరలో నిరాకరింపబడిన గాంధర్వ కుమారుడొకరు ఈ సమయంలో ప్రవరుని వేషంలో వరూధినిని చేరగా వారికి స్వరోచి అనే కుమారుడు కలుగుతాడు. స్వరోచికి పుట్టిన కుమారుడే స్వారోచిషుడు. అతడే తరువాత మనవయ్యాడు. అందుకే ఈ కావ్యానికి స్వారోచిష మను సంభవం అని పేరు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

ఇందులో మొదటి రెండాశ్వాసము లందునూ శృంగార రసభాసంతో వరూధిని ప్రవరాఖ్యుని కథ ఉన్నది. శ్రోత్రి యుడు జితేంద్రియుడు అయిన ప్రవరుని శాంత ప్రవృత్తికిని, స్వేచ్ఛా చరితమైన వరూధిని కామ ప్రవృత్తికిని సంఘర్షణము చక్కగా వర్ణించబడినది. వరూధిని ప్రవరుల పాత్రలను సజీవములుగా వర్గీకరించుటలో పెద్దన చాలా నేర్పును ప్రదర్శించాడు. వరూధిని ప్రవరాఖ్యుల సంవాద ఘట్టాలను శాంత శృంగారాల ఘర్షణలకు ప్రతీక. మను చరిత్ర యందలి ప్రధానరస నిర్ణయ విషయంలో విమర్శ కులలో అభిప్రాయ భేదాలున్నాయి. అందలి అంగీరస మును సోపపత్తికముగా నిరూపించుట ప్రత్యేక విషయం.

ప్రవరుడు "శీలంబున్ గులమున్ శమంబు దమమున్ జెల్వంబు లేఁబ్రాయము" కలిగి శమమునకు ఆలాపనమై ప్రథమంగా ప్రత్యక్షమగును. తల్లిదండ్రుల మీద గౌరవం, సమాజం పట్ల అవగాహన, పరపత్నిని, పరకాంతను కోరనివాడు, ఇతరుల యందు గౌరవం కలిగిన వాడు ప్రవరుడు. హిమవత్పర్వతాలలో వరూధిని ప్రవరాఖ్యుని అందాన్ని చూసి, ఎలాగైనా అతన్ని సంభోగించాలని, అతనికి దగ్గర కావాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తుంది. ఇక్కడ శృంగార రసము ఉంది. ప్రవరుని బాహ్య సౌందర్య మును చూసి వరూధిని వలచి అతనిని వలపింప జేసుకొనచూసినది. అతడు తనను నిరాకరించు చున్నాడని భావించి అతని మనస్సును మార్చడానికి ప్రయత్నిస్తుంది. అగ్ని తేజో మధ్యంగదుడై ప్రవరుడంతర్హితుడైనాడు. ప్రవ రుడు ఏమైనది, ఎక్కడికెళ్లినది వరూధునికి తెలియదు. కనుకనే విరహ వేదనతో కృంగి కృషించినది. తన తలపును కాదన్న వాడు మరునాడైన కనబడక పోతాడా అని ప్రత్యాషతో ఎదురు చూసింది. మాయా ప్రవరుని యందు భ్రాంతవశంన అన్నట్లు నిర్దిష్టముగు అనురాగమామెకు కలదు. ఇట్లా వరూధిని మాయ ప్రవరుల సమాగమమున ఉభయత్ర అనురాగమున్నది. మాయా కల్పితము వలన ఏర్పడు శృంగారమగుటచే అది రసబాసయే అనుకున్నాను వికాత్రాను రాగమను రస బాసము కాదు. కాలాంతరమున నైనను వరూధినికి వంచన తెలియలేదు. అసలు ప్రవరుడే తన ప్రియుడని విశ్వసించింది.

కాబట్టి శృంగార రసబాసం అసాధారణమైనది. దీనిని సాధారణ సన్నివేశంగా భావించరాదు. ధర్మ ప్రతిష్టాప కుడగు మను సంభవమున ఈ సంగమము కారణ మగుట విధి నిర్ణయం. అందువలననే గంధర్వుని మోసం బయట పడలేదు. మహా పురుష సంతానం అసాధారణమై దురవ గాహంగా ఉండునని పెద్దన ఇందుమూలంగా బోధిం చాడు.

ప్రవర తేజో భావనతాత్మయగు వరూధిని యందు గాంధర్వ తేజస్సుతో జన్మించినవాడు స్వరోచి. ఇతడు మాయా ప్రవరునికి, వరూధినికి జన్మించాడు. అతడు ధర్మోత్సాహ ప్రణయముల మేలి కలయిక గంధర్వాభీజ సంజాతుడు కావున స్వరోచిలో మొదట శృంగారమే ప్రధానంగా ధర్మోత్సాహం అప్రదానంగా ఉన్నది. కనుకనే అతడు బహుకులమతడు భోగాసక్తుడై ఉన్నది.

ఇలా మను చరిత్రలో శృంగార రసము ప్రధానమై ఉన్నది. ప్రవరాఖ్యుడు పరకాంతను వలచిన వాడు కాదు. కానీ వరూధిని ప్రవరాఖ్యుని ప్రేమించింది. శృంగారం కోరింది. కానీ మాయా ప్రవరుని వలలో పడింది. స్వరోచికి తల్లి అయింది. ఆమె కొడుకు కూడా శృంగారంలో ప్రథముడు. ముగ్గురు భార్యలను చేసుకొని శృంగార రసాన్ని పోషించాడు. ఇలా ప్రవరాఖ్యుడు శాంత రసాన్ని పోషిస్తే వరూధిని స్వారోచి శృంగార రాసన్ని పోషించాడు. ఈ శృంగార వర్ణనల్లో పెద్దన ఎంతో రమ్యంగా సహజంగా, సామెతలలో వర్ణించి రక్తి కట్టించాడు.

❖ ❖ ❖

# నాటక సాహిత్యం – రసం – రస సమన్వయం

– శ్రీమతి రాజ్యలక్ష్మి, 'ప్రతిభారత్న' రచయిత్రి.

భారతీయ కావ్యసిద్ధాంతాలయిన 1. రసం, 2. అలంకారం, 3. గుణం, 4. రీతి, 5. ధ్వని, 6. వక్రోక్తి, 7. ఔచిత్యం, అన్న ఏడింటిలో రస సిద్ధాంతమే ఉత్తమమైనదని అలంకారికులు నిర్ధారించారు. రస సిద్ధాంత ప్రవక్త క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందిన భరతుడని మానావల్లి రామకృష్ణ కవి వ్యక్తీకరించారు. భరతుని 37 అధ్యాయాల 'నాట్యశాస్త్రం'లో 6వ అధ్యాయంలో రస - భావ చర్చ ప్రస్థావించబడింది. మానవకోటి జీవన ధ్యేయం, గమ్యం ఆనందాను భూతి. నిరంతర ఆనంద గనేషణ ఫలితము సౌందర్యం. సౌందర్యపు ఆరాధన ఆనంద స్థితికి ప్రథమ సోపానం. ఆలంకారికుల అధ్యయనాల, వాదనల ప్రకారం రసం అనేది నాటకాలు, కావ్యాల సందర్భాన కళారసం అని పేర్కొనబడినది, ఆ కళారసాన్ని సహృదయుడే అనుభవిస్తాడు.

**రసమనే పదం వ్యుత్పత్తి**

↓

| ఋగ్వేదం | అధర్వణ వేదం | వేదాంతము | ఉపనిషత్తులు | లోకం | ఔషదశాస్త్రం |
|---|---|---|---|---|---|
| సోమరసం<br>జలము<br>పాలు | నది, రుచి | ఆత్మ / పదార్థం | సారం | పానీయం | పాదరసం |

రస్యతే ఇతి రసః రస్యతే = ఆస్వాధ్యతే రస సిద్ధాంతము భారతీయ సంస్కృతిగానే అలంకారికులు గుర్తించారు. 'సహృదయుడు' రస సిద్ధాంతానికి పునాది. సహృదయుని హృదయం.. స్వచ్ఛమైన తళతళలాడే అద్దమై కవి హృదయం అందులో ప్రస్ఫుటంగా ప్రతిధ్వనిస్తూ ప్రతిఫలిస్తుంది.

**"యేషాం కావ్యానుశీలన వశాత్**
**విశదీ భూతే మనోముకురే**
**వర్ణనీయ తన్మయిభవన యోగ్యతా**
**తే హృదయ సంవాద భాజః సహృదయాః**
**(ఆనందవర్ధనుడు)**

**"యస్తు ష్టాతుష్టి మాప్నోతి శోకే శోకముపైతిచ**
**క్రోధేక్రుద్ధోభయే భీరుస్స శ్రేష్ఠః ప్రేక్షకస్సృతః**
**(భావ ప్రకాశం)**

సహృదయుడికి రసానికి ఉన్న సంబంధం: సహృదయుని మనో దర్పణంలో ప్రతిభావించే సౌందర్య సారమే రసం. రస భావాన్ని కల్గించే శబ్దశక్తి రసధ్వని. భరతుడు రస సిద్ధాంతాన్ని నాటక పరంగా అన్వయిస్తే ఆనంద వర్ధనుడు మొదలైనవారు రసాన్ని శ్రవ్యకావ్యాలకు అన్వయించారు. శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలనేవి విషయ గుణాలు. కాగా శ్రోత్రః త్వక్ చక్షు, జిహ్వా, ఘ్రాటాలు అనేవి జ్ఞానేంద్రియాలు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500




**రసానందము అనే పదాన్ని అలంకారికులు ఐదు విధాలుగా అభివర్ణించారు**



ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500




రసరాజం - శృంగారం సర్వ ప్రాణులకు అభీష్టమైన రసం. రసాలన్నింటిలో శృంగార రసానికి హృదయాన్ని ద్రవింపజేసే శక్తి ఎక్కువగా ఉంది. తక్కిన రసాలు పరి పోషణలోను, చివరి దశలోనూ మాత్రమే ఆనందాన్ని కల్గిస్తాయి. కానీ శృంగార రసం మాత్రం మొదటినుంచి చిత్త సుఖాన్ని కలిగించి ఆనందాన్ని ఇస్తుంది. లోకంలోనూ కావ్యంలోనూ మొదటినుంచి ఆమోదయోగ్యం శృంగారం మాత్రమే. ఈ దృష్ట్యా శృంగారం రసరాజమై అగ్రస్థానాన్ని వహిస్తుంది. మానవ జీవితంలో శృంగార వీరాలకు ప్రాధా న్యత ఉండగా శృంగారంలో మిగిలినవి వ్యక్తిగతమైన రూపాలుగా మాత్రమే ఇమిడిపోతాయి.

**అభిజ్ఞాన శాకుంతలం** : రసం - పోషణ కాళిదాస విర చిత శాకుంతలం నాటకాన అంగిరసంగా శృంగారమును చెప్పుకొనవచ్చు.

దుష్యంతుడు కణ్వాశ్రమంలో శకుంతలను చూడడం, శకుంతల పట్ల ఆకర్షితుడవడం, ప్రేమించి గాంధర్వ వివాహం చేసుకొనడం, వారిరువురి విరహం ప్రియదర్శ నార్థ తలపు, దాంపత్యం, రాజు వెడలడం, శకుంతల దుష్యంతుని తలుచుకుని వియోగాన వివశత ఈ వర్ణనలు అన్నింట ఔచిత్య భంగం లేని శృంగార రస పోషణ జరిగింది. అంగిరసం శృంగారముగా రాజిల్లితే, శకుంతల దుష్యంతుల వియోగ వర్ణనలో విప్రలంభ శృంగారము, మాధవుని మాటల ద్వారా హాస్యం, శకుంతలను సాగ నంపే సందర్భాన కణ్వాదులు పొందిన ఉద్వేగాలలో కరుణం, సానుమతి తిరస్కరణీ ప్రభావ ఆవిష్కరణలో అద్భుతం, సర్వదమనుడు - సింహం పిల్లల ఆటలాడే సందర్భంలో వీరం, అంగ రసాలుగా పోషింపబడి నాట కానికి వన్నె తెచ్చాయి.

**శృంగార రస పోషణ** : సహృదయ నైవేద్యంగా రచించిన ఈ నాటకంలో ప్రథమాంకం మొదలు నాయికా నాయ కుల ప్రణయం, విరహం, విప్రలంభ శృంగారాన్ని వర్ణించి, చివరి అంకంలో వారి కలయిక ద్వారా మరల శృంగారమే సాధించి, శృంగారాన్ని అంగి రసంగా పోషించారు. కావ్యేషు నాటకం రమ్యం, నాటకేషు శకుంతలా అన్న నాటకాన్ని సార్థక నామధేయం చెయ్యడంలో శృంగార అంగి రస పోషణ రససిద్ధికి తరగని పెన్నిధి

**ప్రతాపరుద్రీయం - వేదంవారు!** ప్రతాపరుద్ర నాటకంలో ప్రస్తావన భాగంలో శరదృతువర్ణనతో ప్రారంభించడం వలన నాటకం వీరరస ప్రధానమని చెప్పవచ్చు.

రసపోషణ ప్రధమాకంలో హాస్యరసం, తొమ్మిదో అంకంలో వియోగ శృంగారం, యుగంధరుని చర్యలోను, ఓడలో జరిపిన కార్యనిర్వాహణలో అద్భుతరసం, ఖుస్రూఖాన్ కళేబర దర్శనంలో ఓడలో భయానకరసం. అయిదవ అంకం రెండవ స్థలంలో "గ్రద్ధలు బుఱ్ఱ బొండ్లములతో బండువు గాలించుచున్నవి" అనే ఘట్టంలో భీభత్సరసం, అష్టమాంకంలో సుల్తాను వలీ ఖానుని పట్టి చంపుతానని లేవటంలో రౌద్రరసం, చర మాంకంలో రాణి పూజలో శృంగారభేదమైన భక్తిరసం అంగరసాలుగా చక్కగా అమరి నాటకాన్ని రక్తి కట్టించాయి.

'న భావహీనో రసో నభావోరసవర్జితః' భావహీనమైన రసం ఉండదు. రసహీనమైన భావం ఉండదు అని ఆత్మ ప్రత్యయంతో శాసన సమానమైన అభిప్రాయాన్ని భర తుడు వ్యక్తీకరించాడు. కావ్యమార్గాలైన అలంకారం గుణం, రీతి, ధ్వని, వక్రోక్తి ఔచిత్యం అని ఎన్ని ఉన్నా గమ్యస్థానం రసానుభూతి. తాదాత్మ్య స్థితి రూపంలో సహృదైక వేద్యంగా ఉంటూ ఉంటుంది.

శృంగారం రసాభాసం రసవిషయకమైన ఆభాసం. లేనిది వున్నట్టుగా భాసించడం అవుతుంది. రసాభాస భావాన్ని అలంకారికులు శృంగార రస పరంగానే చూశారు.

**ఈ రసాభావం నాలుగు విధాలు :**

1. **ఏకత్రైవానురాగం :** నాయికానాయకులలో ఒకరి లోనే అనురాగం ఉండి రెండో వారిలో లేక పోవడం. ఉదా:మనుచరిత్రలో వరూధినీ ప్రణయం, సారంగధర చరిత్రలో చిత్రాంగి సారంగధరల అనురాగం.
2. **మ్లేచ్ఛగత శృంగారం :** నీచ ప్రవృత్తి గలవారిని ఆలంబనంగా స్వీకరించడం. వారు సాత్త్వికాది భావాలు కలిగే వరకూ ఆపుకోలేరు. వర్ణిస్తే వారి కామోద్రేకమే మనకు ఆభాసమైనా ఆనందప్రదం అవుతుంది.
3. **తిర్యక్ గతమైన శృంగారం :** తిర్యగ్గతమైన శృంగారం ఆభాసం. ఉదా: పెద్దన మనుచరిత్రలో చక్రవాకి విరహం, అనంతామాత్యుడు గోవ్యా ఘ్రసంవాదంలో గోవు సర్వప్రాణి సాధారణమైన మాతృమూర్తిగా గోచరిస్తుంది.
4. **ఉభయనిష్ఠమైన అనుచిత శృంగారం :** ప్రీతి ఇద్దరి లోనూ వున్నప్పటికీ అనుచితమైనప్పుడు ఆ శ్రంగారం రసాభాసం అవుతుంది.

1. **గురుపత్నీగతం :** తారాశశాంక విజయం గురువు సతి తార, శిష్యుడు చంద్రుని తోటి శృంగారం
2. **మునిపత్నీ గతం :** అహల్యా సంక్రందనం గౌతమ ముని భార్య అహల్యతో ఇంద్రుడు సంక్ర మించడం.

ఈ విధం గా శ్రంగార రసం కావ్య మార్గాల పయనించి సహ్రదయులకు రసానుభూతుల వోలలాడించింది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - ప్రొపెసర్ వెలమల సిమ్మన
2. సాహిత్య విమర్శ - పొట్టి శ్రీరాముల విశ్వవిద్యాలయం

❖❖❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# భార్గవరామ చరిత్రం - వీర రసపోషణ

**- జి. రమేశ్,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

విశ్వశ్రేయ: కావ్యమ్ అన్నారు మహానుభావులు. అట్టి కావ్యము పద్య రూపమైన, గద్య రూపమైన, చంపూ రూపమైన సరే జగత్తుకు ఉపకారార్థమై, ఆయా కావ్య గుణాల చేత శ్రోతలను, పాఠకులను రంజింప చేయాలి. ప్రాచీన అలంకారికుల అభిప్రాయం ప్రకారం కావ్యం రస ప్రాధాన్యతను బట్టి రెండు విధాలుగా ఉండవచ్చు అన్నారు. అవి శృంగార, వీరరస ప్రాధాన్యం కలవి. ఇవి అంగిరసాలుగా ఉండి, తక్కినవి అంగరసాలుగా ఉం డవచ్చు.

భార్గవరామ చరిత్రం అనే పద్య కావ్యమును అను ముల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారు రచించారు. ఈ కావ్యంలో కథేతివృత్తాంతాన్ని పరశురామునికి సంబంధిం చిన చరిత్రను స్వీకరించారు. ఇది ముఖ్యంగా వీరరస పోషణతో సమ్మిళితమై, ధర్మ రక్షణ సంబంధమైనది. మానవ సమాజం సుఖశాంతులతో వర్ధిల్లాలి అంటే ధర్మ మార్గాచరణమే ప్రధాన కర్తవ్యం. ధర్మానికి క్షితి కల్గినచో లోకం నశించునని, మనకు శాస్త్ర గ్రంథాలు స్పష్టంగా వివరించును. అందు వలన ధర్మరక్షణం ప్రధాన విధి. ఇట్టి ధర్మరక్షణ ప్రబోధ ప్రధానమైన ఇతివృత్తాంతాన్ని అనుముల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు స్వీకరించి, ఈ ఇతివృత్త ప్రాధాన్యముపైననే తమ బుద్ధిని కేంద్రీకరిం చారు.

ఈ భార్గవరామ చరిత్రం 10 అశ్వాసాల మహాకావ్యం. దీనిని హరిహరనాథునికి అంకితమిచ్చాడు. ఇది ఒక్కటే కాకుండా విద్వద్దం పతీ విలాసం, పోతన చరిత్ర, కర్నూల్ చరిత్రం మొదలైన వినూత్న కావ్యాలను చారిత్రక దృష్టితో రచించారు.

అటువంటి కర్తవ్యం బోధన అనుముల వేంకట సుబ్ర హ్మణ్య శాస్త్రిగారు తమ భార్గవరామ చరిత్రం ద్వారా తెలియచేశారు. ప్రధానంగా ఇది పౌరాణిక, చారిత్రక, ధార్మికత,చ మహాకావ్యత్వం అన్న నాలుగు లక్షణాలు సమ్మిశ్రమైన గొప్ప కావ్యం భార్గవరామ చరిత్ర అని చెప్పవచ్చు.

ఇట్టి భార్గవరామ చరిత్రం భృగువంశోద్భవుడైన శ్రీ పరశురామ భగవానుని దివ్య కథాత్మకం. ఈ మహా పురుషుడు ప్రసేనజిన్మహారాజు పుత్రికయైన రేణుకాదేవి యందు ఋచిక మహర్షి పుత్రుడైన జమదగ్ని మహామునికి జన్మించిన ఐదవ కుమారుడు. సకల విద్యా సారంగతుడు, సర్వాస్త్రకుశలుడు మహాతపోధనుడై శ్రీ మహావిష్ణువు ఆరవ అవతారంగా ప్రఖ్యాతి చెందిన అసాధారణ జన్ముడు.

ఈ భార్గవరామ చరిత్రాంశం మహాభారత ఉద్యోగ పర్వాంతర్గతమైన 155వ అధ్యాయమున అతి సంగ్రహంగా ఐదు శ్లోకాలలో చెప్పబడింది. ఈ ఐదు శ్లోకాలలోని సంక్షిప్త కథను తన కావ్య వస్తువుగా స్వీకరించి2000పద్యా, గద్యా లతో భార్గవరామ చరిత్రను వీరరస పోషణతో రచించాడు.

భార్గవరామ చరిత్ర యందలి కథానాయకుడు పరశు రాముడు పౌరాణిక కాలంలో అనేక రుగ్మతలను, ప్రజా పీడనలను తొలగించి కృతార్థులైనారు. అతని గాథనే ప్రధానంగా తీసుకొని తన కాలంలో నున్న పరపీడనా, పాలనతో గొట్టుమిట్టాడుతున్న ప్రజలు స్వేచ్ఛా స్వాతం త్ర్యాలు లేక అలమటిస్తున్నప్పుడు వాటిని ఎదురించ డానికి, స్వేచ్ఛాయుత స్వపరిపాలనను కోరుతూ ప్రజలలో స్వాతంత్ర్య జాతీయ, సంఘ సంస్కరణోద్యమాలు తలె త్తాయి. వాటిని చైతన్యపరుస్తూ బలోపేతం చేయడానికి శాస్త్రిగారు తమ శాస్త్రపరిజ్ఞానంతో శాస్త్రంలో అక్కడక్కడ చెప్పిన మెలకువలను కూడా వారికందించి ఉద్యమాల కూతం కల్పించారు. ఆధునిక కాలం మొదటి దశలో సంఘంలోనున్న అనేక రుగ్మతలను, పరపీడనాది వాటిని

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

తొలగించుటకు పరశురాముని మనస్సులో వీరరసం ఏ విధంగా మూర్తీభవించిందో కవి కావ్యంలో పోషించిన తీరు వ్యక్తమవుతుంది. అందుచేతనే ఈ కావ్యం వీరరస పోషణా ప్రధానమైనదిగా చెప్పవచ్చు. కావ్యావతారికలోని ఈ విషయాన్ని కవి క్రింది విధంగా ప్రతిపాదించారు.

కం॥ **"అదియుత్సాహ స్థాయిత**
**నెదకింపై వీరరస సమిద్ధాంబైయు**
**న్నది నా చతురతయందే**
**ట్టిదోరసికులయెదుటన నడినగా తెలియున్"**
**(భా-1-19)**

ఉత్సాహమే స్థాయి భావంగా కల్గి హృదయానంద సంధాయియైన వీరరసముతో కూడిన కావ్య నిర్మాణ చతురతను రసగ్రహణ పారీణులగు రసికుల ఎదుట ఉంచిననే గానీ, తన కృతార్థత బయలు పడదని కవి పేర్కొన్నాడు. తన కావ్యం వీరరసపోషణా ప్రధానమని కవి స్వయంగా చెప్పుకున్నట్లు ఈ పద్యం ద్వారా తెలుస్తుంది.

ఈ కావ్యంలో నాయకుడు పరశురాముడు ప్రతి నాయకుడు కార్తవీర్యారునుడు ఇద్దరు వీరాధివీరులే పరశురాముని కంటే పూర్వమే సూర్యవంశ సంజాతుడైన నగర చక్రవర్తి నగర చక్రవర్తి హైహయులపై దండెత్తిన కథాంశం కూడా ఇందు పొందుపర్చబడింది. ఈ విధంగా ఈ ముగ్గురు వీరుల వీరరసపోషణతో కూడిన విజృంభణం కావ్యంలో ప్రస్ఫుటంగా చోటు చేసుకున్నది. ఈ ముగ్గురు వీరులు ఆయా సందర్భాలలో చూపిన వీరత్వం పరశురాముని జైత్రయాత్రలో సిద్ధి పొందింది. ఆ విధంగా వీరరస పోషణ సిద్ధి కల్గి కావ్యమున వీరరసానికి ప్రాధాన్యం సంప్రాప్తించింది.

భార్గవ రాముడు శైశవం అదిగా వీరుని వలె చిత్రించుట కవి ఉపజ్ఞతకు నిదర్శనం. రాముని యందు శిశు దశలోనే వీరత్వ లక్షణాలను కవి ఈ విధంగా వ్యక్తం చేశారు.

సీ॥ **భావి సామ్రాజ్యమే పాటిదన్నటు చూపుజిగురు**
**గ్రొంబెదవిపై జిన్నినగవు**
**సమదవీర క్షత్రసమితికీ గతియె యన్కరణివ్రేళు**
**లు నోరగ్రువికొనును**
**బవరానదనుజూచి పాఱు హైహయకోటి**
**గేఱించునట్లు కేకిసలు గొట్టు**
**విలనాల్గు చెఱగులు గలయనేలుడు నన్న**
**వడుపున బాన్పు నల్గడల బ్రాంకు**

రేణుకాదేవి చొన్న కొడుకైన పరశురాముని చేష్టలు తల్లికి మిక్కిలి ఆదర పాత్రములు, రాముని పెదవులపైన చిర్నవ్వు భావి సామ్రాజ్యం ఏ పాటిదన్నట్లున్నది. వ్రేళ్ళను నోటిలోనికి దురుముకొనుట వల్ల మధాంధులైన క్షత్రీయులకు రాబోవు దుర్గతి ఇదియని చాటుతున్నదట. చప్పట్లు చఱుచుచు పెద్దగా నవ్వుట వలన యుద్ధంలో తన భూసామ్రాజ్యమును జయించి ఆక్రమింతునన్నట్లుగా అతడిప్పుడే పాన్పుపై అన్ని వైపులకు ప్రాకుతున్నాడట. మనోహారాలైన శిశు చేష్టలనున వీరరసంలో మేళవించి, చేసిన ఈ వర్ణన అత్యంత రమణీయమైనది. శిశు దశదాటి యౌవనంలోకి అడుగిడిన రాముని పరాక్రమ విజృంభణం ఎట్టున్నదో ఈ క్రింది పద్యంలో రామునిలో కవి వీరరస పోషణ ఎలా చేశారో తెలుస్తుంది.

చ॥ **"పఱచినచో గురంగములు పర్విడ జాలవు**
**వానివెంట బి**
**ట్టఱచినచో మృగేంద్రము భయంబున**
**దోకమలంచి నాఱువే**
**చఱచినచో నుదగ్రమదసామజియేనియు**
**విహ్వాలించుదా**
**దఱచినచో సమస్తమును దానయితోచు**
**మునీంద్రు పట్టికిన్"**

పై పద్యంలో పరుగిడినచో అతని వెంట గుర్రాలు సహితం పరుగెత్తలేవు. పెద్దగా అరచినట్లైతే సింహం సైతం భయంతో తోకను ముడుచుకొని పరుగెత్తును. చరచినచో భయంకరమైన మదపుటేనుగులు కూడా భయపడి

ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సదాశివపేట.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

పోవును. ఇంత వరకు అతని వీరత్వం ఋజువు చేయు విషయాలు కాగా, ఇక నాల్గవది తాను లోతుగా పరిశీలిస్తే ఈ సమస్తమును తానుగానే తనకు కన్పించును. ఇది జ్ఞాన సంబంధమైన విషయమని అర్థమవుతుంది.

పరశురాముని అవతార విశేషాలను వర్ణించు ఈ క్రింది పద్యం రాముని వీరత్వం ప్రధానమే ఉంది. దీని వలన పరశురాముని అవతారమే వీరరస ప్రధానంగా ఉందని తెలుస్తుంది. అతని చరిత్ర కూడా వీరరస ప్రయోజనంగా సాగినది.

**సీ॥ భృగుకులై కాలం కరిష్ణుడై విష్ణుడిమ్మహిబుట్టెనెవని**
**జన్మచ్ఛలమున**

పరశురాముడు తన తపముచే హరుని మెప్పించి వరాన్ని పొందాడు. ఇంద్రాది దేవతలు తపముచే సైంహికేయులను దనుజుల వలన తమకు వాటిల్లిన కష్టాలను తెల్పగా పరమశివుడు పరశురాముని పంపెను. హరుని పినాకము గుహుని అక్షయ తూణ యుగమును తీసికొని ఇంద్రరథముపై మాతలి సారథికాగా భార్గవరాముడు సైంహికేయులపైకి వెడలి దానవపురాన్ని చేరి చేసిన రణరంగ సంరంభం వీరరసాత్మకంగా కింది పద్యంలో సాగిన తీరు కనిపిస్తుంది.

పరశురామున్ని ఎదర్కొనుటకై కార్తవీర్యార్జునుడు రణమునకు తరలివస్తున్న సన్నివేశం కూడా వీరరస ప్రధానంగా కనిపిస్తుంది. ఈ కావ్యంలో కార్తవీర్యార్జుని యుద్ధం ఇదే చివరిదిగా తెలుస్తుంది.

**చ॥ కవచముగా రుమ్కంబుగనకత్సరు ఖడ్గము**
**దూణయుగ్మయును దవివి వెలుంగ దత్త (భా-5-82)**

యుద్ధానికి వలయ సాధనాలతో యోగ వేషుడై కార్తవీర్యుడు రామునిపైకి వచ్చిన తీరును, అతడు వివిధ సైన్యాలచే పరివేష్టితుడైనట్లు ప్రకాశిస్తున్న విధానమును పరిశీలించవచ్చు. తర్వాత దశమాశ్వాసం అంతా రాముని జైత్రయాత్రతో నిండియున్నది.

కురుక్షేత్రమునందు భజబలంతో పరశుధారాశక్తితో శస్త్రాస్త్ర ప్రయోగంలో శత్రు నిరాసనం కావించుటలో పరశురాముని ప్రతిజ్ఞ తీరుతుంది.ఈ కావ్యం కవి పేర్కొన్న విధంగా వీరరసపోషణం అణువణువున కనిపిస్తుందని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. భార్గవ రామ చరిత్రము - అనుముల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి
2. వనపర్తి సంస్థానము సాహిత్య సేవ - డాక్టర్ ఆలేటి మోహన్‌రెడ్డి

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# ప్రబంధ కావ్యం – శృంగార రసం

– దేవసాని సోని, స్నాతకోత్తర విద్యార్థి (ద్వి.సం.), తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ & పీ.జి కళాశాల, సిద్ధిపేట, తెలంగాణ.

విజయనగర సామ్రాజ్యమును మొదట సంగమ వంశీయులు (1336-1485) పరిపాలించారు సంగమ వంశము క్షీణించి సాళువ వంశము (1485-1506) సాళువ వంశము క్షీణించి తుళు వంశము (1506-1571) తులదూగినది.

భువన విజయంలో అష్టదిగ్గజ కవులుండిరని ప్రసిద్ధి

- అల్లసాని పెద్దన : మనుచరిత్ర
- భట్టుమూర్తి : వసుచరిత్ర
- ముక్కు తిమ్మన : పారిజాతపహరణం
- పింగళి సూరన్న : రాఘవ పాండవీయం, కళా ప్రపూర్ణము
- తెనాలి రామలింగము : పాండురంగ మహాత్యము
- రామ భద్రకవి
- శంకర కవి
- ధూర్జటి : శ్రీ కాళహస్తి మహాత్యం

## రసము :

మానవుడు వివిధ సందర్భంలో వివిధ రకాల హావా భావాలను వ్యక్త పరుస్తుంటారు. ఆ విధమైన అభిప్రాయాన్ని మన ప్రాచీన అలంకారులు రసము అని వెలిబుచ్చారు. ఒక మహాకవి రచించినది చదువుతున్నప్పుడు మనస్సులో తీవ్రమైన భావాలు కనబడుతాయి వాటిని చూసి హృదయం స్పందిస్తుంది. సాహిత్యం ఆలోచనలతో కూడినది, కాళిదాసు, శాకుంతల నాకటంలో వర్ణనలు హృదయానికి దగ్గర ఉంటాయి. రసం గురించి మొట్ట మొదటగా చెప్పినా అలంకారికుడు **భరతుడు** నాట్యశాస్త్ర గ్రంథంలో విభావానుభవ, వ్యభిచారి, సంయోగ, రస నిష్పత్తి, విభావానులు, అనుభవాలు, వ్యభిచారి భావాలు. ఈ మూడు వుంటే రసం నిష్పన్నం అవుతుంది.

**ధనుంజయుడు (దశరూపకం)** భరతుని రససూత్రాన్ని ఆధారంగా చేసుకుని ధనుంజయుడు తన దశరూపకంలో

**"విభావై రసుభావైశ్చ**
**సాత్వికైర్వ్య భిచారిభి:"**

4 సిద్ధాంతాలను పేర్కొన్నాడు. భారతీయ అలంకారికులు రసాలు ఎనిమిదియా? తొమ్మిదియా అని కావ్యానికి వివిధ సిద్ధాంతాలను తెలియజేశాడు. కావ్యంలో రసం అలంకారం రీతి ధ్వని వృత్తికి ఔజిత్యం ఉంటాయని వీటన్నింటిలో రసము గురించి చెప్పారు. రసం అంటే అనుభూతి ఋగ్వేదంలో సోమరసం, జలం, పాలు అనే అర్థంలో వాడబడింది. అదర్వణ వేదంలో వదిరంచి అని వాడబడింది. ఉపనిషత్తులో సారం అనే అర్థంలో రస ప్రస్థావన ఉంది.

## రస సూత్రం :

**శృంగార హస్య, కరుణా రౌద్ర వీర భయనకా:**
**భీభత్సాద్భుత సంజ్ఞాచేత చేత్యస్టా వాజ్యేరసా: స్మృత:**

**విషయం :** ప్రబంధా యుగంలో అష్టదిగ్గజ కవులలో ఒకరైనా అల్లసాని పెద్దన తన మనుచరిత్ర దీనిని మారన మార్కేండేయ పురాణం ద్వారా తన ప్రబంధంలో వరూధిని పరిణయం అనే ఘట్టంలో ప్రవరాఖ్యుడు.

రసరాజమైన శృంగారము, సంయోగము, విప్రయోగము అని అర్థాలు వున్నప్పటికి అసలు శృంగారం (ఎవరు) అనే రసం కూడా మానవుడికి ఒక అవశ్యకమైన ఒక విధానం. ఈ శృంగార రసాన్ని మొదటగా భరతుడు తన నాట్య శాస్త్రంలో చెప్పినప్పటికి బోజుడు ఈ రసానికి అంత్యంత ప్రధాన్యతలను ఇచ్చాడు.

శృంగార రసానికి అసలు అర్థం చెప్పిన దీనిని ఒక క్రీడలా భావించేవారు కూడా వున్నారు. ఉదా॥ మన్మధున్ని రస ప్రీయుడిగా చాలా మంది కవులు చెబుతారు. ఎదైనా

ఒక శృంగార ఘట్టం వచ్చినది అంటే మన్మధుడు రసక్రియుడు అని చెబుతారు.

ఈ శృంగారన్నే మిథున క్రీడ అని అర్ధము కూడ వుంది. ఒకే చిత్తలగు ఇద్దరు ప్రాణులు జీవిత పరిపూర్తికై ఒండోరులు కలిసి ఉండాలని కోరిక పుట్టిన దాని సంయోగము కోరకు అందు సుఖమును శృంగారం అందురు.

ఇరువురి అభిప్రాయల మిధనే సుఖము (శృంగారము) ఆధారపడి ఉంటుంది. ఏమనిషి అయిన ఏకాకియై జీవితమున పరిపూర్ణంగా సుఖాన్ని పొందలేడు. ఈ అభి లాషలో పురుష ప్రకృతి, స్త్రీ ప్రకృతిని, స్త్రీ ప్రకృతిని పురుష ప్రకృతిని ఆకర్శించును. ఈ సృష్టిలో ఆడ, మగ అన్న బేధం కనుక లేకపోయినపట్లయితే ఈ సృష్టిలో ఇది కూడా ఒక వింత భావనగానే చెప్పవచ్చును. ఈ శృంగారన్ని కొందరు అర్ధనారిత్వం అని మరికొందరు దీని గురించి నీచంగా రాయడం ద్వారా వేశ్యలు అనే వృత్తి ప్రత్యేకంగా ఏర్పాటయింది. ఈ వేశ్యలు కేవలం వారి అందచందా లకు, రాజులకు కాలంనాటి నుండి వీరు ఉన్నారని మనకు ప్రబంధ యుగంలో ముఖ్యంగా శ్రీకృష్ణదేవ రాయల ఆస్థానంలో ఉన్నటువంటి నర్తకీ గానీ, భారత భాగవతంలో గానీ పోతన ఒక భోగిని అనే వేశ్య గురించి వర్ణించడం అనేది ఆ యుగం నాటి నుండే ఉందని చెప్పవచ్చును. శృంగారం అనే రసానికి రతి అనే స్థాయి భావం ఉందని చెప్పవచ్చును.

అల్లసాని పెద్దన రచించిన తన వరూధిని పరిణ యంలో ప్రవరుడు తను గృహస్థ జీవితంలోకి దూరంగా వెళ్ళిన అక్కడ అరుణాస్పదపురంలో తన భార్యను గుర్తుకు తెచ్చుకోవడం మిథున క్రీడ వాంఛన లేని సంయోగమే కదా! అంతే విధంగా పరమ పవిత్రమయిన నాయిక, నాయకుల ప్రేమకు ప్రతీరూపంగా ఈ రసక్రీడను కూడ చెప్పవచ్చును. దాంపత్య సుఖజీవమునకు చేయ టయే కావ్యములోని శృంగార రసమునకు మూలము. సంతానం ఇందుకు రసక్రీడ ప్రధానం అని చెప్పవచ్చును.

అల్లసాని పెద్దన యొక్క మనుచరిత్రలో వరూధిని ప్రవరున్ని చూసి అతని గురించి వర్ణించే సందర్భంలో ప్రవరున్ని ఎవరు నీవు ఇంతటి చారడేసి కళ్ళు పెట్టుకుని ఎవరినయ్యా నీవు దారి అడుగుతున్నావు? ఇక్కడ ఒంటరి గానున్న జవరాలిని పలకరించే నేపథ్యం కాకపోతే అంటూ వరూధిని అనే అప్సరస శృంగారాన్ని ఒలకరిస్తూ నీవు నన్ను చూసి నాతో ఉండడానికి వచ్చావు అంటూ తాను ప్రవరుని అందానికి తానే ఒరచూపుతో తన మేను సరలితో వలపు నవ్వులతో ప్రవరున్ని మధ్య శృంగార ఘట్టాన్ని ఎంతో చక్కగా అల్లసాని తన అల్లిక నిజంగా జిగిబిగిలా వ్యక్తపరిచారు.

ఎంతటి గొప్ప వ్యక్తి అయిన ఒక స్త్రీ అందానికి ఆకర్షణ కాక తప్పదు. కదా అంటూ ఎందరో మహామునులు, దేవ మహర్షులు ఎంతో నిష్ఠతో ధ్యానం చేస్తున్న సంద ర్భంలో మాయ అప్సరసల రూపంలో దేవుల్లే సహితం ప్రత్యేక్షమయి వారి ఆట, పాటల, అంద చందాలతో గొప్ప గొప్ప వాళ్ళ తపస్సు భంగం చేసిన వారు కూడా ఉన్నారు. అందుకు కారణం రసక్రీడ కారణం అని చెప్ప వచ్చు. కావున కొందరు అలంకారులు, శృంగారం రసరాజు అని పేర్కొనగా మరికొందరు విమర్శకులు రసరాజమని కాదని మరికొందరు పండితా శ్రేష్ఠులు అన్ని రసాలకంటే శృంగార రసమే శ్రేష్ఠమని వ్యక్తపరిచారు.

ప్రవరుడు ఒకానొక సందర్భంలో పుణ్య క్షేత్రాలను దర్శించుకోవాలనే ఉద్దేశ్యంతో మితిమిరిన అత్యాశతో బయలుదేరుతాడు. అప్పుడు తన కాళ్ళకు ఉన్న పసరు అయిపోవడం (కరిగిపోవడం) వలన తాను మిమ లయాల్లో తాను వేళ్ళేదారి తెలియక ఉన్న సందర్భంలో వరుదుని అనే ఒక స్త్రీ ప్రవరున్ని చూసి తనపైన మోజు అనగా ఇష్టం పెంచుకుంటుంది. ఎలానైన తనను వివాహం చేసుకోవాలని మెల్లగా వరుధిని ప్రవరున్ని తదేకంగా చూస్తు తన పైట జారుతున్న పట్టించుకోకుండా నిలబడి ప్రవరుని కండ్లలోకి చూస్తువుంది. అంతేకాకుండా ప్రవరుడు తనకు లొంగకుండా అతనగా తనను ఆకర్షింప

కుండ అక్కడి నుండి వెళ్ళుతున్నాడు. అని గ్రహించి తాను అతన్ని దొంగచాటుగా చూస్తు అతన్ని ఎలాగైన తన విశానమైన చాతిని తన ఉంగరాల కురులను, ఎత్తైన భుజాలు, ఎత్తు, అతని చేపలాంటి కనులు చూస్తు నీ అందానికి నేను సరికాను అన్నట్టుగా పెద్దన ప్రవరుని, వరుధూని మధ్య శృంగార రసాన్ని తెలియజేసినాడు.

## ఉపయుక్త గ్రంథ సూచీ :

1. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి : తెలుగు సాహిత్య చరిత్ర (తృతీయ భాగము)
2. పింగళి లక్ష్మీకాంతం : సాహిత్య శిల్ప సమీక్ష భావ : 1994

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# శృంగార నైషధం - శృంగార రస పోషణ

**- వేణు జంగిటి,** అతిథి ఉపన్యాసకులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ & పి.జి. కళాశాల, సిద్ధిపేట, తెలంగాణ.

తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలించినట్లైతే ప్రారంభం నుండి ఆధునిక సాహిత్యం వరకు కూడా మన తెలుగు సాహిత్యం సంస్కృత సాహిత్యపు అడుగు జాడల్లోనే నడిచింది. నన్నయాదులతో మొదలైన ఆంధ్రీకరణ ప్రక్రియ శ్రీనాథుడి కాలంలో మహోన్నత మైన దశకు చేరుకుందనడంలో ఎలాంటి సందేహం లేదు ఎందుకంటే

**సంతరించితి నిండు జవ్వనమునను శ్రీ / హర్షనైషధ కావ్యమాంధ్ర భాష......**

అని చెప్పిన శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడుగా ప్రసిద్ధిగాంచి తెలుగు కవిత్వాన్ని పుష్టివంతం చేసిన గొప్ప ప్రాచీన కవి నైషధం విద్వదౌషధంగా రూఢికెక్కిన శ్రీహర్షుని నైషధ చరితమును ఆంధ్రీకరించి తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానం నిలబెట్టుకున్న కవిగా శ్రీనాథున్ని చెప్పవచ్చు.

శృంగార రసం అనగానే గుర్తుకు వచ్చే కవి శ్రీనాథుల వారు. ఎందుకంటే చాలామంది శృంగారమనే పదం వాడడానికి, పలకడానికి సిగ్గుపడుతారు, జంకుతారు కూడా! కానీ శ్రీనాథుడు తన రచనకే శృంగార నైషధం అని పేరుపెట్టటడంతో ఆయనకు తర్వాత కాలంలో వచ్చిన కవులందరికి దిక్సూచిగా మారాడు.

**శృంగార రసం రసరాజం అని భోజుడు** ప్రతిపాదించాడు. 16వ శతాబ్దంలో వచ్చిన ప్రబంధాలలో ప్రధాన రసం శృంగారమే అయినప్పటికి ప్రబంధాల ముందు కాలంలోనే అంటే 15వ శతాబ్దపు కావ్య యుగంలో శృంగార రసాన్ని అంగీరసంగా చేసి కావ్యరచన చేసిన శ్రీనాథుడు రస నిర్వహణలో అద్వితీయ ప్రతిభామూర్తి అని చెప్పవచ్చు.

అందరూ అనుకున్నట్లుగానే భరతుడు చెప్పినవి ఎనిమిది రసాలే కాదు, శాంతం కూడా ఆయనకు అంగీకార్యమే శృంగార - హస్య - కరుణ - రౌద్ర - వీర - భయానక - భీభత్స - అద్భుత శాంతాలనే తొమ్మిది రసాలున్నాయి. కానీ అభినవగుప్తుడు లాంటి వారు రసాలు తొమ్మిది కన్నా తక్కువ లేవు, ఎక్కువ లేవు అని చెప్పగా, లోల్లట రుద్రుడు, భోజుడు ప్రతిభావం రసం కావచ్చు అని నిరూపించాడు. తొమ్మిదే రసాలు కాకుండా ప్రేయో రసం, వత్సల రసం, శ్రద్ధారసం, స్నేహరసం, లౌల్యరసం, మృగయారసం, ఉదాత్తరసం, మాయారసం, కారుణ్య రసం, వ్రీడనక రసము, భక్తిరసం, అక్షరసం దీనిని అనుసరించి కొత్తగా అలంకారీకులు క్రికెట్టు రసం అని ప్రతిపాదించిన ఆశ్చర్యం లేదు.

**"క్రీడా రసం నిర్వశతీవ బాల్యే"**

కుమార సంభవం శ్లోకాన్ని ప్రమాణంగా చెప్పవచ్చు. అంగిరసం శృంగారంగా వెలుగొందిన తెలుగు పంచ మహా కావ్యాల్లో ఒకటైన శృంగార నైషధాన్ని శ్రీనాథుడు ఆంధ్రీకరించిన తీరు, వర్ణనలు, రసపోషణ యావత్ సాహిత్యాన్ని అలరించింది ఈ కావ్యంలో అంగరసంగా కరుణం వర్ధిల్లింది.

ఇక ప్రధానమైన రసం శృంగారం రసం. విభావానుభవ వ్యభిచారాద్యులు రసవర్గులు కదా! నాయికా నాయకుల వలన రసము నిష్పన్నమగునో ఆ నాయికా నాయకుల్ని ఆలంబనాలుగా చెప్పవచ్చు. ఈ కావ్య రసకారుకులైన నాయకానాయికలు నలదమయంతులు. ఉదాత్తమైన రసమునకు ఉత్తమ ప్రకృతులైన నాయికా నాయకులు ఆవశ్యకం.

ఈ శృంగార నైషధంలో శృంగార రసానికి స్థాయి భావం రతి **"తత్ర సంభోగ విషయక ఇచ్ఛావిశేషోరతి:"**

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

మన అలంకారికులు రతి కాంక్ష అనేది ముందు నాయికకు, తర్వాత నాయకుడికి కలగాలని వివరించారు. శ్రీనాథుడు శృంగార నైషధం కావ్యాదిలో పోషించబడే రసం గురించి చాలా అద్భుతంగా వర్ణించాడు.

**చ. పనివడి, నారికేళ ఫలపాకమునం జవియైన భట్టహ**
**ర్షుని కవితాను గుంభములు సోమరి పోతులు కొందఱయ్యె లౌ**
**నని కొనియాడ నేరఁ రది యట్టిద లేజవరాలు చెక్కు గీ**
**టిన వసవల్చు బాలకుడు డెందమునంగల గంగ నేర్చునే?** (ప్ర.శ్వా. 17)

అంటూ ఒక పాలు త్రాగే పిల్లవాడికి (బాలుడికి) నిండు యవ్వన వతి యొక్క రూప లావణ్యాలను ఆస్వాదించే శక్తి ఉండదు. కానీ అట్లాంటి మాధుర్య రసానుభూతి పొందాలంటే నిండు యవ్వనుడికి మాత్రమే సాధ్యమవుతుందని కావ్యంలోని శృంగార రసపోషణ గురించి నర్మగర్భంగా తేల్చిచెప్పిన కవి శ్రీనాథుడు.

ఈ శృంగార నైషదంలో నాయికానాయకులు దమయంతి, నలుడు. శ్రీనాథుడు వీరిద్దరి యొక్క శృంగార చేష్టల్ని ఒకరి పట్ల ఒకరు కామవాంఛతో ఉన్న తీరును ఆ విరహాన్ని రెట్టింపు చేసే చంద్రుడు, మలయానిలము, మన్మథుడు, వసంతము మొదలగు వారి దూషణ, విరహ తాపాన్ని పోగొట్టెందుకు చేసే శీతోపచారాలు (ప్రయత్నాలు) చివరికి ఇరువురు కలవడం, ఆ కలయికలో ఉండే వివిధ అవస్థలు రతిక్రీడ ఆనందం అన్నింటిని శ్రీనాథుడు ఎంతో మాధుర్యంగా ఒళ్ళుపులకించే విధంగా శృంగార నైషధంలో శృంగార రసాన్ని పోషించాడు.

శృంగార నైషధంలో చాలా పద్యాలలో శృంగార రస పోషణ ఉన్నప్పటికిని స్థాలిపులాకన్యాయంగా కొన్ని పద్యాల్ని మాత్రమే స్పృశిస్తున్నాను.

శ్రీనాథుడు శృంగార రస పోషణలో భాగంగా దమయంతి నలుని యొక్క గుణ గణాల్ని తెలుసుకున్న తర్వాత ఆమెలో కలిగిన విరహవేదన గురించి

**చ. ఉదిత మనోనురాగ దహనోష్ణ భరంబున నా లతాంగికిన్**
**హృదయమునందు జొబ్బిలి వహించిన చందన కర్దమంబుబు**
**ద్బుదముల నీనెఁ గల్పిత విభూషణ జాల మృణాళ వల్లరీ**
**వదనములం దమందగతి వారక పిచ్చిల జొచ్చె ఫేనముల్** (ద్వి. ఆ -114)

అంటూ నలునిపట్ల విరహవేదనతో దమయంతి హృదయంలో పుట్టిన అనురాగమనే వేడి వలన ఆమె శరీరంపై రాసిన చందపు పూతకాస్త బుడగలుగాబయటకు తన్నుకువస్తే ఆమె యొక్క నగల సముహం ఆ బుడగల్ని బాహ్య ప్రపంచంలోకి రాకుండా అడ్డుకట్టగా మారుతున్నాయి అని చెపుతూ నలుడి పట్ల దమయంతి పెంచుకున్న ప్రేమానురాగాలు, కామ కోరిక (విరహ వాంఛలు) వలన ఆమె శరీరం పొంగే కడలిలా మారుతుందని వర్ణించిన గొప్ప కవి మన రసిక శ్రీనాథుడు.

అట్లాగే నలదమయంతులు ఇరువురు ఒకరి ఒకరు ఎదురుపడిన క్షణంలో పోషించిన శృంగార రస పోషణ ఎంతో అనుభూతిని కలిగిస్తుంది.

**ఉ.ఆరలి బోటికిన్ విభున కప్పుమనంబునవిప్రలంభ శృం**
**గార మొకళ్ళొకళ్ళ యిఱి గౌగిట బుట్టిన నిండు వేడ్కచే**
**బోరన నార గూరి మతిపొంగె, ఘృతం బతిమాత్ర బోసినన్**
**గూరికి గూర్కి యక్షణము గొబ్బున మండిన దీపమోయ నన్** (తృ. ఆ. -116)

నలదమయంతులు ఒకరునొకరు చూసుకున్నప్పుడు వారిద్దరికి ఒకేసారి హెూమగుండంలో నెయ్యివేస్తే వచ్చేటు వంటి అగ్నికీలల్లా వారిమధ్య కామ వాంఛలు పుట్టి, ఒకరినొకరు కావాలి అనుకునే అభిలాష జనించడంతో వీరి మధ్య ఉన్నటువంటి మాసిపోని ప్రేమానురాగాలతో నిరంతరం శోభించే విధంగా మాంజిష్ఠ రాగములో శ్రీనాథుడు చెప్పడం జరిగింది.

వివాహానంతర ఘట్టంలో నలదమయంతుల మధ్య ఇదివరకే ఉన్న కామవాంఛలు రతిక్రీడల గురించి ఈ క్రింది విధంగా

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

**మ. మృదు మృష్టన్నము లీ ప్రకారమున నెమ్మిన్వారు ముప్పొద్దు గొ**
**న్నిదినంబు ల్భుజియించు చుండిరి సమున్నిద్రాను రాగంబుతో**
**బదియాఱేడుల పువ్వుబోండ్ల నునుపుం బాలిండ్ల కాఠిన్యం సం**
**పదంతో రాత్రులు మల్లు సాము మదనోన్మాదంబునం జేయుచున్ (ష.ఆ-142)**

శ్రీనాథుడు నలదమయంతుల శరీర లావణ్యములనే ఆయుధాలుగా చేసి వారిద్దరి మధ్య అనురాగంతో రతి అనే మల్లుసాము (యుద్ధాన్ని) చేస్తున్నారని, శృంగార రస పోషణల గల మాధుర్యాన్ని అందించారు.

యవ్వనులైన నలదమయంతుల యొక్క విరహవేదన కాస్త ఈ మల్లుసాము వలన వారి యొక్క ప్రేమానురాగాలు రెట్టింపయ్యేలా తీర్చిదిద్దిన గొప్ప కవి మనశ్రీనాథుడు.

మంకెనపువు మీది యళి మాడ్కి...................... అను పద్యంలో శ్రీనాథుడు నలదమయంతుల తొలి సంగమం అయిన తర్వాత నలుడి యొక్క చిగురువంటి పెదవి లోపలి భాగం, పంటిగాటు గుర్తుతో శోభిస్తూ ఉంది. ఆ గుర్తు మంకెనపువ్వు మీద తమ్మెద వాలినట్టు ఉంది ఆ సన్నివేశం. అది చేసిన దమయంతి చిరునవ్వు తునకలని తన కనురెప్పల వెంట్రుకల గుబురులో, కనుక కాటుక చీకటిలోనూ ఇంకిపోయేట్టు చేసిందట.

ఆహా శ్రీనాథ! రసపోషణ అంటే ఇది! నీకు కవి సార్వభౌమ బిరుదు సార్థకమవ్వడానికి యీ ఒక్కపద్యం చాలు.

## ముగింపు :

తెలుగు పంచ మహాకావ్యాలలో మొదటిగా పేరు పొందిన శృంగార నైషధాన్ని శ్రీనాథుడు మామిడి సింగనకి అంకితం ఇచ్చాడు. ఈ కావ్యంలో శ్రీనాథుడు శృంగార రసాన్ని అద్భుతంగా పోషించాడు. తర్వా వచ్చిన కావ్యాలేవి దీనికి (శృంగార నైషధం) సాటి రావు. ఈ కావ్యానికి శృంగార పదం జోడించడంతో శృంగార నైషధం నామం సార్థక మైనది. దీనితో మన శ్రీనాథుడు కాస్తా శృంగార నాథుడిగా మారాడు అని చెప్పవచ్చు.

## ఉపయుక్త గ్రంథ సూచి :

1. డా॥ శ్రీరామమూర్తి కొర్లపాటి : శ్రీనాథుడు
2. తెలుగులో పరిశోధన-రజతోత్సవ సంచిక శ్రీనాథుడు : శృంగార నైషధం

❖❖❖

# వేయి పడగలు - కరుణ, శృంగార, భక్తి రసాలు

- **అవధానం సుజాత,** సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, సిటీ కళాశాల, నయాపూల్, హైదరాబాదు.

**అంశము :** శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, వేయి పడగలు - ప్రధానరసముల విశ్లేషణ

**లక్ష్యము :** శ్రీ విశ్వనాథ సత్యనారాయణ నవలలో ప్రధానరసములైన కరుణ, శృంగార, భక్తిరసములను గుర్తించి విశ్లేషించుటయే ఈ వ్యాసం యొక్క ప్రధాన లక్ష్యము.

## వ్యాసములోని ప్రధాన అంశములు :

1. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ సాహితీ వ్యక్తిత్వం
2. వేయిపడగలు - వైశిష్ట్యం
3. రసము - నిర్వచనం - వివరణ
4. వేయిపడగలలోని ప్రధానరసములు

ఎ. కరుణ బి. శృంగారము సి. భక్తి

## ముగింపు :

ప్రధానరసములు, కథాగమనమునకు తోడ్పడిన విధము - రసానందము -గ్రంథసూచి.

## శ్రీ విశ్వనాథ సత్యనారాయణ సాహితీ వ్యక్తిత్వం :

జ్ఞానపీఠ బహుమతి గ్రహీత, కవిసమ్రాట్, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ "1934"లో రచించిన నవల వేయిపడగలు. శ్రీ విశ్వనాథ సత్య నారాయణ బహుముఖ ప్రజ్ఞాశాలి. శతాధిక గ్రంథకర్త. డా॥ అక్కిరాజు రమాపతి విశ్వనాథ గూర్చి "గొప్పకల్పనా శక్తి, భావావేశము, భాషమీద ప్రభుత ఉన్న రచయిత" అని పేర్కొన్నారు.

హరీత శివశర్మ విశ్వనాథస్థానాన్ని చెపుతూ "ఋషులలో విశ్వామిత్రుడు గాయిత్రిని దర్శించినట్లు కవులలో సత్యనారాయణ రసాత్మను సాక్షాత్కరింప చేసుకున్నారు". విశ్వనాథలో ప్రతిభా వ్యుత్పత్తులు ఒక దానిలో ఒకటి పోటీ పడుతూ ఉంటాయి. వారి తీవ్రమైన భావావేశానికి వ్యుత్పత్తి తోడైంది. అందుకే మల్లాది రామకృష్ణశాస్త్రి విశ్వనాథను "దేశం పట్టనంత కవి" అని అన్నాడు. నార్ల "జీనియస్" అని జల సూత్రం కవ్యుర్థ అని ప్రశం సించాడు.

1. డా॥ అక్కిరాజు రమాపతిరావు, తెలుగు నవల 1975 పుట.18
2. హరిత శివశర్మ "విశ్వనాథ వ్యక్తిత్వము" భారతి 1956 జనవరి

## "వేయి పడగలు" వైశిష్ట్యం :

వేయి పడగలు నవల ఆంధ్ర విశ్వవిద్యాలయము నిర్వహించిన నవలల పోటీలలో బహుమతి పొందిన నవల. ఈ నవలను విశ్వనాథ ఆశువుగా చెబుతూంటే విశ్వనాథ వేంకటేశ్వర్లు 29రోజుల్లో 999 వ్రాశారు. 1937 - 38లో ఆంధ్రపత్రిక సుచిత్ర వార పత్రికలో ధారా వాహికంగా వెలువడింది. స్వర్ణోత్సవాన్ని జరుపుకొన్న నవల. ఈ నవలను పి.వి. నరసింహారావు సహస్రఫణ్ అన్న పేరుతో హిందీలోకి అనువదించారు. గుజరాతి, కన్నడ, సంస్కృత భాషలలోనికి అనువదించబడింది. 25 ముద్రణలు పొందినవి. పాశ్చాత్య నాగరికతా ప్రభావం, మనజాతి సంస్కృతిపై ఏవిధంగా ప్రభావం చూపిందో చిత్రించారు. వేయి పడగల నవలను గూర్చి యస్వీ రామారావు "గ్రామీణ వ్యవస్థను భూమికగా చేసుకొని తెలుగు సంస్కృతికి దర్పణం పడుతూ మూడుతరాల కథను సజీవ పాత్ర చిత్రణతో వేయి పుటల్లో విస్తరించిన ఈ నవల విశ్వనాథ బహుముఖ పరిజ్ఞానానికి పరిశీలనా ప్రతిభకు సమగ్రరూపం" అని వివరించారు. జి.వి. సుబ్ర హ్మణ్యంగారు ఈ నవలను " వేయి పడగలు కాల్పనిక, సాంఘిక కావ్యేతిహాస నవల" అని అన్నారు.

1. య.స్వీయ రామారావు - విశ్వనాథ నవలా శిల్పము, వివేచణ 1990, 90 సంచిక పుట 179.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

2. జి.వి. సుబ్రహ్మణ్యం, కాల్పనిక నవలా కావ్యం - ఆదివారం, ఆంధ్రప్రభ. 12.11.89.

అనుమాండ్ల భూమయ్య ఈ నవల గూర్చి "వేయి పడగల్లో నిర్మాణశిల్పం ఉన్నది, కతాకథనం ఉన్నది, కావ్యస్థాయి వర్ణనలు ఉన్నాయి. రసానుభూతిని కలిగించే సంఘటనలు ఉన్నాయి అన్నారు.

## రసము – నిర్వచనము – వివరణ :

విభానుభావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తి అని భరతుని రస సూత్రము. విభాను భావ వ్యభిచారుల యొక్క సంయోగము వలన రసము నిష్పన్నమగునని అర్థము. భరతుడు తన నాట్యశాస్త్రమున 8 రసములనే పేర్కొనెను. అవి. శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర్య, భయానక, భీభత్స, అద్భుతము అనునవి. వీనికి రతి, హాసము, శోకము, క్రోధము, ఉత్యాహము, భయము, జుగుప్స, విస్మయము అను 8 స్థాయి భావములు కలవు. భోజుడు శృంగారము ఒకటే రసమని చెప్పెను.

భట్టోద్భవుడు శాంతమును రసముగా పేర్కొని 9 రసములను తెలిపెను. రూపగోస్వామి మధురము, ఉజ్జ్వలము అను పేరుతో భక్తిరసమును విస్తరించి తెలిపెను. దేవతా విషయమైన రతి భావమునే భక్తి భావముగా చెప్పిరి. ఈ భక్తి శ్రీకృష్ణ గోపీ విషయకము. భవభూతి కరుణ రసము ఒక్కటే రసమని తెలిపెను.

## కావ్యాలంకార సంగ్రహము – సన్నిధానం సూర్య నారాయణ శాస్త్రి :

**కరుణ రసము :** విశ్వనాథ వేయి పడగలు నవలలో కరుణరసమును చక్కగా పోషించారు. నవల కథాగమ నానికి ఈ రసం చక్కగా తోడ్పడింది. సుబ్బన్న పేట జమిందారు కృష్ణమనాయుడు. ఆయన వద్ద లక్ష్మణస్వామి అనే ఏనుగు ఉండేది. ఏ ఉత్సవంలోనైనా జమిందారు దానిపై ఊరేగేవారు. ఆ ఏనుగు కోటకే గొప్ప అలంకారం. జమిందారు చనిపోయిన తరువాత అది మేతమేయడమే మానివేసింది. కృష్ణమ నాయుని కొడుకు రంగారావుకు పట్టాభిషేకము అనగానే మేత మేసి నీరు త్రాగి, దొడ్డిలో గంతులు వేసింది. మావటి వాడు హౌదా తెచ్చి దానిపై పరచి చక్కగా అలంకరించాడు. అది రంగారావు కారుకు ఎదురుపోయింది. స్వామి తనపై ఎక్కి ఊరేగాలని దాని కోరిక. రంగారావు దాని భావన గ్రహించక హారను మ్రోగించాడు. అది అడ్డు తొలగలేదు. మావటి వాడు దాని కోరికను తెలిపాడు కాని రంగారావు విసుక్కుంటూ కారును పక్క నుండి పోనిచ్చాడు. అపుడు లక్ష్మణస్వామి పడిన ఆవేదనను విశ్వనాథ ఈ విధంగా వర్ణించారు. "పగతీఱిన దన్న పాపఱేడు ప్రక్కలొరయుచు నాసారంధ్రము నెక్కి మెదడులో పీఠము పెట్టగా, శ్రీకాళహస్తీశ్వరుని మల్లి కార్జునదేవుని మహాభక్తుడు, త్రేతాద్వాపరసంధినాటి గజ రాజు, బాధచేపెట్టిన ఘీంకారము వంటి హృదయ విధారకమైన ఘీంకృతి, వెనుకనుండి పటాపటాలుమని మిన్నులు విఱిగి పగిలి నేలబడిన ప్రళయ మేఘగర్జా నినాదము వలె వినవచ్చెను.లక్ష్మణ స్వామి బాధతో మెలి తిరిగిపోతు కిందపడి ప్రాణములు విడిచెను. ఆ తర్వాత మావటి వాడు కూడ చనిపోయెను.

విశ్వనాథ లక్ష్మణస్వామి, మావటివాని మరణాన్ని వర్ణించిన తీరును కంట నీరు తెప్పిస్తుంది. పసరిక మరణ వృత్తాంతాన్ని విశ్వనాథ వర్ణించిన తీరులో కరుణ రసం గోచరిస్తుంది. పసరిక పైరు పచ్చదనానికి ప్రతీక. చిన్నతనం నుండి పంటచేలలో ఇతర పాములతో, పిట్టలతో ఆడుతూ ఉండేది. ఎదిగిన తర్వాత గోపాల్‌రెడ్డి కొడుకు కృష్ణారెడ్డితో స్నేహం ఏర్పడుతుంది. కృష్ణారెడ్డి పసరికకు ఆధునిక పోకడలు నేర్పిస్తాడు. ఒక సారి పొలంలోకి వచ్చి తన తుపాకీతో పిట్టలను కాలుస్తాడు. పాములకు హాని చేయాలని చూస్తాడు. అప్పుడు పాములు అతనితో నీవు అతనితో స్నేహం చేస్తున్నావు నీ స్వభావం మారింది. నీవు మా దగ్గరికి రావొద్దని అంటాయి. అప్పుడు పసరిక ఏడుస్తూ, తనను కాటువేయమని అంటాడు. అప్పుడు కుంభీనుడు అన్న సర్పము గణాచారి మధ్యవర్తిగా ఉంటే తాను కాటు వేస్తానని అంటాడు. గణాచారి రాగానే

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

పసరికను కాటువేయగానే పసరిక గిలగిలలాడి మెలికలు తిరిగి నెత్తురు కక్కుకొని చనిపోయింది. వెంటనే ఆకాశంలో పక్షులన్నీ పెద్దగా విలపించాయి. పుట్టలో నుండి బుస్సు మని దుఃఖ ధ్వనులు వినవచ్చాయి. గణాచారి ఈ మర ణాన్ని చూసి ఈవిధంగా పాట పాడింది.

**"వేయి పడగల పాము విప్పారుకొని వచ్చి**
**కాటందుకొన్నది కలలోన రాజును,**
**నాల్గుశిరసుల నాగు అల్లనల్లగ వచ్చి**
**ఊరి పెద్దను నిలవేసింది పొలములో,**
**రెండు శిరసుల నాగు రివ్వురివ్వు మని వచ్చి**
**ఇంటి కోడలి పురు గూదింది దొడ్డిలో,**
**ఒక శిరసు నాగన్న ఒయ్యారముగ వచ్చి**
**నిజముగా నా తండ్రి! నిన్ను కఱచిందిరా!"**

గణాచారి చూచుచుండగా పసిరికను కఱచినపాము కుంభీనుడు సర్వేఱాతిపై ఒకదానిమీద తల కొట్టుకొని చచ్చెను.

**శృంగార రసము :** విశ్వనాథ వేయి పడగల్లో దాంపత్య శృంగారాన్ని అద్భుతంగా వర్ణించారు. అరుంధతి, ధర్మా రావుల కార్యము సందర్భంలో వారి మధ్య అన్యోన్యాన్ని అనురాగాన్ని ఈ విధంగా వర్ణించారు. ''ద్వారము దగ్గర అరుంధతిని చూసి ధర్మారావు మనసు సముద్ర మదనము సమయంలో క్షీరసాగర గర్భమునుండి చంద్రుడు ఉద యించినట్లు ఆనందము కలిగెను. అతడు ఆమె వంకనే చూచుచుండెను. ఆమె తల ఎత్తి అతనిని చూచెను. ''వ్యాక రణ దోషములెరుగని ఆ కన్నులలోని భాష ఏమో ఆ పండితులగు వారిందరకు చక్కగా అర్థమై'', పతి చేతులు చాచుటయు భార్య వేగముగా ఆ కౌగిట చేరుట జరిగెను... ధర్మారావు మధురాధరము తన ఎలనాగుల కన్నులమీద ముంగురులమీద అదరము మీద ఎదమీద పాదముల మీద చుబుకుము మీద మెడ మీద తాండవించెను. ఈ విధంగా వారి తొలి రాత్రి గడిచినది.

మరొక సందర్భంలో జమిందారిణి ధర్మారావు ఇంటికి విచ్చేసెను. నూతన వధూవరులను ఆశీర్వదించి అరుంధతి మెడలో తన చంద్రహారము వేసెను. ఆ రాత్రి దంపతులిద్దరు శయనించిరి. ''తెగ ఉక్కపోసి అరుంధతి రైక ఊడదీసెను. ధర్మారావు పై ఎదనుండ నీయలేదు --వంపు తిరిగిన చక్కని మెడ మీద నదీసైకతముల కోడె త్రాచు వలె అందములు చిమ్మినది. పూర్ణ చంద్రుని పదునారు కళలు చిమ్మిన వెన్నెలలు హారము బిళ్ళల మీద పడి, చింది కాంతులు ధర్మారావు కన్నులలో కొట్టెను. అతడు వంగి హారమును ముద్దు పెట్టుకొనెను-- ధర్మా రావు -- పైన చంద్రుడు కింద చంద్రుడు ఇద్దరును పదహారు కళలు నిండిన వారే. అతనికి మచ్చ వుంది నీకు లేదు. నీవు సర్వ కళా శోభితవు. పున్నమి నాటి చందమామవు అని పలికెను. ఈ వర్ణనలో శృంగార రసము పోషించ బడినది.

**భక్తి :**

వేయి పడగలు నవలలో గిరిక పాత్ర ద్వారా విశ్వనాథ గోపిక భక్తిని వివరించారు. దేవదాసీ వ్యవస్థ పవిత్రతను నిరూపించడానికి పోషించిన పాత్ర గిరిక. రామేశ్వర శాస్త్రి రత్నగిరి యొక్క కుమార్తె గిరిక. ఆమె చిన్నతనం నుండి ధర్మారావు ద్వారా స్వామిని సేవించే విధానం తెలుసు కుంది. భాగవత పద్యాలు కర్ణామృతము, భ్రమరగీతలను కృష్ణ తత్త్వాన్ని తెలుసుకుంది. నిరంతరం స్వామి చింతనలోనే గడిపేది. చిన్న హరప్ప నాయుడు స్వామి కల్యాణోత్సవములను వైభంగా జరపాలని పూనుకున్నాడు. ఆ ఉత్సవాలలో గిరిక దశావతారాలను ప్రదర్శించింది. నియమ నిష్ఠలతో నాట్యాన్నే తపస్సుగా మలచింది. భోగప్ప ప్రతిరోజు ముద్రలను చూపుతుండెను ధర్మారావు ప్రతి రోజు అవతార విశేషమును మనసుకు హత్తుకునే విధంగా గిరికకు తెలియజేయుచుండెను.చివర కళ్యాణం రోజు గిరిక తన నృత్యము ద్వారా నాట్యమును ప్రదర్శించెను. తన్మయత్వముతో మూర్ఛ పోయెను. హారతి సమ యములో లేచి నిలబడెను. ఆ హారతిలో ఆమెకు శంఖ చక్ర గధా పద్మహస్తుడు, వనమాలి - - హిరణ్మయ శరీరు డైన మహా పురుష దర్శనమామెకు కలిగెను.-- ఆ మూర్తి ఆమెలో ప్రవేశించెను. గోపిక భక్తికి ఇది పరాకాష్ఠ.

**ముగింపు :**

వేయి పడగలు నవల ఒక రసవత్తరమైన కావ్యము. ఈ నవలలో కరుణ, శృంగార, భక్తి రసములు చక్కగా పోషించబడినాయి. ఈ రసపోషణ ఆయా వర్ణనలద్వారా వ్యక్తమైనది. ఇవి కథా గమనానికి ఎంతో పుష్ఠిని చేకూర్చాయి. నవలకు కావ్యస్థాయిని చేకూర్చాయి. అందుకే విశ్వనాథను రసశిల్పి అనవచ్చును. తీ నవలలో హాస్య రసము కూడ ధర్మారావు తన మిత్రులతో చేసే సంభాషణలో పోషించబడినది.

కోట నిర్మాణ వర్ణనలో అద్భుత రసము (గోవు అడవిలోని పుట్ట వద్దకు వెళ్ళి పాముకు పాలను నివేదించుట, కాపుకు వేయి పడగల పాము, నాలుగు తలల పాము రెండు తలల పాముగా స్వామి దర్శనమిచ్చుట). వర్ణించబడినాయి.

**గ్రంథసూచి :**

1. వేయి పడగలు - విశ్వనాథ సత్యనారాయణ 25వ ముద్రణ - శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్, మారుతీ నగర్ , విజయవాడ.
2. వేయి పడగలు - ఆధునిక ఇతిహాసము సెప్టెంబర్ 2012, అనుమాండ్ల భూమయ్య, శ్రీ మనస్వీ ప్రచురణ
3. వేయి పడగలు - సమకాలీనత, సార్వకాలీనత, కె.వియ రాఘవన్ తెలుగు అకాడమి, హైదరాబాద్
4. వేయి పడగలు - ఒక పరిశీలన, ముదిగొండ వీరభద్రయ్య తెలుగు అకాడమి ప్రచురణ.
5. కావ్యాలంకార సంగ్రహము - రామరాజ భూషణుడు (సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి) ఎమెస్కో ప్రచురణ.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# కవిత్రయ భారతం - రసావిష్కరణ

- డా॥ బొచ్చుమంచి వెంకటేశ్వర్లు, ఆంధ్రోపన్యాసకులు,
విజ్ఞాన జ్యోతి ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.

**"శృంగార హాస్య కరుణా రౌద్ర వీర భయానకా**
**భీభత్సాద్భుత శాన్తిస్య నవనాడీ రసాస్మృతా"**

రసాలు తొమ్మిది అని అలంకారకులు ప్రతిపాదించిన సందర్భంలో చెప్పిన శ్లోకమిది. శృంగారం, హాస్యం, కరుణం, రౌద్ర, వీరం, భయానకం, బీభత్సం, అద్భుతం, శాంతం - అనేవి నవరసాలు.

| | రసము | | స్థాయి భావము |
|---|---|---|---|
| 1. | శృంగారం | - | రతి |
| 2. | వీరం | - | ఉత్సాహం |
| 3. | కరుణ | - | శోకం |
| 4. | అద్భుతం | - | విస్మయం |
| 5. | హాస్యం | - | హాసం |
| 6. | భయానకం | - | భయం |
| 7. | బీభత్సం | - | జుగుప్స |
| 8. | రౌద్రం | - | క్రోధం |
| 9. | శాంతం | - | శ్రమం |

భక్తిని కూడా మరికొందరు రసంగా అంగీకరించారు. ఇట్లా రసాల సంఖ్య తర్వాత కాలంలో పెరుగుతూ పోయింది.

అయితే కవిత్రయ కవులు వ్యాసభారతాన్ని తెలుగులోకి అనువాదం చేసే సందర్భంలో రసానికి పెద్ద పీట వేశారు. కావ్య ప్రయోజనాన్ని సాధించాలంటే పాఠకుల హృదయ రంగస్థలం మీద రసావిష్కరణ జరిగి తీరవలసిందే. ఈ దృష్టితో దిఙ్మాత్రంగా కవిత్రయ కవులు ఆవిష్కరించిన రసాలను చర్చిద్దాం!

నన్నయ భారతంలో రసాలు అంగరూపంగా గానీ, అంగి రూపంగా గానీ పోషింపబడినాయి. తపోవృత్తిలో ఉన్న పాండురాజును కాముక వ్యాపారానికి ప్రేరేపించడం భాగంగా నన్నయ శృంగార రసోచితంగా వసంత ఋతువును వర్ణించాడు.

**"కమ్మని లతాంతములకు మ్మొనసి వచ్చు మధుప**
**మ్ముల సుగీత నినదమ్ము లెసగెం; జూ**
**తమ్ముల లసత్కిసలయమ్ముల సుగంధి ముకుళమ్ము**
**లను నానుచు ముద మ్మొనర వాచా**
**లమ్ము లగు కోకిల కులమ్ముల రవమ్ము మధుర**
**మ్మగుచు విన్చె; ననిశమ్ము సుమనోభా**
**రమ్ముల నశోకనికరమ్ములును జంపకచయమ్ములోను**
**గింశుకవనమ్ములుగు నొప్పెన్.**

- సువాసన గల కలువ పూలకు మూగిన తుమ్మెదల ఝుంకారం అతిశంచింది. మామిడి చివుళ్ళను, మొగ్గలను తింటూ సంతోషంతో కూసే కోయిల గుంపుల కూతలు మనోహరంగా వినిపించాయి. అశోకాలు, సంపెంగలు మోదుగులు బాగా పూచాయి.
- ఈ పద్యంలో వసంత ఋతువులో వనాలలో విరబూసి కనువిందు చేసే పూలచెట్లు అందాన్ని, వీనుల విందు చేసే తుమ్మెదల ఝుంకార నాదాన్ని కోయిలల సుస్వర మాధుర్యాన్ని నన్నయ వర్ణించాడు. మకారాన్ని ద్విరుక్తంగా మళ్ళీమళ్ళీ ప్రయోగించి తుమ్మెదల ఝుంకారనాదాన్ని, కోయిలల సుస్వర మాధుర్యాన్ని పాఠకుల చెవి సోకేటట్లు చేసారు. శృంగార భావోద్దీపకంగా ఏర్పడిన వాతావరణాన్ని అక్షర రమ్యంగా ధ్వనింపజేశాడు. ఇది లయగ్రాహి పద్యం.

అట్లాగే

**"చారుసువర్ణహాసినవచంపకభూషయు సిందువారము క్తా రమణీయమున్ వకుళదామవతంసయు నై యపూర్వ శృం గారవిలాసలీల యెసఁగం దనముందట నున్న మాద్రి నం భోరుహనేత్రఁ జూచి కురుపుంగవుఁ డంగజరాగమత్తుఁ డై"**

- లాంటి పద్యాలలో నన్నయ శృంగార రస నిర్వహణ సామర్థ్యాన్ని తెలుసుకోవచ్చు.

తిక్కన భారతంలో రసాభ్యుచిత పదబంధం పేరెన్నిక గన్నది.

''నన్నయదొక ఋషిమార్గమైన తిక్కనదొక రస మార్గ మని'' - అభియుక్తోక్తి. కావ్య పరమావధి రసం శిల్పం రసావిష్కరణాత్మకమైన కళ భారతం 'శాంత'రస ప్రధా నంగా సాగినప్పటికీ - సంఘటనలకూ, సన్నివేశాలనూ బట్టి అంగభూతమైన రసాలు ఏర్పడినాయి.

తిక్కన విరాట పర్వాన్ని తీర్చిదిద్దాడు. నిజానికి ఇది అన్ని పర్వాలకూ సమానంగా అన్వయం చేసుకోవచ్చు.

**"హృదయాహ్లాది, చతుర్థ, మూర్జిత కథోపేతంబు, నానారసా**
**భ్యుడయోల్లాసి విరాటపర్వ; మట యుద్యోగాదులుం గూడఁగాఁ**
**బదియేనింటిఁ దెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై పెంపునం**
**దుదిముట్టన్ రచియించు టొప్పు బుధసంతోషంబు నిండారఁగన్!"**

తిక్కన విరాట పర్వంలో ఉత్తరాభిమన్యుల వివాహ సందర్భంలో వధూవరుల పరస్పర అవలోకనాది చేష్టితా లను ఉదాత్త శృంగారంగా తీర్చిదిద్దాడు.

**"వరుచూడ్కి ముద్దియ వదనంబుపైఁ బఱి । దివుటమై నునుఁగొంతితీపు గ్రోలు,**
**సుందరీ రత్నంబు చూపు మనోహరు । నడుగుల యొప్పుపై నల్ల నడరుఁ,**
**బతివిలోకనములు పడఁతుకమైఁదీవఁ । గలయంగఁ బలుమఱు మెలఁగుచుండు,**
**వెలఁది కటాక్షముల్ విభునిపైఁగ్రమమున । నెగసి మోమున సోఁకి మగుడ వచ్చు.**

పద్యంలో వధూవరులు ఒకరినొకరు చూసుకోవడం లోని ఆసక్తి, ఆతురత అత్యద్భుతంగా వర్ణించబడింది.

విరాట సభలో ద్రౌపదికి కలిగిన అవమానాన్ని చూసి భరించలేకపోయాడు భీముడు. తొందరపడితే అజ్ఞాత వాసం భంగం జరుగుతుందో ఏమోనన్న సందేహం అడ్డొచ్చింది. ఈ సందర్భంలో తిక్కన పద్యం.

**"కనుఁగొని కోపవేగమునఁ గన్నుల నిప్పులు రాల, నంగముల్**
**గనలఁగ, సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ్మ, నితాంత దంతపీ**
**డనరటదాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త న ర్తన ఘటనా ప్రకార భయదస్ఫురణా పరిణద్ధమూర్తియై."**

రసపోషణలో తిక్కన స్థాయిని గుర్తింపజేసే పద్యాలలో ఇదొకటి. భీముని క్రోధావేశాన్ని వర్ణించడం ఇందులో ప్రధానం. చివరి రెండు పాదాల్లో క్రోధంలో ఊగిపోతున్న భీముణ్ణి పాఠకుల ముందుంచుతాయి. భీముని మనో చలక తీవ్రతను ఇవి వ్యక్త పరుస్తాయి. సమాసం మొత్తంలో శఫ'ట'కారాల పునః పునరావృత్తిని కల్గించడం క్రోధ వ్యక్తీకరణకు అనుకూలమని అలంకారికుల అభి మతం చంపక మాలలో రౌద్ర రసాన్ని ఆవిష్కరించడం చాలా అరుదైన విషయం. తిక్కన సిద్ధహస్తుడు కదా! అందుకే రసావిష్కరణలో తనదైన ప్రత్యేకతను చాటు కొన్నాడు.

కీచకుణ్ణి చిత్రహింస చేసి వికారంగా చంపాలని భీమునికి బుద్ధి పుట్టింది. అప్పుడా శవాన్ని గట్టిగా పట్టి తల, చేతులూ, కాళ్ళు శరీరంలోకి చొచ్చుకొని పోయేటట్లు చేసి, మొత్తం చిల్లులు పడ్డ నిండు సంచిలా వున్న కీచకుని శరీరాన్ని నేలమీద పడవేసి నలగగొట్టి సతోషంతో పెద్ద

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

ముద్దగా చేస్తాడు. ఈ సందర్భంలో తిక్కన బీభత్స రసాన్ని ప్రదర్శించాడు.

**"వికృతపుఁజావు సంప మది వేడుక పుట్టినఁగిట్టిపట్టిమ**
**స్తకమును బీన దీర్ఘ భుజశాఖలుఁ బాదయుగంబు మేనిలో**
**నికఁ జొర నుగ్గుగాఁ దుఱిమి నించిన గ్రంతలతిత్తియైన కీ**
**చకు ధరణీస్థలిం జదిపి చక్కని ముద్దగఁజేసెఁ దుష్టుఁడై."**

- ఈ విధంగా కీచకవధ ఘట్టంలో శృంగార రసాభాసం, రౌద్రం, బీభత్సం, క్రోధ రసాలు సందర్భానుసారంగా ప్రత్యక్షమై 'నానారసాభ్యుదయోల్లాసి' - అన్న తిక్కన నానుడిని సార్థక్యం చేస్తున్నాయి.

ఎర్రన భారతంలో సూక్తి వైచిత్రులు కోకొల్లలుగా కనిపిస్తాయి. ఎర్రన భారతంలో కథాగమనం పెంచి పోషించబడింది. అందుకే ఎర్రన్నది వర్ణనాత్మక దృష్టిగా ముద్రపడింది. ఎర్రన నృసింహ పురాణ పీఠికలో ఇలా వివరించారు.

**"ఉన్నత సంస్కృతాది చతురోక్తి పథంబులఁ గావ్యకర్తవై**
**యెన్నికమైఁ బ్రబంధపరమేశుఁ డనంగ నరణ్యపర్వశే**
**షాన్నయ మంధ్రభాష నుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి తా**
**నన్నయభట్ట తిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపునన్."**

అరణ్య పర్వాన్ని ఎర్రన నన్నయ తిక్కనాదుల మార్గాన్ని అనుసరించి అనువాదం చేశాడు. సందర్భానుసారంగా చతురోక్తులను ప్రదర్శించి తన కావ్య రమణీయతను ప్రదర్శించాడు.

నన్నయ మధ్యలో వదలిపెట్టిన శరత్కాల వర్ణనకు ఎర్రన హఠాత్తుగా ప్రారంభించి తొట్రుపాటు లేకుండా ప్రజ్ఞతో నిర్వహించాడు. ఎర్రన చేసిన శరదృతువర్ణన ఈ క్రింది పద్యంలో గమనించండి.

**"దానాంభః పటలంబునం బృథువయోధారావళిం దాల్చిగ**
**ర్జా నిర్ఘోషము బృంహితచ్ఛలనఁ బ్రచ్ఛాదించి ప్రావృట్పయో**
**దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతన్ డిగ్గె నాఁ**
**గా నొప్పారె మదోత్కట ద్విరద సంఘంబుల్ వనాంతం బునన్."**

- ఈ పద్యంలోని భావకల్పన, పద సంఘటన మిక్కిలి ప్రజ్వలంగా వుంది. ప్రతి పదగతమైన ఈ సౌందర్యం సైంధన పరాభవ ఘట్టాన్ని చక్కగా ప్రకాశిస్తుంది.

**"అలనవిలాసలాలన రసాన్వితలైన నితంబినీజనుల్**
**వలసిన, భూరివిస్ఫురితవస్తు సమగ్రము లైన గ్రామముల్**
**వలసిన సుల్లసన్మణి సువర్ణ విభూషణ గోధనావళుల్**
**వలసినఁ గోరుమిచ్చెద ధ్రువంబుగ నావుడు నాతఁ డిట్లనున్."**

- ఈ పద్యం ఎర్రన శైలికి చక్కటి ఉదాహరణ. ఎర్రన నన్నయ ధారాశుద్ధిని, తిక్కన పదాల విరుపును సాధించి తనదైన కూర్పుతో కవిత్వానికి ఒకే వ్యక్తిత్వాన్ని సాధించాడు. ఈ కూర్పులోని నేర్పు అతనిని ప్రబంధ పరమేశ్వరునిగా తీర్చిదిద్దింది. సందర్భానుసారంగా రసపరిపోషణ చేసిన కవులలో ఎర్రనగారికి కూడా సముచిత స్థానం ఉంది.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# నవరస మిశ్రితం - ప్రభావతీ ప్రద్యుమ్నం

- డా॥ పి. లలితవాణి, ప్రాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కాలెజి, చేవెళ్ళ, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

**"విభావానుభావ వ్యభిచారీ**
**సంయోగాద్రస నిష్పత్తిః"**

రస సిద్ధాంత ఆది గురువు భరతుని ప్రతిపాదనమిది. సహృదయునిలో నిగూఢమై ఉన్న భావ పరంపర కావ్య పఠనవేళ రసంగా అభివ్యక్తమై ఆనందాన్ని ప్రసాదిస్తుంది. రసం ఎనిమిది విధాలని భరతముని, శాంతరసాన్ని చేర్చి రసములు తొమ్మిది అని ఆనంతర ఆలంకారికులు నిర్ధారించారు. తరువాత్తరువాత మధుసూదన సరస్వతి భక్తిని, భానుదత్తుడు మాయని, మరొకరు ప్రేయస్సుని రసాలుగా పేర్కొన్నారు. స్థాయీ భావాలననుసరించి రసావిష్కరణ జరుగుతుంది.

లోకంలో ప్రతి మానవుడు ఆనందార్థి. ఆనందం మూడు రకాలు. ఒకటి లౌకికానందం. అది భౌతికం. రెండోది జ్ఞానానందం. అది ఆత్మానందం. అదే ఆధ్యాత్మికం. మూడోది అలౌకికానందం. అదే రసానందం. రసానందం బ్రహ్మానంద సహోదరం.

**"సాధ్యోహిరసః"**

"రసము కవి చేతను, సహృదయుని చేతను సాధింపదగింది" అని శబ్దశాసనుడు నన్నపార్యుడు విశ్లేషించాడు. అందుకే తన ప్రబంధాలలో నవరసాలను నిర్మించాడు సూర్యనార్యుడు. పాఠకులు సహృదయులైతే తప్పక తద్రసానందాన్ని ఆస్వాదించగలుగుతారు. నవవిధ రసాలు ధర్మోత్సాహాను ప్రాణితములైనప్పుడే దీప్తిమంతాలవుతాయి.

ప్రబంధయుగంలో పింగళి సూర్యనార్యునిది ఒక పెద్ద పీట. విశిష్టరచనలో సూరనది అందె వేసిన చెయ్యి. "కళాపూర్ణోదయం" ఒక అద్భుత కల్పనా విశేష ప్రబంధం. "రాఘవ పాండవీయం" ఒక అపూర్వ చిత్ర ద్వ్యర్థి కావ్యం. "ప్రభావతీ ప్రద్యుమ్నం" ఒక విలక్షణ శృంగార ప్రబంధం. "హరివంశం" లోని ఒక కథను స్వీకరించి "ప్రభావతీ ప్రద్యుమ్న" ప్రబంధంగా మలిచాడు. ప్రబంధ లక్షణాలైన అష్టాదశ వర్ణనాదులనే కాక నవరసాలను నిక్షిప్తం చేశాడు "ప్రభావతీ ప్రద్యుమ్నం"లో. నవరసాలూ నాట్యం చేశాయి ఈ ప్రబంధంలో. రసవర్ణన కూడా రసవత్తరమైనది.

శృంగారానికి స్థాయీ భావం రతి. నాయికా నాయకుల హృదయాలలో జనించే సంభోగాభిలాషయే రతి. ప్రభావతీ ప్రద్యుమ్నం శృంగార ప్రబంధమే. ఇందులో శృంగారమే అంగి. తక్కివన్నీ అంగరసాలే. శృంగారం ముఖ్యంగా రెండు విధాలు. స్త్రీ పురుషులు కలిసి ఉండగా చేయబడిన వర్ణన సంభోగ శృంగారం. ఇద్దరూ విడివిడిగా దూర దూరంగా ఉన్నపుడు చేయబడింది విప్రలంభ శృంగారం.

ఈ ప్రబంధంలో పంచమాశ్వాసంలో అధికభాగం శృంగార రసోల్లాసితమే. శృంగార రస ఉద్దీపనాలైన మన్మథోపాలంభనం, లజ్జా ప్రదర్శనం, నర్మోక్తులు, సరసోక్తులు మనోహరంగా వర్ణించాడు పింగళి సూరన. శృంగార రసానికి ఆలంబనమైన విరహ వర్ణన పఠితల మనస్సులను గిలిగింతలు పెడుతుంది. చివరిగా రసదీప్తి రతిక్రీడను ఆవిష్కరించాడు కావ్యకర్త.

**"యాదవుడంతట రతుల వి**
**భేదములు క్రమక్రమాభ్యుపేతములుగ నా**
**పైదలికి గఱిపి, చిత్రా**
**పాది సురత రాజ్యమునకు బట్టము గట్టెన్" - (5-100)**

అన్నిటికంటే కష్టతరమైనది సంభోగ శృంగార రసవర్ణన. కానీ, పింగళి సూరనకది సునాయాసమే అయింది.

**"గుబ్బపాలిండ్లు గన్గొను వేడుకను మించు**
**గాఢ పరీరంభ కౌతుకంబు**
**గాఢ పరీరంభ కౌతుకంబును మించు**
**జఘన లోలుప హస్త చాలనంబు**

**జఘున లోలుప హస్త చాలనంబును మించు**
**దిలక మంటిన కురుల్ దిద్దు తమియు**
**దిలక మంటిన కురుల్ దిద్దు తమిని మించు**
**వాతెఱ చవులాను వలపు పెంపు**
**వాతెఱ చవులాను వలపు పెంపును మించు**
**రతుల రవౌయు, రతుల రహిని మించు**
**నధర రసము, విఘటి తాన్యోన్యముగ దత్త**
**ఱిలుచు బతి రమించె జెలువ గూడి – (5-105)**

ఈ శృంగార ప్రబంధానికి ఈ ఒక్క పద్యం చాలు రసాత్మకతకు! ఇంతటి సంభోగ శృంగార వర్ణనము మరియొక చోట లేదేమోనని కవిసమ్రాట్ విశ్వనాథవారి భావన. ఈ శృంగార రసోల్లాస సందర్భంలోనే నాయకుడు ''ప్రప్రభావతి'' అని సంబోధించడం యావత్పండిత లోకాన్ని అలరించింది. సూరనకిది ఎంతో ఖ్యాతిని గడించి పెట్టింది.

**"శృంగార ఏవ మధురః**
**వర ప్రహ్లాదనౌ రసః"**

శృంగార మొక్కటే రసరాజమని పండిత సిద్ధాంతం.

నాయకుడు - ప్రతినాయకుని సంహరించడమే వీర రస దీప్తి. స్థాయి ఉత్సాహం. అందునా తత్ప్రతి నాయ కుడు రక్కసుడు, లోక కంటకుడు అయినప్పుడు ఆతని సంహారం విశ్వకళ్యాణమే అవుతుంది. లోక శ్రేయాన్ని చేకూర్చిన ఆ నాయకుడు ఉత్తముడు, ఉదాత్తుడు అవు తాడు.

ఈ ప్రబంధంలో వీరం అంగరసమే. కాకపోతే దుష్ట రాక్షస సంహారంతో కావ్యం ముగుస్తుంది కనుక - అంగమే అయినా ప్రాముఖ్యతను సంతరించుకుంది. నాయకుడు ప్రద్యుమ్నుడు. ప్రతినాయకుడు వజ్రనాభుడు. ప్రద్యు మ్నుడు - పరంధాముడైన శ్రీకృష్ణుని సుతుడు. శ్రీకృష్ణునికి సముడు. (వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధులకు అభేద మన్నది వేద స్తుతివాక్కు). ఇక వజ్రనాభుడు రాక్షసుడు. అష్టదిక్పాలకులను అష్ట కష్టాలు పెట్టినవాడు. త్రిలోక వాసులను తిప్పలు పెట్టినవాడు. ఒక్క ముక్కలో సాధు కంటకుడు. విశేషించి వరగర్వితుడు. చాటుగా వచ్చిన అల్లుని తీరు తెలిసి, కూతురి మగడన్న ధ్యాస కూడా లేక చంపడానికే విజృంభించాడు. అంతే. అసురునిపై క్రోధం, వానిని వధించాలన్న ఉత్సాహం, రక్కస వీరులలో భయం - మూడు ముప్పిరిగా ప్రద్యుమ్న వజ్రనాభుల సమరం భయంకరంగా సాగింది.. ఈ సందర్భంలో వీరంతో పాటు భయానక, రౌద్ర రసాలు కూడా చోటు చేసు కున్నాయి.

**"అంపవానలు గురిసె భయంకరముగ" – (5-209)**
**"తనవాలున దచ్చరములు**
**దునుముచు బ్రద్యుమ్నుడతని దునుముకడంకన్**
**ఘనరయమున జనదాకిరి**
**సునాభముఖ్యులగు రాక్షసులు బలములతోన్"**
**– (5-210)**

ఈ అసుర సంహార వీరరస దీప్తిలో ఓ విశేషం ఉంది. వీరరస భేదాలన్నిటికీ రసత్వ సిద్ధిని కల్పించేది ధర్మవీరం. అదే దాని సారం. ధర్మం అంటే ఏమిటి!? నిజకర్తవ్య పాలనమే కదా. దుష్ట సంహారమే మహాధర్మం. క్షాత్ర ధర్మం. విశేషించి వీర ధర్మం. లోక కంటకుడైన వజ్రనాభుని వధించడమే ప్రద్యుమ్నుడు నెరపిన క్షాత్ర వీరధర్మం. దానితో లోకశ్రేయస్సు చేకూరింది. అందుకే ఇక్కడ (ధర్మ) వీరరసం వర్తిల్లింది.

కరుణకి స్థాయి శోకం. వజ్రనాభుని చేత పడిన పాట్లన్ని టినీ శ్రీకృష్ణునికి వెళ్ళబోసుకుని బోరుమన్న మహేంద్రుని మనోవేదనంతా కరుణారసపూరితమే

**'తనకులుపా చాల'దని మిట్టిపడగ న**
**నామధేయపు దైత్యునకు నడంగి**
**'తన విడిదికి రంభ ననుపవై' తని తిట్టు**
**కిగ్గాడి యసురకు గేలుమొగిచి**
**'తనకు బెద్ద ఱికంబునుసేయ'వని దూఱు**
**నధమరాక్షసునకు నర్పలొసగి**
**'తనకమృతము వోసియనుప' వంచు నదల్ప**

**బినుగు రక్కసునకు బ్రియము చెప్పి**
**పంకరుహనాభ! యే బడ్డపాటు లరయ**
**నెందు నెవ్వరు బడరు నీకేమి చెప్ప!**
**నెంత పాపంబు చేసిన జంతు వొక్కొ**
**యింద్రుడగు'నని యపుడాత్మ నెన్నుకొంటి - (1-78)**

అని దైత్యాధముని దర్పాధిక చేష్టలన్నిటినీ చెప్పుకుని, తన దీనావస్థను దైత్యారి ముందుంచాడు దేవేంద్రుడు. అంతేనా! ఆ రక్కసుడు తనను పదవీ భ్రష్ఠుని చేసి, అమరావతి నుండి వెళ్ళగొడతానన్న వైనాన్ని విన్నవించు కున్నాడు.

**"రాజ్యహీనత నేగు మెచ్చుటి కేనియున్" (1-87)**
**"ఇట్లు సేయవేని, యింద్ర! మీరెల్ల నా**
**చేతిలోనివార చెప్పనేల?**
**యిపుడు పట్టి నిగ్రహించెద" (1-88)**
**"రాజ్య సుఖాశ యేర్పడ**
**న్విడిచితి, నింక నీవు తల నిండగ నర్థము వోసితేని నే**
**నడుగటు పెట్టగా వెఱతు, నచ్యుత! నిన్నునె కొల్చి**
**యుండెదన్" (1-92)**

అంటూ ప్రాధేయపడ్డాడు పరమాత్మునికి. ఇంతటి శోకతప్త కరుణ రసానికి శాంతరసం అవసరమయింది. పడిన కష్టాలకు విరక్తితో నిర్వికారం కలిగింది ఇంద్రునికి. నిర్వికార చిత్తవృత్తియే శమం. శాంత రసానికి స్థాయి శమం. మహేంద్రుని దీనాలాపాలు విన్న ఎవ్వరికైనా మనస్తాపం కలగక మానదు. భగవంతుడైన వాసుదేవుడే భరించలేక చెవులు మూసుకుని "కటకటా" అని కలత చెందాడు.

**ఎన్నగదొల్లి యీ కొలదియే; బలురక్కసు లెందఱెందఱ**
**త్యున్నతి గ్రొవ్వి త్రుళ్ళరు? బిడౌజ! తుదింజెడి**
**పోరెవాండ్రు? వీ**
**డున్నిజనాశకాలము కడున్నికటంబగుడన్, నలంగజే**
**సెన్నిను; నింత సత్పురుష చిత్తము నొచ్చిన రిత్తవోవునే!**
**(1-95)**

"మంచివారిని కష్టపెట్టిన పాపం ఊరికే పోదు" అన్న లోకోక్తితో దేవేంద్రుని ఊరడించాడు దేవదేవుడు. తన మాటలతో ఉపశమనం కలిగించి మనశ్శాంతిని ప్రసాదించాడు. ఇక్కడ పరోక్షంగా శాంతరసాన్ని ఆవిష్కరించాడు సూర్యనార్యుడు.

వజ్రనాభుడు తన రక్కస మూకతో నందనవనాన్ని, పారిజాతాది కల్పవృక్షాలను, రంభాది అప్సరలను హింసపెట్టిన వైనమంతా భీభత్సమే. దీనికి స్థాయి జుగుప్స. జుగుప్సను కూడా అందంగా వర్ణించడం తిక్క యజ్వ తర్వాత ప్రబంధ కర్తలకే సాధ్యం.

**దనుజాధిరోహ తాడన భంజనాదుల**
**కోర్చునే కల్పవృక్షోత్తమములు!**
**శోష్య పర్యుషిత మనుష్య మాంసంబులు**
**పూను నట్టివియె సంతానకములు!**
**దానవ ద్విప ఘటాలానతా దురవస్థ**
**సైరించునే హరి చందనములు!**
**మనుజ ఖాది స్వేద మలిన వస్త్రాదులు**
**దాల్ప బాలవియె మందార తరులు! (1-73)**

ఇందులో ముఖ్యంగా మనుష్య మాంసాలు, స్వేద మలిన వస్త్రాలు - జుగుప్సను కలిగించి, హృదయ శల్య కారకాలవుతాయి.

ఇప్పటికీ స్వర్గలోకమన్నా, నందనవనమన్నా, పారిజాతాది కల్పవృక్షాలన్నా - మనకు పూజనీయాలే. మహానందాన్ని కలిగించేవే. అలాంటి నందనవనాన్ని చిందరవందర చేసి, దివ్యవృక్షాలను మలినతరం చేయడం జుగుప్స కంటే ఎక్కువే.

వటువుల ఆగడంలో - గోచులను ఎత్తి, ఎగురవేసి, పట్టుకుని, కలకల నవ్వి, గోచులనే పుచ్చుకుంటామని చేసిన అల్లరి - పాఠకులను నవ్విస్తుంది. హాస్య రసానికి స్థాయి హాసమే. ప్రభావతి, చంద్రవతి, గుణవతి, శుఖి ముఖీల సరస నర్మోక్తులలో హాస్యరసం చిప్పిలింది.

మహదాశ్చర్యాన్ని, మనోహ్లాదాన్ని అందించేదే అద్భుత రసం. స్థాయి విస్మయం. అద్భుత వస్తు సందర్శనమే విస్మయ కారణం. ఈ కావ్యంలో ఆదిలోను, మధ్యలోను, అంతంలోను అద్భుత రసాన్ని చొప్పించాడు పింగళి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

(పురవర్ణన అష్టాదశ వర్ణనలలో ఒకటి ఐనప్పటికీ) ద్వారకా నగర వర్ణన విస్మయాన్ని కలిగించి, అద్భుత రసాన్ని ఆవిష్కరించింది. కోట చుట్టూ చుట్టుకుని ఉన్న చుట్లు - మహావిష్ణువును వీడలేక ఆదిశేషుడు ఆ వాసు దేవుడు కొలువున్న ద్వారకాపురి కోటను చుట్టుకునే ఉన్నాడా - అన్నట్లున్నాయన్న ఉత్ప్రేక్షతో ఆశ్చర్యాన్ని కలిగించాడు సూరన కవి.

**భోగపు జుట్లు కోటలుగ, భూరికిరీట సముజ్జ్వల త్ఫణా**
**పూగము సౌధబృందముగ, భోగి కులేంద్రుడు పేంద్రు బాయలే**
**కీగతి దానువచ్చి భజియించెనొకోయవతార! మంచు జే**
**తోగతి నాకు నెంతయును దోచుచున్నది నిర్జరేశ్వరా!**
**(1-60)**

ఇది ఒక్క మచ్చుతునక మాత్రమే. ఈ రకంగా పద కొండు పద్యాలలో ద్వారకను కళ్ళముందు ప్రత్యక్షం చేశాడు సూరన. ఇది కేవలం వర్ణనలలోని అద్భుతమే కాదు. ఊహా అద్భుతమే. రసమూ అద్భుతమే.

ప్రభావతికి పార్వతీదేవి కలలో సాక్షాత్కరించి ఒక పురుషుని వరునిగా నిర్ణయించి ఆతని రూపాన్నే చిత్రించి ఆ పటాన్నిచ్చింది. విభ్రమచెంది కనులు తెరిచిన ప్రభావతికి ఆ పటం ప్రక్కనే కనిపించింది. విస్మయం చెందింది. కలలో జరిగింది ఇలలో పక్కనే ప్రత్యక్షమవడం అద్భుతం కాదా! ఆ చిత్రం ప్రద్యుమ్నునిదే.

సుదర్శన చక్రాయుధం ఒక్క విష్ణువుకే ధరింప, భరింప, ప్రయోగింప శక్యం. కానీ, ఈ కావ్యంలో ప్రద్యుమ్నుడు చక్ర ప్రయోగం చేస్తాడు. ఇది అభూత అద్భుత కల్పన. శ్రీకృష్ణునికి పుత్రుడు, సముడు, అంశరూపుడు అయిన ప్రద్యుమ్నుడు తండ్రి ప్రసాదించిన చక్రాన్ని ప్రయోగించి వజ్రనాభుని శిరః ఖండన చేస్తాడు. ఇది నిజంగా అద్భుతమే.

నవరసాలే కాక భక్తిరసం, మాయారసం, ప్రేమో రసం కూడా ఈ ప్రబంధంలో ప్రస్ఫుటం అవుతున్నాయి.

సర్వరస సమ్మిశ్రితంగా మలిచినా ప్రభావతీ ప్రద్యుమ్నం శృంగార ప్రబంధమే. అంగి శృంగారమే అయినా అన్ని రసాలనూ ఆవిష్కరించి పింగళి సూరన పఠితలను రసోన్ముఖులను చేశాడు. సూరన కృతులు మూడూ - మూడు విభిన్న వైశిష్ట్య వైవిధ్య భరితాలే.

**పింగళి సూరన - "సత్కావ్య రచనా విశారదుడు".**
**నానా మహిత ప్రబంధ రచనా ఘనవిశ్రుతి"**

❖ ❖ ❖

# కరుణరసాత్మక నవల 'మూగవాని పిల్లనగ్రోవి'

– డా॥ ఎం. రమేశ్ బాబు, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైద్రాబాద్.

## రసం :

కావ్యానికి ఆత్మ రసమే అన్నది ప్రాచ్య ఆలంకారికులలో ఎక్కువ మంది అభిప్రాయం. రససిద్ధాంత ప్రవర్తకుడు భరతుడు మొదలుకొని మన ఆధునిక ఆలంకారికుల వరకు అంగీకరించినది రసమే ఆత్మ. "రస్యతే ఇతి రసః" అని (ఆస్వాదించబడుతుంది కాబట్టి రసం) నాట్యశాస్త్రంలో భరతుడు ప్రతిపాదించిన రస సిద్ధాంతాన్నే ఆనందవర్ధనుడు శ్రవ్యకావ్యాలకు కూడా అన్వయించాడు.

సాహిత్యం ఆలోచనామృతం. వాసనా రూపంగా మనలో ఉన్న సత్త్వగుణాల్ని ఉద్రేకింపజేసి రసస్థితికి కారణమౌతుంది. భరతుడే మరోచోట "నహి రసాదృతే కశ్చిదర్థ : ప్రవర్తతే" అంటాడు. అనగా రసహీనమైన ఏ అర్థం ప్రవర్తించదు. దీనినే అభినవ గుప్తుడు

**రసేనైవ సర్వం జీవతి కావ్యం**
**నహి రస శూన్యం కించిదస్తి**
**రసోవస్తుతః ఆత్మా వస్త్వలంకార ధ్వనీతు**
**సర్వథా రసం ప్రతి పర్యవస్యేతే" అంటాడు**

(రసము చేతనే కావ్యం సర్వం జీవిస్తుంది. రస శూన్యమైన కావ్యం ఉండదు. నిజానికి రసమే కావ్యాత్మ. వస్తువు, అలంకారాలు, ధ్వని సర్వథా రసానికి సహాయాలే అవుతాయి)

## రస సంఖ్య :

ఇంతటి ప్రాముఖ్యం గల రసం మరియు రస సంఖ్య విషయంలో కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. భరతుడు

**"శృంగార హాస్య కరుణా రౌద్రవీర భయానకా**
**బీభత్సాద్భుత సంజ్ఞా చేత్యష్టౌ నాట్యేరసాస్మతి"**

అంటూ 8 రసాలు శృంగారము, హాస్యము, కరుణము, రౌద్రము, వీరము, భయానకము, బీభత్సము మరియు అద్భుత రసాలను పేర్కొన్నాడు. ఆ తర్వాత భట్టోద్భవుడు తన కావ్యాలంకార సారసంగ్రహంలో "శాంతాన్ని" కూడా రసంగా చెపుతూ నవరసాలను (9) ప్రతిపాదించాడు. ఆ తర్వాత చాలా కాలం వరకు ఆనంద వర్ధనుడు, అభినవగుప్తుడు భట్టనాయకుడు, విశ్వ నాథుడు, జగన్నాథ పండితరాయులు వంటి వారు కూడా ఈ నవరసాలనే ఆమోదించారు.

ఆ తర్వాత కొందరు ఆలంకారికులు మరికొన్ని భావాలను కూడా రసాలుగా ప్రతిపాదించారు. వీరిలో రుదటుడు ప్రేయస్సును (స్నేహం), విశ్వనాథుడు వత్సలను (వాత్సల్యం), మధుసూదన సరస్వతి భక్తిని, భానుదత్తుడు మాయారసం (మిథ్యాజ్ఞానం) రసాలుగా ప్రతిపాదించారు. మొత్తం మీద భరతుడు మొదటగా చెప్పిన 8 రసాలతో పాటుగా 'శాంతం' కూడా రసంగానే పరిగణిస్తూ నవ రసాలు స్థిరపడ్డాయి. దీనినే భట్టోద్భవుడు తన కావ్యాలంకార సార సంగ్రహంలో ఈ విధంగా పేర్కొన్నాడు

**శృంగార హాస్యకరుణా రౌద్రవీర భయానకాః**
**బీభత్సాద్భుత శాంతాశ్చ నవ నాట్యేరసాస్మృతా**

## కరుణరసం :

దీని తర్వాత ఏ రసము గొప్పది అన్న చర్చ ఆలంకారికులో జరుగగా భోజుడు "శృంగార ఏవ ఏకో రసః" (శృంగార మొక్కటే రసం) అని ప్రతిపాదించగా భవభూతి తన ఉత్తర రామచరితమ్‌లో "ఏకోరసః కరుణ ఏవ" అంటూ కరుణమే అన్ని రసాలకు మూలమని ప్రతిపాదించాడు.

**"ఏకో రసః కరుణ ఏవ నిమిత్త భేదా**
**ద్భిన్నః పృథక్పృథగి వాశ్రయుతే వివర్తాన్**

**ఆవర్త బుద్బుద తరంగ మయాన్వికారా
నంభోయథాసలిలమేవహి తత్సమస్తమ్"**
**- ఉత్తరరామచరిత**

కరుణమొక్కటే రసం. నీరు సుడులుగా, బుడగలుగా, అలలుగా, ప్రవాహంగా మారినట్లు 'కరుణం' వివిధ రకాలుగా కనిపిస్తుంది అంటాడు. భరతుడు ఈ కరుణంలోనే మూడు భేదాలు ఉన్నాయని చెప్పాడు.

1) ధర్మోప ఘాతజం (ధర్మహాని వల్ల కలిగేది)
2) అర్థాపచయోద్భవం (ధనహాని వల్ల కలిగేది)
3) శోకకృతం (బంధువుల, మిత్రుల మృత్యుశోకం వల్ల కలిగేది)

భానుదత్తుడు కేవలం రెండు భేదాలుగా 'కరుణం'ను పేర్కొన్నాడు

1) స్వనిష్ప (తనకు వచ్చిన కష్టం వల్ల కలిగేది)
2) పరనిష్ట (ఇతరులకు వచ్చిన కష్టం వల్ల కలిగేది)

ఇలా రసస్వరూపాన్ని ఆలంకారికులు నేటికీ వివరిస్తూనే ఉన్నారు. ఈ రసస్వరూపాన్ని ఆధునిక సాహిత్యానికి కూడా అన్వయిస్తూనే ఉన్నాం.

ఎందుకంటే.. "నభావహినోస్తి రసః, నభావో రసవర్జితా" (భావము లేని రసము లేదు, రసవర్జితమైన భావమూ లేదు) ఆధునిక సాహిత్య ప్రక్రియలలో కూడా రచయిత తన ఎంచుకున్న వస్తువును బట్టి రసపోషణ చేస్తున్నాడు.

## ఆధునిక ప్రక్రియలలో వస్తువు :

ఆధునిక సాహిత్యంలో ప్రక్రియలు అనేకంగా ఉన్నాయి. ప్రక్రియ ఏదైనా రచయిత సమాజ పరిణామాలనే ఇతి వృత్తంగా తీసుకొని కావ్యసృష్టి జరుపుతున్నాడు. ఉదాహరణకు గత మూడు, నాలుగు దశాబ్దాలలో ఛిన్నాభిన్నమయిన గ్రామీణ వ్యవస్థని చిత్రించే సాహిత్యం వివిధ ప్రక్రియలలో వచ్చినప్పటికీ నవలలో ఈ అంశాన్నే ప్రధానంగా తీసుకొని రచించిన అనేకం పాఠకలోకానికి చేరువయ్యాయి. వాటిలో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడానికి ప్రధాన కారణాలయిన 1995 డబ్లు.టి.ఒ. గాట్ ఒప్పందం మొదలుకొని ప్రభుత్వాలు ప్రస్తుతం ఆర్థిక మండళ్లకై (రాజ్జు), జలాశయాలకై, రహదారులకై, వివిధ కారణాలతో చేపట్టిన భూసేకరణలు, వాతావరణ ప్రతికూల పరిస్థితులు, ప్రభుత్వాల నిర్లక్ష్యం ప్రధానాంశాలుగా ఉన్నాయి.

భూమికి రైతుకి ఉన్న సంబంధం తల్లీ బిడ్డల సంబంధంగా చూస్తాం. పంట పండినా, ఎండినా చివరకు అడుక్కుతినే పరిస్థితి దాపురించినా భూమిని అమ్ముకోవడానికి రైతు ఇష్టపడడు. రైతుకు భూమి ఒక ఆసరా, ఒక తోడు, ఒక పని, ఒక స్నేహం, ఒక మమత, ఒక గౌరవం, చివరకు ఒక ప్రాణంగా చెప్పవచ్చు. కాని మారుతున్న సామాజిక వ్యవస్థలో భూమిని నమ్ముకొన్న రైతు ప్రాణాలు తీసుకోవడానికి కూడా సిద్ధపడుతున్నాడు.

## కేశవరెడ్డి నవలలు :

డా॥ పి. కేశవరెడ్డి రచించినవి '8 నవలలు'. ఇవి (1) శ్మశానం దున్నేరు (2) క్షుద్రదేవత (3) అతడు అడవిని జయించాడు (4) రాముడుండాడు - రాజ్యముండాది (5) సిటీ బ్యూటిఫుల్ (6) చివరి గుడిసె (7) మూగవాని పిల్లనగ్రోవి (8) మునెమ్మ. వీటిలో సిటి బ్యూటిఫుల్ అనే నవల తప్ప మిగతావన్నీ గ్రామీణ సమాజపు రూపురేఖలను, అంతఃసంఘర్షణలను చిత్రీకరించేవే. కేశవరెడ్డి గారు తమ నవలలో తీసుకున్న ఇతి వృత్తాలు చాలా క్లిష్టమైనవిగా చెప్పవచ్చు. ఒక్కో నవల ఒక్కో జీవితాన్ని ఆవిష్కరించేవే. ఈ జీవితాలు క్రాంతదర్శులై కవులకు, సామాజిక ఉద్యమకారులకే కాక సాధారణ మానవ మాత్రులు లెవరూ ఊహించలేనివి. ఈ నవలలోని కథానాయకులు అణగారిణ వర్గాలుగా నేటికీ ఉన్న ఎరుకలు, యానాదులు, మాలలు, ఇంకా ఆరుగాలం శ్రమించే కాపులు మాత్రమే. ఇలాంటి కష్టజీవుల యదార్థ, వ్యధార్థ గాథలకు కావ్యగౌరవం కల్పించి వారి జీవితాన్ని నవలలుగా మలచి పాఠకుడి ముందు నిలిపిన శిల్పి డా. పి. కేశవరెడ్డి గారు. అందుకే ఈరి నవలలన్నీ ఇంగ్లీషు మరియు వివిధ భారతీయ భాషల్లోకి అనువాదమై విశేషమైన ఖ్యాతిని తీసుకొచ్చాయి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

## మూగవాని పిల్లనగ్రోవి - కరుణరసం :

కేశవరెడ్డి గారు 1996 లో రచించిన మూగవాని పిల్లనగ్రోవి నవలలో భూమితో రైతుకున్న సంబంధం, అన్యోన్యత ఎంత గాఢమైనదో, భూమితో రైతుకు ఎడబాటు రైతు అస్థిత్వాన్ని ఎంతగా కృంగదీస్తుందో మనం చూడవచ్చు. డబ్లు.టి.ఒ. ఒప్పందంలో భారతీయ రైతు జీవితంలో వస్తున్న మార్పులను దశాబ్దం పాటు పరిశీలించిన కేశవ రెడ్డి గారు అన్యాపదేశంగా రైతు జీవితంలో ఏర్పడు కల్లోలాలను దీనిలో చిత్రీకరించాడు. రైతు పెట్టుబడులు పెరిగిపోవడం, వాతావరణంలో మార్పులు, కరువు, రైతు పరపతి లేకపోవడం, పెట్టుబడులకై అప్పులు చివరికి ఆత్మహత్య వీటన్నింటినీ ఈ మూగ వాని పిల్లనగ్రోవిలో చూపాడు.

ప్రకృతికి - రైతుకి - భూమికి ఉండే సంబంధాన్ని కథానాయకుడై బక్కిరెడ్డి జీవితలో చూపిస్తాడు రచయిత. జీవితమే కాదు మరణంలోనూ అదే సంబంధాన్ని కొనసాగిస్తాడు. దీనికి ఒక్క ఉదాహరణ చాలు. బక్కిరెడ్డి తన పొలమైన 'బాటకాడికయ్యలు' తను చేసిన అప్పు కింద మణియంగారి స్వాధీనం చేసినప్పటికి నుండి మనిషి అచేతనంగా మారిపోతాడు. తర్వాత రోజు రాత్రి మబ్బు పట్టి వర్షం మొదలు కాగా వర్షంతో తడిసిన భూమి నుండి వచ్చిన మట్టి వాసననే మళ్లీ అతనిలో ఉత్తేజాన్ని కలిగిస్తుంది. ఆ వాసనను ఎదనిండా పీల్చిన బక్కిరెడ్డి కొద్ది రోజులుగా తనలో ఆవరించిన నిస్సత్తువను, నిరుత్సాహాన్ని నిరాశను ఒక్కసారిగా వదిలేస్తాడు. అదే అర్ధరాత్రి మంచిపై నుండి లేచి ఎడ్లను కట్టుకొని నాగలిని భుజాన వేసుకొని తన పొలం దగ్గరకు వెళ్లి దున్నడం మొదలెడ్తాడు. ఇప్పుడు తనది కాని ఆ భూమిని దున్ని, దున్ని అలసి ఆ బురదలోనే కూరుకుపోయి మరణిస్తాడు. బక్కిరెడ్డి భార్య ఉదయం బక్కిరెడ్డిని వెదుకుతూ పొలం దగ్గరికి వెళ్లేసరికి అక్కడ కనిపించిన దృశ్యం దృశ్యాన్ని వివరించిన కేశవరెడ్డి గారు కరుణ రసాన్ని ఒక దృశ్యంగా చూపారు. రచయిత వర్ణనలోనే" పొలం మధ్య ఎడ్లు రెండూ నిలబడి నెమరువేస్తూ ఉన్నాయి. నాగలి మేడి పక్కకు పడిపోయి ఉంది. బక్కిరెడ్డి ఎడమ చేతి పిడికిలి నాగలి మేడి చుట్టూ బిగుసుకొని ఉన్నది. కుడి భుజము, ముఖము బురదలో సగానికి కూరుకొని ఉన్నాయి"

**అందుకే ఏకో రసః కరుణ ఏవ**

## ఆధార గ్రంథాలు :

1. నాట్యశాస్త్రం - భరతుడు
2. తెలుగు సాహిత్య విమర్శ - వెలమల సిమ్మన్న
3. సాహిత్య శిల్ప సమీక్ష - పింగలి లక్ష్మీకాంతం

❖❖❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# శివకవుల సాహిత్యం - రసవాదం

- నందిగామ నిర్మలకుమారి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ & పీ.జి కళాశాల, సిద్ధిపేట, తెలంగాణ.

"విభావ అనుభావ, వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తి" భరతుడు రస సిద్ధాంతంలో మూడో శతాబ్ధంలో చెప్పాడు. విభావాలు మానవుని ఆలోచనను ప్రభావితం చేస్తాయి, అనుభావాలు వ్యక్తి ప్రవర్తనను బట్టి ఉంటాయి, వ్యభిచారి భావాలు మనసు ఉపరితలంలో కలిగే భావనలు. వీటి ఆధారంగా మానవుని జీవన సరళి ఉంటుంది. ఈ ప్రతి పాదన ప్రసిద్ధ లాక్షణికుడు భరతుడు తన 'నాట్య శాస్త్ర గ్రంథం'లో వివరించాడు. మనిషి యొక్క భావోద్వేగాలు ఆయా కాలాన వచ్చిన సాహిత్యంలో ప్రస్ఫుటం అవుతాయి అనేది భరతుని భావన. ఇది కేవలం మనిషి యొక్క భావోద్వేగాలు మాత్రమే కాదు, ఒక నిర్దిష్టమైన సమయంలో సమాజంలో వ్యక్తి యొక్క వైయుక్తిక అనుభవాలు మాత్రమే కాకుండా సమాజం యొక్క భావోద్వేగాలను సాహిత్యంలో నిలిపిన ఉదంతాలు ఉన్నాయి. "కళ కేవలం కళ కోసమే" కాకుండా సమాజం కోసం అని నమ్మిన ఉదంతాలు చరిత్రలో అనేకం ఉన్నాయి ఆక్రమంలో ప్రాచీన అలంకారికుల మొదలు ఆధునిక కవుల దాకా ఈ ప్రయత్నం వెనక ఉన్న కృషిని వివరించడంతో బాటు సాహిత్య సాంస్కృతిక ప్రాచీన పౌరాణికాల మొదలు మధ్య యుగాలలో వచ్చిన శివకవుల దాకా సాహిత్యంలో అనేక ప్రత్యామ్నాయ ఆలోచనలు ప్రోది చేసుకున్న వైనం అర్థం కావాలి అంటే సమాజంలో జరిగిన గమనాలను అర్థం చేసుకోవాలి. ఆ గమనాలతో బాటు సాహిత్యంలోనూ సంభవించిన మార్పులనూ గమనించాలి.

సాహిత్య ప్రపంచంలో దాతువు అక్షరం అయినప్పుడు అవి పదాలు వాక్యాలుగా ఒక్కొక్క వాక్యం కావ్య రూపం సంతరించుకుంటుంది. అంటే దాతువులో రసము ఆయువుపట్టుగా ఉంటుంది. ప్రాచీన ఆలంకారికులు రస సిద్ధాంతం గురించి అనేక వాదోప వాదాలు చేసారు. భారతీయ సాహిత్యంలో అతిప్రాచీనమైన సాహిత్య రూపం వేదాలు, ఉపనిషత్తులు. వాటి కొనసాగింపుగా వచ్చిన పురాణ, ఇతిహాసాలు

సాహిత్యం ప్రతి యుగానికి తమవైన సాహిత్య రూప సారాలను కలిగి ఉంటుంది. దానికి అనువైన సాహిత్య వాదాలనూ తన వెంట తీసుకొని నిత్యం గమనంలో ఉంటుంది. ఆగమనం తాను నడిచిన కాల విలువలనూ ప్రజా బహుళ్యంలోకి తీసుకొని పోతుంది. ఆ క్రమంలో మొదట వేద సారస్వతం, ఆతర్వాత పురాణ ప్రభంధ ప్రక్రియలు, వాటి కొనసాగింపుగా ఇతర కావ్యాలు, శతకాలు, పద్య గద్య ఇతర కావ్య ప్రక్రియలూ ఆయా కాలానికి అనుగుణంగా బయలుదేరాయి.

ఆ క్రమంలో పురాణయుగం అయ్యాక క్రీ.శ. ఆరు ఏడు శతాబ్దాల మధ్య దక్షిణ భారతదేశ కేంద్రంగా బయలు దేరిన భక్తి సాహిత్యం ఈ దేశ విలక్షణమైన ప్రక్రియగా ముందుకు వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా మత ఆధారిత సంస్కరణ ఉద్యమాలు మిగతా ప్రాంతంతో పోలిస్తే భారతదేశంలో ఎక్కువ. కాకుంటే ప్రపంచ వ్యాప్తంగా మతం పేరుతో జరిగిన అనర్థాలు మన దగ్గరే ఎక్కువగా జరిగాయి. ఆ క్రమంలో జైన, బౌద్ధ, లోకాయత చార్వాక, శైవ, వైష్ణవ, వీరశైవ లాంటి ధార్మిక పాయలు తమవైన సాహిత్య ప్రక్రియలనూ తమ ధార్మిక పాయల వ్యాప్తికోసం వాటిని మరింత సమర్థవంతంగా ప్రజల మధ్య నిలపడం కోసం వివిధ సాహిత్య ప్రక్రియలు ముందుకు వచ్చాయి. ఇది మొదట మౌఖికంగా తర్వాత లిఖిత రూపంలోకి ఆ తర్వాత వివిధ జనరంజక ప్రదర్శన రూపంలోకి విస్తరించింది.

ఆ క్రమంలో తెలుగులో స్వతంత్ర కావ్య రచన పాల్కురికి సోమనాథునితోనే మొదలైంది. ఆ ప్రక్రియ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

ప్రజాదారణ పొందడం వెనక పాల్కురికి అనుసరించిన కావ్య ఎత్తుగడ. తెలుగులో దేశీ సాంప్రదాయానికి తొట్ట తొలిగా పునాదులు వేసిన ఆయన పురాణ రచనా ప్రక్రియను అప్పటి దాకా ఉనికిలో ఉన్న గ్రాంధిక భాష కాకుండా ప్రజలకు సులభంగా అర్థం అయ్యే విధంగా ద్విపద ప్రక్రియను అనుసరించాడు. ఆ విధంగా ద్విపదలో ప్రబంధ కావ్యాలను పురాణరూపంలో సాధారణ భక్తుల చరిత్రలకు కావ్య గౌరవం ఆపాదించి ప్రజా కవి కాగలిగాడు. ఒక రకంగా సాహిత్య చరిత్రలో మధ్య యుగాలలో జరిగిన ఈ ఎత్తుగడ నాటి లాక్షణికుల నిర్దేశిత రస వాదాలకీ కావ్య పరిమితులకీ భిన్నమైనమే అనుకోవచ్చు. ఎందుకంటే ఆ కావ్యాలు లక్షలాది ప్రజలకు దగ్గర అవడం వెనక నాడు ఆయన అనుసరించిన భాష, భావ, సరళత మాత్రమే.

"సాహిత్య చరిత్రలో అయినా విజ్ఞానశాస్త్ర చరిత్రలో అయినా పురోగమనం ఒకే విధంగా ఉండదు. చరిత్రలో మొదటి యుగాన్ని తర్వాత యుగం అప్రధానం చేస్తుంది, సాహిత్య చరిత్రలో ఒక యుగాన్ని మరొక యుగం అధిగమిస్తుంది" త్రిపురనేని మధు సూధనరావు 1997 (సాహిత్యంలో వస్తు శిల్పాలు). ఆ క్రమంలో లాక్షణికులు నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి యుగానికీ అప్రధానం చేయడమో అధిగమించడమో జరుగుతూనే ఉంది. ఎందుకంటే చరిత్ర నిరంతరం గమనంలో ఉంటుంది. కనుక భావాలూ నిరంతరం సంఘర్షణలో ఉంటాయి.

పూర్వకాలంలో కావ్యానికి, కావ్య పరంపరకు పరిమితమైన ఒక వర్గం ఉంది. పండిత పామర విభజన తోబాటు వేద, పురాణ, ప్రబంధ కావ్యాలకు ఒక స్పష్టమైన శిష్ట వర్గం ఉంది. కానీ ఈ వర్గానికి, బయట ఉన్న సాధారణ ప్రజలకు వేదం సాహిత్యం పురాణ ప్రవచనం అందనంత దూరంలో ఉంది. నాటి శివకవులు దేశీ భాషలలో అందునా సులభంగా అర్థం అయ్యే ద్విపద లాంటి ప్రక్రియల రూపంలో రచనలు చేయడం మూలంగా అంతకు ముందు సాహిత్యంలో యుగాన్ని శివకవులు అధిగమించారు అనుకోవచ్చు. దానికోసం వాళ్ళు ప్రజా భాషను వాహికగా చేసుకోవడంతో బాటు అంతకు ముందు ఉన్న కావ్య భాషకు రచనా ప్రక్రియకూ భిన్నమైన ద్విపదను అన్వయించుకున్నారు.

రాజ భాషకీ ప్రజల భాషకూ మధ్య రూపంలోనూ సారంలోనూ అంతులేని అఘాతం ఉండేది. మధ్య యుగాల కాలం నాటి సాహిత్య లక్ష్యం ఆనాటి సమాజంలో వేళ్ళూనుకుని పోయిన ధార్మిక పాయలను ప్రజా జీవనంలో వివిధ రూపాలలో కావ్యాల ద్వారా సుస్థిరం చేయడం మాత్రమే. అయితే ఇంతకు ముందు ఉన్న యుగంలో ఈ రచనా ప్రక్రియలు మొత్తం సంస్కృత, పాళీ, ప్రాకృత భాషలో ఉన్నా ఆనాటి లాక్షణికులు విధించిన కావ్య పరిమితులు మాత్రం మీరలేదు. నాటి సంస్కృత భాష వాస్తవానికి రాజ భాష మరియు పండిత భాష అది ప్రజా బాహుళ్యంలోకి రావడానికి చాలా కాలమే పట్టింది. ఈ ప్రక్రియలు వందల ఏళ్ళుగా స్థిర పడి కొన్ని నిర్దిష్టమైన లక్ష్యాలకు అనుగుణంగా చలామణి అయ్యాయి.

తొలి సాహిత్య రూపం అయిన ఈ ప్రక్రియలు ప్రధానంగా క్రీ.పూ. నాల్గవ శతాబ్దం నుండి క్రీ.శ. నాలుగు, ఐదు శతాబ్దాల వరకు నాటి లాక్షణికులు నిర్దేశించిన లక్ష్యాల పరధిలోనే ప్రజా బహుళ్యంలో మనగలిగి ఉన్నాయి. ఈ ప్రక్రియలు మొత్తం నాటికి మౌఖిక రూపంలోనే ఉన్నాయి. కాలక్రమేణ మహా జనపదాల కాలం మొదలు మౌర్య, గుప్త, రాజవంశాలు పురాణాలు ఇతిహాసాలను లిఖిత రూపంలోకి అచ్చు వేయడం జరిగింది. అలా అచ్చు రూపంలోకి వచ్చినా ఒక క్రమబద్ధమైన విభజన రేఖ లోపల మాత్రమే ఈ సాహిత్యం చలామణీలోకి వచ్చింది. మహా సామ్రాజ్యాలు అంతరించాక ఏర్పడిన ప్రాంతీయ రాజ్యాల ఆవిర్భావంతో బాటు ప్రాంతీయ భాషల సాహిత్య వికాసం వాటికి లిపి రూప కల్పన కూడా మొదలైంది. ఈ ప్రక్రియలు అన్నీ ఆనాటికి లాక్షణ కారులు నిర్దేశించిన రసాల అనుసారంగా ఉండేవి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

వాటిని కాదని రచన చేసే శక్తి నాటి కావ్యకర్తలకు లేదు. ఆ క్రమానికి పునాదులు వేసిన వారు శివకవులు.

ప్రాంతీయ భాషల ఆవిర్భావంతో బాటు నాటి ప్రాచీన కావ్యాల అనువాదాలు విస్తృతంగా జరిగాయి. ఆ విధంగా ఆవిర్భావం చెందిన అనువాద సాహిత్యం కూడా లక్షణ శాస్త్రాల అనుసరణగానే జరిగాయి. ఆ విధంగా అనువాదాలతో బాటు పురాణ సాహిత్యానికి ప్రక్షిప్తాలు, అన్వయాల మొదలు దేశ భాషల్లో స్వతంత్ర కావ్య రచనలు కూడా మొదలు అయ్యాయి. ఆ పరంపరను ప్రభావవంతంగా జన బాహుళ్యంలోకి తీసుకొని పోయిన వాళ్ళలో శివ కవుల ధీరోదాత్తమ పటిమ వాస్తవానికి నాటి లాక్షణికుల చట్రాలను ధిక్కార స్వరంతో ఎదిరించారు. అందులో ఆధ్యుడు తొలి తెలుగు ఆదికవి ప్రథమాంధ్ర పితామహుడు పాల్కురికి సోమనాథుడు. తెలంగాణ ప్రాంతానికి మణి మకుటం లాంటి విద్వత్ కవి పౌరాణికుడు సోమన. కాకతీయుల కాలంలో క్రీ.శ పన్నెండు, పదమూడు శాతాబ్దాల మధ్యకాలంలో వరంగల్ జిల్లా పాలకుర్తిలో జన్మించిన పాల్కురికి సోమనాథుడు ఆనాడు మహోధృతంగా ప్రజలలోకి వచ్చిన వీరశైవ లాక్షణికుడు. అయితే గడిచిన కాలాన ఉద్భవించిన సాహిత్యం నవరస భరితంగా, సరససల్లాపంగా, లయబద్ధంగా ఉండాలి అనే నిబంధన ఉండేది. మహాకావ్యాలకు ఉండవలసిన కావ్య హేతువులను శైలము, పురము, రాజు, రుతువులు, యాత్ర, యుద్ధము, మంత్రము, ఉద్యానము, చారుడు, సురతము, వివాహము, జలక్రీడం, విప్రలంభము, చంద్రోదయము, పుత్రుడు, మధుపానము లాంటి కావ్య వర్ణనలు ఉండవలెననే నిబంధనను త్రుణీకరించినవాడు పాల్కురికి అంతే కాకుండా ముప్పై ఆరు అలంకారాలు, డెబ్బై రెండు అర్ధభావాలు, నవరసాలు తదితర కావ్య లాక్షణికులు నిర్దేశితములకు అతీతంగా కావ్య రచన చేసిన వాడు సోమనాథుడు దేశీ భాషల్లో మొదట పురాణ సాహిత్యానికి అనువాదాలతోబాటు వాటికి వందలాది ప్రక్షిప్తాలు ప్రజలకు వివిధ రూపాల ద్వారా వచ్చాయి. ఈ వచ్చే క్రమంలో ఆయా రాజ వంశాలు అనుసరించిన ధార్మిక పాయలకు అనుగుణంగా ఈ రచనల మీద ప్రభావం ఉండేది. తొలి దశ వైదిక రచనల ప్రధాన లక్ష్యం వైదిక సాంస్కృతిక పరంపర వ్యాప్తి చేయడం లక్ష్యంగా ముందుకు వచ్చాయి అని మూల రచనలు వాటి అను వాదం రూపేణా ముందుకు తెచ్చిన రాజ వంశాలూ స్పష్టంగా పేర్కొన్నారు. ఈ క్రమంలో తెలుగునాట మొదలైన దేశీ సాహిత్య రచనను ముందుకు తీసుకొని వచ్చిన శివకవుల సాహిత్య తిరుగుబాటును చర్చించదలిచాను.

తెలుగు నాట కాకతీయ ప్రభువుల పాలన కాలంలో ఇక్కడ సాహిత్యం, సాంస్కృతిక కళలు, నృత్యం లాంటి వాటికి ఎక్కువ ప్రాతినిథ్యం ఇచ్చారు అనేది జగద్వితం. వాస్తవానికి ప్రతాప రుద్ర దేవుని ముందు వరకూ కాకతీయులు జైన మతాన్ని అవలంభించారు. కాకతీయుల కాలంలో అనేక జైన సదనాలు ఆరామాలు వాటి ఉనికి ఉన్నది అన్న దానికి ప్రత్యక్ష సాక్ష్యం. పదకొండు పన్నెండో శాతబ్దంలో కర్ణాటక నుంచి బయలుదేరిన బసవుని వీరశైవం కాకతీయుల పాలనా కాలంలో ముఖ్యంగా ప్రతాపరుద్రుని కాలంలో అంటే పన్నెండు పదమూడో శతాబ్దాన్ని వీర శైవ మతానికి ఉచ్ఛ దశ అనుకోవచ్చు. నాడు సాహిత్యంలో శివ కవుల యుగంగా శివత్రయంగా పరిగణించబడిన పాల్కురికి సోమనాథుడు, మల్లిఖార్జున పండితా రాధ్యుడు, నన్నెచోడుడు. శివ కవులలో ప్రధానంగా అప్పటివరకూ వస్తున్న భాషా ధోరణుల మీద సాంస్కృతిక వైరుధ్యాల మీద ముఖ్యంగా పురాణాల నిర్మాణం మీద అనేక ప్రయోగాలు చేసారు. రూప సారాల్లో అప్పటి వరకూ వచ్చిన నిర్మాణ సూత్రాలను పునర్నిర్మాణ దిశగా తమ రచనల ద్వారా ముందుకు వచ్చారు. ఇది నిజానికి సాహిత్య చరిత్రలో ఒక నూతన దృక్కోణం. ఒక రకంగా భాషా సాంస్కృతిక ఆధిపత్యం మీద తిరుగుబాటు. ఆ క్రమంలో ముందుకు వచ్చినదే దేశి మార్గ చర్చ. మార్గ ఆధిపత్య శక్తుల రూపం అయితే దేశీ సాంప్రదాయం మౌఖిక పరంపరను అనుసరిస్తున్న సామాన్య జనఘోష.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

ఆ ప్రక్రియకు పునాది వేసిన వారు శివకవులు. శివ కవుల అంతిమ లక్ష్యం వీరశైవ ధార్మిక భావనల ప్రచార లక్ష్యం అయినప్పటికీ వాళ్ళు అనుసరించిన భాషా సూత్రాలు ఎన్నుకున్న రచనలు రచనా శైలి పామర లోకానికి మరింత ప్రీతిపాత్రం అయ్యాయి అనడంలో సందేహం లేదు.

తెలుగు భాష ఉనికి క్రీ.శ. ఆరు, ఏడు శతాబ్దాల కాలంలో మొదట శాసనాల రూపంలో ఉన్నప్పటికీ క్రీ.శ. పదకొండు పన్నెండో శతాబ్దంలో అది కావ్య భాషలా రూపు దిద్దుకున్నా ఆ క్రమానికి ఆద్యుడు పాల్కురికి సోమ నాథుడు. తెలుగు సాహిత్యంలో ఆదికవి పాల్కురికి సోమ నాథుడు. ఆయన రాసిన బసవపురాణం సంస్కృత అష్టా దశ పురాణాల రూప సారాలకు భిన్నంగా రాయబడినది. అప్పటి దాకా తెలుగు సాహిత్యంలో రెండు వర్గాలు, రెండు సాహిత్య పాయలుగా విడివడి ఉన్న క్రమంలో జాన తెలుగులో రాసిన ద్విపద కావ్యం బసవపురాణం. ఒక రకంగా చూసినట్లయితే ఇది తొలి తెలుగు దేశీ పురాణంగా భావించవచ్చు. సంస్కృత పురాణాల ఆధిపత్య ధోరణుల మీద తిరుగుబాటు శివకవులతోనే మొదలైంది.

నాటి రాజ భాష సంస్కృతం అనివార్యంగా రాజాస్థానా లలో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆక్రమంలో మొదలైనదే దేశీ మార్గ భావన. అది మరొక పార్శ్వంలో లిఖిత మౌఖిక భావనగా రెండు పాయలుగా తమ తమ శ్రోతలను కలిగి ఉంది. శివకవులు తమ రచనలలో శ్రోత లకు మౌఖిక సాంప్రదాయంలో పురాణాలను శ్రవణా నందముగా తీర్చి దిద్దారు. ఈ ప్రక్రియ ప్రధానంగా కాక తీయుల కాలంలో వర్ధిల్లింది. ఈ కాలంలోనే అనేక ద్విపద కావ్యాలు ఆనాటి అష్టాదశ పురాణాలను అనుసరిస్తూ విస్తారంగా రచనలు వచ్చాయి. ఆధునిక చర్చల్లో శివకవుల సాహిత్య ఒరవడిని అవైదికంగా వేద ప్రమాణంలేని దానిగా లాక్షణికులు అభిప్రాయపడ్డారు. సాంప్రదాయ లాక్ష ణికులు నిర్దేశించిన భాష, భావ, సాంస్కృతిక చట్రాలకు విరుద్ధమైన భావజాల వ్యాప్తిని శివకవులు అనుసరించారు.

ఆ అంశాలను నాటి విమర్శకులు అయిన బండారు తమ్మయ్య, వేటూరి ప్రభాకర శాస్త్రి, డా. చిలుకూరి నారా యణ రావు, గడియారం రామకృష్ణ శర్మ, జి.వి. సుబ్ర హ్మణ్యం లాంటి సాహిత్య విమర్శకులు కూడా బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర రచనలకు రాసిన సుదీర్ఘ విపుల పీఠికలో ఈ అంశాలను నిరూపించారు. ముఖ్యంగా బండారు తమ్మయ్య బసవ పురాణానికి రాసిన పరిశోధ నాత్మకమైన ముందు మాటలో లాక్షణికులు నిర్దేశించిన వివిధ రస వాదాలకు భిన్నంగా రాయబడిన అంశాలు నిరూపించారు.

బసవపురాణం రచనను వెలికి తీసి విపుల పీఠిక రాసిన బండారు తమ్మయ్య, ఆ తర్వాత పందొమ్మిది వందల నలభైలలో పాల్కురికి సోమనాధుని విరచిత మల్లికార్జున పండితారాధ్య చరిత్ర రచనకు ప్రసిద్ధ పరిశోధకుడు డా చిలుకూరి నారాయణ రావు రాసిన పరిశోధనాత్మక రచనలో లాక్షణిక సాంప్రదాయానికి విరుద్ధమైన అంశాలు చర్చించారు. ఆయనతో బాటు ఆచార్య జి.వి. సుబ్ర హ్మణ్యం కూడా బసవపురాణం రచనకు ముందుమాట రాస్తూ లాక్షణిక సాంప్రదాయాలను త్రుణీకరించిన వైనాన్ని ఆధారాలతో సహా నిరూపించారు. మొత్తంగా తెలుగు భాష ఆవిర్భావంలో తొలి రచనలు అనువాదాలు అయిన ప్పటికీ తొలి స్వతంత్ర రచనలకు మార్గం వేసిన వాడు పాల్కురికి సోమనాధుడు మాత్రమే. పురాణ నిర్మాణంలో ఆయన అనుసరించిన పద్ధతి అప్పటి శిష్ట పురాణాలకు భిన్నంగా ఎన్నుకున్నాడు. ప్రాచీన ఐహిత్యాల స్థానే శివుని భక్తుల చరిత్రలనే ప్రధాన భూమికగా బసవపురాణం రాసాడు. ఇది ఒక రకంగా నాటి పురాణ రచనలో ఒక ప్రయోగాత్మక ప్రక్రియ అయితే శివ కవుల రచనలు మొత్తం రస వాదానికి వ్యతిరేకంగా ఉన్నాయి అనడం కాదు గానీ ఆనాటి ఆలోచనా శైలికి భిన్నమైన ఇతివృత్తంతో కావ్య రచన చేసిన శివకవులు తమవైన అలంకార శైలిని

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

తమవైన కావ్య హేతువులను అవలంబించి మిగతా కావ్య కర్తల రచనా శైలికి ధిక్కారంగా ఒక యుగాన్ని శాసించారు అనడంలో అతిశయోక్తి లేదు. వీటి వీద ఇంకా సమగ్రమైన పరిశోధన చేయాల్సిన అవసరం ఉంది.

## ఉపయుక్త గ్రంథ సూచీ :

1. త్రిపురనేని మధు సూధన రావు : సాహిత్యంలో వస్తు శిల్పాలు పర్స్పెక్టివ్స్ ప్రచురణలు, 1997, హైద్రాబాద్
2. చిలుకూరి నారాయణ రావు : పండితారాధ్య చరిత్ర పాల్కురికి సోమనాధుడు. తెలుగు విశ్వవిద్యాలయము, 1990, హైద్రాబాద్
3. ఆరుద్ర : సమగ్ర ఆంధ్ర సాహిత్యం మొదటి సంపుటి, తెలుగు అకాడమీ, 2002, హైద్రాబాద్
4. రస సిద్ధాంతం : పుల్లెల రామచంద్రుడు తెలుగు అకాడమి 1985, హైద్రాబాద్

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# కె. సభా కథలు - కరుణరసం

**- వారణాసి మల్లీశ్వరి,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం, చిత్తూరు జిల్లా.

పశుపక్ష్యాదులతో సహా మనిషి వివిధ సందర్భాల్లో స్పందించే తీరును తెలియజేసేది రసం. శరీరంలోని అవయవాల స్పందనను బట్టి అతడు ఎలాంటి స్థితిలో ఉన్నాడో చెప్పగలుగుతాం. అలాంటి భావననే 'రసం' అంటారు. మానవుని జీవితం నిత్యం సంఘర్షణలమయం. మనిషి సుఖదుఃఖాది మానసిక స్థితిగతులకు లోనవు తుంటాడు. మనుగడ సాగించే సందర్భంలో సుఖం, సంతోషం, బాధ, దుఃఖం, ఆనందం వంటి భావనలకు తగిన విధంగా స్పందిస్తుంటాడు. ఈ భావాలన్నింటిని క్రాంతిదర్శులైన మునులు 'రస' రూపంలో వ్యక్తం చేశారు. ఉదాహరణకు విధ్వంస దృశ్యాన్ని చూసినపుడు భయం కలుగుతుంది. ఆ భయం ఎలా ఉందో చెప్పడానికి ఉపమానాలతో కూడిన రసతత్వాన్ని 'భయానకరసంగా' పేర్కొన్నారు. ఇలా నవరసాలనూ వివరించారు. అయితే కొందరు రసాలు తొమ్మిది కాదని అనంతుని 'అనంతావై రసః' అన్నారు. రసాలు అనంతాలు అని అభిప్రాయ పడ్డారు.

"విభావానుభావ సంచారీ భావ సంయోగాతే రస నిష్పత్తిః" అన్నారు ఆలంకారికులు. విభావ, అనుభావ, సంచారీ భావాల సంయోగంతో రసం ఏర్పడుతుంది. రసాలలో సరసం మిన్న అనే చర్చ ఆలంకారికుల మధ్య చాలాకాలం జరిగింది. ఒక్కొక్కరు ఒక్కో రసాన్ని 'రస రాజము' గా పేర్కొన్నారు. కొందరు హాస్యం అన్నారు. ఇంకొందరు భక్తి అన్నారు. మరికొందరు భక్తి రసమే కాదన్నారు. భవభూతి మాత్రం 'ఏకోరసః కరుణ ఏవ' అన్నాడు. కరుణరసం ఒక్కటే రసమన్నాడు.

మనిషికి ఉండాల్సిన గుణాలన్నిటిలో మిన్నగా ఉం డాల్సింది కరుణ. ఈ కరుణ ఉండే సమాజంలో హత్యలు, దొమ్మీలు, దోపిడీలు, అరాచకాలు, దౌర్జ న్యాలు, అత్యాచారాలు, వేధింపులు, అనైతికత వర్తనలు జరగవు. ప్రజలందరూ ప్రశాంతంగా జీవించగలుగుతారు. ఈ 'కరుణ' గుణం లేకపోవడం వల్ల అసంఖ్యాక అవకతవకలు సమాజంలో వెర్రితలలు వేస్తున్నాయి. ఇదే భావనను భవభూతి వెలిబుచ్చాడు.

పురాణాల్లో, కావ్యాల్లో, ప్రబంధాల్లో నవరసాల పోషణ ఉంటుంది. ప్రాచీన కావ్యాలతోపాటు నేటి ఆధునిక సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లోనూ నవరసాలు కని పిస్తాయి. వెనుకబడిన రాయలసీమలోని కరువు, పేద ప్రజల కడగండ్లను అక్షరబద్ధం చేసిన సభా కథల్లోని కరుణరసాన్ని రేఖా మాత్రంగా పరిశీలించడమే ఈ పత్రం ఉద్దేశం.

కె. సభా రాయలసీమ జీవితానికి సంబంధించిన ప్రత్యేక సమస్యల్ని తన కథల్లో చిత్రీకరించారు. సభా రాసిన అనేక సమకాలీన సామాజిక కథలకు కేంద్రబిందువు బడుగులే. రాయలసీమ ప్రాంతంలో చితికిపోయిన రైతును ఆవిష్కరించడానికి ఇన్ని కథలు రాసిన మరొక రచయిత లేరంటే అతిశయోక్తికాదు ! సభా రాసిన 'పాతాళ గంగ' అన్న ప్రసిద్ధమైన కథ రాయలసీమ కథాసాహిత్యంలో తరువాత రచయితల వస్తు ఎంపికకు బాటలు వేసింది.

సభా కథల్లో ఎక్కువగా కరుణరసం కనిపిస్తుంది. 'అంబా' కథానికలో ఒకవైపు భూగర్భజల సంక్షోభాన్ని, సన్నకారు రైతుల కష్టాలను కళ్ళకు కట్టారు. కపిలకు ఆధారమైన గిత్త మరణాన్ని ఆర్ద్రంగా ఆవిష్కరించారు. ఈ కథలోని పున్నయ్య సిద్ధులమ్మ దంపతులకు నాలుగు గుంటల వ్యవసాయమే ఉంది. పన్నెండుమట్ల బావిలో గజంలోతు నీళ్ళు మాత్రమే ఉన్నాయి. మడిని తడి చేయడం పెద్ద సమస్య. రెండు గిత్తలూ, ఆలూమగలూ, ముగ్గురు మగపిల్లలూ, ఇద్దరు కూతుళ్ళూ... వీరంతా నాలుగు గుంటల మడికోసం చాలా శ్రమపడతారు. ప్రతి

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

రైతు తన ఎడ్లను కన్నబిడ్డల్లా చూసుకుంటాడు. ఈ కథలో పున్నయ్య పరిస్థితి కూడా అంతే. కపిల తోలడం ముగిస్తుండగా హఠాత్తుగా పున్నయ్య, ఓ గిత్త బావిలో పడిపోతారు. తాను తీవ్రమైన గాయాలతో ఉన్నా తన కన్నా ఎక్కువగా గిత్త కోసం పున్నయ్య పడ్డ ఆర్తి పాఠకుల మనసును కలిచివేస్తుంది. భర్తకు వైద్యం చేయించేందుకు గిత్తని అమ్ముదామనుకున్న భార్య మీద పున్నయ్య విరుచుకు పడతాడు. రైతులకు వారి ఇంట ఉండే పశువులకు మధ్య మానసిక బంధాన్ని సభా చక్కగా వర్ణించారు. "నాకేమీ పరవాలేదు. ఒకటి రెండురోజుల్లో బాగయిపోతుంది. ముందు ఆ గిత్తకు పచ్చ గడ్డి తెచ్చిపెట్టు. కోడిగుడ్లు పట్టు వేస్తే దానికి ఒళ్ళు నొప్పులుపోతాయి" అని పున్నయ్య మంచంలోంచే భార్యను పురమాయిస్తాడు. ఈ వాక్యాల్లో గాయపడిన పశువుపై యజమాని చూపే ప్రేమానురాగాలు కనిపిస్తాయి. చదివే పాఠకుడి హృదయం ద్రవించక మానదు.

సీమ కరువు నేపథ్యంగా చిత్రించిన 'అంబా' ఒక విషాదాంత కావ్యం. పున్నయ్యకు ఉన్న రెండు గిత్తల్లో ఒకటి ప్రమాదవశాత్తూ బావిలో పడుతుంది. దాన్ని చూస్తూ బిక్కుబిక్కుమంటూ మరో గిత్త గట్టున నిలబడి ఉంటుంది. బావిలో పడ్డ గిత్త అంబా అంబా అంటూ అరుస్తోంది. స్పృహలోకి వచ్చిన పున్నయ్య ఆ అరుపులు విని విలవిల్లాడిపోయాడు. డెబ్బై రెండు అడుగుల లోతుకు పడ్డ తన గిత్తకు ఎంతటి గాయాలయ్యాయోనంటూ తపించిపోయాడు. తనకు తగిలిన గాయాల గురించి ఆలోచించకుండా గిత్తను బయటకు తీసేవరకూ ఆస్పత్రికి రానని పట్టుపడతాడు. పదిహేను మైళ్ళున్న ఆస్పత్రికి వెళ్ళాలంటే పున్నయ్య కుటుంబానికి సాధ్యంకాని పని. ఆస్పత్రి వైద్యమంటే ఆ కుటుంబానికి తలకు మించిన భారం. చావు బతుకుల్లో ఉన్న మనిషి వైద్యం చేయించుకోలేని పరిస్థితిని సామాన్యుల స్థితికి అద్దం పడుతూ సభా రాసిన తీరు పాఠకుల హృదయాల్ని మెలి పెడుతుంది.

కొట్టంలో కొమ్ము విరిగిపోయిన గిత్త అంబా అంబా అంటూ అరుస్తుంటే పున్నయ్య తల్లడిల్లిపోయేవాడు కొమ్ము విరిగినచోట పెద్ద రంధ్రం పడి చెత్త బెట్టింది. ఆ బాధను భరించలేక అది "తలను గట్టిగా గోడకేసి కొట్టుకున్నది. చేరెడు చీము, నెత్తురూ పురుగులు చింది పోయినవి. నట్టింటిలో పడివున్న పున్నయ్య దానిని చూచి ప్రాణం తల్లడిల్లిపోగా పైకి లేవబోయి మళ్ళీ క్రింద పడినా ఊరుకోలేక డేకుతూ డేకుతూ వాకిటకు వచ్చాడు. అలాగే మెల్లగా ప్రాకుతూ వెళ్లి గిత్తను అందుకొన్నాడు. అది మోరను వంచింది. మెల్లగా గాటిలోనున్న కసువుతో పుండును తుడుస్తుంటే అది పసిబిడ్డలా కన్నీరు కారుస్తూ ఉండిపోయింది. అతని హృదయం ఎలాంటిదో ఆ గిత్తకు తెలుసు. ఆ కోడె గుండెలెలాంటివో ఆ పున్నయ్యకే తెలుసు. రెండు ప్రాణాలూ బాధతో ఉన్నా రెండు ప్రాణాలు అల్లల్లాడుతున్నా క్షణకాలం ఏదో చెప్పరాని, వర్ణించడానికి ఈ జగత్తులో ఎవ్వరికీ వీలుకాని ఆనందాన్ని అనుభవించాయి." ఇది చదివిన పాఠకుల కంట్లో నీరు రాకమానదు. ఇంతటి కరుణరసాన్ని సభా తన కథలలో గుప్పించి పశువులకు రైతుకూ ఉన్న అనుబంధాన్ని వర్ణించారు.

పున్నయ్య తన గురించి పట్టించుకునే స్థితిలో లేడు. నిద్రలో కూడా గిత్త గురించే ఆలోచన. "సిద్దీ సిద్దీ గిత్తకెలా ఉందో చూసిరా ఎవరో ఈడుస్తున్నారే దాన్ని చూడు చూడు" అంటూ గిత్త బాధనంతా తానే అనుభవిస్తాడు. హృదయవిదారకమైన నరకాన్ని చవిచూస్తాడు. అంతలో గిత్త తలవాలిపోగా, పున్నయ్య వెనక్కి వాలిపోవడం రెండూ ఒకేసారి జరుగుతాయి. అటు గిత్త, ఇటు పున్నయ్య ఒకేసారి ప్రాణాలు వదిలారు. రచయిత ఆ మాట నేరుగా చెప్పకపోయినా పాఠకుడి కళ్ళు చెమర్చే తీరులో రచన ఉంది. ఈ కథలో కరుణరసం కట్టలు తెంచుకుంది.

అదే విధంగా సభా రచించిన కరుణరసాత్మక కథ "బంగారు". ఆమె బంగారు గనుల్లో పనిచేసే కూలీ. సొంత పొలం లేని రైతు కూతురు. బంగారుకు ఎర్రరాళ్ళ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

కమ్మల జత కొనాలనే ఆశ. తండ్రి రత్తయ్య పంటలో వచ్చిన ఆదాయంతో ఎర్రరాళ్ళ కమ్మలు చేయిస్తానని మాట ఇచ్చాడు. కానీ ఆ ఏడాది చెరకు పంట చెడిపోయింది. అప్పులపాలైన రత్తయ్య వాటిని తీర్చేసి, బంగారు గనుల్లో కూలీగా చేరాడు. ఎంతో కష్టపడి రెండు వందలు సంపాదించాడు. దాంట్లో ఓ వంద రూపాయలు పెట్టి కూతురికి ఎర్రరాళ్ళ కమ్మలు చేయిద్దామనుకున్నాడు. కానీ ఇంతలోనే జబ్బు పడ్డాడు. సొమ్ము ఖర్చయిపోయింది. ఆ యువతి అతి చిన్న కోరిక తీర్చలేనందుకు తండ్రి పడే యాతన గుర్తుకువస్తేనే హృదయం ద్రవిస్తుంది. సభా రాసిన వాక్యాల వెంట కళ్ళు వెళుతూ ఉంటే నీటి పొరలతో ఒక్కోసారి అక్షరాలు కనిపించవు.

తండ్రి ఖరారు చేసిన ముత్యాలును పెళ్ళిచేసుకోవడానికి బంగారు ఓ షరతు పెట్టింది. తనకు ఎర్రరాళ్ళ కమ్మలు కొనివ్వమని పట్టుబట్టి పెళ్ళితో కమ్మలు సాధించింది. పెళ్ళయిన నెలరోజులకు తాను పెట్టుకున్న కమ్మలు ఎరువు నగలని తెలుసుకుని ఎంతో వేదన మనసులో ఉన్నా పైకి కనిపించకుండా కమ్మలు తీసి భర్త చేతిలో పెడుతుంది. ఇక్కడ రచయిత కరుణ రసాన్ని అతికినట్లుగా తీర్చిదిద్దారు. బంగారు కోరిక మాత్రం ఎప్పటికీ తీరకపోవడాన్ని కథలో కరుణాత్మకంగా వర్ణించారు సభా. బిడ్డ పుట్టినా ఆమె కోరిక మాత్రం కమ్మలమీదే ఉంది. అది తీరనికోరికగానే జీవితాంతం మిగిలిపోతుంది. నోటిదాకా వచ్చిన కూడు మట్టిపాలైందన్న చందంగా ప్రతి సందర్భంలో కమ్మలు కొనేశాననుకునే దశలో ప్రతిబంధకాలు ఎదురై బంగారు ఆశను అడియాశ చేశాయి. ఈ కథలో సాంతం కరుణరసం కనిపిస్తుంది.

సభా రచనలు భూమి, భూమిని నమ్ముకున్న కుటుంబాలు, ఆ కుటుంబాలపై ఆధారపడిన పేదల చుట్టూ తిరిగాయి. పలు కథల్లోని అనేక సందర్భాల్లో కరుణరసం పాఠకుల హృదయాల్ని తాకేలా పోషించారు సభా. ఎనిమిది దశాబ్దాల కిందట రాసిన కథల్లో కడుపునిండని జీవుల గురించి సాగిన సభా రచనలు మనసున్న ప్రతి మనిషిచేత కన్నీటి చుక్కలు కురిపిస్తాయి. సమాజంలో నేడు కూడా అలాంటి దృష్టాంతాలు మనకు ఎదురవుతూనే ఉన్నాయి.

❖❖❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# భాగవతంలో అద్భుత రసం

– కుమ్మరి ఎల్లప్ప, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

భాగవతం అనగానే మనకు హైందవధర్మం, భక్తి తాత్త్వికత, గుర్తుకువస్తాయి. భాగవతం, భాగవతం, అంటూ పోతే బాగైతం, బాగైతం అని వినిపిస్తుంది. భాగవతంలో నవవిధ భక్తులును పోతన పోషించడం జరిగింది. భాగవతంలో దాదాపు అన్ని రసాలు ఉన్నాయి. విష్ణుమూర్తి దశావతారాలలో అద్భుతరసం పోషించ బడిందని చెప్పవచ్చు. అద్భుతరసం నవరసాలో ఒకటి. నారాయణుడు అద్భుతరసాన్ని ప్రధాన రసంగ చెప్పడం జరిగింది. అద్భుతాంశంతో కూడిన రసాన్ని అద్భుత రసం అనవచ్చు. మానవాతీత శక్తిని అద్భుతాంశం అంటారు. మానవ మేధాశక్తిచే సృష్టించే ప్రతిది అద్భుతాంశమే. మనస్సుకు ఆహ్లాదాన్ని, ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని ఇచ్చె ప్రతి అంశం, అబ్బా, ఆహ్హా, ఓహో అని అనిపించే ప్రతి అంశము అద్భుతాంశమే, అద్భుతములో కూడీన రసము అద్భుత రసము.

## భాగవతంలో..

అద్భుతరసం గురించి వివచించడానికి నేను ఈ వ్యాసంలో ప్రయత్నం చేస్తాను. భాగవతంలోని విష్ణుమూర్తి అవతారాన్ని వేశాలలో అద్భుత రసం గలదు. గోవర్ధన పర్వతోద్ధోరణ, కాళీయమర్ధనం, కుచేలుని కథలో, శ్రీకృష్ణ లీలల్లో, నరసింహావతారంలో, గజేంద్ర మోక్షం మొదలగు సన్నివేశాల్లో పోతన అద్భుత రసాన్ని బాగా పోశించాడు. పోతన తన భాగవతంలో దాదాపుగ అన్ని రసాలను పోశించాడు. శబ్ధ సౌంధర్యం, శబ్బాలంకారాలకు పోతన ఆయనకు ఆయనే సాటి. శ్రీకృష్ణుడు మట్టి తిన్నాడని తల్లి యశోద నోరు తెరచి చూసిన సందర్భంలో అద్భుత రసం గలదు.

**నరసింహావతారంలో అద్భుతరసం :** నరసింహస్వామి స్తంభంనుండి ఉద్భవించినప్పుడు ఆ సమయంలో పోతన అద్భుత రసాన్ని ఈ క్రింది విధముగా పోశించాడు. ప్రహ్లాదుని తండ్రి హిరణ్యకశపుడు విష్ణుమూర్తి ఏది? అని అడిగితే అప్పుడు ప్రహ్లాదుడు తండ్రితో ఈ విధముగ పలుకుతడు. ‘‘ఇందుగలడందులేడని

**సందేహము వలదు చక్రి సర్వోప గతుండెందెందు వెదకి చూచిన**
**నందందే గలడు దానవాగ్రణ వింటే”**

ఆ శ్రీహరి లేని చోటు లేదు. ఆయన సర్వాంతర్యామి అని ప్రహ్లాదుడు అనగా హిరణ్య కశ్యపుడు ఈ స్తంభం నందు నీ హరిని చూపించు అనగా హరిని ప్రహ్లాదుడు ధ్యానించగా భక్తుని మాటలు నిజము చేయగోరిన హరి స్తంభంనందు ఉద్భవించాడు. స్తంభం నుండి ఉద్భవించిన సమయంలో స్తంభం పెళపెళా విరిగింది, విస్పులింగాలు దశ దిశలా చెలరేగాయి. మేఘాలు ఢీకొట్టుకొని పిడుగులు పడినట్లుగా ఉరుములు పుట్టాయి., ఛటఛట ధ్వనులు దిక్కులకు వ్యాపించాయి. ఆ ధ్వనికి బ్రహ్మాండము దద్ధరిల్లింది. ఆ స్తంభం విచ్చుకొని ఎర్రని రెండు పాదాలు వెలువడ్డాయి. పద్మాల్లా ఉన్న ఆ పాదాలలో శంఖం, చక్రం చాపం, మొదలైన లక్షణాలతో సాముద్రిక చిహ్నాలు గోచరించాయి. ఆ సమయంలో దిగ్గజాలు, శేషుడు, ఆదికూర్మం మొదలగునవి అన్ని కుంగిపోయాయి. ఆ సమయంలో పహ్లాదుని కాపాడడానికి, హిరణ్యకశిపుని శిక్షించడానికి నరసింహును రూపంలో శీహరి ఆవిర్భవించాడు. ఇక్కడ నరసింహా స్వామి అవతారంలో అద్భుత రసం చెప్పడం జరగింది. ఈ క్రింది పద్యంలో అద్భుత రసం చెప్పడం జరిగింది.

**“నరమూర్తి గాదు కేవల**
**హరిమూర్తియుగాదు మానవాకారముకే**
**సరియాకారము నున్నది**
**హరిమాయారచితమగు యథార్థ సూడగన్”**

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

**గజేంద్రమోక్షంలో అద్భుత రసం :** గజేంద్రమోక్షంలో శ్రీహరి ఏనుగును కాపాడె సందర్భంలో పోతన అద్భుత రసాన్ని చెప్పడం జరిగింది. "సిరికిం చెప్పడు శంఖ చక్ర యుగము.....", అను పద్యంలో అలాగే "తన వెంటన్ సిరి, లచ్చివెంట నవరోధ వ్రాతమున్...." అను పద్యంలో అలాగే ఈ క్రింది పద్యంలో కూడా అద్భుతం రసం పోశించబడింది.

**"మరకమొకటి రవి జొచ్చెను**
**మరకము మరియొకటి దనదుమాటున డాగెన్**
**మకరాల యముని దిరిగెడు**
**మకరంబులు కూర్మ రాజు మరున కరిగెన్"**

శ్రీహరి చేయి చాచి గజేంద్రుని శరీరమంత నిమిరి దు:ఖం పోగొట్టి కరిని సరస్సుపైకి లాగినసందర్భంలో కరి పొందిన అనుభూతిని, మొసలికి శాపం పోగొట్టు సమయంలో పోతన అద్భుత రసాన్ని చెప్పడం జరిగింది.

**క్షీరసాగర మథనంలో అద్భుత రసం :** క్షీరసాగర మథనంలో శివుడు విషాన్ని మింగినప్పుడు పోతన అద్భుత రసాన్ని పోషించాడు. పార్వతితో శివుడు ఈ విధముగా అంటాడు. "దేవి ఈ విషం లోకాలను నాశనం చేస్తుంది, కాబట్టి ఈ హాలాహాలాన్ని నేను స్వీకరించి సర్వ ప్రాణుల్ని రక్షిస్తాను అంటాడు. ఈ క్రింది పద్యాన్ని గమనించినట్లైతే శివుని త్యాగము మరియు భాగవతంలోని అద్భుత రసం తెలుస్తుంది.

**"మ్రింగెడి వాడు విభుండని**
**మ్రింగెడిదియు మేలని ప్రజకున్**
**మ్రింగుమనె సర్వ మంగళ**
**మంగళ సూత్రంబు నెంత మరి నమ్మినదో"**

ఈ పద్యములో విషం మింగడం అనేది ఒక శివుడికి మాత్రమే సాధ్యం అని పోతన భాగవతంలో అద్భుత రసంగా చెప్పడం జరిగింది.

**"గరళంబు గంఠ బిలమున**
**హరుడు ధరించుటకు మెచ్చి యౌను ననుచున్**
**హరియు విరించియు నుమయును**
**సురనాథుడు బొగడిరంతసుస్థిరమతితో"**

అను పద్యంలో కూడ అద్భుత రసం గలదు.

**వామనావతారంలో అద్భుత రసం :** వామనావతారంలో బలి చక్రవర్తికి విష్ణుమూర్తి విశ్వరూపం చూపించు సందర్భంలో పోతన అద్భుత రసం చెప్పడం జరిగింది.

**"ఇంతింతై వటుడింతయై మరియు దానింతై వీధిపై**
**నంతే చంద్రుని కంతయై ధ్రువుని పై నంతై మహర్వాతి పై**
**నంతై సత్య పదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్థియై"**

అను పద్యంలో అలాగే "రవిబింబంబు పమింప బాబాత్రమగు .... "అను పద్యంలో పోతన అద్భుత రసం చెప్పడం జరిగింది.

భాగవతం దశమస్కంధములో యశోద శ్రీకృష్ణుడు మన్ను తిన్నాడని తెలిసి అతన్ని మందలిస్తుంది. ఆ సమయంలో శ్రీకృష్ణుడు ఇలా అంటాడు.

**"అమ్మా! మన్ను దినంగనే శిశువునో యాకొంటినో వెట్టినో**
**నమ్మంజూడకు వీరి మాటలు మదిన్నన్నీవు కొట్టంగ వీ**
**రిమ్మార్గము ఘటించి చెప్పదరు కాదేనిన్....**

అనె పద్యంలో అలాగే

**"కలయో వైష్ణవ మాయయో యితర సంకల్పార్థమో సత్యమో**
**తలపన్నే రక యున్న దానినో యశోదదేవి గానో పర స్థలమో యుండుటకే .....".**

అనుపద్యంలో పోతన అద్భుత రసం చెప్పడం జరిగింది.

**గోవర్ధనోధరణంలో అద్భుత రసం :** శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతం ఎత్తిన సమయంలో కూడ అద్భుత రసం గలదు. ఇంద్రుడు గోవర్ధన పర్వతంపై ఎడతెరిపి లేకుండ వర్షం కురిస్తే, ఆ సమయంలో కొందరు ముసలి వారు శ్రీకృష్ణున్ని కాపాడమని వేడుకొనగ, శ్రీకృష్ణుడు మీరు భయపడకండి ఇదంత ఇంద్రుని పని అని గోవర్ధన పర్వతాన్ని ఎత్తుతాడు.

**"బాలుండీతడు కొండ దొడ్డది మహా భారంబు సైరంపగా**
**జాలంగో యది దీని క్రింద నిలువన్ శంకింపగా బోలదీ**
**శైలాంభోనిధి జంతు సంయుత ధరా చక్రంబు పై బడ్డ నా**

కేలల్లాడదు బంధులార నిలుడీ క్రిందన్ ప్రమోదం బునన్. "అనుపద్యంలో పోతన అద్భుత రసం చెప్పడం జరిగింది. అలాగే కుచేలుని కథలో కూడ శ్రీకృష్ణుడు అటుకులు తినడం, కుచేలునికి ఐశ్వర్యం కలగడం, ఆ సమయంలో శ్రీకృష్ణుడు కుచేలునికి చేసిన సపర్యలు, స్నేహం మొదలగు అంశాలు అద్భుత రసంతో చెప్పడం జరిగింది.

ఈ విధంగా నవరస పోషణలో పోతన అగ్రేసరుడని నిర్ణయిస్తూ నరసింహావతారంలో, గోవర్ధనోధరణంలో, వామనావతారంలో, క్షీరసాగర మధనంలో, గజేంద్ర మోక్షంలో మొదలగు సన్నివేశాలలో అద్భుత రస నిరూపణ చేస్తూ ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

❖❖❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# "దంపతుల ప్రథమ కలహం" కథలో "కరుణ రసం'

- **డా॥ బి. భీమమ్మ** అధ్యాపకురాలు, తెలుగు విభాగం, ఉమెన్స్ డిగ్రీ కళాశాల, బేగంపేట్, హైదరాబాద్.

తొలి తెలుగు కథారచయిత్రిగా వెలుగులోకి వచ్చిన భండారు అచ్చమాంబ రాసిన "దంపతుల ప్రథక కలహం" కథలో ఓ వెచ్చని సెలయేరై, ఓ చల్లని చిరుగాలై, ఓకమ్మని లాలిపాటై, కరుణరసాన్ని ఒలికించి... ఆపై ఓ సంసార సంగీత వీణాతంత్రుల్ని మృదుమధురంగా మోగించింది. ఈ కథ 1902 లో రచించబడింది. హిందూసుందరి పత్రికలో ప్రచురింపబడి, ఎందరో దంపతులకు ఆదర్శంగా నిలబడింది.

కథలో ప్రధానంగా లలిత, నారాయణరావు దంపతులతో పాటుగా పార్వతమ్మ పాత్ర కనిపిస్తుంది. లలిత నారాయణరావులకు పెళ్ళయి రెండు నెలలు కావొస్తుంటుంది. నారాయణరావు మృధుస్వభావి భార్యను అమితంగా ప్రేమిస్తాడు. లలిత మంచిపిల్ల, కాని కొంచెం పెంకి స్వభావం, బాలచాపల్యం తగ్గలేదు. దీంతో ప్రతి చిన్న విషయానికి కోప్పడటం, తాను అనుకున్నదే జరగాలనుకోవడం, వంటి మొండితనం భర్తకు విసుగు తెప్పిస్తుంటుంది. భార్య ప్రవర్తన అతడికి బాధను కలిగిస్తుంటుంది. ఈ క్రమంలో పార్వతమ్మ పాత్ర లలితలో మార్పు కోసం ప్రయత్నిస్తుంది. ఈమె లలితకు స్వయనా అమ్మమ్మ. తన జీవితంలో జరిగిన యదార్థ సంఘటనను మనవరాలికి తెల్పి, ఆమె సంసారాన్ని చక్కదిద్దాలనుకునే తాపత్రయం ఈ పార్వతమ్మలో మెండుగా కనిపిస్తుంది. ఈవిధంగా ముగ్గురు వ్యక్తుల మధ్య సాగిన కథా విధానంలో నారాయణరావు పాత్ర పూర్తిగా కరుణ రసభరితమై కనిపిస్తుది. లలిత ప్రవర్తనలో భీభత్సం కనిపించినప్పటికీ, చివరక కరుణరసమే పైచేయి అవుతుంది. ఒక అమ్మమ్మ పార్వతమ్మలోనూ కరుణరసమే కన్పిస్తుంది. అటు తన మనవరాలికోసం, ఇటు తన జీవితం కోసం పార్వతమ్మ కరుణరసానికే ప్రాధాన్యత ఇస్తూ కథానియికలా గోచరిస్తుంది. కథా వివరాల్లోకి వెళ్తే... "నేను పెండ్లాడిన భార్యనునే గాని, దాసిని కాను, వివాహమాడుట వల్లనను భర్తకు దాసినగుదునాయేవి?" అంటూ కథ ప్రారంభం అవుతుంది. అప్పుడు అమ్మమ్మ పాత్ర పార్వతమ్మ "లలితా! నీవు వెఱ్ఱిదానవా యేమి? ముసలి దానిని నా మాట నించుక వినుము. నీవిటువంటి మాటలన గూడదు..." అంటూ మనవరాలికి సర్దిచెప్పే ప్రయత్నం చేస్తుంది.

ఇక్కడ కథ చదివిన పాఠకుడు లలిత పాత్రలో విపరీత ధోరణిని తప్పకుండా గ్రహిస్తాడు. కథా ప్రారంభంలో పాఠకుడు పొరబడే అవకాశం వున్నా, కథ మొత్తం చదివాక లలిత సున్నితమైన మనస్తత్వంగా అర్థం అవుతుంది.

కథలో నారాయణరావు నాటకశాలకు వెళ్ళి నాటకం చూడాలనుకుంటాడు. విషయాన్ని స్నేహితులతో చర్చించి సతీసమేతంగా నాటకశాలకు రమ్మంటాడు. విషయాన్ని భార్యకు చెప్పి ఆమెలో ఆనందాన్ని చూడాలనుకుంటాడు. తీరా ఇంటికి వెళ్ళి విషయాన్ని చెప్పిన నారాయణావుకు నిరాశ ఎదురౌతుంది. బాధ, ఆవేదన, కోపం... ఇవన్నీ చుట్టుముట్టి వేధిస్తాయి. ఎందుకంటే లలితలో ఆనందాన్ని చూడాలని వచ్చిన నారాయణరావుకు "మరొక్కరే చూడబొండు టిక్కట్లు కొననప్పుడు నన్నడిగితిరా! నేడు నేను వచ్చుటకు వీలులేదు. వేరొక స్థలమునకు బోవలయును" అన్న భార్య మాటలు మనస్తాపం కలిగిస్తాయి. ఇద్దరి మధ్య కాసేపు వాదన జరుగుతుంది. లలిత నాటకశాలకు వెళ్ళకపోవడానికి పెద్ద కారణాలు ఏమి కనబడవు. ఆమె పొగరే ఒక కారణంగా కనిపిస్తుంది. దీంతో అతడొక్కడే నాటకశాలకు వెళ్తాడు. అందరు సతీసమేతంగా వస్తారు. తానొక్కడే ఒంటరిగా కూర్చుని నాటకాన్ని చూడలేకపోతాడు. అన్యమనస్కుడిగా వుంటాడు. అతడి వ్యక్తిగత వివరాల్లోకి వెళ్తే అతడొక పెద్ద ఉద్యోగి. నెలకు 100 రుపాలయ జీతం

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

అంటే ఇప్పటి లెక్కల ప్రకారం లక్ష రూపాయల జీతం. అదనపు సంసాదన కూడా వుంటుంది. ఇంట్లో వంట మనుషులు వుంటారు. దేనికి కొదవలేదు. అయిన లలిత అన్ని వుండి అల్లుడినోట్లో శని వున్న చందాన ప్రవర్తిస్తుంటే నారాయణరావు తట్టుకోలేకపోతాడు. భార్యలో మార్పు కోసం, తన జీవితంలో ఆనందం కోసం తాపత్రయపడు తాడు.

లలిత మాత్రం ఇవేమీ ఆలోచించదు. మితిమీరిన భావజాలంతో భర్తను పూచికపుల్లలా తీసివేస్తుంది. ఆ రోజు నారాయణరావు నాటకానికి వెళ్తే, లలిత అమ్మమ్మ వద్దకు వచ్చి “నేను దాసిని కాను” మాటలతో విసుగు తెప్పిస్తుంది. అప్పుడు అమ్మమ్మ పార్వతమ్మ లలితలో తప్పును గ్రహి స్తుంది. వారిద్దరి సంసారం ఏపొరపాటు జరిగినా ఆ తప్పంతా మనవరాలిదేనని భావిస్తుంది. ఇదే విషయాన్ని “మొదటి యపరాధము నీదేయని... అంటూ గుర్తు చేస్తుంది కూడా అంతేకాదు మనవరాలిలో సంపూర్ణమైన మనసు వున్నదని, ఆ మనసుని మేల్కొలిపే ప్రయత్నంగా తన జీవితంలో జరిగిన యధార్థ సంఘటనను ఉదాహ రణగా వివరిస్తుంది. ఈ కథలోకి భార్యభర్తలు సుఖంగా సఖ్యతగా వుండాలి. ఒకర్ని ఒకరు అర్థం చేసుకోవాలి. తప్పొప్పుల్ని క్షమించుకోవాలి. ఎక్కువ తక్కువ అనే మన స్తత్వం వుండకూడదు. ఇట్లా వుండకపోతే ఆ సంసారానికి అర్థంలేదు. ఈ క్రమంలో ఒక భర్త ఒక భార్య తరుచు గొడవలు పడటం వల్ల, ఆ భర్త భార్యను వదిలి దేశాం తరము వెళ్ళిపోతాడు. జీవితంలో వాళ్ళు ఇంక మళ్ళీ కలుసుకోలేకపోతారు. భర్త బతికి వున్నడో లేదో తెలియని పరిస్థితిలో ఆ భార్య వృద్ధురాలైపోతుంది. ఆ చివరి దశలో తోడులేకుండా ఒంటరిగా ఆ భార్య నరకయాతన అనుభ విస్తుంది. ఆ భార్య ఎవ్వరోకాదు నేనే...” అంటూ అమ్మమ్మ పార్వతమ్మ తనదైన కథను మనవారాలు లలితకు చెప్తుంది. అంతే! ఆ కథ విని లలిత భయపడుతుంది.

తన భర్తను కూడా తను గొడవపడి బాధపెడుతున్నది కాబట్టి, అతడు కూడా అలా వెళ్ళిపోతాడో ఏమోనని కంగారుపడుతుంది. అది గమనించిన అమ్మమ్మ మీది “ప్రథమ కలహం కాబట్టి నీ భర్త ఎక్కడికీ వెళ్ళడు...” అని ధైర్యం చెప్తుంది. అయినప్పటికీ లలితలో భయం తొలగదు. భయపడుతునే ఇంటికి వస్తుంది. భర్తకోసం ఎదురుచూస్తుంది. నాటకశాల నుండి ప్రేక్షకులు అందరూ బయటకు వెళ్ళిపోతారు. అదే క్రమంలో నారాయణరావు కూడా బయటకు వస్తాడు. కాని అతడి దారి గోదావరి తీరంవైపు నడుస్తుంది. ఇంటివద్ద మనసు నిండా పాశ్చాత్తా పాన్ని నింపుకుని భర్త కోసం ఎదురుచూస్తున్న లలితలో కరుణరసం అమాంతంగా పొంగిపొర్లుతూ కనిపిస్తుంది.

అక్కడ గోదావరి తీరాన కూర్చుని భార్య గురించి ఆలోచిస్తున్న నారాయణరావులోనూ కరుణరసమే ఉప్పొంగి కనిపిస్తుంది. ఆమెకు నేను! ఏమి తక్కువ చేసాను? ఆమె ఎందుకు అలా ప్రవర్తిస్తున్నది? ఆమెలో మార్పురాదా? నా స్నేహితుల ముందు ఈరోజు నా పరువు పోయింది కదా! అందరూ సతీసమేతంగా వస్తే నేను ఒంటినైపోయాను అని బాధపడుతున్న అతడిలో చెప్పా లంటే కరుణరసం సముద్రాలుగా పొంగిపొర్లుతున్నది.

అమ్మమ్మ జీవిత కథలో ఒక్కసారిగా మారిపోయిన లలిత కూడా కరుణ రసానుభూతిగా క్షణక్షణానికి మారి పోవడం మొదలయ్యింది. అతడు రావడం ఆలస్యం అయ్యేకొద్దీ ఆమెలో భయం హెచ్చుమీరుతుంది. ఆ భయమే కరుణరసమైన ఆమె గుండెను పిండుతుంది. ఈ పరిస్థితుల్లో అతడి గురించి ఎవ్వరైనా సమాచారం తెల్పి వుంటే బాగుణ్ణు అని ఆరాటపడ్తుంది. చివరకు సమయం మించిపోతుంది. ఇక లలిత తట్టుకోలేక పోతుంది. తానే బయటకు వచ్చి భర్త గురించి వెదకాలను కుంటుంది. ఈ సమయంలో ఆమెలో కనిపించిన ఆర్ద్రత, బాధ, దుఃఖం, కఠిన శిలల్ని సైతం కరిగించేలా కని పిస్తుంది. ప్రతి భార్యలోనూ మార్పు తెచ్చేలా గోచరిస్తుంది “భర్త అంటే ఏమిటో” ఎవ్వరూ వివరించకుండానే అర్థమౌతుంది. నారాయణరావు ఏ అఘాయిత్యానికి పాల్పడి వుండవద్దు అనే ఆందోళన చదివే పాఠకుల్లోనూ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

తారాస్థాయికి చేరిపోతుంది. ఈ క్రమంగా పాఠకుడు ఉద్వేగానికి లోనవుతుంటే మన కథానాయిక లలిత దీపం పట్టుకుని నెమ్మదిగా ఇంటి బయటకు వస్తుంది. ఆమె ఇంటి ముందు వున్న పంచపాకలోకి వచ్చిరాగానే అక్కడ ఎవ్వరో పడుకుని వున్నట్లుగా చీకటిలోంచే కనిపెడు తుంది. ఎవ్వరా అని దగ్గరకు వెళ్ళి వెళ్ళగానే భర్తగా అర్థ మౌతుంది. అంతే! అందకటి ఆమె ఆందోళన ఒక్కసారిగా పటాపంచలైపోతుంది. ఎదలోతుల్లోంచి దుఃఖం ముంచుకు వస్తుంది. వెంటనే భర్త పాదాలపై పడ్తుంది. తనని క్షమించమని ఏడుస్తుంది. ఆ స్పర్శకు ఒక్కసారిగా హఠాత్తుగా లేచిన నారాయణరావు భార్య తీరుకు ముందు ఆశ్చర్యపోతాడు. తన కోపాన్ని ఇంట్లోకి రాకుండా అలక లగా ప్రకటించిన నారాయణ అతి తక్కువ కాలంలోనే లలితలో వచ్చిన మార్పుకు ఎంతో సంతోషిస్తాడు. గర్వ పడుతాడు. చివరకు లలితను ఓదారుస్తాడు. ఆ విధంగా వారి కలహాల కాపురం కమనీయమై రమణీయమై విల సిల్లుతుంది.

## ముగింపు :

భార్య భర్తలు ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఒకచోట మూడుముళ్ళ బంధంతో కలిసి ఒక్కటౌతారు. సాధా రణంగా ప్రతి సంసారంలో గొడవలు అనివార్యమే. కాని ఈ గొడవలు చిలికి చిలికి గాలివాన కాకూడదు. తొలకరి జల్లుల్లా కురిసి ఆగిపోవాలి. అప్పుడే ఆ సంసారం నిండు నూరేళ్ళు వర్థిల్లుతుంది అనే సందేశం ఈ కథలో కని పించింది.

ముఖ్యంగా “మార్పు” అనే సంసారంలో ఎంత అవ సరమో లలిత పాత్ర నిరూపించింది. అట్లాగే ఓపిక, ప్రేమ, నమ్మకం, ఆప్యాయత... వంటివి సంసారం నిల బడటంలో ఎంత అవసరమో నారాయణరావు పాత్రలో కనిపించింది.

ఉదాత్తమైన పెద్దరికం, నీతి పుస్తకం వంటి మన స్తత్వం, సర్దిచెప్పే స్వభావం ఇవన్నీ అమ్మమ్మ పాత్ర పార్శ్వ తమ్మలో కనిపించాయి.

## ఆధార గ్రంథాలు :

శతాధిక రచనల సమాహారం, తెలంగాణ రచయిత్రుల కథలు, పేజి నెం.1-7.

❖❖❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# కవిత్రయ భారతం - నవరస రమ్యం

- డా. పి.వి. ఉమాశశి, ప్రాచార్యులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గజ్వేల్, సిద్ధిపేట, తెలంగాణ.

వ్యాస మహాభారతం మహేతిహాసం. కవిత్రయ భారతం రసవన్మహా కావ్యం.

కావ్యానికి జీవం, ఆత్మ రసమే. రసం లేని కావ్యం ప్రాణం లేని జీవి లాంటిది. అందుకే కావ్యానికి ప్రాణ భూతమైన రససృష్టిలో, పోషణలో, నిర్వహణలో అనేక మెళకువలు ప్రదర్శించబడిన కవిత్రయ భారతం సర్వజన హృదయాకర్షకంగా ప్రసిద్ధి చెందింది. నవరస భరితమై అలరారింది.

**"శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః**
**భీభత్సాద్భుత శాంతాశ్చ నవనాట్యే రసాః స్మృతాః**
**రతి ర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా**
**జుగుప్సా విస్మయ శమాః స్థాయి భావాః ప్రకీర్తితాః**

**- నాట్యశాస్త్రం - భరతుడు**

## రౌద్రం :

**"కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్ సూచు చుండన్ మదో**
**ద్ధురుడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోక భీ**
**కర లీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘ ని**
**ర్ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతును గ్రాకృతిన్"**

**- ప.233 - ద్వి.ఆ - సభాపర్వం - నన్నయ**

కురుసభలో పాండవ పట్టమహిషికి పరాభవం, జూదంలో ఓటమి, పాండవులు ఏమీ చెయ్యలేని అసహాయత, పాంచాలిని సభకీడ్చి వస్త్రాపహరణ ప్రయత్నం. ఇవన్నీ కలిసి కుంతీసుత మధ్యముణ్ణి కృద్ధుడిని చేశాయి. కులసతికి జరిగిన అవమానంతో రౌద్రాకారం దాల్చాడు. ద్రౌపదిని సభకీడ్చి, వలువలూడ్చిన దుశ్శాసనుణ్ణి లోక భీకరంగా వధిస్తానని, రొమ్ము చీల్చి రుధిరాన్ని త్రాగుతానని భీకర ప్రతిజ్ఞ చేశాడు. తొడపైన ద్రౌపదిని కూర్చోమని సైగ చేసిన దుర్యోధనుని తొడలు విరగ గొడతానన్నాడు. "భగ్నోరు తరోరు చేసెద ఉగ్ర రణాంతరంబునన్" అని "నాస్వాదింతు నుగ్రాకృతిన్" అన్న భీమసేనుని పలుకుల ద్వారా కోపం స్థాయీ భావంగా నిలిచిన రౌద్రరసాన్ని ఆవిష్కరించాడు ఆదికవి.

**"దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాప స్ఫుర**
**ద్గర్వాంధ్ర ప్రతివీర నిర్మథన విద్యా పారగుల్ మత్పతు**
**ల్గీర్వాణాకృతులేవు రిప్డు నిను దోర్లీలన్ వెసంగిట్టి గం**
**ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా"**

**- ప.55 - ద్వి.ఆ - విరాట పర్వం - తిక్కన**

కామించి వెంటబడ్డ కీచకునికి తన పతుల సామర్థ్యం గురించి చెప్పవలసి వచ్చింది ఆ సాధ్వీమణి ద్రౌపదికి. నెమ్మదిగా, చేస్తున్న పని మంచిది కాదని, వివాహితలను కామించడం మంచిది పద్ధతి కాదని నచ్చచెప్పిన ఆమె మాటలు ఆ కామాంధుడి చెవికెక్కలేదు. ఎంత చెప్పినా వినని కీచకుడి మీద అవధుల్లేని కోపం వచ్చింది. రౌద్రాకారం దాల్చి, అమిత శూరులైన తన భర్తల బాహు బలాధికృతను వివరించింది. కండకావరంతో, కన్ను మిన్ను కానక మిడిసిపడే వారిని సంహరించి, తనను రక్షించగల సమర్థులని హెచ్చరించింది. ప్రళయకాల స్వరూపిణిగా మారి ద్రౌపది పలికిన పలుకులు, కామంతో కళ్ళు మూసుకుపోయిన ఆ కీచకుణ్ణి చలింప చెయ్యలేదేమో కానీ, చదివిన వారికి మాత్రం ఆ రౌద్ర స్వరూపం కళ్ళముందు నిలిచి, సమీప భవిష్యత్తులో ఆ నీచుడికి చావు తప్పదన్న విషయాన్ని స్పష్టం చేస్తాయి. నాయక చిత్రణలోనే కాక, నాయికా చిత్రణలో కూడా రౌద్రరసాన్ని ప్రయోగించి రంజింప చెయ్యడం సందర్భోచితం మాత్రమే కాదు, సహృదయ రంజకం కూడా.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

భయానకం :

"దైన్యంబు తలపోత దలకొన్న చెలువ కా
నసమున వెల్ల దనంబు గదిరె
భయరస వేగంబు పైకొని ముట్టినం
గాంతకు తనులత కంపమడరె
బెగడంత కంతకు మిగిలిన నింతికిం
బదముల నట దొట్రు పాటు బెరసె
దల్ల డం బొందినం దన్వికి నవయవం
బులనెల్ల ఘర్మాంబు కళిక లెసగెం
దలకు పుట్టెం గొంకు గొలదికి మీఱవె
న్పాటు దోచెముట్టు పాటు దొడరె
వెఱగు పాటు దనికె నెఱనాడె నొవ్వు నె
వ్వ గలువగల నీనె దిగులు వొదివె"

- ప.106 - ద్వి.ఆ - విరాటపర్వం - తిక్కన

కీచకుడు ద్రౌపదీ వేషంలో ఉన్న సైరంధ్రిని మోహించాడు. అక్క సుదేష్ణ ద్వారా ఆమెను మదిర నెపంతో తన మందిరానికి రప్పించే ప్రయత్నం చేశాడు. పాండవుల పట్టమహిషి అయినా పరుల పంచన దాస్యం చెయ్యడం వల్ల ఆ దురవస్థ తప్పలేదు. కీచకుని మందిరంలోకి అడుగుపెట్టే ఆ సాధ్వి భయాన్ని వర్ణించడం ఒక్క తిక్కనకే సాధ్యమేమో! అసలే కీచకుడు దుర్మదాంధుడు. కామాతురుడు. ఆ నీచుని వద్దకు వెళ్ళే ద్రౌపది పరిస్థితి దారుణాతి దారుణం. దీనత్వంతో ముఖం వెల వెల పోయింది. భయంతో మేనంతా చెమటలు పట్టాయి. భయం తీవ్రమై కాళ్ళు తడబడ్డాయి. తొట్రుపాటు కలిగింది. జంకు, దిగులు, భయం ముప్పిరిగొన్నాయి. ఈ అవస్థని దృశ్యాత్మకంగా వర్ణించడంతో పాటు, భయానక రస పోషణతో పాఠకులలో కూడా భయాన్ని కలిగించాడు కవిబ్రహ్మ.

"అని యెలుగెత్తి పల్కు నలినాడు మహోద్ధతిం
ద్రుళ్ళు నార్చుం బె
ల్చన భుజమప్పళించు దమ సైనికులున్ మనవారు
రక్కసుం
డని వెఱగందువారు గళితాయుధులయ్యేడు వారు భీతి
మూ
ర్ఛను బడువారునై రణ విరామముం బొంద
మదోత్కటాకృతిన్"

- ప.217 - తృ.ఆ - కర్ణపర్వం - తిక్కన

భీమసేనుడు దుశ్శాసనుణ్ణి రొమ్ము చీల్చి సంహరిస్తున్నాడు. అప్పుడు ఆ సంఘటన చూసి కౌరవసేన భయభ్రాంతులైన వైనం రసాత్మకంగా వర్ణించబడింది కర్ణపర్వంలో. ద్రౌపదిని సభకీడ్చి, వలువలూడ్చిన దుశ్శాసనుణ్ణి ఏమాత్రం కనికరించ దలచలేదు భీమసేనుడు. తను పూనిన ప్రతిజ్ఞ ప్రకారం రొమ్ము చీల్చిన భీముణ్ణి చూసి కౌరవసేన ఇతడు మనిషా రాక్షసుడా అని నిర్ఘాంతపోయారు. తమనెక్కడ సంహరిస్తాడా అని భయపడ్డారు. కకావికలయ్యారు. ఆయుధాలు విడిచి పారిపోయారు. తట్టుకోలేక మూర్ఛిల్లారు. భయానక రసానికి స్థాయీభావం భయం. భయానక రస వర్ణనని ఒక్క పద్యంలో గుదిగుచ్చి అందించాడు కవిశేఖరుడు తిక్కన.

భీభత్సం :

"వికృతపు చావు సంపమది వేడుక వుట్టిన గిట్టిపట్టి మ
స్తకమును బీన దీర్ఘ భుజశాఖలుం బాద యుగంబు మేనిలో
నికి జొర నుగ్గుగా దుఱిమి నించిన గ్రంతల తిత్తి యైన కీ
చకు ధరణీ స్థలిం జదిపి చక్కని ముద్దగ జేసె తుష్టుడై"

- ప.353 - ద్వి.ఆ - విరాటపర్వం - తిక్కన

కీచక సంహారం నర్తనశాలలో అతి నిగూఢంగా జరపవలసిన కార్యం. పాండవుల ఉనికి బయటపడితే తిరిగి అరణ్య అజ్ఞాత వాసాలు చేయక తప్పని పరిస్థితి. అందుకే భీభత్సంగా, శరీరాన్ని ఎవరూ గుర్తు పట్టలేనంత భయంకరంగా తుద ముట్టించాడు కీచకుణ్ణి భీమసేనుడు. ఆ కీచకుడి తలను, చేతులను, కాళ్ళను శరీరం లోనికి జొనిపి, రంధ్రాలున్న తిత్తిలా తయారు చేశాడు. తిరిగి నేలమీద బాది మాంసపు ముద్దగా చేశాడు. జుగుప్సావహమైన ఈ దృశ్యం తిక్కన చేతిలో విశిష్టంగా మలచబడి, భీభత్స రస ప్రయోగంలో ముఖ్యభూమికగా నిలిచింది.

**"నరసింహుండసురేంద్రు వ్రచ్చు కరణి న్రౌద్రంబుద గ్రంబుగా
నుర మత్యుగ్రతఁ జీరి క్రమ్ము రుధిరమ్ముల్లాసియై దోయిట
న్వెరవారంగొని త్రావు మెచ్చు చవికిన్మేనున్ మొగంబున్ భయం
కర రేఖం బొరయంగ జల్లికొను నక్కౌరవ్యు జూచుంబొరిన్"**

**– ప.214 – తృ.ఆ – కర్ణపర్వం – తిక్కన**

దుశ్శాసనుడు నిండు సభలో చేసిన ద్రౌపదీ వస్త్రాప హరణానికి ప్రతీకారంగా భీమసేనుడు చేసిన వీర విజృంభణం. నరసింహస్వామి హిరణ్యకశిపుని ఛేదించి నట్లుగా భీముడు దుశ్శాసనుడి వక్షాన్ని చీల్చాడు. పైకి ఎగజిమ్మిన రక్తాన్ని దోసిట తీసుకుని తాగినట్లుగా ఆనం దించాడు. ముఖం పైన చల్లుకుంటూ విలయ తాండవం చేశాడు. చూసినవారికి జుగుప్స భావనని కలిగించిన భీముడి ఈ చర్య భీభత్సరస ప్రాప్తికి ఒక చక్కని ఉదా హరణగా నిలుస్తుంది.

## అద్భుతం :

కీచక వధానంతరం వికృతపు చావు చచ్చిన కీచకుని దేహాన్ని చూసి ద్రౌపదిలో కలిగిన ఆశ్చర్యాతిశయమే తిక్కనగారి అద్భుతరస ప్రయోగానికి భూమికగా నిలి చింది.

**"చూచుచు జేరి వ్రేల్మిడుచుచుం దలయూచి విలక్ష చిత్తయై
యా చపలాక్షి ముక్కు పయి నంగుళముం గదియించి దీనికై
కీచక యింత సేసితి సుఖిత్వము బొందుదు గాక యింక న
ట్లేచిన నిట్లుగా కుడుగునే యనుచున్ వెఱగందు
చుండగన్"**

**– ప.356 – ది.ఆ – విరాటపర్వం – తిక్కన**

భార్య కోరిన విధంగా కీచకుణ్ణి చంపాడు భీముడు. ఆ పని చేసిందే తన ఇల్లాలి కోసం. ఆమెకు అది చూపాలి. ఆమెలో కలిగే ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని చూడాలి. అందుకే ద్రౌపదిని తెచ్చి భయంకరంగా తను చంపిన కీచకుడి మృతదేహాన్ని చూపించాడు. ఏమాత్రం ఆనవాలు పట్టలేని విధంగా ఉన్న ఆ మృతదేహాన్ని చూసి ముక్కున వేలేసుకుంది భీమసేనుని పత్ని. ఇంత చక్కని తెలుగు నుడికార ప్రయోగం ఒక్క తిక్కనకే సాధ్యం. నన్నింత బాధించిన దానికి తగిన ఫలితం అనుభవించక తప్పదని, ఇలాంటి చావు చావడానికేనా ఇంత పని చేశాడని ఆశ్చర్య పోయింది. అద్భుతానికి స్థాయీభావం ఆశ్చర్యం. ఈ ఆశ్చర్యం చూడరానిది, చూడలేనిది చూసినప్పుడు కలిగే భావావేశం. ద్రౌపదిలో కలిగిన ఈ విస్మయ భావమే అద్భుతరసంగా పరిణమించింది. పాఠకులను అలరిం చింది.

**"అనుడు దయార్ద్రచిత్తుడగు నప్పరమేశ్వరుడిచ్చె దృష్టి య
జ్జనపతి కద్భుతం బడర సమ్మద పూరము గ్రమ్మ నాతడుం
గనుగొని భక్తిమ్రొక్కి నిను గంటిఁ గృతార్థుడ నైతి నింక నొ
ల్ల నొరుల జూడ లోచనములం బురుషోత్తమ సంహరింపవే"**

**– ప.409 – తృ.ఆ – ఉద్యోగపర్వం – తిక్కన**

శ్రీకృష్ణ రాయబారం మహాభారతంలో రసవద్ఘట్టం. ఎంత చెప్పినా, ఎందరు చెప్పినా వినని దుర్యోధనుడు సంధి కాంక్షించి వచ్చిన వాసుదేవుణ్ణి బంధించ దలిచాడు. అతని అల్పత్వానికి నవ్వుకుని, శ్రీకృష్ణుడు సకల మహ ర్షులు, సర్వ రాజన్యులు కొలువైన సభలో తన విశ్వ రూపాన్ని ప్రదర్శించాడు. నారదాది దివ్య మునీంద్రులకు, భీష్మ ద్రోణ విదుర సంజయలకు దివ్యదృష్టినిచ్చి దర్శన మిచ్చాడు. దేవతలు పుష్పవర్షం కురిపించారు. దేవదుం దుభులు మోగాయి. ఆ సంరంభానికి ఆశ్చర్యపడిన ధృత రాష్ట్రుడు కృష్ణుని ప్రార్థించాడు. పరమాత్ముడు దయార్ద్ర చిత్తుడు. అందుకే ఆ అంధరాజుకు దివ్య చక్షువులను ప్రసాదించాడు. తనకు లభించిన ఆ దివ్యదృష్టితో విశ్వ రూపాన్ని చూసి తరించాడు. ఆశ్చర్య చకితుడైనాడు. ఆనందభరితుడైనాడు ఆ కురురాజు.

విశ్వరూపమే ఒక అద్భుతం. సకల లోకాలను, సమస్త జీవరాశిని తనలో ఇముడ్చుకున్న పరమాత్ముని మహా రూపం. ఒక పుట్టుగుడ్డికి కళ్ళు రావడం, వచ్చిన తన దివ్యదృష్టితో దర్శించడం మరొక అద్భుతం. మళ్ళీ ఈ పాడు లోకాన్ని చూడలేక ఇచ్చిన దృష్టిని ఉపసంహరించ మనడం కూడా అద్భుతమే. ఈ దృశ్యాన్ని ఆశ్చర్య

భరితంగా, అద్భుతంగా, రసపూరితంగా రచించి అందించిన అద్వితీయ ప్రతిభావంతుడు కవిత్రయ ద్వితీయుడు.

మహాభారతం ప్రతి పద్యం సుందరం. నవరస భరితం. కావ్య ప్రయోజనాలైన ఉపదేశ, రసానందాలను సమపాళ్ళలో అందించినవారు కవిత్రయం వారు. ఉపదేశాత్మకంగా మలచి, మానవ జీవిత విధానాన్ని వర్ణిస్తే రసానంద కారకంగా తీర్చి మానవ జీవితాలను ఆనంద భరితం చేశారు. రసజ్ఞులకు, రసాస్వాదకులకు పంచభక్ష్య పరమాన్నాలై, ఇష్ట మృష్టాన్న భోజనం లాంటి సంతృప్తిని అందించాయి కవిత్రయ భారతంలోని నవరసాలు.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# నానారసాభ్యుదయోల్లాసము

- డా. ఎన్. మృదుల, సహాయాచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సాపూర్, మెదక్ జిల్లా, తెలంగాణ.

తిక్కన రామాయణ, మహాభారతాలు రెండూ రస పోషణలో ప్రత్యేకతలను కలిగి ఉంటాయి. అందునా మహాభారతానిది అగ్రస్థానం తిక్కన మహాభారతంలో చేసిన రస ప్రయోగాలను ప్రధానంగా మూడు రకాలుగా గుర్తించవచ్చు.

1. ఏకరస ప్రయోగాలు
2. ద్విరస ప్రయోగాలు
3. బహురస ప్రయోగాలు

## 1. ఏకరస ప్రయోగాలు :

మహాభారతంలో ఏకరస ప్రయోగాలు తక్కువే అయినా ఆ ప్రయోగాలలో తిక్కన విలక్షణతను సాధించాడు. వాటిని పరిశీలించినట్లయితే ప్రముఖంగా ఐదు రకాలు అని భావించవచ్చు.

1.1 శృంగారం	1.2 కరుణం
1.3 రౌద్రం	1.4 వీరం
1.5 బీభత్సం

### 1.1 శృంగారం :

తిక్కన ఎంచుకున్న మహాభారత ఇతివృత్తం శృంగార రసపోషణకు అనుకూలంగా లేకపోయినప్పటికీ, శృంగార భావాల తలపోతలో రసప్రయోగం చేశాడు. 'కెంగేలు గేలితో గీలించి.....యభిమత క్రీడనములకు నలవరింతు' (విరా.II 310). కీచకుని మనసులో రేకెత్తిన శృంగార భావాలను తిక్కన పై పద్యంలో ప్రకటించాడు. ప్రతినాయకుని పరంగా వర్ణించబడిన ఈ శృంగారం ఆభాసగా నిలుస్తుంది.

### 1.2 కరుణం :

తిక్కన కరుణ రసప్రియుడు. కరుణ రసాన్ని విరాట పర్వం మొదట్లోనే తిక్కన ప్రస్తావించాడు. 'కరుణారసము వొంగి తొరగెడు చాడ్పున.......' (విరా.II 12) అని కరుణరస ప్రీతిని వ్యక్తీకరించాడు. మహాభారత యుద్ధానంతరం స్త్రీ పర్వంలో తిక్కన వర్ణించిన కరుణ రసం అన్యులకు సాధ్యం కానిది.

### 1.3 రౌద్రం :

తిక్కన భీముని ప్రస్తావనలో అధికంగా ప్రయోగించే రసం - రౌద్రం. కీచకవధ ఘట్టంలో అత్యంత గుంభనంగా సాగిన మల్లయుద్ధంలో తిక్కన రౌద్రాన్ని అభివర్ణించాడు. 'తిగిచిన నడుగులు దెరలక........ రౌద్రవృత్తినొంచుచొండు రులకు వెక్కసముగ' (విరా.II 347). రౌద్రరస మన: ప్రవృత్తులతో ఒకరికొకరు అసాధ్యులైపోయారని తిక్కన వర్ణించాడు. మల్లయుద్ధకళ పై ఆయనకున్న అవగాహనను పై పద్యం కళ్ళకు కడుతుంది.

### 1.4 వీరం :

మహాభారత ఇతివృత్తం ఆదినుండి అంతం వరకు వీరరసాన్నే ఆశ్రయించుకొని సాగింది. అందుకు భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక పర్వాలు పూర్తి స్థాయి ఉదాహరణలుగా నిలుస్తాయి. 'శల్యునారాచపంచకమున నొప్పించి......నెక్కుడగు గాని యసదుగా డీత డనిరి' (భీష్మ.1.272) యుద్ధరంగంలో అభిమన్యుడు చెలరేగిపోతున్న తీరును పై పద్యం తెలుపుతుంది. ఆయా సందర్భాలలో యుద్ధరంగాన్ని, అడుగడుగునా తన యుద్ధ నైపుణ్యాన్ని వీరరసంతో మేళవించి వర్ణించాడు.

### 1.5 బీభత్సం :

కురుక్షేత్ర సంగ్రామానంతరం గాంధారి చూసిన యుద్ధ భూమి -'ప్రేవులు గండలు పెఱికి వేటాడి...... వృకంబులును మానసము వికలంబుసేయ' (స్త్రీ.II.9)గా ఉన్నది. ఈ దృశ్యం ఒళ్ళు గగుర్పొడిచే బీభత్స ప్రధానమైనది. ఈ సందర్భం కూడా తిక్కనకు యుద్ధభూమితో ఉన్న పరిచయాన్ని తెలుపుతుంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

## 2. ద్విరస ప్రయోగాలు :

ఒకే ఘట్టంలో రెండు రసాలను ప్రయోగించడంలో తిక్కన సిద్ధహస్తుడు. ఈ సందర్భంలో తిక్కన చేసిన విరుద్ధ రస ప్రయోగాలను పరిశీలిస్తే ఆయనలోని రసద్రష్ట మనకు కనిపిస్తాడు అవి -

2.1 శృంగార - భయానక రస సమ్మేళనం
2.2 భయానక - హాస్య రస సమ్మేళనం
2.3 కరుణ - రౌద్రరస సమ్మేళనం
2.4 రౌద్ర - బీభత్స రస సమ్మేళనం
2.5 రౌద్ర - అద్భుతరస సమ్మేళనం
2.6 బీభత్స - అద్భుతరస సమ్మేళనం
2.7 బీభత్స- కరుణ అద్భుత రస సమ్మేళనం.

**2.1 శృంగార - భయానక రస సమ్మేళనం :**

'వెఱవక నను జూచె .......రాగసాగర పూర నిర్మగ్ను డయ్యె' (విరా.II 33) కీచకుడు ఏ మాత్రం జంకు గొంకులు లేకుండా తననే చుస్తున్నాడని ద్రౌపది కలత పడింది. ఈ అపాయం నుండి తప్పించుకోడానికి ఏ ఉపాయము లేకపోవడంతో ఆమెముఖం వెలవెల పోయింది. ఈ విధంగా భయహావభావాలను ప్రదర్శిస్తున్న ద్రౌపదిని నీచుడూ, వివేకహీనుడూ అయిన కీచకుడు చూచి ఆమె ప్రకటిస్తున్న శృంగారచేష్టలని భావించి లోలోన మురిసిపోతూ క్రమంగా వలపుమున్నీట మునిగిపోయాడు. అన్నది పై పద్యభావం. తిక్కన, భయసాత్త్విక భావాలను రతికనుకూలంగా భావించిన కీచకుని స్థితిని తిక్కన వర్ణించి, రస ప్రస్థానంలో నూతనత్వాన్ని సాధించాడు. ఇటువంటి శృంగార-భయానక రస సమ్మేళనాలకు మరి కొన్ని ఉదాహరణలుగా విరా. II 37, 45, 47 పద్యాలను కూడా మనం గుర్తించవచ్చు.

**2.2 భయానక - హాస్య రస సమ్మేళనం :**

భయాన్ని హాస్యాన్ని మేళవించి రచించిన తీరు ఉప కీచకుల వధ వృత్తాంతంలో కనిపిస్తుంది. 'మన కీచకుల కెల్ల మారియై పుట్టిన....పురజనంబులు తలంకి' (వి III 37). విరాట మహారాజు పట్టణంలోని ప్రజలు, సైరంధ్రిని చూచి పొందిన అదురు పాటును పై పద్యంలో వర్ణిం చాడు. నిజానికి ప్రజల పక్షాన అవి భయ భావ వ్యంజ కాలు. కాని, ద్రౌపది అంత భయపడవలసిన వ్యక్తి కాదని, పఠిత హృదయం చెప్పడంతో వారి చేష్టలన్నీ వికృతులుగా అనిపించి హాస్యాన్ని కలిగిస్తాయి.

**2.3 కరుణ - రౌద్రరస సమ్మేళనం :**

గాంధారి, తన పుత్రులందరూ యుద్ధంలో మరిణిం చడంతో దీనికంతకటికీ కారణం శ్రీ కృష్ణుడేనని భావించి, శపించటానికి, పూనుకున్నది. 'పూని పాతివ్రత్య పుణ్య ఫలంబున ..... మీ వధూజనములు నేడ్చువారు పతుల సుతులను బంధుల బనవిపనవి' (స్త్రీ.II.161). యాదవ కాంతలు భర్తలను, కొడుకులను, బంధువులను పేరు పేరునా తలచుకొని కుమిలికుమిలి ఏడుస్తారు పొమ్ము - అని శపించింది. కరుణ రస పోషణ తద్వారా గాంధారి వాగ్రూపంలో చూసిన రౌద్రానికి పై పద్యం ఒక ఉదా హరణ మాత్రమే.

**2.4 రౌద్ర - బీభత్స రస సమ్మేళనం :**

రౌద్రం అనంతరం బీభత్సం అత్యంత సహజంగా ఏర్పడే రసం. ఈ రెండు రసాలు తిక్కనకు బాగా పరిచయ మైనవే. వీటి మేళవింపు తో ఆయన రచించిన పద్యాలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు 'కాలువలై పాఱు కీలాల జలముల దేలి పోయెడు మృతదేహములును...... అమ్మ హెూద్భటసంకులమున' (ద్రోణ. I. 386) సంజయుడు ధృతరాష్ట్రమహరాజుతో యుద్ధరంగాన్ని వర్ణిస్తూ, రౌద్ర బీభత్సారసాల నాట్య రంగం లాగా కనిపించిందని అంటాడు. ద్రోణుడు రౌద్రం చూపిస్తే, అర్జునుడు భీభత్సాన్ని ప్రదర్శించాడు. అందుకే తిక్కన, చాలా సందర్భాలలో అర్జునుడిని వివ్వచ్చుడు అనే ప్రస్తావిస్తాడు.

**2.5 రౌద్ర - అద్భుతరస సమ్మేళనం :**

కర్ణ ఘటోత్కచుల 'యుద్ధంలో మాయా ముఖంబున .......మొక్కుడై త్రుంచెనతని విల్లక్కజముగ' (ద్రోణ. V. 208) - ఘటోత్కచుడు మాయతో పెద్ద నోరు సృష్టించి కర్ణుడు వేసిన బాణాలన్నింటినీ మ్రింగేశాడు. తిక్కన ఈ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

పద్యంలో కర్ణుని పరంగా రౌద్రాన్ని ఘటోత్కచుని పరంగా అద్భుతాన్ని అద్భుతంగా మేళవించాడు.

**2.6 బీభత్స - అద్భుతరస సమ్మేళనం :**

సతీదేవి ఇతివృత్తంలో బీభత్సాద్భుత ఘట్టాలను తిక్కన చక్కగా వర్ణించాడు. 'దేవి చిత్తమెఱింగి దేవుండు ప్రమథసం... సప్త తంతు దాహియగుచు ధరణినాథ!' (శాంతి V. 439). భీష్ముడు ధర్మరాజుకు జ్వరం యొక్క ఇతివృత్తాన్ని తెలియజేసే సందర్భంలో తిక్కన ఈ రెండు రసాల మేళవించాడు. అంతటి బీభత్సంలో ఒక ఆకృతి జన్మించడం అద్భుత కార్యం.

**2.7 బీభత్స- కరుణ అద్భుత రస సమ్మేళనం :**

సంజయుడు ధృతరాష్ట్రుని మందిరానికి వచ్చి, 'జననాథ! శల్యుండు సమసె సౌబలుడు గీటడిగె......రెండు దొడలును విఱిగి ధరిత్రి బెలుచ గూలి రూపఱి రారాజు ధూళిబ్రుంగై' (శల్య I.9). ఈ పద్యం బీభత్సవంతమైన రాజుల మరణం కరుణరసపూరితమైన ధుర్యోధనుని స్థితిని తెలియచేస్తుంది. ఈ రెండింటిని తిక్కన ఒకే పద్యంలో నిబిడీకృతం చేశాడు.

## 3. బహురస ప్రయోగాలు :

తిక్కన అనేక రసాలను ఒకే పద్యంలో చొప్పించి ఆనందం పొందగలిగినవాడు. ఇది ఆయనలోని రస పిపాసను తెలియ చేస్తుంది. ఉదాహరణకు - అర్జునుడు సైంధవుని తలను నడిపించిన విధానాన్ని సంజయుడు ధృతరాష్ట్రునికి తెలియచేసే సందర్భంలో తిక్కన 'సైంధవు ఘోర కబంధంబు దలయిల.....ఉల్లసిల్లిరతని యోధులెల్ల' (ద్రోణ IV 333). ఈ పద్యంలో తిక్కన బీభత్స, అద్భుత, కరుణ, ఆహ్లాద, రౌద్ర రస భావాలను అలవోకగా మేళ వించాడు. ఒకే విషయం, ఒకే సమయంలో భిన్న వ్యక్తు లకు కలిగే భిన్న రస భావాలను పటితకు అందించాడు. ఈ 'రసనా' చమత్కృతితో పాత్రల వ్యక్తిత్వాన్ని మన కళ్ళ ముందుంచాడు.

ఈ విధంగా 'హృదయాహ్లాది... నానారసాభ్యుద యోల్లాసి విరాటపర్వమట యుద్యోగాదులుం గూడగా.... తుదిముట్టన్ రచియింపుటొప్పు బుధ సంతోషంబు నిండా రగన్' (విరా.I. 7). మహాభారతాన్ని రచించాడు. రస పోషణతో హృదయక్షాళన చేసి పఠితకు కావ్య పరమార్థాన్ని అందించాడు. అందుకే మహాకవిగా నిలిచిపోయాడు.

## ఉపయుక్త గ్రంథ సూచి :

1. తిక్కనసోమయాజి. ఆంధ్ర మహాభారతము, విరాట పర్వము మొదలు, స్వర్గారోహణ పర్వం వరకు. 2011. ప్రధాన సంపాదకుడు సుబ్రహ్మణ్యం, జి.వి. 4-15 వరకు సంపుటాలు. తిరుపతి - తిరుమల తిరుపతి దేవస్థానములు.
2. తిక్కనసోమయాజి. నిర్వచనోత్తర రామాయణం. 1968. పరిష్కర్త. మాధవ శర్మ, పాటిబండ. హైదరాబాద్. ఆం.ప్ర. సాహిత్య అకాడమి ముద్రణ.
3. సూర్యనారాయణ శాస్త్రి, సన్నిధానం. 1987. అనువాదకుడు. కావ్యాలంకార సంగ్రహం.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# రంగనాథ రామాయణం, మొల్ల రామాయణాలలో నవరసాల పరిశీలన

– శిష్ట్లనూరి చంద్రశేఖర శర్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

శ్రీమద్రామాయణం విశ్వపూజ్యము ధర్మ మార్గ మూలము, ధర్మచరితుడు దాశరథి జీవితమనంగా లోక ప్రఖ్యాతము. రామాయణం ఆదికావ్యం. ఆదిపురుషుని జీవన కథా కావ్యం. పంచాక్షర, అష్టాక్షర మంత్ర ఫలము రామనామం. పరమశివుడు నిరంతరం జపించే తారక మంత్రం రామనామం. హనుమఎదలో శాశ్వతంగా కొలువు తీరిన సీతారాముల గాధ రామయణం. రాముని ధర్మ మార్గంలో వెన్నటి నడిపించిన సీతాకథే రామాయణం. వాల్మీకి ఈ ఆది కావ్యానికి సీతాయాశ్చరితం మహత్ అని నామకరణం చేశాడు.

సీత యంటే వ్యవసాయపద అర్థం లో నాగలి. అలాగే నిఘంటు అర్థం క్షమ. యాదేవి సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా అన్నమాట. జగన్నాయకి రామగేహి సీతాదేవికి వర్తిస్తుంది. రాముని ఉపాసనీ దేవత సీత రాముడు సాధకుడు. సహస్రారంలో ఉన్న (షట్చక్రాలలో) సీతాదేవిని మూలాధారం నుండి హనుమవెతికి స్వామితో కలిపాడు. రాముడు యుగ పురుషుడు యాగ ఫలజన్ముడు. అందుకే అన్నమయ్య శరణు వేడెదయజ్ఞ సంభవరామ అనినుతించాడు. " శరణం నీవే రఘురామ పావన నామ గుణ ధామ" అని విభీషణ హనుమదాదులు రాముని ప్రస్తుతించారు. " శ్రీరామనామం మరువాం మరువాం" శ్రీ రామ పాదం విడువాం విడువాం" అని జానపదులు రామ భజనల్లో తరించారు. ఉండేది రాముడొకడె అని త్యాగయ్య కీర్తించి ధన్యుడయ్యాడు.

"సంసార జలధి దాటించగలదీ రెండక్షరముల నామమే జై శ్రీ రామచంద్రుని నామమే" అని ఇరవయ్యో శతాబ్దంలో కవులు నుతించారు. రామాయణం తెలుగు సాహిత్యంలో కవిత్రయ భారతంలో సరస్వతీ నదిలా కన్పిస్తూనే ఉంది. కావ్య పురాణ యుగం నుండీ నేటి ఆధునిక యుగం వరకూ రామయణం కథా గానంగా అనేక ప్రక్రియల్లో శాశ్వత్వంగా నిలబడింది. నిలబడుతోంది, నిలబడుతూనే ఉంటుంది. అందుకే పునాతిభువన త్రయం అని శ్లాఘించబడింది.

అలాంటి రామకథ రామాయణం రంగనాథుని పేర రంగనాథరామాయణంగానూ తరువాతి కాలంలో కవయిత్రి మొల్ల చేతిలో మొల్ల రామాయణంగా ప్రఖ్యాతమైంది. తెలంగాణ తొలి తెలుగు ద్విపద ప్రక్రియా కావ్యంగా రంగనాథ రామాయణం ప్రఖ్యాతమైతే, తొలి తెలుగు కవయిత్రిగా మొల్ల వ్రాసిన మొల్ల రామాయణం రామభక్తి సంప్రదాయంలో విశ్వాన్ని ఓలలాడించింది.

అటువంటి అనర్ఘరత్నాలైన రంగనాథ రామాయణం, మొల్ల రామాయణములలో ప్రాచీన సాహిత్యంలో నవరసాలు అనే శీర్షికన పై రెండు రామాయణాలలో యిరువురు తీర్చిదిద్దిన నవరసములను తులనాత్మక పరిశోధనలో భాగంగా ఈ సదస్సు పత్రాన్ని నిర్మాణం చేయడం జరిగింది. రంగానాథ రామాయణం తెలుగు సాహిత్య క్షేత్రంలో వెలసిన దేశిచ్ఛంద సాహిత్య ప్రథమ ద్విపద రామయణం క్రీ.శ 1280 ప్రాంతంలో ఈ రచన జరిగినట్లు కట్టా వరదరాజు రామాయణం పీఠికలో నిడదవోలు వెంకటరావు గారు నిర్ధారించారు.

ఇక భాస్కర రామాయణం రచన తదుపరి చంపూ కావ్య పద్ధతిలో ఆవిష్కృతమైనది మొల్ల రామాయణం మొల్ల తన రామాయణమును శ్రీరామ ప్రేరణచే రచించినట్లు చెప్పుకుంది. ఇక రంగనాథ రామాయణం

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

కర్త విషయంలో ఉన్న వాదోపవాదాలు విస్మరించి లోనారసిచూసినట్లైతే ఈ కావ్యము బుద్దారెడ్డి చేతిలో రసరమ్యంగా నిర్మితమైనది అన్నది లోకంలో వ్యాప్తమైన విషయం. అలాగే కవయిత్రి మొల్ల వ్రాసిన రామాయణం నవరస బంధురమై రస సముచితముగా తీర్చిదిద్దబడినది అనే విషయంలో ఏ మాత్రం సందేహ పడనక్కరలేదనేది పెద్దల మాట. ఇక వీరిరువురి రామకథా కావ్యాలలో నవ రసములను పోషించినవైనాలను సోదాహరణంగా తెలియ జేసే ముందు రస పరిచయానికి సంబంధించినంత వివ రణ ఇక్కడ తెలియజేయడం జరుగుతుంది.

లాక్షణికులు తమ లక్షణ గ్రంథాలలో కావ్యపరముగా తెలియచేసిన విషయాలప్రోదిలో రసం ప్రధానమైనదిగా తెలియజేశారు. విశ్వనాదుని సాహిత్య దర్పణం లో వాక్యం రసాత్మకం కావ్యం అని తెలియజేశాడు. వేదాలలో రస శబ్దము సోమపానము, జలము, సారము, అనే అర్థాలలో పేర్కొనబడింది. ఉపనిషత్తులు రస శబ్దాన్ని ఆనందము, సారము అనే అర్థాలలో తెలియజేశాయి. అయితే ఒక ప్రత్యేకార్థంలో చెప్పవలసివస్తే జగత్తునకుసారభూతమైన ఆనందమే రస పదానికి సరైన అర్థంగా నిర్ధారించవచ్చును.

జలము పూలకండములచే ఆస్వాదనీయములైనట్లే విభావాదులచే వికసింపబడిన స్థాయిభావా విశేషమే రసమనవచ్చును. ఇక రస సంఖ్యను తొమ్మిదని ఎని మిదని పలు విధములుగా తెలియచేశారు. అయితే రస ములు తొమ్మిదని భావించిన వారు అధికంగా ఉన్న కారణంగా లోకంలో నవరసాలను పేరు వ్యాప్తిలోకి వచ్చింది. నవ రసములు శృంగార, హాస్య, వీర, కరుణ, భీభత్స, భయానక, రౌద్ర, అద్భుత, శాంతములు అని విఖ్యాతకంగా ఈ నవరసములకు రతి, హాస్య, ఉత్సాహ, శోక, జుగుప్స, భయంతో, రోష, విస్మయ, శమములు 8 స్థాయిభావములుగా చెప్పబడినవి. స్థాయి భావము లను కావ్యాలంకార సంగ్రహ కర్త భట్టుమూర్తి తన గ్రంథం తృతీయా శ్వాసంలో ఈ విధంగా తెలిపాడు.

"నదులెన్ని కలిసినను కప్పుకొనుచూ గాంభీర్యము విడనాడని జలధివోలె సంచారి భావాదులెన్నికలిసిననూ స్థిరముగా వుండే భావవిశేషమే స్థాయిభావము" అంటాడు. ఇక రసోత్పత్తికి సహాయకారులుగా అనుభావ, విభావ, భావ గతములుగా దోహదపడునని భట్టుమూర్తి తెలియ జేశాడు. అనుభవములు చేష్టాగతములు రసోదయానికి తోడ్పడేవి సంచారి భావములు వీటి వల్లనే రసము కావ్య ములో ఆనందం కల్గిస్తుంది. అందువల్లనే కావ్యమునకు రసమే ఆనందమని లాక్షణికులు స్థిరపరిచారు.

ప్రధానంగానే కావ్యాలలో నవరసాల్లో ఏదైనా ఒకటి ప్రధానరసంగా ఉండి మిగిలినవి అంగి రసాలుగా లేదా అనుషంగీకాలుగా ఉంటాయి. పైన పేర్కొన్నరస విషయ ప్రకటిత భావములాధారంగా రంగనాథ, మొల్ల రామా యణాలలో నవరసములను ఆ యిరువురి రామాయణ కావ్య కాండల ఆధారంగా తులనాత్మకంగా విశ్లేషించే ప్రయత్నం జరుగుతుంది.

రంగనాథ రామాయణంలో శృంగార రసమునకు పరా కాష్టయన తగినదిగా కవి మేనక, విశ్వామిత్రుల శృంగా రమును తెలియజేశాడు. ఇది మేనక అంగాంగ వర్ణనం కొంత అతిశయంగా తెలిపినా ఆమె దేవ వేశ్య అయి నందున వుచితంగానే అన్పిస్తుంది. ఉదా

**లలిత మావనకళాలావణ్యా గణ్య**
**జలకాళిదేల నాసతిజారుకొప్పు**
**పదేయేండ్లు మదిసోలి భావజుకాళి**
**సదమదంబుగ సౌఖ్య సరసినిదేలి**

( రంగనాథ రామాయణం, బాలకాండ, 1770 ద్విపద పుట : 59)

పై ద్విపదలో కవి విశ్వామిత్రుడు చూసిన దేవాంగన మేనకను చూసిన సందర్భంలో ఆమె అంగాంగ వర్ణన చేశాడు కవి. మేనక దేవవేశ్య అయిన కారణంగా ఉద్దీ పన సామాగ్రికి కవి ప్రాధాన్య మీయడం జరిగింది. మేనక విశ్వామిత్రులలో గల స్థాయి భావం రతి, ఉద్దీపనలచే

శృంగార రసం ఫలవంతం చేశాడు. అయితే ఈ శృంగారం చపల నిదర్శనంగానే కన్పిస్తుంది కాని ఇందులో ఉదాత్తత కన్పించదు. ఇక మొల్ల రామాయణంలో సుందరా కాండములో రావణుడు మదనప పీడితుడై సీతను ప్రార్థించే ఘట్టంలో శ ృంగార రసము ప్రతి నాయకుని పరంగా మొల్ల తెలిపింది. లయ గ్రాహి వృత్తం.

**తోయ జదళాక్షి....**
**నా యెడ గ ృపారసము సేయు**
**కవి వేకమున నీ యెడల**
**నుండుటి దిన్యాయమే లతాంగి "**

(మొల్ల రామాయణం ఎమ్మెస్కో ప్రచురణ 1990, పుట : 71)

పై లయ గ్రాహి వృత్తంలో మొల్ల ప్రతినాయకుడైన రావణుని మన్మధావస్థను శృంగార భావనలకు సంకేతాలతో తెలిపింది.

## వీరరసం :

వీర రసానికి స్థాయిబావము ఉత్సాహం. అద్భుతాన్ని వీరరసంలో అంతర్భాగంగా విశ్వనాధుడు తెలియజేశాడు. లోకోత్తర సాహసకార్యం వీరంగా నరసభూపాలీయకర్త భట్టుమూర్తి ప్రతిపాదించాడు. రంగనాథ రామాయణకర్త కరుణను అంగిరసంగా ప్రకటిస్తూ దీనికి వీరాన్ని అంగి రసంగా తెలిపాడు. రామరావణుల యుద్ధం వీరరసానికి పరాకాష్ట రామాయణంలో పై యిద్దరూ వీర, ప్రతివీరులు వీరిరువురి మధ్య యుద్ధం రెండు పర్యాయాలు నడిచింది. యుద్ధం ప్రథమ పర్యాయంలో ఇరువురిలోనూ ఉత్సాహం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. దీనికి ఉదాహరణ

**దేవుండు కోపంబు దీహింపజేర్చి**
**భీకకర గుణరవ స్పీతుడైవేగ**
**వాకారి కెదురుగా నడచి "**

( రంగనాథ రామాయణం, యుద్ధ కాండ, పుట : 336)

పై ద్విపద లో కవి రాముడు కోపంతో వూగిపోతూ విజృంభించి వేగంగా వైరికి ఎదురు నడుస్తున్న సమయంలో రాముని నడకలోని వీరోత్సాహాలు స్ఫుటంగా దృశ్యమానంచేశాడు కవి.

పై సందర్భంలో రాముడు రావణుని పై అర్ధచంద్ర బాణంతో  పంచశరములతో రావణుని నొప్పించుట బల్లంతో రావణు విల్లు విరవడం అన్నీ కూడా సమరోత్సాహ సూచితలుగా కన్పిస్తాయి. అయితే ఈ ప్రథమ యుద్ధంలో రావణుడు కేవలం నిశ్చేష్టుడవ్వడం మాత్రమే కవి తెలిపాడు. పై సంఘటనలో ప్రతిపాదితమైన వీరానికి ఉత్సాహం స్థాయిగా చెప్పడం వల్ల రెండవసారి రామ రావణుల మధ్య యుద్ధంలో ఆవశ్యకమైంది. మొల్ల రామాయణంలో కిష్కింద కాండములోని సంహార ఘట్టంలో

**"సాలముపొంత నిల్చి...**
**మ్రుండవందన శఈల సురాళి మెచ్చగన్ "**

(కిష్కింద కాండము, 14 వపద్యం, పుట : 58)

పై పద్యంలో రాముడు విల్లు నిటారునిల్పి బాణము సంధించినవైనాన్ని మొల్ల దృశ్యమయం చేసింది. ఈ పద్యంలో అక్షరరమ్యతలో నన్నయను, దృశ్యమయం చేయడంలో తిక్కన్న ను మొల్ల అనుసరించింది.

ఈ పద్యం చదువుతున్నప్పుడు విశ్వనాథ వారు తన రామాయణ కల్పవృక్షం బాలకాండ శివధనుర్భంగ ఘట్టంలో రాముడు విల్లువిరిచిన వైనాన్ని తలపునకు తెస్తుంది. అలాగే రాముని వీరరసావతార మూర్తిగా వాలిని వధించే సందర్భంలో హావభావాలను మొల్ల అక్షరరమ్యత లో భాగంగా దర్శంపచేస్తుంది. అలాగే రాముని ఆ వీరోచిత వైనాన్ని కళ్ళెదుట దర్శింపచేసే నేపథ్యంలో తిక్కన నాటకీయతను అనుసరించి దృశ్య దర్శనం చేస్తుంది.

ఇక కరుణ రసం గురించి చెప్పాలంటే రసేషు కరుణో రసః అన్నది లోకనానుడి. దీని అర్థం పరికిస్తే రసము లన్నింటిలో కరుణమే ప్రముఖరసము భవభూతి కరుణ రసాన్ని ప్రకృతిగా సంభావించాడు. మిగిలిన రసాలను

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

వికృతాలుగా అభిప్రాయపడ్డాడు. భవభూతి ఉత్తర రామచరిత్రలో కరుణ రసాన్ని ఈ విధంగా నిర్వచించాడు.

**ఏకోరసః కరుణ ఏవ నిమిత్త భేదా ద్భిన్నః**
**ప్రథక్ప్ ృథగిరా శ్రయతే వివర్తాన్**
**ఆవర్త బుద్బుత తరంగా యాయాన్ వి**
**రాన అంభో యదా సలీల మేవహితత్స మస్తమ్"**

(ఉత్తర రామచరిత్ర భవభూతి, పుట : 28)

సముద్రం సుడులతో, బుడగలతో అలలతో వికారం ధరించినట్లు కరుణరసం శృంగార, హాస్య, వీరాదిరస మములను భరించుచున్నదని అని పై శ్లోకార్థం. ఈ కరుణ రసానికి స్థాయి భావము శోకము. దశరధుడు ముని కుమారుని చంపిన ఘట్టంలో (శర సందానం చేసిన సందర్భం ఆ మునికుమారుని ఆర్తనాదములు

**"క్రమమెప్పునడవులగంధమూలములు**
**......................................**
**మింకేమని పలవింతు విధిక"**

(రంగనాథ రామాయణం అయోధ్య కాండం, పుట: 120)

పై ద్విపదలో ముని కుమారుడు తాను మరణించు చున్నాననే బీధవాడి సకాలమునకు తనచెంతకు రాని తన తల్లితండ్రులు (అంధులు) పడె బాధను కవి కరుణ ప్లావం చేస్తాడు. ముని కుమారుని శోకం కరుణకు మూలమైనది.

ఇక మొల్ల రామాయణంలో కిష్కింద కాండలో వర్షావేళ శ్రీ రాముని సీతా వియోగ పరితాపం తెలిపె సీస పద్యం చదివిన వారికి సైతం హృదయం ద్రవింప చేస్తుంది.

**పలువురు నీ హస్త పల్లవంబుచేత**
**....................................**
**బయలు కౌగలించుబలవరించు**

(కిష్కింద కాండ, 23, పుట : 60)

పై పద్యం వియోగంలో శ్రీరాముని వియోగ భారం (సీతా వియోగభారం) ప్రాకృతిక ప్రవృతి అవస్తలలో తల్ల డిల్లిన వైనాలు వర్ణించింది మొల్ల. ఈ పద్యం లో కరున శ్రీరాముని అవస్థలో ఏర్పడిన శోకం ద్వారా మొల్ల కరుణ రసాన్ని స్రవింప చేసింది.

ఇక అద్భుత రసాన్ని వివరించదలిస్తే ఈ అద్భుత రసానికి స్థాయిభావం విస్మయం ఆలంకారికారికులైన విశ్వ నాధుడు శక్తి భద్రుడు అద్భుతరసాన్ని ప్రకృతిగాను తదితరములు వికృతములుగాను తెలియచేశారు.

రంగనాథ రామాయణంలో శివధనుర్భంగ ఘట్టంలో అద్భుత రసాన్ని కవి పండించాడు.

**"చిరనిద్రసుఖింయించు శేషాహియనగ**
**గాలిమేషములోన గదలనిరుచుల**
**దూలకపొలచు విద్యుదండమనగ**
**నిర్పుమాకారత నిండారియందు"**

(రంగనాథ రామాయణం, బాల కాండ, పుట : 64)

మొల్ల సుందరకాండలో హనుమ విక్రమ విహారాన్ని లంకలో గావించు వైనాన్న యిలా వర్ణించింది.

**మేదిని సమముగా మేడటగావించి**
**కాళీగృహంబుల నేలగలిపి**
**......................................**
**పారిపోయిరి రావణుల పాలకంత**

(మెల్ల రామయణం సుందరకాండము, పుట : 87)

పై పద్యం ఆదిలో మేదిని సమముగా మేడలుగావించి అనే పద ప్రయోగం ఈనాడు వ్యాప్తంలోఉన్న నేలమట్టం చేయు అను పదానికి సమానార్థకంగా కన్పిస్తుంది. పై పద్యంలో కనిపించేదంతా అద్భుతరసమే అందునా ఈ పద ప్రయోగంలో అద్భుతం అన్పిస్తుంది.

హాస్య రసము పరికిస్తే హాస్య రసమునకు స్థాయి భావము హీసము. ఇది చేష్టాగతంగా ఎంతో ఆనందాన్ని స్తుంది. రంగనాథ రామాయణంలో ఋష్య శృంగవృత్తాం తంలో ఋష్య శృంగుడు తనను వంచించి రోమ పాద

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

మహారాజు వద్దకు తీసుకొని వెళ్ళుటకై వచ్చిన వారాంగనలను చూచి ఋషి కుమారులని ఎంచి మాట్లాడిన మాటల్లోనూ, ప్రవర్తనలో రుష్య శృంగని ప్రవర్తనను చేష్టానలో ఋష్యశృంగుని ప్రవర్తనను చేష్టాగత హాస్యంగా బుద్ధారెడ్డి తెలియజేశాడు. ఆ హాస్య పోషణలో ఇలా ఉంది.

**"అతివలమ్ముని యున్న యడవికి బోయి భావించి చెలగి"**

(రంగనాథ రామాయణం, బాల కాండ, పుట : 11 - 12)

పై ద్విపదలో ఋష్యశృంగుడు అంతవరకు స్త్రీలను చూడనందున వారి శరీరావయవమ్ములను తనతో సరి పోల్చుకోనుచూ తనకు తలపై రెండు కొమ్ములున్నట్లు వారి గుండెలపై స్తనములను కొమ్ములుగాభావించి తత్తర పడుచున్నప్పుడు కవి ఋష్యశృంగుని ప్రవర్తన ద్వారా చేష్టాగతి హాస్యము ప్రకటింపచేసినాడు. బుద్ధారెడ్డి మొల్ల తన రామాయణం సుందరకాండములో లంకలో హనుమ రాక్షస వీరులను దండించబోయే సందర్భంలో అతని ప్రవర్తనలో హాస్యం ప్రకటితం అయింది.

**వాలమల్లార్చి, బ్రహాండగోళమెల్ల**

**........................................**

**మంతుకక్కిన మా హనుమంతుడంత**

(మొల్ల రామాయణం, సుందరకాండం, పద్యం: 140)

భయానకరసం క్రూరత్వానికి ప్రతీక. జీవుల హృదయంలో పుట్టే అనర్థ, శంక, భయాలు భయానక రసానికి ప్రతీకలు. ఈ భయానక రసానికి భయం స్థాయి భావం.

రంగనాథ రామాయణంలో బాలకాండలో సీతా స్వయంవర ఘట్టంలో పరశురాముని రూపాన్ని ఆగ్రాహాన్ని తెలిపే ఘట్టంలో ఆతని ఉగ్రరూపం ఆ సభలోని వారికి భయాన్ని కలిగించింది, ఆ ద్విపద యిలా ఉంది.

**" క్రమ్మిన జజలతో ............... భాసిల్లుచుండ"**

(రంగనాథ రామాయణం, బాలకాండ, పుట: 78)

మొల్ల తన రామాయణం సుందరకాండములో హనమ వాలము అగ్నికి చిహ్నంగా లంకానగరాన్ని ధ్వంసం చేసే సందర్భంలో సృష్టించిన ప్రళయాన్ని భయానకంగా ఇలా తెలియజేసింది.

**కొలవు కూటములకు గుప్పించి**

**............. దానవేశ్వర పురము దగ్ధంబు చేసే**

(మొల్ల రామాయణం, పుట : 105)

బీభత్స రసం హేయమైన స్పూరణంగా లాక్షణికులు తెలియజేశారు. వస్తువు లందలి దోషధర్మాధులచే కలిగేది జుగుప్సా లేక రోత అవుతుంది. ఈ విషయం రసగంగాధరం తెలిపింది. భీభత్స రసానికి జుగుప్సా స్థాయిభావం. శ్రీరాముడు ఖర దూషణాదుల సంహారం సందర్భంలో ఆ రణభూమి వర్ణితం చేసినదంతా భీభత్సరసంలోనే రంగనాథ రామాయణ కర్త తెలియచేశాడు.

**"నలియైన మాంసఖండములు మొండెములు**

**హత శేషమగు సైన్యమంతయు"**

(రంగనాథ రామాయణం, అరణ్య కాండం, పుట: 157)

రాముడు ఖరధూషణాదులను వధించే నేపథ్యంలో ఆ రణభూమి మాంసఖండాలతో మొండెయములతో చూచే వారికి రోత కల్గించేదిగా ఉంది అని చూపినారు.

మొల్ల రామాయణంలో బాలకాండలో విశ్వామిత్రుని యాగ ధ్వంసములో అసురుల విరోధిచేష్టలను మొల్ల ఇలా తెలిపింది.

**ఆకాశ వీధి నెలకొని ................ ముని గణంబుభీతిన్ బొందన్"**

(మొల్ల రామాయణం బాల కాండ పద్యం57, పుట : 21)

ఈ పద్యంలో మొల్ల పవిత్రమైన యాగ గుండాలలో అసురులు రోత పుట్టించే విధంగా రక్తం కుమ్మిరించడానికి మాంసఖండాలను వేయడాన్ని రోత కల్గించే విధంగా వర్ణించింది. ఇక రౌద్ర రసం ప్రస్తావిస్తే ఈ రసానికి స్థాయి భావం కోపం. కార్య సాధనకు అవరోధం కలిగితే వచ్చేది

కోపం. దీనిని చిత్తవృత్తి విశేషంగా రసగంగాధరం తెలియ జేసింది.

**ముడిపడుబోదులతో మొగముకెంపెసగ**

**.............................................**

**జళిపించిపలికె..**

(రంగనాథ రామాయణం, అయోధ్య కాండ, పుట: 97)

పై ద్విపదలో బుద్ధారెడ్డి లక్ష్మణుడు కైక కోరికల పట్ల తీవ్ర ఉగ్ర స్వభావంతో రామపట్టభిషేక భంగాన్ని, వనవాస పయనాన్ని నిరసిస్తూ ప్రకటించిన కోపావేశాలు పై రౌద్ర రసంలో తెలిపాడు.

మొల్ల రామాయణం యుద్ధ కాండలో తన మరణ రహస్యం చెప్పిన విభీషణునిపై రావణుడు ప్రకటించిన ఆగ్రహం మొల్ల రావణుని పరంగా ఈ పద్యంలో తెలియ చేసింది.

**"తొల్లి వరప్రాప్తి .......... ద ృణముకైవడి**
**నడిమిక ద్రెంచి వైచె"**

(మొల్ల రామాయణం, యుద్ధ కాండం, పద్యం, 103, పుట: 181)

శాంత రసానికి శమము స్థాయి భావము, విషయ విరాగిత్వం కూడా చిత్తవత్తి విశేషం దీనిని శమం అని రసగంగాధరం గ్రంథం తెలిపింది. రంగనాథ రామాయణం అయోధ్య కాండంలో క్రోధంతో లక్ష్మణుడు కైక, దశరథ, భరతుల నింద చేసిన సందర్భంలో రాముడు శాంతచిత్తుడై సౌమిత్రిని ఓదారుస్తున్న ఘట్టంలో బుద్ధారెడ్డి ఇలా తెలియజేశాడు.

**ఈ లక్ష్మణుడు బీలుడేమిమునెఱుంగ**

**..................................**

**తనలోన శాంతమంతము దోచబలికె**

(రంగనాథ రామాయణం, అయోధ్య కాండ, పుట: 98)

మొల్ల తన రామాయణం అరణ్య కాండంలో క్రోధ స్వభావుడైన లక్ష్మణుడు శాంత మనస్కుడై శ్రీరాముడు సీతను వియోగంతో రోదించే ఘట్టంలో చేసిన సాంత్వన వచనాలలో శాంత రసాన్ని పండించింది. ఆ రస ప్రకటిత పద్యం యిలా ఉంది.

**దానునికైవడి నూరక**

**............................**

**గానని మీదటను వగవగా దగుమనకున్**

(మొల్ల రామాయణం, అరణ్యకాండం, పద్యం. 58, పుట : 52)

ఈ విధంగా ప్రాచీన కావ్యాలలో నవరసాలను రంగనాథ, మొల్ల రామాయణాలలో పరిశీలిస్తూ ఈ సదస్సు పత్రంలో సోదాహరణంగా తెలియజేయడం జరిగింది.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# తిక్కన మహాభారతంలో నవరసాలు

- యం. స్వర్ణలత, ఆంధ్రోపన్యాసకురాలు, నోబుల్ పి.జి & డిగ్రీ కళాశాల, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్.

''వాక్యం రసాత్మకం కావ్యం'' అన్న విశ్వనాథుని మాటలను బట్టి చూస్తే కావ్యంలో 'రసం' ప్రాధాన్యత తెలుస్తుంది.

'రసం' కావ్య సౌందర్యాన్ని దేదీప్యమానం చేస్తుంది. ప్రాచీన భారీయాలంకారికులంతా కావ్యంలోని 'రసం' ప్రాధాన్యాన్ని గుర్తించారు. కావ్యంలో రసం ఎలా ఉత్పన్న మవుతుంది అని చెబుతూ భరతుడు... నాట్యశాస్త్రంలో.. విభావానుభవ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తి.

విభావ, అనుభావ, సంచారీ భావాల సంయోతం చేత 'రసం' ఉత్పన్నమవుతుందని వక్కాణించాడు. ప్రాచీన భారతీయాలంకారికులలో రసం గురించి మొదట ప్రస్తావించిన వాడు భరతుడు.

### భరతుని నాట్యశాస్త్రమున..

**"శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకా ః**
**బీభత్సాద్భుత సంజౌ చేత్యష్టా నాట్యే రసాః స్మృతాః"**

అంటూ కావ్యంలో రసాలు ఎనిమిది అని ప్రతిపాదించాడు. వీనిలో శాంత రసం ప్రస్తావన లేకపోవడంతో కొంతమంది అలంకారికులు భరతుని ఎనిమిది రసాలకు తోడుగా శాంత రసాన్ని చేర్చి కావ్యంలో తొమ్మిది రసాలు (నవ రసాలు) ప్రతిపాదించారు.

ఇక ప్రస్తుత విషయానికొస్తే సంస్కృతంలో వ్యాస మహర్షి రాసిన మహాభారతాన్ని తెలుగులో ముగ్గురు కవులు అనువదించారు. వీరినే కవిత్రయంగా చెబుతాము. కవిత్రయంలో రెండవ వాడైన తిక్కన భారతంలోని విరాట పర్వం మొదలు స్వర్గారోహణ పర్యవం వకు గల 16 పర్వాలను తెనిగించి కవిత్రయంలో అద్వితీయుడిగా ప్రసిద్ధి పొందాడు. 13వ శతాబ్దానికి చెందిన మనుమసిద్ధి ఆస్థానంలో మంత్రి అయిన తిక్కనకు రాజ్యపాలనలోని మెళకువలన్నియు కరతలామలకములే కావడంతో కవిత్వంలోనూ పరిపాలనా అనుభవాలు, యుద్ధ నీతులు, రాచరికపు లక్షణాలు ప్రస్ఫుటించడం కనిపిస్తుంది.

వీర, శృంగారాల్లో ఏదో ఒక దానిని ప్రధానంగా స్వీకరించి మిగతా వాటిని అంగరసాలుగా చేసుకోవచ్చు అంటూ ధనుంజయుడు తన దశ రూపకంలో వీర, శృంగారాలకు ప్రాధాన్యమిచ్చాడు. అయితే సంస్కృతాంధ్ర కవులందరూ తమ కావ్యాలలో విధిగా వీర, శృంగారలనే పాటించలేదు. సంస్కృతంలో ఆదికావ్యం రామాయణం. ఇందులో కరుణ రసం ప్రధాన పాత్ర వహించింది. తెలుగు కావ్యాల్లో మాత్రం మన వారు శృంగారం తర్వాత వీరానికే పెద్ద పీట వేశారు. తిక్కన భారతంలోనూ, భారతానికంటే ముందు రచించిన నిర్వచనోత్తర రామాయణంలోనూ వీర రసమే ప్రధాన పాత్ర వహించిందని చెప్పవచ్చు. కొంత మంది విమర్శకులు తిక్కన భారతం శాంత రస ప్రధానమైనదని చెప్పారు. అయితే తిక్కన భారతంలో గల 15 పర్వాలలో యుద్ధ సన్నివేశాలు సందర్భాలు గల పర్వాలే ఎక్కువగా అగుపిస్తాయి. అందునా తిక్కన స్వయంగ మంత్రి, యుద్ధ విద్యలు నేర్పినవాడు, యుద్ధాలు చేసిన వాడు కనుక సహజంగానే తిక్కన కవిత్వంలో యుద్ధ తంత్రం, వీరత్వం కనిపిస్తుంది. అయితే కొందరు అన్నట్లుగా శాంతం కూడా ఒక రకంగా ప్రధానంగానే భావించవచ్చు. రాజనీతి మరియు యుద్ధాల వల్ల కలిగే నష్టాలు తెలిసిన వాడు తిక్కన. తద్వార తిక్కన కవిత్వంలో శాంతం సైతం ప్రధాన పాత్ర ఉందని తలచవచ్చు.

### తిక్కన భారతం - వీర రసం :

వీర రసానికి స్థాయీ భావం ఉత్సాహం. ఉత్సాహం ఉత్తముల స్వభావం. వీరానికి ఆది దేవత ఇంద్రుడు. విరాటపర్వంలో భీముని వీరత్వానిక పెద్దపీట వేయబడినది.

నానారసాభ్యుదయోల్లాసంగా కవి బ్రహ్మ తిక్కన తన భారతాన్ని తీర్చిదిద్దాడు. తెలుగు కవులు అనువాదాన్ని మక్కికి మక్కిగా కాకుండా స్వతంత్రంగా చేశాడు. సందర్భానుగుణంగా, ఔచితీమంతంగా కవిత్రయం వారు ఆంధ్ర మహాభారతాన్ని తీర్చిదిద్దాడు.

సుకుమారమైన భావాలను తెలుపడానికి అనుకూల మైన ఛందం ఉత్పలమాల. అయితే ఉత్పలమాల పద్య ఛందంలో సైతం వీరత్వాన్ని రంగరించి చూపిన ఘనత తిక్కనకే దక్కుతుంది. ఆంధ్ర మహాభారతం సంజయ రాయబార ఘట్టంలో సంజయుడు ధర్మజునితో పలికిన మాటలను గమనిస్తే...

**''పెట్టని కోట నీకు హరిభీముడునర్జునుడున్ రణంబునం**
**దొట్టిన మంటలాకొలది యోధుల సాత్యకీయున్ విరాటుడుం**
**జుట్టపు మేరు వుగ్ర రణశోభితుడీ ధ్రువదుండు నిన్ను ని**
**ట్టట్టన వచ్చునే సులకైనను నొల్లవుగాక చివ్వకున్"**
(ఉద్యోగపర్వం 11-297వ)

ఇదీ ఉత్పలమాలలో తిక్కన చూపిన వీరత్వ ప్రధాన మైన పదజాలం.

దక్షిణ గోగ్రహణ, ఉత్తర గోగ్రహణ సందర్భాలలో తిక్కన భారతంలో వీర రసం తొణికిసలాడుతుంది. గోవులను కౌరవులను తోలుకుపోయిన వార్త విన్న విరటుడు...

**"ఏమీ నిక్కమె మున్నెఱుంగడే త్రిగర్తేశుండే మద్గోధన**
**స్తోమంబు గొనిపోవు తెంపునకు నుద్యోగించెనే మేలుమే**
**లామై తోడనే పోవుగాక యని వీరాలాపముల్ పల్కియు**
**ద్ధామ క్రోధ శిఖాకలాప వికటోద్యద్భ్రూకటి స్ఫూర్తియై"**
**(3-139)**

అని మంత్రి దండనాధులను యుద్ధమునకుత్సాహ పరిచాడు విరాటుడు. యుద్ధంలో విరాటుడు ఓడిపోయి సుశర్మచే బంధింపబడ్డాడు. ధర్మరాజు మనకు ఆశ్రయ మిచ్చిన విరాటుడిని రక్షించుకొనుట మన బాధ్యత అని భీయునితో పలికాడు. భీముడు క్రోధావేశపరుడై తన మేనును పెంచి, యుద్ధ సన్నద్ధుడయ్యాడు. ఈ సంద ర్భంలో తిక్కన చక్కని వీర రసాన్ని పోషించాడు. ఇలా వీర రస ప్రాధాన్యాన్ని తిక్కన భారతంలో ఎంతైనా చూప వచ్చు. అలాగే కీచకుడు ద్రౌపదిని చూపి మోహించాడు. ద్రౌపదిని కీచకుడు చూసిన సందర్భంలో భయానక రసాన్ని తిక్కన తన కవిత్వంలో చూపాడు. ఇదే సందర్భంలోనూ, మిగతా యుద్ధ పర్వాలలోనూ తిక్కన భయానక, బీభత్స రసాలను చూపించాడు. వ్యాస విస్తరణ భయంచే నవ రసాలను ప్రత్యేకించి విస్తారంగా ఇక్కడ వివరించడం లేదు.

ఉద్యోగ పర్వమునందలి విశ్వరూప సందర్భమున తిక్కన అద్భుత రస పోషణగావించాడు.

నవరసాలలో చివరిది శాంతము. దీనికి శమము స్థాయీ భావము. తిక్కన భారతంలో వీరము కన్న శాంత రసమే ప్రధానమైనదని కొందరు విమర్శకులు తలచారు. డాక్టర్ ఆంధ్ర కమలాదేవి తన సిద్ధాంత గ్రంథం.. తిక్కన - భారతము - రసపోషణములో తిక్కన శాంత రసానికి ప్రాధాన్యమిచ్చాడనీ, తిక్కన భారతం శాంత రస ప్రధానమై నదని నిరూపించారు.

యుద్ధ పరిణామాలు తెలిసిన మంత్రి తిక్కనా మాత్యులు. అందుకే ఉద్యోగ పర్వంలో తిక్కన తన కవిత్వం ద్వారా శాంతరసాన్ని పరవళ్ళెత్తించారు. ఉద్యోగ మనగా ప్రయత్నం. పాండవ, కౌరవుల మధ్య యుద్ధ నివారణ కొరకు శ్రీకృష్ణుడు, సంయుడు రాయబారాలు నడిపారు. ఈ సందర్భంలో తిక్కన తనలోని భావాలను శాంతియుత జీవన పట్ల కలిగే ఆనందానుభూతుల్ని కవిత్వంలో వ్యక్తీకరించి.. శాంత రసానికి ప్రాధాన్య మిచ్చారు.

**"అన్నదమ్ములమై యుండి యకట మసల**
**నొరుల దలమెత్తి చూడ నొండరుల తోడ**
**చెనగ నేటికీ నీవేల పెద్ద వారి**
**బుద్ధి విని పంచి కుడుచుట పాలదొక్కా..."**

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

అంటూ భీమసేనుడు, శ్రీకృష్ణునితో యుద్ధ నివారణ కోసం రాయబారం చేయమని ప్రార్థించాడు. సహజంగానే భీముడు ఆవేశపరుడు. అలాంటి భీమునితో కూడా శాంతి వచనాలు పలికించిన ఘనత తిక్కనకే చెల్లుతుంది. భీముని చేత శాంతి వచనాలు పలికించడం ఒక వింతైన సన్నివేశంగా తలచవచ్చు.

ధర్మరాజు యుద్ధం వలన కలిగే జన, ఆస్థి నష్టాలను ఊహించుకుని నిర్వేదానికి లోనయ్యాడు. ఆ సందర్భంలో

**"మనకేటి రాజ్యమొండొక**
**జనపరదమున కేగి భైక్ష్య చర్యావిధి జీ**
**వనము నడిపికొని యుండుద**
**మనఘా యట్లయిన సుఖులమవుదము సుమ్మీ..."**

అంటూ శ్రీకృష్ణుని సంధి చేయమని వేడుకున్నాడు. హింసాత్మకమై యగ్నం కంటే అహింసాత్మకమైన తపో యగ్నం అధికమని తిక్కన తన భారతంలో సూచించాడు. ఇలా తిక్కన భారతంలో రస పోషణ గురించి ఎంతైనా చెప్పవచ్చు. నవ రసాలను ప్రత్యేకంగా, సవిస్తారంగా విపులీకరించాలంటే కొన్ని వందల పేజీలు రాయవచ్చు. కానీ వ్యాస విస్తరణ భయం చేత అక్కడక్కడ కొన్ని సన్ని వేశాలను ఉదహరిస్తూ ఈ వ్యాసాన్ని సమర్పించడం జరి గింది. ఇది తిక్కన భారతం - నవరసాలు అంశానికి పూర్తిగా న్యాయం చేయకపోయినా.. కొంతైనా దోహదం చేస్తుందని భావిస్తూ ముగిస్తున్నాను.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# జానపద గేయాలు - హాస్యరసం

- నండూరి అనంతలక్ష్మి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, సిటీ ప్రభుత్వ కళాశాల, హైదరాబాద్.

## రస సంఖ్య :

రసం కావ్యానికి ప్రాణం వంటిది. "విభావానుబావ వ్యభిచారి సంయోగాద్ర నిష్పత్తి" - ఇది భరతుని రస సూత్రం. విభావం, అనుభావం, వ్యభిచారి భావం - వీని సంయోగం వలన రసం నిష్పన్నం అవుతుందని దీని భావం. లోకంలో 'నవరసాలు' అనే మాట ప్రసిద్ధంగా వినిపిస్తుంది. రస సంఖ్య విషయంలో భరతుని తరువాత చాలామంది అలంకారికులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. భరతుడు నాట్యశాస్త్రంలో ఎనిమిది రసాలను మాత్రమే పేర్కొన్నాడు.

**"శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః**
**బీభత్సాద్భుత సంజ్ఞౌ చేత్యష్టౌ నాట్యే రసాః స్మృతాః"**

వీనికి వరుసగా స్థాయి భావాలు కూడా తెలుపబడినాయి.

**'రతిర్హా సశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా**
**జుగుప్సా విస్మయశ్చేతి స్థాయి భావాః ప్రకీర్తి తాః"**

కావ్యరసాలు తొమ్మిదని ప్రప్రథమంగా చెప్పినవాడు ఉద్భటుడు. అతడు రచించిన "కావ్యాలంకార సార సంగ్రహ" గ్రంథంలో భరతుడు పేర్కొన్న ఎనిమిది రసాలతోపాటు శాంతం ఒక రసంగా అంగీకరించబడింది. ఉద్భటుని తరువాత ఆనంద వర్ధనుడు, అభినవ గుప్తుడు మొదలైనవారు శాంతాన్ని ఒక రసంగా ప్రతిపాదించారు. మమ్మటుడు తన కావ్య ప్రకాశంలో 'శాంతోపి నవమోరసః" అని శాంతాన్ని తొమ్మిదవ రసంగా పేర్కొన్నాడు.

## జానపదం :

జానపదం అంటే పల్లె లేదా చిన్న గ్రామం. జనపథంలో ఉండేవారు జానపదులు. జానపదులకు సంబంధించినదే జానపదం. అది వస్తు, భావ, ప్రదర్శన రూపాలలో ఉండవచ్చు. మొత్తం మీద జానపదత్వమన్నది జానపదమవుతుంది. జానపదుల కళలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, భాష, విశ్వాసాలు, సాహిత్యం, పండుగలు, ఆటలు అన్నింటినీ కలిపి జానపద విజ్ఞానం (Folklore) అంటున్నారు. జానపద విజ్ఞానంలో ఒక భాగమైన జానపద సాహిత్యంలో గేయ, వచన, రూపకాలనే మూడు ప్రధాన శాఖలున్నాయి. గేయశాఖను కథాసహిత, కథారహితాలని రెండు రకాలుగా విభజించవచ్చు. వచన శాఖలో కథలు, సామెతలు, పొడుపు కథలని మూడు రకాలున్నాయి. రూపకాల్లో యక్షగానాలు, వీధి భాగవతాలు, గొల్లభామలు మొదలైనవి ఉన్నాయి. జానపద గేయాల్ని రసపరంగా మూడు విభాగాలు చేయవచ్చు. అవి 1) శృంగార రసాత్మకాలు, 2) కరుణ రసాత్మకాలు, 3) హాస్య రసాత్మకాలు.

నవరసాల్లో హాస్యమొకటి. తక్కినవానివలె హాస్యము కూడ బ్రహ్మానంద సహోదరమని పూర్వ అలంకారికులు అంగీకరించి యున్నారు. నవ్వును మనవారు "వికృతాకార వాగ్వేష చేష్టాదేర్నర్తకాద్భవేత్ హాస్యో హాస స్థాయి భావః" అని నిర్వచించియున్నారు. వికృతమైన ఆకారము, వాక్కు, చేష్టలు మొదలగు వానియొక్క వేడుక వలన హాస్యము కలుగును. దానికి హాసము స్థాయి భావము.

## జానపద గేయాలలో హాస్యరసం :

జానపదుల జీవితంలో కష్టాలు, కడగండ్లు ఎన్ని ఉన్నా వారి జీవితంలో నవ్వు పుట్టించే సన్నివేశాలు కూడా గేయరూపంలో కనబడతాయి. వాటిలో కొన్ని - లక్ష్మీ పార్వతుల మధ్య సంవాద రూపంలో హాస్యంతో సాగిన ఈ క్రింది పాటలో వాక్ఛమత్కృతితో గుణాన్ని దోషంగా, దోషాన్ని గుణంగా చెప్పి ఎదుటివాళ్ళ ఎత్తుల్ని చిత్తు చేయడం కనిపిస్తుంది.

"లక్ష్మీ - గౌరీదేవి నీశంభుని గళమున నలుపేమిటె
ఓయమ్మా

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

పార్వతి - నారీమణి నీ విష్ణుదేవుడు నలుపు గాదటే కొమ్మా

లక్ష్మీ - బిరుదులేక నీకాంతుడు జగములో - బిచ్చ మెత్తుడేమమ్మా

పార్వతి - బలము లేక బలిచక్రవర్తిని - అడగ లేదంటే కొమ్మా"

వాక్చమత్కృతితో గూఢార్థాల మాటల్ని పేర్చి అబ్బుర పాటు కలిగించె ప్రశ్నలు వేసి సమాధానం తెలియగానే హాయిగా నవ్వుకొనే హాస్యపూరితాలైన గేయాలు పొడుపు కథల రూపంలో ఉన్నాయి. ఉదాహరణకు...

స్త్రీ - ఒకరికి చేతులిచ్చి - ఒకరికి కాళ్లనిచ్చి
ఒకరికి నడుమునిచ్చి - కూకున్నానోయ్ రాజా
కూకున్నానోయ్

పు - ఎవరికి చేతులిచ్చి - ఎవరికి కాళ్లనిచ్చి
ఎవరికి నడుమునిచ్చి - కూకున్నావోయ్ పిల్లా
కూకున్నావోయ్

స్త్రీ - గాజులికి చేతులిచ్చి - కడియాలకి కాళ్లనిచ్చి
డాబూకు నడుమునిచ్చి - కూకున్నానోయ్
రాజా కూకున్నానోయ్
............................................"

**"అందరివోలె అడిగేదాన్ని కాదు - కొందరి వోలె కొసిరేదాన్ని కాను**
**అంతే నాకు చాలు - తమలపాకు తొడిమే పదివేలు" అంటూ**

**"ముక్కుకూ ముక్కెర లేక నాముక్కు చిన్నబోయినాది**
**నీ ముగ్గురూ బిడ్డాల నమ్మి నాముక్కుకూ ముక్కెరతేవ"**

అని అడిగే జాణ మాటలు నవ్వు తెప్పిస్తాయి.

వరసైన వదినా - మరదళ్ళు, బావా - మరదళ్ల మధ్య సాగే సరసోక్తులు హాస్యరస పూరితాలు.

**వైశాఖ మాసాన వారింట పెళ్లి**
**వల్లభుండు అన్నయ్య పెళ్లి చేయించె**
**మిళ్లి తడయాకుండ బొట్టు పడకుండ**
**నేర్పుగా పెద్దొదిన నేతులొడ్డించె**
**అంతకంటె నేర్పరె చిన్నన్న వొదినె**
**ఆకాశన మిళ్లి ఆడించిపోయే"**

వదినల పిసినారితనాన్ని హేళన చేయడం ఈ పాటలో కనిపిస్తుంది. ఇలాంటిదే బావను ఆటపట్టించే పాట :

**"బావగారు మీరు ప్రతిభగలవారు**
**నిండన్న సంభలోన పిండి బొక్కేరు"**
**"పదేళ్ల నాటిదే పాతదూలమ్ము - పడిపోయె మాబావ పల్వరస మింద**
**పళ్లని పిప్పాయె నోరెర్రనాయె - సభలోన బావకు తలవంపులాయె**
**వీధిలో బావకు వినసిగ్గులాయె - రచ్చలో బావకు రాసిగ్గులాయె"**

ఒక గడుసరి మరదలు వదిన గారిని సత్కరించిన విధానం :

వాన గొడ్తాంది జాన, వదినె వచ్చేనమ్మ
ఎట్లా పొమ్మందు వదినె, వాన గొడ్తాంది జాన ॥వాన॥
నీళ్ళు ఇస్తామంటె, చిల్లుల చెంబాయె
పీట వేస్తామంటె, పిల్ల సందాడెనమ్మా! ॥వాన॥
చాప వేస్తామంటె, సందు కొంచెమాయె
కల్లు దెస్తామంటె, చెల్లాని పైసాయె
సామలు దంచుదామంటె, సన్నాని ధాన్యమాయె
కొఱ్ఱలు దంచుదామంటె, కొత్తా ధాన్యమాయె ॥వాన॥
కోడిని గోస్తామంటె, గుడ్ల మీది కోడి వదినె
వడ్లూ దంచుదామంటె, ఇత్తనాల వడ్లు వదినె ॥వాన॥
కౌగిలిచ్చు కుందామంటె, కడుపూల బల్ల వదినె
కండ్ల చూస్తామన్న, కండ్లొచ్చెనాయి వదినె ॥వాన॥
నువ్వు బోయె తోవలోనె, కుడుకాలంగడి వదినె
నీకుప్పె కుదువబెట్టి, కొబ్బెరంపు నాయీ వదినె ॥వాన॥
నువ్వుబోయె తోవలెనె, మట్టెలంగడి వదినె
నీ మడియె కుదువబెట్టి, మట్టెలంపునాయి వదినె ॥వాన॥

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

నువు బోయె తోవలెనె, గాజులంగాడి వదినె
నీ కాలు కుదువబెట్టి - గాజులందపు నాయి వదినె
॥వాన॥

పై పాటలో మరదలు వదినె గారికి "పెట్టిపోతలు" లేవు సరిగదా కన్నులతో చూచుటకు నిరాకరించినది. పైపెచ్చు మడిమలు, కాళ్లు కుదువబెట్టియైన తనకు మట్టెలు మున్నగునవి కొని పంపించమన్నది గడసరి మరదలు.

**ఉప సంహారం :**

జానపద గేయాలు జాతికి ప్రతిబింబాలు. అవి కాలక్షేపం కోసం, కష్టాల్ని మరచిపోవడానికి పాడుకునేవి. పల్లెపట్టుల్లోని పామర ప్రజలకు సంబంధించిన ప్రతి చిన్న అంశాన్ని జానపద గేయాలు వ్యక్తం చేస్తాయి. శబ్దాడంబరంగాని, కవిత్వపు కసరత్తులుగానీ ఆ గేయాల్లో కనిపించవు. జానపదుల జాణతనం, అమాయకత్వం, గడుసుదనం, హాస్యచతురత మనకు జానపదుల హాస్యరస గేయాల్లో కనిపిస్తాయి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగు జానపద గేయ సాహిత్యము - బి. రామరాజు
2. తెలుగు జానపద గేయ గాథలు - నాయని కృష్ణకుమారి

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# నన్నయ్య భారతం - మధుర రస గుణాలు

- ఎల్. రేఖ, గద్వాల, జోగులాంబ జిల్లా, తెలంగాణ.

మన తెలుగు సాహిత్య సంపద అనంతంగా ఉంది. అది తరగు గు ఆధుఒక కాలంలో సాహిత్యాన్ని వాఙ్మయాన్ని సారస్వతాన్ని ఓకె పేరుతో పిలుస్తున్నారు. స్థూలంగా చూస్తే పెద్ద తేడాలేనప్పంటికి సూక్ష్మంగా చూస్తే కోంత భేదం కానవస్తుంది.

## సాహిత్యం :

సాహిత్య శబ్దం కావ్య గ్రంధాల్నుంటికి వర్తిస్తుంది. వేదం పురాణ శాస్త్రాలకన్నా కావ్యం ఉత్తమమైంది. అందుకే తెలుగు కావ్యాల చరిత్రలను సాహిత్య చరిత్ర అంటారు.

**నిహీతేన సహితం సాహిత్యం సహితస్య భావహ సాహిత్యయి**

**నిసహిత య్యోరావస్య సాహిత్యం సంగీతమపి సాహిత్యం సరస్వత్యా:**

**స్తనద్వయం ఏకమాపాత మధుర మన్యధా లోచనా మృతము**

అను శ్లోక్నా బట్టి హితంను శ్రేయస్సును కోరేది సాహిత్యము తెలుస్తుంది. భారతం, రామాయణం, భాగ వతం, ఖురాన్, బైబిల్ తదితర సాహిత్య గ్రంధాలతో పాటు కావ్యలున్న సాహిత్యంగానే పరిగుంచవచ్చు. ఎందు కంటే గ్రంధాల్ను ప్రజాహితాన్ని కాంక్షిస్తూ విశ్వశ్రేయస్సును కోరే హితం సాహిత్యం.

## నన్నయ్య:

నన్నయ్యకు పూర్వం తెలుగు పద్య, గద్య సాహిత్యం శాసన రూపంలో ఉందన్నమాట వాస్తవం. నన్నయ్యకు పూర్వం శాసనాల్లో కుపించే సాంఘీక, సామాజిక, సాంస్కృతిక, సంప్రదాయలతో పాటు ఆనాటి భాషా రూపం కూడా తెలుస్తుంది. ఆనాటి సంస్కృతి సంప్రదాయాలు నేటికి మన సంస్కృతిలో మిగిలి ఉన్నాయి. నాటి భాషావిధానం నేటి భాషావిధానాన్నికి మార్పు చెందడం జరిగింది. దానికి కారణం భాష ప్రవహించే నది వంటిది. ప్రవహించే నది తన ప్రవాహుకి అనుగుణంగా తన దిశను మార్చుకున్న ట్లుగా నాటి భాషా తన రూపాన్ని మార్చుకొని నేడు సరళ గ్రాంధికంగా, వ్యవహారిక భాషాగా రూపాతరం చెదింది. నాటి శాసనాలలో కుపించే కవిత్వం కొంత సృజనాత్మకత కలిగి ఉంది. అది కవితా పరమైన పద్ధతి ఈ సంస్కృతి సంప్రదాయాలు తదనంతర కాలంలో నన్నయ్య కవిత్వంలో కోంత పరిణతి చెంది కనిపిస్తుంది.

## నన్నయ్య రచనలు :

చాముండికావిలాసం మూడు అశ్వాసాల గ్రంధం, ఇంద్ర విజయం, ఆంధ్ర శబ్ద చింతామణి అను తెలుగు వ్యాకరణ గ్రంధం సంస్కృతంలో వ్రాయబడింది. సంస్కృతంలో వేద వ్యాసుడు రచించిన వంద పర్వాల భారతాన్ని ఆంధ్రీకరించడానికి పూనుకుంటూ వ్యాస భారతంలో 17000 శ్లోకాలను 4000గద్య పద్యలలోకి నన్నయ్య అనువదించాడు. నన్నయ్య భారతంలోని ఆది, సభ, అరణ్య పర్వంలోని 3 1/2 అశ్వాసాలు 142వ పద్యం **నిశారద రాత్రులుజ్వల లసత్తరు** అను పద్యంలో శరత్కాల వర్ణన చేస్తూ కాల గమనం చెందడం జరిగింది.

## నన్నయ్య అనువాద విదానం :

ఒక గ్రంథాన్ని అనువదించాలంటే ప్రధానంగా 3 ముఖ్యమైన పద్ధతులున్నాయి. మూలగ్రంథం నుండి కథను మాత్రమే తీసుకొని రస, భావాలను పోషిస్తూ స్వతంత్రంగా రచన చేయడం. ఇది కథానువాద పద్ధతి, మరోకటి భాషానువాదపద్ధతి, ఇది స్వతంత్రం విదేయం కు మద్యస్థ పద్ధతి మరోకటి పదానువాద పద్ధతి ఇది మూలాన్ని అనుసరించి చేయాల్సిందే గాని కర్తకు ఏమాత్రం స్వతంత్రం ఉండదు. పై మూడింటిలో **కథానువాదపద్ధతి** మేలయినది. దీనిని తెలుగులో

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

నన్నయ్య పాటించి తరువాత కవులకు, మార్గ దర్శకు డయ్యాడు.

**భారత రచనకు ఉపక్రమించుటకు కారణం :**

ఆంధ్ర కవితా పోషకులయిన మహరాజులలో అగ్ర గణ్యుడు రాజరాజ నరేంద్రడు తన చంద్రవంశస్థులయిన పాండవుల చరిత్రను వినాలన్న బలమైన కోరికతో అదే కాకుండా వర్ణాశ్రమ ధర్మలను ఆచరించడానికి, భారత శ్రవణా శక్తిని వంశకర్తల మహిమాతిశయాలను తెలుసు కోవడానికి అన్య భాషలలో భారతనువాదాన్ని వ్యతిరేకిస్తూ వైదిక ధర్మాన్ని ఉదరించాలు తన కుల బ్రాహ్మణుడైన నన్నయ్యతో **'నా హృదయంబున అనవతరము శ్రీ మహభారతం నందు అభిప్రాయంబు విన'** అను కోరికతో **'కృష్ణ ద్వైపాయన ము వృషభాభిహిత మహభారత బద్ధి నిరూపితార్థ మేర్పడ తెనుంగున రచియింపు మదిక దీయుక్తి మేయిన్'** అని నన్నయ్యను భారతరచనకు ప్రేరేపించాడు.

నన్నయ్యకు భారతాన్ని ఆంధ్రీకరించడం ఎంత కష్టమే తెలును అందుకే నక్షత్రాలను లెక్కించడం సర్వవేద శాస్త్రాల సారాన్ని గ్రహించడం, బుద్ధి అనే బాహువులతో భారత భారతీ సముద్రాన్ని ఈదటం బ్రహ్మకైనా సాధ్యం కాని పని అని పేర్కొన్నాడు. **'దేవ నీ అనుమతుంబున విద్వజ్జనులు అనుగ్రహంబునన్ జేసి నా నేర్చు విదంబునన్ నిక్కావ్యంబు రచించెదన్'** అని తన ఆమోదాన్ని తెలిపి ధర్మస్థాపనా పరమైన భారతాన్ని ప్రచారం చేయాలనే భావంతో **'శ్రీవాణి గిరిజాశ్చరాయ వదతో వక్షోముఖాజ్గెఘయె'** అంటూ సంస్కృతి శ్లోకంతో త్రిమూర్తులు కీర్తిస్తూ కావ్యా రంభం చేయడం. ఇందులో ప్రత్యేకత, మంగళ శ్లోకం 'మ'గణంతో ప్రారంబమైతే కావ్యం కలకాలం జీవిస్తుంది. అని చందశ్శాస్త్రం తెల్పుతుంది. ఈ భావనను నన్నయ్య గౌరవించాడు.

**అవతారిక :**

ఈయన అవతారికను కూడా ప్రథమ పురుషులో వ్రాస్తూ ఎదుటివారిని గురించి తెలియజేస్తూ అతడు చేశాడు, ఆమె చేసింది, వంటి క్రియాపదాలు ఎక్కువగా అవతారికలో కానవస్తున్నాయి. నన్నయ్య మహభారతాన్ని తానే స్వయంగా తెలుగు చేస్తూ కూడా **'తెనుంగునన్ మహభారత సంహిత రచనా బిందురుడయ్యే జగద్ధి తంబుగన్'** అంటూ తెలుసుకున్నాడు. ఇదే మర్యాదను పోతన కూడా పాటించి బమ్మెర పోతరాజోకడు భాగవతం జగద్ధితంబుగన్ అని పేర్కోన్నాడు. అవతారికలో నన్నయ్య కవితా రచనతో పాటు రాజరాజ వ్యక్తిత్వాన్ని, భారతరచన ఆవిర్బవ పరిస్థితులు, నారాయణభట్టు సహాయం, నన్నయ్య కవితా లక్షణాలు మొదలగు అంశాలు పేర్కో న్నాడు.

**భారతం గొప్పతనం :**

సంస్కృత భారతం శాస్త్రేతిహసం, తెలుగుభారతం కావ్యేతిహసం అనేకులు. భారతాన్ని గూర్చి పేర్కోంటూ ధర్మశాస్త్రము, ఇతిహసము, వేదాంతము, నీతి శాస్త్రము, కావ్యము, సకల లక్షల సంగ్రహము బహుపురాణ సముచ్చమము, అనేకులు అనేక విదాలుగా కీర్తించారు.

**నన్నయ్య కవితాగుణాలు :**

నన్నయ్య తన కవితా గుణాలను భారతంలోని క్రింది పద్యంలో వివరిస్తూ తన కవితాగుణాలను పేర్కోన్నాడు.

**'సారమతింగవీంద్రులు ప్రసన్న కథా కవితార్థయుక్తిలో,**
**నారసిమేలునొతరు అక్షర రమ్యత నాదరింప,**
**నానారుచిరార్థ సూక్తి నిధి నన్నయ్యభట్టు తెనుంగునన్ మహ,**
**భారత సంహితా రచనా బందురుడయ్యె జగద్ధితంబుగన్'**

అని పై పద్యంలో నన్నయ్య గారి కవితా గుణాలు ప్రసన్న కథా కవితార్థ యుక్తి, అక్షర రమ్యత, నానారుచిరార్థ సూక్తి నిధి అని పేర్కోన్నాడు.

**ప్రసన్న కథా కవితార్థయుక్తి :**

అనగా కథా కథన చాతుర్యంతో సంభాషణలలో రస పోషణ చేస్తూ సందర్భాన్ని బట్టి రసపోషణ చేసి పాఠకుల హృదయాలను రసానందంతో నింపడం, ప్రసన్నమైన కథతో కూడిన అర్థయుక్తి చమత్కారంతో కూడిన మాటలు కలిగి ఉండటమే ప్రసన్న కథా కవితార్థయుక్తి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

ప్రసన్న అంటే చదవగానే సులభంగా అర్థమవుతు మళ్ళీ, మళ్ళీ చదవాలుపించడం, ప్రసన్న కథా కవితార్థ యుక్తి కథ వినగానే మానసిక ఆనందం కలిగి కనుల ముందు ప్రత్యక్ష మయ్యేట్లుగా అనుభూతి చెందేవిదంగా రచించడం కథలో కూడుకొని ఒక విశేషమైన అర్థం ప్రకాశించటం అని చెప్పవచ్చు. నన్నయ్య ఉత్తమ కథ కుడు. కథా కథన శిల్పం నందు పండితుడు.

**అక్షర రమ్యత :**

ప్రసన్న కథా కవితార్థయుక్తిని అర్థం చేసుకోవడానికి పాడాత్వం కావలి. అలా కాకుండా పాండిత్యం అవసరం లేకుండా పండితులు కాని వారిని కూడా అకర్షించేది అక్షర రమ్యత. పదాల కూర్పువల్ల కలిగే నాదమాదుర్యమే అక్షర రమ్యత . ఇదే నన్నయ్య కవిత్వంలోని మాదుర్యానికి మూల బిందువు ఈ అక్షరరమ్మత వల్ల కఠినమైన సంస్కృత సమాసాలు కూడా తెలుగు సొగసులను సంతరించు కున్నాయి. అక్షరరమ్యత తర్వాత వారికి నన్నయే మూల బిందువు.

ప్రధానంగా పోతన గారి అక్షరరమ్యత పతాక స్థాయిలో కలదు

**నిధేయుండవు,**
**సకలలోకస్థేయుండవు**
**నమ్రులకు విదేయుండవు,**
**వయో పాయజ్ఞడ విజ్ఞాగములు**

వంటి ఎన్నో సుకుమారమైన పదాలు, పద్యాలు నన్నయ్య భారతంలో కుపిస్తాయి. ఒక పద్యంలో ఎదైనా ఒక మాట ఎలా వాడితే అటువంటిదే దానికి ప్రక్కన మరోకటి వాడి మనస్సుకు ఉల్లాసం కలిగించడం నన్నయ్య గారి తరచు ప్రయోగించే సాధారణ శిల్పం **'కురువృధుల్ గురువృద్ధ బాంధవులనే కల్ సూచుచుండన్'**

వీటిలో అక్షరరమ్యత నాగసౌష్ఠవం ప్రధానంగా కుపిస్తుంది. అలాగే **'బహువచన పాదపుబ్ధికుల'** అను పద్యంలో నాగస్తుతిని గూర్చి తెల్పునట్టిదిగా మనం గమనించవచ్చు.

అలాగే సముద్ర వర్ణనను కూడ సముద్ర అలల్ని సాక్షత్కరింప చేయడం మనం గముంచాలి. **"వివిదోత్తుంగ త్తుంగ తరంగ ఘటిత చలద్వేలా వనైలావలి"** అను పద్యంలో మనం చూడవచ్చు. అక్షరరమ్యత పద్యంలోని భావం తెలియక ముందు కుడా తల ఊపించేలా చేయడం నన్నయ్యగారి అక్షరరమ్యత గోప్పతనం. ఈ గుణం శబ్దుకి సంబందించింది. శ్రవణేంద్రియాల ద్వారా గ్రహించేది. వీరి రచనలో ఎక్కడ తడబాటు లేకుండా సమాన విక్షేపాలతొ సాగిపొతు ఉంటంది.

ప్రనన్న కథా కవితార్థాయుక్తి అర్ధసిద్ధి అక్షరరమ్యతలో శబ్దసిద్ధిని సాదించాడు. శబ్ధలంకారాలు నిండుగా ఉండే కవిత్వం అక్షరాల వల్ల పుట్టిన రమ్యత అక్షరరమ్యత.

**నానరుచిరార్ధసుక్తి నిది :**

ఒక విషయ్ను ఇతరులకంటే వైవిద్యంగా చెప్ప గలగటం, విషయాన్ని ఉన్నది. ఉన్నట్లుగా చెబితే వాఖ్యత అవుతాడు. అందంగా చిబితే కవి కాగలడు. అలాకాక ఒక విషయ్ను విసుగు తెప్పించి కుడా అందంగా చెప్ప గలగడం నన్నయలోని మరో విశిష్టత ఎన్నో రుచిరమైన లేదా అందమైన అర్ధాలుగల సూక్తులకు నిదిలా బాసించడం నానారుచిరార్ధ సూక్తి నిదిత్వం

**ఖండవల్లి లక్ష్మిరంజనం :**

వీరి దృష్ఠిలో సూక్తి అనగా రుచికరమైన చమత్కార యుక్తమైన మార్పు ఈ చమత్కారం ఒక్కొక పదం నందు, పదబందం నందు, సమాసం నందు, కారకం నందు వాఖ్యం నందు అనేక విధాలుగా చూడవచ్చు. మృదు మదురమైన అర్థ సుక్తులు ఎన్నో ఉన్నాయి. వీరి సూక్తులకు ఒక ప్రత్యేకత ఉంది. కథాలో ఒక నీతిని గాని ధర్మాన్ని గాని బోధించాల్సి వచ్చినప్పుడు దాన్నోక ప్రత్యేకమైన పద్యంలో చెప్పడం ఈయన ప్రత్యేకత.

**లౌకిక నీతి :**

క్షమాగుణం లేని తాపసి తపస్సు ప్రమత్తు సంపద, ధర్మ బాహ్యాపైన రాజురాజ్యం పగిలిపోయిన కుండలోని

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

నీరుల నిలవదు. దీనిలో క్రోదం వలన కలుగు అనార్థాలను, ధర్మాన్ని వీడిన రాజురాజ్యం, ప్రమత్తుని సంపదను గూర్చి చెప్పు సందర్భం

**రాజనీతి ప్రభోదం :**

సౌబిలు మంత్రియగు కుకుడనువాడు దుర్యోదనుకి రాజ్యనీతిని ఉపదేశించు సందర్భంలోనిది. **"జనపాలుడు మృదు కర్మంబునసైననూ గ్రూరుకర్మము"** రాజు అయిన వాడు మృదుమదురంగానైనా, కఠినంగా నైనా అవసరమైనప్పుడు తగిన విధంగా ప్రవర్తించి కార్యమును సాధించాలి ఇది రాజధర్మం.

**లోకజ్ఞాత సూచికలు :**

దశరాజు కూతురు సత్యవతి గంగానదిలో పడవ నడుపుతూ జీవనం సాగిస్తూ ఉంటుంది. ఒకనాడు పరాశరుడు పడవలో ఎక్కి సత్యవతి అందచందాలను చూసి కామ పరవశుడు అవుతాడు. ఈ సందర్భాన్ని **"ఎంతశాంతులయ్యే, నెంత జితేంద్రులయ్యో"** అను పద్యంలో ఎంతటి మహాపురుషులు అయిన ఎకాంతంలో స్త్రీ కనపడినప్పుడు మనస్సు గతి తప్పుతుంది. మన్మధుడి శక్తి ఒప్పుకునుట జనులకు సాధ్యం కాదు ఇందలి భావం. ఇది నన్నయ్య కల్పన.

**శాస్త్రవైదూష్య నిరుపితాలు:**

అబద్ధాలాడటం తప్పే అయిన దీనికి కొన్ని సందర్భాలలో మినయింపు కలదు శర్మిష యామతికి చెప్పు సందర్భాంలో **"చను బోంకగా, పాణ త్యాయమున సర్వదనాపహరణమున, వదగావచ్చిన విప్రార్ధనము నవదూజన సంగమమున, వివాహ సమయంబులందు"** అు పేర్కొంటూ ప్రాణ త్యాగ సమయమున, ప్రాణం పోవు సమయమున, వివాహ సమయమున అసత్యం పలికినా తప్పులెదుర్కోంటునే సత్యం యొక్క గొప్పతనాన్ని పేర్కోంది. **"నుజలపూరితంబులు నూతుల నూరిటికంటే"** అనుపద్యంలో సత్యవాక్కు యొక్క గోప్పతనాన్ని పేర్కొంటూ ఎంతో అందమైన పద్యాలను రాయడం జరిగింది.

**'గతకాలం మేలు వచ్చుకాలం కంటే'**
**'వృద్దుల బుద్దులు సంచరింపవే'**
**'వంటయింట కుందేలు సొచ్చె'**
**'యతి దలంపగ బతిచంచలము'**
**'వార్తయందు జగము వర్ధిలుచున్నది.'**

వంటి అనేక సూక్తులను పేర్కోనడం జరిగింది.

**నారాయణ భట్టు:**

నన్నయ్య మహభారతంలో నారాయణ భట్టు స్థానాన్ని గూర్చి పేర్కోంటూ మహభారత యుద్ధంలో కృష్ణుడు అర్జునుడికి ఏ విధంగా సహయపడినాడో నన్నయ్య మహభారత రచనలో అదే విధంగా సహయపడినట్లు పేర్కోనాడు. అందుకుగాను నారాయణ భట్టుకు రాజరాజ నరేంద్రుడు **నందపూడి అ**గ్రహరాన్ని దానంగా ఇవ్వగా ఆ దానశాసనాన్ని స్వయంగా నన్నయ్య సంస్కృతంలో రచిస్తూ నారాయణభట్టును పరిపరి విధాలుగా కీర్తించాడు.

**ముగింపు :**

నన్నయ్య తెలుగులో కవిత్వానికి, అనువాద కవిత్వానికి ఆదికవి. ఈయన అనుసరించిన వర్ణనలు, చందస్సులు, అలంకారాలు తరువాతి కవులకు ఆదర్శం అయ్యాయి. అందుకుగాను నన్నయ్యకు పూర్వం కవిత్వం ఉన్నా ఇతడే తెలుగులో మహకవి, అదికవి అని కీర్తిని గడించాడు. **మారన - నన్నయ్యను ఆంధ్రకవిత గురుడు, రామరాజభూషణుడు - మణియన్ వాగానుశాసనుడు సృజియింపన్ అని, విశ్వనాథుడు - ఋషి వంటి నన్నయ రెండవ వాల్మికి అని, తిక్కన - ముదుకృతులాంధ్ర కవిత్వ విశారథుడు విద్యాదయితుండొనెర్చె మహితాత్ముడు.** నన్నయ **భట్టు అని ఎ**ర్రన, **నన్నయ్య భట్టు కుంబజరం బెన్న** అని భద్రదగజంతం పోల్చడం జరిగంది. ఈవిదంగా నన్నయను అనేకులు అనేక విధాలుగా తెలుగు సాహిత్య ప్రపంచానికి సృష్ఠికర్తగా కీర్తించారు. మరి కొందరు నన్నయ భారతాన్ని గూర్చి సారమతినన్నయ, ప్రసన్న కథా కవితార్థా యుక్తి, భట్టారక భారతభారతి, ప్రాజ్ఞన్నయ యుగం -

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

భారతం వ్యాసభారతం - నన్నయ పరిష్కారం. వంటి మొదలగు అనేక పరిశోధన విమర్శక వ్యాఖ్యన గ్రంథాలు రచించడం జరిగింది.

ప్రసన్న **కదా కవితార్థ యుక్తి -** విశ్వనాథ సత్య నారాయణ

**సారమతి నన్నయ్య -** ఇంద్ర గంటి హనుమ శాస్త్రి

**భట్టారక భారత భారతి -** శలాక రఘునాథ శర్మ

**ప్రాజ్ఞ నన్నయ్య యుగం - నన్నయ్య భారతం -** దివాకర్ల వెంకటావదాని వ్యాస భారతం నన్నయ్య పరిష్కారం

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# జానపద పురాణ సాహిత్యంలో రస చర్చ

- కొండిగారి బుచ్చయ్య పరిశోధక విద్యార్థి, జానపద కళలశాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఒకప్పుడు జానపద సాహిత్యమంటే కేవలం పల్లెపదాలు మాత్రమే జానపద విజ్ఞానాన్ని కూడా కొందరు జానపద వాఙ్మయానికి పర్యాయపదం అని వాడడం జరిగింది. జానపద విజ్ఞానాన్ని ఇంగ్లీషులోని 'ఫోక్‌లోర్'కు సమానార్థకంగా తెలుగులో మనం వాడుతున్నాం. 'ఫోక్‌లోర్' అనే పదాన్ని డబ్ల్యు.జె. థామస్ 1846లో రూపొందించాడు. 'ది ఆథనీయం' అనే పత్రికకు రాసిన ఒక పుత్తరంలో థామస్ 'ఫోక్‌లోర్' అనే పదాన్ని సూచిస్తూ దాని అర్థాన్ని కూడా కొంత వరకు వివరించాడు. జానపదాలకు చెందిన ఆచారాలు, నమ్మకాలు, కథాగేయాలు, సామెతలు మొదలైన విజ్ఞానమే 'ఫోక్‌లోర్' అని థామస్ వచించాడు.

జానపదులకు సంబంధించినదే 'ఫోక్‌లోర్' అని చెప్పడం సులభమే. 19వ శతాబ్దిలో 'ఫోక్'ను నిర్వచించిన విద్వాంసులు జానపదులంటే విద్యా విహీనులైన కర్షక జనులని, గ్రామీణులని అభిప్రాయ పడ్డారు. సంస్కృతిలో మూడు దశలున్నాయని మానవ శాస్త్రవేత్తలు అభిప్రాయ పడ్డారు. అరణ్య జీవన స్థితి, అనాగరిక స్థితి, నాగరిక స్థితి అనే ఈ మూడు దశలలో జానపదులు అనాగరిక స్థితికి చెందిన వారని అభిప్రాయ పడేవారు. అంటే జానపదులు అటు ఆటవికులూ కాదు, ఇటు నాగరికులూ కాదు. పల్లెటూళ్ళలో నివసించే వారన్న మాట.

జనపదం అంటే పల్లెటూరు. జనపదాలలో నివసించేవారు జానపదులు. వారి నోళ్ల వెంబడి అలవోకగా పాడే పాటలు జానపద గేయాలనీ అనవచ్చును. జానపద గేయాల్లో మన ఆచార సాంప్రదాయాలు, సంస్కృతి, అలనాటి వైభవాలు తొణికిస లాడుతూ ఉంటాయి. ఈ గేయాల్లో ఎన్నో రకాలున్నాయి.

శిష్ట సాహిత్యమనీ, జానపద సాహిత్యమనీ సాహిత్యం రెండు రకాలు. శిష్ట సాహిత్యాన్ని ఒక వ్యక్తి సృష్టిస్తే, జానపద సాహిత్యానికి సమాజమే సృష్టికర్త. భారత, భాగవత, రామాయనాలను రచించిన వారిని కవిత్రయం, పోతన, భాస్కరాదులనీ గుర్తించినట్లుగా జానపద గేయాన్ని ఎవరు రచించారో చెప్పడం కష్టం. తరతరాలుగా సమాజంతో పాటు ఎదుగుతూ, పదుగురి నోళ్లలో ఆనందంగా పాడబడుతూ అందరి అదరానికీ పాత్రమై నేటికీ ప్రజాదరణ పొందుతోంది జానపద గేయం.

(అక్షరజ్ఞానం లేని గ్రామీణులు ఏనాడో, ఎప్పుడో, ఎక్కడో అలవోకగా సృష్టించుకోగా ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమిస్తూ వచ్చే కథలు, గాథలు, గేయాల వాఙ్మయ రాశియే జానపద సాహిత్యమని నిర్వచించ వచ్చును). జానపద విజ్ఞానంలో అనేక భాగాలున్నాయి. జానపద గాథలు, గేయాలు, పొడుపు కథలు, సామెతలు, వాద్యాలు, వైద్య విజ్ఞానం ఇలా ఎన్నో రకాలున్నాయి. జానపద గేయాల్లో బహుళ ప్రచారంలో ఉన్నవి.

సాహిత్యంలో శిష్ట సాహిత్యమని, జానపద సాహిత్యమని రెండు విభాగాలున్నాయి. శిష్ట సాహిత్యం వ్యక్తి సృష్టి. జానపద సాహిత్యం సమూహ సృష్టి. పురాణమన్న సాహిత్య ప్రక్రియ సంస్కృత భాషల్లో శిష్ట సాహిత్య స్థాయిని పొందింది. దీనినే 'మైథాలజీ' అని అంటారు. చరిత్రకు పూర్వ దశల్లో మానవ సంస్కృతి, సామాజిక విలువలు, మానవుల అవగామన వీటిని ప్రతిబింబించే రచనలు ప్రపంచంలోని అన్ని భాషల్లోనూ మౌకిక సాహిత్యంగా ప్రజల నోళ్లలో, పెద్దమ్మ చెప్పే కథల్లో, పాడిచే చాటువుల్లో పాడుకొనే పాటల్లో మిగిలి ఉంటాయి. పుక్కిటి పురాణమని, కట్టు కథలని తేలిగ్గా కొట్టి పారవేసే ఈ వాఙ్మయంలో మానవుడు సృష్ట్యాది నుంచీ ఎలా పరిణమిస్తూ వచ్చాడో ప్రకృతిని ఎలా విద్వేశించాడో, తన ఉనికిని ఎలా

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

గుర్తించాడో అన్న విషయాలే ఏ భాషలోనైనా పురాణేతి మాసాల వెంట కర్మకాండతో ముడిపడి ప్రజల అల వాట్లోలో మిళితమై, జీవితంలో భాగమై నాది కార్యకలా పాలకు తాత్త్విక ప్రేరణగా మిగిలి ఉంటాయి.

పురాణంలో వస్తువుకి సంబంధించిన వరకు శిష్ట జాన పద వాఙ్మయాలలో భేదం తక్కువ. కానీ రూపంలో మాత్రం జానపద పురాణాలు కొన్ని ప్రత్యేకతల్ని కలిగి వున్నాయి. ఒక్కోసారి దీని ప్రభావం వస్తు స్వరూప అవ గాహన మీద కూడా పడుతుంది. ఎప్పటికప్పుడు మాన వుడు తన జీవితంలో వస్తున్న జానపద పురాణంలో శిష్టుల పురాణంలో లేని ఒక నిత్య పరిచయ లక్షణం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది.

సంస్కృతంలో పదునెనిమిది పురాణాలు ఉన్నాయి. (అష్టాదశ పురాణాలు). వాటిలో 'భారత భాగవతాదులు' జానపదులకు చాలా పరిచయంలో ఉన్న విషయాలు, ఇతిహాసాల్లో రామాయణం ఎక్కువ ప్రీతి పాత్రమైంది 'రామాయణం' కథాగమన రీతిలో కావ్యమే అయినా పురాణ ప్రసిద్ధి ఉన్న ఇతివృత్తమైంది. జానపదులు ఎక్కువగా పాడుకొనే పాటలు రామాయణ భారత భాగ వతాల్లోనివి.

కానీ నిమ్నజాతుల్లో దేశీయతా ముద్ర ఉన్న ఇతర పురాణాలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు ఆసాది వాళ్లలో ప్రచారంలో ఉన్న 'మాతాపురాణం' శాక్తేయ మతా నికి సంబంధించినది.

ప్రతిబింబింపచేసే 'శక్తి' పుట్టు పూర్వోత్తరాలకు సంబం ధించిన కథలు శిష్టుల కంటె భిన్నంగా జానపదుల్లో మాత్రమే ప్రచారంలో ఉంది. ఆది పరాశక్తి ఒక గుడ్డు పెట్టిందని ఆ గుడ్డులోంచి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు పుట్టారని చెప్పే 'ముగ్గురమ్మల మూలపుటమ్మ' కథ జాన పదులకు మాత్రమే తెలుసు మాతా పురాణం పేరిట తెలంగాణ ప్రాంతంలో బవనీలు (బైండ్లు) పాడే పాట శాక్తేయ వీర శైవాలకున్న మత పరమైన సంఘర్షణను సూచించేది. ఆసాది వాండ్లు రాయలసీమలో పెద్దమ్మ కథ అనే పేరిట...!

ఆదిలాబాద్ ప్రాంతంలో నివసిస్తున్న 'గోండు జాతి' ప్రజల్లో ప్రచారంలో ఉన్న 'కాలికంకలీ' కథ కూడా ఈ కోవకు చెందినదే.

మేరు పర్వతం మీద దేవతలంతా సమావేశమైనారు. 'పాపి సరంజన్‌వెన్' అను పురుష దేవత నేనే సర్వాధికున్ని అన్నాడు. 'నిరానింజన్ వెన్' అన్న స్త్రీ దేవత అన్నది వారి దృష్టులు కలవడం వల్ల ఆమె గర్భవతి అయింది. ఆమె కొక కూతురు కలిగింది. '8' ఘడియల్లో దాని పేరు 'కాలి కంకలి' అది నీరు తేవటానికి ఏటికి వెళ్లి 'ఋషి శరత్' అన్న వాడు దంతావధానం చేసుకొని పారవేసిన ఆకు నీటిలో కొట్టుకొని వచ్చిన దానిని నమిలి తిన్నందువల్ల గర్భం ధరించింది. ఆమె '12' కళ్ళాల గోండు దేవతల్ని 33 కళ్ళాల తెలుగు దేవతల్ని, 32 కళ్ళాల మరాటా దేవతల్ని కన్నదట. ఈ గోండు జాతి వంశ పురుషుడు 'పెహంది లింగాల్', మొహమి అన్న పురాతన గరుడపక్షి గ్రుడ్డు పెడితే అందులో నుండి వీడూ, పాండురాజు పుట్టారట.

పెహంది లింగాల్ అనే గోండుల మూల పురుషుడు ఒకడున్నాడని 33 కళ్ళాల తెలుగు దేవతల్ని కలా కంకలి కన్నదని చెప్పే ఈ కథ గోండులకు తెలుగులకు వున్న చారిత్రక సంబంధాన్ని గురించి చరిత్ర చెప్పిన ఎన్నో విషయాల్ని అందిస్తోంది. ఇలాగే జానపదుల్లో 'కుమార స్వామి కథ' చాలా ప్రచారంలో ఉంది.

రత్న భల్లానుడన్న రాజు కొడుకు వీరభద్రుడు యోని జుడై జన్మించడానికిష్టం లేక గుమ్మడి కాయ నుంచి పుట్టా డట. ఈ గుమ్మడి కాయ ఒక దృష్ట్యా ప్రతీక. మరొక దృష్ట్యా చిహ్నం. గుమ్మడి కాయల తోట, ఇల్లు తోటకు సంస్కృత నామ కాశవనం. కాశవనం ఆకాశం ఒకటే. అనంతత్వానికి అది ప్రతీక.

ఉపనిషత్తులో ఆకాశం నుండి జీవ సృష్టి జరిగిందని చెప్పబడగా బ్రహ్మ తేజస్సు కారుడు ఆకాశమంటే

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

'పరబ్రహ్మ పదార్థ'మని నిర్ధారించాడు. సువర్ణకాశములు బంగారు రంగులో ఉన్న గుమ్మడి పండ్ల తోట తన అనుభవంలో ఉనన దానిని తెనుగు భాష పద కవి తీసుకున్నాడు. అలాగే గుమ్మడి కాయ సువర్ణాండమే ఇదీ వేదంలో 'సృష్టి విద్య'లో విషయం. అక్కడ బంగారు గ్రుడ్డు సృష్టి జన్మస్థానం. ఇక్కడ గుమ్మడికాయ ఇది తాను చూసిన వస్తువు. దీనిని సువర్ణాంతానికి చిహ్నంగా జానపద కవి భావించాడు. ఇలాగే సవర జాతిలో ఉన్న 'రమ్మ బమ్మ' కథ కూడా ఇలాంటిదే.

రాయలసీమ ప్రాంతంలో నేను సేకరించిన వీపు రాజు (పోతులయ్య) కథ కూడా కుమారస్వామి జననాన్ని గురించి జానపద భావన చెపుతుంది.

కైలాసంలో పార్వతి ఈశ్వరునితో తనకు బిడ్డ కావాలని కోరిందట. సృష్టిలోని జీవరాశులన్నీ మనవే కదా మనకేలా పిల్లలన్నాడు. కానీ వినలేదు. సరే నీవు భూలోకానికి వెళ్లి ఏటి గట్టున తోట పెంచి, నీ భుజాలు బబ్బలెక్కేంత వరకు దానికి నీళ్లు మోస్తే 'సంతు' లభిస్తుందన్నాడు. ఆమె అలాగే చేస్తుంది. చివరికి దిగులుతో ఏటి గట్టున వుండే ఇసుకలో వ్రేలితో వెలికి తీస్తుండగా రెండు పళ్లు దొరికాయి. అందులో ఒకటి తినింది. రెండవది తినేలోగా ఈశ్వరుడు వచ్చి దానిని తీసుకొని రెండొప్పులు చేసి ఒకటి సముద్రంలోకి ఒకటి గట్టుపైకి విసిరాడు. గట్టుపైకి విసిరిన వప్పలో పాలు కాని ఏడు మంది రాజులు పుట్టారట. సముద్రంలోకి వేసిన వప్పులో రక్తం కారిందట. ఏడు గురు అక్కమ్మ గార్లు పుట్టారట. వీరు పాతాళంలో పడ్డారట. పార్వతి నిండు మంచయింది కను పొద్దులచ్చాయి. కడుపులో వుండే బిడ్డ తల్లితో అమ్మా నేను వీపున రావాలా? యోనిలో రావాలా? అని అడిగి తల్లి వీపున బయటకొచ్చాడట. అందుకే అతనికి వీపు రాజు అన్నారు. తర్వాత ఈశ్వరుడు పాతాళంలో వుండే తన కుమారున్ని బయటికి తీసేందుకే తన జడల్ని నాలుగు దిక్కులకు వదిలాడట. కానీ పాతాళ లోకం వెళ్లిన అతను అక్కమ్మ గార్లు 'సిరిపున్నమాను'కు ఉయ్యాల వేసుకొని ఊగుతున్నారట. శివునికి భారమైంది. బాధను చూడలేక పార్వతి వీపురాజును పాతాళానికి పంపింది. అతడు వారి దగ్గరకెళ్లి 'అక్కయ్యలు' అని పిలిచాడు.

అందరూ ఈగలుగా మారి జడకు వాలి భూలోకాని కొచ్చారు. ఈ అక్కమ్మ గార్లు కోటలో ఉండగా ఒక రోజు గౌరి నోములు చేయాలని కోటకు వీపురాజును కావలి పెట్టి వెళ్లారు. ఈ అదును చూసుకొని 'మరూరి మాలోడు వచ్చి వీపురాజును మభ్యపెట్టి నీకు' మేటి బురుజంత ముద్ద, తాటి మానంత పోతునిస్తాను. కోట తలనిస్తారా అని అడగటం అతడు వప్పుకోటం, కోట కొల్లకొట్టడం జరుగుతుంది. పోతును అడగటం వల్ల 'పోతు రాజు' (పోతులయ్య) అయ్యాడు. వెంటనే అక్కమ్మ గార్లు కని పెట్టి పోతురాజు శాపమిస్తాడు. ఆ శాపం వల్ల ఇప్పటికీ నిదర్శనంగా కొన్ని పల్లెల్లో ఊరి బయట పోతలయ్య గుళ్లు వున్నాయి. ఆ శాపమేమంటే నీవు కోటకు కావలి మరిచి తిండి కోసం శెలవిచ్చావు. నీవు ప్రతి పల్లెలోనూ ఊరబయట ఊరన్న చోటంతా ఊరగాయలుండు అంతేగాక నీవు మన అమ్మకు వీపున పుట్టావు కాబట్టి నీ 'వీపు'కు మాత్రం పూజ ఏడాదికి ఒకసారి పూజ పెట్టి 'వీరగంధం' పూస్తారు అని అన్నారు. ఇదే విధంగా పోత లయ్య గుడి ఊరి బయట ఉండటం. పూజ కూడా అదే విధంగా చేయటం జరుగుతుంది.

జానపదుల పురాణాల్లో మరొక తరగతి పురాణ కథల్లో జానపదులు తమ భావనను ప్రవేశింప జేసి కథల్ని వ్యాఖ్యానించుకోవడం, ఉదాహరణకి వరాహావతార కథ ఇలాంటిదే విష్ణువు శ్రీ రామావతారంలో వాలిని చంపాడు. వాలి కొడుకు అంగదుడికి ఆ కోపం అలాగే ఉండి పోయింది. ఆ కోపాన్ని తీర్చడానికి విష్ణువు పంది రూపంలో అంగదుడికి అడ్డుపడి వాడి చేత దెబ్బలు తింటాడు. అంగదుడు బోయవాడుగా పుట్టాడట శైవ వైష్ణవాల్ని కలిపే కథ. ఈ పురాణాల్లో మరొక తెగ కొన్ని విచిత్ర ప్రశ్నలు వేసుకొని వాటి సమాధానాలు వెతకటం. మొదట అనుములు ఎవరు పండించారు? చారిత్రకంగా ఎవ్వరూ చెప్పలేని

ప్రశ్నలేని ప్రశ్న ఇది. దీనికి సమాధానంగా అనుముల 'బ్రహ్మారెడ్డి' కథ పుట్టింది. బ్రహ్మారెడ్డి పాతాళానికి వెళ్లి అనుములు తైదులు (రాగులు) తెచ్చాడట. ఇది కోస్తా జిల్లాల్లో ప్రచారంలో ఉన్న పురాణగేయం. అలాగే జాతుల పుట్టు పూర్వోత్తరాల్ని గురించి ఇంకా ఎన్నో కథలు ఆయా తెగల్లో ప్రచారాల్లో వున్నాయి. వీటన్నిటా పురాణ లక్షణా లున్నాయి. ఒకో ఇంటి వారికి ఏ ఏ జంతువు, చెట్టు ప్రతీకలవుతాయో (కుల దేవతలు) ఒకో జాతి

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - రామరాజు. బి
2. జానపద నృత్యకళ - డా॥ బిగిచర్ల కృష్ణారెడ్డి
3. తెలుగు వారి జానపద కళా రూపాలు - డా॥ బిగిచర్ల కృష్ణారెడ్డి
4. డా॥ బిగిచర్ల కృష్ణారెడ్డి - జానపద కళా వ్యాసావళి- డా॥ బిగిచర్ల కృష్ణారెడ్డి

❖❖❖

# యం.డి. సౌజన్య నాటికలు - రస పోషణ

- డా॥ బూసి వెంకటస్వామి, శాఖాధిపతి, తెలుగు విభాగం, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు జిల్లా.

"నాటక కళాభ్యుదయంపైనే ఒక జాతి యొక్క ఔన్నత్యం ఆధారపడి ఉంటుందని" విశ్వకవి రవీంద్రుని ఉవాచ ఇది అక్షరాల నిజం. సుమారు 130 సం॥ల సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలుగు నాటకరంగం పరిణామ క్రమంలో ఎన్నో మలుపులు తిరిగి, మరెన్నో మెళకువలను రంగ రించుకొని నిత్య నూతన చైతన్యవంతమైన ప్రదర్శనా ప్రయోగాలతో ముందుకు పయనించి సమాజానికి ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చింది. సందర్భానుగుణంగా, కాలానుగుణంగా మార్పు చెందుతూ పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘిక నాటకాలుగా ప్రదర్శింపబడుతూ వ్యవస్థకు భక్తిని, ముక్తిని, రక్తిని అందించటంతోపాటు ఒక ఆలోచనా శక్తిని నాంది పలికి నవభారత నిర్మాణంలో భాగం పంచుకుంది.

ఆయుధం కన్నా, అణువుకన్నా బలంగా మనిషి ఆలోచనా విధానాన్ని వాడిగా వేడిగా పదును పెట్టడంలో సర్వ కళ సమాహారమైన నాటక ప్రక్రియను మించినట్టి ప్రక్రియ ప్రపంచ సాహిత్యంలోనే లేదు. అందుకే 'కావ్యేషు' నాటకం రమ్యమ్, నాటకం వలె 'నాటిక' కూడ పాశ్చాత్య సాహిత్య ప్రభావం చేత వృద్ధి చెందింది. నాటకం కంటె కొంచెం చిన్నది నాటిక, నాటిక పరిధి చిన్నదైనా రచయిత తాను చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా ప్రతిపాదించడానికి ఈ ప్రక్రియ దోహదకారి అయింది. నాటకకర్తలు నాటకాలతో పాటు నాటికలు రచించి ప్రతిభావంతంగా ప్రదర్శించబడేటట్లు చేసి తెలుగు నేల నాలుగు చెరుగులా రంగస్థలమనే చలువ పందిళ్ళు కప్పారు. ఆ కోవలోనే పేర్కొనదగిన నాటకకర్త యం.డి. నఫీజుద్దీన్. ఈయన కళలకు కాణాచి, ఆంధ్రాప్యారిస్‌గా పిలువబడే తెనాలి గడ్డపై జన్మించారు.

జాతీయ సమైక్యతా సాధనకు సాహిత్యం దోహద పడినంతగా మరేదీ దోహదపడదని నమ్మే నఫీజుద్దీన్ ఇప్పటి వరకు 10 దృశ్యనాటికలు, 6 శ్రవ్య నాటికలు వ్రాశారు.

1968 సంవత్సరంలో జ్ఞానోదయం, శత్రుశేషం వంటి నాటికలు పరిషత్ పోటీలలో ప్రథమ బహుమతులు పొందాయి. విభిన్న ఇతివృత్తాలను ఎన్నుకొని చక్కటి సందేశాన్ని అందించే నాటికలు వ్రాసిన నఫీజుద్దీన్ 1976 నుండి నవలలు వ్రాయడం కోసం తన కలం పేరును యం.డి. సౌజన్యగా మార్చుకున్నారు. కథ, నవల నాటకం, బాలసాహిత్యం, హాస్యరచన మొదలైన సాహిత్య ప్రక్రియలలో నేటికీ సృజనాత్మక రచనలు చేస్తున్నారు.

సౌజన్య తన నాటికల్లో ప్రజల హృదయాలను కదిలించడానికి హృద్యమైన, ఆర్ధ్రమైన కరుణ రసాన్ని చొప్పించడంతోపాటు సమాజంలో ఆధ్యాత్మిక, శాంతి, సౌభ్రాతత్వాలను పెంపొందించడానికి దోహదమయ్యే భక్తి తత్వాన్ని, సమాజ రుగ్మతలను చీల్చిచెండాడి సంఘంలో వేగంగా సంస్కరణ తీసుకురావటానికి తోడ్పడే చురుక్కు మనిపించే హాస్యాన్ని ఆలంబనగా చేసుకున్నారు.

## రస పోషణ :

కావ్య పరమావధి రసము. ఒక కమనీయ కావ్యాన్ని విన్నప్పుడు, ఒక రమణీయ నాట్యాన్ని, నాటకాన్నిగాని చూచినప్పుడు సహృదయుల హృదయంలో ఉదయించే ఆనందమే రసం. అది పాఠకులకులేదా ప్రేక్షకులను మధురానుభూతిని కలిగిస్తుంది. ఆ అనుభూతే నాటకాన్ని పలుమార్లు చూడవలెననే కోరికను కలగజేస్తుంది.

భిన్న, విభిన్న రుచులున్నా ఆబాలగోపాలానికి వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించి నాటకం. నాటకానికి రసం ప్రాణం. నాటకం చూచేటప్పుడు సహృదయుల మనస్సులో

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

రేఖామాత్రంగా విభావ, అనుభావ, సంచారి భావాలు రేకెత్తింపబడి తర్వాత స్పష్టంగా ప్రత్యక్షమై హృదయాన్ని పరవశింపజేసి ప్రకృతిని మరిపింపజేసే అలౌకిక ఆనందమే రసం.

సహృదయుల చేత ఆస్వాదింపబడే ఆనందమే రస మని తెలుస్తుంది. "నహిరసాదృతే కశ్చిదర్థ ప్రవర్తతే". రసము లేకుండా కావ్యార్థమేదీ ప్రయోగింపబడదు. ఒక వేళ ప్రయోగింపబడ్డా అది నీరసకావ్యమై నిర్జీవమై పోతుంది.

'వాక్యం రసాత్మక కావ్యమ్'. రసాత్మకమైన వాక్యము కావ్యము. ఏ కావ్యానికైతే రసం ఆత్మభూతమవుతుందో అనగా సారవంతమైన జీవిత పరమార్థమవుతుందో అది రసాత్మక వాక్యము. అటువంటి రసాత్మ వాక్యమే కావ్య మని చెప్పవచ్చు. రస ఆవిష్కరణకు కారణభూతమైనది కవి యొక్క శైలి కథా గత పాత్రలను, వాటి స్వరూప స్వభావాలను, సొంపైన పదాల పొందిక ద్వారా, సన్నివేశాల కల్పనల ద్వారా, సంభాషణా మూలమున సహృదయ హృదయాలను రంజింపజేయుట, రసోన్ముఖముగ వారిని ప్రయాణింపజేయుట శైలి ప్రత్యేకత.

నాటకానికి ప్రాణంగా భాసించబడేది రసం. కాబట్టి రచయిత విభిన్న దృశ్యాలతో సన్నివేశాలు కల్పించి ఆ సన్నివేశాలకు తగిన పాత్రలను కల్పించి రసాన్ని ఉద్దీపింప జేయాలి. కవి దృష్టిలో రసము ఎంత ప్రధానమో ప్రేక్షకుని దృష్టిలో రసం అంటే ప్రధానం అని మనం గమనించాలి.

భరతుడు తన నాట్యశాస్త్రంలో రసాలు ఎనిమిది అని పేర్కొన్నప్పటికీ నేడు రసాలు తొమ్మిది అని భావింపబడు తున్నాయి.

నవరసాలలో శృంగార, కరుణ రసాలలో ఏది ప్రధాన మైందనే మీమాంస పండిత లోకంలో లేకపోలేదు. ఏది ఏమైనప్పటికీ నాటకంలో ప్రధానంగా శృంగార, కరుణ, వీరరౌద్ర భయానక, భీభత్మ హాస్య రసాలు పోషింపబడ తాయి. సౌజన్య తన నాటికలలో సందరోభచితంగా రసా లను ప్రయోగించారు.

## హాస్య రసం :

నవరసాలలో ఎక్కువ మందిని అలరించేది హాస్యం మాత్రమే.

మామూలుగానైతే శృంగారానికే అగ్రతాంబులము ఇవ్వాలి. ఆ తర్వాతే హాస్యం. అయితే శృంగారం అంటే సరిపడని ఋషిపుంగవులు ఉండవచ్చునేమోగాని హాస్య మంటే పెదవి విరిచే వారెవ్వరూ ఉండరు. కాబట్టి సాహి త్యంలో హాస్యానికే పెద్దపీట వేయాలి.

హాస్యం అనేది రచయిత తన కావ్యాలలో ప్రయోగిం చడం కత్తిమీద సాములాంటిదే. ఏ మాత్రం తూకం తప్పినా అది అపహాస్యమవుతుంది. పాఠకుని నవ్వించ బోయి రచయిత నవ్వుల పాలవుతాడు.

ఎవరినైనా ఏడిపించడం తేలికేగాని నవ్వించడం కష్టం. ఏడ్చినప్పుడు ఎలాగైతే కన్నీరు వస్తుందో ఒక మంచి హాస్య రచన కూడా కంటనీరు తెప్పిస్తుంది. అలా చేయగలిగేదే గొప్ప రచన. ప్రాచీన కవుల నుండి ఆధునికులు వరకు ఎందరో సాహితీవేత్తలు తమ రచనల్లో చక్కని, చిక్కని హాస్యాన్ని పండించి తెలుగు వారిని నోరారా, కడుపారా నవ్వించగలిగారు.

నాటిక రచనకు ప్రాణ ప్రతిష్టపోసేది హాస్యరసమే. శృతిమించకుండా రాగాలు పలికిస్తే సంగీతం కూడా అంతే. రచయిత తాను చెప్పదలుచుకున్న సందేశాన్ని వ్యంగ్య అధిక్షేప రూపంలో హాస్యాన్ని జోడించి చెబుతాడు. అయితే కొన్నిచోట్ల హాస్యమే ప్రధానంగా కన్పిస్తుంది.

నాటికలలో ప్రదర్శించే హాస్యం పాత్ర గత, సన్నివేశగత సంభాషణాగత హాస్యం అని అనేక రకాలు. ఇందులో సన్నివేశగత హాస్యం ఉత్తమమైనది. హాస్యం అనేక రకాలుగా ఉన్నప్పటికీ ప్రేక్షకులకు కొంతసేపు ఆనందాన్ని ఇస్తూ నాటిక దృష్టిపథం నుండి మరలిపోకుండా వారిని కట్టడి చేస్తుంది. రచయితలు చక్కని హాస్యాన్ని పండించి నట్లయితే ఆ నాటిక ఉత్తమోత్తమైనదిగా భావించబడు తుంది. సౌజన్య తన నాటికలలో సన్నివేశాలకు తగినట్లుగా

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

అక్కడక్కడ హాస్యాన్ని ప్రవేశపెట్టారు. వీరు నాటిక ఇతి వృత్తానికిగాని, విషయానికి భంగం లేకుండా రసానంద మైన హాస్యాన్ని పండించారు.

కనకపు సింహాసనమున.... నాటికలో సన్నివేశగత హాస్యం చోటు చేసుకుంది. పోతురాజు ఇంట్లో వంట వాడైన నవాబ్ హైదర్‌జంగ్‌తో గంగడు పోతురాజు గురించి అడిగినప్పుడు.

**గంగడు** : చెబుతావా! మర్యాదగా (కత్తితో బెదిరిస్తాడు)

**నవాబ్** : చెబుతాం! చెబుతా! మాది హయ్యగార్‌కి సిన్మా బొమ్మ దీపలచ్చికి ఖల్పి - హిక్డా హాక్టి సన్మానం హుంది సాబ్.

**గంగడు** : పోతరాజుకు సన్మానమా!

**నవాబ్** : హది సన్మానం పైకి హీవ్వాళా మది హయ్య గార్కీ డబ్బూ దస్కం దక్షిణా తాంబూలం సది వింపుల్ హుంటైసాబ్.

**గంగడు** : ఇది సన్మానం అంటే

**నవాబ్** : ఔను సర్కార్ మాది హయ్యగార్ మీద హేన్గూ హెక్కుద్దీ హివ్వాళ

**గంగడు** : ఏమిటీ! మీ అయ్యగారి మీద ఏనుగు ఎక్కుద్దా!

అన్నప్పుడు నవ్వని ప్రేక్షకుడు ఉండడు. మరొకచోట పోతురాజు తనకు జరగబోయే సన్మానం గూర్చి ఆలోచిస్తూ అక్కడ సభలో తాను ఎలా మాట్లాడాలో రిహార్సల్స్ చేస్తూ ఉంటాడు. అటువంటి సమయంలో తన వంటివాడు నవాబ్‌కి రిహార్సల్స్ కాగితం అందించి 'నట్టు' పడ్డప్పుడు చెప్పమని తను మాట్లాడటానికి ప్రయత్నిస్తాడు. ఆ సమ యంలో నవాబ్ పోతురాజుకు కూర గరిటెను అందించి ఇది స్పీకర్‌గా భావించి చెప్పమన్నప్పుడు దానిని అందు కున్న పోతురాజు -

**పోతురాజు** : చోదర చోదరీమణులకు, చభాచతులకు, వందనాలు. ఈ దినం నా జీవితంలో పెద్ద దినం. మన పాత పెజా నాయకులు గ్యాందీపంతులు, నెవ్రి - బోచు. పొట్టేలు - పెచోదు - చాత్తర్లు - పొట్టి చీరాములు ఎంతో చాంతియుతంగా తెల్లల్ల డొక్కచించి డోలుకట్టి వాయించి ఆళ్ళని సాగనంపారు. ఆసంటి - అసంటి దేశం మనదేశం ఎక్కడ్రా నూచూచేది దిక్కుమాలిన సన్యాసి (నవా బును కర్రతో పొడుస్తాడు)

**నవాబ్** : అబ్బా.... సచ్చాం.... ఆ.... ఆ.... అసమంటి మడుసుల్

**పోతురాజు** : అసుమంటి మడుసుల్ మనదేశంలో పుట్ట మట్టి

**నవాబ్** : పుట్టమట్టి కాదు సార్ ఉన్నమట్టి హనీ హుందీ

**పోతురాజు** : ఏదో.... ఒక మట్టి.... పెజలారా మీరు గమ్మున కూకోవాల ఇప్పుడు మన పద్మ బూసన దీపలచ్చిగారు కండకండాంతరాల్లో తమ డ్యాన్సు పోగ్రాములతో మన భారత చంచ్కృతి యొక్క ఓనత్యం ఎట్టా చాటారో పెసవిస్తార్.

**నవాబ్** : హేమ్టీ హింతమంతి మడుసుల్లో ప్రస విస్తార్

అన్న సన్నివేశంలో చక్కని హాస్యం ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుంది. నాటిక ఆద్యంతం ఇటువంటి సన్నివేశాలే ప్రేక్షకులకు కలకాలం గుర్తు ఉండేటట్లు చేస్తాయి.

అల్లిబిల్లి అప్పారావు నాటికలో బ్యాంక్ మేనేజర్ పశు పతికి ఇంట్లో భార్య నుండి ఎదురయ్యే సమస్యలు, కూతురి పెండ్లి సమస్య రెండూ కలవరపెడతాయి. ఆ సమయంలో గుమస్తా అప్పారావు మేనేజర్ పశుపతి చేత ఒక నాటకం ఆడిస్తాయి. అతనికి యాక్సిడెంట్ జరిగినట్లు దాని వలన మతి తప్పి చెముడు కూడా వచ్చినట్లు మేనే జర్ భార్యకు చెబుతాడు.

భర్తకు జరిగిన యాక్సిడెంట్ గూర్చి అతని భార్య ఆండాళ్ లబోదిబోమంటూ భర్తను పలకరించడానికి ప్రయత్నిస్తూ

**ఆండాళ్ :** ఏవండీ! ఇవెన్ని (రెండు వేళ్ళు చూపిస్తుంది)

**పశుపతి :** రెండు

**ఆండాళ్ :** మతిపోలేదు. అదృష్టవంతురాలిని. ఏవండీ ఇవాళ పండుగకు నాకోసం మైసూర్ సిల్క్ చీర ప్యాక్ చేసి తెస్తానన్నారుగా!

**పశుపతి :** ఏమిటీ! మైసూర్ పాక్ తెస్తానన్నానా! డైటింగ్ చేస్తూ స్వీట్స్ తినవద్దన్నారుగా డాక్టర్.

**ఆండాళ్ :** అబ్బా.... మైసూర్ సిల్క్ చీర.... డిజైన్.... చక్కగా వడియాలు పేర్చిన డిజైన్ తెస్తానన్నారుగా.

**పశుపతి :** ఏమిటీ చేతులకు కడియాలా! ఇంకానయం అందెలేమీ వద్దా!

**ఆండాళ్ :** నా బొంద... గాజు పోగులకు గతిలేదు కానీ

**పశుపతి :** ఏమిటీ నాకు మతి లేదా! అను.... అను.... నాకర్మ

**ఆండాళ్ :** అయ్యో! అయ్యో! అసలే మతిలేని మనిషిని ఏడుస్తుంటే ఈ బస్సు యాక్సిడెంట్‌తో చెవిటి పీనుగయ్యాడే!

**పశుపతి :** ఏమిటి ఏనుగునయ్యానా! అనూ.... నీ నోటికి అడ్డా.... ఆపా.

**ఆండాళ్ :** అబ్బా ఆపండి మీకు దండం పెడతాను.

**పశుపతి :** ఏమిటీ! అన్నం పెడతావా! ఏమి కూరలు

**ఆండాళ్ :** నా బొంద.... నా శార్ధం.... నా పిండాకూడు

అన్న సన్నివేశంలో ప్రేక్షకులకు కంటనీరు తెప్పించే విధంగా హాస్యం పోషింపబడింది.'' ఆండాళ్‌కి తగిన బుద్ధి వచ్చిందనే స్పృహ పాఠకులకు కలుగుతుంది. ఈ సన్నివేశం ఒక ప్రక్క హాస్యాన్ని కురిపిస్తూనే మరొక ప్రక్క ప్రబోధాన్ని కల్గజేస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

దేవుడూ నీకు దిక్కెవ్వరు నాటికలో పకీరయ్య పాత్ర ద్వారా ఎక్కువ హాస్యం ఉద్భవిస్తుంది. ''ఏదీ! సుక్కేసు కోవాలా! ఓ రూపాయి యిప్పించు సూద్దాం'' అని మద్యం కోసం దేవున్నే డబ్బులడగటం ప్రేక్షకులకు పాఠకులకు నవ్వు తెప్పిస్తుంది.

మరొక సందర్భంలో అవతారం ఆచారి ఇద్దరూ విగ్రహం ఆచూకీ చెప్పమని పకీరయ్యను చేయి చేసుకుంటారు. ఆ సందర్భంలో ఒకరిని తిట్టుకుంటూ, విమర్శించుకుంటూ ప్రవర్తించే విధానం పాఠకులకు నవ్వు తెప్పిస్తుంది.

**ఆచారి :** ఎందుకు నాయనా! దేవుడికి నేవేద్యం కూడా మిగలకుండా మింగటానికా!

**అవతారం :** ఏమిటి! భక్తులు తెచ్చిన కొబ్బరి చిప్పలు దొంగచాటుగా కోనయ్య హోటల్లో చట్నీకి అమ్ముకునే వాడివి నువ్వా నాకు చెప్పేది.

**ఆచారి :** ఏమిటి! కోనయ్య హోటల్‌లో చట్నీకి అమ్ముకుంటానా! నువ్వు మాత్రం తక్కువ నాయనా! దీపారాధన ప్రమిదల్లో నూనె.... పెళ్ళాం పురుడని, తాతయ్య తద్దినమని డబ్బాలు.... డబ్బాలు పట్టించుకువెళ్ళావే సిగ్గులేదూ!

**దయానిధి:** ఇదిగో ఆచారి.... ఇదిగో అవతారం.

**అవతారం :** లేకపోతే చూడండి. తెల్లారి లేస్తే నెత్తిన శఠగోపం పెట్టే వెధవ, వీడా.... నన్ను దెప్పి పొడిచేదీ (కోపంగా గుడ్లురిమాడు)

**ఆచారి :** నేనేదన్నా పెట్టి అణ.... అర్ధణా పుచ్చుకుంటాను. నువ్వు తెల్లారి లేస్తే పెట్టేది భస్మాసుర హస్తమేగా!

అని విమర్శించుకోవటం ప్రేక్షకులకు ఆనందంతో పాటు ఆలోచన కలుగుతుంది. ఆచారి, అవతారం లాంటి వ్యక్తుల మనస్తత్వం ఏ పాటిదో అంచనా వేసుకొని అటువంటి వారికి దూరంగా మెలగాలనే సందేశం వ్యక్తం అవుతుంది.

అదేవిధంగా హాస్యానికి ఒక ప్రత్యేకత ఉంది. హాస్యం బుద్ధి కౌశలానికి పదును పెడుతుంది. మనస్సును రంజింపజేస్తుంది. మానసిక ఉల్లాసాన్ని ఇస్తుంది. మానవ జీవితంలోని వక్రతను, లోపాలను అది విశ్లేషించి చూపి

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

మనిషిని సంస్కరిస్తుంది. విలక్షణను అర్థం చేసుకునే శక్తిని ప్రసాదిస్తుంది. ఇటువంటి లక్షణాలన్నింటిని ఆపాదించు కొని సౌజన్య నాటికల్లో హాస్యం పరవళ్లు త్రొక్కింది.

## కరుణ రసం :

ఏకోరసః కరుణ ఏవ అని ఉత్తర రామ చరిత్రలో భవ భూతి కరుణ ఒక్కటే రసమని మిగిలినది దీనిని ఆశ్రయిం చుకొని ఉంటాయని పేర్కొన్నాడు. దీనిని నిజం చేస్తూ వాల్మీకి మహర్షి హృద్యమైన కావ్యాన్ని రచించాడు. అందుకే రసములన్నింటిలో మధుర్యాతిశయముచే హృదయం ద్రవీకరణమును కలిగించి ఆనంద పారవశ్య మును గొలుపుటలో కరుణమునకు గల శక్తి తక్కిన రసములకు లేదనుట సర్వధా నిజము అని తెలియ జేయటం జరిగింది.

మనోదోషశుద్ధికి కరుణ రసము ఉపయుక్తమని రాయప్రోలు వారు భావించినట్లు సి.నా.రె. పేర్కొన్నారు.

ఆధునిక నాగరికతా సమాజంలో కలుషితమవుతున్న ప్రజల మనుషులను ఆర్ద్రంగా కదిలించి వారిలోని దోషా లను తొలగించి ఉన్నతమైన వ్యక్తిత్వం కలవారిగా తీర్చి దిద్దగలిగేది కరుణ రసమే. అందుకే యం.డి. సౌజన్య తన నాటికల్లో కరుణరసాన్ని ప్రవేశపెట్టి ప్రేక్షకుల హృద యాలను కదిలించగలిగారు.

దేవుడూ! నీకు దిక్కెవరు అనే నాటికలో గుడి వాచ్‌మెన్ పకీరయ్య భార్య చనిపోయి పిల్లల్ని పోషించుకోవటానికి అష్టకష్టాలు పడుతున్న సమయంలో గుడి అధికారి అవ తారం, గుడి ట్రస్టీ దయానిధి కలసి తాము చెప్పినపని చేయకపోతే అతనిపై పోలీసుకేసు బనాయిస్తామని బెదిరిస్తారు.

పకీరయ్యను అవతారం గుడిలో మద్యం సేవించమని బలవంతం చేస్తుంటే పకీరయ్య నిరాకరిస్తూ

పకీరయ్య : వద్దు సామీ! బుద్ధి గడ్డితిని - ఒకే ఒక మారి తాగి ఆ గర్భగుడికాడ పడుకుండా.... ఆ పాపానికి ఆరోజే అక్కడే నాలచ్చిని ఎవరో గోరంగా పంపారు సామీ! -

అంటూ వ్యతిరేకిస్తాడు. అప్పటి దాకా పకీరయ్య భార్య చనిపోయిందని మాత్రమే తెలిసిన ప్రేక్షకుడికి హత్యగా వింపబడిందన్న విషయం తెలుస్తుంది. ఆ సంఘటన ద్వారా అప్పుడు పకీరయ్యతో పాటు ప్రేక్షకుడు కూడా విషాదానికి లోనవుతాడు.

ఈ సన్నివేశంలో కరుణ రసాన్ని ఆవిష్కరింపజేస్తాడు రచయిత. అంతేగాదు బాధితుడైన పకీరయ్యను అవ తారం దయానిధి విగ్రహం కోసం కర్రలతో అమానుషంగా కొట్టడం, ఆచారి పకీరయ్య మీద కిరసనాయలు పోసి అగ్గిపుల్ల వేసే ప్రయత్నం మొదలగు ఎన్నో సంఘటనలు కూడా కరుష రసానికి ఆలంబనగా ఉన్నాయి.

శత్రుశేషం నాటికలో రాజ్యకాంక్షతో స్వంత పినతండ్రే తనను తుదముట్టించడానికి ప్రయత్నిస్తున్నాడని యువ రాజు తెలుసుకొని నిర్వేదంతో కూడిన నిర్లిప్తానికి గురి అవుతాడు. ఆ సమయంలో అతని నాడిని పరీక్షించిన రాజవైద్య శిఖామణి మందు ఇవ్వవలసిన చేతితో కాల కూట విషాన్ని అందించి శత్రువుల కుర కత్తులకు మీ శరీరం చిన్నాభిన్నం కావటం కంటే ఈ విష సహాయాన్ని పొందమని చెప్పినప్పుడు ఎటువంటి ప్రేక్షకుడునైనా కంట నీరు తెప్పించక మానదు. తనకు మరణం తొందరగా వస్తే బాగుండునని యువరాజు పలికే మాటల్లో కరుణ రసం చిప్పరిల్లుతుంది.

అదేవిధంగా దేశం కోసం, కనకపు సింహాసనమున...., గురుగేవోభవ మొదలైన నాటికలలో కరుణ రసం ద్వేదేప మానంగా ప్రకాశిస్తుంది. సౌజన్య నాటికల్లో హాస్యమే గాకుండా భయానిక, రౌద్ర, అద్భుత, కరుణ రసాలు పోషింపబడి ప్రేక్షకులకు రసానందాన్ని కలగజేశాయి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక - ఫిబ్రవరి 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC Approved Journal No. 42500

# భానుమతీ రామకృష్ణ గారి అత్తగారి కథలు - హాస్యం

- డాక్టర్ వై. శ్రీలత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బంటుమిల్లి, కృష్ణా జిల్లా.

ఆధునిక తెలుగు సాహిత్యంలో నాటి నుండి నేటి వరకు ఎన్నో ప్రక్రియలు ప్రవేశించి భాషను, సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. అందులో కథ అత్యంత ప్రసిద్ధ మైన వచన సాహిత్య ప్రక్రియ. ఎందరో రచయితలు, రచయిత్రులు తమ కథాకథన కౌశలంతో సామాజిక జన జీవన చిత్రణ చేస్తూ తమ ఉనికిని సుస్థిరం చేసుకుంటూ, భావితరాల వారికి దిశానిర్దేశం చేస్తున్నారు.

సమాజం భూత, వర్తమాన, భవిష్యత్ సంఘటనలకు ప్రతిరూపం. అలాంటి సమాజంలో జరిగే పరిణామాలకు సాహిత్యం నిలువుటద్దం. మనుషుల్లోని భావాలకు రూప కల్పన కథాసాహిత్యమైతే, మానవ మనుగడను ప్రయోగ శాలగా మార్చుకొని చేసే సమాజ రచయితలుగా కథా రచయితలు అభినందనీయులు. అందుకే కథ కూడా అనేక శాఖోపశాఖలుగా విస్తరిల్లింది. వందేళ్ల వయస్సు దాటిన తెలుగు కథను పరిశీలిస్తే కథకులు, కథల్లో వచ్చిన మార్పు తెలుస్తుంది.

తెలుగు సాహిత్యంలో వైవిధ్యమైన కథలకు, కథా రచయితలకు కొదవలేదు. ఎన్నో రకాల వస్తువులతో, నవ రసాలతో కూడిన కథలు వచ్చాయి. నవరసాల్లో రెండవ ప్రాధాన్యం కలిగిన హాస్యం నేపథ్యంగా వచ్చిన కథలెన్నో ఉన్నాయి. ఇతివృత్తంలో, పాత్ర చిత్రణలో, సన్నివేశ కల్పనలో, సంభాషణల్లో హాస్యం నిండిన కథలే హాస్య కథలు. నవ్వడం ఎంత సులువో నవ్వించడం అంత కష్టమని హాస్య కథల్ని పరిశీలిస్తే అర్థమవుతుంది.

తెలుగు సాహిత్యంలో కలకాలం నిలిచిపోయే హాస్య పాత్రలనగానే గురజాడ 'గిరీశం', చిలకమర్తి 'గణపతి', మొక్కపాటి 'బారిష్టరు పార్వతీశం', మునిమాణిక్యం 'కాంతం', బాపిరాజు 'కోణంగి' మొదలైన పాత్రలతో పాటు గుర్తొచ్చే మరొక ముఖ్య పాత్ర భానుమతీ రామకృష్ణ గారు సృష్టించిన అత్తగారు.

భానుమతీ రామకృష్ణ గారు నటన, దర్శకత్వం, సంగీతం, చిత్రలేఖనం వంటి వివిధ రంగాలలో బహు ముఖ ప్రజ్ఞాశాలి. వీటితో పాటు రచనలోనూ తన పాండి త్యాన్ని నిరూపించుకున్నారనడానికి నిదర్శనం ఆవిడ రచించిన అత్తగారి కథలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించడమే. హాస్యానికి పెద్దపీట వేసి రచనలు చేసిన రచయితుల్లో భానుమతీ రామకృష్ణ గారిది ప్రత్యేక స్థానం. హాస్యం ప్రధానంగా ఆవిడ రచిం చిన అత్తగారి కథలు తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని సంపాదించాయి.

అత్తగారి కథలు మూడు భాగాలు. అత్తగారి కథలు 1వ భాగం, అత్తగారి కథలు 2వ భాగం, అత్తగారూ - నక్సలైట్లు మూడవ భాగం. ఈ కథలకు రాజమన్నారు గారు ముందుమాట వ్రాస్తూ " సజీవమైన పాత్రను సృష్టిం చడం, ఆ పాత్ర యొక్క ప్రత్యేక వ్యక్తిత్వాన్ని చిత్రించడం సులభంగా సాధ్యం కాదు. ప్రబంధ నాయికా నాయకులు అచ్చుబొమ్మలు. ప్రతీ వార, మాస పత్రికల్లో పాత్రలు నూటికి తొంభైకి మించి కీలుబొమ్మలు. వాటిలో జీవ గుణం ఉండదు. మన సాహిత్యంలో వాస్తవికత అరుదు. స్వానుభవంకన్న కవి సమయాల మీదా, లక్షణ సూత్రాల మీద నిర్మింపబడిన మన పూర్వ కావ్యాల్లో వాస్తవికతకు ప్రాధాన్యం లేదు. ఆధునిక రచయితలకు పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల వాస్తవికత మీద అభిమానం కలి గింది. కానీ ఏ కొందరో తప్ప ఆ విషయంలో విజయం సాధించలేదు. ఇంక హాస్యరస పోషణంటే అది మరీ అవినీతి, అపనింద, అసూయ, అసహ్యకరమైన పద ప్రేలా పన లేకుండా చక్కగా గిలిగింతలు పెడుతూ సృష్టించినవి బహు తక్కువ. అందులో భానుమతి "అత్తగారు" పాత్ర ఒకటి" అంటారు. ఈ మాటల ద్వారా అత్తగారి పాత్ర ఈ కథల్లో ఎలా తీర్చిదిద్దబడిందో అర్థం చేసుకోవచ్చు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

భానుమతిగారి అత్తగారు తెలుగు ప్రజల హృదయాల్లో ఒక సజీవ మూర్తిగా, ప్రత్యేక వ్యక్తిగా మిగలడానికి కారణం ఆ పాత్రలో కనిపించే వాస్తవికత, సమగ్రత, అందులో తొణికిసలాడే జీవం. ఈ కథలు చదువుతుంటే అత్తగారి పాత్ర భానుమతి గారి అత్తగారేమో అనిపిస్తుంది. ఇందుకు సమాధానంగా ''.... నాకు అన్ని రసాల్లోకి ఎక్కువ ఇష్టమైన హాస్య రసంతో నేను అత్తగారి కథలు రాసాను. నా కథలకు ఇన్స్పిరేషన్ మా అత్తగారే కానీ, ఇన్సిడెంట్స్ నా కల్పితాలు'' అంటారు రచయిత్రి. అత్తగారి పాత్రలో కనిపించే అమాయకత్వం, తెలిసీ తెలియని తనం, చాదస్తం, మేక పోతు గాంభీర్యం, జాణతనం, తన పెద్దరికం పట్ల వ్యామోహం, వంటగది మీద అధికారం, గౌరవం పొందాలనే కాంక్ష, సనాతన ఆచారాల పట్ల నిష్ఠ, అనుమానం, అపనమ్మకం, ప్రేమ, ఉదాసీనత, పరిజ్ఞానం... ఇలాంటి లక్షణాలలో ఏదో ఒక లక్షణం ప్రతీ అత్తగారిలో ఉండటమే ఈ అత్తగారి పట్ల తెలుగు వారికి అవ్యాజమైన అభిమానం కలగడానికి కారణం కావచ్చు.

అత్తగారి పరిజ్ఞానం గొప్పది. ఎంతంటే ఆవకాయ, నిమ్మకాయ పచ్చడి ఒకేరకంగా పెట్టేయచ్చనేంత (అత్తగారూ ఆవకాయా కథ). ఆవకాయెంతో నిమ్మకాయంతే, ఆవెంతో గేదంతే అనే అత్తగారి పరిజ్ఞానానికి నవ్వరాని వారెవరుంటారు? ఆమెకు తను చేసే ప్రతీ పనిపట్ల తనకెంతో నమ్మకం. అందుకే అరటికాయ పొడి చేసేటప్పుడు అందులో బొగ్గులపొడి కలిసినా, వడియాలు పెట్టినప్పుడు అవి తగిలి పక్కింటి పిల్లాడికి బొప్పికట్టి రక్తం వచ్చినా అవన్నీ తోసిరాజని ఎప్పటికప్పుడు కొత్త ప్రయత్నాలు చేస్తుంది (అత్తగారూ అరటికాయ పొడి కథ). ఏదైనా పొరపాటు జరిగితే అ తప్పు మరొకరిమీద తోసేసి చల్లగా తప్పుకునే జాణతనపు హాస్యం పాఠకులకు నవ్వుల విందును ఇస్తుంది.

అత్తగారూ ఓటు కథలో వాళ్లింట్లో పనిచేసే పనివాళ్లందరూ తలా ఒక పార్టీకి అభిమానులు. ఎవరికి వారే తమ పార్టీకే ఓటు వేయమని అత్తగారిని కోరతారు. ఓటువేసిన రోజు పనివాళ్లందరూ ఎవరికివారు అత్తగారిని ఏ పార్టీకి ఓటు వేసారని అడుగుతారు. అప్పుడు అత్తగారు ఎవరడిగితే వారి పార్టీకే ఓటు వేసానని చెబుతుంది. తర్వాత అందరూ కలిసి ఒకేసారి అసలు ఓటెవరికి వేసారని అడుగుతారు. అప్పుడామె ''అట్ల అడగండి చెప్తాను. పిచ్చివెధవల్లారా! మీకొకటి చెప్పి నేనింకొకటి చేస్తానట్రా..... నీకు చెప్పినట్లు నాకు ఇష్టమైన ఆవుదూడకు, మనకు ప్రత్యక్ష దైవ సూర్యుడికి వేశాను. నేను లోపలికి పోతుంటే అమ్మా! నక్షత్రానికే ఓటు వెయ్యండన్నాడొక ముసలి ఆచార్లు. అందుకని చివర్లో ఆ నక్షత్రం మీదకూడా ఓ ముద్రపడేసి చక్కా వచ్చాను'' అని అంటుంది. అన్ని గుర్తులమీద ఓటేస్తే ఓటు చెల్లదన్న విషయం తెలియని అత్తగారి అమాయకత్వానికి అందరూ పగలబడి నవ్వుతారు. అలా ఆమె తన అమాయకత్వంతో అందరికీ సమన్యాయం చెయ్యాలనుకొని అభాసుపాలవుతుంది.

అత్తగారి ప్రపంచం చాలా చిన్నది. అందులో ఆమెకు తెలిసిందే జ్ఞానం. అంతకు మించిన జ్ఞానాన్ని ఆమె అంగీకరించదు. ఎప్పుడైనా తన కొడుకో, మనవడో చెబితే మాత్రం కొద్దిగా అంగీకరిస్తుంది. ఆమెకు తన పుట్టింటి వారంటే అమితమైన ప్రేమ. ఆవిడ దృష్టిలో బస్సు, వ్యాను రెండూ ఒకటే. దొంగలు నల్లగా మీసాలతో ఉంటారు. సవతులంటే పోట్లాడుకోవలసిందే. ఐదు మానికల పంచితం ఇచ్చే ఆవును నమ్ముతుంది కానీ ఐదు మానికల పాలిచ్చే జెర్సీ ఆవును నమ్మదు. ఇలాంటి అత్తగారి అభిప్రాయాలు, నమ్మకాలు, సిద్ధాంతాలు ఆద్యంతం పాఠకులను నవ్వుల్లో ముంచెత్తుతాయి.

అత్తగారి కథలకు కొడవటిగంటివారు వ్రాసిన ముందుమాటల్లో...''మనస్థితికీ, వాతావరణానికి మధ్య అసాంగత్యం ఉండి, దాని ఫలితంగా ఘర్షణ సాగినప్పుడే హాస్యం ఉత్పత్తి అవుతుంద''ని అంటారు. ఈ కథల్లో అత్తగారికి జరిగేది అదే. పూలు, పళ్ళు, టెంకాయ... ఆవుకోసం సిద్ధం చేస్తే ఇంటికి ఆచ్చోసిన ఆంబోతు వస్తుంది (అత్తగారూ - ఆవు నంబరు: 23). వంటకాలు సిద్ధం చేసుకొని

కూతురు కోసం కారు పంపితే కారులో పెళ్లివారింటి విధవ రాలైన వంటావిడ వస్తుంది. నక్సలైట్లు పారిపోయి మద్రాసు వచ్చారని పేపర్లో చదివి గూర్ఖాతో ఎవర్నీ రాని యవద్దని చెప్పడంతో పాపం బంధువులూ, ఆత్మీయులూ అవమానపడి తిట్టి వెళ్తే నిజంగానే పారిపోయిన దొంగలు మారువేషాల్లో చుట్టాలమని నమ్మించి ఇంట్లో తిష్ట వేయడం (అత్తగారూ నక్సలైట్లు).... ఇవన్నీ చదువుతుంటే పగలబడి నవ్వుకుంటూనే 'పాపం అత్తగారు' అని అన కుండా పాఠకులుండలేరు. అదే భానుమతిగారు సృష్టించిన అపూర్వ హాస్యం. అందులో వక్రతకు, వికటత్వానికి తావు లేదు. నవ్వుతో పాటు అయ్యో అనిపించేదే గొప్ప హాస్య మని ఈ కథలు నిరూపిస్తాయి.

అత్తగారికి ఈ కథల్లో కొన్ని సరదాలు కూడా ఉన్నాయి. అందులో ఒకటి పంచాంగాలు చూసేప్పుడు పాతవి, కొత్తవి కలిపి తిరగేయడం. ఒక్కోసారి తన మతిమరుపుతో పోయిన సంవత్సరానిదో, నెలదో పంచాంగం తిరగేసి ఏకాదశి అనుకొని ఏ షష్టినాడో ఉపవాసం ఉంటుంది. పక్కింటావిడ వాళ్ల పిల్లాడి అక్షరాభ్యాసానికి ముహూర్తం అడిగితే దశమి అనుకొని అష్టమినాడు మంచి వర్జ్యం ఘడియల్లో అక్షరాభ్యాసం చేయిస్తుంది. ఇక్కడ సన్ని వేశాలు, మాటల వర్ణనల్లో కనిపించే వ్యంగ్యం కారణంగా అందులోని అర్థం మనకు ఆనందాన్నిస్తుంది. అత్తగారికి పెళ్ళిళ్ళు కుదర్చడమన్నా కూడా మహా సరదా (అత్తగారూ కూర్మావతారం). అరవీర భయంకరంగా, కోరల్లాంటి పళ్ళు, మిడిగుడ్లుకల లక్ష్మీనరసింహమ్మకు, వెంకటేశం అనే అనాకారికి పెళ్ళిళ్ళు కుదర్చడంలో వర్ణనలు కడుపుబ్బా నవ్విస్తాయి. పెళ్లికూతుర్ని పాతనగలతో అలంక రించాలని అత్తగారు ప్రయత్నించే సందర్భాన్ని భానుమతి గారు ఇలా వర్ణిస్తారు...'' వడ్డాణం పెట్టడానికి పెళ్ళి కూతురు నడుం కోసం వెతికాం చిక్కలా. పిల్లను ఒక్కసారి నిలువునా చూసి మధ్యభాగం నడుం అని తేల్చి వడ్డాణం తగిలించబోయాం. సగం చుట్టుకు కూడా రాలేదు వడ్డాణం. మెళ్ళో గొలుసు భూగోళంలా ఉన్న పిల్ల తల నుండి దిగి మెడదాకా వెళ్ళలేదు. మధ్యలోనే స్టకప్ అయింది. ఇంక వంకీలు ముంజేయి దాటలేదు. అత్త గారు నిరుత్సాహపడిపోయారు..." ఈ దృశ్యం ఊహించు కుంటే చాలు... కార్టూన్ల మాదిరిగా మానసికోల్లోసాన్ని కలిగిస్తాయి.

అత్తగారి కథల్లో ప్రతీ సన్నివేశం కూడా నవ్వు పుట్టిం చేదే. అవన్నీ అత్తగారినే కేంద్రీకృతం చేసుకొని ఉంటాయి. అత్తగారు తిరుపతి ప్రయాణంలో చెల్లెలి కోడలితో రాత్రంతా గొడవ పెట్టుకొని, తెల్లారగానే ముసిముసి నవ్వుల్తో మాటలు కలుపుతుంది, తాను ఎన్ని అరటి పళ్ళు తిన్నదో ఎవరికీ తెలియకుండా ఉండేందుకు తొక్కలు చాపకిందకు తోసేస్తుంది. ఇక ఆవిడ వంట చేసుకొని వీపు గోడకు తిప్పి భోజనానికి కూర్చుంటే సాక్షాత్తూ భగవంతుడే స్థంభంలో నరసింహుడిలా ఆ గోడలో ప్రత్యక్షమై చూస్తే తప్ప ఆవిడ ఏం తింటుందో ఎవరికీ అర్థం కాదు. ఈనుతున్న గొడ్డు చుట్టూ... భూ ప్రదక్షణమంత పుణ్యం అంటూ ప్రదక్షిణ చెయ్యబోయి గేదె విసుగుతో తన్నగానే పాచిపట్టిన నీళ్ళతొట్లో పడి ఒక పట్టాన ఆవిడ బయటకు రాలేకపోతుంది. అప్పుడు, "అమ్మగారు పడతారని తెలిస్తే తొట్టి శుభ్రంగా కడిగే వాడిని'' అంటూ పరమ విధేయంగా మాట్లాడే పనివాడి మాటలు భానుమతిగారి హాస్య సృష్టికి పరాకాష్ట. ఇలా కథలో, పాత్రలో మిళితమైన హాస్యం అత్తగారిని మన మనసుల్లో సజీవంగా ఉంచింది.

ఈ కథల్లో కనిపించే కోడలి గురించి కూడా చెప్పు కోవాలి. ఈ పాత్ర అత్తగారిమీద భక్తి, శ్రద్ధ, గౌరవం కలిగి అత్తగారితో సమాంతర పాత్రగా కనిపిస్తుంది. ప్రథమ పురుషలో కోడలు చెప్పే ఈ కథలు ఎంతో తెలివిగా అత్తగారి ప్రత్యేకతలను తెలుపుతాయి. ఇక్కడ అత్తగారిలో లోపాలు, దోషాలు ఎంచి ఎద్దేవా చేయకుండా, వాటిని నవ్వుకుంటూనే మార్చాలని చేసే ప్రయత్నం ద్వారా ఉత్తమ హాస్యాన్ని రచయిత్రి అందించారు. తమ లోపాలు ఎదుటివారు ఎత్తిచూపకముందే తామే గ్రహించుకుని,

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

నవ్వుతూ బైటపెట్టి నవ్వుకోవడం ఆత్మపరిశోధనాపూర్వక హాస్యం. ఇటువంటి హాస్యం కూడా ఈ కథల్లో కని పిస్తుంది. ఇతరుల్లో లోపాలను కనిపెట్టి వాటిని ఏవగించు కోవడం కంటే, వాటిని తేలికగా చూసి, ఆనందించి అంద రికీ ఆమోదయోగ్యమైన హాస్యంతో ఇతరుల పట్ల సాను భూతి పెంచడం అనే పద్ధతినే భానుమతిగారు ఈ కథల్లో ఎంచుకున్నారనిపిస్తుంది. అందుకే అత్తగారంటే మనకి వల్లమాలిన ప్రేమాభిమానాలు ఏర్పడి ఉంటాయి.

భానుమతి గారి అత్తగారి పాత్ర కృతకంగా, అతికించిన బొమ్మలా కనిపించకపోవడానికి కారణం ఆవిడ రచనా పాటవమే అని చెప్పవచ్చు. అత్తగారిని ముఖ్యపాత్రగా చేసుకొని, హాస్యంతో అలంకరించి, ఎగువ మధ్యతరగతి వాతావరణాన్ని, పాతకాలపు తెలుగింటి గృహిణుల మనస్త త్వాన్ని, అమాయకత్వాన్ని, అలవాట్లను, ఒకనాటి తెలుగు దేశ చరిత్రను, సంస్కృతిని కూడా అక్షరబద్ధం చేసి మన కందించారు. అందుకు ఉదాహరణగా... వాస్తును అను సరించి కట్టిన ఇల్లు, పనివాళ్లు, గోల్కొండ వ్యాపారుల పద్ధతి, ఆచారం, మడి పేరుతో జరిగే అల్లరి, వంటలు, శుభకార్యాలు, బంధాలు, అనుబంధాలు, ఆప్యాయతలు, అనుమానాలు... వీటన్నింటినీ నవ్వించేలా వర్ణిస్తూ మన దైన పద్ధతులు ఎలా ఉంటాయో మనకందించారు. అందుకే ఈ కథల్లో ఏ పాత్రచూసినా మనింటికి, మన వాళ్ళకు సంబంధించిగా కనిపిస్తుంది. ఇటువంటి ఆవిష్క రణ భానుమతిగారికే చెల్లింది. ఒక సందర్భంలో భాను మతి గారు ఇలా చెప్పుకున్నారు. "నేను గొప్పదాన్ని కాబట్టి, గొప్పగానే పనులు చేస్తాను, గొప్పగానే రాస్తాను" ఈ మాటలు ఆవిడ ఆత్మస్థైర్యానికి నిదర్శనం. అత్తగారి కథలు ఈ మాటల్ని నూటికి నూరుపాళ్లు నిజం చేసాయి.

**ఆధార గ్రంథాలు :**

1. అత్తగారి కథలు - మానస పబ్లికేషన్స్ 2004
2. కౌముది వెబ్ మాసపత్రిక
3. భానుమతీ రామకృష్ణ వికీపీడియా
4. నాలో నేను : భానుమతీ రామకృష్ణ - మానస పబ్లికేషన్స్ 2004

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

Chairman of the Seminar
**Dr. T. Patanjali**
Principal

Convenor
**Dr. S. Baby Ramani**
Head of the Department, Telugu

**Organising Committee:**
Sri Vinayaka Kumar, Vice Principal
Sri Y. Ramesh Babu, Asst Prof. in Zoology
Dr. S. P. Krishaveni, Asst. Prof. in Economics
Sri N. Ramulu, Asst. Prof. in Public Admin.
Sri D. Sarvaiah, Lecturer in Mathematics
Sri P. Raji Reddy, Lecturer in Physics
Sri B. Omprakash, Record Assistant.

**Reception Committee:**
Dr. D. Karunakar, Asst. Prof in Chemistry
Smt. A. Manjula, Lecturer in History
Smt. P. Krishna Vamshi, Lecturer in Commerce
Sri Akthar, Lecturer in Commerce
Sri. J. Rajeshwar, Offiice Sub-ordinate

**Registration Committee:**
Smt. K. Anuradha, Asst. Prof. in Botany
Smt. P. Savidya, Lecturer in Commerce
Smt. ManjulaVani, Lecturer in Hindi
Sri. S. Devender, Lecturer in Political Science
Sri. R. Arun Kumar, Office Sub-ordinate

**Technical Assistance Committee:**
Sri G. Naga Laxman, FTM-TSKC
Ms. VamshiPriyadarshi, Lecturer in Computer Science

Full paper will be published with ISSN Number
Registration fee:

| | |
|---|---|
| For Students/ Research scholars: | Rs. 100=00 |
| For Faculty members: | Rs. 300=00 |
| For ISSN publication: | Rs.1000=00 |
| Submission of full paper or before: | 10th Feb 2019 |
| Seminar date: | 21st Feb 2019 |

ఒక్క రోజు జాతీయ సదస్సు

# సాహిత్యం-నవరసాలు

**తేది: 21-02-2019**

నిర్వహణ

## తెలుగు శాఖ

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ

**Address for Correspondance:**

**Dr. S. Baby Ramani,**
**Asst. Prof. In Telugu.**
**Cell : 8332932330**

**K. Srichandra,**
**8790432192.**

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

**కళాశాల పరిచయం:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, సంగారెడ్డిజిల్లా (తెలంగాణ) 1984 వ సం. లో స్థాపించబడింది. తొలుత సదాశివపేట ఉన్నత పాఠశాలలో నడుపబడిన ఈ కళాశాలకు పిదప 15 ఎకరాల విస్తీర్ణంలో స్వంత భవనం స్థాపించబడింది.

ఈ కళాశాల ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్నది. హైదరాబాదు నుండి పూణెకు వెళ్ళే జాతీయ రహదారి - 9 సమీపంలో ఉన్నది. ఈ కళాశాల జిల్లా కేంద్ర కార్యాలయానికి 16 కి.మీ. దూరంలో, రాష్ట్ర రాజధాని హైదరాబాదుకు 60 కి.మీ. దూరంలో ఉన్నది.

1984 వ సం.లో బి.ఎ(హెచ్.ఇ.పి.) మరియు బి.కామ్.(జనరల్) కోర్సులతో స్థాపించబడినది. 2016 - 17 విద్యాసంవత్సరం నుండి రెండు క్రొత్త కంప్యూటర్ కో ర్సులు ప్రవేశపెట్టబడినవి. 2018-19 విద్యాసంవత్సరం నుండి సెమిస్టరు విధానంతో బి.ఎ., బి.కామ్. బి.ఎస్.సి.లతో 18 క్రొత్త గ్రూపులు ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాలలో ప్రవేశపెట్టబడ్డాయి. కళాశాలలో నూతనంగా TSKC, కామర్స్ ల్యాబ్, NSS , NCC యూనిట్లు ఏర్పాటు చేయబడినవి. మా కళాశాలలో పట్టభద్రులైన వేల మంది విద్యార్థులు సమాజంలో గౌరవప్రదమైన స్థానాలలో స్థిరపడ్డారు. అంకితభావం, నిబద్ధత ప్రతి అధ్యాపకులకు గల విశిష్టమైన గుణం.

*****

*ISSN పబ్లికేషన్ కొరకు*

Bank Details:
S. BABY RAMANI
Acc. No. 62011228955
IFSC Code: SBIN0020106
SBI-ICRISAT Branch, Patancheru.

**[illegible]** జీవితం నవరసభరితం ప్రతిక్షణం ప్రతిఒక్కరు ఏదో ఒక రసాన్ని అనుభూతించడం సహజంగాను

**"శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః**
**బీభత్సాద్భుత సంజ్ఞౌ చేత్యష్టౌ నాట్యే రసాః స్మృతాః"**

ఈ రసములను గూర్చి మొదట భరతుడు నాట్యశాస్త్రమున ప్రస్తావించాడు. శాంతమును రసముగా భావించని భరతుడు ఎనిమిది రసములను మాత్రమే తెలిపాడు. ఉద్భట శాంతరసమును గూర్చి ప్రస్తావించి ఉద్భోధించుడు నాట్యశాస్త్రమున ప్రవేశపెట్టినాడు. ఇట్టి నవ రసాస్వాదన అందరు అనుభూతించాలని మా ముఖ్య సదస్సు లక్ష్యం.

సాహిత్యం

అంశములు

- కవిత్రయయుగం - నవరసాలు
- శివకవియుగం - నవరసాలు
- భక్తికవితాయుగం - నవరసాలు
- ప్రబంధయుగం - నవరసాలు
- క్షీణయుగం - నవరసాలు
- కథ - నవరసాలు
- నవల - నవరసాలు
- నాటకం - నవరసాలు
- ఆధునికసాహిత్యం - నవరసాలు
- జానపదసాహిత్యం – నవరసాలు

పైన తెలిపిన సాహిత్య ప్రక్రియలలో మీ ఇష్టమైన ప్రక్రియపై నవరసాలలో ఏదైన ఒక రసము గూర్చి పరిశోధనా పత్రాలు పంపవచ్చు. తమ పరిశోధనా పత్రాలను డిసెంబర్ 7 లో – అను [illegible] ఫాంట్ – ఫాంట్ సైజ్ 15 – పేపర్ సైజ్ A4 లో పంపవలెను

సదస్సు పరిశోధనా పత్రాలను • ISSN NO మరియు UGC అప్రూవ్ డ్ జర్నల్ ద్వారా ప్రత్యేక సంచిక • ప్రచురించడం జరుగుతుంది. మీ వ్యాసాలు మూడు పేజీలకు మించకుండా ఫిబ్రవరి 10 తేదీలోపు gdcsspt@gmail.com అనే మెయిలుకు పంపవలెను. మీ వ్యాసములు ప్రచురించబడిన ప్రత్యేక సంచిక జాతీయసదస్సు రోజే ఆవిష్కరించబడుతుంది. అదే రోజు వ్యాసకర్తలకు అందజేయబడుతుంది.

ఫిబ్రవరి 2019

భావవీణ ప్రత్యేక సంచిక

సాహిత్యం - నవరసాలు
జాతీయ సదస్సు

Journal of Telugu Literary, Culture & Language Studies




GOVT. DEGREE COLLEGE
SADASIVPET
జ్ఞానమ్ సదాశివమ్

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల

## సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.